# మానవహక్కులు - 2007

బులెటిన్ - 8

---

**మానవహక్కుల వేదిక ప్రచురణ**
Humanrights Forum Publication

ప్రచురణ సంఖ్య: 15
ప్రచురణ కాలం: మే 2007
కాపీలు: 2000, వెల: 15 రూపాయలు
కవర్: మోహన్
డిటిపి: ఎన్.రఘురామయ్య
ముద్రణ: నవ్య ప్రింటర్స్

ప్రతులకు:
**ఎస్.జీవన్ కుమార్**
3-12-117/ఏ-2/1, పి.ఎస్.కాలనీ
గణేష్‌నగర్, రామంతాపూర్
హైదరాబాద్-13, ఫోన్: 27039519

**ప్రజాశక్తి, నవోదయ, దిశ బుక్ హౌస్‌లు**

సంపాదకీయం

# ఆలస్యానికి సంజాయిషీతో ....

**రెం**డు సంవత్సరాల గడువు తరువాత 8వ బులెటిన్‌ను పాఠకుల ముందు ఉంచుతున్నాం. సామాజిక పరిస్థితులు వేగంగా మారుతున్నందున ఆరు నెలలకొక బులెటిన్ తీసుకు రాగలిగితే మారుతున్న ఆ పరిస్థితులపైన హక్కుల కోణం నుంచి ఒక రన్నింగ్ కామెంటరీగా ఉండేది. ఉండాలనే మా ప్రయత్నం. రాబోయే రోజులలో దాన్ని సాధించేందుకు కృషి చేస్తాం.

**ప్రత్యేక ఆర్థిక మండలుల** మీద ఈ బులెటిన్‌లో వివరమైన వ్యాసం ఉంది. మార్చి 14న పశ్చిమ బెంగాల్‌లోని నందిగ్రాంలో ప్రత్యేక ఆర్థిక మండలి వద్దంటున్న జనం మీద కాల్పులు జరిపి 14 మందిని చంపిన విషయం మీకు తెలుసు. ప్రజల సమ్మతి లేకుండా కొత్త ప్రత్యేక ఆర్థిక మండలి నెలకొల్పే ఉద్దేశం తమకు లేదని ఆ రాష్ట్రాన్ని పరిపాలిస్తున్న వామపక్ష ప్రభుత్వం స్పష్టం చేసినా కూడా ప్రతిపక్ష పార్టీ అయిన తృణమూల్ కాంగ్రెస్, ముస్లిం మతవాద సంస్థలు, నక్సలైట్లు మొండిగా సాధారణ పరిపాలన సహితం సాగనివ్వకుండా అడ్డుపడుతున్నారనీ, సిపిఐ (ఎం) పార్టీకి చెందిన వారిపైన భౌతిక దాడులు చేసి తరిమేశారనీ, పాలనా యంత్రాంగాన్ని పునరుద్ధరించడానికీ చట్టబద్ధ పాలనను తిరిగి నెలకొల్పడానికీ సిపిఐ (ఎం) కార్యకర్తలూ నాయకులూ తిరిగి గ్రామంలోకి ప్రవేశించడానికీ, పోలీసులను రంగంలోకి దించక తప్పలేదనీ వామపక్ష ప్రభుత్వం ఆ కాల్పులను సమర్థించుకుంది.

అంతా నిజమే అనుకున్నా, ప్రజలు మూర్ఖంగానే అడ్డుపడుతున్నారని అనుకున్నా, వారు మొండిగా ఉన్నప్పుడు బలవంతంగా పోలీసులను దించి రక్తపాతం

సృష్టించవలసిన అవసరం ఏమొచ్చింది? ఎట్లాగూ ప్రజలు ఒప్పుకోనిదే ప్రత్యేక ఆర్థిక మండలి నెలకొల్పం అంటున్నప్పుడు తొందరేమొచ్చింది?

నిజానికి నందిగ్రాం పశ్చిమ బెంగాల్‌ను ఏలుతున్న వామపక్ష కూటమికి పూర్తి బలం ఉన్న ప్రాంతమే. స్థానిక ఎంఎల్‌ఏ, స్థానిక ఎం.పి వామపక్షాలకు చెందినవారే. మూడంచెల పంచాయితి రాజ్ వ్యవస్థలోని మెజారిటీ పదవులు పాలక కూటమికి చెందిన వారే గెలుచుకున్నారు. అటువంటి చోట ప్రజలంతా ప్రతిపక్షాలు, మతతత్వ శక్తులు, నక్సలైట్ల దుష్ప్రచారాన్ని నమ్మి విచక్షణ కోల్పోతారంటే నమ్మడం అంత సులభం కాదు. పాలక కూటమి అనుచరులు సహితం ప్రత్యేక ఆర్థిక మండలి వద్దంటే వద్దని అంటుండగా నాయకులు ఒంటరి అయ్యారని వింటున్నాం.

ఆ నాయకుల మీద భౌతిక దాడులు జరిగాయనీ, వారు తమ ఊర్లూ ఇళ్ళూ విడిచిపెట్టి వెళ్ళిపోయారనీ వామపక్ష నేతలు అంటున్నారు. అవుననే అనుకుందాం. మెజారిటీ ఓట్లు పొంది గెలుపొందిన వారు అక్కడ ఉండలేని పరిస్థితి ఏర్పడితే అది దౌర్జన్యమే అయినప్పటికీ ఎక్కడో ఏదో తప్పు జరిగిందని అర్థం చేసుకోవడం సబబు కాదా? దాని బదులు ఆ నాయకులను వెనక్కి తీసుకుపోయి దింపి రావడాన్ని ప్రెస్టీజ్‌కు సంబంధించిన విషయంగా తీసుకోవడం ఉచితమా? పోలీసుల మోహరింపు వెనక ఉన్నది ఈ 'ప్రెస్టీజ్' కాదా?

కాల్పులు జరిపింది పోలీసులు మాత్రమే కాదనీ ఖాకీ దుస్తులలో ఉన్న సిపిఐ (ఎం) కార్యకర్తలూ ఉన్నారనీ వింటున్నాం. ఇది కొత్త విషయం కాదు. పశ్చిమ బెంగాల్‌లో సిపిఐ (ఎం) నాయకత్వంలోని వామపక్ష కూటమి అవిచ్ఛిన్నంగా గెలుస్తుండడం వెనుక వారు ప్రజలకు చేసిన మేలు ఉన్నమాట వాస్తవమే అయినప్పటికీ, వారి కేడర్ గ్రామాలలో రాజ్యాంగేతర శక్తిగా వ్యవహరించి ప్రత్యర్థులను టెర్రరైజ్ చేయడమూ వాస్తవమేనని ఆ రాష్ట్రానికి చెందిన ప్రజాతంత్ర శక్తుల నుంచి చాలా కాలంగా వింటున్నాం. పాలనా యంత్రాంగానికీ సిపిఐ (ఎం)కూ తేడా చెరిగిపోయిందనేది అభియోగం. నందిగ్రాం దానిని రుజువు చేసింది.

దేశంలోకి భారీగా పెట్టుబడులను ఆహ్వానించడానికి గ్రామాలకు గ్రామాలు ఖాళీచేసి అన్ని హంగులూ ఉన్న విశాల క్షేత్రాలను విస్తరిలో పెట్టి అనేక రాయితీలతో పాటు పెట్టుబడిదారీ కంపెనీలకు అప్పగించే ఆలోచనకు గ్రామీణ ప్రాంతాలలో ప్రతిఘటన బలంగా వస్తుందనడానికి నందిగ్రాం ఒక సూచిక. అయితే దానినుంచి ఎవరూ ఏమీ నేర్చుకుంటున్నట్టు కనబడదు. ఈ ఏప్రిల్ నెల రెండవ వారంలో ముంబాయి నుంచి ఢిల్లీకి ఒక ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటుచేసే ఒప్పందం జపాన్‌కు చెందిన కంపెనీలతో జరిగిందని పత్రికలు రాశాయి. ఆ కారిడార్‌లో ఒకటికాదు పలు ప్రత్యేక ఆర్థిక మండలులు ఉంటాయంట. ఇంకా అంతర్జాతీయ



విమానాశ్రయాలూ, అత్యాధునికమైన ఓడరేవూ ఉంటాయంట. ఇది ఎంత ప్రతిఘటనకు దారితీస్తుందో ఎన్ని ప్రాణాలు బలి తీసుకుంటుందో వేచి చూడాలి.

**రిజర్వేషన్ల పట్ల** సుప్రీంకోర్టు అనుసరిస్తున్న అనుచిత వైఖరి గురించి కూడా ఈ బులెటిన్‌లో ఒక వ్యాసం ఉంది. నాగరాజ్ వర్సస్ యూనియన్ ఆఫ్ ఇండియా అనే కేసులో సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పును సమీక్షించే వ్యాసం ఇది. సుప్రీంకోర్టు వైఖరిలో వ్యక్తమవుతున్న భావదారిద్ర్యం గురించి అందులో ప్రస్తావించాము.

ఈ లోపల ఆ వైఖరిని సుప్రీంకోర్టు మరొకసారి ప్రదర్శించింది. కేంద్ర ప్రభుత్వం అజమాయిషీలోని ఉన్నత విద్యాసంస్థలలో ఒబిసిలకు రిజర్వేషన్లు కల్పిస్తూ పార్లమెంటు చేసిన చట్టాన్ని స్టే చేసింది. రేపటి సంగతేమో గానీ ఈ విద్యా సంవత్సరాన్ని ఒబిసిలు కోల్పోయినట్టే. 1931 జనాభా లెక్కల ఆధారంగా రిజర్వేషన్లు ఎట్లా ఇస్తారని సుప్రీంకోర్టు అడిగిందంట. జనాభా లెక్కల ఆవశ్యకత ఒబిసిల దామాషా నిర్ణయించడానికే తప్ప సంఖ్య నిర్ణయించే దానికి కాదు కదా. ఒబిసిలదైనా, వేరే ఎవరిదైనా జనాభా నిష్పత్తి 1931కీ, నేటికీ గణనీయంగా మారి ఉంటుందని న్యాయమూర్తులు అనుకుంటున్నారా? ఒకవేళ మారినా పెరిగి ఉంటుంది తప్ప తగ్గి ఉండదు – ఎందుకంటే ఒబిసిలు సగటున అగ్రకులాల కంటే పేదలనేది అందరూ ఎరిగిన వాస్తవమే. భారతదేశ జనాభాలో పేదల జనాభా పెరుగుదల రేటు ఉన్న వాళ్ళతో పోలిస్తే సాపేక్షంగా కొంచెం ఎక్కువనేది కూడా తెలిసిన విషయమే. మరయితే 1931 లెక్కల పైన ఆధారపడడం వల్ల ఒబిసిల కోటా తగ్గి ఉంటుందేమో గానీ మించిపోయి ఉండే అవకాశం లేదు కదా!

సామాజిక వర్గాలు తాము వెనుకబడే ఉన్నామని రుజువు చేసుకోవడానికి లైను కట్టే దేశం ప్రపంచంలో మరెక్కడా లేదని సుప్రీంకోర్టు అపహాస్యం చేసిందంట. సామాజిక విషయాల గురించి మాట్లాడేటప్పుడు బజారు స్థాయి వ్యాఖ్యలను దాటిపోలేనితనాన్ని న్యాయస్థానాలు ప్రదర్శించడం మన అనుభవంలోని విషయమే. అటువంటి విషయాలలో జరుగుతున్న తాత్విక, రాజకీయ సంవాదం గురించి సాధారణ దినపత్రికల పాఠకులకు ఉండే పాటి జ్ఞానం కూడా లేకుండా మాట్లాడుతుంటారు. అన్ని రాష్ట్రాలలోనూ తమను వెనుకబడిన వర్గంగా గుర్తించమని రాష్ట్ర ప్రభుత్వానికి అర్జీపెట్టుకున్న సామాజిక వర్గాలు ఉన్నాయి. ఆ అర్జీలు విచారణలో ఉన్నాయి. అందులో ఎన్ని అర్జీలు బలిసిన వర్గాలు కేవలం రిజర్వేషన్ పొందడం కోసం ఒబిసి ముద్ర వేయించుకునే ఆరాటంలో పెట్టుకున్నవో న్యాయమూర్తులు తెలుసుకునే ప్రయత్నం చేశారా? నీ దగ్గర ఏం సమాచారం ఉంది అని ప్రభుత్వాన్ని దబాయిస్తున్నారు. కాని వారి దగ్గర ఏం సమాచారం ఉందని ఈ రకమైన వ్యాఖ్యలు చేస్తు

న్నారు? అయినా, ప్రపంచంలో వేరే ఎక్కడన్నా పుట్టుక ప్రాతిపదికన మనుషులకు అభివృద్ధి పొందే అవకాశాలను నిరాకరించిన సమాజం ఉందా? సిగ్గుపడవలసింది దానికా లేక వెనుక ఉంచబడ్డవాళ్ళు సమాన అవకాశాలు కోరుతున్నందుకా?

అందరినీ ఏవేవో ప్రశ్నలు వేస్తూ, అందరికీ ఏవేవో సవాళ్ళు విసురుతున్న సుప్రీంకోర్టు తనకు తాను ఒక ప్రశ్న వేసుకోవలసి ఉంది. ఈ (దాదాపు) 60 సంవత్సరాలలో ఎంతమంది ఒబిసిలు సుప్రీంకోర్టు జడ్జీలయ్యారు? మాకు తెలిసి రత్నవేల్ పాండ్యన్ అనే తమిళనాడుకు చెందిన ఒక న్యాయమూర్తి మాత్రమే సుప్రీం కోర్టును అందుకున్న ఒబిసి. ఇంకొకరో ఇద్దరో ఉన్నారనుకుందాం. దేశ జనాభాలో సగానికి తక్కువలేని ప్రజల నుంచి ఆరు దశాబ్దాల కాలంలో ఇద్దరు ముగ్గురు మాత్రమే సుప్రీంకోర్టు జడ్జీలు కాగలిగారంటే ఎక్కడో ఏదో తీవ్రలోపం ఉన్నట్టు అను కోనవసరం లేదా? సమాజంలోనే ఉందందామా, జడ్జీల ఎంపికలో ఉందందామా – ఏదో ఒకటైతే అనక తప్పదు కదా? అదే కాలంలో సుప్రీంకోర్టు జడ్జిలలో బ్రాహ్మణు లెంతమంది ఉన్నారో లెక్కతీస్తారా? ఎప్పుడైనా దాదాపు సగం బ్రాహ్మణులే కారా? బ్రాహ్మణులతో పాటు కాయస్త, కరణ్, వైద్, వైశ్య, రాజ్‌పుట్ లాంటి 'ద్విజుల'ందరినీ కలుపుకుంటే సుప్రీంకోర్టులో అత్యధిక శాతం న్యాయమూర్తులు వారే కదా? కనీసం 30 సంవత్సరాలుగా మన రాష్ట్రం నుంచి ఒక రెడ్డి సుప్రీంకోర్టులో తప్పనిసరిగా లేరా? ఈ ఆనవాయితీ ఎప్పుడయినా తప్పిందా?

వీళ్ళంతా అయోగ్యులనీ కేవలం కులం వల్లనే సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా ఎంపిక అయ్యారనీ అనడం లేదు. ప్రస్తుత న్యాయవ్యవస్థ అవసరాల పరిధిలో ఎక్కువ భాగం యోగ్యులే కావచ్చు. కానీ యోగ్యతకు కులం కారణం కాదని వాళ్ళు సహితం ఒప్పుకుంటారు కాబట్టి కొన్ని కులాలలో మాత్రమే ఇది ఎందుకుంది అన్న ప్రశ్న వేసుకోనక్కరలేదా? అవకాశాలతో దానికి సంబంధం ఉందనీ, అవకాశాల కలిమికీ లేమికీ కులంతో సంబంధం ఉందనీ నిర్ధారించడం సమంజసంగా ఉండదా? అందరికీ సవాళ్ళు విసిరే సుప్రీంకోర్టు తనకు తాను ఈ సవాలు ఎందుకు వేసుకోదు?

దేశంలో ముస్లింల స్థితిగతుల మీద రాజేందర్ సచార్ కమిటీ సమర్పించిన నివేదిక మీద రివ్యూ ఈ బులెటిన్‌లో ప్రచురించాలనుకున్నాము గానీ దానికి విడిగా ఒక ప్రచురణ తీసుకురావడం ఉచితంగా ఉంటుందన్న అభిప్రాయంతో విరమించు కున్నాము. నిరాదరణకు గురైన సామాజిక వర్గంగా ముస్లింలు ఒక హక్కుగా పొంద వలసినవన్నిటికీ 'బుజ్జగింపు' అన్న నిందను తగిలించి జరగవలసిన న్యాయం జరగ కుండా అడ్డుపడుతున్న సంఘపరివార్ నోరు మూయించే సామర్థ్యం గల కృషి చేసి నందుకు రాజిందర్‌సచార్‌గారికి అభినందనలు.

**20 మే, 2007** **మానవహక్కుల వేదిక**



# ఇందులో ...


## సంపాదకీయం

ఆలస్యానికి సంజాయిషీతో ... ......... 3

## వ్యాసాలు

కొత్త 'భూసంస్కరణల' ప్రహసనం –కె.బాలగోపాల్ ......... 9

ఖైదులోనూ వివక్షే – కె.మురళి ......... 42

విద్యుత్ విచారణల్లో పాల్గొనడం అవసరమా? – గొర్రెపాటి నరేంద్రనాథ్ ......... 48

నిర్వాసితాభివృద్ధి – బుర్ర రాములు ......... 53

జీవన్‌రెడ్డి కమిటీ నివేదికలో ఏముంది? – కె.బాలగోపాల్ ......... 58

నెహ్రూ పట్టణ పథకంలో పేదలకు చోటు లేదా – ఎస్.జీవనకుమార్ ......... 69

## జుడీషియరీ వాచ్

రిజర్వేషన్లు – న్యాయస్థానాల వైఖరే అసలు సమస్య –కె.బాలగోపాల్ ......... 75

## రిపోర్టులు

సిరిసిల్ల ఆత్మహత్యలు ......... 85

రాచకొండ ఫీల్డ్ ఫైరింగ్ రేంజ్ – పి.సుబ్బారావు, జి.మోహన్ ......... 91

## లేఖ

ప్రైవేట్ ముఠాల బీభత్సాన్ని ఆపుదాం ......... 95

## కరపత్రాలు ... 105-211

పేదల భూములను కంపెనీలకు కట్టబెట్టే

# కొత్త 'భూసంస్కరణల' ప్రహసనం

-కె. బాలగోపాల్ ★



**భూ**సంస్కరణలకు కాలం చెల్లిందని ఎవరన్నారు? కాకపోతే, భూస్వాముల భూములు తీసి పేదలకిచ్చే బదులు పేదల భూములు తీసి ధనవంతులకిస్తున్నారు - అంతే తేడా. ఆ భూసంస్కరణలు ఎట్లాగూ పెద్దగా సాధ్యం కాలేదు కదా. అందుకని ఇదైనా చేద్దామని మన పాలకులు నిర్ణయించుకున్నట్టున్నారు.

భూస్వాముల భూములు పేదలకి ఇవ్వడానికి ప్రయత్నించిన రోజుల్లో ఎన్నో ఆటంకాలు ఎదురయ్యాయి. భూస్వాములే కాదు, కోర్టులు కూడా కన్నెర్ర చేశాయి. స్వాధీనం చేసుకున్న మిగులు భూములకు పూర్తి స్థాయి నష్టపరిహారం ఇయ్యవలసిందేనని కోర్టులన్నాయి. రాజ్యాంగాన్ని సవరించి ఆర్టికల్ 31ని ఒకసారి తిరగరాసి ఆ తరువాత మొత్తంగా తీసేసి భూసంస్కరణలను కాపాడవలసి వచ్చింది. అయితే కాపాడి పెద్దగా చేసిందేమీ లేదనుకోండి. దేశం మొత్తం మీద సాగు భూమిలో 2 శాతాన్ని మిగులు భూమిగా గుర్తించి సరిపెట్టుకున్నారు, అందులో పంచింది తక్కువ, పంచగా పేదల దగ్గర మిగిలింది ఇంకా తక్కువ.

★ మానవ హక్కుల కార్యకర్త, ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో న్యాయవాది

ఇప్పుడు అమలవుతున్న రివర్స్ భూసంస్కరణలకు ఏ ఆటంకాలూ లేవు. పేదలు కన్నెర్ర చేసే స్థితిలో లేరు. కోర్టులు వాళ్ళ తరఫున కన్నెర్ర చేయడానికి ఉత్సాహపడడం లేదు. పేద లెవరైనా కోర్టుకెక్కితే 'అభివృద్ధికి అడ్డం రావద్దండీ, అభివృద్ధి జరగనివ్వండీ' అని న్యాయమూర్తులంటున్నారు.

ఈ మలితరం 'భూసంస్కరణలు' ఏ విధంగా ఉన్నాయో చూద్దాం.

దీన్ని గురించి పత్రికలలో కొంత – కొంతేమిటి చాలా – చూసే ఉంటారు. ఈ భూముల పంపిణీ వల్ల ప్రత్యక్షం గానూ, పరోక్షం గానూ కాంగ్రెస్ వాళ్ళు ప్రయోజనం పొందుతున్నారని కడుపు మండిన చంద్రబాబు అభిమానుల పత్రికలు దీనికి వ్యతిరేకంగా, విపరీతంగా రాశాయి. అయితే ఆ రాతలలో ఎవరు ప్రయోజనం పొందుతున్నారన్నది ఉన్నదే గానీ ఎవరు నష్టపోతున్నా రన్నది లేదు. ఏ విధంగా నష్టపోతున్నారన్నదీ లేదు.

ఈ భూముల బదలాయింపు ఎంత వేగంగా జరుగుతున్నదంటే ఈ రిపోర్టు మీ చేతికి అందే సరికి ఇంకెన్నో చోట్ల ఇంకెన్నో రకాలుగా పేదలు తమ అనుభవంలో ఉన్న భూములు కోల్పోయి ఉంటారు. ప్రత్యేక ఆర్థిక మండలులలో లాగ ధనవంతులు పెట్టుబడులు పెట్టడం కోసం ప్రభుత్వం పేదల భూములు వారికి అప్పగించడ మొక్కటే కాదు. ప్రభుత్వం కచ్చితమైన నిర్ణయమేదీ చేయక ముందే బ్రోకర్లు రంగంలోకి దిగి ఫలానా భూములు ఫలానా అవసరాల కోసం సేకరించబడ తాయని ప్రచారం చేయడం కూడా పేదల భూములు అన్యాక్రాంతం కావడానికి దోహదం చేసింది. భూసేకరణ ప్రక్రియనూ, కోర్టు కేసులనూ ఏం ఎదుర్కొంటారులే, నాకు అమ్మేయండి నేను చూసుకుంటానని, వదంతులు పుట్టించిన బ్రోకరే భూములు చవగ్గా కొనుక్కుంటాడు. తీరా చూస్తే భూమి సేకరణ అక్కడ కాక పక్కనెక్కడో జరుగుతుంది. అమాయకంగా ఆ భూమిని అమ్ముకున్న పేదవారు చూస్తుండగానే వారి భూమి విలువ కొన్ని రెట్లు పెరిగి వారిని వెక్కిరిస్తుంది. హైదరాబాద్ చుట్టూ ఉన్న రంగారెడ్డి జిల్లా గ్రామాలలో ఇది ఎన్నో చోట్ల జరిగింది.

ప్రభుత్వం ఫలానా భూమి కావాలని నిర్ణయం చేయగా, ప్రభుత్వ నిర్ణయాన్ని మార్పించి పక్కనే ఉన్న నోరు లేని జనం భూములను సేకరణ చేయించి తమ భూములను కాపాడుకోవడమే కాక వాటి ధరను పెంచుకుని లాభపడిన మహానుభావులూ ఉన్నారు. హైదరాబాద్‌ను కమ్ము కుంటున్న ఔటర్ రింగ్ రోడ్డు విషయంలో ఇది పెద్దఎత్తున జరిగింది. దీనివల్ల లాభపడ్డ కాంగ్రెస్ నాయకులు, వాళ్ళ బంధుమిత్రుల జాబితా 'ఈనాడు'లోనూ, 'ఆంధ్రజ్యోతి'లోనూ చూసే ఉంటారు. అయితే తెలుగుదేశం పార్టీ నాయకులూ, వారి సన్నిహితులూ కూడా చాలామందే ఉన్నారు. నిజానికిది తెలుగుదేశం పాలనలోనే మొదలయింది. రంగారెడ్డి జిల్లాలోని నానక్‌రాంగూడ దీనికి సజీవ తార్కాణం. మాజీ టీచర్ ఆకుల రాజయ్యలాగ వట్టి అబద్ధాలు చెప్పి పేదలు దున్నుకుంటున్న భూములను కారుచవగ్గా కొని కంపెనీలకు అమ్ముకున్న వారూ ఉన్నారు.

**ఈ భూముల బదలాయింపు ఎంత వేగంగా జరుగుతున్నదంటే ఈ రిపోర్టు మీ చేతికి అందేసరికి ఇంకెన్నో చోట్ల ఇంకెన్నో రకాలుగా పేదలు తమ అనుభవంలో ఉన్న భూములు కోల్పోయి ఉంటారు.**

అయితే మా దృష్టి లాభపడ్డ వారి మీద కాదు, నష్టపోయిన వారి మీద. నిజంగా భూసే కరణ అంటూ జరిగిన చోట ఆ భూమిపైన యాజమాన్య హక్కున్న రైతుకు భూసేకరణ చట్టం కింద నష్టపరిహారం దక్కుతుంది. ఈ నష్ట పరిహారం అరుదుగా తప్ప తిరిగి అంత భూమి, అంతే మంచిభూమి, కొనుక్కోవడానికి సరి పోదు. ఇది సాధారణ విషయం కాగా, ఈ మధ్య కాలంలో మన రాష్ట్రంలో అన్ని ప్రాంతాలలోనూ ఎవరికీ అంతుబట్టని కారణాల వల్ల పనికిరాని భూముల ధరలు సైతం విపరీతంగా పెరిగి పోతున్న కారణంగా, ఎకరానికి ఆరేడు లక్షల నష్టపరిహారం ప్రభుత్వం ఇచ్చినా కూడా తిరిగి దగ్గర్లో ఎక్కడా అర్థ ఎకరం కొనుక్కోవడమూ వారికి సాధ్యం కావడం లేదు. 'మా భూమి ధర యాభై లక్షలుంటుంది. (లేదా కోటి రూపాయలుం టుంది). మాకు 10 లక్షలే ఇస్తే ఎట్లా' అని నిరసన తెలిపిన నిర్వాసితుల గురించి పత్రికలలో చదివే ఉంటారు. భూములు కొనుక్కోలేకపోతే ఏదైనా వ్యాపారం చేసుకొని బతకొచ్చు కదా అన్న ప్రభుత్వం జవాబు, అనుభవం లేని వ్యాపారంలో డబ్బుపెట్టి ఆ ఇంత కూడా పోగొట్టుకుంటే ఆపైన ఏం దిక్కు అన్న రైతు ఎదురుప్రశ్న వినే ఉంటారు. లక్షల రూపాయల నష్టపరిహారం ఇస్తున్నా ఇంకా ఏడుపా అని మొదట అనిపించినా, కొంచెం ఆలోచిస్తే ఈ ఆందోళనలో న్యాయం ఉందని అర్థమవుతుంది.

**ప్రాజెక్టుల కోసమో వేరే దేనికోసమో బలవంతపు భూసేకరణ చేసినప్పుడల్లా సాంఘికంగా అణగారిన కులాల వారంతా అక్కడ్నించి మౌనంగా నిష్క్రమిస్తుంటారు. వాళ్ళు ఆ తరువాత ఏమయ్యారు? ఉన్నారా, పోయారా అని అడిగే వారుండరు.**

కానీ భూమి నుంచి జీవనం పొందేది కేవలం దాని యజమానే కాదు. ఆ యజమాని భూమిలో కూలి చేసే వాళ్ళ దగ్గిర మొదలుపెట్టి, ప్రభుత్వ భూములను యాజమాన్య హక్కు లేకుండా సాగుచేసుకునే భూమిలేని పేదలు, వంట చెరుకు, పళ్ళు, దుంపలు ఆకులు సేకరించుకునే వారు. యాజమాన్య హక్కున్న రైతులకు అనేక సేవలందిచ్చి బతికే చాకలి, మంగలి, కుమ్మరి, కమ్మరి తదితర వృత్తి కులాలు, ప్రకృతిలోని ఫలసాయం పైన ఆధారపడి బతికే గీత కార్మికులు, ఊరుమ్మడి భూములలోనూ ప్రభుత్వ బంజర్లలోనూ పశువులు మేపుకొని బతికే పశువుల కాపర్లు, రాళ్ళు కొట్టుకొని బతికే వడ్డెరలు, ఆ భూములలో ప్రవహించే వాగులలోను, అక్కడున్న చెరువులలోనూ చేపలు పట్టుకొని బతికే మత్స్యకారులు, సముద్రతీర భూములైతే అక్కడ పడవలు పెట్టుకొని, వలలు ఆరేసుకొని చేపల వేటచేసే జాలర్లు, అడవి భూములైతే వాటిపైన చట్టపరమైన యాజ మాన్యం లేకున్నా వాటి నుంచి అనేక రూపాలలో జీవనం పొందే ఆదివాసులు – అసంఖ్యాకమైన ప్రజానీకానికి భూమి జీవనాధారం. వీరంతా సాంఘికంగానూ అణగారిన కులాలకు చెందిన వారు. ప్రాజెక్టుల కోసమో వేరే దేనికోసమో బలవంతపు భూసేకరణ చేసినప్పుడల్లా ఈ ప్రజానీక మంతా మౌనంగా నిష్క్రమిస్తుంటారు. వాళ్ళు ఆ తరువాత ఏమయ్యారు? ఉన్నారా, పోయారా అని అడిగే వారుండరు.

అభివృద్ధి పేరిట ప్రభుత్వం చేపడుతున్న భూమి సేకరణనూ, భూసంతర్పణనూ ఈ బాధితుల కోణం నుంచి చూడడం మా ఉద్దేశం. మన రాష్ట్రంలో ప్రస్తుతం నడుస్తున్న భూసేకరణ నేపథ్యంలో ఈ విషయాన్ని పరిశీలిద్దాం.

## ప్రత్యేక ఆర్థిక మండలులు

ఇంగ్లిష్‌లో వీటిని స్పెషల్ ఎకనమిక్ జోన్‌లు (ఎస్.ఇ.జడ్) అంటారు. వీటి స్వరూప స్వభావాలను నిర్దేశించేది ప్రత్యేక ఆర్థిక మండలుల చట్టం, 2005. విదేశీ మార్కెట్‌కు ఎగుమతులు

చేపట్టగల సంస్థలను నెలకొల్పడానికి దేశీయ విదేశీయ పెట్టుబడిదారీ కంపెనీలను ఆహ్వానించే లక్ష్యంతో ప్రత్యేక సదుపాయాలు, రాయితీలు కల్పించే వ్యవస్థ ఈ ఎస్.ఇ.జడ్ అనేది. ఎగుమతుల చుట్టూ అల్లుకున్న ఆర్థిక ప్రగతే దేశ అభివృద్ధికి ఉచితమైన మార్గం అన్న నయా ఉదారవాద సిద్ధాంతాన్ని విశ్వసించే వారిలో మన్మోహన్‌సింగ్ ఒకరు. ఆ దృష్టికి ఎగుమతి రంగానికీ, అందులో పెట్టుబడులు పెట్టగల వారికీ ప్రత్యేక రాయితీలు ఇవ్వడం సహజమైన విషయంగా కనిపిస్తుంది. ఆ అవగాహననే ప్రశ్నించేటట్టయితే – ఎగుమతులకు వాటి ప్రాముఖ్యం ఉన్నప్పటికీ దేశీయ మార్కెట్‌నూ, అందులో వ్యక్తమయ్యే ప్రజల అవసరాలనూ తీర్చడంద్వారా చేపట్టే అభివృద్ధే ఆరోగ్య కరంగా ఉంటుందనేటట్టయితే – అసలు ఎగుమతుల ప్రోత్సాహం పేరిట ప్రత్యేక సదు పాయాలు ఇచ్చే విధానంలోని విజ్ఞత ఎంత అని అడగొచ్చు. ఆ చర్చలోకి పోవడం ఈ నివేదిక పరిధిలోని విషయం కాదుగానీ, ప్రత్యేక ఆర్థిక మండలుల ఆవశ్యకత ప్రకృతి సిద్ధమైనదైనట్టు మాట్లాడే ప్రభుత్వం వైఖరి సందేహాలకు అతీతమైనది కాదని గ్రహించడమూ అవసరమే కాబట్టి ఈ మాటలు అంటున్నాం.

ఈ సదుపాయాలేమిటి? ఒక విశాలమైన భూభాగాన్ని ప్రత్యేక ఆర్థిక మండలి కోసం కేటాయించడం జరుగుతుంది. అందులో ఫ్యాక్టరీ, లేక ఇతర రూపాలలో ఉత్పత్తి లేక సేవా ప్రక్రియ చేపట్టే ఆర్థిక సంస్థకు అవసరమైన భూమేకాక, దానికి అనుబంధంగా అవసరమైన భూమి యావత్తు కేటాయించబడుతుంది. అంటే వారి ఉద్యోగులకు నివాస స్థలాలు, రోడ్లు, పార్కులు, క్లబ్బులు, వాళ్ళ పిల్లలకు స్కూళ్ళు, మార్కెట్లు వగైరాలకు కూడా భూమి కేటాయించబడు తుంది. ఈ అనుబంధ అవసరాలకు కేటాయించే భూమి ఆర్థిక మండలి మొత్తం విస్తీర్ణంలో 75 శాతం ఉండవచ్చునని ప్రత్యేక ఆర్థిక మండలుల చట్టం కింద జారీ అయిన రూల్స్ అంటాయి. అంటే ఒక్కొక్క ప్రత్యేక ఆర్థిక మండలీ ఒక చక్కటి టౌన్‌షిప్ అన్నమాట.

ఇంకా ఏమేం రాయితీలిస్తారు? సంపూర్ణమైన పన్ను రాయితీ ఇస్తారు. కంపెనీకి ఇవ్వడమే కాదు, దాని డైరెక్టర్లకు వ్యక్తిగత ఆదాయపన్ను చట్టం నుంచి కూడా అనేక మినహాయింపులు లభిస్తాయి. కేంద్ర ప్రభుత్వమే కాదు, రాష్ట్ర ప్రభుత్వాలూ తమ పరిధిలోని పన్నుల నుంచి మినహా యింపు ఇవ్వాలి. ఇప్పటికి దేశంలో ఆమోదం పొందిన ప్రత్యేక ఆర్థిక మండలులకు ఇవ్వబోయే పన్ను రాయితీలు సాలీనా కేంద్ర, రాష్ట్ర బడ్జెటుకు 1 లక్ష కోట్ల రూపాయల నష్టం కలిగిస్తాయని కేంద్ర ప్రభుత్వ ఆర్థిక శాఖ అధికారులే ఆందోళన వ్యక్తం చేశారు.

**పేదలకు, రైతులకు గతంలో ఇచ్చిన రాయితీలు తొలగించినప్పుడు మనం విన్న వాదనలు జ్ఞాపకం ఉన్నాయి కదా? రాయితీలు ప్రభుత్వ ఖజానా మీద పెద్ద భారమనీ, బడ్జెట్ లోటుకు అవే ప్రధాన కారణమనీ, లోటు బడ్జెట్ ఆర్థిక అరాచకత్వానికి దారితీస్తుందనీ విన్నాం. మరి పెట్టుబడిదార్లకు రాయితీలు ఇస్తే అదే జరగదా?**

పేదలకు, రైతులకు గతంలో ఇచ్చిన రాయి తీలు తొలగించినప్పుడు మనం విన్న వాదనలు జ్ఞాపకం ఉన్నాయి కదా? రాయితీలు ప్రభుత్వ ఖజానా మీద పెద్ద భారమనీ, బడ్జెట్ లోటుకు అవే ప్రధాన కారణమనీ, లోటు బడ్జెట్ ఆర్థిక అరాచకత్వానికి దారితీస్తుందనీ విన్నాం. మరి పెట్టుబడిదార్లకు రాయితీలు ఇస్తే అదే జరగదా? జరగదనుకోవాలి కాబోలు. లేదా మన పాలకుల దృష్టిలో మనం విజ్ఞత లేని గొర్రెలను కోవాలి కాబోలు.



**రాయితీలు ఇచ్చి పెట్టుబడులను ఆకర్షించి, ఆ తరువాత కార్మిక సంఘాలు గొడవ చేస్తున్నాయనో ఎన్నికలొచ్చాయనో వెనక్కి తీసుకునే 'ప్రమాదం' ఉంది కాబట్టి 49 (2)లో ఆ షరతు పెట్టారు. కాగా, 'ఏ చట్టం నుండైనా మినహాయింపు ఇయ్యవచ్చును' అనేది కాలుష్య నియంత్రణ చట్టాలకూ, పర్యా వరణ చట్టాలకూ కూడా వర్తిస్తుంది కదా?**

పన్ను రాయితీలేకాదు. 'ఏ చట్టం నుండైనా ఏ మేరకైనా మినహాయింపు ఇయ్య వచ్చు' అని ప్రత్యేక ఆర్థిక మండలుల చట్టంలోని సెక్షన్ 49 అంటుంది. కేంద్ర ప్రభుత్వం ఒక తాఖీదు జారీ చేయడం ద్వారా అటువంటి మినహాయింపు ఇయ్యవచ్చు. 'ఏ చట్టం నుండైనా' అనేది కార్మిక చట్టాలకు కూడా వర్తిస్తుందని వేరే చెప్పనక్కర లేదు గానీ సెక్షన్ 49 (2) ఈ విషయాన్ని చాలా విచిత్రంగా స్పష్టం చేస్తుంది. ఏ చట్టం నుండైనా ఒక తాఖీదు ద్వారా మినహాయింపు ఇయ్యవచ్చు నంటే మరొక తాఖీదు ద్వారా దానిని మళ్ళీ సవరించవచ్చుననీ వెనక్కి తీసుకోవచ్చనీ కూడా అర్థం వస్తుంది. అయితే ఒక తాఖీదు ద్వారా ఏదైనా కార్మిక చట్టం నుంచి ఇచ్చిన మినహాయింపును మరొక తాఖీదు ద్వారా వెనక్కి తీసుకోవడానికి వీలులేదని సెక్షన్ 49 (2) అంటుంది. దీనిని బట్టి పెట్టుబడులను ఆహ్వానించడంలో కార్మిక చట్టాల సడలింపుకు ఎంత ప్రాముఖ్యం ఇస్తున్నారో అర్థం అవుతుంది. రాయితీలు ఇచ్చి పెట్టుబడులను ఆకర్షించి, ఆ తరువాత కార్మిక సంఘాలు గొడవ చేస్తున్నాయనో ఎన్నికలొచ్చాయనో వెనక్కి తీసుకునే 'ప్రమాదం' ఉంది కాబట్టి 49 (2)లో ఆ షరతు పెట్టారు. కాగా, 'ఏ చట్టం నుండైనా మినహాయింపు ఇయ్యవచ్చును' అనేది కాలుష్య నియంత్రణ చట్టాలకూ, పర్యావరణ చట్టాలకూ కూడా వర్తిస్తుంది కదా? ఇది మరొక తీవ్రమైన ప్రమాదాన్ని సూచిస్తుంది.

చెప్పుకోదగ్గ విషయం ఏమిటంటే ముందే 10 మందో, 15 మందో పెట్టుబడిదారులు మేము మీ దగ్గర పెట్టుబడులు పెడతామని ముందుకొస్తే వారికోసం ఒక ప్రత్యేక ఆర్థిక మండలిని ఏర్పాటు చేయడం కాదు జరుగుతున్నది. క్షేత్రాన్ని తయారుచేసి వాళ్ళను ఆహ్వానిస్తారు. వచ్చిన వాళ్ళు వస్తారు లేదా వాళ్ళు వచ్చేదాకా ఆ క్షేత్రం అట్లాగే పడి ఉంటుంది. మొదట రంగంలోకి వచ్చేది ఒక డెవలపర్. ఇతనొక వ్యక్తి కావచ్చు, ఒక కంపెనీ కావచ్చు, ప్రభుత్వమే కావచ్చు. తానొక ప్రత్యేక ఆర్థిక మండలి నెలకొల్పుతానని అర్జీ పెట్టుకుంటాడు. దీనిని పరిశీలించి నిర్ణయం తీసుకొనడానికి కేంద్ర ప్రభుత్వం ఒక అనుమతి బోర్డును (బోర్డ్ ఆఫ్ అప్రూవల్) నెలకొల్పుతుంది. అయితే ఆ ఆమోదానికి సంబంధిత రాష్ట్ర ప్రభుత్వం సమ్మతి కావాలి. ఈ అనుమతి బోర్డు పాత్ర ప్రత్యేక ఆర్థిక మండలికి ఆమోదం ఇవ్వడంతో అయిపోదు. దాని అభివృద్ధి సక్రమంగా జరిగేటట్టు చూడడం కూడా ఈ బోర్డు కర్తవ్యమే. అందులో నెలకొల్పబోయే పారిశ్రామిక సంస్థలకు లైసెన్స్ ఇవ్వడం, ప్రత్యేక ఆర్థిక మండలిలో చేపట్టే రోడ్లు వగైరా నిర్మాణాలకు సంబంధించిన ప్రతిపాదనలను ఆమోదించడం, దాని డెవలపర్ అక్రమంగా వ్యవహరించినట్టయితే అతనికిచ్చిన అనుమతిని రద్దు చేయడం వగైరా అధికారాలు కూడా బోర్డుకు ఉన్నాయి. రద్దు చేసిన తరువాత ఒక పాలనాధికారిని (అడ్మినిస్ట్రేటర్‌ను) నియమించి, మరొక డెవలపర్‌కు ఆ అనుమతిని బదిలీ చేయడానికి బోర్డు అర్జీలు ఆహ్వానిస్తుంది లేదా కొన్ని షరతులతో పాత డెవలపర్‌కే తిరిగి అనుమతి ఇయ్యవచ్చు.

ఈ బోర్డు కింద ఒక అభివృద్ధి కమిషనర్ ఉంటారు (డెవలప్‌మెంట్ కమిషనర్). వారు ప్రత్యేక ఆర్థిక మండలిలో ఆర్థిక సంస్థలు నెలకొల్పే విషయంలో సలహాలు, సూచనలు ఇస్తారు. ఆ

సంస్థలు ఎగుమతుల పెంపుదలకు దోహదపడేటట్టు చూస్తారు. డెవలపర్ పనితీరును, మండలిలో నెలకొల్పే ఆర్థిక సంస్థల పనితీరును పర్యవేక్షిస్తారు. మొత్తానికి బోర్డు ఆధ్వర్యంలో బోర్డు అప్పగించే అన్ని పనులూ చేస్తారు. ప్రత్యేక ఆర్థిక మండలిలో ఆర్థిక సంస్థలు నెలకొల్పడానికి ఉత్సాహం చూపేవారు ఈ అభివృద్ధి కమిషనర్కే దరఖాస్తు పెట్టుకోవాలి. దానిని ఆమోదించడానికి ఒక అప్రూవల్ కమిటీ ఉంటుంది. వారు అనుమతి ఇచ్చేటప్పుడు షరతులు పెట్టి ఇయ్యవచ్చు.

మొత్తానికి డెవలపర్ చొరవతో, రాష్ట్ర ప్రభుత్వం సమ్మతితో, కేంద్ర ప్రభుత్వం పర్యవేక్షణతో ప్రత్యేక ఆర్థిక మండలులు నెలకొంటాయి, నడుస్తాయి. (ఆ డెవలపర్ ఒక వ్యక్తి కావచ్చు, కంపెనీ కావచ్చు, కేంద్ర లేక రాష్ట్ర ప్రభుత్వం కూడా కావచ్చునని మరొకసారి గుర్తు చేయాలి).

చెప్పుకోదగ్గ మరో విషయం ఏమిటంటే ఎగుమతుల ప్రక్రియను బలోపేతం చేయడం ఈ ప్రత్యేక ఆర్థిక మండలుల లక్ష్యం అయినప్పటికీ, ఒక మండలిని డెవలపర్ ప్రతిపాదన మేరకు నెలకొల్పే దశలో అక్కడ ఏ సంస్థలు రాబోతాయో ఏ మేరకు ఎగుమతులకు దోహదం చేయబోతాయో, ఎవరికీ తెలీదు. ఆ దశలో అదింకా భవిష్యత్తుకు సంబంధించిన విషయం. అయితే అందుకు తగిన సంస్థలు పెట్టుబడులు పెట్టడానికి ముందుకు రాని పక్షంలో సేకరించిన భూమిని తిరిగి రైతులకిచ్చేదేమీ ఉండదు. అప్పటికే దానినంతా చదును చేసి లేఅవుట్ చేయడానికి తయారు చేసేసి ఉంటారు. ఎవరో ఒకరు వచ్చేంత వరకు ఎదురు చూస్తూ ఉంటారు. చివరికి వచ్చిన వారితో సరిపెట్టుకుంటారు. అయితే అంతా తాము అనుకున్నట్టు జరిగినా కూడా భూసేకరణ వల్ల ప్రజలకు కలిగిన నష్టం కంటే, ఎగుమతులకు ఎస్ఇజడ్ల ద్వారా లభించే ప్రోత్సాహం కారణంగా దేశ ఆర్థిక వ్యవస్థకు జరిగే మేలు ఎక్కువ ఉంటుందని ఎవ్వరూ హామీ ఇవ్వజాలరు. కేవలం దబాయింపుతో ఈ ఎస్ఇజడ్ వ్యవస్థను దేశం మీద రుద్దుతున్నారు.

చెప్పుకోదగ్గ విషయాలు నిజానికి చాలానే ఉన్నాయి.

ఎప్పుడు వస్తాయో, వస్తాయో రావో తెలీని కంపెనీల కోసం ప్రభుత్వం బలవంతపు భూసేకరణ చేసేయొచ్చా? భూసేకరణ చేసే అధికారాన్ని ఇచ్చే ఏకైక చట్టం 1894లో అప్పటి బ్రిటిష్ పాలకులు జారీచేసిన భూసేకరణ చట్టం. దాని ప్రకారం ప్రజావసరాల కోసం మాత్రమే ప్రభుత్వం బలవంతపు భూసేకరణ చేయవచ్చు. ప్రైవేటు వ్యక్తులైనా కంపెనీలైనా భూమి అవసరమైతే కొనుక్కోవలసిందేనన్నది అప్పటి అవగాహన.

**అంతా తాము అనుకున్నట్టు జరిగినా కూడా భూసేకరణ వల్ల ప్రజలకు కలిగిన నష్టం కంటే, ఎగుమతులకు ఎస్ఇజడ్ల ద్వారా లభించే ప్రోత్సాహం కారణంగా దేశ ఆర్థిక వ్యవస్థకు జరిగే మేలు ఎక్కువ ఉంటుందని ఎవ్వరూ హామీ ఇవ్వజాలరు. కేవలం దబాయింపుతో ఈ ఎస్ఇజడ్ వ్యవస్థను దేశం మీద రుద్దుతున్నారు.**

అయితే ఉత్పత్తిదాయకమైన పెట్టుబడులు పెట్టడానికి ముందుకొచ్చే కంపెనీలకు భూములమ్మడానికి రైతులు సిద్ధంగా లేనప్పుడు వారు పెట్టుబడులు పెట్టలేకపోవడం దేశ అభివృద్ధికి హాని చేస్తున్నదన్న వాదనతో 1984లో భూసేకరణ చట్టాన్ని సవరించి 'కంపెనీ'ల అవసరాల కోసం కూడా ప్రభుత్వం భూసేకరణ జరపవచ్చునని శాసనం చేశారు. ఆ కంపెనీ ఏదైనా కావచ్చు. ప్రజావసరాలను ఉత్పత్తి చేసే కంపెనీయే కానక్కర లేదు. అటువంటి కంపెనీలకే



ఈ సవరణను పరిమితం చేయాలన్న అభ్యర్థనను న్యాయస్థానాలు కూడా తిరస్కరించాయి. మద్యం ఫ్యాక్టరీ కోసం కూడా ప్రభుత్వం భూసేకరణ చేయవచ్చు.

అయితే ఎస్ఇజడ్లకు ఈ చట్ట సవరణ వర్తిస్తుందా? ఎందుకంటే ఈ భూములు సేకరించేది డెవలపర్ కోసం. డెవలపర్ ఒక కంపెనీ కానక్కర లేదు. ఒక వ్యక్తి కావచ్చు. ఇక అతని చేతిలో పెట్టే భూమిలో ఆర్థిక సంస్థను నెలకొల్పబోయే కంపెనీలంటారా, వారు భూసేకరణ జరిగేటప్పుడు కనుచూపు మేరలో ఉండరు. అటువంటి భూసేకరణ చెల్లుతుందా? న్యాయస్థానాల వైఖరి కొంతైనా బాగుంటే ఈ విషయం కోర్టులో తేల్చుకుందాం అని ఉత్సాహపడి ఉందుము గానీ న్యాయస్థానాలు ఈ ప్రశ్నకు ఏం జవాబు ఇయ్యబోతాయో ఊహించగలం కాబట్టి ఈ చర్చను ప్రశ్న దగ్గరే వదిలేద్దాం.

**ప్రత్యేక ఆర్థిక మండలి పేరిట ప్రభుత్వం సేకరించే భూమిలో నాలుగవ వంతు భూభాగంలో మాత్రమే ఫ్యాక్టరీ గానీ, ఇతర ఆర్థిక సంస్థగానీ నెలకొంటుంది. మిగిలిన మూడు వంతుల భూభాగంలో, అందులో పనిచేసే ఉద్యోగుల నివాసాలు, పార్కులు, క్లబ్బులు, వాళ్ళ పిల్లలకు స్కూళ్ళు, విశాలమైన రహదార్లు, షాపింగ్ కాంప్లెక్స్లు ఉంటాయి. ప్రజల జీవనాధారమైన భూమిని ఇంత ధారాళంగా పెట్టుబడిదార్ల చేతిలో పెట్టనిదే దేశం అభివృద్ధి చెందదా?**

మరొక ప్రశ్న ఏమిటంటే ప్రత్యేక ఆర్థిక మండలిలో నెలకొల్పబోయేది కేవలం ఉత్పత్తిదాయకమైన ప్రక్రియను చేపట్టే సంస్థను కాదు. 'కనీసం 25 శాతం భూభాగంలో ఆర్థిక సంస్థ ఉండాలి' అనేది ప్రత్యేక ఆర్థిక మండలుల చట్టం కింద కేంద్ర ప్రభుత్వం జి.ఎస్.ఆర్ 54 (ఇ) పేరిట జారీచేసిన నియమావళి పెట్టిన నిబంధన. తక్కిన 75 శాతం భూభాగంలో ఏముంటుంది? ఆర్థిక సంస్థకు అనుబంధమైన నిర్మాణాలుంటాయి. అందరికీ అర్థమయ్యే భాషలో చెప్పాలంటే, ప్రత్యేక ఆర్థిక మండలి పేరిట ప్రభుత్వం సేకరించే భూమిలో నాలుగవ వంతు భూభాగంలో మాత్రమే ఫ్యాక్టరీ గానీ, ఇతర ఆర్థిక సంస్థగానీ నెలకొంటుంది. మిగిలిన మూడు వంతుల భూభాగంలో, అందులో పనిచేసే ఉద్యోగుల నివాసాలు, పార్కులు, క్లబ్బులు, వాళ్ళ పిల్లలకు స్కూళ్ళు, విశాలమైన రహదార్లు, షాపింగ్ కాంప్లెక్స్లు ఉంటాయి. అంటే ఒక్కొక్క ప్రత్యేక ఆర్థిక మండలి ఒక సుఖమయమైన టౌన్షిప్గా రూపొందుతుంది. ఇటువంటి వ్యవస్థ కోసం చేసే భూసేకరణ చట్టరీత్యా చెల్లుతుందా అన్నది ఒక ప్రశ్న కాగా, ప్రజల జీవనాధారమైన భూమిని ఇంత ధారాళంగా పెట్టుబడిదార్ల చేతిలో పెట్టనిదే దేశం అభివృద్ధి చెందదా అన్నది బహుశా అంతకంటే ముఖ్యమైన ప్రశ్న.

ప్రత్యేక ఆర్థిక మండలుల చట్టం సెక్షన్ 3 (1) ప్రకారం ప్రత్యేక ఆర్థిక మండలులలో నెలకొల్పబోయే 'ఆర్థిక సంస్థ' ఫ్యాక్టరీయే కానక్కర లేదని కూడా చెప్పాలి. అది ఉత్పత్తిదాయకమైన సంస్థ కావచ్చు. సేవా రంగ సంస్థ (అంటే బ్యాంకు, ఇన్సూరెన్స్ కంపెనీ, ఆస్పత్రి, చివరికి హోటల్ సైతం) కావచ్చు, వర్తక కేంద్రం కావచ్చు, గోడౌన్ కావచ్చు. అంతేకాదు 'ఉత్పత్తి' (మ్యానుఫ్యాక్చర్) అనే దానికి పారిశ్రామిక ఉత్పత్తి అనేకాక వ్యవసాయ ఉత్పత్తి, పళ్ళతోటల పెంపకం, పశుపోషణ, చేపల పెంపకం అని కూడా సెక్షన్ 2 (ఆర్)లో అర్థం చెప్పారు. కాబట్టి

రైతులందరినీ తరిమేసి వాళ్ళు నాటిన చెట్లను నరికేసి మళ్ళు దున్నేసి తిరిగి ఒక కంపెనీ ఆధ్వర్యంలో వ్యవసాయం లేక తోటల పెంపకం చేపట్టవచ్చు! ఒక్కటే తేడా ఏమిటంటే ఇది ఎగుమతుల కోసం జరుగుతుంది. మనం తినడం కోసం కాదు. ఒక్క మాటలో చెప్పాలంటే ఇదీ అదీ అన్న తేడా లేకుండా ఎగుమతుల కోసం చేపట్టే ఏ ఆర్థిక కార్యకలాపమైనా ప్రత్యేక ఆర్థిక మండలులలో నెలకొల్పవచ్చు.

ఇంకొక వింత విషయం ఏమిటంటే 'ఎగుమతులు' అంటే విదేశాలకే కానక్కరలేదు. ప్రత్యేక ఆర్థిక మండలిలోని ఒక సంస్థ నుంచి మరొక సంస్థకు, లేక ఒక ప్రత్యేక ఆర్థిక మండలి నుంచి మరొక ప్రత్యేక ఆర్థిక మండలికి జరిగే అమ్మకం కూడా ఎగుమతేనట. మనబోటి బలహీనమైన ఆర్థిక వ్యవస్థ గల దేశాలకు చెందిన సంస్థలు అంతర్జాతీయ విపణిలో పోటీపడి అమ్మకాలు సాగించడం కష్టతరమని చెప్పి అటువంటి సంస్థలకు పన్ను రాయితీలివ్వడాన్ని ఒక పక్క సమర్థించుకుంటూ, మరొక పక్క ఇరుగు పొరుగు ప్రత్యేక ఆర్థిక మండలులకు చేసే అమ్మకం కూడా ఎగుమతేననడాన్ని ఏ విధంగా అర్థం చేసుకోవాలి? సహేతుకంగా తోచే ఒక కారణాన్ని చూపించి, దానితో ఏమీ సంబంధం లేని కార్యకలాపాలకు కూడా ఖరీదైన రాయితీలివ్వడం మోసం అనిపించుకోదా?

ప్రత్యేక ఆర్థిక మండలికి కేటాయించిన భూభాగంలో ఉత్పత్తి లేక ఇతర ఆర్థిక ప్రక్రియ నిర్వహించే ప్రాంతం 25 శాతం వైశాల్యాన్ని మించి ఉండనవసరం లేదనీ మిగిలిన 75 శాతం 'అనుబంధ' నిర్మాణాలకు కేటాయించవచ్చుననీ పైన చెప్పాము. ఈ విషయాన్ని ఇంకొంచెం వివరంగా తెలుసుకోవాలి. ఒకటి కంటే ఎక్కువ రకాల ఉత్పత్తులు చేపట్టే ప్రత్యేక ఆర్థిక మండలిని బహుళ ఉత్పత్తి (మల్టీ ప్రొడక్ట్) ఎస్ఇజడ్ అంటారు. అటువంటి ఎస్ఇజడ్ కనీస వైశాల్యం 2,500 ఎకరాలు (వెయ్యి హెక్టార్లు) ఉండాలి. ఇక్కడ కొంచెం భూమి అక్కడ కొంచెం భూమి కాదు, అవిచ్ఛిన్నమైన భూభాగం కేటాయించాలి. అందులో 25% మించి ఉత్పత్తి లేక ఇతర ఆర్థిక ప్రక్రియ ఉండనవసరం లేదు.

సేవా రంగానికి చెందిన కార్యకలాపాలకు పరిమితమయ్యే ప్రత్యేక ఆర్థిక మండలి వైశాల్యం అంత ఉండనవసరం లేదు. 250 ఎకరాలుంటే చాలు. ఓడరేవు, విమానాశ్రయం నెలకొల్పే ప్రత్యేక ఆర్థిక మండలులు కూడా ఉండగలవు. వీటి వైశాల్యం 250 ఎకరాలు మించి ఉండాలి. వీటిలో మాత్రం ప్రధాన ప్రక్రియ 50 శాతం భూభాగంలో ఉండాలి. మిగిలిన 50 శాతం అనుబంధ కార్యకలాపాలకు వినియోగించవచ్చు. వర్తకం, గోడౌన్ల ఎస్ఇజడ్ వైశాల్యం 100 ఎకరాలు మించి ఉండాలి. దీనికి కూడా 50 శాతం నియమం వర్తిస్తుంది.

**'ఎగుమతులు' అంటే విదేశాలకే కానక్కరలేదు. ప్రత్యేక ఆర్థిక మండలిలోని ఒక సంస్థ నుంచి మరొక సంస్థకు, లేక ఒక ప్రత్యేక ఆర్థిక మండలి నుంచి మరొక ప్రత్యేక ఆర్థిక మండలికి జరిగే అమ్మకం కూడా ఎగుమతేనట.**

మిగిలిన భూభాగం 'అనుబంధ' అవసరాలు తీర్చడం కోసం ఉద్దేశించబడిందని అంటున్నాముగానీ, ఈ 'నాన్- ప్రాసెసింగ్ ఏరియా'లో ఏం చేయవచ్చుననే విషయాన్ని చట్టం అస్పష్టంగానే ఉంచేసింది. వ్యాపార అవసరాలకు, విద్యాసంస్థలు, ఆస్పత్రులు మొదలైన సామాజిక అవసరాలకు, హోటళ్ళకు, కాలక్షేపానికి, నివాసాలకు



ఆ భూమిని డెవలపర్ కేటాయించవచ్చునని అంటుంది గానీ ఇవన్నీ ఉత్పత్తి ప్రక్రియలో పాల్గొనే ఉద్యోగుల అవసరాలతో ముడిపడి ఉండాలనదు. కాబట్టి వారి అవసరాలు తీర్చగా మిగిలిన భూమిని రియల్ ఎస్టేట్ వ్యాపారానికి వినియోగించుకోవాలనుకుంటే చట్టంలో ఆటంకం లేదు.

**'నాన్ - ప్రాసెసింగ్ ఏరియా'లో ఏం చేయవచ్చుననే విషయాన్ని చట్టం అస్పష్టంగానే ఉంచేసింది. వ్యాపార అవసరాలకు, విద్యాసంస్థలు, ఆస్పత్రులు మొదలైన సామాజిక అవసరాలకు, హోటళ్ళకు, కాలక్షేపానికి, నివాసాలకు ఆ భూమిని డెవలపర్ కేటాయించవచ్చునని అంటుంది గానీ ఇవన్నీ ఉత్పత్తి ప్రక్రియలో పాల్గొనే ఉద్యోగుల అవసరాలతో ముడిపడి ఉండాలనదు. కాబట్టి వారి అవసరాలు తీర్చగా మిగిలిన భూమిని రియల్ ఎస్టేట్ వ్యాపారానికి వినియోగించుకోవాలనుకుంటే చట్టంలో ఆటంకం లేదు.**

ఇంకొక రెండు విషయాలు చెప్పుకుంటే ఈ ప్రత్యేక ఆర్థిక మండలుల ప్రత్యేక స్వభావం పూర్తిగా అర్థం అవుతుంది. కార్మిక చట్టాల అమలును (మినహాయింపులివ్వగా ఇంకా మిగిలి ఉండే) పర్యవేక్షించే అధికారం ఉన్న కార్మిక శాఖ అధికార్ల స్థానంలో డెవలప్‌మెంట్ కమిషనర్‌ను నిలబెడుతుంది ప్రత్యేక ఆర్థిక మండలుల నియమావళి. ఈ కమిషనర్ గారి ప్రధాన కర్తవ్యం ప్రత్యేక ఆర్థిక మండలి ఆర్థికంగా ఫలవంతంగా పని చేసేటట్టు చూడడం. కాబట్టి కార్మిక శాఖ అధికారాలు అతని చేతిలో పెడితే కార్మికుల హక్కులను ఎగుమతి వ్యాపారానికి లోబడిన విషయంగా చూస్తాడనడంలో సందేహం అక్కర లేదు.

చివరిగా ఈ ప్రత్యేక ఆర్థిక మండలిలో అధికారికంగా నివసించే వారందరికీ గుర్తింపు కార్డులుంటాయి. ఈ గుర్తింపు కార్డులు ప్రత్యేక ఆర్థిక మండలిలోని ఆర్థిక సంస్థ పరిసరాలలోకి ప్రవేశించడానికి అనుమతిగా పనిచేస్తాయి. ప్రమాదకరమైన ఉత్పత్తులు చేసే సంస్థలలోకి ప్రవేశాన్ని నియంత్రించడం ఎరుగుదుము కానీ ఈ నియమాల కింద ఏ రకమైన ఆర్థిక కార్యకలాపాలు నిర్వహించే ప్రత్యేక ఆర్థిక మండలిలోనికైనా అనుమతించిన వారికే ప్రవేశం ఉంటుంది. ఇది భద్రతా చర్యకాదు, పారదర్శకతను నిరాకరించే చర్య. ఎగుమతి దిగుమతి సుంకాలకు సంబంధించినంత వరకు ప్రత్యేక ఆర్థిక మండలి 'విదేశీ భూభాగంగా' పరిగణించబడుతుందని ఈ చట్టమే సెక్షన్ 53లో అంటుంది. వివరాలలోకి పోతే సుంకాల విషయంలోనే కాదు, సమాచారం విషయంలోనూ అది విదేశీ భూభాగమే అని అర్థం అవుతుంది. కార్మికుల హక్కులుకిచ్చే మినహాయింపును దృష్టిలో ఉంచుకున్నట్టయితే, అది ఇంక ఏ విషయంలో స్వదేశీ భూభాగం అని మనల్ని మనం ప్రశ్నించుకోవలసిందే.

## రాష్ట్రంలోని ప్రత్యేక ఆర్థిక మండలులు

2006 డిసెంబర్ నాటికి మన రాష్ట్రంలో 43 ప్రత్యేక ఆర్థిక మండలులు అనుమతి పొందాయని ప్రభుత్వ సమాచారం. వాటికింద 90 వేల ఎకరాలకు పైగా సేకరించబడతాయని అంచనా. ఆ 43లో 6 బహుళ ఉత్పత్తి మండలులు కాగా మిగిలినవి ఏకోత్పత్తి మండలులు. 27 ఐటి ఉత్పత్తులకు, 3 పాదరక్షల ఉత్పత్తికి కేటాయించబడ్డాయి. బయోటెక్నాలజీ, కాగితపు పరిశ్రమ, సెమీకండక్టర్స్, ఆభరణాలు, వస్త్రాలు, రెడీమేడ్ దుస్తులు, గృహ నిర్మాణ పరికరాలకు సంబంధించినవి ఒక్కొక్కటి ఆమోదం పొందాయి.

అయితే ఏ రోజైనా ఇంకా ఎస్ఇజడ్‌లు ఆమోదం పొందగలవు కాబట్టి, ఈ గణాంకాలు కేవలం మన రాష్ట్రంలో ప్రత్యేక ఆర్థిక మండలుల ప్రక్రియ పరిమాణాన్ని సూచించడానికి పని కొస్తాయి. ఈ పరిమాణం ఎంతటిది అంటే దేశంలో మహారాష్ట్ర తరువాత ప్రత్యేక ఆర్థిక మండలుల సంఖ్యలో మనదే రెండవ స్థానం. హైదరాబాద్ పరిసరాలలో ప్రత్యేక ఆర్థిక మండలుల రూపంలోనే కాక ఇతర రూపాలలోనూ భూములను ప్రభుత్వం పెట్టుబడిదార్లకు దత్తం చేస్తుండగా, విశాఖపట్నం ప్రత్యేక ఆర్థిక మండలుల ఏర్పాటుకు ప్రధాన క్షేత్రంగా ఉంది. విశాఖపట్నం సిటీకి కూతవేటు దూరంలో ఉన్న అచ్యుతాపురం, రాంబిల్లి మండలాలలో ఇప్పటికే 18,000 ఎకరాల ఎస్ఇజడ్‌లు ఆమోదం పొందాయి. ఆ తీరం వెంబడి ఇంకా కూడా ఆమోదం పొందగలవని వింటున్నాం. మరి రెండు పెద్ద ఎస్ఇజడ్‌లు తూర్పు గోదావరి జిల్లాలోని కాకినాడ దగ్గర, చిత్తూరు జిల్లాలోని సత్యవేడు, వరదయ్య పాలెం మండలాలలోనూ నెలకొనబోతున్నాయి. మొదటి దాని వైశాల్యం 10,000 ఎకరాలు. రెండవ దాని వైశాల్యం 12,000 ఎకరాలు.

ఈ మధ్య కొందరు కాంగ్రెస్ నాయకులు – ప్రధానంగా ఆ పార్టీ అధ్యక్షురాలు – లేవదీసిన చర్చనిక్కడ ప్రస్తావించాలి. ప్రత్యేక ఆర్థిక మండలులకు భూసేకరణ చేపట్టేటప్పుడు సారవంతమైన భూములను మినహాయించాలని ఆమె సూచించారు. ప్రత్యేక ఆర్థిక మండలుల స్వరూప స్వభావాలను పైన వర్ణించాము. దానికి కేటాయించే భూమి 'అవిచ్ఛిన్నమైనది' (కంటిన్యూయస్) అని ఎస్ఇజడ్ చట్టం స్పష్టంగా అంటుంది. సారవంతమైన భూములు లేని వేల ఎకరాల అవిచ్ఛిన్నమైన భూమి థార్ ఎడారి వెలుపల ఎక్కడైనా దొరుకుతుందా? సోనియాగాంధీ గారి కోరిక మేరకు చట్టాన్ని సవరించి 'అవిచ్ఛిన్నమైనది' అనే విశేషణాన్ని తీసేస్తారనుకుందాం. కానీ అట్లా మినహాయించిన సారవంతమైన భూములలో వ్యవసాయం సాధ్యమవుతుందా? ఆ పొలాల చుట్టూ ఇళ్ళుంటాయి, షాపులుంటాయి, ఫ్యాక్టరీలుంటాయి. వాటి నుంచి వెలికి వచ్చే కాలుష్యానికి ఆ పొలం బలికాకుండా కాపాడుకోవడమే రైతుకు పెద్ద భారం కాదా?

కాకుండా సారవంతమైన నేలలు అన్నప్పుడు రెండు పంటలు లేక మూడు పంటలు పండే భూములు అనే వ్యాఖ్యానం చేస్తున్నారు. ఇది తిండిగింజల ఉత్పత్తి పడిపోతుందన్న ఆందోళనే తప్ప రైతులు, కూలివాళ్ళ జీవనం దెబ్బతింటుందన్న ఆందోళన కాదు. వ్యవసాయరంగ నిపుణుడు ఎం.ఎస్.స్వామినాథన్ ఈ విషయం స్పష్టంగానే చెప్పాడు. ఎస్ఇజడ్‌ల వల్ల దేశంలో ధాన్యం ఉత్పత్తి పడిపోకుండా జాగ్రత్త పడాలన్నాడు.

**దేశంలో మహారాష్ట్ర తరువాత ప్రత్యేక ఆర్థిక మండలుల సంఖ్యలో మనదే రెండవ స్థానం. హైదరాబాద్ పరిసరాలలో ప్రత్యేక ఆర్థిక మండలుల రూపంలోనే కాక ఇతర రూపాలలోనూ భూములను ప్రభుత్వం పెట్టుబడిదార్లకు దత్తత చేస్తుండగా, విశాఖపట్నం ప్రత్యేక ఆర్థిక మండలుల ఏర్పాటుకు ప్రధాన క్షేత్రంగా ఉంది.**

కానీ భూమి సారవంతమైనదైనా, కాకున్నా దానిమీద ఆధారపడి బతికే వాళ్ళకు అదే జీవనం. అది రెండు పంటల భూమైతే కనీసం కొంత ఎక్కువ నష్టపరిహారమైనా వస్తుంది. సారహీనమైన భూమికి అది కూడా రాదు. కాగా, ప్రభుత్వ భూమి, ఊరుమ్మడి భూమిని పరిశ్రమలకు ఇచ్చేయడంలో ఏ సమస్యా లేనట్టే అందరూ మాట్లాడుతున్నారు. ఆ భూమి ఒక్కొక్క చోట ఒక్కో విధంగా చాలామందికి జీవనాధారంగా



ఉంటుంది. వాళ్ళకు దానిపైన చట్టం గుర్తించే యాజమాన్య హక్కు లేకుంటే లేకుండవచ్చు. ఉదాహరణకు విశాఖపట్నం జిల్లా సబ్బవరం సమీపంలో ఈ మధ్య బాక్సైట్ పరిశ్రమ రిఫైనరీ కోసం 1700 ఎకరాలను ప్రభుత్వం జిందాల్ కుటుంబానికి చెందిన ప్రైవేటు కంపెనీకి అప్పగించింది. అది ప్రభుత్వ భూమి కాబట్టి భూమి సేకరణ అక్కరలేదనింది. కానీ నిజానికి ఆ 1700 ఎకరాలలో 1000 ఎకరాలు సాగులో ఉన్నాయి. మిగిలిన బంజరు వంట చెరుకుకు, పశు గ్రాసానికి కొన్ని వందల కుటుంబాలకు ఆధారంగా ఉంది. రేపు ఆ 1700 ఎకరాలూ జిందాల్‌కు అప్పగించేస్తే ఎన్ని వేల కుటుంబాల జీవనం దెబ్బతింటుందో చెప్పడం కష్టం.

**బాక్సైట్ పరిశ్రమ రిఫైనరీ కోసం 1700 ఎకరాలను ప్రభుత్వం జిందాల్ కుటుంబానికి చెందిన ప్రైవేటు కంపెనీకి అప్పగించింది. అది ప్రభుత్వ భూమి కాబట్టి భూమి సేకరణ అక్కరలేదనింది. కానీ నిజానికి ఆ 1700 ఎకరాలలో 1000 ఎకరాలు సాగులో ఉన్నాయి.**

హైదరాబాద్ పరిసరాలలో హైదరాబాద్ పట్టణాభివృద్ధి సంస్థ (హుడా) 'తన భూములు' అమ్ముకుంటున్నదంటూ వినిపించే వార్తలన్నీ ఇటువంటివే. రాజేంద్రనగర్ మండలంలోని కోకాపేట ఖరీదైన అమ్మకానికి పేరు గాంచింది. ఒకే చోట ఉన్న 60 ఎకరాల భూమిని హుడా వేలం వేసి కోట్లు సంపాదించిందన్న వార్త సంచలనం సృష్టించింది. అది ఖాళీ జాగా అన్న అభిప్రాయమే హుడా కలిగించింది. కానీ సర్వే నెం. 109 లోని ఆ 60 ఎకరాలను 36 మాదిగ కుటుంబాల వారు 50 సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్నారు. 1965 నుంచి వారు డి–ఫారం పట్టాలు ఇమ్మని ప్రభుత్వానికి అర్జీ పెట్టుకుంటూ ఉన్నారు. నిరభ్యంతరకరమైన ఆక్రమణను క్రమబద్ధీకరించి డి–ఫారం పట్టాలు ఇవ్వాలని బోర్డు స్టాండింగ్ ఆర్డర్స్ చెప్తాయి. అయినప్పటికీ పాలకులకు అంత టైం దొరకలేదు. మీకుకాక వేరే ఎవరికిస్తాం లెమ్మని కాలక్షేపం చేస్తూ వచ్చారు. ఈ భూమి ఎవరికి కావాలి లెమ్మని చేసుకుంటున్న వారు కూడా ధీమాగానే ఉన్నారు. తెలుగుదేశం పాలనలో రాష్ట్రంలో భూకంపం మొదలైంది. కంపెనీలకు భూములు భారీగా బదలాయించే ప్రక్రియ షురూ అయింది.

2001లో పోలీసు అకాడెమీకి కోకాపేట సర్వే నెం. 109లోని 60 ఎకరాలను అప్పగించే ప్రయత్నం జరిగినప్పుడు ఆ భూమి చేసుకుంటున్న మాదిగలు గట్టిగా అడ్డంపడ్డారు. ఆ ప్రయత్నాన్ని ఆపించగలిగారు. కానీ రోజులు మారాయని గ్రహించి తమ ఎంఎల్ఏ సబితా ఇంద్రారెడ్డిని కలిసి ఎట్లాగైనా తమ భూమికి పట్టాలు ఇప్పించమని అడిగారు. 'తెలుగుదేశం పాలనలో కాదు – మా ప్రభుత్వం రానీ చేపిస్తానన్నది. తమ ప్రభుత్వం రాగానే భూమిని హర్రాజు పెట్టిచ్చింది' అని వాళ్ళు సగం నవ్వుతూ సగం కోపంగా అంటారు. హర్రాజ్ హుడా కార్యాలయంలో జరుగుతున్నదని తెలిసి ఆటంకపరచడానికి వారు పోగా సబితా ఇంద్రారెడ్డి వాళ్ళను తన దగ్గరకు పిలిపించుకొని సంప్రదింపుల పేరిట హర్రాజ్ అయిపోయే దాకా కాలక్షేపం చేసిందని వారి మరొక ఫిర్యాదు.

ఈ ఉదంతాలను ప్రస్తావించడంలో గల ఉద్దేశం, ఎవరి జీవనానికీ హాని కలిగించకుండా వేల ఎకరాల భూసేకరణ చేసేయవచ్చుననుకోవడం భ్రమ అని చెప్పడం. కంపెనీల కోసం, రోడ్ల కోసం, ప్రాజెక్టుల కోసం చేసే బలవంతపు భూసేకరణ చాలా పరిమితమైన పరిధిలో ఉండాలి. బలవంతపెట్టని ప్రత్యామ్నాయాలను అన్వేషించాలి. అయినప్పటికీ తప్పనిసరైతే, ఆ భూమిపైన

తమ జీవనం కోసం ఆధారపడే ప్రజల జీవన ప్రమాణం ఏమాత్రం దెబ్బతినని సమగ్ర పునరావాస విధానాన్ని అమలులో పెట్టిన తరువాతే భూసేకరణ చేపట్టాలి. ప్రత్యేకించి, మూకుమ్మడిగా వేల ఎకరాల భూములను కంపెనీలకు ధారాదత్తం చేసే ప్రత్యేక ఆర్థిక మండలుల భావననే విడిచి పెట్టాలి.

చిత్తూరు జిల్లా సత్యవేడు, వరదయ్యపాలెం మండలాలలో 12,000 ఎకరాల ఎస్ఇజడ్ తయారవుతున్నది. దానికోసం 16 గ్రామాలలో భూముల సేకరణకు చర్యలు మొదలయ్యాయి. దీని డెవలపర్ సన్నాటి రవీంద్రరెడ్డి అనే వ్యక్తి ('అతను ప్రవాస భారతీయుడంట' అని తప్ప ఆ మహానుభావుడి గురించి ఎవరికీ ఏమీ తెలీదు). ఇతను శ్రీసిటీ (ప్రై) లిమిటెడ్ అనే కంపెనీ అధినేత.

చిత్తూరు జిల్లాలో ఏవో రెండు మండలాలంటే అవి ఎక్కడో మారుమూలనున్నాయనుకునేరు. ఒక పెద్ద నగరానికి ఒక జాతీయ రహదారికి ఒక ప్రధాన రైల్వే మార్గానికి ఒక ఓడరేవు లేక విమానాశ్రయానికి దూరంగా ప్రత్యేక ఆర్థిక మండలి నెలకొల్పడానికి ఏ 'డెవలపర్' ముందుకు రాడు. (ప్రాంతీయ అసమానతలు కూడా ఎస్ఇజడ్‌ల వల్ల పెరుగుతాయని దీనిని బట్టి అర్థం అవుతుంది). సత్యవేడు, వరదయ్యపాలెం ఎస్ఇజడ్ 5వ నంబర్ జాతీయ రహదారి పక్కన ఉండడమే కాక, మద్రాసు - హౌరా రైల్వే లైను పక్కన ఉండి, మద్రాసు నగరానికీ నెల్లూరు పట్టణానికీ భారీగా విస్తరణ చెందుతున్న కృష్ణాపట్టణం రేవుకూ దగ్గర్లో ఉంది.

ఈ 16 గ్రామాల జనాభా 25 వేల దాకా ఉంటుంది. గ్రామ ఆవాసాలను విడిచిపెట్టి గ్రామం చుట్టూ ఉన్న భూములను మాత్రమే స్వాధీనం చేసుకుంటున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. ఇది మొత్తం భూమిని స్వాధీనం చేసుకోవడం కంటే పెద్ద మోసం. భూములన్నీ కోల్పోయి ఇళ్ళు మాత్రం మిగుల్చుకొని అక్కడ బతికి ఏం చేస్తారు? ఆ ఇళ్ళు కొనే వాళ్ళెవరూ ఉండరు కాబట్టి ఏదో ఒక రోజు వాటిని వదిలిపెట్టి వట్టి చేతులతో వెళ్ళిపోవాలి.

మంచి పంటలు పండే భూములను ప్రత్యేక ఆర్థిక మండలుల కోసం సేకరించబోరు అన్న అభిప్రాయం ఈ మధ్య వింటున్నాం కాబట్టి ఈ 12 వేల ఎకరాలలో మూడింట రెండు వంతులు రైతుల స్వంత భూమి అనీ, మిగిలిన ఒక వంతు పేదలు చేసుకుంటున్న ప్రభుత్వ భూమి అనీ చెప్పాలి. పైగా అక్కడ చాలా చెరువులున్నాయి, వందల సంఖ్యలో బావులు, బోర్లు ఉన్నాయి. సజ్జలు, వరి, చెరుకు, వేరుశనగ పొలాలేకాక మామిడి తోటలు, మల్లెతోటలు, రోజా పూదోటలు ఉన్నాయి. పశువులు ఒక్కొక్క ఊరిలోనూ వేల సంఖ్యలో ఉన్నాయి.

**ఎవరి జీవనానికీ హాని కలిగించకుండా వేల ఎకరాల భూసేకరణ చేసేయవచ్చుననుకోవడం భ్రమ. తప్పనిసరైనప్పుడు, ఆ భూమిపైన తమ జీవనం కోసం ఆధారపడే ప్రజల జీవన ప్రమాణం ఏమాత్రం దెబ్బతినని సమగ్ర పునరావాస విధానాన్ని అమలులో పెట్టిన తరువాతే భూసేకరణ చేపట్టాలి.**

భూమంతా సారవంతమైనది కాదుగానీ సారవంతమైన భూములు మాత్రం మంచి ఆదాయం ఇస్తాయి. చెరుకు వేస్తే ఒక ఎకరానికి 25 వేల నికర ఆదాయం రాగలదు. రోజా పూల తోట ఎకరానికి 1 లక్షదాకా ఇవ్వగలదు. మల్లె తోట అంత కంటే చాలా ఎక్కువ ఇవ్వగలదు. గెణుసు గడ్డలు (చిలగడ దుంపలు) వేస్తే



ఎకరానికి 50 వేల ఆదాయం రాగలదు. అన్నీ కలిసొచ్చినప్పుడే తప్ప ప్రతి సీజన్‌లోనూ ఇంత ఆదాయం రాని మాట నిజమే గానీ ఇక్కడి వ్యవసాయం ఫలవంతమైనదని గుర్తించాలి. ఇప్పుడు ఈ భూమంతా శ్రీసిటీ అనే 'డెవలపర్' చేతిలోకి పోతున్నది. మొదట్లో ఈ గ్రామాల ప్రజలు కొంత ప్రతిఘటించారు. ఎకరానికి రెండున్నర లేక మూడు లక్షల రూపాయల నష్ట పరిహారం ఇవ్వడానికి ప్రభుత్వం సంసిద్ధత ప్రకటించింది. అయితే ఈ మాత్రం పొందాలంటే రైతులు దానిపైన కోర్టుకు పోమని హామీ ఇవ్వాలి. లేకపోతే ప్రభుత్వ రిజిస్ట్రేషన్ ధర ప్రకారం వారికి 1 లక్షకు తక్కువగా నష్టపరిహారం ఇచ్చి కోర్టుల చుట్టూ తిప్పుతుంది ప్రభుత్వం.

**ఒక ఎకరం భూమి ఉన్న ఏ రైతు ఒక లక్ష రూపాయలకు తక్కువ అప్పు పడలేదు. ఊరిలో ఉండి వ్యవసాయం చేసుకుంటున్నంత కాలం అప్పుల వాళ్ళు మరీ ఒత్తిడి పెట్టరు. కానీ భూమి అప్పగించి వెళ్ళిపోతాడనుకుంటే బాకీ తీర్చేదాకా పోనివ్వరు.**

ఎకరానికి రెండున్నర లేక మూడు లక్షల నష్టపరిహారం ఇస్తే మళ్ళీ తిరిగి ఆ పరిసరాలలో ఒక ఎకరం కొనడం సాధ్యం కాదన్న విషయం అటుంచి, ఆ డబ్బులు కూడా వారి చేతిలో మిగలవు. ఒక ఎకరం భూమి ఉన్న ఏ రైతు ఒక లక్ష రూపాయలకు తక్కువ అప్పు పడలేదు. ఊరిలో ఉండి వ్యవసాయం చేసుకుంటున్నంత కాలం అప్పుల వాళ్ళు మరీ ఒత్తిడి పెట్టరు. కానీ భూమి అప్పగించి వెళ్ళిపోతాడనుకుంటే బాకీ తీర్చేదాకా పోనివ్వరు.

తన ప్రతిపాదనకు రైతులను ఒప్పించడానికి ప్రభుత్వం రెండు రకాల పద్ధతులు ఆశ్రయిస్తున్నది. ఒకటి భూమి ఎక్కువగా ఉండి, 50 లక్షలో, కోటి రూపాయలో నష్టపరిహారం దొరికితే వ్యవసాయం విడిచిపెట్టి ఏ వ్యాపారమో చేసుకొని బతకడానికి సిద్ధంగా ఉన్న పెద్ద రైతులను ఒప్పించి వారిచేత చిన్న రైతులపైన ఒత్తిడి పెట్టించడం. 30-40 ఎకరాల భూములు గల భూస్వాములున్న ఊర్లు కొన్ని ఉన్నాయి కాబట్టి ఈ ఎత్తుగడ సాగుతుంది. అటువంటి భూస్వాములకు వ్యవసాయ రంగం నుంచి బయటకు పోవడానికి అభ్యంతరం లేకపోవడానికి వేరే కారణం కూడా ఉంది. వాళ్ళు వ్యవసాయం స్వయంగా చేసుకోరు. రైతులకు కౌలుకిచ్చి చేయించుకుంటారు. బాగా చేసే కౌలుదార్లు దొరకరనీ, కౌలు సరిగ్గా చెల్లించరనీ మామూముగా ఉండే అసంతృప్తి వారిలో ఉంది. ఎస్ఇజడ్‌కు ఇచ్చేసి ఈ 'పీడ' వదిలించుకోవడానికి వాళ్ళు సులభంగానే సిద్ధపడతారు.

సత్యవేడు మండలం చెరివి పంచాయతీలో ప్రభుత్వానికి ఈ అవకాశం లభించింది. ఆ ఊరికి చెందిన రెడ్డి కులస్తులైన భూస్వాములు కొందరు తిరుపతిలో ప్రభుత్వ అధికారులు నిర్వహించిన మీటింగ్‌లో పాల్గొని ఎకరానికి రెండున్నర లక్షల నుంచి మూడు లక్షల దాకా నష్టపరిహారం ఇస్తే చాలనీ, ఆపైన కోర్టుకు పోమని రాసిచ్చి భూమి అప్పగించేయడానికి అంగీకరించారు. గ్రామ ప్రజల ఆమోదం పొందడానికి గ్రామ సభ జరపలేదు. వేరే ఏ రూపంలోనూ ప్రజాభిప్రాయ సేకరణ చేయలేదు. ఆ గ్రామ పంచాయతీకే చెందిన చిగురుపాలెం వాసులు తమకేమీ తెలీదనీ, తమను అడగకుండా ఈ నిర్ణయం చేశారనీ అంటున్నారు.

ఊరిలో ఒకరిద్దరితో మాట్లాడి నిర్ణయం ఎట్లా చేస్తారని అధికార్లను అడిగితే ఆ నిర్ణయాన్ని అందరూ అంగీకరించాలన్న ఒత్తిడేమీ లేదని, అంగీకరించడానికి నిరాకరించే రైతులు తమ హక్కుల

కోసం కోర్టులో కేసు వేసుకోవచ్చుననీ నిజాయితీ లేని జవాబులు చెప్తున్నారు. సాంకేతికంగా చూస్తే అది నిజమే కావచ్చు. అయితే ఒప్పందాన్ని తిరస్కరించే రైతులకు ప్రభుత్వం భూసేకరణ చట్టాన్ని, దానికింద అనుసరించే ప్రక్రియను అమలుచేస్తుంది. అంటే స్థానికంగా భూముల అమ్మకాలు రిజిస్టర్ అయిన ధరలను ప్రమాణంగా పెట్టుకొని ఏ 60 వేలో, 70 వేలో ఇస్తుంది. ఆ తరువాత ఒక దశాబ్దకాలం కోర్టుల చుట్టూ తిప్పుతుంది. చివరికి నష్టపరిహారం పెరగడం తరచుగా జరుగుతుంది గానీ ఈ లోపల చేసిన అప్పులకయ్యే వడ్డీలనూ, బ్రోకర్లకూ, లాయర్లకూ (ఒక్కొక్కసారి జడ్జీలకు కూడా) చెల్లించుకునే మొత్తాన్నీ దాని నుంచి మినహాయించవలసి ఉంటుంది.

ఇది చిన్న వ్యవసాయదారులకు చాలా అన్యాయం చేస్తున్నదని గ్రహించిన కారణంగా ఈ మధ్య కాలంలో 'కన్సెంట్ (సమ్మతి) అవార్డులు' అనే ప్రక్రియను ప్రవేశపెట్టారు. ప్రభుత్వం ఏక పక్షంగా భూమి ధరను నిర్ణయించి ఆపైన రైతును కోర్టు చుట్టూ తిప్పే బదులు, రైతులతో కూర్చొని మాట్లాడి ఇద్దరికీ సమ్మతమైన ధర నిర్ణయించడం కోసం జిల్లా స్థాయిలో ఒక కమిటీని, రాష్ట్ర స్థాయిలో ఒక కమిటీని నియమిస్తారు. సమ్మతి కుదిరితే ఇక ఆపైన రైతులు కోర్టుకు పోమని అంగీకరిస్తారు. ఇది మంచి ఆలోచనే.

అయితే ఎంత మంచి ఆలోచననైనా భ్రష్టు పట్టించడంలో మన పాలకులు వారికి వారే సాటి. ఈ ప్రక్రియను ప్రజాస్వామికంగా అమలు జరపదలచుకున్నట్టయితే గ్రామ సభ నిర్వహించి బహిరంగంగా చర్చించి అందరి అభిప్రాయాలూ తీసుకోవాలి. మెజారిటీ ప్రభుత్వ ప్రతిపాదనను అంగీకరించి, కొద్దిమంది మాత్రం కాదంటే ఆ కొద్దిమందితో విడిగా మాట్లాడాలి. అంతేతప్ప కొద్ది మంది మోతుబరులతో మాట్లాడి ఒక నిర్ణయం తీసేసుకుని 'సమ్మతి అవార్డు' ఇదేనని ప్రకటించి, దానిని కాదనే వాళ్ళు కోర్టుకు పోవచ్చునని సూక్తులు వల్లించడం 'సమ్మతి' అన్న భావననే వెక్కిరించడం అవుతుంది. అయితే అన్ని భూసేకరణ ప్రక్రియలలోనూ ఇదే జరుగుతున్నది.

ప్రభుత్వం ప్రయోగిస్తున్న రెండవ ఒత్తిడి 'ఒక్కొక్క ఇంటికీ ఒక ఉద్యోగం ఇస్తాం' అన్న హామీ. ఇది రైతులను, ముఖ్యంగా వెనుకబడిన ప్రాంతాల రైతులను చాలా ఆకర్షిస్తుంది. కురవని వర్షాలతో, మొలకెత్తని విత్తనాలతో, పని చేయని మందులతో, పలకని ధరలతో విసిగిపోయిన రైతులకు ఫ్యాక్టరీలో ఉద్యోగం బహుభద్రమైన ప్రత్యామ్నాయంగా తోస్తుంది. ఆ ఆకర్షణ కారణంగా వారు విచక్షణ కోల్పోయి ప్రభుత్వ ప్రతిపాదనకు అనాలోచితంగా సమ్మతిస్తారని ప్రభుత్వం ఆశ. ఇది దుర్మార్గమైన ఆలోచన. ఎందుకంటే ప్రత్యేక ఆర్థిక మండలుల విషయంలో ప్రభుత్వం ఏం చేయవచ్చు, ఏం చేయకూడదు అనేది ఎస్ఇజడ్ చట్టానికి లోబడి ఉంటుంది. ఆ చట్టంలో ఎక్కడా కూడా ఎస్ఇజడ్‌లో నెలకొల్పబోయే కంపెనీ ఎవరికి ఉద్యోగాలివ్వాలో ఆదేశించే అధికారం ప్రభుత్వానికి లేదు. ఒక వేళ రేపు అటువంటి అధికారాన్ని ప్రభుత్వానికి కల్పించే సవరణ చేసినా అది రాజ్యాంగ విరుద్ధం అని న్యాయ స్థానాలు ప్రకటించవన్న నమ్మకం లేదు. పోనీ అటువంటి చట్ట సవరణ చేస్తామన్న ప్రకటనైనా

**కొద్ది మంది మోతుబరులతో మాట్లాడి ఒక నిర్ణయం తీసేసుకుని 'సమ్మతి అవార్డు' ఇదేనని ప్రకటించి, దానిని కాదనే వాళ్ళు కోర్టుకు పోవచ్చునని సూక్తులు వల్లించడం 'సమ్మతి' అన్న భావననే వెక్కిరించడం అవుతుంది.**



సత్యవేడు – వరదయ్య పాలెం ఎస్ఇజడ్‌కోసం భూములు సేకరిస్తున్న గ్రామాల వివరాలు

| | గ్రామం పేరు | సేకరిస్తున్న రైతు వారీ భూమి | సేకరిస్తున్న ప్రభుత్వ భూమి (డి-ఫారం పట్టా భూమిని కలుపుకొని) |
|---|---|---|---|
| | | ఎకరాలలో | |
| **సత్యవేడు మండలం** | | | |
| 1. | పెద్ద ఈటిపాకం | 663 | 191.00 |
| 2. | రాళ్ళకుప్పం | 270 | 63.55 |
| 3. | మల్లావారిపాలెం | 1077.97 | 138.20 |
| 4. | ఇరుగుళం | 1044.14 | 228.36 |
| 5. | గొల్లావారిపాలెం | 146.68 | 41.51 |
| 6. | చెంగబాకం | 89.43 | 28.14 |
| 7. | అప్పాయపాలెం | 71.96 | 23.40 |
| 8. | ఆరూరు | 783.33 | – |
| 9. | కొల్లాడం | 525.23 | 90.25 |
| 10. | చెరివి | 1008.29 | 504.00 |
| 11. | మాదన్నపాలెం | 33.97 | – |
| | **మొత్తం** | **5714.00** | **1308.41** |
| **వరదయ్యపాలెం మండలం** | | | |
| 1. | చెదుల్లపాకం | 1071.90 | 1488.26 |
| 2. | తొడూరు | 367.37 | 164.70 |
| 3. | చిలమత్తూరు | 1024.56 | 137.15 |
| 4, | మోకూరుపల్లి | 424.72 | 2.35 |
| 5. | సిద్దమ్మ అగ్రహారం | 106.36 | 0.14 |
| | **మొత్తం** | **2994.91** | **1792.60** |

మన్మోహన్‌సింగ్ ప్రభుత్వం చేస్తుందా? ఎస్ఇజడ్‌లలో కంపెనీలు పెట్టే వాళ్ళకు ఒక దాని తరువాత ఒకటి రాయితీలు ఇవ్వడమే ప్రభుత్వ విధానంగా ఉంది తప్ప వాళ్ళ మీద ఏ ఆంక్షా పెట్టే ఉద్దేశం ప్రభుత్వానికి లేదు. పెట్టుబడుల కోసం అంతా దేబిరిస్తున్నారు. అటువంటప్పుడు చేయబోని సాహసాన్ని హామీగా చూపించడం ఎందుకు? ఒకవేళ ఏ చట్టమూ చేయకుండా కేవలం పెద్ద మనుషుల ఒప్పందంగా ఆ కంపెనీల యాజమాన్యాలను ఒప్పించినా 'అర్హతను బట్టి' అన్న షరతు ఉద్యోగాల హామీకి తప్పకుండా ఉంటుంది. ఆ కంపెనీలు ఎగుమతులు చేయాలి కాబట్టి, వాటి సాంకేతిక ప్రక్రియలు అత్యాధునికంగా ఉండే అవకాశమే ఎక్కువ కాబట్టి, ఆ 'అర్హత' సత్యవేడు లాంటి చోట్ల చాలా తక్కువ మందికే ఉండబోతుంది. విశాఖపట్నం స్టీల్ ప్లాంటు, రామగుండం

థర్మల్ ప్లాంటుల నిర్వాసితులకు 'అర్హతను' బట్టి కుటుంబానికొక ఉద్యోగం ఇస్తామన్న హామీ లోగడ కూడా ఇచ్చారు. దాని గతేమైందో, రెండు మూడు దశాబ్దాలుగా ఎంతమంది నిర్వాసితులు హైకోర్టులో కేసు మీద కేసువేసి ఉద్యోగం కోసం అడుక్కుంటున్నారో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటిస్తుందా?

ప్రభుత్వం ప్రజలను ఒప్పించడానికి ఇంకొక అబద్ధం కూడా చెప్తున్నది. ప్రత్యేక ఆర్థిక మండలి కోసం అప్పగించబోయే భూమిలో 'బంజరు' అన్నది చాలా ఉంది. అందులో పేదలకు డి-ఫారం పట్టాలు (అసైన్‌మెంట్) ఇచ్చిన భూమీ ఉంది, ఎవరికీ చట్టపరంగా ఏ హక్కులూ కల్పించని భూమీ ఉంది. కాని ఏది ఎంత అని ప్రభుత్వం ప్రకటించడం లేదు. బహుశా, డి-ఫారం భూములకు నష్టపరిహారం ఇచ్చే ఉద్దేశం లేదు కాబట్టి వాటి గురించి వేరుగా లెక్కలు ప్రకటించనక్కర లేదని ప్రభుత్వం అభిప్రాయం కావచ్చు.

అయితే హామీలు మాత్రం భిన్నంగా ఉన్నాయి. రైతులకు ఎంత నష్టపరిహారం ఇస్తే డి-ఫారం పట్టాదారులకూ అంత ఇవ్వడం జరుగుతుందని అధికారులు ప్రకటిస్తున్నారు. డి-ఫారం భూములున్న వాళ్ళు నమ్ముతున్నారు కూడా. వాళ్ళకు తెలియనిదేమిటంటే ఒకప్పుడు డి-ఫారం పట్టా భూములను ప్రాజెక్టుల కోసం స్వాధీనం చేసుకున్నప్పుడు ఏ నష్టపరిహారం ఇచ్చేవారు కారు. ఎందుకంటే ఆ పట్టాలోని షరతులలోనే 'ఏదైనా ప్రజావసరం కోసం దీనిని ఏ నష్టపరిహారం ఇవ్వకుండా స్వాధీనం చేసుకోవచ్చు' అని ఉంటుంది. అయితే ఇది అన్యాయమని అందరూ ఆందోళన చేయగా చేయగా రాష్ట్ర ప్రభుత్వం జి.ఓ నెం. 1307 జారీ చేసింది. దాని ప్రకారం డి-ఫారం పట్టాదారుకు కూడా భూసేకరణ సందర్భంలో ప్రాథమిక విలువను ప్రభుత్వం నష్టపరిహారంగా ఇస్తుంది. దానిపైన కోర్టుకు పోయే అవకాశం మాత్రం వారికి ఉండదు. ఈ జి.ఓ విచిత్రమైన వ్యాఖ్యాలకు దారితీసింది. చివరికి, ఎల్ఎఓ, చేవెళ్ళ వర్సెస్ మేకల పాండు అనే కేసులో ఏడుగురు జడ్జీల హైకోర్టు బెంచి డి-ఫారం పట్టాదారుకు కూడా స్వంత భూమి గల వాళ్ళకు ఇచ్చిన మోతాదులోనే నష్టపరిహారం ఇవ్వాలని తీర్పు ఇచ్చింది. 2004లో వెలువడిన ఈ తీర్పును రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాలు చేసింది. ఆ సవాలు పెండింగ్‌లో ఉన్న కారణంగా రాష్ట్రంలో ఎక్కడా దానిని అమలుచేయడం లేదు. ఎస్ఇజడ్‌ల దగ్గర మాత్రం ఈ వాస్తవాలన్నీ దాచిపెట్టి సమాన నష్టపరిహారం ఇస్తానని హామీ ఇస్తున్నది.

భూమి మీద యాజమాన్య హక్కులే లేకుండా ప్రత్యక్షంగానో, పరోక్షంగానో భూమి మీద ఆధారపడి వివిధ రూపాలలో జీవనం పొందుతున్న వర్గాల గురించి, భూసేకరణలో వారి ప్రస్తావన ఎక్కడా కనిపించకపోవడాన్ని గురించి, మొదట్లో చెప్పాము. రైతుల పొలాలలో పనిచేసే వ్యవసాయ కూలీలు, వివిధ సేవలందించి బతికే చాకలి, మంగలి, కమ్మరి, కుమ్మరి తదితర కులాలు బంజరు భూములలోనూ, పచ్చిక బయళ్ళలోనూ పశువులు మేపుకుని బతికే యాదవులు తదితర పశువుల కాపర్లు, తాటి లేక ఈత చెట్ల నుంచి కల్లు తీసి బతికే గీత కార్మికులు, నీటి వనరులలో చేపలు పట్టుకొని బతికే

**హైకోర్టు బెంచి డి-ఫారం పట్టాదారుకు కూడా స్వంత భూమి గల వాళ్ళకు ఇచ్చిన మోతాదులోనే నష్టపరిహారం ఇవ్వాలని తీర్పు ఇచ్చింది. 2004లో వెలువడిన ఈ తీర్పును రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాలు చేసింది. ఆ సవాలు పెండింగ్‌లో ఉన్న కారణంగా రాష్ట్రంలో ఎక్కడా దానిని అమలుచేయడం లేదు.**



## రెండు సార్లు నిర్వాసితులు

ఒకసారి బలవంతంగా నిర్వాసితులను చేసిన వారిని వారి జీవిత కాలంలో రెండవ సారి చేయకూడదన్న నియమం ఐక్యరాజ్య సమితి రూపొందించిన విస్థాపన★ నియమాలలో ఒకటి. అటువంటి అంతర్జాతీయ నియమాలలో దేనినీ గౌరవించిన చరిత్ర మన పాలకులకు లేనప్పుడు దీనిని గౌరవించలేదని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు.

వరదయ్యపాలెం మండలంలోని శ్రీహరికోట కాలనీ, తొండూరు సొసైటీ గ్రామాల ప్రజలు 1972లో తమ స్వస్థలమైన నెల్లూరు జిల్లా తీర గ్రామాల నుంచి ఇక్కడికి వచ్చారు. శ్రీహరికోట రాకెట్ కేంద్రం వారిని నిర్వాసితులను చేసింది. శ్రీహరికోట కాలనీలో 114 కుటుంబాలు, తొండూరు సొసైటీలో 160 కుటుంబాలు ఉన్నాయి. దాదాపు సగం మంది దళితులు. గత విస్థాపన అనుభవం నుంచి వీరికి ప్రభుత్వ హామీల విషయంలో విపరీతమైన అనుమానం ఉంది, ఆగ్రహం ఉంది.

ఒక్కొక్క కుటుంబానికీ 5 ఎకరాల సాగుభూమి ఇస్తామని చెప్పి తీసుకొచ్చారు. ఇచ్చింది రెండున్నర ఎకరాలు. అది కూడా విడివిడిగా ఇవ్వలేదు. హరిజన్ డెవలప్‌మెంట్ సొసైటీ పేరిట ఉమ్మడిగా ఇచ్చారు. హైకోర్టులో కేసువేసి విడివిడి పట్టాలు పొందవలసి వచ్చింది. పోనీ అదైనా సాగుభూమి ఇచ్చారా అంటే లేదు. పాముపుట్టలు నిండిన బంజరు భూమి ఇచ్చారు. దేశ సాంకేతిక ప్రగతికి చిహ్నమైన శ్రీహరికోట ఈ విధంగా నెలకొనింది. నిర్వాసితులే శ్రమ చేసి, ఖర్చు పెట్టుకొని ఆ భూమిని సాగులోకి తెచ్చి బతుకుతున్నారు. ప్రభుత్వం తవ్విచ్చిన బావులు ఎండిపోగా స్వంతగా బావులు తవ్వుకున్నారు. ఆ తరువాత బోర్లు వేసుకున్నారు. ఇళ్ళు ప్రభుత్వం కట్టివ్వక పోతే తామే కట్టుకున్నారు. శ్రీహరికోట రాకెట్ కేంద్రంలోనే ఇంటికొక ఉద్యోగం ఇస్తామన్నారు. అందరికీ కలిపి కూడా ఒక్క ఉద్యోగమూ ఇవ్వలేదు. ఈ రెండు ఊర్ల వాళ్ళే ఎస్ఇజడ్ గురించి ఎక్కువ కోపంగా ఉన్నారు. ప్రభుత్వ హామీల స్వభావం వాళ్ళకర్థమయింది కదా మరి!

★ బలవంతంగా తొలగించబడిన ప్రజలను నిర్వాసితులు అంటున్నాం గానీ బలవంతపు తొలగింపు ప్రక్రియకు తెలుగులో ఒక మాట ఏదీ లేదు. హిందీ, బెంగాలీ, ఒరియా భాషలలో విస్థాపన్ అంటున్నారు. స్థాపనకు అభావం విస్థాపన. కాబట్టి డిస్‌ప్లేస్‌మెంట్ అన్న ఇంగ్లీష్ పదానికి అనువాదంగా విస్థాపన అన్న మాట వాడుతున్నాం.

మత్స్యకారులు– వీరు భూసేకరణ ప్రక్రియలో అదృశ్య మానవులు. 2005లో మొట్టమొదటి సారిగా వీరిని ఎంత పాక్షికంగానైనా చిత్రంలోకి తీసుకొచ్చే జి.ఓ నెం. 68ని రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసింది. జారీ అయితే చేసింది గానీ దాని అమలుకు తీసుకుంటున్న చర్యలు శూన్యం. అయితే ఈ సంగతి చిత్తూరు కథలో కంటే మత్స్యకారులు, కల్లుగీత కార్మికులు, యాదవులు గణనీయంగా ఉన్న తూర్పు గోదావరి, విశాఖపట్నం జిల్లాలలో చూడడం ఉచితంగా ఉంటుంది.

తూర్పు గోదావరి ప్రత్యేక ఆర్థిక మండలి గురించి మొదట చూద్దాం. కాకినాడ దగ్గర సహజవాయు నిక్షేపాలు బాగా ఉన్నాయి కాబట్టి ఒఎన్‌జిసి వారికి శుద్ధి కర్మాగారం (రిఫైనరీ) నెలకొల్పడానికి భూమి కావాలంటూ ప్రభుత్వం చర్చ మొదలుపెట్టింది. ఒక్క ఒఎన్‌జిసికే కాక

ఇతర ప్రైవేటు రంగ పెట్రోలియం కంపెనీలకు కూడా రిఫైనరీలు నెలకొల్పడానికి భూమి కావాలి కాబట్టి ఇక్కడ ప్రత్యేక ఆర్థిక మండలి నెలకొల్పబోతామన్నారు. మొత్తం 10 వేల ఎకరాల ఎస్ఇజడ్ నెలకొల్పుతాం అన్నారు. తొలుత కాకినాడ రూరల్, సామర్లకోట, పిఠాపురం, యు.కొత్తపల్లి మండలాలలో నెలకొల్పుతామన్నారు. ఆ భూమిలో వరి పండించే నేలలున్నాయని రైతులూ, సంవత్సరంలో సగం రోజులు పైగా పని దొరుకుతుందని వ్యవసాయ కూలీ సంఘాలూ గొడవ చేశారు. వాళ్ళ ఆందోళన కన్నా, అది రియల్ ఎస్టేట్ కళ్ళకు బంగారు భూమి కావడం వల్ల బిల్డర్లు ఒత్తిడి పెట్టారనీ ఆ కారణంగా ప్రభుత్వం తన ప్రణాళిక మార్చుకుందని ప్రజలంటారు. ఏమైతేనేం, ప్రత్యేక ఆర్థిక మండలి యు.కొత్తపల్లి, తొండంగి మండలాలలోని తీరప్రాంత గ్రామాలకు మారింది. చెప్పాల్సిన మరొక విషయం ఏమిటంటే ఒఎన్‌జిసి ఈ దశలోనే తనకు కాకినాడ దగ్గర రిఫైనరీ నెలకొల్పే ఉద్దేశం లేదని ప్రకటించింది. అయినప్పటికీ ఎస్ఇజడ్ ప్రయత్నం సాగుతూనే ఉంది.

తొలి ప్రతిపాదనలో సారవంతమైన భూములు ఉన్నాయి కాబట్టి దాని స్థానంలో తీర ప్రాంతంలోని చవిటి నేలలను ఎంపిక చేశామని ప్రభుత్వం వివరణ ఇచ్చుకున్నప్పటికీ, ఇప్పుడు సేకరణ కోసం ప్రతిపాదించినవి కూడా సారహీనమైన నేలలు కావు. వందల ఎకరాల జీడి మామిడి, సరుగుడు, కొబ్బరి, సపోటా, మామిడి తోటలున్న భూమి. సరుగుడు నారు ఇక్కడి నుండే రాష్ట్ర మంతటికీ ఎగుమతి అవుతుంది. అర ఎకరంలో నారుపోస్తే 2 లక్షల రూపాయల ఆదాయం వస్తుంది. సరుగుడు తోట నాలుగేళ్ళు పెంచి కలప అమ్మితే ఎకరానికి లక్షా యాభై వేల రూపాయల ఆదాయం వస్తుంది.

మారిన ప్రతిపాదనలలో మొదట యు.కొత్తపల్లి మండలంలోని మూలపేట, పొన్నాడ, రమణక్కపేట, శ్రీరాంపురం పంచాయతీలలోని భూములను సేకరణ కోసం ప్రతిపాదించారు. అయితే అవి 6000 ఎకరాలు మించడం లేదని ఇంకొంచెం పైకి వెళ్ళి తొండంగి మండలంలో మరొక 4000 ఎకరాలకు కూడా ప్రతిపాదన పెట్టారు. ఇవి సముద్రతీరం నుంచి కొద్దిగా లోపలికి, తీరానికి సమాంతరంగా ఉన్న భూములు. వీటికీ సముద్ర తీరానికీ మధ్య అనేక మత్స్యకారుల గ్రామాలున్నాయి. వారు సముద్రంలోనే కాక, ఇప్పుడు సేకరిస్తున్న భూములలోని ఉప్పుటేర్లలో కూడా చేపల వేట చేస్తారు. ఈ ఉప్పుటేర్లన్నీ ప్రత్యేక ఆర్థిక మండలి నుంచి వెలువడే కాలుష్యానికి బలికావడం ఖాయం. ఆ కాలుష్యం సముద్రంలోకి ప్రవహించి సముద్రాన్నీ కలుషితం చేయడం ఖాయం. ఇది ఊహించి చెబుతున్నది కాదు. విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ వల్ల దగ్గర్లో ఉన్న సముద్రం కలుషితమై చేపలవేట బాగా దెబ్బతిన్న సంగతి అక్కడి మత్స్యకారులను అడిగితే చెప్తారు. కాబట్టి యు.కొత్తపల్లి, తొండంగి మండలాల మత్స్యకారుల జీవనం బాగా దెబ్బతింటుంది.

**తొండంగి మండలంలో సేకరించదలచిన మరో 4000 ఎకరాల భూమికీ సముద్ర తీరానికీ మధ్య అనేక మత్స్యకారుల గ్రామాలున్నాయి. వారు సముద్రంలోనే కాక, ఇప్పుడు సేకరిస్తున్న భూములలోని ఉప్పుటేర్లలో కూడా చేపల వేట చేస్తారు. ఈ ఉప్పుటేర్లన్నీ ప్రత్యేక ఆర్థిక మండలి నుంచి వెలువడే కాలుష్యానికి బలికావడం ఖాయం. ఆ కాలుష్యం సముద్రంలోకి ప్రవహించి సముద్రాన్నీ కలుషితం చేయడం ఖాయం.**

6000 చిల్లర ఎకరాల భూసేకరణకోసం నోటీసులు పొందిన యు.కొత్తపల్లి మండల వ్యవసాయదారులు చట్టాన్ని ఎరిగిన వాళ్ళను సంప్రదించి వివరంగా అభ్యంతరాలు తెలుపగా, వాటికి భూసేకరణ అధికారి ఇచ్చిన



జవాబులు చూస్తే ప్రభుత్వం దబాయింపును ఒక భూసేకరణ సాధనంగా ఎంతగా వాడుకుంటున్నదో అర్థం అవుతుంది. నిర్దిష్టమైన ప్రతి ప్రశ్నకూ, ప్రతి అభ్యంతరానికీ 'తగు జాగ్రత్తలు తీసుకుంటాం'. 'చట్టంలో ఎట్లా ఉంటే అట్లా చేస్తాం' అనే పడికట్టు సమాధానాలు ఇవ్వడం, కలెక్టర్ గారు వాటిని స్వీకరించి భూసేకరణ విచారణ (సెక్షన్ 5-ఎ విచారణ) ముగిసినట్టు ప్రకటించడం, జరిగిపోయింది.

**నిర్దిష్టమైన ప్రతి ప్రశ్నకూ, ప్రతి అభ్యంతరానికీ 'తగు జాగ్రత్తలు తీసుకుంటాం'. 'చట్టంలో ఎట్లా ఉంటే అట్లా చేస్తాం' అనే పడికట్టు సమాధానాలు ఇవ్వడం, కలెక్టర్ గారు రైతులిచ్చిన అభ్యంతరాల్ని స్వీకరించి భూసేకరణ విచారణ (సెక్షన్ 5-ఎ విచారణ) ముగిసినట్టు ప్రకటించడం, జరిగిపోయింది.**

ఒక అభ్యంతరాన్ని, దానికిచ్చిన జవాబునూ చూద్దాం.

## అభ్యంతరం

భూసేకరణ కోసం ఎంపిక చేయబడ్డ భూములు బంగాళాఖాతాన్ని ఆనుకొని ఉన్నాయి. ఉప్పాడ నుంచి అద్దరిపేట దాకా తీరం 50 కిలోమీటర్ల పొడవు ఉంది. కాలక్రమంలో ఈ తీరం వెంబడి ఉప్పాడ, అమీనాబాద్, రామన్నపాలెం, మూలపేట, కొనపాపపేట, చోడిపల్లిపేట, హుకుంపేట, పెరుమాళ్ళపురం, దానవాయిపేట, ముసలయ్యపేట, ఎల్లయ్యపేట, వేమవరం, అద్దరిపేట అనే గ్రామాలు ఏర్పడ్డాయి. ఇవి శతాబ్దాలుగా ఉన్న గ్రామాలు. సముద్రంలో బతుకు తెరువు కోసం చేపల వేట చేసే మత్స్యకారులు సముద్ర తీరంలో ఆవాసాలు నెలకొల్పిన క్రమంలో ఈ గ్రామాలు ఏర్పడ్డాయి. సముద్ర తీరాన్ని మత్స్యకారులు తమ పడవలు పెట్టుకోవడానికీ, వలలు ఆరేసుకోవడానికీ, చేపలను బాగుచేసుకోవడానికీ ఒక స్థలంగా వినియోగించుకుంటారు. వారి సంప్రదాయక జీవనం సజావుగా సాగాలంటే సముద్రతీరం మీద వారికి హక్కు అవసరం. ఈ మత్స్యకారులు సముద్రం మీదనేకాక సముద్రం నుంచి లోనికి వచ్చే ఉప్పుటేర్ల మీద కూడా ఆధారపడతారు. అవి సముద్రంలో పోటు వచ్చినప్పుడు మత్స్యకారుల గ్రామాలు మునగకుండా కాపాడతాయి. అంతేకాక వాటిలోనూ వారు చేపలు పట్టుకుంటారు. ఇప్పుడు ప్రత్యేక ఆర్థిక మండలిని ఏర్పాటు చేయడం వారి జీవనాన్ని దెబ్బతీస్తుంది. సముద్రతీరం నుంచి 2 కిలోమీటర్ల లోపల ఏ పరిశ్రమ నెలకొల్పినా పెద్ద సంఖ్యలో ఉన్న మత్స్యకారుల జీవనం తీవ్రంగా దెబ్బ తింటుంది.

## జవాబు

ఈ అభ్యంతరానికి భూసేకరణ అధికారి (కాకినాడ ఆర్‌డివో) ఇచ్చిన, జిల్లా కలెక్టర్ (విచారణాధికారి) ఆమోదించిన **జవాబిది.**

మీరు పేర్కొన్న గ్రామాలలోని మత్స్యకారుల జీవనం దెబ్బతింటుందన్న ఆందోళన నిరాధారమైనది. వాళ్ళ వృత్తి వాళ్ళు కొనసాగించవచ్చు. ఈ విషయాలను ప్రభుత్వ మత్స్యశాఖ పరిశీలిస్తుంది. ఈ ఆందోళన అవాస్తవమైనది. కేవలం భూసేకరణ వల్ల ఏదో నష్టం ఉన్నట్టు చూపించడం కోసం కల్పించింది. ప్రాజెక్టు వల్ల మత్స్యకారుల జీవనం ఏ విధంగానూ దెబ్బతినదు. భూసేకరణ

నోటిఫికేషన్ జారీచేసే ముందు అన్నీ లెక్కలోకి తీసుకున్నాం. వాళ్ళ సంఘాలు ఇచ్చిన ఏ అర్జీ పెండింగ్‌లో లేదు. వాళ్ళు ఏ అధికార్లనైతే కలిశారో ఆ అధికార్లు అన్నిటికీ జవాబు చెప్పేశారు.

ఈ మహాభాగ్యానికి అభ్యంతరాలు అడగడం ఎందుకో, జవాబు చెప్పడం ఎందుకో!

మత్స్యకారుల లాగా యాజమాన్య హక్కు లేకుండా ప్రకృతి మీద ఆధారపడి బతికే వారు కల్లుగీత కార్మికులు. భూసేకరణ జరుగుతున్న రావివారిపోడు, రమణక్కపేట, ముమ్మిడివారిపోడు, కర్రివారిపాలెం, శ్రీరాంపురం, మూలపేట, దమ్మువారిపాలెంలలో దాదాపు 1000 దాకా గీత కార్మిక కుటుంబాలున్నాయి. కులవృత్తిగా కల్లుగీసే శెట్టి బలిజలే కాక కొన్ని ఊళ్ళలో దళితులు కూడా ఆ వృత్తి నేర్చుకుని చేస్తున్నారు. వీరి జీవనాధారం యావత్తు పోతుంది. యాదవులు ఈ రెండు మండలాలలోనూ పెద్ద సంఖ్యలో ఉన్నారు. రైతుల అనుమతితో వారి తోటలలో వీరు పశువులు మేపుకుంటారు. యు.కొత్తపల్లి, తొండంగి మండలాలలో 15 వేల కుటుంబాలు ఉన్నాయని అంటారు. రైతుల భూములు పోతే వీరి జీవనం కూడా తీవ్రంగా దెబ్బతింటుంది.

మత్స్యకారులు, కల్లుగీత కార్మికులు, యాదవులు, వ్యవసాయ కూలీలు – వీరందరికీ సామాన్యంగా ఉండే లక్షణం ఏమిటంటే ప్రభుత్వం సేకరించే భూమి మీద వీరికి యాజమాన్య హక్కు లేకున్నా, ఆ భూసేకరణ వీరి జీవనాన్ని గణనీయంగా దెబ్బతీస్తుంది. ఒకప్పుడు అటువంటి ప్రజలకు ఏ రకమైన నష్టపరిహారం లభించేదికాదు. కానీ ఆందోళన చేయగా చేయగా వారికి కూడా నగదు రూపంలో కొంత నష్టపరిహారం లభించే అవకాశం ఇప్పుడు వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం 2005లో జి.ఓ నెం. 68 అనే తాఖీదు జారీ చేసింది. దాని ప్రకారం ప్రాజెక్టు నిర్వాసితులనే కాక ప్రాజెక్టు బాధితులను కూడా గుర్తించాలి. వారి జీవన స్థితిగతుల గురించి సామాజిక ఆర్థిక సర్వే జరపాలి. ప్రత్యేకించి, సగటున వారు ఎంత దైనందిన ఆదాయం పొందుతున్నారో అంచనా వేయాలి. ఆ ప్రాతిపదికన వారికి నష్టపరిహారం ఇవ్వాలి. కానీ రాష్ట్రంలో ఎక్కడా జీవో 68 అమ లుకు కావలసిన ప్రాథమిక సర్వే కూడా జరపడం లేదు. అది జరపకుండా ప్రాజెక్టు కట్టేస్తే, రేపు ప్రాజెక్టు బాధితులు మా సంగతి ఏమిటని అడిగే స్థితిలో కూడా ఉండకపోవచ్చు. తాము బాధితుల మని రుజువు చేసుకోవడానికి వారి వద్ద ఏం ఆధారాలుంటాయి? భూసేకరణ జరగక ముందే వారికి సంబంధించిన సామాజిక ఆర్థిక సర్వే జరిపినట్టయితే గ్రామం ఇంకా ఉంటుంది, గ్రామస్తు లుంటారు, నిజమో అబద్ధమో చెప్తారు. అంతా అయిపోయిన తరువాత ఏం ఆధారం మిగులుతుంది?

**మత్స్యకారులు, కల్లుగీత కార్మికులు, యాదవులు, వ్యవసాయ కూలీలు – వీరందరికీ సామాన్యంగా ఉండే లక్షణం ఏమిటంటే ప్రభుత్వం సేకరించే భూమి మీద వీరికి యాజమాన్య హక్కు లేకున్నా, ఆ భూసేకరణ వీరి జీవనాన్ని గణనీయంగా దెబ్బతీస్తుంది.**

కాకినాడ ఎస్ఇజడ్ గురించి ఇంకొక రెండు విషయాలు చెప్పాలి. అది 'పోర్టు ఆధారిత ప్రత్యేక ఆర్థిక మండలి. అంటే ఆ ఎస్ఇజడ్ నుంచి జరిగే ఎగుమతులకు కాకినాడ పోర్టు కీలకం. కానీ కాకినాడ పోర్టు చాలా చిన్నది. అందువల్ల దానిని పెద్దది చేసే కార్యక్రమం కూడా ఎస్ఇజడ్ స్థాపనతో పాటు చేపట్టారు. కాకినాడ సీపోర్ట్ లిమిటెడ్ ఆధ్వర్యంలోని పోర్టులో ప్రస్తుతం కేవలం 4 బెర్త్‌లు ఉన్నాయి. వాటిని 25కు పెంచే కాకినాడ డీప్‌వాటర్ పోర్ట్ ప్రాజెక్టును అమలు చేస్తున్నారు.



## గంగవరం మత్స్యకారులు

జిఓ 68 అమలుకోసం కొట్లాడి, చోడిపల్లి రాజు అనే మత్స్యకారుడిని పోలీసు తూటాలకు బలి ఇచ్చి, దాన్ని కొంతమేరకైనా అమలు చేయించుకున్న ఒకే ఒక బాధితులు గంగవరం మత్స్యకారులు. విశాఖపట్నం సమీపంలోని పెదగంట్యాడ మండలంలో గంగవరం పోర్టు అనే ప్రైవేటు పోర్టు కడుతున్నారు. దానిని దిబ్బపాలెం అనే తీర గ్రామం వద్ద కడుతున్నారు కాబట్టి ఆ ఒక్క ఊరి భూములు మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం గంగవరం పోర్టుకోసం సేకరించింది. అయితే దిబ్బపాలెం తీరాన్ని ఆసరా చేసుకొని చేపల వేటకు పోయే మత్స్యకారులు ఒక్క దిబ్బపాలెం వాళ్ళే కాదు. గంగవరం, జాలరిపల్లిపాలెం, పెదపల్లిపాలెం, చినపల్లిపాలెం గ్రామాల జాలర్లు కూడా దిబ్బపాలెం తీరం నుంచి చేపల వేట చేసేవారు. అయితే గంగవరం పోర్టుకు వాళ్ళ ఊర్లున్న భూములు అక్కర లేదు కాబట్టి వాళ్ళు నిర్వాసితులు కారు. అంటే ప్రాజెక్టు వాళ్ళను అక్కడ నుంచి పొమ్మనదు.

కానీ దిబ్బపాలెం తీరాన్ని తమకు లేకుండా చేస్తే వాళ్ళు వెళ్ళిపోక తప్పదు. జి.ఓ 68 పరిభాషలో వాళ్ళు ప్రాజెక్టు బాధితులు. ఆ జిఓలోని సహాయ పునరావాస ప్రణాళికను వారికి అందించవలసి ఉంది. అయితే ప్రభుత్వం ఎప్పటిలాగే 'దిబ్బపాలెం గ్రామాన్ని తొలగిస్తున్నాము కాబట్టి వారు మాత్రమే మా దృష్టిలో నిర్వాసితులు. ఏమిచ్చినా వారికే ఇస్తాం. మిమ్మల్ని ఎక్కడికీ పొమ్మనలేదు కాబట్టి మీరు మీ ఊర్లలోనే హాయిగా అక్కడే బతకొచ్చు' అంది. అయితే మిగిలిన నాలుగు ఊర్ల మత్స్యకారులు ఆందోళనకు దిగి హైకోర్టులో కేసు వేయగా అధికారులే వెనక్కి తగ్గి వారికి కూడా పునరావాస పథకాన్ని ఒక మేరకు వర్తింపచేశారు. అప్పికొండ అనే ప్రత్యామ్నాయ స్థలంలో చేపల వేట చేసుకోవడానికి జెట్టీ కట్టిస్తామనీ, గంగవరం నుంచి అక్కడి దాకా రోడ్డు వేస్తామనీ, పడవలను అప్పికొండకు తరలించడానికయ్యే ఖర్చు ఇస్తామనీ ఒప్పుకున్నారు. అప్పికొండ అనేది చేపల వేటకు అంత అనుకూలమైన చోటు కాదనీ, గంగవరంలో ఉంటూ ప్రభుత్వ ఉద్యోగిలాగా బస్సెక్కి అప్పికొండకు పోయి చేపలు పట్టుకొని రావడం కష్టమనీ, మత్స్యకారులందరినీ బాధితులుగా గుర్తించకుండా మత్స్యశాఖ గుర్తింపు కార్డులిచ్చిన వారిని మాత్రమే గుర్తించడం అన్యాయమనీ, కట్టిస్తామన్న జెట్టీ కట్టే దాఖలాలు లేవనీ గంగవరం జాలర్లు అసంతృప్తిగా ఉన్నప్పటికీ పునరావాస హక్కుకు గుర్తింపు సాధించిన ఘనత వారికే దక్కింది.

దీనివల్ల ఈ తీరం వెంబడి చేపల వేట చేసుకొని బతుకుతున్న మత్స్యకారుల జీవనం దెబ్బతింటుంది. 500 ఇళ్ళున్న హార్బర్‌పేట అనే మత్స్యకారుల గ్రామం తొలగిపోనుంది. అయితే వీరికి సముద్రం మీద పట్టా లేకపోవడమే కాక, ఇళ్ళ స్థలాలకూ పట్టాలు లేని కారణంగా భూసేకరణ చట్టానికి ఈ ప్రజలు లేనట్టే. వాళ్ళకు కనీసం నోటీసు ఇవ్వకుండా అదనపు బెర్త్‌లు ఒక దాని తరువాత ఒకటి కట్టుకుంటూ పోతున్నారు. హార్బర్‌పేట వాసులేకాక ఇతర మత్స్యకారులు కూడా – మొత్తం దాదాపు 30 వేల మంది – ఈ తీరం వెంబడి చేపలు పట్టుకొని బతుకుతున్నారు. వారు ఊర్లు ఖాళీ చేయనక్కర లేదు గానీ చేపల వేట ఇక అక్కడ సాగదు.

ఈ కుటుంబాలలో మగవాళ్ళు పడవలలో సముద్రం మీదికి పోయి చేపలు, పీతలు తెస్తారు. ఒడ్డు మీదనే వాటిని వేలం వేస్తారు. అదే గ్రామానికి చెందిన స్త్రీలు పాడుకొని కొనుక్కొని పోయి కాకినాడ మార్కెట్‌లో అమ్ముకొని వస్తారు. వేట బాగా జరిగిన రోజున భార్యా, భర్త కలిసి 200 రూపాయల పైనే సంపాదించగలరు. పెద్దగా చదువులు లేవు కాబట్టి ఉద్యోగాలు చేస్తున్న వారు లేరు. రేపు డీప్ వాటర్ పోర్ట్ ప్రాజెక్టు అమలైతే ఈ 30 వేల జనాభా దిక్కులేని వారవుతారు. జిఓ 68 ప్రకారం తమకు నష్టపరిహారం ఇవ్వాలన్న ఆందోళన ఇప్పుడిప్పుడే మొదలుపెట్టారు. రాష్ట్ర ప్రభుత్వం గానీ, జిల్లా యంత్రాంగం గానీ స్పందించడం లేదు. సకాలంలో సామాజిక ఆర్థిక సర్వే జరిపించుకోలేకపోతే 'మీరక్కడ చేపలు పట్టుకొని బతికారన్న రుజువేమిటి?' అన్న ప్రశ్న వాళ్ళను వెక్కిరించగలదు.

నెల్లూరు జిల్లా కృష్ణపట్నం పోర్టు నిర్మాణంలో కూడా మత్స్యకారులు ఇదే రకమైన సమస్య ఎదుర్కొంటున్నారు. అక్కడ రాష్ట్రంలో ఎక్కడా లేనంత భారీ విద్యుదుత్పత్తి కేంద్రం వెలుస్తున్నది. ఒకటి 4000 మెగావాట్లు, ఇంకొకటి 1600 మెగావాట్లు ఉత్పత్తి చేసే రెండు ప్లాంట్లు రానున్నాయి. రెండూ థర్మల్ ప్లాంట్లే కాబట్టి బూడిద దండిగా వస్తుంది. ఇదంతా సముద్రంలోకి పోతుందనడంలో అనుమానం లేదు. అది ఆ తీర ప్రాంతంలో చేపల వేటను బాగా దెబ్బతీస్తుంది.

దీనికి అనుబంధంగా కృష్ణపట్నం రేవును కూడా పెద్దది చేస్తున్నారు. ఇప్పటిదాకా అక్కడ 'బెర్త్'లులేవు. ఓడలు దూరాన ఆగి పడవల ద్వారా సరుకులు దించి పోతున్నాయి. ఇప్పుడు మూడు బెర్త్‌లు నిర్మిస్తున్నారు. రేవు రాక ముందు అక్కడ జెట్టిపాలెం అనే మత్స్యకారుల గ్రామం ఉండేది. వారిని అక్కడి నుంచి తొలగించి, తీరం నుంచి లోపలికి పంపించారు. స్థానిక ఎంఎల్ఏ వారికి చేసిందేమీ లేకున్నా వారు వేసుకున్న గుడిసెలకు ఎ.పి.రెడ్డినగర్ అని పేరు పెట్టుకున్నారు. ఇప్పుడు 3 బెర్త్‌లు వచ్చి కృష్ణపట్నం రేవు పెద్దదైతే దానికి రైల్వే లైను, గోడౌన్ అనుబంధంగా వస్తాయి కాబట్టి మత్స్యకారులు ఎ.పి.రెడ్డి నగర్‌నూ కృష్ణపట్నం తీరాన్ని కూడా వదిలిపెట్టి పోవాలి.

కాకినాడ ఎస్ఇజడ్‌కు తిరిగి వద్దాం. యాజమాన్య హక్కు గల రైతులకు సైతం తక్కువ నష్ట పరిహారం ఇచ్చి తప్పించుకోవడానికి ప్రభుత్వం పెద్ద నాటకమే ఆడుతున్నది. ఈ ఎస్ఇజడ్ డెవలపర్ కాకినాడ స్పెషల్ ఎకనమిక్ జోన్ లిమిటెడ్ అనే కంపెనీ. దాని తరఫున హైదరాబాద్‌లో కర్నాటి వెంకటేశ్వరరావు అనే డైరెక్టర్ ఉన్నాడు. అతను ప్రభుత్వం ప్రమేయం లేకుండా, ప్రతిపాదిత ఎస్ఇజడ్ భూభాగంలోని భూములు అమ్ముకోవడానికి సిద్ధంగా ఉన్న రైతులతో నేరుగా బేరం పెట్టి ఎకరానికి 3 లక్షలిచ్చి కొనేస్తున్నాడు. 10 వేల ఎకరాలలో 4 వేల ఎకరాలు ఇప్పటికే కొనేశాడని అంచనా. కొనుగోలు పత్రంలో 'ఈ భూమి నుంచి నాకు ఆదాయం రావడం లేదు కాబట్టి అమ్మేస్తున్నాను' అని రాయించుకుంటున్నాడు. రేపు వేరేఎవరైనా ఇవి సారవంతమైన భూములు కాబట్టి, ఎక్కువ ధర కావాలని తగాదా పెట్టు కుంటే చూపించడానికి కాబోలు.

**వేట బాగా జరిగిన రోజున భార్యా, భర్త కలిసి 200 రూపాయల పైనే సంపాదించగలరు. పెద్దగా చదువులు లేవు కాబట్టి ఉద్యోగాలు చేస్తున్న వారు లేరు. రేపు డీప్ వాటర్ పోర్ట్ ప్రాజెక్టు అమలైతే ఈ 30 వేల జనాభా దిక్కులేని వారవుతారు.**



ప్రభుత్వం ఏం చేస్తున్నదంటే తక్కిన వాళ్ళను ఈ అమ్మకాలు చూపించి బెదిరిస్తున్నది. 'మీరు కూడా వాళ్ళలాగ 3 లక్షలకు కర్నాటి వెంకటేశ్వరరావుకు అమ్మేయండి. లేకపోతే ప్రభుత్వ రేటు ప్రకారం ఎకరానికి ఒక లక్షో, లక్షన్నరో ఇస్తాం. ఆపైన పదేళ్ళో, పదిహేనేళ్ళో కోర్టుల చుట్టూ తిరగండి' అంటున్నది. కోర్టులంటే సహజంగా ఉండే భయంతో డెవలపర్‌కు 3 లక్షలకు అమ్ముకొని పోతారని ప్రభుత్వ ధీమా. నిజానికి రాష్ట్రమంతటా పెరుగుతున్నట్టే ఇక్కడ కూడా భూముల ధరలు పెరుగుతున్నాయి. ప్రతిపాదిత ఎస్ఇజడ్ ప్రాంతాన్ని దాటి పైకిపోతే ఇటువంటి భూములే 8 లేక 10 లక్షలు పలుకుతున్నాయి. అయినప్పటికీ ఎవరికి వాళ్ళు విడివిడిగా నిర్ణయం తీసుకొనేటట్టయితే అధిక భాగం 3 లక్షలకు అమ్మేసుకోవడం, మిగిలిన వాళ్ళు గత్యంతరం లేక వారిని అనుసరించడం జరగొచ్చు. ప్రభుత్వం, కర్నాటి వెంకటేశ్వరరావుగారూ అసలా దినం కోసమే ఎదురు చూస్తున్నట్టున్నారు.

**రాష్ట్రంలోని అతి పెద్ద ప్రత్యేక ఆర్థిక మండలి విశాఖపట్నం జిల్లాలో రానుంది. గాజువాక నుంచి యలమంచిలికి పోయే రహదారికీ, బంగాళాఖాతానికీ మధ్యన అచ్యుతాపురం, రాంబెల్లి మండలాలలో మొత్తం 19,200 ఎకరాలలో దీనిని ప్రతిపాదించారు.**

రాష్ట్రంలోని అతి పెద్ద ప్రత్యేక ఆర్థిక మండలి విశాఖపట్నం జిల్లాలో రానుంది. గాజువాక నుంచి యలమంచిలికి పోయే రహదారికీ, బంగాళాఖాతానికీ మధ్యన అచ్యుతాపురం, రాంబిల్లి మండలాలలో మొత్తం 19,200 ఎకరాలలో దీనిని ప్రతిపాదించారు. మొదటి దఫా అచ్యుతాపురం మండలంలో 9,200 ఎకరాలు, రెండవ దఫా రెండు మండలాలలోను కలిపి 10,000 ఎకరాలు తీసుకుంటున్నారు.

ప్రత్యేక ఆర్థిక మండలుల కోసం సారవంతమైన నేలలు తీసుకోము అనే బుకాయింపు వింటూనే ఉన్నాము కాబట్టి, రాంబిల్లి మండలాన్ని విశాఖపట్నం జిల్లా కోనసీమ అని అంటారని చెప్పుకోవాలి.

అచ్యుతాపురం మండలంలో సేకరిస్తున్న భూమిలో భాభా అణుపరిశోధన కేంద్రానికి (బార్క్) అప్పగిస్తున్న 3,829 ఎకరాల భూమి స్థానిక ప్రజలను ఎక్కువ ఆందోళనకు గురిచేస్తున్నది. ఇప్పటికే చెప్పాడ, జోగన్నపేట, దోసూరు, జంగులూరు, మడంతూరు గ్రామాలలో 'బార్క్' కోసం 2,115 ఎకరాలు సేకరించారు. ఇంకా తింతిడి, దోసూరు, చిప్పాడ, జోగన్న పాలెంలలో 1,714 ఎకరాలు సేకరించనున్నారు. ఇది కేవలం పరిశోధనా కేంద్రం కోసమేనని పాలకులు దబాయిస్తున్నా, ఇక్కడ అణువిద్యుత్ కేంద్రం నెలకొల్పబోతున్నారన్న అనుమానం ప్రజలలో ఉంది. కేవలం పరిశోధనా కేంద్రానికి అంత భూమి ఎందుకు అవసరం ఉంటుంది? దేశంలో కొత్తగా నెలకొల్పబోయే విద్యుదుత్పత్తి కేంద్రాలలో అణు కేంద్రాలకు ప్రాముఖ్యం ఇవ్వనున్నట్టు ప్రధాన మంత్రి అనేకసార్లు ప్రకటించి ఉన్నాడు. ఇప్పటికి 15 ఉన్నాయనీ ఇంకొక 19 నిర్మించే ఆలోచన ఉన్నదనీ అంటున్నారు. అచ్యుతాపురంలో 'బార్క్' కోసం అని కేటాయించిన భూమి వాటిలో ఒక దానికోసమన్న అనుమానం సహేతుకమైనదే.

ఒక వేళ అచ్యుతాపురం భూములలో నెలకొల్పబోయేది అణుపరిశోధనా కేంద్రమే అయినా అణుకాలుష్య ప్రమాదం ఉంటుంది. అందువల్ల కేంద్ర పర్యావరణ శాఖ అనుమతి కావాలి. దానికి

ముందు రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ఈ పర్యావరణ ప్రభావాన్ని గురించి, కాలుష్య నియంత్రణ కోసం బార్క్ నెలకొల్పబోయే వ్యవస్థ గురించి బహిరంగ విచారణ జరగాలి. దానికి ముందు బార్క్ వారు తాము చేపట్టబోయే కార్యకలాపాలేవో, వాటి పర్యవసానంగా ఉండగల అణుకాలుష్య ప్రమాదం ఎటువంటిదో, దాని నియంత్రణ కోసం తాము చేపట్టబోయే చర్య లెట్లాంటివో తెలిపే నివేదికలు రూపొందించి స్థానిక ప్రజలకు అందుబాట్లో ఉంచాలి – ఇవేవీ జరగకుండా భూసేకరణ చేసేయడంలోని ఆంతర్యం ఏమిటి? అంతా మా వాళ్ళే కాబట్టి అన్ని సమ్మతులూ అనుమతులూ లభించక చస్తాయా అన్న ధీమా కాక మరేమిటి?

పైన చెప్పినట్టు ఈ 19,200 ఎకరాల భూమి చాలా ఫలవంతమైనది. జీడితోటలు, సరుగుడు తోటలు, కొబ్బరి తోటలు, వరిచేలు, చెరుకు, మిర్చి తోటలు, కాయగూరల తోటలు, సమృద్ధి అయిన పాడి, చేపల వేట ఇక్కడ ప్రజలకు పలు విధాల జీవనాధారాన్ని కల్పిస్తున్నాయి. ప్రభుత్వం ప్రతిపాదించిన నష్టపరిహారం తోటలకు ఎకరానికి 2.95 లక్షలు, ఆపైన జీడి చెట్టు ఒకటికి రూ. 200 చిల్లర, కొబ్బరిచెట్టు ఒకటికి రూ. 1,000 చిల్లర, సరుగుడు చెట్టుకు మాత్రం శూన్యం. ఎకరానికి సగటున 60 చెట్లు వేసుకుంటే తోటకు ఒక ఎకరానికి మూడు నుంచి మూడున్నర లక్షల నష్టపరిహారం (గరిష్ఠం నాలుగు లక్షలు) లభించగలదు. కానీ రాంబిల్లి మండలంలో ఎకరం కొబ్బరి తోట 15 లక్షలకు పోతుంది. జీడితోట 13 లక్షలకు పోతుంది.

నిరుడు అచ్యుతాపురం మండలంలో భూసేకరణ జరిగిపోయిన గ్రామాల వారు నష్టపరిహారంతో మళ్ళీ అంత భూమి కొనడానికి దూరాన ఉన్న చోడవరం, మాడుగుల పోవలసి వచ్చింది. ఇప్పుడు అక్కడ కూడా దొరకదు. ఇంకా పైకిపోతే ఏజెన్సీ మొదలవుతుంది కాబట్టి అంత భూమి ఇక జిల్లాలో ఎక్కడా కొనలేరు.

కల్లుగీసి బతికే శెట్టిబలిజ, యాతకులాలు, పశువులు పోషించుకొని బతికే యాదవులు, చేపలు పట్టుకొని బతికే మత్స్యకారులు, చేలలో కూలిచేసే దళితులు – వీళ్ళంతా భూమిపైన యాజమాన్య హక్కు లేకపోయినా ఏదో ఒక రూపంలో భూమి లేక సముద్రం నుంచి జీవనం పొందుతున్నారు. వాళ్ళకు కనీసం జిఓ నెం. 68 కింద నష్టపరిహారమైనా ఇవ్వాలి. కానీ దానికి కావలసిన సామాజిక ఆర్థిక సర్వే జరిగితే కదా?

**కల్లుగీసి బతికే శెట్టిబలిజ, యాతకులాలు, పశువులు పోషించుకొని బతికే యాదవులు, చేపలు పట్టుకొని బతికే మత్స్యకారులు, చేలలో కూలిచేసే దళితులు – వీళ్ళంతా భూమిపైన యాజమాన్య హక్కు లేకపోయినా ఏదో ఒక రూపంలో భూమి లేక సముద్రం నుంచి జీవనం పొందుతున్నారు. వాళ్ళకు కనీసం జిఓ నెం. 68 కింద నష్టపరిహారమైనా ఇవ్వాలి. కానీ దానికి కావలసిన సామాజిక ఆర్థిక సర్వే జరిగితే కదా?**

నెల్లూరు జిల్లా కృష్ణపట్నం రేవు గురించి పైన చెప్పాము. అక్కడ తీరాన్ని ఆనుకొని దాదాపు 600 ఎకరాలలో ఉప్పు కొటార్లు ఉన్నాయి. సంవత్సరంలో దాదాపు 7, 8 నెలలు ఏదో ఒక పని దొరుకుతుంది. దినకూలి 50 రూపాయలిస్తారు కాబట్టి పొలాలలో పని దొరికితే ఉప్పుకొటార్లకు రారుగానీ వ్యవసాయ కూలి దొరకని వారు, లేదా దొరకని సీజన్లలో ఇక్కడికే వచ్చి పని చేసుకుంటారు. పెరుగుతున్న కృష్ణపట్నం రేవువల్ల ఈ కొటార్లు మూతపడతాయి. వాటి యజమాన్లు లీజుదార్లే కాబట్టి లీజు గడువు



పూర్తి కానట్టయితే నష్టపరిహారం పొందుతారు గానీ, వందల మందికి పని చేసుకునే అవకాశం మాత్రం శాశ్వతంగా పోతుంది. వీరి విషయం కూడా జిఓ 68 కింద సర్వే జరిపి తగిన నష్టపరిహారం ఇయ్యవలసి ఉందిగానీ, మళ్ళీ అదే ప్రశ్న వేసుకోవాలి. అసలు సర్వే జరిపితే కదా?

**హైదరాబాద్ పరిసరాల 'అభివృద్ధి' రంగారెడ్డి జిల్లా బడుగువర్గాల శ్రేయస్సును, జీవనాన్ని ఎంతగా బలి తీసుకోబోయేదీ అంచనా వేయడం కూడా కష్టం. ఎందుకంటే ఇక్కడ దాడి ఒక రూపంలో లేదు.**

## రంగారెడ్డి జిల్లా

రంగారెడ్డి జిల్లాలో పెద్ద ప్రత్యేక ఆర్థిక మండలి ఏదీ లేదుగానీ చిన్నవి ఉన్నాయి. వాటికింద, ఔటర్ రింగ్‌రోడ్డు వంటి వెర్రి ప్రాజెక్టుల కింద, అసైన్డ్ భూముల వేలం పాట రూపకంగా, బ్రోకర్ల మోసం కారణంగా, ధనవంతులకిచ్చే ప్రభుత్వ భూముల లీజురూపకంగా చిన్న రైతులు, ముఖ్యంగా డి–ఫారం పట్టా ఉన్న భూమిలేని పేదలు, వివిధ వృత్తుల వారూ విపరీతంగా నష్టపోతున్నారు. భూములే కాక కష్టపడి కట్టుకున్న నివాసాలు కూడా బుల్‌డోజర్లకు చవకగా అప్పగించి ఎక్కడ గుడిసె వేసుకునే జాగా దొరుకుతుందా అని వెతుక్కుంటున్నారు. హైదరాబాద్ పరిసరాల 'అభివృద్ధి' రంగారెడ్డి జిల్లా బడుగువర్గాల శ్రేయస్సును, జీవనాన్ని ఎంతగా బలి తీసుకోబోయేదీ అంచనా వేయడం కూడా కష్టం. ఎందుకంటే ఇక్కడ దాడి ఒక రూపంలో లేదు.

ఔటర్ రింగు రోడ్డు కథలు పత్రికలలో చాలా వచ్చాయి. మొదట్లో చెప్పినట్టు ఎవరు లాభపడుతున్నారు, ఎంతగా లాభపడుతున్నారు అనేదే పత్రికల కథనాల సారాంశం. అయినప్పటికీ ప్రస్తుతం రాష్ట్రంలో నడుస్తున్న భూమి కబ్జా ప్రక్రియ గురించి కొంత సమాచారం ఆ కథనాలలో దొరుకుతుంది. దానికి బాధితులకు సంబంధించిన సమాచారాన్ని కూడా జతచేస్తే ఒక సమగ్ర చిత్రం లభిస్తుంది. రాజేంద్రనగర్ మండలం కోకాపేటలో 'హుడా' వారి డబ్బు దాహం వల్ల ఎప్పుడో పట్టాలు దక్కవలసిన భూమి చేజారిపోయిన 36 మాదిగ కుటుంబాల గురించి ఈ రిపోర్టు మొదట్లోనే చెప్పాము.

రంగారెడ్డి జిల్లాలో భూమి కబ్జాల ప్రక్రియ తెలుగుదేశం పాలనలో మొదలై కాంగ్రెస్ పాలనలో కొనసాగుతున్నదని మొదట చెప్పాలి. ఎందుకంటే కాంగ్రెస్ పాలనలో జరుగుతున్న వ్యవహారాల గురించి పెద్దఎత్తున ప్రచారం చేస్తున్న రెండు దినపత్రికల యాజమాన్యాలూ చంద్రబాబు నాయుడు అభిమానులే.

ఔటర్ రింగు రోడ్డు అని పేరు పెట్టినది హైదరాబాద్ నగరాన్ని బైపాస్ చేసి బెంగుళూరు బొంబాయి రహదార్లను విజయవాడకు, ఉత్తర తెలంగాణ ద్వారా మధ్యభారతానికీ, ఖమ్మం ద్వారా ఉత్తరాంధ్రకూ కలిపే 500 అడుగుల వెడల్పున్న రోడ్డుకు. ఇది హైదరాబాద్ చుట్టూ ఉంటుంది గానీ ప్రస్తుతం భూసేకరణ, రోడ్డు నిర్మాణం జరుగుతున్నది షంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని గచ్చిబౌలి ద్వారా బొంబాయి రహదారికి కలిపే భాగం మాత్రమే. ఈ మేరకు – షంషాబాద్ నుంచి గచ్చిబౌలికి – విశాలమైన రోడ్డు వేసే ప్రతిపాదన తెలుగుదేశం పాలనలోనే మొదలయింది. అప్పుడే ఆ బూచిని చూపించి భూములు చవగ్గా కొనుక్కోవడం మొదలయింది. నార్సింగి (రాజేంద్ర నగర్ మండలం)లో రోడ్డు వేయబోతారని దిమ్మెలు పాతిన భూమి ఒకప్పటి ఈనాం భూమి.

చాలామంది దళితులు, ముస్లింలు ఆ భూమి చేసుకుంటున్నారు. ఈనాంలు రద్దయిన తరువాత వారు సెటిల్‌మెంట్ పట్టాల కోసం అర్జీ పెట్టుకుని పొంది ఉంటే వారికి యాజమాన్య హక్కు ఉండేది కానీ 'ఎప్పటి నుంచో మనమే చేసుకుంటున్నాము కదా' అన్న భావనతో ఆ భూమి చేసుకుంటున్న వాళ్ళు చాలావరకు ఆ ప్రయత్నం చేయలేదు.

అస్పష్టమైన వారి యాజమాన్య హక్కు ముప్పా వెంకయ్య చౌదరి అనే రియల్ ఎస్టేట్ వ్యాపారికి ఉపయోగపడింది. 'మీ భూములు పోతాయి, మీరు కోర్టులో కొట్లాడి నష్టపరిహారం తెచ్చుకోలేరు. నాకు అమ్మేయండి. ఆ సంగతేదో నేను చూసుకుంటాను' అని వారిని భయపెట్టి ఎకరానికి ఒక లక్ష, రెండు లక్షలు ఇచ్చి దిమ్మెలు పాతిన భూములు కొనేశాడు. వంద ఎకరాలు కొన్నాడని గ్రామస్తులంటారు. ఇది తెలుగుదేశం హయాంలోనే జరిగింది.

ఆ తరువాత కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చింది. ఔటర్‌రింగ్ రోడ్డు ప్రతిపాదన వచ్చింది. తొలుత రూపొందించిన షంషాబాద్ – గచ్చిబౌలి రోడ్డు ఔటర్‌రింగు రోడ్డులో భాగం అయింది. పైన చెప్పినట్టు ఔటర్‌రింగ్ రోడ్డు పని జరుగుతున్నది ఇక్కడే. అయితే మొదట్లో దిమ్మెలు పెట్టిన చోటకాక అలైన్‌మెంట్ పక్కకు జరిగింది. పక్కన అప్పటికే ముప్పా వెంకయ్య చౌదరి గారు ఇంకొక 25 ఎకరాలు దాకా భూమికొని ఉన్నాడు. ఈ భూమి కొన్నదీ దళితుల నుంచి, ముస్లింల నుంచే. వీరికి చూపించిన బూచికూడా అదే – ఇవి ఈనాం భూములు, మీ యాజమాన్య హక్కు అస్పష్టమైనది, నాకమ్మేస్తే నేనన్నీ చూసుకుంటాను అని. ఇట్లా ఒకసారి కాదు ఏడుసార్లు ఔటర్ రింగు రోడ్డు అలైన్‌మెంట్ మారింది. అలా ముప్పా వెంకయ్య చౌదరి గారి ముప్పా హోమ్స్ ప్రైవేటు లిమిటెడ్ చేతిలోకి చాలా భూమి పోయింది. చవగ్గా ఆ భూమిని కోల్పోయిన వారిలో ఆ భూమిని ఎప్పటి నుంచో స్పష్టాస్పష్టమైన హక్కుతో చేసుకుంటున్న వారు చాలామందే ఉన్నారు. స్వాతంత్ర్య సమర యోధులుగా భూములు పొంది, భూసేకరణ తలనొప్పి మన మెక్కడ భరిస్తామని భయపడి ముప్పా వారికి అమ్మివేసిన పెద్దలూ చాలామంది ఉన్నారు. ముప్పా వారు ఇచ్చిన డబ్బులతో వారు పొలాలు కాదు కదా ఇళ్ళ స్థలాలు కూడా రాజేంద్రనగర్ మండల గ్రామాలలో ఎక్కడా కొనలేరు. వేరే ఏ రకంగానూ జీవనం పొందే అవకాశం వారిలో ఎక్కువమందికి లేదు.

ఈనాం భూమి లాంటిదే జాగీరు భూమి. రాజేంద్రనగర్ మండలం మనికొండలో జాగీరు భూములున్నాయి. నానక్‌రాంగూడకు చెందిన వారు దాదాపు 80 మంది ఇందులో 252 ఎకరాలు చేసుకుంటున్నారు. 1917లో అప్పటి జాగీర్దారు వాళ్ళకు ఇచ్చాడు. జాగీర్లు రద్దయిన తరువాత వాళ్ళు సెటిల్‌మెంట్ పట్టాలు పొందే ప్రయత్నం చేయలేదు. తాతల కాలం నుంచి మా భూమే కదా అనుకున్నారు. పైగావాళ్ళు హిందీ మాట్లాడే లోధాలు. స్థానిక పరిస్థితులతో పరిచయం తక్కువ, సామాజిక సంబంధాలు తక్కువ. చంద్రబాబు నాయుడు పాలనలో ఈ భూములన్నీ ఏ నష్టపరిహారం ఇవ్వకుండా ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్‌కు అప్పగించడం, ఇన్‌ఫోసిస్, విప్రో, పొలారిస్ మొదలైన

**ఇట్లా ఒకసారి కాదు ఏడుసార్లు ఔటర్ రింగు రోడ్డు అలైన్‌మెంట్ మారింది. అలా ముప్పా వెంకయ్య చౌదరి గారి ముప్పా హోమ్స్ ప్రైవేటు లిమిటెడ్ చేతిలోకి చాలా భూమి పోయింది. చవగ్గా ఆ భూమిని కోల్పోయిన వారిలో ఆ భూమిని ఎప్పటి నుంచో స్పష్టాస్పష్టమైన హక్కుతో చేసుకుంటున్న వారు చాలామందే ఉన్నారు.**



సాఫ్ట్‌వేర్ కంపెనీలకు దత్తత చేయడం జరిగిపోయింది. రైతులు హైకోర్టులో కేసు వేశారు గానీ ఎంత ఫలితం వస్తుందో తెలీదు.

**హైందవ సమాజంలో ఏదీ దళితుల దగ్గరికి తనంతట తాను పోదుగానీ రోడ్లు మాత్రం దళితుల భూములను వెతుక్కుంటూ పోతాయనడానికి నానక్‌రాంగూడ మంచి ఉదాహరణ.**

గచ్చిబౌలి నుంచి లింగంపల్లి వెళ్ళే రహదారి పైన ఉంది నానక్‌రాంగూడ. రహదారి ఊరిపక్క నుంచి పోతుంది. అయితే ఆ గ్రామాన్ని రహదారితో కలుపుతూ ఒక రోడ్డు గ్రామంలోకి వచ్చి, తిరిగి అవతలి వైపు రహదారిని కలుస్తుంది. ఈ రహదారిని చంద్రబాబు నాయుడు హయాంలో వెడల్పు చేశారు. నానక్‌రాంగూడ పక్కన ఉన్న భాగాన్ని వెడల్పు చేస్తే విజయనిర్మల అనే తెలుగు సినీనటికి సంబంధించిన భూమిలో నుంచి పోతుంది కాబట్టి దాని బదులు గ్రామంలో నుంచి పోతున్న రోడ్డును వెడల్పు చేశారు. దీనికోసం చాలా దుకాణాలు దెబ్బతినడమే గాక ఆ తరువాత ఊరిలో నుంచి పోయే రోడ్డే మెయిన్ రోడ్డయిపోయి ట్రాఫిక్ రొద ఎక్కువయింది. ఏమైతేనేం, సినీనటి ఆస్తి పదిలంగా ఉంది.

ఆ తరువాత రాజశేఖరరెడ్డి ప్రభుత్వం వచ్చింది, ఔటర్‌రింగ్ రోడ్డు వచ్చింది. అందులోని షంషాబాద్ – గచ్చిబౌలి భాగం నానక్‌రాంగూడ మీదుగా పోవలసి ఉంది. అయితే మొదట ప్రతిపాదించిన మార్గం రామానాయుడు స్టూడియోస్ మీదుగా పోతుంది కాబట్టి దానిని తప్పించారు. రెండవ ప్రతిపాదన కొత్ర శ్రీనివాసరావు అనే రియల్ ఎస్టేట్ వ్యాపారి కొన్న భూముల మీదుగా పోతుందని దాన్నీ తప్పించారు. (ఇతను చంద్రబాబు బంధువని వదంతి. అయినప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం అతని ఆస్తిని కాపాడింది). చివరికి సర్వే నెం. 149 నుంచి వేస్తున్నారు. ఇది ఆ గ్రామ దళితులు 'ఇందిరమ్మ కాలం నుంచి' చేసుకుంటున్న 10 ఎకరాల భూమి. దానికి డి–ఫారం పట్టాలు (తెలంగాణలో వాడుకలో ఉన్న పరిభాషలో లావోణి పట్టాలు) ఇమ్మని వాళ్ళు చాలా కాలంగా అడుగుతున్నా అధికారులు ఇదిగో ఇస్తాం, అదిగో ఇస్తాం అంటూ జాప్యం చేస్తూ వచ్చారు. వాళ్ళు బావులు తవ్వుకున్నారు, ఎస్‌సి కార్పొరేషన్ సహాయంతో బోర్లు వేసుకున్నారు. కానీ పట్టా ఏదీ లేని కారణంగా దమ్మిడీ నష్టపరిహారం ఇవ్వకుండా వారి భూములలో భూతం లాంటి 500 అడుగుల వెడల్పు రోడ్డు వేసేస్తున్నారు.

హైందవ సమాజంలో ఏదీ దళితుల దగ్గరికి తనంతట తాను పోదుగానీ రోడ్లు మాత్రం దళితుల భూములను వెతుక్కుంటూ పోతాయనడానికి నానక్‌రాంగూడ మంచి ఉదాహరణ.

ఆ ఊరు మరొక ప్రముఖమైన కోర్టు కేసులోనూ భాగం అయింది. సర్వే నెం. 115/1లో 82.28 ఎకరాల భూమిలో 18 మంది భూమిలేని పేదలకు డి–ఫారం పట్టాలు ఇచ్చి ఉన్నారు. 2000 సంవత్సరంలో ఆ భూమిని ప్రభుత్వం స్వాధీనపరచుకున్నప్పుడు అన్ని చోట్లలాగే డి–ఫారం పట్టాలు ఉన్న వారికి నష్టపరిహారం ఇవ్వాలా అన్న ప్రశ్న తలెత్తింది. ఒకప్పుడు ఏ నష్టపరిహారం ఇచ్చేవారు కారని ఇదివరకే చెప్పాం. ఎందుకంటే భూమిలేని పేదలకు ఇచ్చే డి–ఫారం పట్టాలోనే ఏదైనా ప్రజావసరం కోసం ప్రభుత్వం ఈ భూమిని ఎటువంటి నష్టపరిహారం ఇవ్వకుండా వెనక్కి తీసుకోవచ్చునని ఒక షరతు ఉంటుంది. అయినప్పటికీ ఇది అన్యాయం అనీ, ఏళ్ళ తరబడి చట్టబద్ధంగా సాగుచేసుకుంటున్న భూమి నుంచి వట్టి చేతులతో పంపించి వేయడం తప్పనీ ఆందోళన చేయగా, రాష్ట్ర ప్రభుత్వం జి.ఓ నెం. 1307 జారీ చేసింది. దాని ప్రకారం రైతులకిచ్చినంతే

(అంటే ప్రభుత్వం నిర్ణయించిన ధర) డి-ఫారం పట్టాదార్లకు ఇస్తారు. అయితే అది చాలదని ప్రభుత్వం మీద కోర్టు కెక్కే హక్కు డి-ఫారం పట్టాదారుకు ఉండదు.

అంతలో, డి-ఫారం భూములను స్వాధీనం చేసుకుంటే ఏ నష్ట పరిహారం ఇవ్వనక్కర లేదని రాష్ట్ర హైకోర్టు ఐదుగురు జడ్జీల బెంచి తీర్పు చెప్పింది. డి-ఫారం పట్టాలోనే రాసి ఉంటుంది కదా - ప్రజావసరాలకు కావలసి ఉంటే నష్టపరిహారం ఇవ్వకుండా తీసేసుకుంటామని? మరి నష్ట పరిహారం ఎందుకిస్తావు?' అని హైకోర్టు అంది. ప్రభుత్వమే పెట్టిన షరతును తొలగించే అధికారం ప్రభుత్వానికి ఎందుకు లేదో చట్టం చదువుకోని పామరులకర్థం కాదు గానీ అప్పటి రాష్ట్ర ప్రధాన న్యాయమూర్తి గారైన సత్యబ్రత సిన్హా గారికి అట్లా అనిపించింది. ఈ తీర్పు అన్యాయమనీ దానిని తిరగదోడాలనీ కోర్టులో కేసులు వేయగా, ఏడుగురు జడ్జీల బెంచి కూర్చొని కొన్ని కేసులలో ఉమ్మడి తీర్పు ఇస్తూ, సిన్హాగారి తీర్పు చెల్లదని ప్రకటించడమే గాక, డి-ఫారం పట్టాదారుకు ప్రభుత్వ ధర ప్రకారం ఇచ్చిన నష్ట పరిహారం పైన కోర్టుకు పోయే హక్కు లేదని జిఓ 1307 అనడం చెల్లదనీ, స్వంత భూమి గల రైతుకు ఇచ్చినంత నష్టపరిహారం డి-ఫారం పట్టాదారుకూ ఇవ్వాలనీ తీర్పు చెప్పింది. ఈ తీర్పు ఉమ్మడిగా చెప్పిన కేసులలో నానక్‌రాంగూడలో సర్వే నెం. 115/1లోని డి-ఫారం భూముల కేసూ ఒకటి. ఈ ఏడుగురు జడ్జీల తీర్పును రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాలు చేసింది. ఆ తరువాత రాష్ట్రంలో జరుగుతున్న భూసేకరణ ప్రక్రియలలో డి-ఫారం భూములున్న వారికి ప్రభుత్వం బుద్ధికి తోచిన అబద్ధం చెప్తున్నది. ఒక్కొక్కచోట మీకేమీ ఇవ్వనక్కర లేదని చెప్తున్నది. ఒక్కొక్కచోట రైతులతో సమానంగా ఇస్తామని చెప్తున్నది. ఇవ్వడం మాత్రం ఇప్పటిదాకా జరగలేదు.

డి-ఫారం పట్టాభూములకు నష్టపరిహారం ఇస్తారా ఇవ్వరా అని ఆదుర్దాగా ఎదురు చూస్తున్న వారిలో మహేశ్వరం మండలంలోని శ్రీనగర్, రావిరాల, జిన్నాయగూడెం గ్రామవాసులూ ఉన్నారు. వీళ్ళకు ఔటర్‌రింగ్ రోడ్డు దెబ్బ ఉంది. ఫ్యాబ్‌సిటీ దెబ్బ ఉంది. మొత్తం ఎన్ని ఎకరాలు తీసుకుంటారో ఇప్పటికింకా తెలీదు. రావిరాల, జిన్నాయగూడెంలలో కలిపి 827 ఎకరాలు కచ్చితంగా తీసు కుంటారని తెలుసు. అందులో 100 ఎకరాలు (సర్వే నెం. 88లో) భూమిలేని పేదలకు డి-ఫారం పట్టాలు ఇచ్చిన భూస్వాముల సీలింగ్ మిగులు భూమి. అయితే ఈ ఊర్లలో ఇంకా చాలా సీలింగ్ మిగులు భూమి ఉంది. అదంతా కూడా ఫ్యాబ్‌సిటీ, రింగ్ రోడ్ల కోసం తీసేసుకోబోతారని వింటు న్నారు. ఈ పేదలకు ఏ మాత్రమైనా నష్టపరిహారం వస్తుందా అనేది సుప్రీంకోర్టులో నలుగుతున్న కేసు తీర్పును బట్టి ఉంటుంది.

**రాష్ట్రంలో జరుగుతున్న భూసేకరణ ప్రక్రియలలో డి-ఫారం భూములున్న వారికి ప్రభుత్వం బుద్ధికి తోచిన అబద్ధం చెప్తున్నది. ఒక్కొక్కచోట మీకేమీ ఇవ్వనక్కర లేదని చెప్తున్నది. ఒక్కొక్కచోట రైతులతో సమానంగా ఇస్తామని చెప్తున్నది. ఇవ్వడం మాత్రం ఇప్పటిదాకా జరగలేదు.**

మంచాల మండలంలో ఆకుల రాజయ్య అనే టీచర్ వందల ఎకరాలు పేద రైతుల నుంచి కారుచవగ్గా కొన్న వైనాన్ని పత్రికలు బాగానే రాశాయి. ఈ భూములు లోయపల్లి, ఆరుట్ల గ్రామాలలో ఉన్నాయి. ఇది నల్గొండ జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలాన్ని ఆనుకొని ఉన్న ప్రాంతం. అదీ ఇదీ అంతా గుట్టలతో, బండలతో నిండి ఉన్న భూమి. ఈ ప్రాంతాన్ని



రాచకొండ ఏరియా అంటారు. ఇక్కడి భూములు ఒకప్పుడు పెద్ద పెద్ద భూస్వాములకు చెందినవి. 1,100 ఎకరాలకు యజమాని అయిన యూనుస్ ఖాన్ వారిలో పెద్దవాడు.

**రాజధాని పరిసరాలలోని ప్రభుత్వ భూమి ఇప్పుడు పేదలది కాదు. పరిశ్రమలది, రియల్ ఎస్టేట్ వ్యాపారులది. నగరం వెలుపల ప్రశాంతంగా ఫామ్ పెట్టుకోవాలని కోరుకునే ధనవంతులది.**

గుట్టల మయమైన ఈ భూమిని వేరే ఏ రైతులూ సాగులోకి తేలేకపోదురు. అది లంబా డాలకే సాధ్యం అయింది. వారే చేశారు, వారే దున్నుకుంటూ ఫలం తీసుకుంటూ ఉన్నారు. మొత్తం 4,000 ఎకరాల దాకా ఉన్న ఈ భూమిని దున్నుకుంటున్నది ఆంబోతుతండ, సత్యంతండ, బాలిగుట్టతండ, లోయపల్లి (గ్రామము, తండ) బండలేమూరు, హరిజనతండ, ముచ్చెర్లకుంట, బోడకొండ, కుర్రవానితండ, ఎల్లమ్మ తండలకు చెందిన పేదలు, అత్యధికంగా లంబాడీ గిరిజనులు. వాళ్ళు దశాబ్దాలుగా ఈ భూమిని చేసుకుంటు న్నారే గానీ ఆ భూమిని యజమానుల నుంచి కొనుక్కోలేదు, తమ అనుభవాన్ని క్రమబద్ధం చేసు కోలేదు. ఇది గమనించిన ఆకుల రాజయ్య వాళ్ళ దగ్గరికొచ్చి 'భూస్వామి దగ్గర ఈ భూమి కొనేశాను' అని చెప్పి 5 వేలో, 10 వేలో వాళ్ళ చేతిలో పెట్టి ఆ భూమిని కబ్జా చేసుకున్నాడు. ఆశ్చర్యంగా 4,000 ఎకరాలనూ సొంతం చేసుకోవడమే కాక మొత్తమంతటినీ వివిధ కంపెనీలకు అమ్మేశాడు కూడా.

భూములన్నీ కోల్పోయిన లంబాడా గిరిజనులు ఇప్పుడిప్పుడే మేలుకొని విషయాన్ని గ్రహిస్తు న్నారు. భూములు కొన్నవాళ్ళు వాటిని స్వాధీనం చేసుకోలేదు కాబట్టి నష్టమేమీ జరగలేదన్న అభిప్రాయంతో ఉన్నారు. ఆ భూములు వ్యవసాయ భూముల నుంచి పారిశ్రామిక భూములుగా ఇంకా బదలాయింపు జరగలేదు కాబట్టి ఆకుల రాజయ్య దగ్గర కొన్న కంపెనీలు ఆగాయి గానీ అది జరిగితే వాళ్ళు రంగంలోకి దిగి ఆ భూమినంతా స్వాధీనం చేసుకుంటారని తెలిసిన వాళ్ళంటు న్నారు. అది జరిగిన నాడు 1,000 నుంచి 1,200 కుటుంబాలు జీవనాధారాన్ని కోల్పోతాయి.

నిజానికి రంగారెడ్డి జిల్లా పేదలు అన్ని రకాలుగా దౌర్భాగ్యులు. ఇళ్ళ స్థలాల కోసం, సేద్యం కోసం వారు ప్రభుత్వ భూములపైన ఆశలు పెట్టుకోవడం సహజం. ఫలితంగా అర్జీలు పెట్టు కుంటారు, లేకపోతే ఎంఆర్‌ఓతో సహా ఏ అధికారి గ్రామానికొచ్చినా చేతులు ముడిచి అడుక్కుం టారు. ఒకనాటి పాలనా సంస్కృతిలో అప్పుడప్పుడు వారి కోరిక తీరేది. స్వయంగా తీరకపోతే అధికార్లకు లంచమిచ్చో, ఎంఎల్‌ఏ కోసం ఎన్నికలప్పుడు పనిచేశో తెచ్చుకునే అవకాశం ఉండేది. కానీ ప్రస్తుత పరిస్థితి వేరు. రాజధాని పరిసరాలలోని ప్రభుత్వ భూమి ఇప్పుడు పేదలది కాదు. పరిశ్రమలది, రియల్ ఎస్టేట్ వ్యాపారులది. నగరం వెలుపల ప్రశాంతంగా ఫామ్ పెట్టుకోవాలని కోరుకునే ధనవంతులది. వారి చేతిలో పెట్టడం కోసం ప్రభుత్వం ఆ భూములను ఆం. ప్ర. ఇండ స్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్‌కు, హుడాకు అప్పగిస్తుంది. మొదటి సంస్థ దానిని పరిశ్రమల కిస్తుంది. హుడా అయితే వేలం పాట పెట్టి అమ్మేస్తుంది. ఇవి రెండూ కాకపోతే ప్రభుత్వమే నేరుగా కొన్ని ప్రైవేటు సంస్థలకు భూములు అమ్మేస్తుంది లేదా లీజుకిస్తుంది. ఎంతెంత ప్రభుత్వ భూమి ఈ రకంగా భూమి లేని పేదలకు దూరం అయిందో చూస్తే ధనవంతుల భూదాహం ఎంతటిదో అర్థం అవుతుంది.

ఆం.ప్ర. ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్‌కు లింగంపల్లి, రాజేంద్రనగర్, కుత్బుల్లాపూర్, సరూర్‌నగర్, హయత్‌నగర్, బాలానగర్, షామీర్‌పేట, మహేశ్వరం, ఉప్పల్, మేడ్చల్, చేవెళ్ళ, గండీడ్, కీసర మండలాలలో 6,490 ఎకరాలు అప్పగించారు. ఒక్క నానక్‌రాంగూడలోనే 505 ఎకరాలు, మనికొండ జాగీర్ భూములు 650 ఎకరాలు, రావిరాలలో ప్రజలకు అనేక రకాలుగా ఉపయోగపడే కంచె 1,650 ఎకరాలు, మాధాపూర్‌లో 310 ఎకరాలు, రాయదుర్గ్‌లో 480 ఎకరాలు, మామిడిపల్లిలో 53 ఎకరాలు, కొల్లూరులో 297 ఎకరాలు, మహేశ్వరంలో 275 ఎకరాలు, గాజుల రామారంలో 231 ఎకరాలు, బాగ్ హయత్‌నగర్‌లో 199 ఎకరాలు, దుండిగల్‌లో 200 ఎకరాలు ఈ విధంగా అప్పగించబడ్డాయి. ఇందులో ప్రభుత్వ బంజరు ఉంది, డి-ఫారం పట్టా భూములున్నాయి, భూసేకరణ కింద స్వాధీనం చేసుకున్న రైతాంగ భూములున్నాయి. ఈ భూములు ఇళ్ళ స్థలాలకూ వ్యవసాయానికీ ఉపయోగపడడమే కాదు, వంట చెరుకుకోసం, పశుగ్రాసం కోసం, పళ్ళు, ఆకులు, కల్లు మొదలైన ఫలసాయం కోసం ప్రజలు తరతరాలుగా వాడుకుంటున్నవి. వీటి చుట్టూ ఎపిఐఐసి వారిప్పుడు ఫెన్సింగ్ వేసేసి ప్రజలనూ, వారి అవసరాలనూ బయటపెట్టేశారు.

హుడాకు అప్పగించిన భూములైతే వేలంపాటలో ధనవంతులకు అమ్ముకోవడానికే. దానికి పారిశ్రామీకరణ అనే ఆచ్ఛాదన సైతం లేదు. హుడాకు బాలానగర్, మల్కాజ్‌గిరి, షంషాబాద్, లింగంపల్లి, రాజేంద్రనగర్, కీసర, ఉప్పల్, షామీర్‌పేట, సరూర్‌నగర్, కుత్బుల్లాపూర్, హయత్

## రాష్ట్ర ప్రభుత్వ సహాయ పునరావాస విధానం: జి.ఓ.ఎం.ఎస్ నెం. 68, నీటిపారుదల శాఖ, తేది: 8-4-2005

ప్రాజెక్టుల కోసం ప్రజలను బలవంతంగా తొలగించడం వీలైనంత తక్కువ జరగాలనీ, ప్రజల తొలగింపు అనివార్యమైన మేరకు వారిపట్ల ముందుచూపుతో, మానవతతో వ్యవహరించాలనీ గుర్తించి ఈ విధానాన్ని రూపొందించినట్టు ఈ జిఓ చెప్తుంది.

దీని లక్ష్యం స్థిరాస్తులు లేని పేదల శ్రేయస్సు అని ప్రకటిస్తుంది.

ప్రాజెక్టు నిర్వాసితులు, ప్రాజెక్టు బాధితులు అనే రెండు వర్గాలను గుర్తిస్తుంది. నిర్వాసితులు అంటే భౌతికంగా తొలగించబడే వారు. బాధితులు అంటే మూడేళ్ళుగా అక్కడే ఉంటూ, ప్రాజెక్టు కోసం జరిగే భూసేకరణ వల్ల జీవనం గణనీయంగా దెబ్బతినే వారు.

ప్రతి ప్రాజెక్టుకూ జాయింట్ కలెక్టర్ కంటే తక్కువ కాని హోదా గల అడ్మినిస్ట్రేటర్‌ను రాష్ట్ర ప్రభుత్వం నియమిస్తుంది. ఆ అధికారి ముఖ్య కర్తవ్యాలు, ప్రజల విస్థాపన వీలైనంత తక్కువ ఉండేటట్టు చూడడం, ప్రాజెక్టు నిర్వాహకులతో మాట్లాడి అతి తక్కువ విస్థాపన గల ప్రత్యామ్నాయాన్ని రూపొందించడం, బలహీన వర్గాలకు ఆదివాసీ తెగలకూ చెందిన నిర్వాసితుల ప్రయోజనాలను కాపాడడం, నిర్వాసితుల సహాయ పునరావాస పథకాన్ని రూపొందించడం. జాయింట్ కలెక్టర్‌కు తగ్గని హోదా గల అడ్మినిస్ట్రేటర్‌తో బాటు, ప్రభుత్వ కార్యదర్శి హోదా గల కమిషనర్ కూడా ఉంటారు. అడ్మినిస్ట్రేటర్ కమిషనర్‌కు లోబడి ఉంటారు.

ప్రతి ప్రాజెక్టు విషయంలోనూ దానివల్ల ప్రభావితమయ్యే ప్రాంతాన్ని సూచిస్తూ ప్రభుత్వం పత్రికలలో పక్కన ఇవ్వాలి. ఆ తరువాత ఆ ప్రాజెక్టు కోసం నియమించబడ్డ అడ్మినిస్ట్రేటర్ సామాజిక ఆర్థిక సర్వే చేపడతారు. భూములు, ఉపాధి కోల్పోయే వారి గురించి, తమ వృత్తికి లేక వ్యాపారానికి దూరమయ్యే వారి గురించి ఈ సర్వేలో సమాచారం సేకరిస్తారు. వ్యవసాయ కార్మికులను, వ్యవసాయేతర శ్రామికులను వేరు వేరుగా గుర్తిస్తారు. ఈ సర్వే, ప్రభావిత ప్రాంతాన్ని ప్రకటించిన తరువాత 90 రోజుల లోపల పూర్తి కావాలి. ఈ సర్వే ఫలితాలను అన్ని సంబంధిత గ్రామ పంచాయతీ కార్యాలయాలలో ప్రదర్శించి అభ్యంతరాలు విని 30 రోజుల లోపల దానికి తుదిరూపం ఇవ్వాలి.

నిర్వాసితులు చెల్లాచెదురై పోకుండా, వీలైనంత వరకు ఒకేచోట, వీలైతే పాత గ్రామ పంచాయతీ పరిధిలోనే ఉండేటట్టు చూడడం అడ్మినిస్ట్రేటర్ విధి. అందుకోసం వారి పునరావాసం నిమిత్తం సమీప ప్రాంతాలలో భూమిని గుర్తించి, దానిని 'పునరావాస ప్రాంతం' (రీసెటిల్‌మెంట్ జోన్) గా ప్రకటించడం జరుగుతుంది. ఆ తరువాత ప్రాజెక్టు నిర్వాసితులనూ, ప్రాజెక్టు బాధితులనూ అడ్మినిస్ట్రేటర్ సంప్రదించి, పునరావాస పథకాన్ని రూపొందిస్తారు. దాని ఖర్చు ప్రాజెక్టు ఖర్చులో భాగంగా లెక్కించబడుతుంది. ఈ పునరావాస పథకంలో ప్రాజెక్టు బాధితులొక్కొక్కరి వివరాలూ పేర్కొనబడాలి.

ఈ పునరావాస పథకంలో ఏమేమి ఉంటాయి? ఇళ్ళు కోల్పోయిన వారికి ఉచితంగా ఇంటి స్థలం ఇస్తారు. దరిద్రరేఖకు దిగువన ఉన్న కుటుంబమైతే ఇల్లు కట్టుకోవడానికి 40 వేల రూపాయల ఆర్థిక సహాయం అందిస్తారు. వ్యవసాయ భూమి కోల్పోయే వారు నష్టపరిహారం బదులు ప్రత్యామ్నాయ భూమి కావాలని కోరుకున్నట్టయితే అందుబాట్లో ఉంటే కనక రెండున్నర హెక్టార్లు మించకుండా ప్రత్యామ్నాయ భూమి, దానిని బాగుచేసుకోవడానికి 5,000 నుంచి 10,000 రూపాయల ఆర్థిక సహాయం ఇస్తారు. ప్రాజెక్టు బాధిత కుటుంబం పశువులను కలిగి ఉన్నట్టయితే పునరావాస స్థలంలో పశువుల కొట్టం నిర్మించుకోవడానికి 3,000 రూపాయల ఆర్థిక సహాయం లభిస్తుంది. పునరావాస స్థలానికి తరలి వెళ్ళడానికి 5,000 రూపాయల ఆర్థిక సహాయం లభిస్తుంది. స్వయం ఉపాధి మీద బతికే గ్రామీణ వృత్తి పనివారికి, చిన్న వ్యాపారికి పునరావాస స్థలంలో షాపు నిర్మించుకోవడానికి 25,000 రూపాయలు ఆర్థిక సహాయం ఇస్తారు. భూమి పూర్తిగా కోల్పోయి భూమిలేని వాళ్ళుగా మారే వారికి 750 రోజుల కనీస వ్యవసాయ వేతనాలిస్తారు. చిన్నకారు రైతుగా మారినట్టయితే 375 రోజుల వేతనం, సన్నకారు రైతుగా మారినట్టయితే 500 రోజుల వేతనం ఇస్తారు. వ్యవసాయ, వ్యవసాయేతర శ్రామికులకు 625 రోజుల కనీస వ్యవసాయ వేతనం ఇస్తారు. పునరావాస స్థలంలో సామాజిక, సాంస్కృతిక సంబంధాలు దెబ్బతినకుండా ఉండే పద్ధతిలో ఒక చోట ఉన్న వారికి ఇళ్ళ స్థలాలు ఒక చోటే ఇస్తారు. పునరావాస స్థలాన్ని అన్ని మౌలిక వసతులూ గల ఆదర్శ గ్రామంగా రూపొందిస్తారు.

ఈ పునరావాస విధానం వచ్చి రెండేళ్ళు కావస్తోంది. అయితే ఇది ఎక్కడా శతాంశం కూడా అమలు కాలేదు.

నగర్ మండలాలలో 5,880 ఎకరాలు అప్పగించారు. ఒక్క మియాపూర్‌లోనే 890 ఎకరాలు, పక్కనున్న చందానగర్‌లో 153 ఎకరాలు, పుప్పాల్‌గుడలో 332 ఎకరాలు, కోకాపేటలో (ఇప్పటికే పత్రికల కెక్కిన 60 ఎకరాలు కలుపుకొని) 620 ఎకరాలు, సాహెబ్‌నగర్‌లో 367 ఎకరాలు, షామీర్‌పేటలో 2,360 ఎకరాలు ఈ విధంగా అప్పగించబడ్డాయి.

పర్యాటక శాఖకు అప్పగించిన భూమి కూడా ఉన్నవాళ్ళ వినోదానికే. రాజేంద్రనగర్, లింగంపల్లి, షామీర్‌పేట, షంషాబాద్, వికారాబాద్ మండలాలలో 845 ఎకరాలు పర్యాటక శాఖకు అప్పగించబడింది. అందులో పెద్ద మొత్తాలు షామీర్‌పేట మండలం జవహర్‌నగర్‌లో 400 ఎకరాలు, రాజేంద్రనగర్ మండలం బుద్వేల్‌లో 200 ఎకరాలు.

చివరి ఖాతా విభిన్న వ్యక్తులకు, సంస్థలకు ప్రభుత్వం అప్పగించిన భూమి. ఇందులో కారుచవగ్గా అప్పగించినది చాలా ఉంది. ఇది చంద్రబాబు కాలంలోనూ జరిగింది, రాజశేఖరరెడ్డి కాలంలోనూ జరుగుతున్నది. రాజేంద్రనగర్ మండలం మనికొండలో ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ అనే ఖరీదైన ప్రైవేటు విద్యాసంస్థకు చంద్రబాబు హయాంలో ఎకరా 25,000కు 250 ఎకరాలు ఇచ్చిన వైనాన్ని హైకోర్టులో సవాలుచేసీ ప్రయోజనం లేకుండా పోయింది. అందులో తప్పేమీ లేదని హైకోర్టు తీర్పు ఇచ్చింది.

అదే సమయంలోనే భారత పారిశ్రామిక సమాఖ్య (సిఐఐ)కి లింగంపల్లి మండలం మాదాపూర్‌లో 'గ్రీన్ బిజినెస్' (అంటే ఏమిటో!) నెలకొల్పడానికి 5 ఎకరాల భూమిని సంవత్సరానికి ఒక్క రూపాయి కిరాయితో 25 ఏళ్ళకు లీజుకిచ్చారు! ఊరికే ఇవ్వబుద్ధికాక ఒక్క రూపాయి తీసుకుంటున్నట్టున్నారు. బ్రహ్మకుమారీలు అనే మత ప్రచార సంస్థకు గచ్చిబౌలిలో ఎకరా వెయ్యి రూపాయల కిరాయికి 37 ఎకరాలు 25 సంవత్సరాలకు లీజుకిచ్చారు. కాంగ్రెసు వారు అధికారానికొచ్చిన తొలిరోజులలో వారి మిత్రులుగా ఉన్న సిపిఐ (ఎం) వారి సుందరయ్య విజ్ఞాన కేంద్రానికి గచ్చిబౌలిలో ఎకరా 10 వేలకు 4 ఎకరాలు అమ్మేశారు. మల్కాజ్‌గిరి మండలం అల్వాల్‌లో లయోలా అకాడెమీ అనే ప్రైవేటు విద్యాసంస్థకు ఎకరా 33,880 రూపాయలకు 132 ఎకరాలు అమ్మేశారు. ఆ పాలనలోనూ ఈ పాలనలోనూ ప్రభుత్వ ఉద్యోగుల హౌసింగ్ సొసైటీలకు దమ్మిడీ తీసుకోకుండా 586 ఎకరాల భూమి మూడు దఫాలుగా హైదరాబాద్ పరిసరాలలో అప్పగించారు. ఈ ప్రైవేటు అప్పగింతలన్నీ (కొన్ని కారుచవగ్గా, కొన్ని మార్కెట్ ధరకు) కలుపుకుంటే 1,562 ఎకరాలయింది.

పైన చెప్పిన లెక్కలన్నీ కలుపుకుంటే హైదరాబాద్ పరిసరాలలోని రంగారెడ్డి జిల్లా గ్రామాలలో 14,778 ఎకరాలు ప్రభుత్వం ద్వారా కలవారి పాలయ్యాయి. ఇది విశాఖపట్నం ప్రత్యేక ఆర్థిక మండలి తరువాత ఒకే ప్రాంతంలో అతిపెద్ద మొత్తం.

**పర్యాటక శాఖకు అప్పగించిన భూమి కూడా ఉన్నవాళ్ళ వినోదానికే. రాజేంద్రనగర్, లింగంపల్లి, షామీర్‌పేట, షంషాబాద్, వికారాబాద్ మండలాలలో 845 ఎకరాలు పర్యాటక శాఖకు అప్పగించబడింది.**

ముగింపుగా అసైన్డ్ భూముల బదలాయింపు నిషేధ చట్టానికి రాష్ట్ర ప్రభుత్వం ఈ మధ్యనే తీసుకొచ్చిన దుర్మార్గమైన సవరణను గురించి చెప్పుకుందాం. ఈ చట్టాన్ని క్లుప్తంగా 9/77 చట్టం అంటారు. పేదలకు డి-ఫారం పట్టాలు ఇచ్చిన భూమిని ఎవరికీ బదలాయించడానికి వీలు లేదనీ, ఎటువంటి బదలాయింపూ



చెల్లదనీ 9/77 చట్టం అంటుంది. పేదలు గత్యంతరం లేని పరిస్థితిలోనో లేక బలవంతుల దౌర్జన్యం కారణం గానో తమకు అసైన్ చేసిన భూమిని ఇతరులకు బదలాయించడం జరుగుతున్నదని గుర్తించి, అటువంటి ఏ బదలాయింపు ఎంఆర్‌ఓ దృష్టికి వచ్చినా ఆ అధికారి దానిని రద్దుచేసి తొలి లబ్ధిదారుకే దానిని అప్పగించాలని అంటుంది. దీనికి 2006లో రాష్ట్ర ప్రభుత్వం చేసిన సవరణ అక్రమంగా బదలాయింపుకు గురైన భూమిని లబ్ధిదారుకు తిరిగి ఇవ్వకుండా ప్రభుత్వం ఖాతాలో వేసుకుని అమ్ముకోవడానికి మార్గం సుగమం చేసింది. ప్రభుత్వం ప్రకటించిన కొన్ని ప్రాంతాలలో అక్రమ బదలాయింపును రద్దు చేసిన తరువాత ఆ భూమిని లబ్ధిదారుకు తిరిగి ఇవ్వనక్కర లేదనీ, బదలాయింపు తరువాత ఆ భూమిని తొలినాడు ఉద్దేశించిన వినియోగానికి భిన్నంగా వినియోగించినట్టయితే దానిని తొలి లబ్ధిదారుకు తిరిగి ఇయ్యనక్కర లేదనీ ఈ సవరణ అంటుంది. హైదరాబాద్ పరిసరాలలోని రంగారెడ్డి జిల్లా భూములను ఈ సవరణ వర్తించే భూములుగా ప్రకటించబోతారని నిస్సందేహంగా చెప్పవచ్చు. రాజధాని పరిసరాలలో పేదలకు చోటులేదన్న పాలనా విధానం చంద్రబాబు కాలం నుంచి రాష్ట్రంలో అమలులో ఉంది. అది ఈ సవరణ రూపంలో కొనసాగుతున్నది. రంగారెడ్డి జిల్లాలో భూములకోసం ఎదురుచూసే పేదలకు గడ్డు రోజులు ముందున్నాయి.

✪

మహిళా ఖైదీల స్థితిగతులు

# ఖైదులోనూ వివక్షే

– కె.మురళి★



నేరస్తుల పట్ల సమాజంలో చిన్న చూపుండడం మనందరికీ తెలిసిన విషయమే అయినా నేరాలకు కొంతవరకు వ్యవస్థీకృత కారణాలు ఉంటాయని, నేరస్తులకు కూడా కొన్ని హక్కులు ఉంటాయని గుర్తిస్తున్నాం. పౌరులకైనా, నేరస్తులకైనా ఒకే సమానత్వపు హక్కు వర్తిస్తుంది. దాని అర్థం పౌరులు, నేరస్తులు హక్కులలో సమానులని, సమానులు కావాలని వాదించడం లేదు. ఒకే రకమైన నేరాలకు పాల్పడిన వారి మధ్య అసమానత్వాన్ని పాటించడానికి వీలులేదని చెపుతున్నాం అంతే. నిజానికి ఆచరణలో సమానత్వపు హక్కుకు ఉన్న అర్థం ఇదే. చట్టాన్ని ఉల్లంఘించిన వారందరూ ప్రభుత్వం దృష్టిలో, సమాజం దృష్టిలో నేరస్తులే. మరి ఆ నేరస్తులు – పురుషులైనా, స్త్రీలైనా సమాజం దృష్టిలో, ప్రభుత్వం దృష్టిలో కూడా సమానులే కావాలి. వారితో వ్యవహరించే తీరులో ఎలాంటి వివక్ష పాటించడానికి వీలులేదు. కాని జెండర్ వివక్ష ప్రభుత్వం వ్యవహరించే తీరులోనూ కనబడుతుంది.

★ మానవహక్కుల కార్యకర్త. పరిశోధకుడు



**మొత్తం ఖైదీల సంఖ్యలో మహిళా ఖైదీలు అత్యల్పంగా ఉండడమే వారి పట్ల అత్యంత వివక్షకు కారణంగా కనిపిస్తుంది. నిజానికి వారు చేసే నేరాలు చాలా తక్కువగా ఉండడం, (పురుషులతో పోలిస్తే), వాటిల్లో తీవ్రమైన నేరాలు చాలా తక్కువగా ఉండడం పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం వారికి మెరుగైన జైళ్ళ వ్యవస్థను రూపొందించాల్సింది.**

ఈ వ్యాసం మహిళా ఖైదీల పట్ల ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు, వారి నేర నేపథ్యం గురించి చర్చించడానికి ఉద్దేశించింది.

మన రాష్ట్రంలో చూసినా, దేశంలోని ఇతర జైళ్ళలో చూసినా ఖైదీల జనాభాలో మహిళా ఖైదీలు 2.4 శాతం మాత్రమే. మన రాష్ట్రంలో సంవత్సరం మొత్తం మీద 20 వేల మంది మహిళలు జైలుపాలై, ఆ తర్వాత విడుదలై బయటకు వస్తుంటారు. సగటున రాష్ట్ర జైళ్ళలో ఏ రోజైనా ఏడెనిమిది వందల మంది మహిళా ఖైదీలు ఉంటారు. కారణాలు ఇదమిత్థంగా తెలియదు కాని, గత ఏడేళ్ళలో పురుష ఖైదీలు మూడు శాతం పెరిగితే, మహిళా ఖైదీలు 23 శాతం పెరిగారు. ఈ విపరీతమైన పెరుగుదలకు గల కారణాలపై ప్రత్యేకమైన పరిశోధన చేయాల్సి ఉంది. అయినా మొత్తం మీద మహిళా ఖైదీలు అత్యంత అల్పసంఖ్యాకులే అన్న విషయం గుర్తుంచుకోవాలి.

మహిళా నేరస్తుల నేర నేపథ్యం పురుషులతో పోలిస్తే పూర్తిగా భిన్నమైంది. వారిలో అత్యధికులు చిన్న చిన్న దొంగతనాలు చేసి పట్టుబడిన వారై ఉంటారు. చెత్త ఏరుకొనే వారు, సెక్స్ వర్కర్లుగా అనుమానింపబడిన వాళ్ళు ఉంటారు. సారా, గంజాయి, గుడుంబా వంటి నిషేధించబడిన మత్తు పదార్థాలు కలిగి ఉన్న వారు లేదా ఇతరుల తరఫున వాటిని రవాణా చేస్తూ పట్టుబడిన వారై ఉంటారు. హత్యా నేరాలలో జైలుకు వచ్చిన కొద్ది మందిలో అధికులు తమను తరచూ శారీరక, మానసిక హింసకు గురిచేసిన వారి హత్యల్లో నిందితులై ఉంటారు. మిగిలిన నేరాలతో పోలిస్తే, ఇలాంటి నేరాలకు పాల్పడిన వారిపై తాము ఎదుర్కొన్న హింస ప్రభావం తీవ్రంగా ఉంటుంది. గత జీవితం నుండి సంక్రమించిన ప్రత్యేకమైన మానసిక, శారీరక సమస్యలు ఉంటాయి. చాలా సందర్భాలలో ఆంధ్రప్రదేశ్ జైళ్ళలో కనిపించే మధ్యతరగతికి చెందిన మధ్య వయస్కులైన స్త్రీలు వరకట్న మరణాలలో నిందితులుగానే అక్కడికి వచ్చి ఉంటారు.

మొత్తం ఖైదీల సంఖ్యలో మహిళా ఖైదీలు అత్యల్పంగా ఉండడమే వారి పట్ల అత్యంత వివక్షకు కారణంగా కనిపిస్తుంది. నిజానికి వారు చేసే నేరాలు చాలా తక్కువగా ఉండడం, (పురుషులతో పోలిస్తే), వాటిల్లో తీవ్రమైన నేరాలు చాలా తక్కువగా ఉండడం పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం వారికి మెరుగైన జైళ్ళ వ్యవస్థను రూపొందించాల్సింది. కాని మెజారిటీగా ఉన్న పురుష ఖైదీలను దృష్టిలో ఉంచుకునే మొత్తం జైళ్ళ వ్యవస్థను రూపొందించడం, నిర్వహించడం జరుగుతోంది. జైళ్ళకు చెందిన అన్ని రంగాలను, విభాగాలను ఈ దృష్టితోనే రూపొందించారు. దీంతో జెండర్ వివక్ష జైళ్ళలో పరాకాష్టకు చేరుకుంది. అది ఏ విధంగా జరుగుతుందో చూద్దాం.

రాష్ట్రంలో మొత్తం 140 జైళ్ళు ఉండగా, మహిళల కోసం రూపొందించిన జైళ్ళు హైదరాబాద్, రాజమండ్రిలలో మాత్రమే ఉన్నాయి. వీటిలో 350 మంది మహిళలు ఉంటుండగా మిగతా దాదాపు 400 మంది మహిళా ఖైదీలు పురుషుల కోసం నిర్మించిన జైళ్ళలో ఉంటున్నారు. శిక్షపడిన మహిళలనే మహిళా జైళ్ళకు తరలిస్తారు. చిత్తూరు నుండి శ్రీకాకుళం వరకు ఉన్న ప్రాంతం నుండి

వచ్చిన మహిళా నేరస్తులను రాజమండ్రి మహిళా జైలుకు, కడప నుండి అదిలాబాద్ జిల్లా వరకు ఉన్న ప్రాంతం నుండి వచ్చిన మహిళలను హైదరాబాద్‌కు తరలిస్తారు. అంటే మహిళలు తమ ఇంటి నుండి చాలా దూరంగా ఉండే జైళ్ళలో ఉండాల్సి వస్తోంది. ఇది వారు తమ కుటుంబ సభ్యులను కలిసే హక్కు మీద తీవ్రమైన ప్రభావం చూపుతుంది. ఉదాహరణకు, చిత్తూరు జిల్లాకు చెందిన మగ ఖైదీ నెల్లూరు సెంట్రల్ జైలులో ఉంటే, అతని కుటుంబ సభ్యులు కనీసం 15 రోజులకు ఒకసారైనా అతన్ని కలవడం వీలౌతుంది. అదే విధంగా అదిలాబాద్‌లో ఉన్న కుటుంబ సభ్యులు వరంగల్ కేంద్ర కారాగారంలో ఉన్న పురుష ఖైదీని సులభంగా తరుచూ కలవగలుగుతారు. కాని మహిళా ఖైదీలను పేద కుటుంబాలకు చెందిన వారైతే (ఎక్కువ మంది వారే ఉంటారు), వారి బంధువులు 6 నెలల నుండి సంవత్సరం మధ్యలో ఒక్కసారి మాత్రమే వచ్చి కలుస్తున్నారు. ఈ ఎడబాటు మహిళలలో, వారి మీద ఆధారపడిన పిల్లలలో తీవ్రమైన మానసిక సమస్యలను కలిగించే అవకాశముంది.

సత్ప్రవర్తన కలిగిన ఖైదీలు తమ కుటుంబ సభ్యులతో 6 నెలలకు ఒకసారి రెండు మూడు రోజులు గడిపే అవకాశాన్ని కల్పించడానికి ప్రత్యేకమైన గదులను నిర్మిస్తున్నట్టు ప్రభుత్వం ఈ మధ్య ప్రకటించింది. ప్రభుత్వ ప్రకటనను బట్టి ఈ పథకం పురుష ఖైదీలకు ఉద్దేశించిందేనని అర్థమవుతుంది. ఈ పథకం లాటిన్ అమెరికా దేశాలలో ఎప్పటినుంచో ఉన్నా మహిళలకు మాత్రం దాన్ని వర్తింపచేయలేదు. దానికోసం కొంత కాలంగా అక్కడ ఉద్యమాలు జరుగుతున్నాయి. అలాంటివి మనం ఇక్కడ ఊహించలేము. మరి మహిళల్లో సత్ప్రవర్తన కలిగిన వారు ఉండరా? వారి ప్రయోజనార్థం కూడా ఈ పథకం ఎందుకు రూపొందించరు? ఈ డిమాండ్ అత్యాశే అవుతుంది. ఎందుకంటే, సత్ప్రవర్తన కలిగిన పురుష ఖైదీల కోసం ఉద్దేశించిన ఓపెన్ ఎయిర్ జైళ్ళనబడే ఖైదీల వ్యవసాయ క్షేత్రాలు చర్లపల్లిలో, అనంతపురంలో గత 40 ఏళ్ళుగా పని చేస్తున్నాయి. అందులో మెరుగైన సౌకర్యాలు ఉండడమేకాక, నిర్బంధం చాలావరకు సడలించబడి ఉంటుంది. ఈ సౌకర్యాలు మహిళలకు కలిగిందే ఆలోచనే ఇంతవరకు రాలేదు. ఇక కుటుంబ సభ్యులతో గడిపే సౌకర్యం కలిగిస్తారని ఎలా ఆశించేది?

శిక్షపడిన మహిళలను మాత్రమే రాజమండ్రి, హైదరాబాద్ జైళ్ళకు తరలిస్తారు. కాని మహిళా పోలీసుల కొరత తీవ్రంగా ఉన్న మన రాష్ట్రంలో శిక్షపడిన మహిళలను ఈ జైళ్ళకు తరలించడానికి కూడా చాలా కాలమే ఎదురు చూడాల్సి వస్తోంది. అంతవరకు వారు పురుషుల కోసం ఉద్దేశించిన స్థానిక జైళ్ళలో ఉండాల్సిందే. మూడు నెలల వరకు ముద్దాయిగా ఉండి, ఆ తర్వాత ఆరు నెలలు శిక్ష అనుభవించాల్సి వచ్చిన మహిళలు సాధారణంగా స్థానిక జిల్లా, కేంద్ర కారాగారాల్లోనే శిక్షాకాలాన్ని పూర్తి చేస్తారు. మహిళల కోసం ఉద్దేశించని ఈ జైళ్ళలో మహిళల పరిస్థితి చాలా దారుణంగా ఉంటుంది. ఈ అన్ని జైళ్ళలో లోనికి, బయటకు

> **సత్ప్రవర్తన కలిగిన పురుష ఖైదీల కోసం ఉద్దేశించిన ఓపెన్ ఎయిర్ జైళ్ళనబడే ఖైదీల వ్యవసాయ క్షేత్రాలు చర్లపల్లిలో, అనంతపురంలో గత 40 ఏళ్ళుగా పని చేస్తున్నాయి. అందులో మెరుగైన సౌకర్యాలు ఉండడమేకాక, నిర్బంధం చాలావరకు సడలించబడి ఉంటుంది. ఈ సౌకర్యాలు మహిళలకు కలిగిందే ఆలోచనే ఇంతవరకు రాలేదు.**



> **2005 జూన్ పదవ తేదీన రంపచోడవరం సబ్ జైలు చూడడానికి వెళ్ళాను. కోర్టులకు సెలవులు కావడంతో జైలులో ముగ్గురు ఖైదీలు మాత్రమే ఉన్నారు. వారిలో ఇద్దరు పురుషులు, ఒక మహిళ. జైలులో చివరగా ఉన్న బ్యారక్‌లో మూడు గదులు, వాటిలో ఒక దానిలో ఆమెను ఉంచి తాళం వేశారు. ఆమెకు ముప్ఫై ఏళ్ళుంటాయి. దొంగతనం కేసులో ముద్దాయి. రెండున్నర నెలలుగా జైలులో ఉంటోంది. ఆ ప్రాంతానికి చెందినది కాకపోవడంతో బెయిలు ఇచ్చేవారు లేరు. నేరారోపణ చిన్న దొంగతనం మాత్రమే కాబట్టి, శిక్షపడితే, శిక్షను పూర్తిచేసి బయటపడాలనే ఉద్దేశంతో ఉన్నట్టు అనిపించింది. జైలు సిబ్బందిలో అరుగురూ మగవారే. వంట చేసే మగ ఖైదీలు రోజుకు రెండు సార్లు ఆమెకు కనిపించి ఆహారం అందించి వెళ్తారని సిబ్బంది చెప్పారు. అంటే ఇరవై నాలుగ్గంటల వ్యవధిలో రెండుసార్లు మాత్రమే ఆమెకు మనుష్య ప్రపంచంతో పరిచయం. ఆ స్థితిలో రెండున్నర నెలలు ఉన్న ఆమె మానసిక స్థితి సాధారణంగా ఉండే అవకాశం ఉందా? ఆమె రక్షణకు అక్కడ భరోసా ఉందా?**

వెళ్ళడానికి మహిళలు కూడా పురుషులు ఉపయోగించే ద్వారాన్నే ఉపయోగిస్తారు. పని దినాలలో ఉదయం పది గంటలకు మీరు ఏదైనా జైలుకు వెళ్తే ఈ దృశ్యం కనిపిస్తుంది. ఒకవైపు 20 నుండి 30 మంది మగవారు అర్ధనగ్నంగా, కొంతమంది చిన్న నిక్కర్‌తో వరుసలో ఉంటారు. ఇంకోవైపు నలుగురైదుగురు మహిళలు వరుసలో ఉంటారు. జైలు హెడ్ వార్డర్, లేక పాత ఖైదీనో వారందరి వివరాలు, శరీరంపై పుట్టుమచ్చలు, కేసు వివరాలు గట్టిగా అడుగుతూ కనిపిస్తాడు. సెక్స్‌వర్కర్, భర్తల లేక ప్రేమికుల హత్య కేసులలో నిందితులైన మహిళలు అందరి ముందు కేసు వివరాలు చెప్పడానికి సిగ్గుతో కుంగిపోతూ కనిపిస్తారు. అదే సమయంలో ఆ వివరాలను ఆసక్తిగా వినడానికి ప్రయత్నం చేసే పురుష ఖైదీలు, జైలు సిబ్బంది వంకర నవ్వుతో మనకు దర్శనమిస్తారు. ఇలాంటి కేసులలో వివరాలు చెప్పే మగవారైతే, వారి ప్రవర్తన 'నేరం పురుష లక్షణం' అన్న స్థాయిలో ఉంటుంది. ఎవరైనా సంకోచంతో వివరాలను గొణిగినా, జైలు సిబ్బంది రెట్టించి అడగరు. కాని మహిళా ఖైదీలను పురుష ఖైదీల ముందు అవమానపరిచే ఈ తతంగాన్ని మాత్రం నాలుగు దశల్లో చాలా వివరంగా నిర్వహిస్తారు. ఈ తతంగాన్ని నిర్వర్తించడానికి ఈ జైళ్ళలో మహిళా సిబ్బంది అస్సలు ఉండరు.

మగవాళ్ళను దృష్టిలో ఉంచుకుని నిర్మించిన ఈ జైళ్ళలో సాధారణంగా బహిరంగ స్నానపు స్థలాలు, వాటి పక్కన రెండున్నర అడుగుల ఎత్తున్న తలుపులతో మరుగుదొడ్లు ఉంటాయి. యాభై మంది ఉండే బ్యారక్‌లో ఒకే ఒక మరుగుదొడ్డి ఉంటుంది. బ్యారక్‌ల మధ్య పగలంతా తిరగడానికి బోలెడు స్థలము, తోటలు ఉంటాయి. ఖైదీలు ఇతర బ్యారక్‌లలో ఉండే ఇతర ఖైదీలను కలవడానికి, ఆసుపత్రి వార్డుకు, క్యాంటీన్, స్కూలు, లేక లైబ్రరీ, పరిశ్రమల వార్డుకు, వంటగదికి స్వేచ్ఛగా తిరిగే అవకాశం ఉంటుంది. ఇలాంటి జైలులో మిగిలిన బ్యారక్‌ల నుండి పూర్తిగా విడివడిన ఒక బ్యారక్‌లో పది నుండి ఇరవై మంది మహిళా ఖైదీలను ఉంచుతారు. వీరి మరుగుదొడ్ల పరిస్థితి, స్నానాల గది పరిస్థితి చాలా ఘోరంగా ఉంటుంది. ఈ బ్యారక్ ప్రవేశ ద్వారం ఇరవై నాలుగ్గంటలు తాళంవేసి ఉండడం వల్ల వారికి జైలులోని ఇతర బ్యారక్‌లతో, వంటగది, లైబ్రరీ, ఆసుపత్రి, పరిశ్రమల విభాగాలతో, ముఖ్యమైన అధికారులతో సంప్రదింపులకు అవకాశాలు పూర్తిగా

తెగిపోతాయి. మగ ఖైదీలు వండిన ఆహారమే మహిళల వార్డుకు పంపబడుతుంది. నిత్యజీవితంలో అవసరపడే చిన్న చిన్న వస్తువులు, వేడినీళ్ళు లాంటివి పురుషులకు సులభంగా దొరకుతాయి. అనధికారంగా పచ్చళ్ళు చేసుకోవడం లాంటి చిన్న చిన్న సరదాలు అన్నీ వారికి తీరుతాయి. కానీ మహిళా ఖైదీలను పూర్తిగా వేరుచేయడంతో ఆ నిర్బంధం చాలా కఠినంగా, నరకప్రాయంగా తయారవుతుంది. మగవారికి ఉద్దేశించిన ఈ జైళ్ళలో మహిళా ఖైదీలపై అత్యాచారాలు జరిగే అవకాశాలు కూడా ఎక్కువ. కాని అవి బయటకు వచ్చే అవకాశాలు చాలా తక్కువ.

జైలులోని మహిళా వార్డుని జైలు లోపలి జైలుగా చెప్పుకోవడం సబబుగా ఉంటుంది. రాత్రి సమయాలలో అత్యవసర వైద్యం అవసరమైతే పరిస్థితి దారుణంగా ఉంటుంది. ఈ జైళ్ళలోని ఆసుపత్రులలో మహిళా నర్సుల, డాక్టర్ల, కాంపౌండర్ల నియామకాలు లేవు. చాలా జైళ్ళలో మగ ఖైదీలే పగలు, రాత్రి నర్సుల పాత్ర వహిస్తారు. కాబట్టి మహిళా ఖైదీల అత్యవసర వైద్య అవసరాలను తీర్చడం ప్రస్తుత జైలు పరిస్థితులలో అనూహ్యం. ఇక ఈ జైళ్ళలో నియమితులైన డాక్టర్లు సహజంగానే స్త్రీల వైద్య నిపుణులు కారు. స్థానిక పట్టణంలో ఎవరైనా మహిళా డాక్టర్లు ఉంటే వాళ్ళు ఏ పదిహేనో లేక నెల రోజులకో ఒకసారి మహిళా వార్డును సందర్శిస్తారు. వారిలో మానసిక వైద్య నిపుణులు ఉండే అవకాశం అసలే ఉండదు. ఈ జైళ్ళలో స్త్రీల అవసరాలను తప్పక తీర్చాలనే నియమమేదీ ఉండదు. "అవకాశం ఉన్న మేరకు, సాధ్యమైన మేరకు", అన్నవే స్త్రీల అవసరాలకు సంబంధించి వాళ్ళు పాటించే రూల్సు. ఇటువంటి పరిస్థితుల్లో రోజుకు సగటున నాలుగు వందల మంది, సంవత్సరానికి 20 వేల మంది మన రాష్ట్రంలో నిర్బంధం అనుభవిస్తున్నారు.

మహిళా ఖైదీని కోర్టు ముందు ప్రవేశ పెట్టాలన్నా, ఆసుపత్రికి తీసుకెళ్ళాలన్నా ఖచ్చితంగా ఒక మహిళా కానిస్టేబుల్ ఉండాలి. మహిళా కానిస్టేబుల్ కొరత తీవ్రంగా ఉండడంతో, మహిళా ఖైదీలు తరచూ విచారణ వాయిదాలకు వెళ్ళలేక పోతుంటారు. ఇది వారి జైలు జీవితాన్ని పొడిగిస్తూ ఉంటుంది. శిక్షపడిన తర్వాత ఎస్కార్ట్ కొరత వల్ల, కాస్త మెరుగైన పరిస్థితులున్న మహిళా జైలుకు తరలింపబడకుండానే శిక్షా కాలాన్ని స్థానిక జైలులోనే పూర్తి చేస్తారు. మహిళా సంక్షేమ గృహాలకు, జైళ్ళకు మధ్య ఎలాంటి సమన్వయం లేకపోవడం వల్ల జైలు నుండి విడుదలయ్యే ఒంటరి మహిళలు, అనాధలు విడుదలైన తర్వాత కూడా దిక్కుతోచని స్థితిని ఎదుర్కొంటున్నారు.

**మొత్తం జైళ్ళ వ్యవస్థను మగ ఖైదీలను దృష్టిలో పెట్టుకుని ఏర్పాటుచేయడం వల్లనే మహిళలు ఇన్ని సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఉదాహరణకు, చిన్న చిన్న నేరాలకు పాల్పడిన మహిళలు కూడా పురుషులకు ఉద్దేశించిన అత్యంత కట్టుదిట్టమైన రక్షణ వలయంలో శిక్ష అనుభవించవలసి వస్తోంది. ఇది మహిళల కోసం వచ్చే పిల్లలకు, బంధువులకు ఎన్నో సమస్యలను తెచ్చి పెడుతుంది.**

మొత్తం జైళ్ళ వ్యవస్థను మగ ఖైదీలను దృష్టిలో పెట్టుకుని ఏర్పాటుచేయడం వల్లనే మహిళలు ఇన్ని సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఉదాహరణకు, చిన్న చిన్న నేరాలకు పాల్పడిన మహిళలు కూడా పురుషులకు ఉద్దేశించిన అత్యంత కట్టుదిట్టమైన రక్షణ వలయంలో శిక్ష అనుభవించవలసి వస్తోంది. ఇది మహిళల కోసం వచ్చే పిల్లలకు, బంధువులకు ఎన్నో సమస్యలను తెచ్చి పెడుతుంది. జైలు సిబ్బందికి ఇచ్చే శిక్షణలో మహిళల ప్రత్యేకమైన సమస్యలపై దృష్టి ఎక్కువ ఉండదు. విద్యా, పరి



శ్రమలలో ఇచ్చే శిక్షణ కార్యక్రమాలు మహిళలను దృష్టిలో పెట్టుకుని రూపొందించడం లేదు. స్త్రీలకున్న ప్రత్యేక ఆరోగ్య సమస్యలకు ఎటువంటి ప్రాధాన్యం ఇవ్వడం లేదు. ఉదాహరణకు ఇంగ్లండులో సాధారణ జనాభాలో ఒక శాతం పురుషులు, సున్నా శాతం మహిళలు మానసిక సమస్యలకు గురౌతారట. జైళ్ళలోని పురుషులలో 44 శాతం మందికి, 62 శాతం మహిళలకు వైద్య సౌకర్యం అవసరమైన మానసిక సమస్యలు ఉంటున్నాయట. మన దేశంలో అలాంటి గణాంకాలేవీ అందుబాటులో లేవు కనుక చెప్పలేం కాని ఇక్కడా అదే పరిస్థితి ఉండొచ్చు. మన రాష్ట్ర జైళ్ళలో మానసిక వైద్య నిపుణుల నియామకాలే లేవు. మరొక విషయమేమిటంటే జైళ్ళలో పనిచేసే మహిళా సిబ్బందికి ఎటువంటి ప్రాముఖ్యత ఇవ్వకపోవడంతో, జైళ్ళ విధాన నిర్ణయాలలో వాళ్ళ అభిప్రాయాలకు, అనుభవానికి ఎటువంటి విలువ కాని, చోటు కాని ఉండడం లేదు.

✪

విద్యుత్ నియంత్రణ మండలి తూతూ మంత్రంగా జరిపే

# విచారణల్లో పాల్గొనడం అవసరమా?

– గొర్రెపాటి నరేంద్రనాథ్ ★



**వి**ద్యుత్ రంగంలో పెట్టే సుమారు పదివేల కోట్ల రూపాయలు పైబడి పెట్టుబడులు, ఖర్చులు గురించి పరిశీలనకు విద్యుత్ నియంత్రణ మండలి వారు (ఆం.ప్ర. విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్) ఏటా జనవరి – ఫిబ్రవరిలో బహిరంగ విచారణ జరుపుతారు. రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తి, సరఫరా, పంపిణీలకు అనుమతులు ఇవ్వడం, వాటి మధ్య సమన్వయం, నాణ్యత ఉండేటట్లు చూడటం, ఉత్పత్తిదారులు, పంపిణీదారులు, వినియోగదారుల మధ్య సమతౌల్యత, విద్యుత్ రంగం ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించడం కమిషన్ వారి బాధ్యత. విద్యుత్ చట్టం, 2005 నిర్దేశించిన ప్రకారం నిర్ణీత గడువులో రాయితీలను (సబ్సిడీలను) వినియోగదారులకు తొలగించడం, అన్ని రకాల వినియోగానికి (ముఖ్యంగా వ్యవసాయ వినియో గానికి) మీటర్లు బిగించేటట్లు చూడటం కూడా మండలి బాధ్యతే. ఈ ప్రక్రియలో భాగంగా ప్రపంచ బ్యాంకు సలహా (సూచనలు) మేరకు పారదర్శకత, జవాబుదారీతనం పేరుతో విద్యుత్ సరఫరా చేసే ట్రాన్స్కో మరియు పంపిణీ చేసే

★ మానవహక్కుల కార్యకర్త, రైతు



నాలుగు డిస్కాముల (తూర్పు, మధ్య, దక్షిణ, ఉత్తర) వార్షిక పద్దులు, రాబోవు సంవత్సర ఆదాయ, ఖర్చుల అంచనా, విద్యుత్ ఛార్జీలపై ప్రతి సంవత్సరం బహిరంగ విచారణలు గత 8 సంవత్స రాలుగా జరుపుతున్నారు.

ప్రపంచ బ్యాంకు సూచించినట్లుగా ఏటా రాష్ట్రంలోని నాలుగు డిస్కాములు, ట్రాన్స్కో వారు తమ వార్షిక పద్దులు, ప్రతిపాదిత ఛార్జీలపై బహిరంగ విచారణ జరుపుతున్నారు. ఏమి చేయాలో ముందే నిర్ణయించుకున్నప్పుడు అలంకార ప్రాయంగా జరిగే బహిరంగ విచారణలెందుకు? అందులో ప్రజా సంఘాలు, వినియోగదారులు పాల్గొని ఏమి సాధించగలం? ఇది అందరూ వేసుకోవాల్సిన ప్రశ్నే.

24 లక్షలకు పైగా నున్న వ్యవసాయ విద్యుత్ సర్వీసులు 29% విద్యుత్ సరఫరాను వాడుతున్నాయని అధికారుల అంచనా. మరో 20% గృహ వినియోగదారులు (వీరిలో రెండు భాగాలు నెలకు 50 యూనిట్లలోపే వాడు తుంటారు). మరో 28% వినియోగం పారిశ్రామిక రంగంలో ఉంటున్నది. సరళీకృత ఆర్థిక సిద్ధాంతాలకు లోబడి విద్యుత్ రంగంలో "సంస్కరణ"ల పేరుతో వ్యవసాయ, గృహ వినియోగ దారులకు ఇస్తున్న రాయితీలను వాటి ఆర్థిక, సాంఘిక కారణాల జోలికి పోకుండా నిర్దిష్ట కాలంలో (3 నుండి 5 సంవత్సరాలలోగా) పూర్తిగా ఎత్తివేయాలని పాలకులు నిర్ణయించి అందుకు ప్రత్యేక చట్టం కూడా చేశారు! (విద్యుత్ చట్టం, 2005). ఈ చట్టం పరిధిలోనే విద్యుత్ నియంత్రణ మండలి పనిచేయాలి. ఇందులో భాగంగానే విద్యుత్ రంగం ఉత్పత్తి, సరఫరా, పంపిణీలను సాధ్యమైన మేరకు ప్రైవేటీకరించేందుకు మండలి కృషి చేయాలి. ఈ సంస్కరణలకు సాధికారికత ఇవ్వడానికే ప్రపంచ బ్యాంకు సూచించినట్లుగా ఏటా రాష్ట్రంలోని నాలుగు డిస్కాములు, ట్రాన్స్కో వారు తమ వార్షిక పద్దులు, ప్రతిపాదిత ఛార్జీలపై బహిరంగ విచారణ జరుపుతున్నారు. ఏమి చేయాలో ముందే నిర్ణయించుకున్నప్పుడు అలంకార ప్రాయంగా జరిగే బహిరంగ విచారణ లెందుకు? అందులో ప్రజా సంఘాలు, వినియోగదారులు పాల్గొని ఏమి సాధించగలం? ఇది అందరూ వేసుకోవాల్సిన ప్రశ్నే.

ప్రతి ప్రజా రంగ సంస్థ కార్యకలాపాల్లో పారదర్శకత, జవాబుదారీతనం ఉండాలనేది ప్రజాస్వామ్యంలో ఒక ప్రాథమిక సూత్రం. గ్రామ పంచాయితీ నుండి, రాష్ట్ర అసెంబ్లీ, కేంద్ర పార్లమెంటు వరకు, వారి వివిధ పరిపాలనా శాఖల వార్షిక బడ్జెటు ప్రతిపాదనలపై కేవలం ఎన్ని కైన ప్రతినిధులే కాకుండా ప్రజల్లోనూ వీటిపై ముందుగానే విస్తృతంగా చర్చలు జరగాలి. ఆ తరువాత అసెంబ్లీలోనూ, పార్లమెంటులోనూ చర్చించి ఆమోదించటమో, సంస్కరించటమో, తిరస్క రించటమో జరగాలి. ఇది ఆరోగ్యకరమైన ప్రజాస్వామ్య ప్రక్రియ. విద్యుత్ నియంత్రణ మండలి బహిరంగ విచారణలను కూడా మనం ఈ ప్రక్రియలోనే చూడాలి.

అన్ని రంగాల్లో లాగానే విద్యుత్ రంగంలో కూడా అనేక అవకతవకలు జరుగుతున్నాయి. ఉదాహరణకు

1) ఉత్పత్తిలో కావాలనే రాష్ట్ర సంస్థ అయిన జెన్కో యూనిట్లపై సవతి తల్లి ప్రేమ చూపించడం, ప్రైవేటు ఉత్పత్తిదారులకు మాత్రం ఉత్పాదనకు ప్రోత్సాహక రాయితీలు ఇవ్వడం, తప్పుదు

సమాచారంతో వారు అధికంగా డబ్బులు ట్రాన్సుకో నుండి రాబట్టడం, రావలసిన డబ్బులు చెల్లించమని ట్రాన్సుకో కోరగా కోర్టుకు ఈడ్చి జాప్యం చేయడం, సాంప్రదాయేతర విద్యుత్ ఉత్పత్తి పేరుతో అధికంగా రాయితీలు అక్రమ మార్గాల్లో పొందడం ద్వారా ఏటా సుమారు 400 నుండి 600 కోట్ల లెక్కన గత 10 సంవత్సరాల్లో సుమారు 5 వేల నుండి 6 వేల కోట్ల ప్రజాధనం ఈ విధంగా దుర్వినియోగం చేశారు.

2) కొన్ని వేల కోట్ల ప్రజాధనంతో ఏర్పాటుచేసిన సరఫరా, పంపిణీ వ్యవస్థను (కరెంటు లైన్లు, సబ్ స్టేషన్లు) నామమాత్రపు చార్జీలకే (వీలింగు చార్జీలు) ప్రైవేటు ఉత్పత్తిదారులు వాడుకుని వినియోగదారులకు డిస్కాముల కన్నా తక్కువ ధరకు పరిశ్రమలకు అమ్ముకునేందుకు వీలు కలిగించటం. తద్వారా డిస్కాముల వద్ద క్రమేపి రాయితీలతో విద్యుత్ పంపిణీ అవుతున్న వ్యవసాయ, గృహ వినియోగదారుల వంటి వారికే పరిమితమై నష్టాల ఊబిలో కూరుకుపోయే ప్రమాదం, అవసరమైన సిబ్బందిని తీసుకోకుండా బిల్లు కలెక్షన్లు, సబ్‌స్టేషను నిర్వహణా బాధ్యతలను ప్రైవేటీకరించడం.

3) వివిధ రకాల వినియోగదారులు దొంగతనంగా వాడుతున్న విద్యుత్ చోరీనంతా మీటర్లు లేని వ్యవసాయ వినియోగంగా చూపించడం. ఏటా పంపిణీ నష్టాలు (సాంకేతిక, దొంగ తనం) తగ్గిపోతున్నట్లు చూపించటం, పొదుపు చర్యలు కేవలం రైతులకే వర్తించేటట్లు ఆంక్షలు విధించడం, విద్యుత్ ప్రమాదాల్లో ఏటా చనిపోతున్న వారికి కేవలం 20 వేలు చొప్పున నష్ట పరిహారం ఇవ్వటం (వీరిలో ఆధారంగా అధికంగా లేబరు, రైతులు ఉండటం.)

ఇటువంటి సమస్యల గురించి ప్రజలు/ వినియోగదారులు తెలుసుకోవటం ముఖ్యం. (సమా చార హక్కు, పారదర్శకత.) తెలుసుకున్న తరువాత వాటి గురించి ప్రశ్నించటం మన బాధ్యత. ఆ ప్రశ్నలకు సంబంధిత అధికారులు జవాబు చెప్పాలి. (జవాబుదారీ తనం.) ఈ ప్రక్రియ అంతా బహిరంగ విచారణల ద్వారా జరగాలి. అప్పుడు పత్రికల్లో, టి.వి.లలో ప్రచారమౌతుంది. ఈ విధంగా విద్యుత్‌రంగం గురించి ప్రజల్లో అవగాహన పెరుగుతుంది. విద్యుత్ రంగ సిబ్బంది/ నిర్వాహకులు, పాలకులలో తమ చర్యలను ప్రజలు గమనిస్తున్నారని, అడిగే వారు ఉంటారన్న భయం వారిని వెంటాడుతూ ఉంటుంది. ఇటువంటి సంప్రదాయం అన్ని రంగాల్లో, అన్ని సంస్థల్లో బలపడాలి. అప్పుడే, ఆ మేరకే ప్రజాస్వామ్యం అర్థవంతంగా ఉంటుంది. ఈ రోజుల్లో రాష్ట్ర వార్షిక బడ్జెటు 80 వేల కోట్లు దాటినా మనం టి.వి.లలో చూస్తున్నదేమిటి? అధికార పక్షాన్ని ఇరుకున పెట్టేందుకు ప్రతిపక్షాలు, ప్రతిపక్షాల అడ్డును తొలగించుకునేందుకు పాలక పక్షం ఎత్తుకు పైఎత్తులు వేయటం తప్పితే కీలకమైన వివిధ ప్రజా సమస్యలపై సమగ్రమైన చర్చలు జరగటం లేదు.

విద్యుత్ ఛార్జీలు, పద్దులపై వివిధ డిస్కాములు, ట్రాన్సుకోల బహిరంగ విచారణలు దాదాపు ఇదే తంతులో జరుగుతున్నాయి. అయితే గత 8 సంవత్సరాలుగా ఈ బహిరంగ విచారణల్లో ప్రజలు, ప్రజాసంఘాలు పాల్గొనటం వల్ల కొంత మేలు జరిగింది.

1) విద్యుత్‌రంగ సమస్యలపై, ఉత్పత్తి నుండి వినియోగం వరకు రాష్ట్ర, దేశ, అంతర్జాతీయ పరిస్థితుల పట్ల ప్రజలు, ప్రజాసంఘాల అవగాహన పెరిగింది. ముఖ్యంగా ఉత్పత్తిలోనున్న పర్యావరణ, నిర్వాసిత సమస్యలు, విద్యుత్ అసలు ఖరీదు, సబ్సిడీలపై, పొదుపు చర్యలపై అవగాహన.



2) ప్రపంచ బ్యాంకు ప్రతినిధులను కూర్చోపెట్టుకొని బహిరంగ విచారణలో ముందుగా పేరిచ్చిన వారే పాల్గొనేటట్లు పరిమితం చేసిన మొదటి విచారణ (1999) నుండి ప్రజలంతా స్వేచ్ఛగా వచ్చి కూర్చొని విని, అవసరమైతే పాల్గొని, వచ్చిన వారికి మధ్యాహ్న భోజన ఏర్పాట్లు చేసే వరకు విస్తరించింది.

3) ఇంగ్లీషులోనే జరుగుతున్న బహిరంగ విచారణ ఇప్పుడు తెలుగులో జరపటం ముఖ్యంగా డిస్కాముల వాదనలు, ప్రతివాదనలు, పద్దులు, ఛార్జీల వివరాలు, టారిఫ్ (ఛార్జీల) ఆర్డరు తెలుగులో కూడా ప్రచురించటం ప్రజావిజయమే.

4) బహిరంగ విచారణలో పూర్తిస్థాయిలో పాల్గొనేందుకు ముందుగానే రాత పూర్వకంగా ప్రజలు తమ అభిప్రాయాలు తెలుపుతూ ఇచ్చే నివేదిక మొదట్లో నోటరీ చేత ధృవీకరించి ఆరు కాపీలు పంపించమనే వారు. దీన్ని సరళీకృతం చేసి నోటరీ ధృవీకరణ తొలగించి, కేవలం, రెండు కాపీలే పంపితే చాలునని మండలి దిగి రావటం కూడా ప్రజా విజయమే.

5) విద్యుత్ ఉత్పత్తి చేసే ప్రైవేటు ఉత్పత్తిదార్లు పాల్పడుతున్న అనేక అవకతవకలను, వారికిస్తున్న అనవసరపు రాయితీలను ఎండగట్టడంలో చాలావరకు ప్రజా సంఘాలు సఫలీకృతమ య్యాయి. (ఇవన్నీ ఇప్పుడు హైకోర్టు, సుప్రీం కోర్టులలో 'స్టే'ల ద్వారా నానుతున్నాయి). ముఖ్యంగా బి.పి.యల్. కంపెనీ అత్యధిక ధరకు రామగుండం వద్ద నెలకొల్పదలచిన విద్యుత్ ఉత్పత్తి కేంద్రానికి నియంత్రణ మండలి అనుమతి నిరాకరించడంలోనూ, సాంప్రదాయేతర ఉత్పత్తిదారులకు చెల్లిస్తున్న అధిక ధరల నియంత్రణలోనూ ప్రజాసంఘాల వాదనతో నియం త్రణ మండలి అంగీకరించింది.

6) ప్రజా ఉద్యమాలకు భయపడి గత 7 సంవత్సరాలుగా విద్యుత్ ఛార్జీలను రైతులకు, గృహ వినియోగదారులకు పెంచేందుకు (రాయితీలు తీసేసేందుకు) విద్యుత్ చట్టం, 2005 ఆదే శించినా ప్రభుత్వం వారు కానీ, డిస్కాములు కానీ, నియంత్రణ మండలి కానీ సాహసించ లేదు.

అయినా అనేక 'కీలక సమస్యలపై ప్రజాసంఘాలు, వినియోగదారుల వాదనలు ఏమీ చేయ లేక పోయాయి. ఉదాహరణకు -

1) గ్యాస్ లభ్యత ఉండదని తెలిసి కూడా "పెద్దల" వత్తిడికి తలవంచి నియంత్రణ మండలి 1999 మెగావాట్లను ఉత్పత్తి చేసే నాలుగు కొత్త ప్రైవేటు గ్యాసు ఆధారిత విద్యుత్ ప్రాజెక్టు లకు అనుమతిచ్చింది. ఇప్పుడు గ్యాస్ సరఫరా 2009 వరకు ఉండదని స్పష్టం కావడంతో ఒప్పందం ప్రకారం వారికి స్థిర ఛార్జీల కింద ఏటా 1020 కోట్లు (2007 నుండి) చెల్లించడమో లేదా కాళ్ళావేళ్ళాపడి అనేక ఇతర రకాల రాయితీలు ఇచ్చేందుకు సిద్ధపడటమో అన్న స్థితికి ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం నెట్టబడింది.

2) గ్యాస్ సరఫరా చేస్తామని చెప్పిన కేంద్ర ప్రభుత్వ సంస్థలైన గ్యాస్ ఆథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్, ఒ.ఎన్.జి.సి, కేంద్ర ఇంధన శాఖ వారు ఇప్పుడు నడుస్తున్న 996 మెగావాట్ల నాలుగు ప్రైవేటు ప్రాజెక్టులకు (జి.వి.కె, స్పెక్ట్రమ్, లాంకొ, బి.ఎస్.ఇ.ఎస్.) కేవలం 60% మాత్రమే గ్యాసు సరఫరా చేయటం, ఆ పైన అధిక ధర చెల్లించనిదే మా వల్ల కాదని

చేతులెత్తేయటం (ప్రభుత్వమే 3 రెట్లు గ్యాస్ ధర పెంచితే ప్రైవేటు సంస్థ అయిన రిలయన్స్ గ్యాసు ధర పెంచేందుకు మహా కుట్ర ఇది). అవగాహన ఒప్పందంలో సరఫరా అనుకున్న స్థాయికి చేయనందుకు శిక్షా చర్యల గురించి అధికారులు, పాలకులు అప్పుడే గుర్తించకపోవడంతో కేవలం ప్రేక్షక పాత్ర వహిస్తున్నాము.

3) వ్యవసాయానికి "ఉచిత" సరఫరా హామీ ఇచ్చి పొదుపు చర్యల పేరున అనేక (అందులో కొన్ని అర్థరహితమైన) ఆంక్షలు రైతులపై మోపడం, ఇదేమిటని రైతు సంఘాలు విశ్లేషించి, ప్రశ్నించి సూచనలు చేసినా ఇది పాలసీకి సంబంధించిన విషయమని తానేమీ చేయలేనని కమిషన్ వారు చేతులు దులుపుకొని పక్కకు తప్పుకున్నారు.

4) రాను రాను రాజుగారి గుర్రం గాడిదైనట్లుగా పద్దులు, నిర్వాహణ వివరాలు, సమాచారం బాగా కుదించి వేశారు డిస్కాముల వారు (2007-08 సంవత్సరానికి). అలాగే ట్రాన్సుకో పరిధిని కేవలం సరఫరాకు కుదించి వేసి మొత్తం రాష్ట్రంలోని విద్యుత్ సమస్యలపై సమగ్రంగా చర్చించేందుకు వేదిక లేకుండా చేశారు.

అయినా కూడా విద్యుత్ ఛార్జీలు - పద్దులపై బహిరంగ విచారణను తూతూ మంత్రంగా చేయాలనే పాలకుల ఉద్దేశాలను అడ్డుకోవడంలో, విచారణల్లో అర్థవంతంగా పాల్గొని (ఇందులో ధర్నాలు చేయడం, ఇతర రకాల అలజడి చేయటం కూడా ఒక భాగమే), అడగవలసిన ప్రశ్నలు అడిగి, జవాబులు రాబట్టడం, పాలకుల్లో తమ చర్యలను ప్రశ్నించే వారు ఉంటారన్న భయం కలిగించటం కోసమైనా వీటిల్లో పాల్గొనడం అవసరం. కేవలం విద్యుత్ రంగంలోనే కాదు, అన్ని రంగాల్లోనూ, అన్ని స్థాయిల్లోనూ బహిరంగ విచారణలు జరగాలని పాలకులపై వత్తిడి తెస్తూ, సాధ్యమైనన్ని బహిరంగ విచారణల్లో అర్థవంతంగా పాల్గొనటం వల్ల ప్రజాస్వామ్యం మరో అడుగు ముందుకు వేస్తుందని నా నమ్మకం.

✪



# నిర్వాసితాభివృద్ధి

– బుర్ర రాములు★

**భా**రత ఆర్థిక వ్యవస్థ ప్రపంచీకరణలో భాగమైన తరువాత సామాజికార్థిక పరిణామాలలో కొత్త పోకడలు చోటుచేసుకుంటున్నాయి. సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ అనే భావనల నిజమైన ఆర్థిక ప్రక్రియ వేగవంతం కావడంతో భారత రాజ్యాంగ లక్ష్యాలకు సమాంతరంగా ఆర్థిక అవ్యవస్థ ఆవిష్కరించబడింది. ఫలితంగా దేశ పాలనా లక్ష్యాలుగా ఉండవలసిన సంక్షేమం, సమానత్వం, అభివృద్ధి అనేవి కేవలం నినాదాలుగా మిగిలిపోయినవి. రాజ్యాంగ లక్ష్యాలకు, రాజకీయ పార్టీల ప్రకటిత విధానాలకు, ఆర్థిక వ్యవస్థ పోకడలకు పోలికలు లేవు. ఏ రాజకీయ కూటమి అధికారంలోకి వచ్చినా ప్రపంచ బ్యాంకు అజెండానే అమలు చేస్తున్నది.



రాజ్యాంగ లక్ష్యాలు ప్రస్తావించడానికే తప్ప ఆచరించడానికి కాదని ఈ దశాబ్ద కాలంలో వచ్చిన విభిన్న ప్రభుత్వాల ఆచరణ నిరూపించింది. ప్రభుత్వాలు రాజ్యాంగ లక్ష్యాల పట్ల ఉదాసీనంగా ఉండడం వల్ల ఆర్థిక వ్యవస్థ క్రమంగా రూపాంతరం చెంది ప్రజలను సంక్షేమ హక్కుల నుండి, భూముల నుండి, ఇతర ప్రకృతి వనరుల నుండి నిర్వాసితులను చేస్తున్నది. ఈ ప్రక్రియ సమాజంలో అనూహ్య అంతరాలను ఆవిష్కరిస్తున్నది.

★ మానవహక్కుల కార్యకర్త. కాకతీయ యూనివర్సిటీలో అధ్యాపకుడు.

యాభై ఏళ్ళ క్రితం ఎంతో సమయ స్ఫూర్తితో ఆవిష్కరించుకున్న మిశ్రమ ఆర్థిక వ్యవస్థను క్రమంగా క్షీణింపజేయడం వల్ల ఉద్యోగాల నుండి, ఉద్యోగ అవకాశాల నుండి ప్రజలు 'నిర్వాసితులై' కొత్త ఆర్థిక అంతరాయాలు ఉనికిలోకి వచ్చాయి. అభివృద్ధి చెందుతున్న దేశాల ఆర్థిక వ్యవస్థలు విస్తరించి, పరిపక్వమైన కొలదీ ధనవంతుల సంఖ్య వేగంగా పెరుగుతున్నదని ఈ మధ్య గార్డియన్ పత్రికలో వచ్చిన ఒక వ్యాసం తెలియజేస్తున్నది. కేవలం ఒక్క శాతంగా ఉన్న ధనవంతులు ప్రపంచ సంపదలో 24 శాతంను నియంత్రిస్తున్నారని ఒక బ్యాంకు నిర్వహించిన అధ్యయనం తెలిపింది. అభివృద్ధి చెందుతున్న దేశాలలో ఇండియా ఒకటని ఈ సందర్భంగా గుర్తుంచుకోవాలి. ఈ దేశాలలో అత్యధిక నికర ఆదాయం ఉన్న వ్యక్తుల (High Net Worth Individuals - HNWI) సంఖ్య పెరిగింది, పెరుగుతుంది, పెరుగుతూనే ఉంటుంది. ఆర్థిక అసమానతలు పాతుకుపోయిన మన దేశంలో ఈ నూతన వర్గం మరింత వ్యత్యాసాలను విస్తరింపజేస్తుంది. ప్రజల రాజ్యాంగ రక్షణలు నిస్సత్తువలోకి జారిపోతే తప్ప ఈ వ్యత్యాసాల విస్తరణ సాధ్యం కాదు. ఆ క్రమం ఈనాడు అమలవుతున్నది. అట్టడుగున ఉన్న ప్రజలకు రక్షణగా ఉన్న రాజ్యాంగ సూత్రాలు అచేతనంగా అయిపోవడం వల్ల ఆ ప్రజలు రెండు రకాలుగా నిర్వాసితులవుతున్నారు. ఒకటి రాజ్యాంగ మౌలిక విలువలకు దూరంగా నెట్టివేయబడడం, రెండవది వారి స్వాధీనంలో ఉన్న వనరులు బహుళజాతి కంపెనీల, దేశీయ పెట్టుబడిదారుల నియంత్రణలోకి వెళ్ళడం. ఈ రెండింటిలో ఏది కారణం, ఏది ఫలితం అని తేల్చి చెప్పడం ప్రస్తుత సందర్భం కాదు. కానీ ఏక సమయంలో రెండు రకాలుగానూ ప్రజలు నిర్వాసితులవుతున్నారనేది ఈ పరిశీలన ఫలితం.

రాజ్యాంగం ఆదివాసులకు అయిదవ షెడ్యూలులోనూ, ఆరవ షెడ్యూలులోనూ రక్షణ కల్పించింది. ఆదివాసులు నివసిస్తున్న ప్రాంతంలోని భూమిని ఇతర వనరులను స్వాధీనం చేసుకునే ప్రభుత్వ అధికారం పైన ఆంక్షలు పెట్టింది. పార్లమెంటు, అసెంబ్లీలు చేసే చట్టాల అమలు విషయంలో గవర్నర్‌కు విచక్షణ కల్పించింది. రాష్ట్రపతి పర్యవేక్షణకు చోటు కల్పించింది. అయినప్పటికీ ఆదివాసులు దురాక్రమణదారులుగా నిర్ధారించబడుతున్నారు, నిరాశ్రయులుగా మారుతున్నారు. అంతేకాదు రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 15 (4), 16 (4), 16 (4ఎ), 46, 243డి, 243 టి, 244, 335 ప్రకారం ఆదివాసుల ప్రయోజనాలకు చట్టాల రూపకల్పనలో, చట్టాల అమలులో ప్రాముఖ్యం ఇచ్చాయి. అయినప్పటికీ ఆదివాసీ ప్రాంతాలలో సహితం ప్రపంచ బ్యాంకు ఆదేశాలకు ప్రభుత్వాలు మోకరిల్లినవి. ఆదివాసుల భూపరాయీకరణను నిరోధించే చట్టాలు స్వాతంత్ర్యం రాకముందే దేశంలోని వివిధ ప్రాంతాలలో ఉనికిలోకి వచ్చాయి. ఆ తరువాత మన రాష్ట్రంలో వచ్చిన 1/70 సవరణ లాంటి మెరుగైన సవరణలనూ వివిధ రాష్ట్రాలు చేశాయి. అయినప్పటికీ సగానికి పైగా భూముల పరాయీకరించబడే ఉన్నవి. ఈ ఆదేశాలు, చట్టాలు, అనుభవాలను దృష్టిలో పెట్టుకునే స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్ళలోనే ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ఆదివాసుల హక్కుల రక్షణకు ఆచరణ బద్ధమైన పంచశీల సూత్రాలను ప్రకటించాడు గానీ, అది ఆయన పాలనలోనే మూతపడింది.

**అట్టడుగున ఉన్న ప్రజలకు రక్షణగా ఉన్న రాజ్యాంగ సూత్రాలు అచేతనంగా అయిపోవడం వల్ల ఆ ప్రజలు రెండు రకాలుగా నిర్వాసితులవుతున్నారు. ఒకటి రాజ్యాంగ మౌలిక విలువలకు దూరంగా నెట్టివేయబడడం, రెండవది వారి స్వాధీనంలో ఉన్న వనరులు బహుళజాతి కంపెనీల, దేశీయ పెట్టుబడిదారుల నియంత్రణలోకి వెళ్ళడం.**



ఆ పంచశీలలో ప్రభుత్వాలు ఏమి చేయాలో, ఏమి చేయకూడదో తెలియచేయడమే కాక, ఎలా చేయాలో, ఆదివాసీ జీవన ప్రమాణాలను ఎలా పోల్చాలో కూడా చెప్పారు.

**ఒకవైపు కొత్త సంపన్న వర్గం ఆవిష్కరణ జరిగి ప్రైవేటు రంగంలో అనూహ్య జీతభత్యాలతో ఉద్యోగాలు పొందే పదుల సంఖ్యలోని ఆధునిక విద్యావంతులు ఇంకొకవైపు నిర్వాసితులుగా, అమానవీయతకు నిదర్శనంగా లక్షల సంఖ్యలోని ఆదివాసులు నిలిచారు.**

1. ఆదివాసులు తమ స్వంత జ్ఞానం, సంస్కృతి, సంప్రదాయాల మార్గంలో అభివృద్ధి చెందడానికి తోడ్పడాలి. వారిపై ఏ విధమైన నిర్ణయాల ఒత్తిళ్ళు విధించరాదు.
2. భూమిపై, అడవిపై ఆదివాసుల హక్కును గుర్తించాలి, గౌరవించాలి.
3. ఆదివాసులు తమను తామే పరిపాలించుకునే విధంగా వారిలోనే కొన్ని జట్లను అభివృద్ధి పరచాలి.
4. ఆదివాసీ ప్రాంతాలలో వారి సంప్రదాయాలకు భిన్నమైన పథకాలు, కార్యక్రమాలు అమలు చేయరాదు. వారి జీవన విధానం పునాదిగానే ప్రభుత్వ యంత్రాంగం పని చేయాలి.
5. ఆదివాసీ ప్రాంతాల అభివృద్ధిని, వారి జీవన ప్రమాణాలను, వారిపై వెచ్చించిన ద్రవ్యంతోనో, పథకాలతోనో అంచనా వేయకుండా, వారి మానవీయ లక్షణాల గుణాత్మక మార్పులతో పోల్చుకోవాలి.

ఇంత స్పష్టంగా స్వాతంత్ర్యం వచ్చిన తొలి దినాలలోనే విధాన ప్రకటన జరిగినప్పటికీ, రాజ్యాంగ రక్షణ, చట్టాలు ఉన్నప్పటికీ, ఆదివాసులను అడవితల్లి పొత్తిళ్ళ నుండి దూరంచేసి, అమానవీయతకు నిదర్శనంగా నిరాశ్రయులను, అంతరాలను సృష్టిస్తున్నవి ప్రభుత్వ విధానాలు.

ప్రపంచీకరణకు శ్రీకారం చుట్టిన కాలం నుండే ఆదివాసీ ప్రాంతాలలో ఉన్న గనులు, భూములు, జలవనరులపై బహుళజాతి కంపెనీల ప్రయోజనం కోసం ప్రాజెక్టులు, పరిశ్రమలు కట్టుకోవడానికి, గనులు తవ్వుకోవడానికి పరిమితులు లేని ఉత్సాహంతో ప్రభుత్వాలు సేవలందిస్తున్నవి. దీనిని ఆదివాసులు తీవ్రంగా వ్యతిరేకించినప్పటికీ వారి ప్రాణాలు తీసైనా నయా ఉదారవాద విధానాలను అమలుచేయ పూనుకుంటున్నారు. దాని ఫలితంగా ఒకవైపు కొత్త సంపన్న వర్గం ఆవిష్కరణ జరిగి ప్రైవేటు రంగంలో అనూహ్య జీతభత్యాలతో ఉద్యోగాలు పొందే పదుల సంఖ్యలోని ఆధునిక విద్యావంతులు ఇంకొకవైపు నిర్వాసితులుగా, అమానవీయతకు నిదర్శనంగా లక్షల సంఖ్యలోని ఆదివాసులు నిలిచారు.

పోలవరం ప్రాజెక్టు ముంపు గ్రామాలను, ఒరిస్సా, ఛత్తీస్‌గడ్ రాష్ట్రాలలోని ఆదివాసీ ప్రాంతాలను పరిశీలించి అక్కడి పరిణామాలను విశ్లేషిస్తే ఆధునిక అభివృద్ధి యొక్క క్రూరముఖం ఆవిష్కరించబడుతుంది. ఈ క్రూరత్వాన్ని ఎత్తిచూపే, ప్రశ్నించే, ఆదివాసీ జీవితాలే దీనికి సాక్ష్యం.

ప్రపంచీకరణలో మన దేశం భాగమైన తొలి సంవత్సరాలలోనే బహుళజాతి కంపెనీలు గనుల పైన దృష్టిని చొరవగా ప్రసరింపచేసినవి. వివిధ రాష్ట్ర ప్రభుత్వాలతో అవగాహన ఒప్పందాలు చేసుకున్నవి. అందుకొక నిదర్శనం ఒరిస్సా ప్రభుత్వం ఉత్కళ్ అల్యూమినా ఇంటర్నేషనల్ లిమిటెడ్

(యుఎఐఎల్) అనే కంపెనీతో చేసుకున్న ఒప్పందం – ఈ ఒప్పందం ఫలితంగా రాయగడ్ జిల్లాలోని కాశీపూర్ అడవులలో గల గనుల నుండి తవ్వి తీసే అల్యూమినా నూటికి నూరుశాతం ఎగుమతి కోసమే కావడం గమనార్హం. 1993లో జరిగిన ఈ ఒప్పందం ఫలితంగా బాక్సైట్ ఖనిజాన్ని కలిగి ఉన్న బాఫ్లిమావి గుట్టలను తవ్వి 195 మిలియన్ టన్నులు 23 – 25 సంవత్స రాలలో తరలిస్తారు. ఈ ముడి పదార్థాన్ని అక్కడికి 25 కిలోల దూరాన ఉన్న కుచియాపదర్ గ్రామ పంచాయతీలోని దొరగుడిలో నెలకొల్పబోయే రిఫైనరీకి కన్వేయర్ బెల్టు ద్వారా తీసుకెళ్తారు. 23 లేక 25 ఏళ్ళ తరువాత గుట్టలకు బదులు బొందలు ఉంటవి. చుట్టూ 25 కిలోల మేర వాతావరణ కాలుష్యం చుట్టుకుంటుంది. బాక్సైట్ కలిగి ఉన్న గుట్టల నుండి కిందికి పోయే నీటి ప్రవాహం ఈ ప్రాంతానికే కాక విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు కూడా ప్రస్తుతం సాగునీరు అందిస్తున్నది. అంటే ఈ గుట్టలు తవ్వడం వల్ల ఆదివాసీ ప్రాంతాలలోనే కాక బయట కూడా వ్యవసాయం దెబ్బ తింటుంది. బాక్సైట్ కోసం, రిఫైనరీ కోసం ఆదివాసులకు చెందిన 3,000 ఎకరాల సాగుభూమి బీడుపడుతుంది. 60 వేల ఆదివాసీ కుటుంబాల జీవితం ఛిద్రమవుతుంది. కేవలం ఇక్కడొక చోటేకాక దక్షిణ ఒరిస్సాలో ఇంకొక అయిదు చోట్ల బాక్సైట్ ప్రాజెక్టులు ప్రారంభించే ప్రయత్నాలు చురుగ్గా జరుగుచున్నవి.

ఇంకొక రకమైన నిర్వాసిత క్రమం ఛత్తీస్‌గడ్‌లో చూడగలం. అక్కడ రెండు దశాబ్దాల క్రితం నక్సలైట్ల ఉద్యమం మొదలైంది. మొదట్లో ప్రభుత్వ యంత్రాంగం యొక్క గిరిజన వ్యతిరేక విధానా లను, ఆచరణను అరికట్టి స్థిరపడ్డారు. ఆ తరువాత ఆదివాసీ సమాజంలో వచ్చిన ఆర్థిక పరి ణామాలు నక్సలైట్ ఉద్యమాన్ని శత్రువుగా భావించే పరిణామం చోటుచేసుకుంది. ఇది క్రమంగా నక్సలైటు చర్యలకు వ్యతిరేకంగా మొదలై నక్సలైట్ ఉద్యమ వ్యతిరేక 'శాంతియాత్ర'గా రూపుదిద్దు కుంది. ప్రస్తుతం నక్సలైట్లకు, సల్వాజుడుంకు జరిగే సంఘర్షణ శాంతి భద్రతల పేరుతో నక్సలైట్ ఉద్యమాన్ని అణచివేయజూస్తుంది. దానికి పరిష్కారంగా అడవిలో జీవిస్తున్న ఆదివాసులను ప్రధాన రోడ్డు వెంబడి నిర్మించిన క్యాంపులలోకి తీసుకొచ్చి శాశ్వతంగా ఇళ్ళు కట్టిస్తామంటున్నారు. ఈ పరిణామాన్ని దంతెవాడ జిల్లాలో అక్కడి ఎస్‌డిపివో గారు చక్కగా చెప్పారు. "అడవికి నక్సలైట్లు ఎందుకొచ్చారంటే – మీరు విసిరివేసినట్టుగా ఉన్నారు. అందువల్ల ప్రభుత్వం యొక్క అభివృద్ధి పనులు అమలుకాలేదు కాబట్టి వారు వచ్చారు. మీరు ఇప్పుడు అడవిలో ఉండకుండా ఇక్కడి క్యాంపులలో ఉంటే పెద్ద పెద్ద పారిశ్రామిక సంస్థలు అడవి భూములను అభివృద్ధి పరుస్తారు. మీకు ఉద్యోగాలు ఇస్తారు ..."

ఈ వివరణకు మద్దతు మనకు ముఖ్య మంత్రి మాటలలో కనిపిస్తుంది. "మీరు క్యాంపులలో ఉంటేనే ప్రభుత్వం వెంట ఉన్నట్టు, లేకుంటే నక్సలైట్లతో ఉన్నట్టు." కావున గడువు ముగిసేలోగా అడవి ఖాళీ చేయాలంటాడు. ఈ విధంగా ఆదివాసుల నిర్వాసితానికి ఒక కొత్త పార్శ్వం ఛత్తీస్‌గఢ్‌లో చూడగలం. ఛత్తీస్‌గడ్ రాష్ట్రమే ఆదివాసీ రాష్ట్రం. మెజారిటీ కాక పోయినా మూడవ వంతు జనాభా ఆదివాసీలదే. దంతెవాడ జిల్లా 80 శాతం పైగా ఆదివాసీ జనాభా కలిగి ఉంది. ఈ జిల్లాలో 10 లక్షల జనాభా, 1,220 గ్రామాలుంటే సుమారు 500 గ్రామాల ప్రజల్ని రోడ్డు వెంబడి ఉన్న 32 క్యాంపులలోకి తరలించారు. ఇప్పటికి 600 మంది దాకా చంపబడ్డారు. ఆదివాసీలు భూములను, ఆస్తులను, అడవిని విడిచిపెట్టి జీవితాన్ని, జీవనాన్ని తుపాకి నీడలో చూసుకోవలసి వచ్చింది. ఇంకా కొందరు గ్రామ, జిల్లా సరిహద్దులే కాదు, రాష్ట్ర సరిహద్దులు దాటి జీవన హద్దుల్ని వెతుక్కో వాల్సి వచ్చింది. నగరాలకు తరలిస్తున్న కలపలాగ లారీలలో ఆదివాసులు గుంపులు గుంపులుగా పోతున్న దృశ్యాలు సాధారణమైనవి.



ఆదివాసుల సామాజిక ఆర్థిక జీవనాన్ని నిలుపుకోవడానికి, దానిలో అంతర్లీనంగా ఉన్న మానవీయ విలువల్ని కాపాడుకోవడానికి, కాలానుగుణంగా వస్తున్న అవరోధాలను దాటడానికి, అతిక్రమణదారులను నిరోధించడానికి తమదైన పద్ధతులలో ప్రయత్నిస్తూనే ఉన్నారు. హిందూ రాజ్యాలలో భాగస్వాములుగా మార్చబడిన తర్వాత కూడా తమ విశిష్ట జీవన విధానాన్ని కాపాడు కుంటూనే ఉన్నారు. రాజ్యాలను వ్యతిరేకించి పోరాడి తమ అస్తిత్వాన్ని నిలుపుకున్న వాళ్ళూ ఉన్నారు. ఉదాహరణకు వరంగల్ జిల్లాలో సమ్మక్క కాకతీయుల అధికారాన్ని ధిక్కరించి పోరాటం చేసి చనిపోయింది. స్వయం పాలనా హక్కుకు ఆమె నిదర్శనం. వలస పాలకుల 'అభివృద్ధి' అడవి నుండి ఆదివాసులను వేరుచేశాయని చూసింది. వారి మాదిరిగానే స్థానిక సంస్థానాలు కూడా ప్రయత్నించినప్పుడు ప్రతిఘటనలు జరిగినవి. దానికి ఉదాహరణలు 1830–1850 వరకు బెంగాల్, బీహార్‌లలో ఆదివాసీల తిరుగుబాట్లు. 1875లో బిర్సాముండా స్వయం పాలనా పోరాటం, రంపపితూరీ, తమ్మన్న దొర పోరాటం, రాంజీగోండ్లు, కొమురం భీంల సవాళ్ళు, మన్యం తిరుగుబాట్లు అటు బ్రిటిష్ పాలకులను, ఇటు నైజాం నవాబును సవాల్ చేసి తమ సామాజిక ఆర్థిక జీవనాన్ని రక్షించుకునేందుకు ప్రయత్నించాయి. ఈ పోరాటాల ఫలితంగా రాజ్యాంగంలోని 5, 6 షెడ్యూళ్ళు, రాజ్యాంగంలోని 15 (4), 16 (4), 16 (4ఎ), 46, 243 డి, 243 టి, 244, 335 ఆర్టికల్స్ రావడం జరిగింది. వీటిని గుణాత్మకంగా నిర్వచిస్తూ ఆదివాసుల భూమి పరాయీకరణను నిరోధించడానికి వచ్చిందే 1/70 రెగ్యులేషన్. వీటి సారాంశాన్ని ప్రభుత్వ ఆచరణలో ఏ విధంగా ప్రతిబింబింపజేయాలో చెప్పిందే నెహ్రూ పంచశీల.

ఇన్ని ఉన్నా నేడు ఆదివాసీ భూములు సగం కంటే ఎక్కువగా పరాయీకరణ చెందినవి. ప్రభుత్వ యంత్రాంగం ఆదివాసులనే దురాక్రమణదారులుగా నిర్ధారించబూనుకుంటున్నది. వీటన్ని టికి తోడు అభివృద్ధి పేరుతో అడవినీ, గనులనూ స్వాధీన పరచుకుంటూ వారిని నిత్యం నిర్వాసితు లుగా మారుస్తున్నది. మన దేశ జనాభాలో 8 శాతంగా ఆదివాసులు ఉన్నారు. ప్రస్తుత అభివృద్ధి ప్రక్రియకు బలై నిర్వాసితులవుతున్న వారిలో ఆదివాసులు 40 శాతం ఉండడం సమస్య తీవ్రతను సూచిస్తుంది.

ఈ క్రమాన్ని వేగవంతం చేయడానికి ప్రపంచీకరణ ఆర్థిక ప్రక్రియ దోహదపడింది. ప్రైవేటీ కరణను యదేచ్ఛగా కొనసాగించడానికి, బహుళజాతి కంపెనీలకు నిరవరోధంగా ఉండడానికి ప్రభుత్వాలు సిద్ధపడినందునే పైన చెప్పిన రక్షణలు ఉన్నా, రాజ్యాంగం ఆదివాసులకు అండగా ఉన్నా ఆదివాసుల నిర్వాసితాలను ప్రాజెక్టుల, గనుల, పరిశ్రమల, శాంతి భద్రతల పేరు మీద విస్తరిస్తూనే ఉన్నారు. ఫలితం ఆదివాసులు కేవలం వనరుల నుండే నిర్వాసితులు కావడం లేదు. జీవన హక్కుల నుండి, జీవితం నుండి కూడా నిర్వాసితులవుతున్నారు. ఈ రాజ్యాంగ వ్యతిరేక, ఆదివాసీ వ్యతిరేక, ప్రజాస్వామ్య వ్యతిరేక క్రమాన్ని ప్రశ్నించకుంటే మనం బుద్ధి జీవుల మెట్లా అవుతాము?

✪

సాయుధ బలగాల (ప్రత్యేక అధికారాల) చట్టం:

# జీవన్‌రెడ్డి కమిటీ నివేదికలో ఏముంది?

– కె.బాలగోపాల్★

సాయుధ బలగాల (ప్రత్యేక అధికారుల) చట్టంలోని వివిధ అంశాలను సమీక్షించి, వాటిని మానవ హక్కుల పరిరక్షణ బాధ్యత వెలుగులో సవరించడమా లేక ఆ చట్టం స్థానంలో మరింత మానవీయమైన చట్టాన్ని ప్రవేశ పెట్టడమా, ఏం చేయడం ఉచితంగా ఉంటుందో సలహా ఇమ్మని కేంద్ర ప్రభుత్వం అయిదుగురు సభ్యులు గల కమిటీని నియమించింది. దాని అధ్యక్షుడు రిటైర్డ్ సుప్రీం కోర్టు న్యాయమూర్తి అయిన బి.పి. జీవన్ రెడ్డిగారు కాగా ఇతర సభ్యులు డా. ఎస్.బి. నకాడె అనే మాజీ వైస్ ఛాన్సలర్, పి.శ్రీవాత్సవ అనే మాజీ కేంద్ర హోం శాఖ కార్యదర్శి, రిటైర్డ్ లెఫ్టినెంట్ జనరల్ వి.ఆర్.రాఘవన్, పత్రికా విలేకరి సంజయ్ హజారికా.



సైనిక బలగాలకు విపరీత అధి కారాలు కల్పిస్తున్నదని విమర్శకు లోనైన చట్టాన్ని సమీక్షించే కమిటీలో ఒక రిటైర్డ్ సైనిక అధికారిని సభ్యుని చేయడం అనుచితం అని కేంద్ర ప్రభుత్వానికి తోచినట్టు లేదు. కమిటీ ప్రజలతో మాట్లాడి ప్రజాభిప్రాయం సేకరించినట్టే సైనిక దళాలతోనూ మాట్లాడి వారి అభిప్రాయాలూ తీసుకోవాలనడం వేరు. సైన్యానికి చెందిన మాజీ అధికారిని ఆ కమిటీలో సభ్యుడిని చేయడం వేరు. అది న్యాయమే అనేటట్టయితే, ఈ చట్టా నికి గురైన వ్యక్తుల ప్రతినిధిని ఒకరిని కూడా కమిటీలో వేయడం న్యాయం అనిపించుకోదా? ప్రజల తరఫున ఉన్నాడు అని చెప్పదగ్గ వ్యక్తి పత్రికా విలేకరి అయిన సంజయ్ హజారికా ఒకడే. అతను అస్సాంకు చెందిన వాడు, ప్రజల హక్కుల గురించి ఆవేదన చెందే పాత్రికేయుడు. అయినప్పటికీ అతనిని బాధితుల ప్రతినిధి అన డానికి వీలులేదు. కమిటీ అధ్యక్షుని పేరు మీద 'జీవన్‌రెడ్డి కమిటీ'గా పేరు పొందిన ఈ విచారణ సంఘం నవంబర్ 2004లో తన పని మొదలుపెట్టి 2005 జూన్ 6 నాటికి తన నివేదికను కేంద్ర ప్రభుత్వానికి ఇచ్చింది. కేంద్ర ప్రభుత్వం ఏమీ చేయకుండా కూర్చుంది. వారి నివేదికను ఆమోదించలేదు, తిరస్కరించలేదు, బహుశా చర్చించనే లేదు.

**జీవన్‌రెడ్డి కమిటీ సాయుధ బలగాల (ప్రత్యేక అధికారాల) చట్టాన్ని రద్దు చేయవలసిందిగా సిఫారసు చేసిందన్న అభిప్రాయం 'ది హిందూ' కల్పించేసరికి కొంత సంచలనం కలిగింది. జీవన్‌రెడ్డి కమిటీ ఆ చట్టాన్ని (క్లుప్తంగా దానిని సాయుధ బలగాల చట్టం అందాం) రద్దు చేయమని చెప్పింది గానీ, అందులోని అనేక అంశాలను చట్ట వ్యతిరేక కార్యకలాపాల (నిరోధక) చట్టంలో చేర్చమనింది కూడా.**

ఇట్లా ఎంత కాలమైనా కొనసాగి ఉండవచ్చు, కొనసాగిన సందర్భాలు లేకపోలేదు. అయితే 'ది హిందూ' దినపత్రిక ఆ నివేదిక ప్రతిని సంపాదించి దానిని బహిర్గతం చేసింది. జీవన్‌రెడ్డి కమిటీ సాయుధ బలగాల (ప్రత్యేక అధికారాల) చట్టాన్ని రద్దుచేయవలసిందిగా సిఫారసు చేసిందన్న అభిప్రాయం 'ది హిందూ' కల్పించేసరికి కొంత సంచలనం కలిగింది. జీవన్‌రెడ్డి కమిటీ ఆ చట్టాన్ని (క్లుప్తంగా దానిని సాయుధ బలగాల చట్టం అందాం) రద్దు చేయమని చెప్పింది గానీ, అందులోని అనేక అంశాలను చట్ట వ్యతిరేక కార్యకలాపాల (నిరోధక) చట్టంలో చేర్చమనింది కూడా. వెరసి జీవన్‌రెడ్డి కమిటీ ఏమందో, దానిలోని మంచి చెడులేమిటో తెలుసుకోవడం అవసరం.

సైనిక బలగాలు ప్రాణాన్నీ, స్వేచ్ఛనూ హరిస్తాయి కాబట్టి వాటి కార్యకలాపాలను, నడవడికను నియంత్రించడానికి నియమాలుండడం అవసరం. సైన్యం కార్యకలాపాలు యుద్ధానికే పరిమితమైనట్టయితే అంతర్జాతీయ యుద్ధ నియమాలు సైనిక బలగాల నడవడికను నియంత్రిస్తాయి. అయితే పౌర సమాజంలో సైన్యాన్ని ప్రయోగించేటట్టయితే దాని కార్యకలాపాలను నియంత్రించడానికి ఒక చట్టం అవసరం. ఎందుకంటే ఎవరి ప్రాణాన్ని గానీ, స్వేచ్ఛను గానీ చట్టం నిర్దేశించే పద్ధతిలో తప్ప ఇతరత్రా తీసేయడానికి వీలులేదనేది భారత రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులలో ఒకటి.

సైనిక బలగాలను పౌర సమాజంలో ప్రయోగించనే వద్దని నిర్ణయించుకుంటే ఈ సమస్య రాదు. అయితే సాధారణ చట్టం కూడా సైనిక బలగాలు దొమ్మీలను అదుపుచేసే కర్తవ్యం నిర్వర్తించే పరిస్థితి రావచ్చునని భావిస్తుంది. ఒక దొమ్మీని అదుపు చేయడం కోసం సైనిక బలగాల సహాయం అవసరం అని భావిస్తే ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేటు హోదా గల అధికారి ఆ సహాయం కోరవచ్చునని సిఆర్‌పిసిలోని సెక్షన్ 130 అంటుంది. అప్పుడు సైన్యం ఆ అధికారి అదుపులో పనిచేస్తుంది. పోలీసులకు సిఆర్‌పిసిలో వర్తించే అన్ని నియమాలూ ఆ సందర్భంగా సైన్యానికి వర్తిస్తాయి.

మరైతే ఒక ప్రత్యేకమైన సైనిక బలగాల చట్టం ఎందుకు అవసరమైంది? సిఆర్‌పిసి సైన్యానికి కేవలం దొమ్మీలను అదుపుచేసే సందర్భంలో మాత్రమే ఒక సహాయక పాత్రను నిర్దేశించింది.

★ మానవ హక్కుల కార్యకర్త, ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో న్యాయవాది.

దానిని ఆ ఘటనకే పరిమితం చేసింది. అంటే ఆ దొమ్మీ చెదిరిపోగానే సైనిక బలగాలు వెనక్కి వెళ్ళిపోవాలి. కాని దానికి ఆ పాత్ర చాలదనుకోవడం వల్లనే ప్రత్యేక చట్టం అవసరం అయింది. సాయుధ పోరాట రాజకీయాలు తలెత్తిన ప్రాంతాలలోనే ఈ అవసరం పాలకులకు తోచింది.

సాయుధ పోరాటాలు ప్రజా సమూహాల ఉమ్మడి చర్యల రూపంలో మాత్రమే జరగవు. (చట్టం వీటిని దొమ్మీలు అంటుంది) ఆయుధాలు ధరించి తిరిగే కొద్దిమంది మిలిటెంట్ల హింసాత్మక చర్యలూ ఉంటాయి. తరచుగా అవే ఎక్కువ ఉంటాయి. ఈ మిలిటెంట్లను భౌతికంగా ఏరివేయడం, వారికి ఆశ్రయం ఇచ్చే నివాసాలను ధ్వంసం చేయడం అనే రెండు కర్తవ్యాలు నిర్వర్తించడం అవసరం అని పాలకులు భావించారు. ఆ రెండు కర్తవ్యాలూ పోలీసులే చేయలేరా అంటే రెండు సమస్యలున్నాయి. అంతటి శిక్షణ పోలీసులకు ఉండదన్నది ఒకటి. రెండవది, పైకి చెప్పడానికి సిగ్గుపడేది, ఏమిటంటే సాయుధ పోరాట రాజకీయాలను మొట్టమొదట ఆశ్రయించింది జాతి ఉద్యమాలు. నాగాలు, మిజోలు, మైతీలు, కాశ్మీరీలు, సిక్కులు వగైరా. ఆ ప్రాంతాలలో పోలీసులు కూడా ఈ జాతులకే చెంది ఉంటారు కాబట్టి వాళ్ళను నమ్మడం కష్టం అన్నది రెండవ కారణం. ఈ రెండు కారణాల వల్ల మిలిటెంట్ రాజకీయాలపైన ప్రయోగించడానికి సైనిక బలగాలను దించడం అవసరం అని పాలకులు భావించారు. కేవలం ఒక్కొక్క ఘటనకు పరిమితం కాకుండా నిరంతరాయంగా సైన్యం పనిచేయడం అవసరం అని భావించారు. అది నిర్వర్తించవలసిన కర్తవ్యాలకు చట్టపరమైన ఆమోదం (లేక ఆచ్ఛాదన) కల్పించడానికొక కొత్త చట్టం అవసరం అయింది. సాయుధ బలగాల చట్టానికి మూలం ఇక్కడుంది.

ఇదంతా జీవన్‌రెడ్డి కమిటీ గుర్తించిందన్న అభిప్రాయం నేను కలిగించి ఉంటే పొరపాటే. ఈ వాస్తవాలను చూసి ఉంటే కమిటీ సూచనలు ఇంకా మెరుగ్గా ఉండేవి. కానీ జీవన్‌రెడ్డి కమిటీ వీటిని చూడలేదు. పోలీసుల బలం చాలదు, సైనిక బలగాలను ప్రయోగించడం అవసరం అనీ, సిఆర్‌పిసి వారికి నిర్దేశించిన పాత్ర సరిపోదు అనీ ప్రకటించి ప్రత్యేక చట్టం అవసరం అన్న అభిప్రాయానికి వచ్చేసింది. పోలీసుల బలం ఎందుకు చాలదో చెప్పలేదు గానీ, సిఆర్‌పిసి వారికి నిర్దేశించిన పాత్ర ఎందుకు చాలదంటే దొమ్మీలు రాజ్యాధికారాన్నీ, రాజ్యం భద్రతనూ సవాలు చేయవనీ, రాజ్యం భద్రతను సాయుధంగా సవాలుచేసే సందర్భం వచ్చినప్పుడు ఆ చట్టం నిర్దేశించే పాత్ర చాలదనీ జీవన్‌రెడ్డి కమిటీ అంటుంది. ఈ విశ్లేషణకూ సాయుధ బలగాల చట్టం సైనిక బలగాలకిచ్చే విశేష అధికారాలకూ పొంతన ఏమిటి? రాజ్యం భద్రతను పరిరక్షించడానికి వ్యక్తులను కాల్చి చంపడం, నివాసాలను కూల్చడం అనే అధికారాలున్న బలగం అవసరమనే నిర్ధారణకు ఏ విధంగా వచ్చారు?

**ఇదంతా జీవన్‌రెడ్డి కమిటీ గుర్తించిందన్న అభిప్రాయం నేను కలిగించి ఉంటే పొరపాటే. ఈ వాస్తవాలను చూసి ఉంటే కమిటీ సూచనలు ఇంకా మెరుగ్గా ఉండేవి. కానీ జీవన్‌రెడ్డి కమిటీ వీటిని చూడలేదు.**

ఏ విధంగానైతేనేం, వచ్చారు.

మిగిలిన విషయాలు చూసే ముందు సాయుధ బలగాల (ప్రత్యేక అధికారాల) చట్టం చరిత్ర కొంచెం చూద్దాం. ఈ పేరుతో ఈశాన్య భారత రాష్ట్రాల కోసం ఒక చట్టం, జమ్మూ కాశ్మీర్ కోసం ఒక చట్టం ఉన్నాయి. రెండింటి మధ్య స్వల్పమైన తేడాలు మాత్రమే ఉన్నాయి.



మొట్టమొదట వచ్చింది సాయుధ బలగాల (అస్సాం, మణిపూర్) ప్రత్యేక అధికారాల చట్టం, 1958. పేరులో అస్సాం, మణిపూర్ అని ఉన్నా దీనికి కారణం నాగాల జాతి పోరాటం. అప్పటికి నాగాలాండ్ అనే రాష్ట్రం లేదు. 'నాగా కొండల ప్రాంతం' అస్సాం రాష్ట్రంలో ఉండేది. మణిపూర్ (అప్పుడూ, ఇప్పుడూ) ఉత్తర భాగంలో నాగాలు నివసించే జిల్లాలు ఉన్నాయి. 1947లో నాగాలు మీ ఇండియాతో మాకేం సంబంధం లేదు, మా పాటికి మమ్మల్ని బతకనివ్వండి అని అంటే పదేళ్ళు ఇండియాలో ఉండి చూడండి, ఆ తరువాత మీ భవితవ్యాన్ని మీరే నిర్ణయించుకుందురని హామీ ఇచ్చి, పదేళ్ళు గడిచిన తరువాత సైన్యాన్ని దించి సాయుధ బలగాల చట్టాన్ని చేశారు మన పాలకులు.

**1947లో నాగాలు మీ ఇండియాతో మాకేం సంబంధం లేదు, మా పాటికి మమ్మల్ని బతకనివ్వండి అని అంటే పదేళ్ళు ఇండియాలో ఉండి చూడండి, ఆ తరువాత మీ భవితవ్యాన్ని మీరే నిర్ణయించుకుందురని హామీ ఇచ్చి, పదేళ్ళు గడిచిన తరువాత సైన్యాన్ని దించి సాయుధ బలగాల చట్టాన్ని చేశారు మన పాలకులు.**

ఇది చాలా చిన్న చట్టం. కాగితానికి రెండు వైపులా అచ్చువేసినట్టయితే ఒకే పేజీలో ఇముడుతుంది. అధికారాన్నీ హక్కులనూ సమన్వయపరచి, హక్కుల రక్షణకోసం అధికారానికి పరిమితులు పెట్టి, మరీ అవసరమనుకున్న చోట దానికి షరతులు పెట్టి వీటిని అతిక్రమించినట్టయితే దానిపైన విచారణ జరిపే వ్యవస్థను రూపొందించి– ఇవన్నీ ఉన్నట్లయితే చట్టం పెద్దదిగా ఉంటుంది, క్లిష్టంగా ఉంటుంది. కాని అధికారాన్ని కట్టబెట్టడమే లక్ష్యం అయిన చట్టం పెద్దదిగా ఎందుకుండాలి?

అందుకే ఇది చాలా చిన్నది. ఈ చట్టం వర్తించే రాష్ట్రాలను మొత్తంగా గానీ, అందులో ఒక భాగాన్ని గానీ కల్లోలిత ప్రాంతంగా ప్రకటించే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికీ, కేంద్ర ప్రభుత్వానికీ కూడా ఉంది. ఎప్పుడు ప్రకటించవచ్చునంటే ఆ ప్రాంతంలో పౌర పాలనకు సహాయకంగా సాయుధ బలగాలను దించడం అక్కడ నెలకొన్న కల్లోలం, లేక ప్రమాదకర పరిస్థితుల దృష్ట్యా అవసరం అనుకున్నప్పుడు. ఆపైన సాయుధ బలగాలు రంగంలోకి దిగుతాయి. వారికి ప్రధానంగా ఉండే అధికారాలు నాలుగు. నిషేధాజ్ఞలను అతిక్రమిస్తున్న వ్యక్తి పైన కాల్పులు జరపవచ్చు, ప్రాణం సైతం తీయవచ్చు. సాయుధ మిలిటెంట్లకు గానీ నేరారోపితులకు గానీ ఆశ్రయం ఇవ్వడానికి ఉపయోగించే నిర్మాణాలను, సాయుధ దాడులు చేయడానికి ఉపయోగించే నిర్మాణాలను, ఆయుధాగారాలుగా ఉపయోగించే, లేక ఉపయోగించగల నిర్మాణాలను ధ్వంసం చేయవచ్చును. నేరంలో నిందితుడైన వ్యక్తిని లేక నేరం చేశాడన్న సందేహం ఉన్న వ్యక్తిని లేక నేరం చేయబోతాడన్న సందేహం ఉన్న వ్యక్తిని అరెస్టు చేయవచ్చు. అరెస్టు చేయడానికి ఎంత అవసరమైతే అంత బలప్రయోగం చేయవచ్చు. ఆయుధాలను గానీ, దొంగిలించిన వస్తువులను గానీ, అపహరించిన వ్యక్తిని గానీ దాచి ఉంచారని సహేతుకంగా భావించే ఏ ప్రదేశంలోకైనా ఎటువంటి వారంట్ లేకుండా ప్రవేశించవచ్చు, సోదా చేయవచ్చు, అరెస్టు చేయవచ్చు. దీనికి ఎంత అవసరమైతే అంత బలప్రయోగం చేయవచ్చు.

ఆయుధాలు పట్టుకొని ఒక రాజకీయ లక్ష్యంతో పోరాటం చేసేవాళ్ళను, అందులో భాగంగా తమ లక్ష్యానికి అడ్డం వచ్చే వాళ్ళను హింసకు గురిచేయడానికి సందేహించని వాళ్ళను ప్రభుత్వం ఉపేక్షించాలా, ఏ ప్రభుత్వమైనా ఉపేక్షించగలదా అని అడుగుతారేమో. ఉపేక్షించాలని గానీ, ఏ

ప్రభుత్వమైనా ఉపేక్షించగలదని గానీ ఎవరూ అనరు. అయితే దీనికోసం ప్రభుత్వ బలగాలకిచ్చే అధికారం విచ్చలవిడి హింసకు దారితీసే అవకాశం లేకుండా కట్టడిచేసే ఆంక్షలు ఆ అధికారాన్ని కల్పించే చట్టంలో అంతర్భాగంగా ఉండడం అవసరం. సాధారణ చట్టం కూడా హింసను అదుపు చేసే అధికారం పోలీసులకు ఇస్తుంది గానీ దానికోసం కనీస బలప్రయోగం – అంటే అదుపు చేయడానికి ఏ మేరకు అవసరమో ఆ మేరకు మాత్రమే – చేయాలని పలు రూపాలలో నొక్కి చెపుతుంది. నిజంగా పోలీసులు బలప్రయోగానికి పాల్పడినప్పుడు అది ఆ సందర్భంలో కనీసమైన బలప్రయోగమేనా అని నిర్ణయించే నిష్పాక్షికమైన వ్యవస్థ ఏదీ లేకపోవడం వల్ల తరచుగా గరిష్ఠ బలప్రయోగాన్నే సరైనదిగా పోలీసులు చలామణి చేయగలుగుతున్నారు గానీ, హేతుబద్ధమైన పరిమితులతో కూడిన బలప్రయోగ అధికారం ఉండడం దానంతటది ఆక్షేపణీయం కాదు. సాయుధ బలగాల చట్టం అన్ని పరిమితులనూ తీసేసి, 'ఎంత అవసరమైతే అంత బలప్రయోగం చేయవచ్చును' అంటుంది.

దీని పర్యవసానాన్ని వివరించాలంటే ఆనాటి నుంచి ఈ నాటిదాకా ఈ చట్టం కల్పించిన ఆచ్ఛాదనను వాడుకొని వివిధ సాయుధ బలగాలు ఎంత విచ్చలవిడి హింసకు పాల్పడ్డాయో చెప్పవలసి ఉంటుంది. ఒక్క ఈశాన్య భారత రాష్ట్రాలలోనే కాదు, జమ్మూ-కాశ్మీర్‌లో కూడా. ఎందుకంటే ఈ చట్టం నమూనాలోనే ఆ రాష్ట్రానికి వర్తించే ఒక సాయుధ బలగాల ప్రత్యేక అధికారాల చట్టాన్ని జారీచేసి దానికింద లక్షల సంఖ్యలో సైన్యాన్నీ పారామిలిటరీనీ అక్కడ దించారు.

ఈ విచ్చలవిడితనం పట్ల నిరసనే జీవన్‌రెడ్డి కమిటీ ఆవిర్భావానికి కారణం. అందులో చివరి ఘట్టాన్ని కమిటీ తన రిపోర్టులో ప్రస్తావించింది. 2004 జూలై 10-11 తేదీల మధ్య రాత్రి అస్సాం రైఫిల్స్ బలగాలు తంగ్‌జాం మనోరమాదేవి అనే యువతిని తన ఇంటి నుంచి తీసుకుపోయి కాల్చి చంపారు. చంపే ముందు ఆమె పైన లైంగిక అత్యాచారానికి పాల్పడ్డారన్న అనుమానంకూడా ఉంది. ఈ హత్యకు నిరసనగా పెద్దఎత్తున ప్రజలు కదిలారు. 12 మంది స్త్రీలు ఇంఫాల్‌లోని అస్సాం రైఫిల్స్ కార్యాలయం వద్ద తమను తాము వివస్త్రలు చేసుకొని భారత సైనికులారా, మమ్మల్ని కూడా రేప్ చేయండి అని నినదించడం యావద్దేశానికి షాక్ ఇచ్చింది. ఆ తరువాత కొనసాగిన నిరసన ఫలితంగా కేంద్ర హోంమంత్రి మణిపూర్‌కు పోవడం, అక్కడి ప్రజాసంఘాలు ఆయనను కలిసి సాయుధ బలగాల చట్టాన్ని రద్దు చేయమని డిమాండ్ చేయడం, ఈ కమిటీ ఆవిర్భావానికి కారణం.

అయితే మనోరమాదేవి హత్య కంటే చాలా ముందు నుంచే ఇరోంచాను షర్మీల అనే స్త్రీ సాయుధ బలగాల చట్టాన్ని రద్దు చేయాలన్న డిమాండ్‌తో నిరాహారదీక్ష చేస్తున్నది. 2000 సంవత్సరం నవంబర్ 2వ తేదీన మణిపూర్ రాజధాని ఇంఫాల్ ఎయిర్‌పోర్ట్ సమీపంలో ఒక బస్‌స్టాండ్‌లో నిలబడ్డ జనంపైన అస్సాం రైఫిల్స్ జవాన్లు కాల్పులు జరిపి 10 మందిని చంపిన ఘటనకు నిరసనగా మొదలుపెట్టిన నిరాహార దీక్షను ఆమె ఈ నాటికీ కొనసాగిస్తున్నది. ప్రభుత్వ వైద్యులు బలవంతంగా గొట్టాలద్వారా ఎక్కిస్తున్న ద్రవ పదార్థం తప్ప వేరే ఏ ఆహారమూ తీసుకోవడం లేదు.

**సాయుధ బలగాల చట్టం అన్ని పరిమితులనూ తీసేసి, 'ఎంత అవసరమైతే అంత బలప్రయోగం చేయవచ్చును' అంటుంది.**



ఈ నేపథ్యంలో ఏర్పడిన కమిటీ, ఒక వ్యక్తిని నేరుగా కాల్చి చంపడానికి సాయుధ బలగాల చట్టం సైనిక బలగాల సిబ్బందికి ఇచ్చిన అధికారం ఎంతవరకు సబబు అన్న ప్రశ్న ప్రధానంగా వేసుకోవలసి ఉండింది. వేసుకోకుండా, రాజ్యం ఉనికినే ప్రశ్నించే ఉద్యమాలు నడుస్తున్న చోట సిఆర్‌పిసి సైనిక బలగాలకు కల్పించే పాత్ర, ఇచ్చే అధికారాలు చాలవనీ, సాయుధ బలగాల చట్టం ఇచ్చే విశేష అధికారాలు అవసరమనీ నిర్ణయించడం (ఎంత మర్యాదగా చెప్పాలన్నా) విచారకరం అనక తప్పదు. ఈ నిర్ణయం చేసిన సందర్భంలో కమిటీ ఇచ్చిన ఉదాహరణ నుంచి వారి ఆలో చనా రీతిని ఊహించవచ్చునేమో. 1984లో ఇందిరాగాంధీ హత్య అనంతరం ఢిల్లీలో జరిగిన సిక్కుల ఊచకోతను ప్రస్తావిస్తూ, అటువంటి సందర్భాలలో సైనిక బలగాలు సాధారణ చట్టం అదుపులో పనిచేసినా ఫరవాలేదు గానీ, రాజ్యం ఉనికికి, భద్రతకు ముప్పుతెచ్చే అశాంతి చెలరేగినప్పుడు ఆ అధికారాలు చాలవన్నారు. ఇది మామూలు మనుషులకు ఆశ్చర్యం కలిగించే అభిప్రాయం. అమాయకులైన సిక్కు ప్రజానీకం పైన పనిగట్టుకొని గుంపులను రెచ్చగొట్టిన కాంగ్రెస్ నాయకులను అదుపు చేయడానికి సిఆర్‌పిసిలోని సమతుల్యమైన అధికారాలు సరిపోతాయి గానీ, తమ భూభాగాన్ని అన్యాయంగా భారత్‌లో కలిపారని చారిత్రక ఆధారాలతో సహా పోరాటం చేస్తున్న వారిని ఎదుర్కొనడానికి విపరీత అధికారాలు కావాలనడం – జీవన్‌రెడ్డి గారు క్షమిస్తే – వికృతమైన ఆలోచన అనక తప్పదు.

**అమాయకులైన సిక్కు ప్రజానీకం పైన పనిగట్టుకొని గుంపులను రెచ్చగొట్టిన కాంగ్రెస్ నాయకులను అదుపు చేయడానికి సిఆర్‌పిసిలోని సమతుల్యమైన అధికారాలు సరిపోతాయి గానీ, తమ భూభాగాన్ని అన్యాయంగా భారత్‌లో కలిపారని చారిత్రక ఆధారాలతో సహా పోరాటం చేస్తున్న వారిని ఎదుర్కొనడానికి విపరీత అధికారాలు కావాలనడం – జీవన్‌రెడ్డి గారు క్షమిస్తే – వికృతమైన ఆలోచన అనక తప్పదు.**

నిజమే, ఆ విపరీత అధికారాలను సుప్రీంకోర్టు తీర్పు పరిధిలోకి కుదించి అర్థం చేసుకోవాలని ఈ రిపోర్టు అంటుంది. వారు అన్నా, అనకపోయినా అది తప్పనిసరి. ఎందుకంటే ఒక చట్టానికి హైకోర్టు లేక సుప్రీంకోర్టు చేసే వ్యాఖ్య ఆ చట్టంలో భాగంగా పరిగణించబడుతుంది. ఆ వ్యాఖ్య వెలుగులోనే ఆ చట్టాన్ని అర్థం చేసుకోవలసి ఉంటుంది.

సాయుధ బలగాల చట్టం చెల్లదంటూ నాగా ప్రజల మానవ హక్కుల ఉద్యమం సుప్రీంకోర్టులో వేసిన కేసులో (ఎన్.పి.ఎం.హెచ్.ఆర్ వర్సస్ యూనియన్ ఆఫ్ ఇండియా) తుదితీర్పు సుప్రీంకోర్టు 1997లో ఇచ్చింది. ఆ చట్టం రాజ్యాంగ విరుద్ధం అని కొట్టివేయవలసింది పోయి, దానిని తగు రీతిలో కుదించి వ్యాఖ్యానించినట్లయితే రాజ్యాంగ బద్ధమేనని సుప్రీంకోర్టు అంది. కుదింపుకు సుప్రీంకోర్టు ఉపయోగించిన ప్రమాణాలలో కొన్ని ఆ చట్టంలోనే ఉన్నాయి. కొన్ని రాజ్యాంగం నుంచి వచ్చాయి.

## ఇవేమిటంటే:

1. సాయుధ బలగాలు స్థానిక అధికార యంత్రాంగానికి అండగా పని చేస్తాయే తప్ప దానిని పక్కన పెట్టి దాని పని తామే చేయవు. ఇద్దరూ పరస్పర సహకారంతో శాంతిస్థాపన కోసం కృషి చేయాలి.

2. సాయుధ బలగాలు ఎవరినైనా అరెస్టు చేస్తే వారిని వెంటనే స్థానిక పోలీసులకు అప్పగించాలి. వారు వెంటనే కోర్టులో హాజరుపెట్టాలి. మొత్తం కలిసి 24 గంటలు మించకూడదు. అదేవిధంగా, సోదా చేసిన క్రమంలో స్వాధీనం చేసుకున్న వస్తువులను కూడా స్థానిక పోలీసుస్టేషన్‌లో అప్పగించాలి.

3. సాయుధ బలగాలు సోదా చేసేటప్పుడు, సాధారణ చట్టంలో పోలీసులు చేసే సోదాలకు వర్తించే నియమాలను పాటించాలి.

4. నిషేధాజ్ఞలు ఉల్లంఘిస్తున్న వ్యక్తిపైన సైనిక బలగాలు నేరుగా కాల్పులు జరపవచ్చుననీ, ప్రాణం సైతం తీయవచ్చుననీ చెప్పే సెక్షన్ రాజ్యాంగ విరుద్ధమేం కాదనీ, అది చెల్లుబాటు అవుతుందనీ అంటూ, అదే సమయంలో 'కనీస బలప్రయోగం మాత్రమే చేయాల'ని సుప్రీం కోర్టు అంది. పరస్పర విరుద్ధంగా కనిపించే ఈ రెండు అభిప్రాయాలనూ కలిపితే ఫలితం గందరగోళం తప్ప వేరే ఏమీకాదు. కనీసం కంటే ఎక్కువ బలప్రయోగం చేసి ప్రాణం తీశారంటే, కనీస బలప్రయోగం చేయాలని సుప్రీంకోర్టు చెప్పినప్పటికీ ప్రాణం తీయవచ్చునన్న చట్టం రాజ్యాంగ బద్ధమేననింది కాబట్టి తప్పేమీ లేదని సైనిక బలగాలు దబాయించగలవు. మహా అయితే అది పొరబాటు కాగలదు గానీ నేరం కాదనగలవు. కాబట్టి, 'కనీస బలప్రయోగం' అని సుప్రీంకోర్టు చేర్చిన షరతుకు పెద్దగా అర్థం లేదు.

5. సాయుధ బలగాలపైన అధికార దుర్వినియోగానికి సంబంధించిన ఫిర్యాదు ఎవరైనా చేసినట్టయితే దానిపైన క్షుణ్ణంగా విచారణ జరపాలి, ఫిర్యాదు నిజమని తేలితే బాధితులకు నష్టపరిహారం ఇవ్వాలి, ఘటనకు పాల్పడిన వారిని ప్రాసిక్యూట్ చేయడానికి కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వాలి. అయితే 'క్షుణ్ణంగా' విచారణ ఎవరు జరపాలో, ఏ విధంగా జరపాలో చెప్పనంత కాలం ఇటువంటి ఆదేశాలకు ఆచరణాత్మకమైన అర్థమేమీ లేదు. అయినా, సుప్రీంకోర్టు 'అధికార దుర్వినియోగం' అన్న డొంక తిరుగుడు ప్రయోగం చేసింది గానీ సాయుధ బలగాలపైన వచ్చే అభియోగాలన్నీ వారు ఏదో ఒక నేరానికి పాల్పడ్డారనే. అది హత్య కావచ్చు, అక్రమ నిర్బంధం కావచ్చు, బలవంతపు అపహరణ కావచ్చు, లైంగిక హింస కావచ్చు – అన్నీ నేరాలే తప్ప కేవలం 'అధికార దుర్వినియోగం' కాదు. వీటిమీద స్థానిక పోలీసులు కేసు రిజిష్టర్ చేయాలనీ, నిష్పక్షపాతంగా నేర పరిశోధన జరపాలనీ, కోర్టులో నేరవిచారణ జరగాలనీ, సైనిక బలగాలు ఆ నేర విచారణతో పూర్తిగా సహకరించాలనీ అనకుండా ఫిర్యాదుల పైన క్షుణ్ణంగా విచారణ జరిపి (ఎవరు జరపాలో!) ఫిర్యాదు నిజమని తేలితే నష్టపరిహారం ఇవ్వాలి, ప్రాసిక్యూషన్ చేపట్టాలి అనడంలో పెద్దగా అర్థం లేదు.

సుప్రీంకోర్టు తీర్పుమీద ఇప్పుడు ఈ వ్యాఖ్యలెందుకంటే, సైన్యానికి ఇచ్చే అధికారం ఆ తీర్పుకు లోబడి ఉంటే చాలుననేది జీవన్‌రెడ్డి కమిటీ అభిప్రాయం. అదనంగా ఇంకొకటి రెండు ఈ కమిటీ చేర్చింది. కాల్పులు జరిపేటప్పుడు శరీరం పైభాగాన కాక కింది భాగాన గురిపెట్టమన్నారు. ఇది సైతం వారి స్వంత ఆలోచన కాదు. సైనిక అధికార యంత్రాంగమే సాయుధ బలగాల చట్టం చాటున విధులు నిర్వర్తిస్తున్న జవాన్లకు జారీచేసిన నియమావళిలో ఇదే సూక్తి ఉంది. ఎవరు చేస్తే ఏమిలే, మంచిదే కదా అంటారేమో. సమస్య ఎక్కడొస్తుందంటే, 'అనుమానితుల మీద నేరుగా కాల్పులు జరపవచ్చు!' ప్రాణం తీయవచ్చు' అని చట్టం ఇచ్చిన అధికారం చెల్లుతుందని చెప్పిన



తరువాత శరీరం కింది భాగానికి గురిపెట్టి కాల్చాలి అన్న ఆదేశానికి అర్థం ఏముంది? కింది భాగానికే గురిపెట్టి కాల్చాను గానీ పొర బాటున పైకి వెళ్ళి అతని ప్రాణం పోయిందం టాడు. ప్రాణం తీసేట్టుగా కాల్పులు జరిపే అధికారం చట్టమే ఇచ్చింది కాబట్టి అతనిని చట్టం ఏమని తప్పు పట్టగలదు?

**అంతర్లీనంగా ఉన్న దానిని చట్టంలో స్పష్టంగా రాసేయడం అవసరం అని జీవన్‌రెడ్డి కమిటీ అభిప్రాయపడింది. అంతవరకు బాగానే ఉందిగానీ ఈ మాటలు చెప్పడానికే అయితే 147 పేజీల రిపోర్టు రాయవలసిన అవసరం ఉండలేదు. అయిదు పేజీల రిపోర్టు సరిపోయేది.**

మొత్తానికి, సైనిక బలగాలను ప్రయోగించే సందర్భాన్ని గురించి, వాటికి ఉండగల అధికారాల గురించి సాధారణ చట్టం చెప్పేది సరిపోదనీ, సైనిక బలగాల (ప్రత్యేక అధికారాల) చట్టం ఇచ్చే అధికారాలు, ఆ చట్టం పరిధి అవసరమేననీ అంటూ ఆ అధికారానికి ఇప్పటికే సుప్రీంకోర్టు విధించిన పరిమితులూ, సైనిక అధికారులే స్వయంగా విధించిన పరిమితులూ కూడా అవసరమనీ, అందులో అంతర్భాగమనీ జీవన్‌రెడ్డి కమిటీ అభిప్రాయపడింది. వాటిని చట్టంలో రాసేయడం అవసరం అనింది.

జీవన్‌రెడ్డి కమిటీ చెప్పింది ఇదే అయితే పెద్దగా చర్చ జరిగేది కాదు. సాయుధ బలగాల చట్టం రాజ్యాంగబద్ధమేనని సుప్రీంకోర్టు ఎప్పుడో చెప్పింది. సాధారణ చట్టాలు సరిపోవని కూడా సుప్రీంకోర్టు చెప్పింది. అలాగే ప్రత్యేక అధికారాలు ఏ పరిమితికి లోబడి ఉండాలో కూడా చెప్పింది. సుప్రీంకోర్టు విధించే పరిమితులు చట్టంలో ఉన్నట్టే లెక్క. అయితే చట్టంలో స్పష్టంగా రాసిన వాటినే గౌరవించడం కష్టమైనప్పుడు అంతర్లీనంగా ఉన్న వాటిని ఏం గౌరవిస్తారు? కాబట్టి అంతర్లీనంగా ఉన్న దానిని చట్టంలో స్పష్టంగా రాసేయడం అవసరం అని జీవన్‌రెడ్డి కమిటీ అభిప్రాయపడింది. అంతవరకు బాగానే ఉందిగానీ ఈ మాటలు చెప్పడానికే అయితే 147 పేజీల రిపోర్టు రాయవలసిన అవసరం ఉండలేదు. అయిదు పేజీల రిపోర్టు సరిపోయేది.

అయితే జీవన్‌రెడ్డి గారి దృష్టి వేరే చోట ఉంది. ఆయుధాలు పట్టుకొని రాజ్యాన్నీ, దాని అధికారాన్నీ సవాలుచేసే ఉద్యమాలను ఎదుర్కొనడానికి వేరు వేరు చట్టాలుండడం మంచిది కాదనీ, ఒక చట్టం ఉంటేనే సమర్థంగా ఎదుర్కోవడం సాధ్యం అవుతుందనీ ఆయన అభిప్రాయం. ఒకే సమగ్ర శాసనం తయారుచేసే ప్రయత్నం 'పోటా'ను ఉపసంహరించుకున్న మరునాడే మొదలైంది. అప్పుడు కూడా ఒకే చట్టం రూపొందించవలసిన 'అవసరాన్ని' ప్రతిపాదించిన వారిలో, ఒక దశలో భారత లా కమిషన్ చైర్మన్‌గా ఉన్న జీవన్‌రెడ్డి గారొకరు. ఇప్పుడు ఈ నివేదికను గాని ప్రభుత్వం అమలుచేస్తే అది పూర్తవుతుంది.

మిలిటెంట్ ఉద్యమాలపైన నిషేధం ప్రయోగించడానికి అధికారం ఇచ్చే చట్టాలు, వారు చేసే హింసాత్మక చర్యలను మరింత 'సమర్థంగా' విచారించే ప్రత్యేక నేర విచారణ వ్యవస్థ, వారిని ఎదుర్కొనడానికి సాయుధ బలగాలకు విశేష అధికారాలిచ్చే చట్టాలు అనేవి మూడూ వేరువేరుగా ఉంటూ వచ్చాయి. ఇందులో మూడవ కోవకు చెందిన చట్టాలు దేశంలో కొన్ని ప్రాంతాలకే పరిమితం అయ్యాయి. నిషేధ అవసరాలకు చట్ట వ్యతిరేక కార్యకలాపాల (నిరోధక) చట్టం, 1967 ఉంది. వివిధ రాష్ట్రాలలో రాష్ట్ర స్థాయి చట్టాలు (ఉదాహరణకు ఆం. ప్ర. పబ్లిక్ సెక్యూరిటీ చట్టం) ఉన్నాయి. రెండవ అవసరానికి టాడా, పోటా వంటి చట్టాలు, రాష్ట్రాలలో ఆంధ్రప్రదేశ్ సంఘటిత

నేరాల నియంత్రణ చట్టం వంటివి ఉండేవి (కొన్ని ఇంకా ఉన్నాయి). మూడవ అవసరానికి సాయుధ బలగాల ప్రత్యేక అధికారాల చట్టాలు (ఈశాన్య రాష్ట్రాలకొకటి, జమ్మూకాశ్మీర్‌కు ఒకటి), కల్లోలిత ప్రాంతాల చట్టాలు (పంజాబ్‌లో ఒకటి, ఆంధ్రప్రదేశ్‌లో ఒకటి) ఉన్నాయి.

మిలిటెంట్ ఉద్యమాలను నిషేధించే అధికారం, వారి హింసాత్మక చర్యలను సమర్ధంగా విచారించి కఠినంగా శిక్షించే అధికారం, వారిని వేటాడి ఏరివేసే అధికారం అనే మూడూ ఒకే చట్టంలో ఉంటే మరింత బలంగా ఉంటుందని వాదించిన, వాదిస్తున్న వారు నిజానికి చాలామంది ఉన్నారు. న్యాయమూర్తులుగా ఉన్న, లేక ఉండిన వారు ఎక్కువగా ఈ వాదన వైపు మొగ్గు చూపుతున్నారు. పైగా ఆ చట్టాలు ఒక ప్రాంతానికో, ఒక సందర్భానికో పరిమితం కాకుండా రాజ్యాంగ యంత్రం చేతిలో ఒక సార్వత్రిక ఆయుధంగా ఉండాలని వారు వాదిస్తున్నారు. 'పోటా'ను రద్దుచేసిన తరువాత ఆ చట్టంలోని ప్రధాన అంశాలను చట్టవ్యతిరేక కార్యకలాపాల (నిరోధక) చట్టంలో చేర్చడం ద్వారా ఈ పని సగం పూర్తిచేశారు (అయితే 'పోటా'లోని అత్యంత అభ్యంతరకమైన అంశాన్ని, అంటే ముద్దాయి పోలీసుల కిచ్చిన ఒప్పుకోలును సాక్ష్యంగా స్వీకరించచ్చునన్న నియమాన్ని, తొలగించారు). ఇప్పుడు సాయుధ బలగాల (ప్రత్యేక అధికారాల) చట్టాన్ని రద్దుచేసి అందులోని ప్రధాన అంశాలను (సుప్రీంకోర్టు ఆదేశించిన పరిమితుల మేరకు సవరించి) అదే చట్టంలో అయిదవ అధ్యాయంగా చేర్చాలన్నది జీవన్‌రెడ్డి కమిటీ సూచన. ఆ పని చేసినట్టయితే, చట్ట వ్యతిరేక కార్యకలాపాల (నిరోధక) చట్టం భారత రాజ్యం ఉనికినీ, అధికారాన్నీ, స్వరూపాన్నీ సవాలు చేసే అన్ని మిలిటెంట్ ఉద్యమాలనూ ఎదుర్కొనడానికి ప్రభుత్వానికి విశేష అధికారాలిచ్చే సమగ్ర శాసనం అవుతుంది. ఏ ఒక్క ప్రాంతానికో, సందర్భానికో పరిమితం కాని సార్వత్రిక శాసనం అవుతుంది. ఈ ప్రతిపాదన జీవన్‌రెడ్డి కమిటీ రిపోర్టులోని ప్రధాన అంశం అని భావించవలసి ఉంటుంది. నిర్బంధ చట్టాలకు ఆ విధంగా సమగ్రత కల్పిస్తే ఏం జరుగుతుందంటే విడివిడిగా ఒక్కొక్క చట్టంలోనూ ఉన్న అణచివేత అధికారాలకుండే లక్షణాలు ఒక దానికొకటి తోడై అన్నీ మరింత నిర్బంధ పూర్వకంగా తయారవుతాయి.

నక్సలైట్ ఉద్యమాన్ని ఒక ఉదాహరణగా తీసుకొని ఈ 'సమగ్రత' పర్యవసానాలను వివరించవచ్చు. కేంద్ర ప్రభుత్వం చట్ట వ్యతిరేక కార్యకలాపాల (నిరోధక) చట్టం కింద నక్సలైట్ ఉద్యమాన్ని ఎప్పుడూ నిషేధించలేదు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం స్వంత చట్టాన్ని చేసుకొని తన సరిహద్దుల పరిధిలో మావోయిస్టు పార్టీని మాత్రం నిషేధించింది. అయితే 'పోటా'లోని టెర్రరిస్టు సంస్థల జాబితాలో మావోయిస్టు పార్టీని కేంద్ర ప్రభుత్వం చేర్చి ఉంది. దానివల్ల 'పోటా'లోని ప్రత్యేక నేర విచారణ వ్యవస్థ ఆ పార్టీకీ వర్తించింది. అయితే 'పోటా'ను రద్దుచేసి అందులోని ప్రధానమైన అంశాలను చట్ట వ్యతిరేక కార్యకలాపాల (నిరోధక) చట్టంలో (కొన్ని ఆహ్వానించదగ్గ సవరణలతో) రాసిన తరువాత ఏం జరిగిందంటే ఈ చట్టం కల్పించే నిషేధ అధికారాలు దేశ వ్యాపితంగా మావోయిస్టు పార్టీకి వర్తించడం మొదలయింది. అంటే ఆ మేరకు మావోయిస్టు పార్టీ

**ఈ ప్రతిపాదన జీవన్‌రెడ్డి కమిటీ రిపోర్టులోని ప్రధాన అంశం అని భావించవలసి ఉంటుంది. నిర్బంధ చట్టాలకు ఆ విధంగా సమగ్రత కల్పిస్తే ఏం జరుగుతుందంటే విడివిడిగా ఒక్కొక్క చట్టంలోనూ ఉన్న అణచివేత అధికారాలకుండే లక్షణాలు ఒక దానికొకటి తోడై అన్నీ మరింత నిర్బంధ పూర్వకంగా తయారవుతాయి.**



పైన దేశ వ్యాపిత నిషేధం వచ్చింది. ఇప్పుడు జీవన్‌రెడ్డి కమిటీ రిపోర్టును అనుసరించి సాయుధ బలగాల ప్రత్యేక అధికారాల చట్టాన్ని రద్దుచేసి అందులోని ప్రధాన అంశాలను (సుప్రీంకోర్టు సూచించిన పరిమితులను కలుపుకొని) చట్ట వ్యతిరేక కార్యకలాపాల (నిరోధక) చట్టంలో చేర్చేస్తే ఏం జరుగుతుందంటే మావోయిస్టు ఉద్యమంపైన సైనిక బలగాలను విశేష అధికారాలతో మోహరించవచ్చు. ప్రస్తుతం మావోయిస్టుల పైన సైన్యాన్ని మోహరించినట్టయితే అది సాధారణ చట్టాల పరిధిలో ఉండాలి తప్ప విశేష అధికారాలిచ్చే చట్టం లేదు. బహుశా అందుకేనేమో వాళ్ళ పైన సైన్యాన్ని ఇప్పటిదాకా దించలేదు. జీవన్‌రెడ్డి కమిటీ సిఫారసులు అమలుచేస్తే సైన్యానికి విశేష అధికారాలిచ్చి మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలలో దించవచ్చు. మావోయిస్టు ఉద్యమంలో ప్రధానంగా పేద వర్గాలు, దళిత ఆదివాసీ ప్రజానీకం భాగస్వాములనేది తెలిసిన సంగతే. పోలీసు చర్యలు వారికి ఎంతటి హాని కలిగించాయో హక్కుల సంఘాల నివేదికలు పదే పదే బయట పెట్టాయి. జీవన్‌రెడ్డి కమిటీ పుణ్యాన సైన్యం రంగంలోకి దిగినట్టయితే ఏం జరగగలదో ఊహించాలంటేనే భయం వేస్తుంది.

జీవన్‌రెడ్డి కమిటీ రిపోర్టు గురించి ఇంకొక్క విషయం కూడా చెప్పాలి. అదేమిటంటే కేంద్ర ప్రభుత్వానికి ఒక ప్రాంతాన్ని కల్లోలిత ప్రాంతంగా ప్రకటించే విషయంలో ఈ రిపోర్టు సూచించే సవరణ పూర్తిగా ఏకపక్ష అధికారాన్ని కట్టబెడుతుంది.

తొలినాడు ఈ చట్టంలో ఒక ప్రాంతాన్ని కల్లోలిత ప్రాంతంగా ప్రకటించి సైన్యాన్ని పంపమని కేంద్ర ప్రభుత్వాన్ని కోరే అధికారం రాష్ట్ర ప్రభుత్వానిది మాత్రమే. రాష్ట్రంలో ఒక ప్రాంతంలో కల్లోలం, లేక ప్రమాదకర పరిస్థితులు ఏర్పడి, పౌరపాలన చేయి దాటి పోయేంతగా విషమించిందనీ, పౌరపాలనకు అండగా సైన్యాన్ని దింపితేనే పాలన సాధ్యమనీ రాష్ట్ర ప్రభుత్వం భావించినట్టయితే ఆ ప్రాంతాన్ని కల్లోలిత ప్రాంతంగా ప్రకటించి సైన్యాన్ని పంపమని కేంద్ర ప్రభుత్వాన్ని కోరవచ్చును. 1972లో ఈ చట్టాన్ని సవరించి, రాష్ట్ర ప్రభుత్వం కోరకున్నా కేంద్ర ప్రభుత్వమే ఆ నిర్ణయం తీసుకోవచ్చునన్నారు. అయితే సైన్యం మోహరింపుకు ప్రమాణం మాత్రం అదే. మోహరించబోయే ప్రాంతంలో కల్లోలం, లేక ప్రమాదకర పరిస్థితులు ఎంతగా విషమించి ఉండాలంటే పౌరపాలనకు అండగా సైన్యాన్ని దించనిదే పాలన సాగదనిపించేంతగా. ఈ అభిప్రాయానికి రాష్ట్ర ప్రభుత్వం రాకున్నా కేంద్ర ప్రభుత్వమే రావచ్చునన్నది 1972లో చేసిన సవరణ సారాంశం. 'ప్రాంతీయ' అస్తిత్వాన్ని ప్రాతిపదికగా గల సాయుధ పోరాట ఉద్యమాల పట్ల 'ప్రాంతీయ' ప్రభుత్వాలు (కాంగ్రెస్ పార్టీకి చెందినవే అయినా) మెతకవైఖరి ప్రదర్శిస్తున్నాయన్న అనుమానంతో వారు కోరకున్నా తానే సైన్యాన్ని పంపే అధికారం కేంద్రానికి ఉండాలని భావించి ఈ సవరణ చేశారు.

జీవన్‌రెడ్డి కమిటీ ఆ అధికారాన్ని విస్తృతం చేసింది. పైన చెప్పినట్టు రాష్ట్రం కోరుకోవాలన్నా కేంద్రం తానే పంపాలన్నా రెండు పరిస్థితులు ఉండాలి. ఆ ప్రాంతంలో కల్లోలం, లేక ప్రమాదకర స్థితి ఉండాలి. దానిని ఎదుర్కోడానికి పౌరప్రభుత్వానికి సైనిక బలగాల సహాయం అవసరమన్న అభిప్రాయానికి ప్రభుత్వం రావాలి. కల్లోలిత ప్రాంతాల ప్రకటనను ఎవరైనా కోర్టులో సవాలుచేస్తే ఈ రెండు పరిస్థితులూ ఉన్నాయనడానికి ప్రాథమిక ఆధారాలు ఆ ప్రభుత్వం చూపించవలసి ఉంటుంది. జీవన్‌రెడ్డి కమిటీ ఈ రెండు పరిస్థితులు ఉన్నప్పుడే కాకుండా 'ఒక రాష్ట్రంలో లేక ఒక ప్రాంతంలో ఆంతరంగిక కల్లోలాన్ని అణచడానికి సైనిక బలగాలను దింపడం అవసరం అని

**అర్థమయ్యీ కాక జీవన్‌రెడ్డి కమిటీ సిఫారసులను అమలుచేయాలని డిమాండ్ చేస్తున్న వారూ ఉన్నారు. అర్థమైన వారిమీద కూడా జీవన్‌రెడ్డి కమిటీ చేసిన ఒక విచిత్రమైన వాదన ప్రభావం ఉన్నట్టుంది. ఆ వాదన – నిర్బంధ అధికారాలను ఒక ప్రాంతానికే పరిమితం చేస్తే అది తమ ప్రాంతం పట్ల చిన్న చూపు లేక వివక్ష అని ఆ ప్రాంతం వారు భావించే అవకాశం ఉంది. వాటిని దేశానికంతా వర్తింపజేస్తే ఈ వివక్ష అనే భావన పోతుంది అనేది!**

కేంద్ర ప్రభుత్వం భావించినట్టయితే’ ఆ రాష్ట్రాన్ని, లేక ఆ ప్రాంతాన్ని కల్లోలిత ప్రాంతంగా ప్రకటించి సైనిక బలగాలను పంపించవచ్చునంది. అంటే ఆంతరంగిక కల్లోలం ఉంటే చాలు. దానిని రాష్ట్ర పౌరపాలనా యంత్రాంగం ఎదుర్కోగలదా లేదా అన్న ప్రశ్నతో నిమిత్తం లేకుండా కేంద్ర ప్రభుత్వం సైన్యాన్ని దించవచ్చు. ఆ రాష్ట్ర ప్రభుత్వం ఒక వేళ ‘నేను అదుపు చేయగలను. మీ సహాయం అక్కరలేదు’ అన్నా, అదుపు చేయగల సామర్థ్యం ఉందని రుజువు చేసినా కూడా కేంద్ర ప్రభుత్వం ఏకపక్షంగా సైన్యాన్ని పంపించవచ్చు. పైగా ఇది సాయుధ బలగాల (ప్రత్యేక అధికారాల) చట్టంలాగ ఎంపిక చేసిన కొన్ని రాష్ట్రాలకే కాదు, దేశమంతటికీ వర్తిస్తుంది. దీని ఫలితంగా ఎప్పుడైనా, ఎక్కడైనా ఆంతరంగిక కల్లోలం ఉందని చెప్పి ఏకపక్షంగా సైన్యాన్ని దించే అధికారం కేంద్ర ప్రభుత్వానికి ఉంటుంది.

ఇది అవాంఛనీయమైన కేంద్రీకరణ అనడంలో సందేహం లేదు. దానికి గల కారణం కోసం ఎంతో దూరం వెతకనక్కర లేదు. ‘జాతి భద్రత అన్నిటి కంటే ప్రధానమైన కర్తవ్యం’ అన్న కమిటీ అభిప్రాయం ఇంతటి కేంద్రీకరణను సూచించడానికి గల ప్రత్యక్ష కారణం. పైగా జాతిభద్రత అనే ప్రయోగానికి వారిచ్చిన వివరణను గమనిస్తే ఇది జాతి ప్రజల జీవితాలకు భద్రత కాదు, రాజ్యం భద్రత అని సులభంగా అర్థం అవుతుంది. రాజ్యం భద్రత అత్యంత ప్రధానమైన పాలనా లక్ష్యం అనీ, ప్రజల ప్రాథమిక హక్కులు, ప్రజాస్వామ్య పాలన మొదలైన ఇతర పాలనా విలువలు, లక్ష్యాలు దాని తరువాతేననీ, కమిటీ రిపోర్టు స్పష్టంగా అంటుంది. ఈ ప్రాధాన్యతను తలకిందులు చేసి ప్రజల ప్రాథమిక హక్కులు, ప్రజాస్వామ్య పాలన అన్నిటి కంటే ప్రధాన లక్ష్యాలని ప్రతిపాదించి నట్టయితే నిర్బంధ చట్టాల గురించి కలిగే అభిప్రాయం కూడా తలకిందులవుతుంది.

ఇదీ జీవన్‌రెడ్డి కమిటీ రిపోర్టు అసలు స్వరూపం కాగా ఆ కమిటీ సాయుధ బలగాల (ప్రత్యేక అధికారాల) చట్టం రద్దును సిఫారసు చేసిందంటూ పెద్దఎత్తునే ప్రచారం జరిగింది. కేంద్ర ప్రభుత్వ మేమో ఆ పని చేయబోవడం లేదని ప్రకటించేసింది. ఫలితమేమిటంటే ప్రజలు – ముఖ్యంగా మణిపూర్‌లో – మళ్ళీ రోడ్ల మీదికొచ్చి సాయుధ బలగాల చట్టాన్ని ఉపసంహరించు కోవాలని ఉద్యమిస్తున్నారు. అర్థమయ్యీ కాక జీవన్‌రెడ్డి కమిటీ సిఫారసులను అమలుచేయాలని డిమాండ్ చేస్తున్న వారూ ఉన్నారు. అర్థమైన వారిమీద కూడా జీవన్‌రెడ్డి కమిటీ చేసిన ఒక విచిత్రమైన వాదన ప్రభావం ఉన్నట్టుంది. ఆ వాదన – నిర్బంధ అధికారాలను ఒక ప్రాంతానికే పరిమితం చేస్తే అది తమ ప్రాంతం పట్ల చిన్న చూపు లేక వివక్ష అని ఆ ప్రాంతం వారు భావించే అవకాశం ఉంది. వాటిని దేశానికంతా వర్తింపజేస్తే ఈ వివక్ష అనే భావన పోతుంది అనేది!

✪



## నెహ్రూ పట్టణ పథకంలో
# పేదలకు చోటు లేదా?

– ఎస్.జీవనకుమార్★

**ఈ** మధ్య నిర్వహించిన జనాభా లెక్కల ప్రకారం దేశంలోని పట్టణ జనాభాలో 23.6 శాతం ప్రజలు దారిద్ర్య రేఖకు దిగువన నివసిస్తుండగా, అందులో 14.1 శాతం ప్రజలు పట్టణాల్లోని మురికివాడలలో కడు దయనీయమైన పరిస్థితుల్లో జీవనం వెళ్ళదీస్తున్నారు. యుపిఎ కామన్ మినిమమ్ ప్రోగ్రామ్‌లో “పట్టణాల్లో పౌర సదుపాయాలను పౌరుల భాగస్వామ్యంతో మెరుగుపరచి, కనీస సదుపాయాలు ప్రజలందరికీ అందుబాటులో ఉంచే వైపుగా పథకాలు తయారుచేస్తాం” అని ప్రకటించారు. అందుకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం డిసెంబర్, 2005వ సంవత్సరంలో “జవహర్‌లాల్ నెహ్రూ జాతీయ పట్టణ పునర్ నిర్మాణ పథకాన్ని” (Jawaharlal Nehru National Urban Renewal Mission - JNNURM) ప్రకటించింది. ఈ పథకం కిందకు నాలుగు మిలియన్లకు పైగా ఉన్న ఏడు నగరాలు (ఢిల్లీ, గ్రేటర్ ముంబాయి, అహ్మదాబాద్, బెంగుళూరు, చెన్నై, కలకత్తా, హైదరాబాద్), మిలియన్ పైన జనాభా ఉన్న 28 నగరాలు, మిలియన్ కంటే తక్కువగా ఉన్న 28 పట్టణాలతో సహా 60 నగరాలు వస్తాయి.



★ మానవహక్కుల కార్యకర్త. హైదరాబాద్‌లో అధ్యాపకులు

ఈ పథకం ఈ కింది లక్ష్యాలు సాధించడానికి ప్రయత్నిస్తుంది.

1. ఈ పథకం అమలుపరిచే నగరాల్లో మౌలిక సదుపాయాల సమగ్ర అభివృద్ధిని సాధించడం.
2. వనరుల సమీకరణ - నిరంతరం సేవలు అందించడానికి మార్గాలు పటిష్టం చేయడం.
3. పట్టణానికి సేవలందించడంలో అవసరమైన పెట్టుబడుల అవసరాన్ని పరిపూర్తి చేయడం.
4. ఈ పథకం కింద ఎంచుకున్న నగరాలలో ప్రణాళికా పరమైన అభివృద్ధి, నగర విస్తరణ పద్ధతిలో హేతుబద్ధత పాటించడం.
5. పాత నగరాలను పునర్ నిర్మించి జనాభా సాంద్రతను తగ్గించడం.
6. మురికివాడల అభివృద్ధి, అందులో నివసించే ప్రజలకు నివాస భద్రత కల్పించడం. తాగునీటి సరఫరా, మురుగునీటి వ్యవస్థలను మెరుగుపరచడం. ఆరోగ్య, విద్యావ్యవస్థలను మెరుగు పరచడం. మురికివాడల్లో ఉండే వృద్ధులకు ఆహారం, ఇతర సౌకర్యాలు కల్పించడం.

ఇందుకోసం 2005-2006 కేంద్ర బడ్జెట్‌లో 5,500 కోట్ల రూపాయలు కేటాయించ బడ్డాయి. ఏడు మెగా పట్టణాలకు నిధులు కేంద్రం నుండి 35 శాతం, స్థానిక సంస్థల నుండి 15 శాతం, బ్యాంకులు ఇతర ఆర్థిక సంస్థల నుండి 50 శాతం కేటాయించబడతాయి. 28 మెట్రో పట్టణాలకు 50:20:30 నిష్పత్తిలో నిధుల సమీకరణ చేసుకోవలసి ఉంటుంది. ఈ పథకం కింద నిధులు కోరే నగరాలు 'పట్టణ అభివృద్ధి పథకాన్ని' తయారుచేసి కేంద్ర ప్రభుత్వానికి పంపాలి. అయితే కేంద్ర ప్రభుత్వం నిధులను మంజూరు చేసే ముందు రాష్ట్ర ప్రభుత్వం నిబంధనలతో కూడిన ఒడంబడికపై సంతకం చేయాలి. ఈ ఒడంబడికలో రెండు రకాల అంశాలు ఉన్నాయి.

1. తప్పనిసరిగా అమలుపరిచే సంస్కరణలు:

ఎ) ప్రభుత్వ - ప్రైవేటు భాగస్వామ్యాన్ని పట్టణ అభివృద్ధి పథకం అమలు కార్యక్రమంలో తప్పని సరిగా ప్రోత్సహించాలి.

బి) పట్టణంలో మౌలిక సేవలు అందించడానికి, నియంత్రించడానికి ఒక స్వతంత్రమైన సంస్థను ఏర్పరచాలి.

సి) అయిదు శాతానికి మించకుండా ప్రస్తుతం అమలులో ఉన్న స్టాంపు డ్యూటీని సవరించాలి,

డి) పట్టణ భూగరిష్ట చట్టాన్ని, అందుకు సంబంధించిన ఇతర చట్టాలను ఎత్తివేయాలి.

ఇ) రెంట్ కంట్రోల్ చట్టాన్ని సంస్కరించి, ప్రైవేటు సంస్థల నుండి పెట్టుబడులు నిరంతరం రావడానికి దోహదం చేయాలి.

ఎఫ్) తాగునీటి సరఫరాను మెరుగుపరచడానికి, క్రమబద్ధీకరించడానికి తగు చర్యలు తీసుకోవాలి.

2) ఈ పై ఆరు అంశాలే కాకుండా, కింది వాటిలో ఒక ఐచ్ఛిక సంస్కరణను ఎంచుకోవాలి.

i) స్వచ్ఛంద పదవీ విరమణ ప్రక్రియ ప్రారంభించడం, అన్ని పరిపాలనా సంబంధ ఉద్యోగాలు నిలిపివేసి, పరిపాలన పద్ధతుల్లో సంస్కరణలు ఆరంభించడం.

ii) భవన నిర్మాణానికి సంబంధించిన నియమ నిబంధనలను సవరించడం, ప్లాట్లకోసం అభివృద్ధి చేసే భూములకు సంబంధించిన నిబంధనలు సరళీకరించడం.



iii) వ్యవసాయ భూముల్ని ఇతర కార్యక్రమాల కోసం వాడుకునేందుకు వీలుగా భూమి విని యోగంలో మార్పులు చేయడం.

పై అంశాలన్నీ నిశితంగా పరిశీలిస్తే తప్ప ఈ పథకం యొక్క అసలు ఉద్దేశాలు మనకు అర్థం కావు. భారతదేశంలోని పట్టణాల్లో మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడం, గ్రామాల నుండి విస్తారంగా తరలివచ్చి మురికి వాడలలో నివాస ముంటున్న పేద ప్రజలకు అన్ని సదు పాయాలు కల్పించడం నిజంగా చాలా అవసరం. 1990 సంవత్సరంలో మురికివాడల్లో ఉండే పేద ప్రజల జనాభా 65 మిలియన్లు ఉంటే, ఇప్పుడు దాదాపు 75 మిలియన్లకు చేరింది. దేశ జనాభాలో 21% ప్రజలు అతి అనారోగ్యకరమైన పరిసరాల్లో, మురికి వాడల్లో నివసిస్తున్నారని గణాంకాలు సూచిస్తున్నాయి. ఇందులో 23 శాతం ప్రజలకు మరుగుదొడ్డి సౌకర్యం లేదు. 37 శాతం మంది ప్రజలకు శుభ్రమైన తాగునీరు అందుబాటులో లేదు.

2020 సంవత్సరం నాటికల్లా సుమారు 300 మిలియన్ల ప్రజలు మురికివాడల్లో నివసిస్తూ ఉంటారని ఒక అధ్యయనంలో తెలిపారు. ఇప్పుడు ప్రభుత్వం హఠాత్తుగా ప్రవేశపెట్టిన ఈ పథకం పరిస్థితుల్ని చక్కబెట్టుతుందని అనుకోవడం పొరపాటే. ఈ పథక రచన ఎవరు చేశారో ఒకసారి పరిశీలిద్దాం. చూడటానికి కేంద్ర పట్టణాభివృద్ధి మంత్రిత్వశాఖ, పట్టణ పేదరిక నిర్మూలన ఉపాధి కల్పన కమిషన్ మరియు కామర్స్ మంత్రిత్వ శాఖ మనకు ఈ పథక నిర్మాణంలో ఉన్నట్టు కనబడ తాయి. USAID (United States Agency for International Development) కు చెందిన FIRE-D (Financial Institutions Reforms and Expansion - Debt) అనే సంస్థ కొంత కాలంగా దేశంలోని మున్సిపల్ శాఖలను మోడల్ మున్సిపల్ లా (MML)ను రచించుకోవాలని వత్తిడి చేస్తున్నది. ఈ సంస్థ మునిసిపల్ చట్టంలో సంస్కరణలు చేస్తే తప్ప పట్టణాల్లో పెట్టుబడులు పెట్టే అవకాశం పెరగదు అని అభిప్రాయపడుతుంది. ప్రధానంగా ఈ సంస్థ తెరవెనక కనపడు తోంది. దీనితో బాటుగా NIPFP (National Institute of Public Finance and Policy), ASSOCHAM (Association of Chamber of Commerce and Industry), JANAGRAHA అనే స్వచ్ఛంద సంస్థ మరియు WTO, ADB సంస్థలు రహస్యంగా తమ సంప్రదింపులు, సలహాలు ఈ పథక రచనలో అందించాయి.

ఈ సంస్థలన్నింటి ఉద్దేశం పెట్టుబడి ప్రవహించేందుకు అనువుగా పట్టణాలను తయారు చేయడం, ప్రజలకు మౌలిక సదుపాయాలు మెరుగుపరిచి అందించిన సేవలకు యూజర్ ఛార్జీల పేరుతో పన్నులు వసూలు చేయడం. "ప్రజలకు మెరుగైన సేవలు అందించి, సౌకర్యాలు మెరుగు పరిస్తే వాళ్ళు అందుకోసం ఎన్ని పన్నులైనా చెల్లించడానికి సంసిద్ధత వ్యక్తం చేస్తున్నారు" అని ఈ పథకంలో చాలాసార్లు స్పష్టంగా చెప్పబడింది. అధికారాలు పూర్తి వికేంద్రీకరణ జరగాలని చర్చ జరుగుతున్న తరుణంలో ఈ పాలసీ పూర్తిగా కేంద్ర ప్రభుత్వ ఆధిపత్యాన్ని సూచిస్తుంది. కేంద్ర ప్రభుత్వానికి, రాష్ట్ర ప్రభుత్వానికి, స్థానిక సంస్థలకు ఉండే సంబంధం పూర్తిగా అప్పిచ్చే వాడికి తీసుకునే వాడికి ఉండే సంబంధంలా కనబడుతుంది. షరతులు విధించడం, పరిపాలన సంస్కరణల కోసం సమ్మతించడం, కేంద్రం సూచించిన ముఖ్యమైన సంస్కరణల్లో ఒకటి ఎంచుకొని, ఒడం బడికపై సంతకాలు చేసిన తర్వాత నిధులు మంజూరు చేసే ప్రక్రియ ఇచ్చేవాడి, తీసుకునేవాడి సంబంధాన్ని సూచిస్తుంది. స్థానిక సంస్థలు బలపడే బదులు బలహీనపడతాయి. రాష్ట్ర స్థాయిలో

ఒక నిపుణుల కమిటీ వేసి నిర్ణయాలు తీసుకోవడమంటే, స్థానిక పరిపాలనా యంత్రాంగాన్ని చిన్న చూపు చూడటమే అవుతుంది.

ఈ పాలసీ పట్టణాభివృద్ధిలో స్థానిక సంస్థల పాత్రను, భాగస్వామ్యాన్ని నొక్కి చెపుతుంది. కాని వివరంగా పరిశీలిస్తే అసలు విషయం మనకు అర్థం అవుతుంది. 74వ రాజ్యాంగ సవరణ ప్రకారం ప్రజాస్వామ్య వ్యవస్థలో పూర్తిగా ప్రజలకు దగ్గరగా ఉన్న మునిసిపల్ కార్పొరేటర్ పట్టణ ప్రణాళిక రచనలో ప్రజల అభిప్రాయాలు వ్యక్తీకరించి ముఖ్యమైన పాత్ర పోషించవలసి ఉంటుంది. 'పౌరభాగస్వామ్యం' పేరుతో పట్టణాలలో కార్పొరేటర్ ప్రాతినిధ్యం అట్లా ఉంచి 'గ్రామ సభ' నమూనాలో 'ప్రాంతీయ సభ'ను ఏర్పరచాలని నిర్దేశిస్తుంది. ఈ సభకు పోలింగ్ స్టేషన్ ప్రాంతాన్ని హద్దులుగా పెట్టాలంటుంది. ఈ నమూనా బెంగుళూరులో పని చేస్తున్న 'జనాగ్రహ' అనే స్వచ్ఛంద సంస్థ ప్రతిపాదించిన 'నగర రాజబల్' నుండి తీసుకోబడింది. 'ప్రాంతీయ సభ' ప్రతినిధిని ఎన్నుకోకుండా నామినేట్ చేస్తుంది. మళ్ళీ ఆ ప్రాంతంలో అన్ని రకాల పలుకుబడి, పట్టు, రాజకీయ బలం ఉన్న వ్యక్తి మాత్రమే నామినేట్ చేయబడతాడు. ఈ ప్రక్రియ 74వ రాజ్యాంగ సవరణను నిర్వీర్యం చేస్తుంది.

ఈ పథకం ద్వారా వచ్చే నిధులకు సంస్కరణలకు దగ్గరి సంబంధం ఉంది. విధించబడిన షరతులు అభివృద్ధి కరంగా అనిపిస్తాయి, కాని రాజ్యాంగంలో నిర్దేశించిన ప్రజాస్వామిక పరిపాలన, ప్రభుత్వ సంస్థల జవాబుదారీతనాన్ని నీరు కారుస్తాయి. 'పట్టణాభివృద్ధి ప్రణాళిక' రచనలో ప్రజల భాగస్వామ్యం అని పేరుకు ఉంటుంది కాని దీని వెనక ధనిక వర్గం, బడా రియల్ ఎస్టేట్ వ్యాపార ధోరణి మనకు స్పష్టంగా కనపడుతుంది. పట్టణ భూగరిష్ట పరిమితి చట్టాన్ని పక్కన పెట్టడం వల్ల ఎవరికి లాభం అవుతుందో మనం సులభంగా అర్థం చేసుకోవచ్చు. ఇందులో తలపెట్టిన (MML - Model Municipal Law) ఆధునిక మునిసిపల్ చట్టం తాగునీటి సరఫరాను, పారిశుధ్య కార్యక్రమాన్ని పూర్తిగా ప్రైవేటు పరం వైపు తీసుకుపోతుంది. స్టాంపు డ్యూటీ తగ్గించడం వల్ల మునిసిపాలిటీల ఆదాయం బాగా తగ్గిపోయి ప్రయివేటు భాగస్వామ్యాన్ని ఆహ్వానించే పరిస్థితి ఏర్పడుతుంది – ఋణ సంస్థల నుండి అప్పులు తీసుకువచ్చే పరిస్థితిని కల్పిస్తుంది.

ఇగవర్నెన్స్ పేరుతో పరిపాలనలో సాగించిన పద్ధతులను ప్రవేశపెట్టడం ఇందులో చాలా ముఖ్యమైన అంశం. భారతదేశ నగరాల్లో ఉన్న మురికివాడల్లో రకరకాల ఇంటి స్థలాల (LAND TENURE) కాగితాలు బస్తీవాసుల దగ్గర ఉంటాయి. కొందరికి డి.ఫారమ్ పట్టాలుంటే, కొందరికి నోటరీ కాగితాలుంటాయి. చాలామంది దగ్గర అసలు ఏమీ కాగితాలు ఉండవు. తాతముత్తాతల కాలం నుండి అక్కడ నివసిస్తూ వస్తున్నామంటూ గత పరిస్థితులను వర్ణిస్తూ వాళ్ళ నివాసాల చరిత్రలు చెపుతుంటారు. జిఐస్ (GIS - Geographic Information System) ద్వారా పట్టణాలను మ్యాపింగ్ చేసే ప్రక్రియ ఈ పథకం సూచిస్తుంది. హైదరాబాద్‌తో సహా చాలా పట్టణాల్లో ఈ GIS మ్యాపింగ్ కార్యక్రమం ప్రైవేట్ కన్సల్‌టెంట్‌లు చేస్తున్నారు. సమాచారం అంతా ప్రభుత్వం చేతుల్లోకి వస్తే, "ఆక్రమణదార్ల"ను గుర్తించడం సులువు అవుతుంది. పన్నులు క్రమబద్ధీకరించే అవకాశాలు పెరుగుతాయి. అభివృద్ధి కోసం ముందుకు వచ్చే ప్రైవేటు భాగస్వామికి, పేద ప్రజల ఇండ్ల అడుగున ప్రభుత్వ భూమి లెక్కలు తెలిస్తే, వాటిని ఎట్లా స్వాధీనం చేసుకోవాలో ప్రభుత్వానికి సలహా ఇచ్చి తన ప్రయోజనాలను నెరవేర్చుకునే అవకాశం దొరుకుతుంది. మూడు నెలల క్రితం



మూసీ వెంబడి ఉన్న బస్తీలలోకి ఉమేశ్ మెహతా అనే పెద్ద బిల్డర్ వచ్చి బస్తీల స్థానంలో గ్రౌండ్ + 7 అపార్ట్‌మెంట్ల (జి+7) నిర్మాణం చేస్తానని, ఇంటి కాగితాలు ఉన్నా లేకున్నా, తను నిర్మించదలచుకున్న అపార్ట్‌మెంట్‌లో అందరికీ ఇండ్లు లభిస్తాయని చెప్పాడు. అంటే బస్తీలను జి+7 అపార్ట్‌మెంట్లుగా కుదించి అక్కడ బస్తీ అడుగున లభించే స్థలాన్ని తాను తీసుకోవడమన్న మాట. ఈ నిర్ణయం ఎవరు తీసుకున్నారో కాని ఒక ప్రైవేటు వ్యక్తి బొంబాయి నుంచి వచ్చి ఇంత ధైర్యంగా తన ఆలోచనలు ప్రజల్లో పెట్టడం ఆశ్చర్యమనిపించింది. బస్తీ ప్రజలంతా మాకు జి+7 వద్దు అని తిరగబడటంతో ఆయన పారిపోయాడు. తెల్లవారి మునిసిపల్ కమిషనర్ పత్రికా ప్రకటన చేస్తూ ఈ విషయంలో ఇంకా నిర్ణయం తీసుకోలేదు, 'ప్రజాభిప్రాయం' సేకరిస్తున్నామని అన్నాడు.

ఈ పథకం కింద వచ్చే నిధులు, 'నగర పరిపాలన వ్యవస్థ' ఎట్లా పనిచేస్తుందని పరిశీలించే ఒక ఫైనాన్షియల్ రేటింగ్ ఏజన్సీ ఇచ్చే సర్టిఫికెట్‌పై ఆధారపడి ఉంటాయి. ఒక ప్రైవేటు కన్సల్‌టెంట్ నగర పరిపాలన పద్ధతుల్ని, అధికార్ల ప్రవర్తనను, వారు కార్యక్రమాలను అమలుపరిచే విధానాల్ని అధ్యయనం చేసి, ఆ నగరాన్ని గ్రేడింగ్ చేస్తుంది. ఇందువల్ల రాజకీయ వ్యవస్థ, ప్రజాస్వామ్య సంస్కృతికి అనుగుణంగా కార్యక్రమాలు చేపట్టి, నిర్వహించే పరిపాలన సంస్థ ప్రతిభను పరిశీలించడం ఒక ప్రైవేటు వ్యక్తి చేతుల్లోకి పోతుంది.

స్థానిక సంస్థలు నిధుల్ని అప్పు తెచ్చుకుంటాయి కాని పనుల్ని నిర్ణయించడం, నిర్దేశించడం రకరకాల ఇతర ఏజన్సీల చేతుల్లోకి పోతుంది. అందువల్ల తీవ్ర సమస్యలు ఎదురౌతాయి. మైసూర్‌లో, మంగుళూరులో, పూనాలో పట్టణాభివృద్ధి పథకాన్ని అమలుపరచడంలో చాలా సమస్యలు తలెత్తాయి. పట్టణాభివృద్ధి అంటే IT పార్కుల నిర్మాణం, బయోటెక్నాలజీ కారిడార్స్ నిర్మించడం మాత్రమే జరుగుతుంది. ఈ సాంకేతిక, కంప్యూటర్ సంస్థల్లో మళ్ళీ ధనిక, మధ్య తరగతులకు చెందిన యువతీ యువకులకు మాత్రమే ఉద్యోగాలు దొరుకుతున్నాయి.

జాతీయ గృహనిర్మాణ, నివాస పాలసీ ముసాయిదాలో మురికివాడలను అభివృద్ధి చేయడం ఒక ముఖ్యమైన ఉద్దేశంగా లిఖించారు. కాలనీలు, ఇళ్ళ కోసం ప్లాట్లు అభివృద్ధి చేసే సంస్థలు, ప్రైవేటు వ్యక్తులు కనీసం 20 శాతం ప్లాట్లను లేక ఇండ్లను పేదలకు కేటాయించే రకంగా / కొనుక్కునే విధంగా వెసులుబాటు కల్పించాలని ఈ పథకం నిర్దేశిస్తుంది. కాని ఈ సూచనను JNNURM నిబంధనల్లో ఒక ఐచ్ఛిక అంశంగా పొందుపరిచారు. బెంగుళూరు, హైదరాబాద్ లాంటి నగరాలు ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ సంస్థలకు కేంద్రాలే కాకుండా, ప్రపంచ పెట్టుబడిని ఆకర్షించడానికి కావలసిన మౌలిక సదుపాయాలు, వసతులు కల్పిస్తున్నాయి. ఇందుకు తార్కాణంగా హైదరాబాద్ చుట్టూ నిర్మించే ప్రపంచంలోకెల్లా వెడల్పయిన, పెద్దదైన రింగ్ రోడ్డు నిర్మాణం మన కళ్ళముందు కనబడుతుంది. ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ సంస్థలకు కావలసిన సదుపాయాలే కాకుండా చాలా నగరాల్లో 'సహారా'లాంటి సంస్థ పెద్ద పెద్ద కాలనీల నిర్మాణం చేపట్టింది. బెంగుళూరు పట్టణంలోని రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులు లండన్, టోక్యో నగరాల భవన నిర్మాణాల వ్యాపారులతో కూడా సంబంధాలు పెట్టుకున్నారు. ప్రపంచ నగరాలైన హాంగ్‌కాంగ్, టోక్యో, సింగపూర్, దుబాయి, లండన్‌ల నుండి పెట్టుబడి, సాంకేతిక పరిజ్ఞానం అమ్ముకునే సంస్థలు బెంగుళూరుకు నేరుగా చేరుతున్నాయి. అంతర్జాతీయ ద్రవ్య సంస్థలు ప్రపంచ బ్యాంకు సంస్కరణల ఎజెండాను అన్ని అంశాల్లో జొప్పిస్తున్నారు. ఈ మొత్తం ప్రక్రియలో పేదవాడికి, చిన్న వ్యాపారస్తుడికి చోటు ఉందా అనేది పెద్ద ప్రశ్న.

ఈ అభివృద్ధి ప్రక్రియ న్యాయస్థానాలను, జడ్జీలను ఒక 'మాయా ప్రపంచం' (Unrealistic Reality) లోకి నెట్టివేస్తుంది. పెద్ద పెద్ద కార్లు రోడ్లపైకి రావడం, కార్లు సులభంగా కొనుక్కునే వాళ్ళు నగరాల్లో పెరగడం, జనాభా పెరుగుదల లాంటి అంశాలు న్యాయమూర్తులను కలవరపరచి, చిన్న వ్యాపారం చేసే వాళ్ళను, ఫుట్‌పాత్‌పై అమ్ముకుని జీవించే వాడిపై దృష్టి సారించి, వీళ్ళే సమస్యలకు కారణం అన్నట్టుగా నమ్మిస్తుంది. హైదరాబాద్ నగరం ఫుట్‌పాత్‌ల నుంచి చిన్న వ్యాపారులను ఖాళీ చేయించడానికి హైకోర్టు ఇచ్చిన ఆదేశాలు మనకు ఈ నేపథ్యాన్ని చూపెడతాయి.

ఈ పాలసీ అన్ని విషయాలు చెప్పి జీవనోపాధి గురించి మాత్రం నిశ్శబ్దంగా ఉంటుంది. బస్తీల్లో మౌలిక సదుపాయాలు పెంచడం, నీరు, విద్యుచ్ఛక్తిలను క్రమబద్ధీకరించి సేవలకు ఛార్జీలు వసూలుచేస్తే తప్పేమీ లేదు అంటుంది. బస్తీలు తరలించడం వల్ల, ఊరు బయట ఇండ్లు కట్టించడం వల్ల పేదల జీవనోపాధి దెబ్బతిని బతుకు భారమైతే దానికి పరిష్కారాలకు మాత్రం ఎక్కడా అవకాశం కల్పించదు. ఈ పథకం అమలు తీరును గమనిస్తూ, ప్రజలను చైతన్యపరుస్తూ 'రాజ్యాంగ చట్రం' నుంచి ప్రభుత్వాలని ప్రశ్నించే పని హక్కుల సంఘాలు, ప్రజాసంఘాలు చేయకపోతే పేదల జీవితాలు మరింత దుర్భరమవుతాయి.

✪





## రిజర్వేషన్లు:

# న్యాయస్థానాల వైఖరే అసలు సమస్య

–కె. బాలగోపాల్★

తీర్పు రాయమంటే వ్యాసాలు రాస్తే కష్టం.

సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఎం.నాగరాజ్ వర్సస్ యూనియన్ ఆఫ్ ఇండియా అనే కేసులో పిటిషనర్లు లేవదీసిన ప్రశ్నలకు జవాబులు చెప్పి ఊరుకోకుండా, రిజర్వేషన్ల మీద ఉడికీ ఉడకని వ్యాసం రాయడం కలకలానికి దారితీసింది. బిసిలలో లాగే ఎస్‌సి, ఎస్‌టిలలో కూడా 'క్రీమీ లేయర్'ను గుర్తించి రిజర్వేషన్ల పరిధి నుంచి తొలగించమని సుప్రీంకోర్టు అన్నదన్న అభిప్రాయం ప్రచారం అయింది. ఇంకొక రెండు ఆందోళనకరమైన అభిప్రాయాలు కూడా ఆ తీర్పులో వ్యక్తం అయ్యాయి గానీ, అవి మొదటి దానిలాగా వెంటనే అర్థమయ్యేవి కావు కాబట్టి అల్లరి జరగలేదు. ఒకటి, ఎస్‌సి, ఎస్‌టిలకు ప్రభుత్వ ఉద్యోగాల ఎంపికలో ఏదైనా ప్రత్యేక ప్రతిపత్తి లేక హక్కు (రిజర్వేషన్లు, అర్హతల సడలింపు వగైరా) ఇవ్వదలచిన ప్రతి ఒక్క సందర్భంలోనూ వారు వెనుకబడి ఉన్నారని శాస్త్రీయ ప్రమాణాల ప్రాతిపదికన రుజువు చేసిన తరువాతే ఆ పని చేయాలి. రెండు, ప్రభుత్వ ఉద్యోగ రంగంలో ఎంపికలో ఎస్‌సి, ఎస్‌టిల లాగే బిసిలకు కూడా రిజర్వేషన్లు ఇయ్యవచ్చును గానీ ప్రమోషన్లలో బిసిలకు ఇవ్వడానికి వీలులేదు.

ఈ మూడు అభిప్రాయాలూ స్పష్టాస్పష్టంగా ఈ తీర్పులో ఉన్నాయి. వాటిని రాజ్యాంగ వ్యాఖ్యానంగా సుప్రీంకోర్టు ఉద్దేశించిందా లేక యథాలాపంగా ప్రవచించిందా అనేది తెలీదు. మొదటిదేనేమోనన్న భయం, రెండవదే లెమ్మన్న ధీమా ఈ తీర్పు పట్ల కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చిన వ్యాఖ్యలలో వ్యక్తం అవుతున్నది.

ఒక కవిత గురించో కథ గురించో చర్చించుకునేటప్పుడు రచయిత భావమేమిటి అని వాదించుకోవడం, విభేదించడం సహజం. న్యాయస్థానాలిచ్చే తీర్పుల విషయంలోనూ అటువంటి పరిస్థితి ఉంటే కష్టం. తీర్పు తప్పు కావచ్చు, ఒప్పు కావచ్చు. న్యాయం కావచ్చు, అన్యాయం కావచ్చు. కానీ అస్పష్టంగా మాత్రం ఉండడానికి వీలులేదు.

ఈ మధ్య కాలంలో సుప్రీంకోర్టు నుంచే అస్పష్టమైన తీర్పులు వెలువడడం మామూలు విషయం అయిపోయింది, ప్రైవేటు రంగంలో రిజర్వేషన్ల గురించి 13 మంది జడ్జిల బెంచి ఏమందో

★ మానవ హక్కుల కార్యకర్త, ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో న్యాయవాది

స్పష్టంగా లేదని వారి అభిప్రాయం ఏమిటో వివరించమని అయిదుగురు జడ్జీలను కూర్చోబెడితే, ఈ బెంచి వారి అభిప్రాయాన్ని స్పష్టం చేసే బదులు తన సొంత అభిప్రాయం చెప్పగా, మళ్ళీ ఏడుగురు జడ్జీలు కూర్చొని వీరి అధిక ప్రసంగాన్ని విమర్శించి తొలితీర్పును స్పష్టపరచే పని చేసిన వైనం ఇనాందార్ వర్సస్ స్టేట్ ఆఫ్ మహారాష్ట్ర కేసులో ఈ మధ్యనే చూశాం. ఇది కొంతవరకు భాషకు సంబంధించిన సమస్య. హైకోర్టు, సుప్రీంకోర్టుల భాష ఇంగ్లీష్ అని రాసుకున్నాం. (కింది కోర్టులన్నీ కూడా ఇంగ్లీష్‌లో నడిచే అతి కొద్ది రాష్ట్రాలలో ఆంధ్రప్రదేశ్ ఒకటి). కానీ ఆ భాష మీద అతి కొద్దిమంది న్యాయమూర్తులకు పట్టు ఉంది. నాలుగు న్యాయ సిద్ధాంత పడికట్టు పదాలు పట్టుకొని క్లిష్టమైన వ్యాఖ్యలు చేస్తుంటారు. ఇది సహజంగానే అస్పష్టతకు, అసమగ్రతకు దారితీస్తుంది. కానీ భాష ఒక్కటే సమస్య కాదు. ఆలోచనలలో తార్కికత కొరవడడం మరొక సమస్య. కొంత న్యాయ సిద్ధాంత పరిభాష అలవడాలే గానీ, అత్యున్నత స్థాయి కోర్టు తీర్పులలో సైతం తర్కం ఎంత బలహీనంగా ఉంటున్నదో సాధారణ విద్యావంతులు కూడా చూడగలరు. మూడవ సమస్య భావదారిద్ర్యం. భారతదేశమంతటి వైవిధ్యము, సంక్లిష్టత ఉన్న దేశ పాలన గురించి ఆలోచించేటప్పుడు ఉండవలసిన విశాల దృక్పథం ఈ తరం న్యాయమూర్తులలో చాలా అరుదు. ప్రత్యేకించి సమానత, సామాజిక న్యాయం అనే భావాల పట్ల వ్యతిరేక వైఖరి – రాజ్యాంగంలో వాటికింకా చోటు ఉంది కాబట్టి అప్పుడప్పుడు వాటి దిశగా ఒక నమస్కారం పారేయడం తప్పనిసరైనప్పటికీ – న్యాయస్థానాలలో చాలా మామూలు విషయం అయిపోయింది.

ఈ భావదారిద్ర్యమే లేకపోతే ప్రస్తుతం ఆందోళనకూ వివాదానికీ దారితీసిన 'నాగరాజు' కేసు ఉనికిలోకి వచ్చేదే కాదు. పార్లమెంటు రాజ్యాంగానికి చేసిన 77వ, 81వ, 82వ, 85వ సవరణలు చెల్లుతాయా లేక అవి పార్లమెంటుకుండే అధికారాలను మించిన సవరణలా అనేది నాగరాజు కేసులో సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ముందున్న వివాదం. రిజర్వేషన్ల పట్ల సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన సంకుచితమైన తీర్పులను అధిగమించడానికే ఈ నాలుగు రాజ్యాంగ సవరణలూ చేయవలసి వచ్చిందని గ్రహిస్తే, వాటి రాజ్యాంగ బద్ధతపైన అగ్రకులాలు లేవదీసిన సవాలును అడ్డం పెట్టుకొని మరిన్ని సందేహాస్పదమైన వ్యాఖ్యలు ఆ కోర్టు ఏ విధంగా చేయగలిగిందో అర్థం అవుతుంది.

ఉద్యోగ రిజర్వేషన్లకు మూలం రాజ్యాంగంలోని ఆర్టికల్ 16 (4) లో ఉంది. ప్రభుత్వ ఉద్యోగ రంగంలో తగిన ప్రాతినిధ్యం లేని వెనుకబడిన వర్గాలకు నియామకాలలోనూ పోస్టులలోనూ రిజర్వేషన్లు ఇయ్యవచ్చునని 16 (4) అంటుంది. నియామకం అనేది నేరుగా ఉద్యోగంలోకి తీసుకోవడం ద్వారా జరగవచ్చు, ప్రమోషన్ ద్వారానూ జరగవచ్చు. 'పోస్టు' అనేది (ఉద్యోగం అందాం) నేరుగా నింపేదీ కావచ్చు, ప్రమోషన్ ద్వారా నింపేదీ కావచ్చు. కాబట్టి 16 (4) ప్రకారం నేరుగా చేసే నియామకాలలోనే కాక ప్రమోషన్లలో కూడా (తగిన ప్రాతినిధ్యం లేని వెనుకబడిన వర్గాలకు) రిజర్వేషన్ కల్పించ వచ్చునేది అందరూ సులభంగా గ్రహించగల

**భారతదేశమంతటి వైవిధ్యము, సంక్లిష్టత ఉన్న దేశ పాలన గురించి ఆలోచించేటప్పుడు ఉండవలసిన విశాల దృక్పథం ఈ తరం న్యాయమూర్తులలో చాలా అరుదు. ప్రత్యేకించి సమానత, సామాజిక న్యాయం అనే భావాల పట్ల వ్యతిరేక వైఖరి న్యాయస్థానాలలో చాలా మామూలు విషయం అయిపోయింది.**



విషయం. 1962లో 'రంగాచారి' కేసుగా పేరుపొందిన జనరల్ మేనేజర్, దక్షిణ మధ్య రైల్వే వర్సెస్ రంగాచారి అనే కేసులో సుప్రీంకోర్టు అదే అభిప్రాయం వ్యక్తం చేసింది. అయితే 1992లో మండల్ కమిషన్ కేసు (ఇందిరా సహానీ వర్సస్ యూనియన్ ఆఫ్ ఇండియా)లో తొమ్మిది మంది జడ్జీల రాజ్యాంగ ధర్మాసనం దానిని తిరగదోడి నేరుగా చేసే అపాయింట్‌మెంట్‌లోనే తప్ప ప్రమోషన్‌లో రిజర్వేషన్ ఇవ్వడానికి వీలులేదనింది.

ఎందుకని? రిజర్వేషన్ ద్వారా జూనియర్లకు ప్రమోషన్ వచ్చి సీనియర్ దిగువ పోస్టులో ఉండిపోవడం పాలనా యంత్రాంగంలో అసంతృప్తికి దారితీస్తున్నదని, దాని సామర్థ్యాన్ని దెబ్బతీస్తున్నదని వాదించిన వారి తర్కాన్ని కోర్టు ఆమోదించిన కారణంగా ఈ అభిప్రాయం వ్యక్తం చేసింది. రిజర్వేషన్లు ఇచ్చేటప్పుడు పాలనా యంత్రాంగం సామర్థ్యం దెబ్బతినకుండా చూసుకోవాలని రాజ్యాంగంలోని ఆర్టికల్ 335 చెప్పిన విషయాన్ని ఈ సందర్భంగా ఉటంకించింది. అయితే జూనియర్లు ముందే ప్రమోట్ కావడమనేది వేరే కారణాల వల్ల కూడా జరుగుతుంటుంది. క్వాలిఫికేషన్లు లేవని, డిపార్టుమెంటల్ పరీక్షలు పాసు కాలేదని, పనిలో యోగ్యత కొరవడిందని సీనియర్‌లు ప్రమోషన్ పొందని సందర్భాలు అనేకం. ఒక్కొక్కసారి పైస్థాయి పోస్టుకు కింది నుంచి ప్రమోషన్ల ద్వారానే కాక నేరుగా రిక్రూట్ చేసుకోవడం కూడా జరుగుతుంది. అప్పుడు వయసు, అనుభవం రెండూ తక్కువ ఉన్న వారు పైస్థాయి ఉద్యోగాలలో నియమితులవుతుంటారు. 50 ఏళ్ళ వయసున్న ఆర్‌డిఓలు మూతిమీద మీసం లేని యువ కలెక్టర్లకు వంగి వంగి సలాంలు చేయడం చూస్తూనే ఉన్నాం. అప్పుడు లేని సమస్య రిజర్వేషన్ ఇచ్చినప్పుడే ఎందుకొచ్చింది?

వచ్చిందని తొమ్మిది మంది జడ్జీల రాజ్యాంగ ధర్మాసనం భావించింది. దానికి విరుగుడుగా 77వ రాజ్యాంగ సవరణ చేసి ఆర్టికల్ 16 (4ఎ) చేర్చి ఎస్‌సి, ఎస్‌టిలకు ప్రభుత్వ ఉద్యోగాలలోనూ (తగిన ప్రాతినిధ్యం లేని పక్షంలో) ప్రమోషన్లలోనూ రిజర్వేషన్ ఇయ్యవచ్చునని రాజ్యాంగం చేత చెప్పించారు.

ఈ సవరణ వెంటనే అమలుకావడం మొదలయింది. సహజంగానే, రిజర్వేషన్ ద్వారా ప్రమోషన్ పొందిన వారు పైపోస్టులో చేరిన రోజు నుంచి సీనియారిటీ పొందారు. దీనిని ప్రమోషన్ ఆలస్యంగా పొందిన అగ్రకులాల వారు సవాలు చేయగా, అజిత్‌సింగ్ జనూజా వర్సస్ స్టేట్ ఆఫ్ పంజాబ్ కేసులో 1995లో సుప్రీంకోర్టు 77వ రాజ్యాంగ సవరణ కారణంగా ఎస్‌సి, ఎస్‌టిలకు ప్రమోషన్‌లో రిజర్వేషన్లు ఇస్తే ఇచ్చారు గానీ ఈ రకంగా ప్రమోషన్ పొందిన వారికి పైపోస్టులో సీనియారిటీ రాదనింది. వారి తరువాత ప్రమోషన్ పొందిన వారి సీనియర్లు పైపోస్టులోనూ సీనియర్లవుతారని ప్రకటించింది. పైన చెప్పినట్టు, అనేక ఇతర కారణాల వల్ల కింది పోస్టులో జూనియర్లుగా ఉన్న వారు ముందుగా ప్రమోషన్ పొందుతారని చూశాం. అక్కడ వాళ్ళ సీనియారిటీ ప్రమోషన్ పొందిన నాటి నుంచి లెక్కించబడుతుంది తప్ప కింది పోస్టులో వారికి సీనియర్లుగా ఉన్న వారు ఆలస్యంగా డిపార్టుమెంటల్ టెస్టులు పాసై ఆలస్యంగా ప్రమోషన్ పొందితే పైపోస్టులో వారికి సీనియారిటీ ఇవ్వరు. ఒక్క రిజర్వేషన్ల విషయంలోనే అభ్యంతరం ఎందుకొచ్చింది మరి?

వచ్చిందని సుప్రీంకోర్టు భావించింది కాబట్టే 85వ రాజ్యాంగ సవరణ అవసరం అయింది. మొన్ననే పుట్టిన ఆర్టికల్ 16 (4ఎ)ని సవరించి ప్రమోషన్‌లో రిజర్వేషన్‌లు సీనియారిటీతో సహా ఇయ్యవచ్చునని రాజ్యాంగం చేత అనిపించవలసి వచ్చింది.

అక్కడితో కథ అయిపోలేదు. మామూలుగా, రిజర్వేషన్లు కల్పించినా కూడా సంబంధిత సామాజిక వర్గం ఆ ప్రయోజనాన్ని అందుకునే స్థితిలో లేకుంటే, ఉద్యోగ అర్హతలను సడలించడం జరుగుతుంది. ఇందులో తప్పేమీ లేదని కోర్టులు అని ఉన్నాయి. ప్రమోషన్లలో ఎస్సి, ఎస్టిలకు ఇచ్చిన రిజర్వేషన్లకు కూడా దీనిని వర్తింపచేసి ప్రమోషన్ పోస్టులకుండే అర్హతలను కూడా అవసర మైన మేరకు ప్రభుత్వం సడలించసాగింది. ఇది చెల్లదని సుప్రీంకోర్టు ఎస్.వినోద్‌కుమార్ వర్సస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో 1996లో అనింది. దీనిని అధిగమించడానికి 82వ రాజ్యాంగ సవరణ చేసి ఆర్టికల్ 335కు ఒక షరతు తగిలించవలసి వచ్చింది.

చివరిగా మొత్తం రిజర్వేషన్లు 50 శాతం మించకూడదన్న నియమాన్ని మండల్ కమిషన్ కేసులో సుప్రీంకోర్టు వ్యాఖ్యానించిన తీరువల్ల 81వ రాజ్యాంగ సవరణ అవసరం అయింది. నిజా నికి ఒక కేడర్‌లో మొత్తం రిజర్వేషన్ 50 శాతం మించి ఉండడానికి వీలులేదన్న రాజ్యాంగ సూత్రానికి ఇప్పుడు ఏ తర్కంలేదు. ప్రభుత్వం ఉద్యోగాలలో ఎటువంటి వివక్షా పాటించడానికి వీలులేదని, అందరికీ సమాన అవకాశాలు ఉండాలని రాజ్యాంగంలోని ఆర్టికల్ 16 (1) అంటుంది. అయితే ఉద్యోగ రంగంలో తగు ప్రాతినిధ్యం లేని వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్ కల్పించ వచ్చునని 16 (4) అంటుంది. మొదట్లో ఈ 16 (4) ను 16 (1) కి మినహాయింపుగా భావించింది సుప్రీంకోర్టు. అంటే రిజర్వేషన్లు సమాన అవకాశాలకు మినహాయింపు అని అర్థం చేసుకుంది. మరైతే మినహాయింపు అసలు కంటే ఎక్కువ ఉండకూడదు కదా? ఎక్కువ ఉంటే దానిని మినహా యింపు అనరు కదా? ఈ కామన్‌సెన్స్ తర్కంతో 1963లో గజేంద్ర గడ్కర్ '50 శాతం గరిష్ఠ పరిమాణం' అనే దానిని రిజర్వేషన్లకు సంబంధించిన రాజ్యాంగ సూత్రంగా ఎం.ఆర్.బాలాజీ వర్సస్ స్టేట్ ఆఫ్ మైసూర్ కేసులో ప్రకటించాడు.

రిజర్వేషన్లు సమాన అవకాశాలకు మినహాయింపు కాదనీ, సమాన అవకాశాలకు ఒక సాధన మనీ 1976లో మొట్టమొదటిసారి సుప్రీంకోర్టు గుర్తించింది. కృష్ణ అయ్యర్, ఫజల్ ఆలీ మొదలుగా గల ఏడుగురు జడ్జీల బెంచి స్టేట్ ఆఫ్ కేరళ వర్సస్ ఎన్.ఎం.థామస్ కేసులో ఈ వాస్తవాన్ని గుర్తించి ప్రకటించింది. మరి రిజర్వేషన్లు సమాన అవకాశాలకు మినహాయింపు కాదు, ఒక సాధనం అని గుర్తించినట్టయితే మొత్తం రిజర్వేషన్ 50 శాతానికి లోబడి ఎందుకు ఉండాలి? సమాన అవ కాశాలకు ఆ సమయంలో ఉండే ఆటంకం ఎంత బలంగా ఉందన్న దాన్ని బట్టి రిజర్వేషన్ల పరిమాణం ఉండాలే తప్ప ముందే ఒక గరిష్ట పరిమాణం రాజ్యాంగం ఎట్లా ప్రకటించగలుగు తుంది? ఫజల్ ఆలీ ఆ కేసులో విడిగా రాసిన తీర్పులో ఈ మాట అననే అన్నాడు. ఒక రాష్ట్రంలో వెనుకబడిన ప్రజలు 80 శాతం ఉంటే రిజర్వేషన్లు 50 శాతం మించి ఉండడానికి వీలు లేదనడం అర్థరహితం అన్నాడు. (ఈ మాట ఒక హైందవేతర న్యాయమూర్తే అనగలిగాడని మేమంటే న్యాయమూర్తులకు మతాన్నీ, కులాన్నీ ఆపాదిస్తున్నాం అని విరుచుకుపడతారు కాబోలు!)

**రిజర్వేషన్లు సమాన అవకాశాలకు మినహాయింపు కాదు, ఒక సాధనం అని గుర్తించినట్టయితే మొత్తం రిజర్వేషన్ 50 శాతానికి లోబడి ఎందుకు ఉండాలి? సమాన అవకాశాలకు ఆ సమయంలో ఉండే ఆటంకం ఎంత బలంగా ఉందన్న దాన్ని బట్టి రిజర్వేషన్ల పరిమాణం ఉండాలే తప్ప ముందే ఒక గరిష్ట పరిమాణం రాజ్యాంగం ఎట్లా ప్రకటించగలుగుతుంది?**



అయినప్పటికీ గజేంద్రగడ్కర్ అభిప్రాయమే సుప్రీంకోర్టు అభిప్రాయంగా కొనసాగింది. మండల్ కమిషన్ కేసులో తొమ్మిది మంది జడ్జీల బెంచి కూడా దానిని నొక్కి చెప్పింది. తొలినాటి తర్కాన్ని కోల్పోయిన ఈ అభిప్రాయం కేవలం సుప్రీంకోర్టు ప్రవచనం కారణంగా ఒక రాజ్యాంగ సూత్రంగా మిగిలిపోయింది. అయితే మండల్ కమిషన్ కేసులో సుప్రీంకోర్టు ఒక ఉద్యోగానికి సంబంధించిన కేడర్‌లో రిజర్వేషన్లు 50 శాతం మించడానికి వీలులేదని ఊరుకోకుండా, ఒక కేడర్‌కు ఏ ఒక్క సంవత్సరంలో జరిగే రిక్రూట్‌మెంట్‌లో నైనా రిజర్వేషన్లు 50 శాతం మించి ఉండడానికి వీలులేదని కూడా ప్రకటించింది. మరైతే బ్యాక్‌లాగ్ పోస్టులను ఎట్లా నింపుతారు? ఒక కేడర్‌లో ఒక సంవత్సరం కొత్తగా 30 పోస్టులు నింపవలసి వచ్చిందనుకుందాం. అందులో 15 దాకా రిజర్వ్‌డ్ పోస్టులు ఉంటాయి (ఒకటో రెండో ఇటూ అటూగా). కానీ అదే కేడర్‌లో 20 ఎస్సి బ్యాక్‌లాగ్ పోస్టులు నింపవలసి ఉందనుకోండి. అవన్నీ ఎస్సిలకు రిజర్వ్ కావలసిందే కదా! ఆ 30, ఈ 20 కలిపి నోటిఫై చేస్తే మొత్తం 50 పోస్టులలో 35 రిజర్వ్ అవుతాయి. అంటే 50 శాతం మించి పోతుంది. ఒక వేళ ఆ సంవత్సరం కేవలం బ్యాక్‌లాగ్ పోస్టులే నింపినట్టయితే ఇరవైకి ఇరవయ్యీ రిజర్వ్ అవుతాయి. అంటే బ్యాక్‌లాగ్ నింపడం అసాధ్యం అని అర్థం. బొత్తిగా అనాలోచితంగా తొమ్మిది మంది జడ్జీల బెంచి వ్యక్తం చేసిన అభిప్రాయాన్ని అధిగమించడానికి 81వ రాజ్యాంగ సవరణ చేసి రాజ్యాంగానికి ఆర్టికల్ 16 (4బి)ని చేర్చి రిజర్వేషన్లు 50 శాతం మించడానికి వీలులేదు అన్న నియమాన్ని ఒక సంవత్సరంలో చేసే నియామకాలకు అన్వయించే టప్పుడు బ్యాక్‌లాగ్ పోస్టులు లెక్కలోకి రావని రాజ్యాంగం చేతనే చెప్పించవలసి వచ్చింది.

ఉద్యోగ రంగంలో తగిన ప్రాతినిధ్యం లేని వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్లు కల్పించే అధి కారానికి సుప్రీంకోర్టు అడుగడుగునా అహేతుకంగా అడ్డం పడడం ఈ రాజ్యాంగ సవరణలకు దారితీసిందనేది స్పష్టమే. 1950ల నుంచి 1970 దాకా ప్రైవేటు ఆస్తిని ప్రభుత్వ పరం చేసే చట్టాలకు, ప్రభుత్వ ఆదేశాలకు సుప్రీంకోర్టు అడ్డం పడడం, ఆ అడ్డంకిని తొలగించుకోవడానికి ప్రభుత్వం ఒకటికి నాలుగుసార్లు రాజ్యాంగాన్ని సవరించడం జరిగింది. ఇప్పుడు ప్రైవేటు ఆస్తులను పెంచే పనే తప్ప స్వాధీనం చేసుకునే ఆలోచన ప్రభుత్వాలు చేయడం లేదు కాబట్టి ఆ విషయంలో ప్రభుత్వానికీ, న్యాయస్థానాలకూ ఘర్షణ పాత చరిత్ర అయిపోయింది. దాని స్థానాన్ని రిజర్వేషన్లు ఆక్రమించుకున్నాయి. మెట్టుమెట్టుగా సుప్రీంకోర్టు అడ్డుపడడం, ప్రభుత్వం రాజ్యాంగాన్ని సవరించి సామాజిక న్యాయ లక్ష్యాన్ని కాపాడడం జరుగుతున్నది.

భారత రాజ్యాంగం ప్రపంచంలోని అతి పెద్ద రాజ్యాంగాలలో ఒకటన్నది తెలిసిన విషయమే. రాజ్యాంగంలో స్థూలంగా పాలనాధికారాలనూ, పౌరుల హక్కులనూ సూచించాలే గానీ ప్రతి చిన్న పాలనాధికార విశేషాన్ని రాజ్యాంగంలో రాయడం ఏమిటన్న విమర్శ భారత రాజ్యాంగంపైన ఎప్పటి నుంచో ఉంది. రాజ్యాంగ పరిషత్ ముందు రాజ్యాంగం ముసాయిదాను ప్రవేశపెట్టిన సందర్భంగా చేసిన చాలా ఆసక్తికరమైన ఉపన్యాసంలో అంబేద్కర్ దీనికి చక్కగా జవాబు చెప్పాడు. ప్రతి రాజ్యాం గానికీ కొన్ని విలువలు ఉంటాయి. ఆ విలువల స్ఫూర్తిని ఆ సమాజం, ఆ దేశ పాలనా యంత్రాంగం జీర్ణించుకొని ఉన్నట్టయితే రాజ్యాంగం క్లుప్తంగా ఉన్నా ఫరవాలేదు గానీ మనది ప్రజాస్వామ్యాన్ని పైపూతగా గల అత్యంత అప్రజాస్వామిక సమాజం కాబట్టి అది సాధ్యం కాదని అన్నాడు. చారిత్రక కారణాల వల్ల వెనుక ఉంచబడ్డ వారికి ఉద్యోగాలలో ప్రత్యేక హక్కులు కల్పించే అధికారం ప్రభు

త్వానికి ఉంది అన్న నాలుగు వాక్యాలు రాజ్యాంగంలో రాసి ఉంటే సరిపోవలసింది, ప్రమోషన్లలో రిజర్వేషన్లు ఇయ్యవచ్చునా, ఇస్తే సీనియారిటీ ఇయ్యవచ్చునా, క్వాలిఫికేషన్ మార్కులు తగ్గించ వచ్చునా అంటూ ఒక జిఒలో ఉండవలసిన వివరాలన్నీ రాజ్యాంగంలోనే రాసుకోవలసిన అగత్యం ఏర్పడడానికి రాజ్యాంగ విలువల స్ఫూర్తి సమాజంలోను, పాలనా యంత్రాంగంలోనే కాదు, న్యాయ స్థానాలలోనూ కొరవడడం తప్ప వేరే కారణం లేదు.

సరే, పైన క్లుప్తంగా వివరించిన 77, 81, 82, 85వ రాజ్యాంగ సవరణలు చెల్లవంటూ అగ్ర కులాల వారు కుప్పలు కుప్పలుగా సుప్రీంకోర్టులో కేసులు వేశారు. వాటన్నిటి పైనా 2006 అక్టోబరు 19వ తేదీన నాగరాజు వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా అనే కేసులో అయిదుగురు జడ్జీల సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం తరఫున తీర్పు ప్రకటించిన కపాడియా అన్ని కేసులనూ కొట్టివేసి ఆ నాలుగు రాజ్యాంగ సవరణలూ చెల్లుతాయని స్పష్టం చేశారు. అయితే ఆ క్రమంలో వివాదంలో భాగం కాని విషయాల మీద పొంతన లేని వ్యాఖ్యలు చేసి అనవసరమైన గందరగోళం సృష్టించారు.

కేసు వేసిన వాళ్ళు ఆ నాలుగు రాజ్యాంగ సవరణలూ చెల్లవనడానికి రెండు కారణాలు చూపించారు. సుప్రీంకోర్టు తీర్పులలో ప్రకటించిన సూత్రాలను వమ్ము చేయడానికి రాజ్యాంగాన్ని సవరించడం చట్టసభకు రాజ్యాంగం ఇచ్చిన అధికారాల దుర్వినియోగం అన్నారు. రెండు, ఈ నాలుగు సవరణలు రాజ్యాంగం మౌలిక స్వరూపాన్నే మార్చేశాయి కాబట్టి అవి చెల్లవన్నారు. రెండు వాదనలనూ కపాడియా నిస్సంకోచంగానే తిరస్కరించారు. చట్టానికి సుప్రీంకోర్టు చేసే వ్యాఖ్య చట్టంతో సమానమని రాజ్యాంగంలోని ఆర్టికల్ 141 అంటుంది. కాబట్టి అన్ని చట్టాలను సవరించినట్టే ఆ వ్యాఖ్యను కూడా సవరించవచ్చు. అది చట్ట సవరణే అవుతుంది గానీ సుప్రీం కోర్టును అగౌరవపరిచే చర్యకాదు. ఇది సాధారణ చట్టాలకే కాక రాజ్యాంగ చట్టానికి కూడా వర్తిస్తుంది. ఎందుకంటే రాజ్యాంగాన్ని సవరించే అధికారం కూడా పార్లమెంటుకు ఉంది.

ఇక రెండవ అభ్యంతరం, ఈ నాలుగు సవరణలూ రాజ్యాంగం మౌలిక స్వరూపాన్నే మార్చేశాయి కాబట్టి అవి చెల్లవు అనేది. రాజ్యాంగాన్ని సైతం సవరించే అధికారం పార్లమెంటుకు ఉంది అని రాజ్యాంగంలోని ఆర్టికల్ 368 అంటుంది. వివిధ రకాల రాజ్యాంగ సవరణలకు అనుసరించవలసిన పద్ధతులను కూడా నిర్దేశిస్తుంది. పైన చెప్పినట్టు, సొంత ఆస్తులను ప్రభుత్వపరం చేయడానికి చేపట్టిన చర్యలకు సుప్రీంకోర్టు పదే పదే అడ్డుతగలగా ఆ ఆటంకాన్ని అధిగమించడానికి 1970 దాకా రాజ్యాంగాన్ని అనేకసార్లు సవరించడం జరిగింది. ఆ సందర్భంగా, రాజ్యాంగాన్ని సవరించవచ్చునంటే

**చారిత్రక కారణాల వల్ల వెనుక ఉంచబడ్డ వారికి ఉద్యోగాలలో ప్రత్యేక హక్కులు కల్పించే అధికారం ప్రభుత్వానికి ఉంది అన్న నాలుగు వాక్యాలు రాజ్యాంగంలో రాసి ఉంటే సరిపోవలసింది, ప్రమోషన్లలో రిజర్వేషన్లు ఇయ్యవచ్చునా, ఇస్తే సీనియారిటీ ఇయ్యవచ్చునా, క్వాలిఫికేషన్ మార్కులు తగ్గించవచ్చునా అంటూ ఒక జిఒలో ఉండవలసిన వివరాలన్నీ రాజ్యాంగంలోనే రాసుకోవలసిన అగత్యం ఏర్పడడానికి రాజ్యాంగ విలువల స్ఫూర్తి సమాజంలోను, పాలనా యంత్రాంగంలోనే కాదు, న్యాయస్థానాలలోనూ కొరవడడం తప్ప వేరే కారణం లేదు.**



ఎంత దూరమైనా పోవచ్చునా, మొత్తంగా రాజ్యాంగాన్నే తిరగ రాయవచ్చునా అన్న ప్రశ్న వచ్చింది. కేశవానంద భారతి వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ అనే కేసులో 1973లో 13 మంది జడ్జీల బెంచి, రాజ్యాంగ ప్రాథమిక హక్కులతో సహా దేనినైనా సవరించవచ్చును గానీ సవరణ కాంణంగా రాజ్యాంగ 'మౌలిక స్వరూపం' మారి పోకూడదని ప్రకటించింది. కాని 'మౌలిక స్వరూపం' అంటే ఏమిటో అప్పటి నుంచి ఇప్పటి దాకా సుప్రీంకోర్టు చెప్పలేదు, అయితే ప్రజాస్వామ్యం, లౌకికవాదం, చట్టబద్ధ పాలన మొదలైన వాటిని 'మౌలిక స్వరూపం'లో భాగంగా సుప్రీంకోర్టు ఆ తరువాత వెలువరించిన తీర్పులలో గుర్తించింది.

**'మౌలిక స్వరూపం', 'మౌలిక స్వరూపం' అంటే ఏమిటో అప్పటి నుంచి ఇప్పటిదాకా సుప్రీంకోర్టు చెప్పలేదు, అయితే ప్రజాస్వామ్యం, లౌకికవాదం, చట్టబద్ధ పాలన మొదలైన వాటిని 'మౌలిక స్వరూపం'లో భాగంగా సుప్రీంకోర్టు ఆ తరువాత వెలువరించిన తీర్పులలో గుర్తించింది.**

నాగరాజు కేసులో కపాడియా ఈ విషయాన్ని ఆసక్తికరంగా చర్చించారు. మౌలిక స్వరూపం అంటే రాజ్యాంగంలోని ఫలానా ఆర్టికల్, లేదా మరొక ఆర్టికల్ కాదనీ, రాజ్యాంగంలోని వివిధ అధికరణాలను కలుపుతూ అనుసంధానం చేసే అంతస్సూత్రాలను మౌలిక స్వరూపంగా భావించాలనీ అన్నారు. ప్రజాస్వామ్యం, లౌకికవాదం, ఫెడరలిజం, చట్టపరమైన సమానత్వం, సామాజిక న్యాయం, పాలనలో నిష్పాక్షికత మొదలైనవి ఒక చోటో ఇంకొక చోటో రాజ్యాంగంలో ప్రస్తావించ బడి ఉండవచ్చు, ఉండకపోవచ్చు. కానీ ఇవి రాజ్యాంగానికి అంతస్సూత్రంగా ఉన్నాయి. ఇవీ, ఇటువంటివీ మౌలిక సూత్రాలు. వీటిని తిరస్కరించే విధంగా రాజ్యాంగ సవరణలు చేసే అధికారం పార్లమెంటుకు రాజ్యాంగం ఇవ్వలేదు. ప్రభుత్వ ఉద్యోగ రంగంలో ప్రమోషన్లలో రిజర్వేషన్లు ఇవ్వవచ్చునా లేదా, ఇస్తే సీనియారిటీ ఇవ్వవచ్చునా లేదా అనేవి ఇటువంటి అంతస్సూత్రాల కిందికి రావు కాబట్టి వాటికి సంబంధించి చేసిన సవరణలు రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని మార్చేశాయని అనడానికి వీలులేదని కపాడియా అన్నారు.

అంతవరకూ బాగానే ఉంది. కానీ 'మౌలిక స్వరూపం' అనే దానికి ఇచ్చిన సవరణ హేతుబద్ధంగానే ఉందనుకున్నా, రాజ్యాంగ అధికరణాలకు అంతస్సూత్రంగా ఏయే విలువలను గుర్తించాలనేది ఇప్పటికీ సుప్రీంకోర్టు చేతిలోనే ఉండిపోవడం గమనార్హం. దేశ పార్లమెంటు దేశ రాజ్యాంగంలో ఏ మేరకు సవరణలు చేయవచ్చునన్న ప్రమాణాలను రాజ్యాంగమే సూచించడం ఉచితంగా ఉంటుంది తప్ప సుప్రీంకోర్టులో అప్పటికి కూర్చున్న న్యాయమూర్తుల అభిప్రాయాలు ఆ ప్రమాణాన్ని నిర్దేశించడం ఏ రకంగానూ మంచిది కాదు. ప్రభుత్వ ఉద్యోగాలలో 69 శాతం రిజర్వేషన్లు ఇస్తున్న తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వ విధానం రాజ్యాంగ బద్ధమేనా అనేది సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసులలో ఒకటి. దానిని 9వ షెడ్యూల్‌లో వేసి న్యాయ సమీక్ష నుంచి కాపాడాలని చూశారు గానీ 9వ షెడ్యూలులో ఉన్న చట్టాలు సైతం రాజ్యాంగ మౌలిక స్వరూపానికి భిన్నమైతే కొట్టివేయవలసి ఉంటుందని ఈ మధ్యనే సుప్రీంకోర్టు అని ఉంది. కాబట్టి మొత్తం రిజర్వేషన్లు 50 శాతం మించ డానికి వీలులేదన్న సూత్రం రాజ్యాంగ మౌలిక స్వరూపానికి సంబంధించినదా – అంటే రిజర్వేషన్లు సగం కంటే ఎక్కువ ఉండడం రాజ్యాంగ మౌలిక స్వరూపంలో భాగమైన సమానతా సూత్రాన్ని

అతిక్రమిస్తుందా – అనే ప్రశ్న త్వరలోనే మరొక రాజ్యాంగ ధర్మాసనం ముందుకు రాబోతుంది. ఆ లోపల 'మౌలిక స్వరూపం'గా గుర్తించగల రాజ్యాంగ అంతస్సూత్రాలైన విలువలు ఏమిటన్నది పార్లమెంట్ స్పష్టం చేయడం మంచిది.

అదట్లా ఉంచి 77, 81, 82, 85వ రాజ్యాంగ సవరణలు ఏ రకంగానూ రాజ్యాంగ విరుద్ధం కావని అంటూ అక్కడితో ఆగిపోకుండా సుప్రీంకోర్టు చేసిన అసందర్భమైన అదనపు ప్రసంగాన్నీ, నష్టకరం కాగల వ్యాఖ్యలనూ చూద్దాం.

'ఈ రాజ్యాంగ సవరణలు రాజ్యాంగ బద్ధమైనవేనని అంటున్నామంటే వీటిని ఆశ్రయించి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలూ ప్రభుత్వ సంస్థలూ ప్రమోషన్ల విషయంలో చేపట్టిన రిజర్వేషన్‌లన్నీ చెల్లుతాయని మా అభిప్రాయం కాదు. ఈ సవరణలు ఆ విషయంలో ప్రభుత్వానికి కల్పించే అధికారం రాజ్యాంగ బద్ధమేనంటున్నాం. కానీ ఆ అధికారాన్ని వినియోగించిన ప్రతి సందర్భంలోనూ, దానిని సక్రమంగా వినియోగించారా లేదా అనేది కోర్టులు సమీక్షించగలవు' అని సుప్రీంకోర్టు అనింది. ఒక అధికారాన్ని ప్రభుత్వానికి కట్టబెట్టడం రాజ్యాంగ బద్ధమే అయినా, దానిని వినియోగించే క్రమంలో చేపట్టిన ఒక చర్య అక్రమంగా ఉంటే అది చెల్లదనీ, ఆ విషయం కోర్టులు సమీక్షించగలవనీ చెప్పే సూత్రంతో పేచీ ఏమీ లేదు. ఉదాహరణకు ప్రజావసరాల కోసం ప్రభుత్వం బలవంతపు భూసేకరణ చేయవచ్చునన్న అధికారం రాజ్యాంగ బద్ధమే అయినా ఒక్కొక్క భూసేకరణ ప్రక్రియనూ అది నిజంగా ప్రజావసరం కోసమే, నిష్పక్షపాతంగా జరుగుతున్నదా మొదలైన ప్రమాణాల ప్రాతిపదికన కోర్టులు సమీక్షించవచ్చు.

అయితే 77, 81, 82, 85వ రాజ్యాంగ సవరణలు ఇచ్చే అధికారాన్ని వినియోగించే చర్యలను సమీక్షించే సందర్భంలో ఏ ప్రమాణాలను ప్రయోగించాలన్న సూత్రీకరణ చేసేటప్పుడు, ఈ రాజ్యాంగ సవరణలిచ్చే అధికారం ఎస్‌సి, ఎస్‌టిలకు మాత్రమే సంబంధించిందని దృష్టిలో పెట్టుకోకుండా బిసి రిజర్వేషన్లకు వర్తించే ప్రమాణాలను కూడా కపాడియా తన తీర్పులో ఉటంకించడం అనవసరమైన గందరగోళానికి దారితీసింది. ఇంత సామాజిక ప్రాధాన్యం గల విషయాలలో అజాగ్రత్తగా తీర్పులు రాయడం క్షంతవ్యం కాదు. అయితే ఈ అజాగ్రత్త కేవలం పొరబాటున దొర్లింది కాదు. రాజ్యాంగ బద్ధమేనని ఒప్పుకోక తప్పని అధికారాల పట్ల వాస్తవానికి వ్యతిరేక భావం ఉండడం ఈ అదనపు ప్రసంగానికి కారణం.

ఆయన ఏకరవు పెట్టిన ప్రమాణాలేమిటంటే రిజర్వేషన్లు పొందబోయే వారు వెనుకబడి ఉన్నారని 'గణాంక యుతమైన సమాచారం' ఉండాలి. ఆ ఉద్యోగ రంగంలో వారికి తగిన ప్రాతినిధ్యం లేదని కూడా కచ్చితమైన సమాచారం ఉండాలి. మొత్తం కేడర్‌లో రిజర్వేషన్ 50 శాతం మించకుండా ఉండాలి. క్రీమీ లేయర్ సూత్రాన్ని పాటించాలి. వీటిని ఆయన తీర్పులో ఒక చోట పొందుపరచలేదు. వ్యాసం రాసే పద్ధతిలో – ఇంకా సరిగ్గా చెప్పాలంటే ఉపన్యాస ధోరణిలో – ఇక్కడొకటీ, అక్కడొకటీ చెప్పారు. అయితే ఈ నాలుగింటిలో రెండు

**ఇంత సామాజిక ప్రాధాన్యం గల విషయాలలో అజాగ్రత్తగా తీర్పులు రాయడం క్షంతవ్యం కాదు. అయితే ఈ అజాగ్రత్త కేవలం పొరబాటున దొర్లింది కాదు. రాజ్యాంగ బద్ధమేనని ఒప్పుకోక తప్పని అధికారాల పట్ల వాస్తవానికి వ్యతిరేక భావం ఉండడం ఈ అదనపు ప్రసంగానికి కారణం.**



మాత్రమే ఎస్‌సి, ఎస్‌టిలకు వర్తిస్తాయి. ఆ ఉద్యోగ రంగంలో తగిన ప్రాతినిధ్యం ఉందా లేదా అని చూడాలి, మొత్తం కేడర్‌లో రిజర్వేషన్ 50 శాతం మించకుండా చూడాలి అనేవి రెండూ ప్రస్తుత రాజ్యాంగ వ్యాఖ్యానాల ప్రకారం అన్ని రిజర్వేషన్లకూ వర్తిస్తాయి. వెనుకబడి ఉన్నారని రుజువుచేసే గణాంకయుతమైన సమాచారం ఉండాలి అనేదీ, క్రీమీ లేయర్‌ను తొలగించాలి అనేదీ బిసిలకే తప్ప ఎస్‌సి, ఎస్‌టిలకు వర్తించవని ఇంతకంటే పెద్ద బెంచిలు తీర్పులు ఇచ్చి ఉన్నాయి. 'ప్రభుత్వ ఉద్యోగాలలో తగిన ప్రాతినిధ్యం లేని వెనుకబడిన వర్గాలకు' రిజర్వేషన్ ఇవ్వడాన్ని గురించి ఆర్టికల్ 16 (4) చెప్తుంది. ఒక సామాజిక వర్గానికి రిజర్వేషన్ ఇచ్చే ముందు అది వెనుకబడిన వర్గామా కాదా అని పరిశీలించాలి. దానికోసం ప్రతి రాష్ట్రంలోనూ ఒక బిసి కమిషన్‌ను నెలకొల్పాలనీ ఆ కమిషన్ ఈ విషయాన్ని పరిశోధించి నివేదిక ఇవ్వాలనీ మండల్ కమిషన్ కేసులో సుప్రీంకోర్టు అనింది. అయితే ఇది ఎస్‌సి, ఎస్‌టిలు కాని కులాలకు మాత్రమే వర్తిస్తుంది. ఎందుకంటే ఎస్‌సి, ఎస్‌టిలను ఆర్టికల్ 16 (4) పరిధిలోని వెనుకబడిన వర్గాలుగా రాజ్యాంగమే గుర్తించిందని ఒకసారి కాదు, అనేక సార్లు సుప్రీంకోర్టు ప్రకటించి ఉంది. వారి విషయంలో వెనుకబడి ఉన్నారని 'గణాంక యుతమైన సమాచారం' ప్రతిసారీ సేకరించి రుజువు చేయనవసరం లేదు. రాజ్యాంగం ప్రకారమే వారు వెనుకబడిన వర్గాలు. ఇతర కులాలకే అది అవసరం. (అందుకే అటువంటి కులాలను ఇతర వెనుకబడిన కులాలు – Other Backward Classes - అంటారు). క్రీమీ లేయర్‌ను – అంటే ఇప్పటికే రిజర్వేషన్‌ల వల్ల ప్రయోజనం పొంది ఉన్న ఉపవర్గాన్ని గుర్తించి రిజర్వేషన్ల పరిధి నుంచి తొలగించాలన్న సూత్రాన్ని ఆదేశించిన మండల్ కమిషన్ కేసులోనే 'ఇది బిసిలకే తప్ప ఎస్‌సి, ఎస్‌టిలకు వర్తించదని స్పష్టం చేస్తున్నాం' అని సుప్రీంకోర్టు అనింది. అది తొమ్మిది మంది జడ్జీల తీర్పు. దానికి భిన్నంగా ఐదుగురు జడ్జీలు ప్రవచించడానికి వీలులేదు. అయినా తాను ఆ సాహసం చేస్తున్నానని కపాడియా అనలేదు. ఏం రాస్తున్నానో ఆలోచించకుండా రాసేశారంతే.

**ప్రమోషన్లలో ఎస్‌సి, ఎస్‌టిలకు రిజర్వేషన్లు ఇవ్వవచ్చునని చెప్పే ఆర్టికల్ 16 (4ఎ) చెల్లుబాటు అవుతుందనే అభిప్రాయానికి రావడానికి సుప్రీంకోర్టు ఇతర కారణాలతో బాటు ఒక విచిత్రమైన వాదనను ఆసరా చేసుకుంది. ఇది ఎవరైనా చేసిన వాదనో లేక జడ్జీల బుద్ధికే తోచిందో తెలీదు.**

ఈ రెండు ప్రవచనాలూ గందరగోళానికి దారితీసినప్పటికీ అవి ఇంతకంటే పెద్ద బెంచీలు గతంలో ఇచ్చిన తీర్పులకు వ్యతిరేకం కాబట్టి వాటికి ఆచరణలో దుష్ఫలితమేమీ ఉండదు. కానీ మరొక నష్టకరమైన సూత్రీకరణ తీర్పులో ఉంది – దానినెవ్వరూ గమనించినట్టు లేరు.

ప్రమోషన్లలో ఎస్‌సి, ఎస్‌టిలకు రిజర్వేషన్లు ఇవ్వవచ్చునని చెప్పే ఆర్టికల్ 16 (4ఎ) చెల్లుబాటు అవుతుందనే అభిప్రాయానికి రావడానికి సుప్రీంకోర్టు ఇతర కారణాలతో బాటు ఒక విచిత్రమైన వాదనను ఆసరా చేసుకుంది. ఇది ఎవరైనా చేసిన వాదనో లేక జడ్జీల బుద్ధికే తోచిందో తెలీదు. 16 (4) ప్రకారం ఎస్‌సి, ఎస్‌టి, బిసిలకు ఉద్యోగాలలో రిజర్వేషన్లు ఇయ్యవచ్చు. 16 (4ఎ) ప్రకారం ఎస్‌సి, ఎస్‌టిలకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు ఇవ్వవచ్చు. అంటే ఉద్యోగాలలో వెనుకబడిన వర్గాలన్నిటికీ రిజర్వేషన్లు ఇచ్చే అవకాశం ఉండగా, ప్రమోషన్ల దగ్గరికి వచ్చేసరికి

**ప్రభుత్వ రంగమే తగ్గిపోతూ ఉన్నప్పుడు, ప్రభుత్వ రంగంలో ఉద్యోగాలే తరిగిపోతున్నప్పుడు, ఈ చర్చ ఎందుకు అంటారేమో. అది సరైన అభ్యంతరం కాదు. ఈ రోజు ప్రభుత్వ రంగ రిజర్వేషన్ల గురించి జరుగుతున్న సంవాదం యావత్తు రేపు ప్రైవేటు రంగ రిజర్వేషన్ల సమస్య మీద కూడా ప్రభావం వేస్తుంది. అందువల్ల ఈ చర్చ చాలా అవసరం.**

అందులో మరీ వెనుకబడిన వారైన ఎస్‌సి, ఎస్‌టిలను వేరుచేసి వారికి మాత్రం రిజర్వేషన్లు ఇచ్చే అవకాశాన్ని కల్పించారు. ఇది హేతుబద్ధమైన ఉపవర్గీకరణే కదా! అనింది సుప్రీంకోర్టు. బిసిలకంటే ఎస్‌సిలు, ఎస్‌టిలు వెనుకబడిన వారు కాబట్టి వారిని వేరుచేసి వారికి మాత్రం ప్రమోషన్లలో రిజర్వేషన్లు ఇవ్వడంలో తప్పేమీ లేదనింది. నిజానికి బిసిలకు ఇవ్వకుండా ఎస్‌సి, ఎస్‌టిలకు మాత్రమే ప్రమోషన్లలో రిజర్వేషన్లు ఇవ్వడం న్యాయమా అన్న ప్రశ్న ఎవరూ లేవదీయలేదు. అసలు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించే అధికారం ఇచ్చే రాజ్యాంగ సవరణ చెల్లుతుందా అన్నదొక్కటే ఈ కేసులోని వివాదం. అది రాజ్యాంగ మౌలిక స్వరూపానికి భంగకరం కాదు కాబట్టి దానిలో తప్పేమీ లేదని సుప్రీంకోర్టు అనింది. అక్కడితో ఆగకుండా, మూడు వర్గాలకు రిజర్వేషన్ ఇచ్చే అధికారం ఉండగా, అందులో రెండు వర్గాలను మరీ వెనుకబడినవిగా గుర్తించి వేరుచేసి వారికి మాత్రం ప్రమోషన్లలో రిజర్వేషన్లు ఇవ్వడం హేతుబద్ధమైన ఉపవర్గీకరణేననీ అందులో తప్పేమీ లేదనీ అనడం ఎందుకు? రేపు బిసిలకు కూడా ఆయా ఉద్యోగ రంగాలలో తగిన ప్రాతినిధ్యం లేని సందర్భాలలో ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించవచ్చుననే సవరణ చేస్తే, వారికి ఇవ్వకుండా ఎస్‌సి, ఎస్‌టిలకు మాత్రమే ఇవ్వడం వల్లనే 16 (4ఎ) చెల్లుబాటవుతుందని సుప్రీంకోర్టు నాగరాజు కేసులో చెప్పింది కాబట్టి వారికి కూడా ఇస్తే చెల్లదని దబాయించడానికా? దీనిని 'ముందు జాగ్రత్తగా' చేసిన సూత్రీకరణగా అనుకోకూడదా?

ప్రభుత్వ రంగమే తగ్గిపోతూ ఉన్నప్పుడు, ప్రభుత్వ రంగంలో ఉద్యోగాలే తరిగిపోతున్నప్పుడు, ఈ చర్చ ఎందుకు అంటారేమో. అది సరైన అభ్యంతరం కాదు. ప్రైవేటు రంగంలోనూ రిజర్వేషన్లు కల్పించాలన్న డిమాండ్ బలంగా ముందుకొస్తున్నది. విద్యా సంస్థల వరకు దీనికి సహితం ఒక రాజ్యాంగ సవరణ సుప్రీంకోర్టు నిర్వాకం వల్ల అవసరం అయింది దాన్ని చేశారు కూడా. ఉద్యోగ రంగంలో రిజర్వేషన్ల విషయంలో ప్రస్తుత ప్రభుత్వం తటపటాయిస్తున్నా రేపో మాపో కల్పించక తప్పదు. సుప్రీంకోర్టు అడ్డం పడితే దానికి కూడా రాజ్యాంగాన్ని సవరించక తప్పదు. ఈ రోజు ప్రభుత్వ రంగ రిజర్వేషన్ల గురించి జరుగుతున్న సంవాదం యావత్తు రేపు ప్రైవేటు రంగ రిజర్వేషన్ల సమస్య మీద కూడా ప్రభావం వేస్తుంది. అందువల్ల ఈ చర్చ చాలా అవసరం. ఆ సంగతి ప్రజాతంత్ర శక్తులకు అర్థం కాకున్నా రిజర్వేషన్ వ్యతిరేకులకు స్పష్టంగా అవుతున్నది కాబట్టే వాళ్ళు దీనికి ఇవ్వవలసిన ప్రాధాన్యమంతా ఇస్తున్నారు.

✪





## సిరిసిల్ల ఆత్మహత్యలు

# నష్టపరిహార రాజకీయాలు

**సి**రిసిల్ల మహానగరం కాదు. ఈ మధ్యనే మునిసిపాలిటీగా గుర్తింపు పొందిన పెద్ద గ్రామం. నేత మగ్గాలు, బీడీ పరిశ్రమ ఆ ఊరికి ఆయువు పట్టయిన వ్యాపకాలు.



గడచిన 10 సంవత్సరాలలో ఆ ఊరిలో 209 మంది నేత కార్మికులు బతుకు గడవక ఆత్మహత్య చేసుకున్నారని ప్రభుత్వం అంటుంది. (300 దాకా చేసుకున్నారని, పోలీసులకు ఫిర్యాదు చేయకపోవడం వల్ల మిగిలినవి బయటకు రాలేదని ఆ ఊరి జనం అంటారు) 209 మాత్రమే జరిగాయనుకున్నా ఒకే ఊరిలో ఒకే సామాజిక వర్గానికి చెందిన వారు సగటున సంవత్సరానికి 20 మంది ఆత్మహత్యకు పాల్పడడం చిన్న విషయం కాదు.

వీళ్ళంతా ఎందుకు చనిపోతున్నారు?

పేదరికం వల్ల, అప్పుల భారం వల్ల, అప్పు తీర్చలేమన్న అవిశ్వాసం వల్ల ప్రాణాలు తీసుకుంటున్నారు. ఒక పద్ధతి ప్రకారం, ప్రతి సంవత్సరం జరుగుతున్నదంటే దీనికి గల కారణాలు కాకతాళీయం కాదనీ నేత మగ్గాల వ్యవస్థ ప్రస్తుత పరిస్థితులలో ఈ చావులకు దారి తీస్తున్నదనీ అర్థం అవుతుంది. ఈ పరిస్థితుల మూలాలను మొత్తంగా వెలికి తీయలేకపోయినా దాని, స్వరూపాన్నయినా అర్థం చేసుకునే ప్రయత్నం ఈ రిపోర్టు.

చనిపోతున్న వాళ్ళు చేనేత కార్మికులు కారు. మరమగ్గాలు (పవర్‌లూం) కార్మికులు. ఒక దశలో – ఇప్పటికే చాలా ప్రాంతాలలో – మరమగ్గాల పోటీకి తట్టుకోలేక చేనేత కార్మికులు ఆత్మ హత్యలు చేసుకున్నారు, ఆకలికి చనిపోయారు. కాలక్రమంలో చాలా ప్రాంతాలలో చేనేత మగ్గాల స్థానంలో మరమగ్గాలు వచ్చాయి. కానీ మరమగ్గాల యజమాన్ల సంగతి ఎట్లాగున్నా, వాటి పైన పనిచేసే కార్మికుల స్థితి చేనేత కార్మికుల కన్నా మెరుగ్గా లేదు.

సిరిసిల్ల పట్టణంలో 25 వేల మరమగ్గాలు ఉన్నాయి. ఇందులో మూడింట రెండు వంతుల మగ్గాల మీద పాలియెస్టర్ బట్టనేస్తారు, మిగిలిన ఒక వంతు మీద నూలువస్త్రాలు నేస్తారు. పాలియెస్టర్ పైన పనిచేసే కార్మికుడొక్కక్కడూ 12 మగ్గాలు నడపగలడు. నూలు బట్టనేసే కార్మికుడు 4 మగ్గాలు నడపగలడు. ('డు' అనడానికి కారణం, చేనేత మీదనైతే భార్యాభర్తా ఇద్దరూ పని చేసేవారు గానీ మరమగ్గాలు కేవలం మగవాళ్ళవి). నూలుబట్టలు నేసే కార్మికులే ప్రధానంగా ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. వాళ్ళు వారానికి 500 రూపాయలు సంపాదించగలరని అనగా వింటున్నాము గానీ ఆత్మహత్య చేసుకున్న కార్మికుల కుటుంబాలతో మాట్లాడితే వారానికి 300 నుంచి 400 రూపాయల దాకా మాత్రమే సంపాదిస్తున్నారని తెలుస్తున్నది. దీనికి తోడుగా ఆ కార్మికుడి భార్య బీడీలు చుట్టి వారానికి 150 నుంచి 200 రూపాయలు సంపాదిస్తున్నది. వెరసి నెలసరి కుటుంబ ఆదాయం 2,000 రూపాయలు దాటదు.

క్రమంగా పట్టణంగా మారుతున్న సిరిసిల్లలో నెలకు రెండు వేల రూపాయల ఆదాయంతో ఒక కుటుంబం బతకడం కష్టం. నెలకు 500 రూపాయల కంటే తక్కువ అద్దెకు ఇల్లు దొరకదు. పిల్లలకు ఏమైనా చదువు అబ్బాలంటే ప్రైవేటు స్కూలుకు ఫీజులు కట్టి పంపించవలసిందేనన్న ఆలోచనను జయించడం సాధారణ మానవులకు సాధ్యంకాదు కాబట్టి ఆ ఖర్చు భరించవలసిందే. నేత కార్మికులు మినహాయింపు లేకుండా పద్మశాలీ కులానికి చెందిన వారు కావడం కూడా సమస్యను పెంచింది. ఆ కులం బిసి జాబితాలో ఉన్నప్పటికీ దానికి బ్రాహ్మణీయ సాంస్కృతిక లక్షణాలు, సామాజిక స్వభావమూ ఎక్కువ. అందువల్ల సులభంగా అన్ని రకాల కూలికి పోరు. నేత వృత్తిని వదిలిపెడితే ఉద్యోగాలో, వ్యాపారమో చేసుకోవాలి తప్ప వేరే ప్రత్యామ్నాయాన్ని సులభంగా ఎంచుకోరు. అవి అందుబాట్లో లేకపోతే చావునైనా ఎంచుకోవడానికి సిద్ధపడతారు. ఆచార వ్యవహారాల ఖర్చులూ అధికమే. కట్నాలు ఇతర బలహీన వర్గాలలో కంటే ఎక్కువే.

నూలు బట్టలు నేసే వారికి ధూళి కాలుష్యం సమస్య తీవ్రంగా ఉంటుంది. క్షయతో సహా శ్వాసకోశ వ్యాధులు నేత కార్మికులలో సగటు కంటే ఎక్కువగా ఉన్నాయని స్థానిక వైద్యులు అంటు న్నారు. చనిపోయిన నేత కార్మికులొక్కక్కరికీ 40 వేల రూపాయలకు తక్కువ కాకుండా అప్పు లున్నాయి. నేత కార్మికులకు బతకడానికి అప్పులిచ్చే బ్యాంకు ఏదీ దేశంలో లేదు కాబట్టి నెలకు వందకు 3 నుంచి 5 రూపాయల దాకా వడ్డీ చెల్లించే ఒప్పందం మీద ప్రైవేటు వ్యక్తుల నుంచి, ఫైనాన్స్ కంపెనీల నుంచి అప్పు తెచ్చుకుంటున్నారు.

విషాదమేమిటంటే, ఇతర జిల్లాల నుంచి కూడా బతుకు తెరువు కొరవడిన చేనేత కార్మికులు మరమగ్గాల మీద పని చేద్దామన్న ఆశతో సిరిసిల్లకు పెద్ద సంఖ్యలో తరలిపోతున్నారు. ఎన్నో ఏళ్ళ కింద భివాండీకీ సూరత్‌కూ మరమగ్గాల పైన పని చేయడానికి పోయిన సిరిసిల్ల వాసులు అక్కడ నేత మగ్గాల వ్యవస్థ సంక్షోభంలో పడడంతో వెనక్కి వచ్చి ఇక్కడ మరమగ్గాలలో పని సంపాదించు



కునే ప్రయత్నం చేస్తున్నారు. ఒక దశలో దీని వల్ల పని దొరకని పరిస్థితి ఏర్పడింది గానీ ఇప్పుడు సమస్య పని దొరకకపోవడం కాదు. పని చాలా మందికే దొరుకుతున్నది. సిరిసిల్లలోని 25 వేల మగ్గాలు ఎప్పుడైనా నిలిచిపోతే అది పని లేకపోవడం కంటే కరెంటు కోత వల్లనే ఎక్కువగా జరుగుతున్నది. అయితే పని విరివిగానే దొరికినా చేసిన పనికి లభించే ఆదాయం – భార్య బీడీ పనిలో సంపాదించే దానితో కలుపుకున్నా – బతకడానికి సరిపోక అప్పు మీద అప్పయి ప్రాణాలు తీసుకుంటున్నారు.

ప్రభుత్వ అధికార్లను అడిగితే వేరే కారణం చెప్తారు. మగ్గాల కార్మికులు కల్తీ కల్లుకు అలవాటు పడ్డారనీ, దానితో ఆరోగ్యం క్షీణించి పని చేయలేక ఆదాయం కోల్పోతున్నారని అందువల్ల ఆత్మహత్య చేసుకుంటున్నారనీ వారంటారు. ఇది నిజమనుకున్నా కల్తీ కల్లును నిరోధించే బాధ్యత తమపైన లేనట్టు ప్రభుత్వ అధికార్లు మాట్లాడడం దుర్మార్గం. కానీ ఇది నిజం కూడా కాదు. అత్యధికంగా – అంటే ఏ వ్యసనానికీ బానిస కాకుండా – పని చేసినా వారానికి 500 రూపాయలు మాత్రమే సంపాదించగలరని అందరూ ఒప్పుకుంటున్న విషయం. వ్యసనాల వల్ల కానీయండి, నూలు నుంచి వచ్చే ధూళివల్ల వచ్చే క్షయరోగం వల్ల కానీయండి, కరెంటు కోతవల్ల కానీయండి, వారానికి 300 లేక 400 మాత్రమే సంపాదించగలుగుతున్నారు. ఒక వేళ 500 సంపాదించినా అవసరాలు తీరుతాయా?

చట్టాన్ని గురించే మాట్లాడుకుంటే, మరమగ్గాల కార్మికులకు కనీస వేతనాల చట్టం ప్రకారం ఒక మీటర్ బట్ట నేస్తే 2.80 రూపాయలు ఇవ్వాలి. కానీ అందులో నాలుగవ వంతు కూడా ఇవ్వడం లేదు. అలాగని కనీస వేతనాలు ఇవ్వాలి అన్న డిమాండ్ కూడా ప్రస్తుత పరిస్థితులలో సమస్యను పరిష్కరించదు. అంచెలంచెలుగా ఉన్న మరమగ్గాల వస్త్ర ఉత్పత్తిలో వాటాదారులు చాలా ఎక్కువ. పైన మాస్టర్ వీవర్స్ ఉంటారు. వాళ్ళు నూలు కొని 'బీం' తయారుచేసి మగ్గాల యజమాన్లయిన జాబ్ వర్కర్లకు ఇస్తారు. ఈ జాబ్ వర్కర్ల దగ్గర 4 నుంచి 10 దాకా మగ్గాలు ఉంటాయి. వాళ్ళు కరెంటు ఖర్చు, షెడ్ కిరాయి వగైరా పెట్టుకొని కార్మికుల చేత పని చేయిస్తారు. ఈ జాబ్ వర్కర్లే నేత కార్మికుల యజమాన్లు. ఖర్చులన్నీ పోను వాళ్ళకు కార్మికులకిచ్చే దానికంటే ఏమంత ఎక్కువ మిగలదు. పెద్ద సంఖ్యలో మగ్గాలుంటే వేరే సంగతి కానీ సగటు యజమానులను కూలి పెంచమంటే మగ్గాలు అమ్ముకొని పోతారే తప్ప పెంచి వ్యాపారం కొనసాగించడానికి ఇష్ట పడరు.

నూలు కొనుక్కునే మాస్టర్ వీవర్లు కూడా ఈ గొలుసులో ఒక 'లింక్' మాత్రమే. ఆపైన నూలు అమ్మేవాళ్ళు, ఆపైన పత్తి జిన్నింగ్ చేసే మిల్లులు, నూలు ఉత్పత్తి చేసే మిల్లులు ఉంటాయి. ఈ చివర బట్ట ఉత్పత్తి అయిన తరువాత అద్దకానికీ, అమ్మకానికీ పోవాలి. ఒక్కొక్క దశలోనూ చివరి ఉత్పాదకం విలువను పంచుకునే వాళ్ళుంటారు. ఈ దొంతరను ఛేదించి జిన్నింగ్‌నుంచి బట్ట ఉత్పత్తి, అమ్మకాల దాకా ఒకే కప్పుకింద జరిగితే తప్ప నేత కార్మికులకు ఇప్పుడున్న మార్కెట్‌లో తగిన వేతనం ఇవ్వడం కష్టం. ప్రభుత్వం టెక్స్‌టైల్ కార్పొరేషన్ ఏర్పాటుచేసి నూలు సరఫరా చేసి బట్ట తానే కొనుక్కొని లాభాలకు అతీతంగా నడిపితే చాలని అనుభవజ్ఞులైన స్థానిక కార్మిక సంఘాల నాయకుల అభిప్రాయం. ఇటువంటి ప్రయత్నం ఏదైనా ప్రభుత్వం తన మీద వేసుకోవడానికి సిద్ధపడితే తప్ప ఈ ఆత్మహత్యల పరంపర ఆగేటట్టు లేదు.

సిరిసిల్లలో ఆత్మహత్యలు 1997లో మొదలై 2000 సంవత్సరం తరువాత పెరిగాయి. ఆ ఒక్క సంవత్సరంలోనే 56 మంది ఆత్మహత్య చేసుకున్నారు. అప్పట్లో చాలా గొడవే జరిగింది. నేత కార్మికులకు పని దొరకక పోవడం అనే సమస్య ఆ దశలో చాలా ఉంది కాబట్టి పని కల్పించాలన్న డిమాండ్ ప్రధానంగా ముందుకొచ్చింది. అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మరమగ్గాల కార్మికులకు పని కల్పించడానికి సిరిసిల్ల సమీపంలో ఒక టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటుచేస్తానని హామీ ఇచ్చాడు. కొన్నేళ్ళ తరువాత అది ఏర్పాటయింది గానీ, దానిలో నెలకొల్పిన మగ్గాలు జెట్ మగ్గాలు. 70 మగ్గాలను ఇద్దరు నడపగలరు. అవి ఎంత మందికి పని కల్పించగలదు?

తరువాత ప్రభుత్వ ప్రయత్నంతో ప్రమేయం లేని కారణాల వల్ల పని బాగానే దొరక సాగింది. కానీ వేతనం చాలక సంక్షోభం కొనసాగింది. ఆత్మహత్యలూ కొనసాగాయి. ఆత్మహత్య చేసుకున్న రైతుల కుటుంబాలకు ఇచ్చినట్టే నేత కార్మికుల విషయంలోనూ నష్టపరిహారం ఇవ్వాలన్న డిమాండ్‌కు రాష్ట్ర ప్రభుత్వం స్పందించి నష్టపరిహారానికి సంబంధించిన ఆదేశాలను జి.ఓ. నెం. 46 రూపంలో 13-2-2006 నాడు జారీచేసింది. ఏ మాటకామాటే చెప్పుకోవాలి. ఈ జి.ఓ రైతుల నష్టపరిహారం జి. ఓ. నెం. 421 కంటే మెరుగైనదే. ఒక నేత కార్మికుని ఆత్మహత్య నష్టపరిహారానికి ఎప్పుడు అర్హమవుతుందనే విషయాన్ని డొంక తిరుగుడుగా కాకుండా స్పష్టంగానే సూచించింది. వృత్తి సంబంధమైన వేదనతో, అంటే తక్కువ వేతనం లేక నిరుద్యోగం కారణంగా ఆర్థిక ఇబ్బందులు ఎదురై తత్ఫలితమైన మానసిక ఒత్తిడి వల్ల ఆత్మహత్య చేసుకున్న నేత కార్మికుని కుటుంబానికి లక్ష రూపాయల నష్ట పరిహారం, బాకీలు తీర్చడానికి 50 వేలు వెరసి లక్షన్నర ఇవ్వడం జరుగుతుందని ఉంటుంది. సిరిసిల్లకు సంబంధించినంత వరకు దీనిని అమలు చేయవలసిన ఆర్‌డిఓ నేత కూలీల సమస్యల పట్ల సానుభూతి గల అధికారి కూడా. అయినప్పటికీ సరిగ్గా సగం కేసులు అనర్హమైనవిగా గుర్తించబడ్డాయంటే జీవిత వాస్తవాలకూ, ప్రభుత్వ విధానాలకు అధికార్లు ఇచ్చే వ్యాఖ్యానాలకూ మధ్య ఎడం ఎంత ఉందో అర్థం అవుతుంది. 1997 నుంచి 2006 దాకా 209 ఆత్మహత్యలు జరిగినట్టు ప్రభుత్వం ఒప్పుకుంటున్నదని చెప్పాం. అందులో 105 ఘటనలను జి.ఓ పరిధిలోకి రానివిగా నిర్ణయించారు.

2003 జూన్ 3వ తేదీన ఆత్మహత్య చేసుకున్న వేముల మనోహర్ కుటుంబానికి స్వంత మగ్గాలు ఆరు ఉండేవి. కుటుంబం ఆస్తి పంపకాలలో మగ్గాలన్నీ అతని తమ్ముడు తీసుకున్నాడు. మనోహర్ మరమగ్గాల మీద పని చేయడానికి భివాండీకి పోయి రెండు మూడేళ్ళు అక్కడ పని చేశాడు. అక్కడ పని తగినంత దొరకని పరిస్థితి వచ్చేసరికి వెనక్కి సిరిసిల్లకు వచ్చాడు. ఇక్కడ ఏ యజమాని దగ్గరా వెంటనే పని దొరకలేదు. ఎవరిదో ఎస్‌టిడి బూత్ నడిపే పని సంపాదించుకున్నాడు. ఆ పనిలో లభించిన జీతం తక్కువ. అప్పటికి అప్పు 40 వేలు చేరుకుంది. వస్తున్న జీతం కుటుంబ పోషణకూ నెలనెలా కట్టవలసిన వడ్డీకే సరిపోక ఆత్మహత్య చేసుకున్నాడు. అతని ఆత్మహత్యకు దారితీసిన కారణాలన్నీ నేత రంగంలో ఆదాయం లేమితో ముడిపడి ఉన్నప్పటికీ చనిపోయే నాటికి నేతకూలీ కాదు, ఎస్‌టిడి బూత్ నడుపుతున్నాడని చెప్పి అతని భార్య సుగుణకు నష్టపరిహారం ఇవ్వలేదు. బహుశా నేత కార్మికుడిగా పనిచేసింది (చివరి దశలో) భివాండీలో, సిరిసిల్లలో కాదన్నది కూడా అధికార్ల దృష్టిలో ఒక కారణం అయి ఉండవచ్చు. ఎందుకంటే స్వర్గం రవీందర్ అనే వ్యక్తి నేత కార్మికుడే, సిరిసిల్ల వాస్తవ్యుడే, అప్పుల భారానికే ఆత్మహత్య చేసుకున్నాడు



అని అంగీకరిస్తూ కూడా అతను పనిచేసింది సిరిసిల్లలో కాదన్న కారణంగా జి.ఓ 46 అతని కుటుంబానికి వర్తించదన్నారు.

2006 జూలై 26న ఆత్మహత్య చేసుకున్న చిలుక లింగయ్య 50 ఏళ్ళవాడు. మరమగ్గం మీద పనిచేసి వారానికి 400 రూపాయలు సంపాదించే వాడు. భార్య బీడీలు చుట్టి వారానికి 100 రూపాయలు సంపాదించేది. ముగ్గురు పిల్లలున్నారు. లింగయ్యకు రేడియో రిపేరింగ్ పనికూడా వచ్చేది. ఆ పని కూడా తీరిక వేళల్లో చేసేవాడు. టివిలు వచ్చిన తరువాత రేడియోలు తగ్గిపోయినా అప్పుడప్పుడు చేస్తూనే ఉండేవాడు. ఆ ఆదాయం ఈ ఆదాయం కలుపుకున్నా చాలక 60, 70 వేల రూపాయల అప్పయింది. పైగా కడుపులో అల్సర్ కూడా బాధపెట్టేది. అతను రేడియో మెకానిక్ అని తీర్మానించి జి.ఓ 46ను అతని కుటుంబానికి వర్తింపచేయలేదు.

2006 మార్చి 6వ తేదీన ఆత్మహత్య చేసుకున్న కోడెం రాజేశంకు నలుగురు పిల్లలు. ఇద్దరు బిడ్డలకు పెళ్ళి చేశాడు. తను వారానికి 400 రూపాయలు, భార్య నర్సమ్మ బీడీ పనిలో వారానికి 140 రూపాయలు సంపాదించే వారు. చనిపోయే నాటికి 80,000 అప్పయింది. అతను నేత కార్మికుడే. భారీగా అప్పుల పాలైన మాట వాస్తవమే. ఆత్మహత్య చేసుకున్న మాటా వాస్తవమే. అయినప్పటికీ నర్సమ్మకు జి.ఓ 46 కింద నష్టపరిహారం ఇవ్వలేదు. ఎందుకని? అతను అతిగా తాగి ఆత్మహత్య చేసుకున్నాడని. మరొక నలుగురి విషయంలో కూడా (గాజుల రమేష్, వెంగోళ్ల రఘునాథం, దూసారాం చంద్రం, దేవన్‌పల్లి దేవరాజు) తాగుడు పర్యవసానంగా ఆత్మహత్య చేసుకున్నారని నష్టపరిహారం నిరాకరించారు. ఇద్దరి విషయంలో (బండి సిద్ధిరాములు, కొక్కుల రాజమల్లు) మానసిక స్థిమితం లేకపోవడం వల్ల ఆత్మహత్య చేసుకున్నారని నిర్ధారించి నష్టపరిహారం నిరాకరించారు. మరో 18 కేసులలో ఆత్మహత్యకు వ్యక్తిగత సమస్యలు, కుటుంబ తగాదాలు, భార్యతో తగాదాలు కారణమని చెప్పి నష్టపరిహారం నిరాకరించారు. 14 కేసులలో అనారోగ్యం కారణంగా ఆత్మహత్య చేసుకున్నారని చెప్పి నష్టపరిహారం నిరాకరించారు.

తాగుడు, మనస్థిమితం కోల్పోవడం, కుటుంబ తగాదాలు, అనారోగ్యం - ఇవన్నీ పేదరికంతో, తీర్చలేని అప్పుల భారంతో ముడిపడి ఉండకూడదా? కనీసం పైకి కనిపించే ఈ కారణాల వెనక్కిపోయి ఏముందో చూసే ప్రయత్నం చేయకపోవడం ఏ విధంగా సబబు? ద్యావనపల్లి వీరయ్య అనే వ్యక్తి విషయంలో అతని రోగం ఆస్మా (ఉబ్బసం) అని కూడా గుర్తించారు. దూది నుంచి చెలరేగే ధూళివల్ల రాగల రోగాలలో అదొకటి. ఉబ్బసం వచ్చి, దానిని నయం చేసుకోవడానికి ఆదాయం చాలక, రోగం వల్ల ఎక్కువ పనిచేయలేని కారణంగా ఆదాయం ఇంకా తగ్గి అప్పు భారం ఇంకా పెరిగి ఆత్మహత్య చేసుకుంటే అది జి.ఓ 46 పరిధిలోకి ఎందుకు రాదు? వేతనం చాలక తీర్చలేని అప్పుల పాలైన నేత కార్మికుడు ఏ తాగుడుకూ అలవాటు పడకుండా, ఇంటి వాళ్ళతో వారి ఖర్చుల గురించో తన అసమర్థత గురించో తగాదా పడకుండా, మనఃస్థిమితం కోల్పోకుండా, ఆరోగ్యం పాడుకాకుండా శుద్ధ అప్పుల భారానికి ఆత్మహత్య చేసుకుంటేనే అతని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకుంటుందనడం ఏం తర్కం? నిరుద్యోగం, లేక తక్కువ వేతనం కారణంగా తలెత్తిన ఆర్థిక దుస్థితి ఫలితంగా మానసిక ఒత్తిడికి లోనై ఆత్మహత్య చేసుకున్న నేత కూలీల కుటుంబాలను జి.ఓ 46 ప్రస్తావిస్తుంది. ఈ పరిస్థితి ఉన్నప్పుడు దానికి వేరే అనేకం తోడుకావచ్చు. మానసిక ఒత్తిడిని పెంచవచ్చు, లేక బతకాలన్న సంకల్పాన్ని నీరసింపచేయవచ్చు. అసలు అప్పు భారమే

లేదంటేనో, ఆ వ్యక్తి ఎన్నడూ నేత కూలీ కాదంటేనో వేరే సంగతి. అవి రెండూ ఉన్నప్పుడు జీవిత సహజ క్రమంలో వాటికి తోడయ్యే విషయాలను కారణాలుగా చూపించి మినహాయించడం ఏం న్యాయం?

జీవితంలో ఉండగల వైవిధ్యమంతా ప్రభుత్వ ఆదేశాలలో వ్యక్తం కావడం అసాధ్యం. అటువంటప్పుడు ఆదేశాలను విశాలమైన పరిధిలో అర్థంచేసుకోవడం, వాటి స్ఫూర్తికి తగిన రీతిలో వాటిని జీవిత పరిస్థితులకు ఉదారంగా అన్వయించడం ఉచితంగా ఉంటుంది. ఈ పనిచేసే అధికారులు స్వభావరీత్యా ప్రజల పట్ల సానుభూతి గల వారే అయినా ప్రభుత్వానికి 'ఆర్థిక భారం'గా భావించబడే నిర్ణయాలు తీసుకునే దగ్గర వెనకాడతారు. 'పాలనా సంస్కరణలు', 'సత్పరిపాలన' అంటూ మనం పదే పదే వింటున్న ప్రక్రియలలో ఈ వైఖరిని వదిలించే ప్రయత్నమేదైనా జరిగితే మంచిది.

✪



## రాచకొండ ఏరియా విస్థాపన

# ఫీల్డ్ ఫైరింగ్ రేంజ్ దగ్గరే ఆగుతుందా?

**- పి.సుబ్బారావు, జి.మోహన్★**

నల్గొండ - రంగారెడ్డి జిల్లాలలో 30 వేల ఎకరాల పైచిలుకు విస్తీర్ణం గల భూభాగంలో భారత సైన్యానికి రైఫిల్ ఫైరింగ్‌లో శిక్షణ ఇవ్వడానికి ఫీల్డ్ ఫైరింగ్ రేంజ్ ఏర్పాటు చేయబోతారన్న ప్రతిపాదన చాలాకాలంగా చర్చలో ఉంది. అడపాదడపా సర్వేలు జరపడం, జీపులు వేసుకొని అధికారులు హడావుడిగా వచ్చిపోవడం జరుగుతుంటుంది. ఎందుకు వస్తున్నారో ఏం చేయబోతారో వాళ్ళు ప్రజలకు చెప్పరు. చెప్పాలన్న పట్టింపు లేదు, చెప్పే అలవాటు లేదు. వాళ్ళ హడావుడి కొంచెం ఎక్కువైనప్పుడల్లా ప్రజలు గాభరా పడడం, ఆందోళన వ్యక్తం చేయడం, స్థానికంగా బలం ఉన్న సిపిఐ వారు నిరసన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుంటుంది. ఈ ఆందోళనకు జవాబుగా ఎవరూ ఏమీ చెప్పరు. ఆందోళన అనవసరమనరు, అసలేమీ జరగబోదనరు, జరగబోయేదేమిటో చెప్పరు.

ఫీల్డ్ ఫైరింగ్ రేంజ్‌ను ఉద్దేశించింది కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోని సైనిక బలగాల అవసరం కోసమే అయినా, భూసేకరణ చేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికే తప్ప కేంద్ర ప్రభుత్వానికి లేదు కాబట్టి రాష్ట్ర ప్రభుత్వానికి విషయం తెలియకుండా పోయే అవకాశం లేదు.

ఈ ప్రాంతాన్ని రాచకొండ ప్రాంతం అంటారు. నిజానికి రాచకొండ అనేది ఒక ఊరు. దాని కేంద్రంగా అప్పుడెప్పుడో చిన్నా చితక రాజ్యాలు ఉండేవని అంటారు. రాజ్యం నెలకొల్పడానికి వేరే కారణాలు ఎన్ని ఉన్నా ఇది శత్రు దుర్భేద్యమైన ఇలాఖా అనేది చూడగానే తోస్తుంది.

ఈ ప్రాంతం విశిష్టమైన నైసర్గిక స్వరూపం గల భూభాగం. నల్గొండ జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలంలోనూ, రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోనూ పరచుకొని ఉంది. గుట్టలు, ఎగుడు దిగుడు నేలలు, చిట్టడవి ఉన్న ఈ ప్రాంతం లంబాడా తండాల మయం.

★ నల్గొండ జిల్లా మానవహక్కుల కార్యకర్తలు

40 దాకా తండాలుంటాయి. వేరే శ్రామిక కులాల వారూ కొందరున్నప్పటికీ లంబాడా గిరిజనులదే ఎక్కువ జనాభా. ఇబ్రహీంపట్నం నుండైనా, నారాయణపురం నుండైనా ఇక్కడికి ప్రవేశించగానే ఒక ప్రత్యేకమైన ప్రాంతంలోకి ప్రవేశించిన అనుభూతి కలుగుతుంది. రాష్ట్ర రాజధానికి కేవలం 60 – 70 కిలోమీటర్ల దూరాన ఉన్నామనిపించదు. ఎక్కడో నాగరికత అంచుకు వెళ్ళిపోయినట్లు అనిపిస్తుంది.

కృష్ణానది బేసిన్‌లోని రంగారెడ్డి, నల్గొండ జిల్లాల ప్రాంతమంతటిలాగా ఇది కూడా తీవ్ర వర్షాభావ ప్రాంతమే. అయితే నేల ఎగుడు దిగుడు గుట్టలమయంగా ఉండడం వల్ల పల్లపు ప్రాంతాలలో కుంటలు ఉండడమే కాక భూగర్భ జలాలు కృష్ణా బేసిన్‌లోని ఇతర ప్రాంతాల కంటే మెరుగుగా ఉన్నాయి. దానిని ఆసరా చేసుకొని రాళ్ళు, బండల మధ్య వరిమళ్ళు చేసి పచ్చటి పంటలు పండించిన ఘనత తండావాసులదే. వేరే ఎవరూ ఇంత సాహసం చేసి ఉండేవారు కాదు. ఈ కష్టం వేరే ఎవరివల్ల అయి ఉండేదీకాదు. ఎవరికి లంచాలివ్వాలో వారికంతా ఇచ్చి, ఎంత ఖర్చు పెట్టుకోవాలో అంతా పెట్టుకుని ఆపైన కరెంటు దొంగతనానికి కూడా వెరవక దాదాపు అన్ని తండాలలోనూ కరెంటు బోర్లు వేసుకున్నారు. ఒకటీ రెండూ కాదు 50 బోర్ల దాకా ఉన్నాయి ఒక్కొక్క తండాలో. 175 ఇళ్ళున్న కపిలవాయి తండాలో 60 బోర్లున్నాయి! బోర్ల కింద వరి పండించడంతో పాటు వర్షాధార భూములలో ఆముదాలు, జొన్నలు, సజ్జలు పండిస్తారు. పట్టాభూములు ఎంత ఉన్నాయో దానిలో సగం దాకా అసైన్‌మెంట్ (లావోణిపట్టా) భూములున్నాయి. అవన్నీ వర్షాధారాలే.

ఈ రెండింటి కంటే ఎక్కువగా అడవి భూములున్నాయి. ఆ అడవి పెద్ద జీవనాధారం తండావాసులకు. వంట చెరుకు సేకరించి బయటి గ్రామాలలో అమ్ముకొని బతికే వాళ్ళు చాలా మంది ఉన్నారు. ఇది కూడా చాలా కష్టంతో కూడుకున్న పనే. రోజంతా కష్టం చేస్తే 20 రూపాయలు మిగులుతాయని రాచకొండ తండా వాసులంటారు. ఇది కాక కుంకుడుకాయ నుంచి తేనెదాకా ఎంతో కొంత విలువైన చిన్న తరహా అటవీ ఉత్పత్తులూ ఉన్నాయక్కడ.

ప్రభుత్వం చేసిన ఒకే మేలు అనేక గ్రామాలలో వనసంరక్షణ సమితులను ఏర్పాటు చేయడం. నిజానికి సారవంతమైన గోదావరి లోయ, తూర్పు కనుమకొండలలో ఆదివాసుల నుంచి రిజర్వ్ ఫారెస్టును కాపాడడానికి వనసంరక్షణ సమితులను ఒక సాధనంగా ప్రయోగిస్తున్నారు గానీ వాటివల్ల నిజంగా ప్రజలకు మేలు జరిగేది తెలంగాణ, రాయలసీమ జిల్లాలలోని వర్షాభావ ప్రాంతాలలో ఉన్న చిట్టడవులలోనే రాచకొండ ప్రాంతంలో వనసంరక్షణ సమితులు కానుగ, జామాయిల్, సీతాఫలాలు పెంచి వందల కుటుంబాలకు జీవనం ఇస్తున్నాయి.

రాళ్ళు, గుట్టల నేలల నుంచి జీవనాన్ని పిండిన లంబాడా గిరిజనుల శ్రమను 'అభివృద్ధి'గా చూడగల దృక్పథం మన పాలకుల వద్ద లేదు. గుట్టల మయమైన రాచకొండ ప్రాంతం రైఫిల్ షూటింగ్ ట్రైనింగ్‌కు బాగా పనికొస్తుందన్న దొకటే వారికి తోచింది. 1993 నుంచి దీనికి సర్వేలు జరుపుతున్నారు. అప్పట్లో నల్గొండ జిల్లాలో 21,838 ఎకరాలు, రంగారెడ్డి జిల్లాలో 9,243 ఎకరాలు దీనికి కేటాయించబడతాయన్నారు. ప్రస్తుత ప్రతిపాదన ప్రకారం నల్గొండ జిల్లాలో 18,471 ఎకరాలు సేకరించబోతారు. రంగారెడ్డి జిల్లా సంగతి తెలీదు. నల్గొండలో సేకరించబోయేదంతా సంస్థాన్ నారాయణపురం మండలం భూమే. గ్రామాల వారీగా ఆ వివరాలు.



| గ్రామం పేరు | సేకరించే భూమి (ఎకరాలలో) | తరి పొలం | మెట్ట భూమి | లావోణి పట్టా భూమి | బంజరు | అడవి |
|---|---|---|---|---|---|---|
| జనగామ | 897.25 | -- | 254.07 | -- | 403.18 | 240.00 |
| నారాయణపూర్ | 2,331.35 | 8.00 | 810.11 | 1,513.24 | -- | 1,202.36 |
| మహమ్మదాబాద్ | 501.08 | -- | 361.36 | 10.00 | 2.35 | 126.27 |
| రాచకొండ | 13,864.37 | 22.36 | 1,371.08 | -- | -- | 11,460.32 |
| ఓయిలపల్లి | 546.09 | 2.01 | 543.08 | -- | -- | -- |
| చిల్లాపూర్ | 330.00 | -- | 203.30 | -- | 126.10 | -- |
| **మొత్తం** | **18,471.34** | **33.09** | **3,544.20** | **1,523.24** | **533.00** | **13,030.15** |

(నారాయణపూర్ మండలం)

ఈ పట్టికను అర్థం చేసుకునేటప్పుడు ఒక విషయాన్ని దృష్టిలో ఉంచుకోవాలి. 'తరిపొలం'గా ప్రభుత్వం గుర్తించేది చెరువులు, కుంటల కింది భూమినే. బోర్ల కింద ఉన్నది మెట్టభూమిగానే నమోదవుతుంది. రెండు, బంజరు, అడవి అనే భూములలోనూ వ్యవసాయం చేస్తున్న వారు చాలామంది ఉన్నారు. వనసంరక్షణ సమితులూ ఉన్నాయి. కుంకుడుకాయ, తేనె, వంట చెరుకు మొదలైనవి సేకరించి అమ్ముకుంటున్న వారూ చాలామంది ఉన్నారు. వీరెవ్వరూ భూమి కోల్పోయే రైతుల జాబితాలో లెక్కకు రారు. ప్రభుత్వం లెక్కపెట్టే బాధిత రైతులు అంటే పట్టాదారులు, లావోణి పట్టాదారులు – 702 మంది మాత్రమే. ఇందులోనూ కచ్చితంగా నష్టపరిహారం దక్కేది పట్టాదారులకే. లావోణి పట్టాదారులకు ఏమిస్తారో, ఎంత ఇస్తారో తెలీదు. పట్టాభూములైనా తిండి పెడతాయి తప్ప భూసేకరణలో వాటి కొచ్చే నష్టపరిహారం అంతంత మాత్రమే. రాచకొండ గుట్టలలో భూముల అమ్మకమూ, కొనుగోలూ జరిగింది తక్కువే. ఎకరా 60 వేలు మించి అమ్ముడు పోయింది లేదు. కాబట్టి పట్టా రైతులతో సహా వేలాది కుటుంబాలు – ప్రధానంగా లంబాడా గిరిజనులు – చేతిలో మహా అయితే చిల్లర పైసలతో వీధిన పడతారు. ఎవ్వరూ చేయని సాహసంతో బండలు పిండి రాచకొండను సస్యశ్యామలం చేసిన వారి శ్రమ సాధించిన అభివృద్ధికి మన్మోహన్‌సింగ్ నిర్వచనంలో అభివృద్ధి అన్న గుర్తింపు లేదు కాబట్టి వాళ్ళ కంతకంటే అర్హత లేదు.

అయితే ఫీల్డ్ ఫైరింగ్ రేంజే ఇక్కడ శాశ్వతం కాకపోవచ్చు. రాచకొండ రాబోయే రోజులలో మన్మోహన్‌సింగ్ నిర్వచించే అభివృద్ధికి కేంద్రం కావచ్చు. టూరిజంలో ఈకో – టూరిజం అనీ అడ్వెంచర్ టూరిజం అనీ లాభసాటి భావనలు వచ్చాయి. హైదరాబాద్ నుంచి మరీ దూరం పోనక్కర లేకుండా, టయోటా కారు నారాయణపురం దగ్గరో, ఇబ్రహీంపట్నం దగ్గరో ఆపి రాళ్ళు, రప్పలు, గుట్టలు, చిట్టడవులు నిండిన విశాల భూభాగంలో కొన్ని గంటలు 'థ్రిల్లింగ్'గా విహరించి సాయంత్రం వెనక్కిపోయి వైస్‌రాయ్ హోటల్ చేరుకోవచ్చు. అప్పుడు కష్టించి వ్యవసాయ అభివృద్ధి సాధించిన లంబాడాలు ఒక సంవత్సరంలో పొందుతున్న ఆదాయం రేపు టూరిజం కంపెనీ వారికి వారంలో రాగలదు. పైగా ఇది నిన్న మొన్నటిదాకా మావోయిస్టుల రాచకొండదళం యథేచ్ఛగా

విహరించిన ప్రాంతం కాబట్టి వారు బసచేసిన రాళ్ళ మధ్యనే, మనం కూడా రెండు నిమిషాలు విశ్రమించి కోకాకోలా తాగిన 'థ్రిల్' కూడా పొందవచ్చు. బహుశా దీనిని విప్లవ టూరిజం అనబోతారేమో. బ్రోచర్‌లో ఇది కూడా చేర్చి రేటు పెంచవచ్చు. రాచకొండకు ఈ వైభవం కలిగే నాటికి ఈ నాడక్కడ సేద్యంచేసి బతుకుతున్న వేలాది లంబాడా కుటుంబాలు ఎక్కడుంటాయో, ఎలాగుంటాయో.

✪





## హక్కుల సంఘాలకు విజప్తి

# ప్రైవేట్ ముఠాల బీభత్సాన్ని ఆపుదాం

(రాష్ట్రంలో కొంతకాలం బీభత్సం సృష్టించిన ప్రైవేటు హంతక ముఠాలకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం చేపట్టమని కోరుతూ దేశంలోని వివిధ హక్కుల సంఘాలకు 11.2.2006 నాడు మానవహక్కుల వేదిక పంపిన లేఖ)

**మిత్రులారా,**

ఆంధ్రప్రదేశ్‌లో 'టైగర్లు', 'కోబ్రాల' పేరిట విచ్చలవిడి హత్యలకు పాల్పడుతున్న ప్రైవేట్ ముఠాల గురించి మీకు తెలుసును. దానికి సంబంధించిన మరికొన్ని వివరాలు మీకు తెలియజేసి రాష్ట్ర ముఖ్యమంత్రికి నిరసన లేఖలు రాయవలసిందిగా, రాయించవలసిందిగా మిమ్మల్ని కోరడం కోసం ఈ లేఖ రాస్తున్నాం.

నక్సలైట్ పార్టీల లీగల్ సంస్థల పైన, పౌరహక్కుల కార్యకర్తల పైన, దాడులు చేయడానికి ప్రైవేటు ముఠాలను సృష్టించే ప్రయత్నం కొత్తది కాదు. 1980ల ద్వితీయార్థంలో కరీంనగర్ జిల్లా పోలీసు సూపరింటెండెంట్‌గా ఉన్న అశోక్ ప్రసాద్ అనే అధికారి నక్సలైట్ల వల్ల హింసకు గురైన వారిని సమీకరించి వారికి వ్యతిరేకంగా నిలబెట్టాలని ప్రయత్నం చేశాడు. ఆ ప్రయత్నం పౌర హక్కుల కార్యకర్తలను ఇబ్బందిపెట్టడం తప్ప వేరే సాధించింది ఏమీలేదు.

1990ల మధ్య భాగంలో క్రాంతిసేన అనే పేరు వినవచ్చింది. ప్రధానంగా కరీంనగర్ జిల్లాలోని కొన్ని గ్రామాలలో రాడికల్ కార్యకర్తలను ఈ క్రాంతిసేన హతమార్చింది. అదీ బహుశా తెల్లబట్టల పోలీసు బృందమే అయి ఉంటుంది. ఈ మధ్య కాలంలో క్రాంతిసేన పేరు వినపడడం లేదు.

ఆ తరువాత గ్రీన్ టైగర్స్ అన్న పేరు ఉనికిలోకి వచ్చింది. మొదట్లో ఆ పేరు మీద పౌరహక్కుల కార్యకర్తలకూ, మావోయిస్టు పార్టీకి (2004 సెప్టెంబర్ దాకా పీపుల్స్‌వార్ పార్టీ అనేవారు) సన్నిహితులుగా భావించబడే రాజకీయ/ సాంస్కృతిక కార్యకర్తలకూ బెదిరింపులు వచ్చాయి. అప్పట్లో గ్రీన్ టైగర్స్ చేసిన అత్యంత భయానక చర్య, 6.4.1997 నాడు ప్రఖ్యాత విప్లవ సాంస్కృతిక

కార్యకర్త గద్దర్ పైన జరిపిన కాల్పులు. ఇప్పటిదాకా ఆ దాడి ఎవరు చేసిందీ తేల్చలేదు, ఎవరినీ అరెస్టు చేయలేదు.

మొదట్లో బహుశా ఈ గ్రీన్ టైగర్స్ కూడా తెల్లబట్టల పోలీసులే అయి ఉండవచ్చును. ఉదాహరణకు వరంగల్‌లో గ్రీన్ టైగర్స్ నాయకుడు హరిభూషణ్ పేరు మీద ఫోన్ పైన బెదిరింపులు జారీచేస్తున్న వ్యక్తి, ఈ కర్తవ్యం కోసమే పోలీసు శాఖ నుంచి సస్పెండ్ చేయబడ్డ జావేద్ అనే కానిస్టేబుల్ అన్న విషయం అందరూ ఎరిగినదే. 2004 సంవత్సరంలో ప్రభుత్వానికీ, మావోయిస్టులకూ జరిగిన చర్చల నేపథ్యంలో తాత్కాలికంగా వెల్లివిరిసిన జవాబుదారీతనం కారణంగా కాబోలు పోలీసు శాఖ ఈ సత్యాన్ని అంగీకరించి అతనిని అరెస్టు చేసింది. ప్రైవేటు ముఠాలకు చెందిన వారిపైన ఏదైనా చర్యతీసుకున్న ఏకైక ఘటన ఇది. మానవహక్కుల వేదిక ప్రస్తుత రాష్ట్ర అధ్యక్షులైన డా. బుర్ర రాములును ఇతను టెలిఫోన్ ద్వారాను, పత్రికా ప్రకటనల ద్వారాను తరచుగా బెదిరించేవాడు.

తెల్లబట్టల పోలీసుల దాడులుగా, బెదిరింపులుగా మొదలైన ఈ క్రమం, నక్సలైట్ పార్టీలలో పనిచేస్తున్న కార్యకర్తలను ప్రభుత్వం తన వైపు తిప్పుకోవడంతో ప్రమాదకర రూపం తీసుకుంది. పార్టీతో విభేదాలు వచ్చి బయటికొచ్చిన వారిని చేరదీసి ప్రైవేటు ముఠాలు ఏర్పాటుచేయడానికి ప్రోత్సహించడం కొందరి విషయంలో జరిగింది. మరికొందరికి పార్టీలో ఉండగానే డబ్బులిచ్చి వారి కామ్రేడ్లను చంపి ఆయుధంతో సహా బయటికొచ్చి నక్సలైట్ – వ్యతిరేక ముఠాలు ఏర్పాటు చేయమని ప్రోత్సహించారు. ఒక వైపు ఈ పనిచేస్తూ మరొకవైపు వ్యాపార తగాదాలను, భూమి తగాదాలను బలప్రయోగంతో పరిష్కరించి డబ్బులు చేసుకునే అవకాశం వారికిచ్చారు. వారి ఆగడాలను పోలీసులు చూసీచూడనట్టు పోతున్నారు. బహుశా వారి సంపాదనలో వాటా కూడా తీసుకుంటున్నారు.

ఈ నక్సలైట్ – వ్యతిరేక ముఠాదారులలో ప్రధముడైన కత్తుల సమ్మయ్య కరీంనగర్ జిల్లాలో పీపుల్స్‌వార్ దళ సభ్యుడు. 1993లో నిద్రిస్తున్న తన కామ్రేడ్లు ముగ్గురిని కాల్చిచంపి ఆయుధాలతో సహా పోలీసుల వద్దకు పారిపోయాడు. ఆ తరువాత పోలీసుల అండతో బెదిరించి వసూళ్ళు చేసుకొని బతకసాగాడు. పీపుల్స్‌వార్‌కు సంబంధించిన మరొక ముగ్గురిని హతమార్చాడు. పేద కుటుంబంలో పుట్టిన సమ్మయ్య ఎంత వేగంగా పైకి పోయాడంటే 2001లో అతని మరణం, వ్యాపారరీత్యా విమాన ప్రయాణంలో ఉండగా కొలొంబోలో జరిగిన ప్రమాదంలో సంభవించింది. కనీసం ఇద్దరు సీనియర్ పోలీసు అధికారులు అతని సంపాదనలో భాగస్వాములని పత్రికలు రాశాయి, చాలా మంది నమ్ముతున్నారు. అయితే ఇది సమ్మయ్యకు ప్రత్యేకమైన విషయం కాదు. నక్సలైట్ – వ్యతిరేక ముఠాలు చేపట్టే బెదిరింపు వసూళ్ళు, బలవంతపు పంచాయతీలు, సందేహాస్పద ఆర్థిక లావాదేవీలన్నిటిలోనూ పోలీసు అధికారులకు భాగస్వామ్యం ఉంది.

ఇతర ప్రముఖ నక్సలైట్ – వ్యతిరేక ముఠాదారులు మహమ్మద్ నయీముద్దీన్, బయ్యపు సమ్మిరెడ్డి, జడల నాగరాజు, తిరుపతి బాలన్న. నయీముద్దీన్‌ది నల్గొండ జిల్లా భువనగిరి. అయితే ఇతను హైదరాబాద్‌లోనో, హైదరాబాద్ సమీపంలోనో నివసిస్తాడు. పోలీసుల పూర్తి సంరక్షణలో బతుకుతాడనేది జగమెరిగిన సత్యం. పీపుల్స్‌వార్ కార్యకర్తగా ఉన్నప్పుడతను కె.ఎస్.వ్యాస్ అనే



పోలీసు డిఐజి సంచలనాత్మక హత్యలో పాల్గొన్నాడు. 'ఎన్‌కౌంటర్' హత్యల విషయంలో అపఖ్యాతి గడించిన ఆ అధికారిని హైదరాబాద్‌లోని ఫతేమైదాన్‌లో జాగింగ్ చేస్తుండగా కాల్చి చంపడం జరిగింది. నయీముద్దీన్ అత్యంత భీతిగొలిపే నక్సలైట్ – వ్యతిరేక ముఠా నాయకునిగా మారిన వైనం తెలుసుకోదగ్గది. జైలులో ఉండగా అతనికి పీపుల్స్‌వార్ నాయకత్వంతో తేడాలు వచ్చాయి. తన సోదరిని లైంగికంగా వేధించిన మిలిటెంట్ పైన వాళ్ళు చర్య తీసుకోలేదని అతను కోపగించుకున్నాడు. అతని తమ్ముడు అలీముద్దీన్ ఆ మిలిటెంట్‌ను అతిక్రూరంగా చంపాడు. అలీముద్దీన్ ఉన్మాద స్వభావం గలవాడు. ఇదిలా ఉండగా ఇంకా జైలులో ఉండగానే నయీముద్దీన్ బెల్లి లలిత అనే సాంస్కృతిక కార్యకర్తను ప్రేమించాడు. అయితే అలీముద్దీన్ ఆమె తన అన్నను మోసం చేస్తున్నదని అనుమానించి ఆమెను చాలా క్రూరంగా చంపాడు. అలీముద్దీన్‌ను పీపుల్స్‌వార్ చంపింది.

దీనితో మొదలైన కక్ష ఆ పార్టీనీ, వారి సానుభూతిపరులనూ హక్కుల కార్యకర్తలనూ భీతావహులను చేసింది. నయీముద్దీన్ జైలులో ఉంటూనే ప్రభుత్వానికి సరండర్ అయ్యాడు. అతని బెయిల్ అప్లికేషన్‌ను ప్రభుత్వం వ్యతిరేకించకపోవడం వల్ల బెయిల్ పొంది బయటకు వచ్చాడు. ఈ రోజు నక్సలైట్ – వ్యతిరేకులందరిలోకీ అతను అత్యంత భయం గొలిపించే వ్యక్తి, అత్యంత క్రూరుడు. అతని చుట్టూ అతని మనుషులు 50 మంది దాకా ఉంటారు. ఈ ముఠా తాము ఎంపిక చేసుకున్న వ్యక్తుల పైన అతిక్రూరంగా దాడులు చేసింది. తనకు శత్రువులైన మావోయిస్టు నాయకత్వానికి సన్నిహితులైన వారిమీద మాత్రమే తాను దాడి చేస్తున్నానని నయీముద్దీన్ పత్రికల వారితో అంటున్నప్పటికీ, అతని వల్ల ఏర్పడిన బీభత్స వాతావరణం అక్కడితో ఆగలేదు. ఏండ్ల తరబడి పోలీసు నిర్బంధాన్ని ప్రతిఘటించి పని చేసిన కార్యకర్తలు అతని నుంచి ఒక్క ఫోన్ వస్తే పని మానుకుంటున్నారు.

ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం (ఎపిసిఎల్‌సి)కి చెందిన టి.పురుషోత్తంను 2000 సంవత్సరం నవంబర్ 23న హతమార్చింది అతని ముఠాయే అనడంలో సందేహం లేదు. అదే సంస్థకు చెందిన మహమ్మద్ ఆజం అలీని నల్గొండలో 2002 ఫిబ్రవరి 18 నాడు చంపింది కూడా అతని మనుషులే. ఎపిసిఎల్‌సి అధ్యక్షుడు డా. జి.లక్ష్మణ్‌ను 2003 నవంబర్ 6వ తేదీన కిడ్నాప్ చేసిన ఘటనలో నయీముద్దీన్ స్వయంగా పాల్గొన్నాడు. అదే సంవత్సరం అక్టోబర్ 1వ తేదీన తిరుపతిలో అప్పటి రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబు నాయుడు పైన జరిగిన హత్యా ప్రయత్నం నేపథ్యంలో ఇది జరిగింది. డా. లక్ష్మణ్‌ను తీవ్రంగా చిత్రహింసలకు గురిచేశారు. తననెవరూ కిడ్నాప్ చేయలేదనీ, హింసించలేదనీ అతని చేతనే చెప్పించారు. మావోయిస్టుల చెరలో ఉన్న ఒక 'కోవర్టు' విడుదల కోసం బందీగా డా. లక్ష్మణ్‌ను అపహరించడం జరిగింది. అతని విడుదల కోసం చంద్రబాబు నాయుడును కలిసిన బృందానికి చంద్రబాబు హామీ ఇచ్చిన అనంతరం, మావోయిస్టులు ఆ 'కోవర్టు'ను హతమార్చినప్పటికీ డా. లక్ష్మణ్‌ను క్షేమంగా విడిచిపెట్టడం జరిగింది. తిరుమల టైగర్స్ అనే పేరు మీద నయీముద్దీన్ అపహరించిన మనిషి క్షేమానికి ముఖ్యమంత్రి హామీ ఇవ్వడం, ఆ హామీని నిలబెట్టుకోగలగడం గమనించదగ్గ విషయాలు.

బయ్యపు సమ్మిరెడ్డి, జడల నాగరాజు కరీంనగర్ జిల్లాకు చెందిన వారు. అయితే సమ్మిరెడ్డి ఇప్పుడు లేడు. అతను పీపుల్స్‌వార్ జిల్లా కమిటీ నాయకుడిగా ఉండగానే, కనీసం ఒక సందర్భంలో

గ్రామంలో రెడ్డి కులస్తుల మాటలు విని సామాజికంగా వెనుకబడిన వర్గాల పార్టీ సానుభూతిపరులకు అన్యాయం చేశాడన్న అభియోగం ఉంది. తరువాత అతను సరండర్ అయి బలవంతపు వసూళ్ళు, పంచాయితులు చేస్తూ సంపాదించుకోసాగాడు. జిల్లాలో తన మాజీ కామ్రేడ్లకు టెర్రర్‌గా తయారయ్యాడు. అదృష్టవశాత్తు అతని నేరచరిత్ర త్వరలోనే ముగింపు కొచ్చింది. 2003 జులై 18న అతని శవాన్ని కృష్ణా జిల్లాలో ఒక మంచినీటి చెరువు నుంచి బయటకు తీశారు. అతన్ని జడల నాగరాజు చంపాడని అతని భార్య ఆరోపించింది. ఏదో భూమి తగాదాలోనో, వ్యాపార పంచాయతీలోనో వారు వైరిపక్షాలు తీసుకున్నట్టున్నారు.

నాగరాజు అప్పటి పీపుల్స్‌వార్ దళ సభ్యుడు. 1998 డిసెంబర్ నెల 11, 12 తేదీల మధ్య రాత్రి అప్పటి తన పార్టీ జిల్లా కమిటీ కార్యదర్శితో సహా తన కామ్రేడ్లను హతమార్చి బయటికొచ్చాడు. అప్పటి రాష్ట్ర హోంమంత్రి ఎలిమినేటి మాధవరెడ్డి టివి కెమేరాలు సాక్షిగా అతనికి బహుమానం అందిచ్చాడు. (ఈయనను పీపుల్స్‌వార్ ఆ తరువాతి కాలంలో రద్దీగా ఉండే హైదరాబాద్ – వరంగల్ రహదారిపైన మందుపాతర పేల్చి చంపింది). నాగరాజు తదుపరి కరీంనగర్ జిల్లా ఈశాన్య ప్రాంతంలోని అటవీ ప్రాంతంలో ఒక ముఠా పెట్టుకొని 'డాన్'గా వ్యవహరించసాగాడు. జిల్లాలోని సామాజిక కార్యకర్తలను అతని ముఠా విపరీతంగా భీతిల్లజేసింది. ఇతర నక్సలైట్ వ్యతిరేక ముఠాదారుల లాగ కాక ఇతను ఎన్నికల రంగంలోకి కూడా దిగాడు. అక్కడ కూడా తన వాళ్ళ విజయానికి బలప్రయోగం చేస్తాడు. (అయితే ఇప్పటికీ ఏ పార్టీలోనూ చేరలేదు). అతను ఖమ్మంపల్లి గ్రామం ఎంపిటిసిగా ఎన్నికయ్యాడు. అతని మనుషులు వివిధ పంచాయతీ పదవులు అలంకరించారు. అతను తన కామ్రేడ్లను చంపిన ఘటనకు అతనిని ప్రాసిక్యూట్ చేయకుండా అతనికి పారితోషికం ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తూ హైకోర్టులో వేసిన రిట్ పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేయగా, సుప్రీంకోర్టులో అప్పీలు దాఖలు చేయడం జరిగింది.★ ఈ మధ్య కాలంలో రాష్ట్ర ప్రభుత్వం యాజమాన్యంలోని సింగరేణి కాలరీస్ కంపెనీ నిర్వహించే బొగ్గు గనుల ప్రాంతంలో అతని సృష్టి అయిన కోల్‌బెల్ట్ విముక్తి సైన్యం బెదిరింపు ప్రకటనలు ఇస్తున్నది. ఇది ఒకప్పుడు మావోయిస్టులకు చాలా బలం ఉన్న ప్రాంతం. మావోయిస్టులకు ఏ రకంగానైనా మద్దతు, సహకారం ఇచ్చినట్టయితే ఖబడ్దార్ అంటూ వీరి ప్రకటనలు వెలువడినప్పటి నుంచి బొగ్గు గనుల ప్రాంతంలో విపరీతమైన భీతి నెలకొనింది.

తిరుపతి బాలన్న మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన వాడు. అతను నయీముద్దీన్ ముఠాతో పని చేస్తాడని చాలామంది అభిప్రాయం. ఎపిసిఎల్‌సికి చెందిన ఆజం ఆలీ హత్యలో అతను పాల్గొన్నాడన్న అభిప్రాయమూ ఉంది. 2003 డిసెంబర్ 11వ తేదీన మహబూబ్‌నగర్ పట్టణంలో దాదాపు ప్రాణాంతకమైన ఒక 'ప్రమాదం' జరిగింది. ఎపిసిఎల్‌సికి చెందిన బిచ్చారెడ్డిని ఒక కారు ఢీకొనింది. బిచ్చారెడ్డి ప్రాణం దక్కింది గానీ ఇప్పటికీ పూర్తిగా కోలుకోలేదు. అది ప్రమాదం కాదనీ అతనిని హత్య చేయడానికి చేసిన ప్రయత్నమనీ కచ్చితంగా చెప్పవచ్చు.

ఇక్కడ చెప్పవలసిన విషయం ఏమిటంటే ప్రజాతంత్ర సంస్థల డిమాండ్ల కారణంగా టి.పురుషోత్తం హత్య కేసులోనూ, మహమ్మద్ ఆజం ఆలీ హత్య కేసులోనూ మహమ్మద్ నయీ

★ ఇటీవల సుప్రీంకోర్టు ఏ కారణం చూపించకుండానే ఆ అప్పీల్‌ను కొట్టేసింది – సంపాదకులు.



ముద్దీన్‌నూ, అతని ముఠాకు చెందిన కొందరు వ్యక్తులనూ ముద్దాయిలుగా చూపిస్తూ చార్జిషీటు దాఖలు చేశారు. అయితే కోర్టు వారిని నిర్దోషులుగా ప్రకటించింది.

సిపిఐ (ఎం–ఎల్) (జనశక్తి) పార్టీకి కరీంనగర్ జిల్లా కమిటీ నాయకుడిగా ఉన్న రణదేవ్ 2003లో తాను సరండర్ కావడమే కాక జిల్లా కమిటీని మొత్తంగా ఆయుధాలతో సహా సరండర్ చేయించాడు. అందుకు మారుగా పోలీసులు అతనికి, అతని మనుషులకు, జిల్లాలో ఒక ముఠాగా వ్యవహరిస్తూ బలవంతపు వసూళ్ళు చేసుకోవడానికి, పంచాయతీలు చేయడానికి స్వేచ్ఛనిచ్చారు. తమ ఆదేశాలు అమలుచేయడం కోసం వీరు పట్టపగలే వ్యక్తులను అపహరించి తమ వాహనాలలో తీసుకుపోతారు. వారి చెర నుంచి విడుదలైన తరువాత ఆ వ్యక్తులు ఫిర్యాదు చేయడానికి పోలీసు స్టేషన్‌కు పోతే, తమను కిడ్నాప్ చేసిన వాహనం స్టేషన్ బయటే ఉండడం చాలా తరచుగా ఎదురయ్యే అనుభవం. ఈ ముఠా సంపాదించుకొన్న డబ్బుల్లో ఒక భాగం పోలీసుల పరం అవుతుందని వేరే చెప్పనవసరం లేదనుకుంటా. వాళ్ళంతా మాజీ నక్సలైట్లు కావడం వల్ల ప్రతి ఒక్కరి మీదా క్రిమినల్ కేసులున్నాయి. ఆ కేసులేవీ ప్రభుత్వం ఉపసంహరించలేదు. అయితే కోర్టు వారంటు జారీ చేసినా కూడా పోలీసులు వారిని అరెస్టు చేయరు. సిరిసిల్లలో జుడీషియల్ మొదటి తరగతి మేజిస్ట్రేటుగా ఉన్న శ్రీ కె.రాజన్న ఒక సందర్భంలో వారంట్లు ఇచ్చినా ఎందుకు అరెస్టు చేయడం లేదని కోర్టులోనే పోలీసులను నిలదీసి అడిగేసరికి, ఆ సాయంత్రమే వారికి రణదేవ్ నుంచి ఫోన్ వచ్చింది. ఎవరితో పెట్టుకుంటున్నవో తెలుసా అని గౌ. మేజిస్ట్రేటునే అతను బెదిరించాడు. పోలీసులను తిట్టినందుకు అమర్యాదగా అభ్యంతరం చెప్పాడు.

పైన చెప్పినట్టు, గ్రీన్ టైగర్స్ అనేది ఆవిర్భావంలో తెల్లబట్టల పోలీసులు ముఠాయే అయి ఉండవచ్చు. కార్యకర్తలను బెదిరించడానికీ వారి పైన దాడి చేయడానికీ పోలీసులే ఆ పేరు పెట్టుకొని ఉండవచ్చు. అయితే మాజీ నక్సలైట్ ముఠాలు ఏర్పడిన తరువాత బెదిరింపులు జారీ చేయడానికి వారూ ఆ పేరే వాడుకోవడం జరిగింది. బహుశా అది పోలీసుల, నేరచరిత గల మాజీ నక్సలైట్ల ఉమ్మడి వేదిక కావచ్చు. టి.పురుషోత్తంను నయీముద్దీన్ ముఠా హత్య చేయక ముందు గ్రీన్ టైగర్స్ పేరు మీద అతనికి బెదిరింపులు వచ్చాయి. నయీముద్దీన్ డా. లక్ష్మణ్‌ను అపహరించి చిత్రహింసలు పెట్టినప్పుడు తిరుమల టైగర్స్ నాయకుడు సింగమలై పేరుతో పేపర్లకు ప్రకటన ఇచ్చాడు. సింగమలై అనేది ఒక తెలుగు సినిమాలో దుష్టులను శిక్షించే హీరో పేరు. ఇక 'తిరుమల' అన్న పేరు పెట్టుకోవడానికి కారణం, 2003 అక్టోబర్ 1వ తేదీన తిరుపతిలో మావోయిస్టులు చంద్రబాబు నాయుడు పైన జరిపిన హత్యాప్రయత్నానికి ఇది ప్రతీకారం అని ప్రకటించడం కావచ్చు.

2004 సంవత్సరం రెండవ సగంలో ప్రభుత్వమూ, నక్సలైట్లూ కాల్పుల విరమణ పాటించి చర్చల ప్రక్రియను మొదలుపెట్టే ప్రయత్నం జరిగినప్పుడు, ఈ సాయుధ ముఠాలను నిరాయుధులు చేయాలన్నది మావోయిస్టుల వైపు నుంచి వచ్చిన డిమాండ్లలో ఒకటి. అయినా అటువంటిదేమీ జరగలేదని చెప్పనక్కర లేదనుకుంటాము.

అయితే ఈ చర్చల ప్రక్రియ 2005 సంవత్సరంలో నిలిచిపోయిన తరువాత వివిధ 'కోబ్రాల' గుంపులు తలెత్తడం ఈ ప్రైవేటు ముఠాలవల్ల కలిగిన భయాన్ని ఇనుమడింపచేసింది. పైన పేర్కొన్న ఘటనలన్నీ నక్సలైట్ ఉద్యమానికి తొలి వేదిక అయిన ఉత్తర తెలంగాణ జిల్లాలలో జరగగా,

కోబ్రాల పేరిట వ్యవహరిస్తున్న ముఠాల చర్యలు పత్రికలు 'నల్లమల జోన్'గా వ్యవహరిస్తున్న దక్షిణాది ప్రాంతంలో జరిగాయి. ఇది తెలంగాణలోని మహబూబ్‌నగర్ జిల్లా, రాయలసీమలోని కర్నూలు జిల్లా, కోస్తాలోని గుంటూరు, ప్రకాశం జిల్లాల ఎగువ ప్రాంతంలో కృష్ణా బేసిన్‌లోని నల్లమల అడవుల చుట్టూ ఉన్న ప్రాంతం. ఈ ప్రాంతం ఈ మధ్య కాలంలో మావోయిస్టు ఉద్యమాని కొక ముఖ్య కేంద్రంగా రూపొందింది. సంప్రదాయకంగా ఇది ముఠా కొట్లాటలకూ ప్రతీకార సంస్కృతికీ పేరుపడిన ప్రాంతం. ఇక్కడ హత్యకు స్పందన పోలీసు కేసు రూపంలో ఉండదు, ప్రతీకార హత్య రూపంలో ఉంటుంది. 'కోబ్రాల' చర్యలు నక్సలైట్ బాధితులు జరుపుతున్న ప్రతీకార చర్యలేనన్న అభిప్రాయం కలిగించడానికి పోలీసులు, ముఖ్యంగా రాష్ట్ర పోలీసు డైరెక్టర్ జనరల్ స్వరణ్‌జిత్ సేన్ ప్రయత్నం చేస్తున్నారు. అటువంటి ప్రతీకారానికి ఆస్కారమే లేదని అనలేము గానీ మూడు విషయాలు ఈ సందర్భంగా ప్రస్తావించాలి. 'కోబ్రాల' పేరు మీద బెదిరింపు ఫోన్లు చేసే వాళ్ళకు పోలీసులకు మాత్రమే తెలిసి ఉండగల విషయాలు తెలిసి ఉండడం బాధితులు తరచుగా గమనించారు. రెండు, పోలీసులకు గానీ పోలీసులకు ఆప్తులైన మహమ్మద్ నయీముద్దీన్ వంటి వారికి గానీ ఏదైనా నష్టం లేక కష్టం కలిగినప్పుడే కోబ్రాల పేరు మీద లేక కోబ్రాలు వ్యవహరించే ప్రాంతాల నుంచి బెదిరింపులు వస్తుండడం కూడా గమనించదగ్గ విషయమే. మూడు రోజు రోజుకూ మరింత నిస్సంకోచంగా సాగుతున్న కోబ్రాల హింసాకాండను పోలీసులు మురిపెంగా తిలకిస్తున్నారు తప్ప ఏమీ చేయడం లేదు.

2005 ఆగస్టు 15 నాడు మహబూబ్‌నగర్ జిల్లా నారాయణపేట ఎంఎల్ఏ నర్సిరెడ్డిని మావోయిస్టులు చంపడంతో ఇది మొదలయింది. జెండా ఎగురవేయడానికి ఆయన అదే జిల్లాలోని మక్తల్‌కు పోగా అక్కడ ఈ హత్య జరిగింది. హింస విషయంలో మావోయిస్టులు ఈ మధ్య కాలంలో అలవరచుకున్న విచ్చలవిడి వైఖరికి ఈ ఘటన ఒక మచ్చుతునక. ఒకరిని చంపడం వారి లక్ష్యం కాగా, అతను నిలబడి ఉన్న గుంపు మీదికి కాల్పులు జరిపి పది మందిని చంపారు (మరొకరు తరువాత ఆస్పత్రిలో చనిపోయారు). అసలు నర్సిరెడ్డిని చంపడానికి ఎందుకు ఎంచుకున్నారన్న ప్రశ్నకు కూడా మావోయిస్టుల వైపు నుంచి జవాబు లేదు. అతను సగటు కాంగ్రెస్ వాది. పెద్దగా మంచివాడూ కాదు. పెద్దగా దుర్మార్గుడూ కాదు. అతను చంపదగ్గవాడే అయితే రాష్ట్రంలో ఏ కాంగ్రెస్ వాడినైనా చంపవచ్చు.

ఆగస్టు 24వ తేదీన మహబూబ్‌నగర్ నివాసి, వృత్తిరీత్యా అధ్యాపకుడు, అనేక ప్రజాహిత ఉద్యమాలలో నిబద్ధతతో పని చేసిన కార్యకర్త అయిన కె.కెనకాచారిని స్కూలుకు పోతుండగా అపహరించి నరికి చంపారు. అతని మృతదేహాన్ని మహబూబ్‌నగర్ నుంచి నారాయణపేట వెళ్ళే రహదారి పక్కన పడేశారు. అప్పటికి ఒక వారం ముందు, అంటే ఆగస్టు 17న, నర్సాకోబ్రాలు అనే పేరు మీద పత్రికలలో ఒక ప్రకటన వచ్చింది. కనకాచారితో సహా చాలామంది కార్యకర్తల పేర్ల జాబితా ఇచ్చి, వారినందరినీ నర్సిరెడ్డి హత్యకు నిరసనగా అంతం చేస్తామని ఆ ప్రకటనలో అన్నారు. కనకాచారి దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం కార్యవర్గ సభ్యుడు.

2005 సెప్టెంబర్ 10వ తేదీన కులనిర్మూలన పోరాట వేదిక ప్రకాశం జిల్లా కమిటీ అధ్యక్షుడైన మన్నెం ప్రసాదును శింగరాయకొండలో అతను పనిచేసే సహకార సంఘం కార్యా



లయంలోనే హత్య చేశారు. ఈ ఘటన 5వ నంబర్ జాతీయ రహదారి మీద పట్టపగలు జరిగింది. నల్లమల నల్లకోబ్రాలు అనే ముఠా అతనిని చంపినట్టు ప్రకటించింది. ఈ ముఠా వివిధ ప్రజాతంత్ర సంస్థల కార్యకర్తలు తమ కార్యకలాపాలు మానుకోవాలని బెదిరిస్తూ నిందలతో కూడిన ప్రకటనలు కొంత కాలంగా ఇస్తూ ఉంది. వారి బెదిరింపు ప్రకటనలలో తరచుగా ప్రస్తావించే వ్యక్తులలో ఒకరు మానవహక్కుల వేదిక ప్రకాశం జిల్లా కమిటీ కన్వీనర్ అయిన ఎన్.వేణుగోపాల్. నిజానికి ప్రకాశం జిల్లాలోని నల్లమల ప్రాంతమైన మార్కాపురం డివిజన్ ఈ కోబ్రాల కార్యకలాపాల కొక కేంద్రంగా ఉంది. రాష్ట్ర వ్యాపితంగా చాలామంది కార్యకర్తలు అందుకొన్న బెదిరింపు ఫోన్లు ఈ డివిజన్ నుంచే వచ్చాయి.

ఈ రెండు ఘటనలు జరిగిన అనంతరం రాష్ట్ర పోలీసు డైరెక్టర్ జనరల్ 'కోబ్రాలు' చేస్తున్న హింస నక్సలైట్ బాధితుల ప్రతీకార చర్యలంటూ వివరించడం విన్నాం. దీని సత్యాసత్యాల సంగతి దిగువ చూద్దాంగానీ, ఆయన ప్రకటన చేసిన పద్ధతి నక్సలైట్ సానుభూతి పరులుగా ముద్ర ఉన్న వారి పైన ప్రైవేటు వ్యక్తుల దాడులను ప్రోత్సహించేదిగా ఉంది. కొద్దిరోజుల లోపలే 'ఒక నక్సలైట్ బాధితుల సంఘం' కరీంనగర్ జిల్లా మహదేవ్‌పూర్ మండలం అంబటిపల్లిలో కిలింగరావు అనే వ్యక్తిని చంపింది. ఇది జరిగింది 2005 సెప్టెంబర్ 14న. ముందు రోజు నక్సలైట్లు చేసిన ఒక హత్యకు ప్రతీకారంగా అతనిని చంపినట్టు ఆ సంఘం ప్రకటించింది. హంతకులు పోలీసులే అయి ఉండాలి లేదా డిజిపి గారి ప్రకటన నుంచి సంకేతాన్ని అందుకున్న వ్యక్తులైనా అయి ఉండాలి. 2005 నవంబర్ 19న ఎపిసిఎల్‌సి వరంగల్ జిల్లా కమిటీ బాధ్యుడైన వీరన్న మోటార్ సైకిల్‌ను గుర్తు తెలియని వ్యక్తులు కాలబెట్టారు. నవంబర్ 23న అనంతపురంలో ఎపిసిఎల్‌సి ప్రధాన కార్యదర్శి అయిన ప్రొఫెసర్ శేషయ్య ఇంటిపైన గుర్తు తెలియని వ్యక్తులు దాడిచేసి అతని కారును తగులబెట్టారు. నవంబర్ 28న మహబూబ్‌నగర్ జిల్లా చిన్న చింతకుంట మండలం అలీపూర్‌లో మునయ్య అనే దళిత అధ్యాపకుడిని నర్సా కోబ్రాలు స్కూలు నుంచి తిరిగి వస్తుండగా నరికి చంపారు. అతను ప్రజాతంత్ర ఉపాధ్యాయ సమాఖ్య సభ్యుడు. అప్పట్లో మావోయిస్టులు చంపిన ఎంఎల్ఏ నర్సిరెడ్డి స్థానానికి ఉప ఎన్నిక జరుగుతూ ఉంది. అతని కుమారుడిని ఏకగ్రీవంగా ఎన్నిక కానివ్వాలన్న అతని కుటుంబ సభ్యుల కోరికను అన్ని ప్రధాన పార్టీలూ మన్నించగా, మునయ్య బంధువొకరు స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేశారు. (వేరే కొందరు స్వతంత్ర అభ్యర్థులు కూడా నామినేషన్ వేశారు). నర్సిరెడ్డి స్థానంలో ఏకగ్రీవంగా ఎన్నిక జరగవలసిన అవసరమేమీ లేదని మునయ్య ఎవరితోనో అన్నట్టు వినికిడి.

ఈ రహస్య ముఠాలలో ఉన్నది అత్యధికం పోలీసులేనన్న మా అభిప్రాయం ఇప్పటికే చెప్పాము. వారితోపాటు మహమ్మద్ నయీముద్దీన్, జడల నాగరాజు మొదలైన నేరస్తులుగా మారిన మాజీ నక్సలైట్లూ ఉన్నారు. వీరేకాక ఒక మూడవ కోవకు చెందిన వారూ ఉండవచ్చు. డిజిపి గారు చెప్పే 'నక్సలైట్ బాధితులకు' వీరు కొంత దగ్గరగా ఉంటారు. వీరు నక్సలైట్ల చేత ఇన్‌ఫార్మర్లుగా, పోలీసు ఏజెంట్లుగా ముద్రవేయబడ్డ వారు. ఆ నింద నిజమైనా అబద్ధమైనా అది మరణ దండనే. గతంలో అటువంటి వాళ్ళకు తమ ప్రాణాలు కాపాడుకోవడానికి మార్గమేదీ ఉండేది కాదు. ఇప్పుడు ఈ ముఠాలలో చేరడం ఒక మార్గం. వీరుకాక వేరే 'నక్సలైట్ బాధితులు' ఈ ముఠాలలో ఉన్నారని మేము అనుకోవడం లేదు.

అయితే నక్సలైట్ బాధితులు అనే వాళ్ళు నిజంగా లేరా, వారికి నక్సలైట్ల పట్ల న్యాయబద్ధమైన వ్యతిరేకత ఉండదా అన్నదిక్కడ ప్రశ్నకాదు. నక్సలైట్ల హింస – ముఖ్యంగా మావోయిస్టుల హింస తక్కువేమీ కాదు. వారు చేస్తున్న అన్ని చర్యలూ వారి రాజకీయ విలువలకు సైతం లోబడి ఉన్నట్టు కనిపించదు. నక్సలైట్ల లక్ష్యశుద్ధిలేని హింసాత్మక చర్యలపట్ల న్యాయమైన ఆగ్రహం ఉన్నవారు సమాజంలో చాలామందే ఉన్నారని నిర్ధారించడానికి కావలసినంత సమాచారం ఉంది. కానీ అదికాదు సమస్య. ప్రభుత్వం ఈ ప్రైవేటు ముఠాలను పనిగట్టుకొని ప్రోత్సహిస్తున్నది. వారు హత్యలు చేస్తూ, వివిధ సంఘాల కార్యకర్తల చేత బలవంతంగా రాజీనామాలు చేయిస్తుంటే చూస్తూ ఊరుకుంటున్నది. అంతేకాక పోలీసు సిబ్బందిలోనే కొందరు ప్రైవేటు ముఠాల ముసుగులో వ్యవహరిస్తున్న సూచనలు ఉన్నాయి. బెదిరింపులు లిఖిత పూర్వకమైన పత్రికా ప్రకటనల రూపంలో ఇస్తున్నప్పటికీ, ఫోన్‌లు చేస్తున్న నంబర్లను బాధితులు గుర్తించి పోలీసులకు తెలియచేస్తున్నప్పటికీ, ఒక్క 'టైగర్'ను గానీ, ఒక్క 'కోబ్రా'ను గానీ పోలీసులిప్పటి దాకా గుర్తించలేదు. ఒకే ఒక మినహాయింపు (మొదట్లో చెప్పినట్టు) వరంగల్ చర్చల వాతావరణంలో 2004లో అరెస్టు చేసిన మాజీ కానిస్టేబుల్ జావేద్.

నిజానికి ఈ నక్సలైట్ – వ్యతిరేక వ్యూహాన్ని పోలీసులు చాలా మురిపెంగా తిలకిస్తున్నారు. దీర్ఘకాలం పనిచేస్తున్న ఉద్యమ కార్యకర్తల చేత పని మాన్పించి ఇంట్లో కూర్చోబెట్టే లక్ష్యం ఏదైతే పోలీసులు సంవత్సరాల తరబడి ఎంత నిర్బంధం ప్రయోగించినా సాధించలేకపోయారో దానిని ఈ టైగర్లు, కోబ్రాలు కొద్ది వారాలలోనే సాధించారు. కార్యకర్తలలో కొందరు తమ ఆత్మగౌరవాన్ని కూడా వదులుకొని, తాము ఉద్యమం నుంచి వైదొలుగుతున్నామన్న విషయాన్ని గమనించి తమను విడిచిపెట్టమని ఈ అదృశ్య పీడకులకు విజ్ఞప్తులు కూడా చేసుకున్నారు. ఆ పని చేయొద్దనుకున్న వారు భయం వల్ల సమర్థంగా పని చేయలేకున్నారు. పోలీసు నిర్బంధానికి వ్యతిరేకంగా మాట్లాడగల సంస్థ ఒక్కటీ లేని పరిస్థితి ఒక జిల్లా తరువాత ఒక జిల్లాలో నెలకొనింది. మానవహక్కుల వేదిక ఒక్కటే దీనికి మినహాయింపుగా ఉంది. అయితే ఇప్పటివరకు ఈ వికృత వ్యూహాన్ని మేము తట్టుకోగలిగాము గానీ ఈ స్థితి శాశ్వతంగా ఉంటుందని మేము కూడా హామీ ఇవ్వలేము.

ఈ సమస్య పట్ల నిరసనను హక్కుల నుడికారంలో తెలపాలని మానవహక్కుల వేదిక భావిస్తుంది. ఆ కారణంగా మేము పోలీసు నిర్బంధానికి వ్యతిరేకంగా ఆందోళన చేసే లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పడిన ప్రజాసంఘాల ఉమ్మడి వేదికలో భాగం కాలేదు. అయితే వారి ఊరేగింపులలో, సభలలో పాల్గొంటున్నాము. మా వంతుగా, ఎప్పుడు సందర్భం వచ్చినా ఈ టైగర్లు, కోబ్రాల నేర చర్యలకు వ్యతిరేకంగా మాట్లాడుతున్నాం. ఈ ముఠాల ఆగడాల విషయంలో ఏమీ చేయకుండా ఉన్న ప్రభుత్వ నిర్వ్యాపకత్వం పట్ల హోంమంత్రిని కలిసి నిరసన తెలిపాము. మా నిరసనను లిఖిత పూర్వకంగా ఇమ్మని ఆయన కోరగా, 2005 సెప్టెంబర్ 1వ తేదీన ఇచ్చాము. ఆ ఫిర్యాదు ప్రతిని ఈ లేఖతో జతచేస్తున్నాం. మళ్ళీ కూడా మేము హోంమంత్రిని కలిశాము గానీ కోబ్రాలంటే కేవలం నక్సలైట్ బాధితులేననీ కోబ్రాల చర్యలతో పెద్దగా ఆందోళన చెందవలసిందేమీ లేదని పోలీసుల మాటల్నే ఆయన కూడా పలుకుతున్నాడు. ఇక పోలీసులు వాళ్ళను పట్టుకోలేక పోతున్నారు, నిరోధించలేకపోతున్నారు అంటారా? పోలీసులు నక్సలైట్లను మాత్రం పట్టుకోగలుగుతున్నారా, నిరోధించగలుగుతున్నారా? అని ప్రశ్నిస్తున్నాడు.



ఇది ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అధికారిక అభిప్రాయం. ఇది సందేహాస్పదం అన్న మా అభిప్రాయాన్ని ఇప్పటికే వివరించాము. మీ నిర్ణయాన్ని మీకే వదిలేస్తున్నాం.

రాష్ట్ర లోకాయుక్త వద్ద కోబ్రాలను నిలువరించడానికి ఉద్దేశ పూర్వకంగానే ఏ చర్యా తీసుకోకపోవడం వల్ల వారి బాధితులకు తీవ్ర హాని కలుగుతున్నదన్న ఫిర్యాదొకటి దాఖలైంది. ఈ ఫిర్యాదులో రాష్ట్ర హోంమంత్రిని, డిజిపిని, ఐజి (ఇంటెలిజెన్స్)ను ప్రతివాదులుగా పేర్కొనడం జరిగింది. ఫిర్యాది విప్లవ రచయితల సంఘం సభ్యుడైన చలసాని ప్రసాద్. సీనియర్ న్యాయవాది, పౌరహక్కుల ప్రజాసంఘం జాతీయ అధ్యక్షుడు అయిన కె.జి.కన్నాభిరాన్ గారి సలహా మేరకు ఈ ఫిర్యాదు దాఖలైంది. ఈ ఫిర్యాదు పైన జరగగల విచారణను ఫలప్రదంగా నడిపించడానికి అవసరమైన సాక్ష్యాలను సేకరించే బాధ్యత మానవహక్కుల వేదిక తన మీద వేసుకుంది.

ఈ ముఠాలు, వాటి హింసాత్మక చర్యల విషయంలో ప్రభుత్వం బాధ్యతను నొక్కి చెప్పే డిమాండ్లతో వీలైనంత ఎక్కువగా సంతకాలు సేకరించి ఉత్తరాలు పంపించవలసిందిగా మిమ్మల్ని కోరుతున్నాము. ఈ ముఠాల కార్యకలాపాల గురించి చేసిన నేర పరిశోధన ఫలితాన్ని, వారిని నిలువరించడానికి తీసుకున్న చర్యలను బహిర్గతం చేయవలసిందిగా మేము ప్రభుత్వాన్ని కోరుతున్నాము. దానితో బాటు, ఈ రాష్ట్ర ప్రజల హక్కులను కాపాడడానికి ఉపయోగపడతాయని మీకు తోచే ఇతర డిమాండ్లు కూడా చేర్చమని మిమ్మల్ని కోరుతున్నాము.

**11-2-2006**





## రాష్ట్రప్రభుత్వం సాగిస్తున్న 'జలయజ్ఞం'లో...

# నిజమెంత? అబద్ధమెంత?
# మేలు ఎంత? కీడు ఎంత?

**కాం**గ్రెస్ ప్రభుత్వానికి ఒక సంవత్సరం నిండిన సందర్భంగా వారు సాధించిన ఘన కార్యాల గురించి చేసుకున్న ప్రచారంలో 'జలయజ్ఞానికి' చాలా పెద్దపీట వేసిన సంగతి అందరం చూశాము. రాష్ట్రంలో ఏ మూలకు పోయినా పెద్దపెద్ద కాలువలు తవ్వుతుండడం చూస్తున్నాము.

రెండు సంవత్సరాలలో 8 ప్రాజెక్టులూ, అయిదేళ్ళలో మొత్తం 30 ప్రాజెక్టులూ నిర్మిస్తామన్నది కాంగ్రెస్ వారి హామీ. అదే 'జలయజ్ఞం'. దీనికోసం ఇప్పటికే 27 వేల కోట్లు ఖర్చయ్యే 157 పనులు మొదలయ్యాయంట. అందులో 68 పనులు (వ్యయం 13 వేల కోట్లు) తెలంగాణలోను, 46 పనులు (వ్యయం 8 వేల కోట్లు) కోస్తా ఆంధ్రలోను, 43 పనులు (వ్యయం 6 వేల కోట్లు) రాయలసీమలోను చేపడుతున్నారంట. అయిదేళ్ళలో 30 ప్రాజెక్టులూ పూర్తిచేసి 65 లక్షల ఎకరాలను కొత్తగా సాగునీటి కిందికి తీసుకు రావడంతో పాటు మరొక 22 లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరిస్తారంట.

ఇది అసాధ్యం అని ఎవరైనా అంటే, అందులో సగం సాధ్యమయినా మంచిదే కదా అనేవాళ్ళుంటారు. నాలుగవ వంతయినా జరగదంటారా అనేవాళ్లూ వుంటారు. ఏమీ చేయకుండా వుండడం కంటే ఏ కొంచెం చేసినా మేలే కదా అనేవాళ్లు సహితం వుంటారు.

సాధ్యాసాధ్యాలనూ అవసరాన్నీ దృష్టిలో వుంచుకొని ఏ ప్రాజెక్టులు ఇప్పుడే సాధ్యమో, ఏవి ఎక్కువ అవసరమో, వేటివల్ల నిజంగా మేలు జరుగుతుందో వాటితో మొదలుపెట్టినట్టయితే, చివరికి నాలుగవవంతే జరిగినా అంతకంటే తక్కువే జరిగినా ఫరవాలేదనుకోవడంలో తప్పు లేదు.

కానీ ఇప్పుడు జరుగుతున్నది అదికాదు. 30 ప్రాజెక్టుల మీదా పని ఏకసమయంలో మొదలయి వేలకోట్లు కేటాయించేశారు. పనులు కాంట్రాక్టర్లకిచ్చి మొదలుపెట్టించేశారు. రాబోయే ఆయకట్టును ఊహించుకుని ఆశలు పెట్టుకొమ్మని రైతులకు చెప్పేశారు. వీటిలో సగం ప్రాజెక్టులు సాధ్యం కాకపోతే సగం డబ్బులు వృధా అవుతాయి. సగం ఆశలు వమ్మవుతాయి. వృధా అయిన ఖర్చు ప్రజలందరికీ భారం అవుతుంది. వమ్మయిన ఆశలు ప్రజల మధ్య ఘర్షణలకూ, ద్వేషాలకూ దారితీస్తాయి. ఆర్థిక సంక్షోభం, సామాజిక కల్లోలం మిగులుతాయి.

కాంట్రాక్టర్లు మాత్రం బాగుపడతారు. ఇంతా అంతా కాదు, చాలా బాగుపడతారు. 'జలయజ్ఞం' అందుకోసమేనా అని అడిగితే రాజశేఖరరెడ్డి అభిమానులకు కోపం వస్తుందేమో. కానీ ఇప్పుడే కోపం చేసుకోకుండా చివరిదాకా చదివి అప్పుడు చెప్పమని మా మనవి.

★ రెండేళ్ళ లోపల పూర్తిచేయబోయే ప్రాజెక్టులలో వంశధార స్టేజ్-2, ఫేజ్-1 ఒకటి. స్టేజ్-2కోసం నేరడి దగ్గర మన ప్రభుత్వం ప్రతిపాదించిన మళ్లింపు పథకానికి

కరపత్రం

ఒరిస్సా ఇన్నేళ్లుగా ఒప్పుకోలేదు. కాబట్టి ప్రస్తుతానికి నేరడికి దిగువన కాట్రగడ దగ్గర సైడ్ కాలవ తీసి ఎంత నీళ్లొస్తే అంత తీసుకుంటామనీ, దీనికి స్టేజ్-2 ఫేజ్-1 అని పేరు పెడతామనీ అంటున్నారు. బాగానే వుంది. కానీ అన్ని నిర్మాణాలూ స్టేజ్-2కు తగినట్లు చేసేస్తున్నారు. హిరమండలం దగ్గర 19 టిఎంసిల రిజర్వాయర్ కడుతున్నారు. దానిపైన రెండు బ్యాలన్సింగ్ రిజర్వాయర్లు కడుతున్నారు. 20 వేల ఎకరాలకు వరద కాలవ, 82 వేల ఎకరాలకు కుడి కాలువ తవ్వేస్తున్నారు. వంశధార స్టేజ్-1 కింద ఇప్పటికే ఒక పంటకు నీళ్లొస్తున్న 1,48,000 ఎకరాలకు స్టేజ్-2 ద్వారా రెండవ పంటకు నీళ్ళివ్వడానికి 'లింక్' కాలువ తవ్వేస్తున్నారు. హిర మండలం రిజర్వాయర్‌కోసం 21 గ్రామాలను ఖాళీ చేయించేస్తున్నారు. రైతులతో బేరంపెట్టి నష్టపరిహారంతో సంతృప్తిపరచి పంపించేద్దామని చూస్తున్నారు. ఇంతాచేసి ఒరిస్సా నేరడి బ్యారేజికి సమ్మతి ఇవ్వకనేపోతే? ఇప్పుడు ఫేజ్-1 పేరిట చేపట్టే కాట్రగడ సైడ్ కాలువ అందులో మూడవ వంతు నీరు మాత్రమే ఇస్తుంది. దానితోనే సరిపెట్టు కోవలసి వస్తే? నీళ్ళు లేని కాలువలు, నేల తడవని రిజర్వాయరు ఎవరిని ఉద్ధరించడానికి కట్టినట్టు? కాలవొచ్చింది కదా ఇక నీళ్ళు రావా అని ఎదురుచూసే ఆయకట్టుదార్లను ఎవరు ఊరడించేటట్టు?

ఒరిస్సాతో వున్న తేడాను ద్వైపాక్షికంగా పరిష్కరించుకోలేకపోతే కేంద్ర ప్రభుత్వాన్ని కోరి ట్రిబ్యునల్ ఏర్పాటు చేయించుకోవాలి. ట్రిబ్యునల్ తీర్పు ప్రకారం వంశధార స్టేజ్-2 కట్టుకోవాలి. అంతేతప్ప 'ఆలూ లేదు చూలూ లేదు' అనే ఈ వ్యవహారం ప్రజాధనాన్ని కాంట్రాక్టర్లకు దోచి పెట్ట డానికి తప్ప ఇంక దేనికోసం ఉద్దేశించబడింది?

ఒక్క వంశధారే కాదు, జంఝావతి, నాగావళి,బాహుద నదుల విషయంలోనూ ఒరిస్సాతో మనకు విభేదాలున్నాయి. చెరిసగం నీళ్లు తీసుకోవాలన్న స్థూలమైన ద్వైపాక్షిక ఒప్పందాలున్నాయి గానీ ప్రతీ ప్రాజెక్టు విషయంలోనూ తేడాలొస్తున్నాయి. అవి ద్వైపాక్షికంగా పరిష్కారం కావని గడచిన అయిదు దశాబ్దాలలో అర్థమయిపోయింది. ప్రతిపాదిత ప్రాజెక్టులకోసం ట్రిబ్యునల్ ఏర్పాటును ఆహ్వానించి దాని తీర్పు వచ్చేదాకా ఆగడం విజ్ఞతగల పాలన అనిపించుకుంటుంది. 'ప్రాజెక్టు' అనగానే 'టెండర్లు పిలువు' అనేది మతిచెడిన పాలన అనిపించుకుంటుంది.

★ హడావుడిగా కట్టేస్తున్న ప్రాజెక్టులలో పోలవరం ఒకటి. ఇప్పటికే దీనికి వేలకోట్లు కేటాయించారు. అయితే ఈ ప్రాజెక్టుకు అవసరమయిన మూడు ముఖ్య అనుమతులకు ప్రయత్నం కూడా ఇప్పటిదాకా జరగలేదు. ఒకటి, కేంద్ర అటవీశాఖ అనుమతి. ఈ ప్రాజెక్టు కింద దాదాపు 10,000 ఎకరాల అడవి మునుగుతుంది కాబట్టి దీనిని చేపట్టడానికి కేంద్ర అటవీ శాఖ అనుమతి కావాలి. రెండవది కేంద్ర సామాజిక న్యాయశాఖ అనుమతి. ఈ ప్రాజెక్టు కింద దాదాపు లక్షన్నర జనాభా నిర్వాసితులవుతారు. అందులో సగం ఆదివాసులు. కాబట్టి కేంద్ర సామాజిక న్యాయశాఖ అనుమతి లేకుండా ప్రాజెక్టు చేపట్టడానికి వీలులేదు. మూడోది, పర్యావరణ అనుమతి. గోదావరి లోయ అడవులు జీవావరణం (బయోస్పియర్) దృష్ట్యా విలువయినవని పర్యావరణ నిపుణులు భావిస్తే ఈ అనుమతి దక్కదు.

'అనుమతులు వచ్చినప్పుడు వస్తాయి, ఈలోపల పనులు చేసుకుంటూ పోదాం' అన్న వైఖరి చెల్లదనీ, చివరకు అనుమతులు రాకపోతే ప్రజాధనం వృధా అవుతుంది కాబట్టి అన్ని అనుమతులూ తీసుకున్నాకనే పనులు మొదలుపెట్టాలనీ ఈమధ్యనే మన హైకోర్టు పులి చింతల కేసులో రాష్ట్ర



ప్రభుత్వాన్ని గట్టిగా మందలించింది. అయినప్పటికీ పులిచింతలలో చేసిన పనే పోలవరంలో మళ్లీ చేస్తున్నారు. రైతులకు నీళ్లివ్వాలన్న ఆరాటంతోనే ఇదంతా చేస్తున్నారని నమ్మలేం. ఎందుకంటే అనుమతులు లేకుండా ప్రాజెక్టు కట్టుకుంటూపోతే ఎప్పుడో ఒకప్పుడు కేంద్ర ప్రభుత్వమో, కోర్టులో అడ్డం తగులుతాయి. అనుమతులు లేని ప్రాజెక్టును పూర్తిచేసి రైతులకు నీళ్లివ్వడం కల్ల. కానీ కట్టినకాడికి కాంట్రాక్టర్లకు పైసలు మాత్రం దక్కుతాయి.

పోలవరం గురించి మరొక రెండు విషయాలు చెప్పుకోవాలి. మునగబోయే 10,000 ఎకరాల అడవికి మారుగా ఎక్కడో ఒకచోట 10,000 ఎకరాల ప్రభుత్వ బంజరును అటవీశాఖకు అప్పగించి అనుమతి తెచ్చుకునే ప్రయత్నం రాష్ట్ర ప్రభుత్వం చేసినా (అంతటి బంజరు భూమి ఒకచోట కాకపోయినా నాలుగయిదు చోట్ల దొరుకుతుందనుకున్నా), సుప్రీంకోర్టు అడ్డంపడగలదు. రాజశేఖరరెడ్డి గారి న్యాయ సలహాదారులు వారికీ విషయం చెపుతున్నారో లేదోగానీ కొన్నేళ్ళుగా సుప్రీంకోర్టు అటవీ భూముల బదలాయింపు మీద నిత్యనిఘా వేసి వుంది. 'గోదావర్మన్ కేసు' అనే కేసొకటి సుప్రీంకోర్టులో వుంది. ఆ కేసులో సుప్రీంకోర్టు తుదితీర్పు ఇవ్వదలచుకోలేదు. దానిని అడవుల సంరక్షణకు ఒక సాధనంగా వాడుకోదలచుకుంది. రెండు మూడు నెలలకొకసారి ఆ కేసు విచారణకొస్తుంది. ఆ మధ్య కాలంలో అటవీ భూముల బదలాయింపుకు ఎక్కడ అనుమతి ఇచ్చివున్నా దానిపైన ఎవ రైనా ఆ కేసు విచారణ సమయంలో మధ్యంతర అర్జీ పెట్టుకోవచ్చు. సుప్రీంకోర్టు దానిపైన నిపుణుల చేత విచారణ జరిపించి, ఆ అనుమతి చెల్లుతుందా లేదా అన్నది చెప్తుంది. చాలా సందర్భాలలో కఠినంగా వ్యవహరిస్తూ వుంది.

రెండవది, ఈ అడ్డంకులన్నీ తొలగినా ఆదివాసుల ప్రతిఘటనను ప్రభుత్వం ఎదు ర్కొనవలసి వుంటుంది. పోలవరం వల్ల ఎంత తక్కువన్నా 70,000 ఆదివాసీ జనాభా నిర్వాసితులవుతారు. వారి బతుకులు ఛిద్రమవుతాయి. వారు అంత సులభంగా తమ ఊళ్ళనూ కొండలనూ అడవులనూ విడిచిపెట్టి పోరు. ఎవరి నాయకత్వం వున్నా లేక పోయినా వారికి తోచిన పద్ధతిలో ప్రతిఘటిస్తారు. వాళ్ల తలలు పగలగొట్టకుండా కాళ్లు చేతులు విరగ్గొట్టకుండా పోలవరం సాధ్యంకాదు. ఇప్పటికే అభివృద్ధి చెందివున్న కోస్తాంధ్ర జిల్లాలలో ఇంకొక 8 లక్షల ఎకరాలకు సాగు నీరివ్వడానికి అభివృద్ధిలో అట్టడుగున వున్న ఆదివాసులను - అందులోను అంత పెద్దమోతాదులో - అణచివేతకు గురిచేయడాన్ని మానవత్వం వున్న వాళ్లెవరూ ఆమోదించలేరు.

★ శ్రీశైలం ఎడమగట్టు కాలవ, ఎలిమినేటి మాధవరెడ్డి కాలవ, కల్వకుర్తి ఎత్తిపోతల పథకం, నెట్టెంపాడు, హంద్రీ-నీవా, గాలేరు-నగరి, గురు రాఘవేంద్ర ఎత్తిపోతల పథకం, పెన్నహోబిలం, తెలుగుగంగ, వెలిగొండ రాజశేఖరరెడ్డి గారి 'జల యజ్ఞం' లోని కృష్ణా బేసిన్ ప్రాజెక్టులు. వీటిలో ఒక్కదానికీ ఒకచుక్క నీటి కేటాయింపు లేదు. వీటికోసం కృష్ణా-తుంగభద్ర నదులలో ఒక్కచుక్క నీరు తీసుకునే హక్కు మనకు లేదు. అయినప్పటికీ తెలుగుగంగ కొన్నేళ్లుగా కట్టుకుంటూ పోతున్నారు, ఎలిమినేటి మాధవ రెడ్డి కాలవ దాదాపు పూర్తిచేశారు. ఇప్పుడు మిగిలిన వాటన్నిటికోసం వందలూ వేల కోట్ల రూపాయలు కేటాయించి కాలవల తవ్వకం, ఎత్తిపోతల రూపకల్పన మొదలుపెట్టారు.

ఇవన్నీ తీవ్ర వర్షాభావ ప్రాంతాల ప్రాజెక్టులు కాబట్టి వీటికి వ్యతిరేకంగా మాట్లాడాలంటే ఎవరికైనా బాధ అనిపిస్తుంది కానీ సాధ్యాసాధ్యాలతో సంబంధం లేకుండా కాంట్రాక్టర్ల జేబులు నింపి ప్రజలలో ఆశలు రేకెత్తించి చివరికి ప్రజల మధ్య విద్వేషాలు మిగిలించే కంటే ముందునుండే వాస్తవాలు తెలుసుకోవడం మంచిది. మొదటి కృష్ణా జలాల ట్రిబ్యునల్ (బచావత్ ట్రిబ్యునల్) చేసిన నీటి కేటాయింపుల ప్రకారం ఈ ప్రాజెక్టులేవీ కట్టుకునే హక్కు మనకు లేదు. రెండవ కృష్ణా జలాల ట్రిబ్యునల్ మనకేమయినా హక్కు ఇస్తుందన్న ఆశ వున్నట్టయితే ఆ ట్రిబ్యునల్ ముందుకు పోవాలి. నేరుగా వాదించి ఏదో ఒకమేరకు హక్కు సంపాదించుకోవాలి. గోదావరి జలాలను కృష్ణా బేసిన్‌కు తరలించి ఆ బేసిన్‌లో నీటి కొరత సమస్యను పరిష్కరించదలచుకున్నా ట్రిబ్యునల్ ముందుకు పోక తప్పదు. దీని సాధ్యాసాధ్యాల గురించి ఇంకొక సందర్భంలో మాట్లాడుకుందాం గానీ, ఎంత నేర్పు ప్రదర్శించినా మనకు ఎక్కువ దక్కడం కష్టం. ఎందుకంటే ఇప్పటికే మనం కృష్ణా బేసిన్‌లో చాలా ఎక్కువ నీళ్లు తీసుకుంటున్నాం. కాబట్టి పైన ఏకరువు పెట్టిన ప్రాజెక్టులన్నీ సాధ్యపడడం కల్ల. అతి కష్టంమీద వాటిలో రెండింటికో మూడింటికో అనుమతి తెచ్చుకోవచ్చునేమో.

ఇప్పటికే రెండవ కృష్ణా ట్రిబ్యునల్ కూర్చొనింది. అందరి వాదనలూ, విజ్ఞాపనలూ వినడానికి సిద్ధమవుతూ వుంది. విజ్ఞతగల ప్రభుత్వం దానిమీద దృష్టి పెట్టి, అక్కడ ఏ మేరకు నీటి హక్కు దక్కితే ఆ మేరకు వీటిలో రెండింటినో మూడింటినో న్యాయబద్ధంగా ఎంపిక చేయవలసి వుండింది. దాని బదులు అన్నిటికీ విచ్చలవిడిగా డబ్బులు కేటాయించి ప్రజలలో ఆశలు రేకెత్తించడం వల్ల జరిగేదేమిటంటే, కేటాయించి ఖర్చు పెడుతున్న డబ్బులో నూటికి డెబ్బై రూపాయలు తప్పనిసరిగా వృధా కావడం; రేపు ఈ ప్రాజెక్టులలో ఏ రెండు మూడింటిని ఎంపిక చేసినా ప్రజలలో తీవ్ర అసంతృప్తి ఏర్పడడం; ప్రాంతాలవారీగా, జిల్లాల వారీగా ప్రజల మధ్య విద్వేషాలు చెలరేగడం. ఇది తెలివితక్కువతనం మాత్రమే కాదు, దుర్మార్గం కూడా.

★ రాజశేఖరరెడ్డి 'జలయజ్ఞం' విద్యుత్ వినియోగం విషయంలో రాష్ట్రం మొత్తంమీద పెద్దభారాన్ని వేయబోతున్నది. ఆయనగారు పూర్తిచేయబోయే 30 ప్రాజెక్టులలో 17 ఎత్తిపోతల పథకాలు. చిన్నా, చితక ఎత్తిపోతలు మనకు పరిచయమే. అవి రాష్ట్రంలో ఎక్కడా సఫలం కాలేదన్న సంగతి కూడా తెలిసినదే. అలాంటిది ఇవి చిన్నాచితక పథకాలు కూడా కావు. భారీ ఎత్తిపోతల పథకాలు. అయితే ఇక్కడ మేము వాటి సాంకేతిక సాధ్యాసాధ్యాల గురించి మాట్లాడడం లేదు. విద్యుత్ వినియోగాన్ని గురించి, దానికయ్యే ఖర్చుల గురించి మాత్రమే మాట్లాడుతున్నాం.

30 ప్రాజెక్టులలో 17 ఎత్తిపోతల ప్రాజెక్టులంటే అర్థం, కొత్తగా సాగునీటి వసతి కల్పించబోయే 65 లక్షల ఎకరాలలో 35 లక్షలదాకా ఎత్తిపోతల కింద వుంటాయని. ఒక్కొక్క ఎత్తిపోతల పథకంలో నీటిని ఎంత ఎత్తుకు లిఫ్ట్ చేయవలసి వుంటుందనేది ప్రాజెక్టును బట్టి వుంటుంది. 50 మీటర్ల నుంచి 300 మీటర్ల దాకా లిఫ్ట్ అవసరం అవుతుందని స్థూలంగా చెప్పవచ్చు. సగటున 150 మీటర్లు ఎత్తిపోయవలసి వుంటుందనుకుందాం. 1 ఎకరానికి అవసరమయిన సాగునీరు 100 మీటర్లు లిఫ్ట్ చేసి పోయడానికి 1000 యూనిట్ల కరెంటు అవసరం అవుతుందని అంచనా. యూనిట్‌కు 2 రూపాయల ధర వేసుకున్నా 150 మీటర్లు ఎత్తిపోయడానికి ఎకరానికి 3000 రూపాయలు అవుతుంది. ఏ రైతూ అంతమొత్తం కాదుకదా అందులో 10వ వంతు మించి



పెట్టుకోలేడు. మిగిలినది ప్రభుత్వమే పెట్టుకోవలసి వుంటుంది. 35 లక్షల ఎకరాలకు ఇది ఎంత అవుతుందంటే ఇప్పుడు మొత్తం వ్యవసాయ బోర్లు, మోటార్లకు అవసరమైన కరెంటుకోసం రాష్ట్రంలోని రైతులంతా కలిసి ఖర్చు చేస్తున్నంత. (ఈ విషయం లెక్కలు వేసి రుజువు చేయొచ్చు). అంటే రాజశేఖరరెడ్డి గారి 'జలయజ్ఞం' ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం భరించవలసిన వ్యవసాయ విద్యుత్ సబ్సిడీ రెండు రెట్లవుతుంది. ఇప్పుడిస్తున్నదే మోయలేని పాలకులు దీన్ని రెండురెట్లు పెంచితే మోస్తారా? జలయజ్ఞం అయిపోయిన తర్వాత కరెంటు సబ్సిడీ మేమియ్యలేము, మీరే బిల్లు కట్టండి అంటే రైతులేం కావాలి? అంత ఖరీదయిన సాగునీరు మాకు అక్కరలేదని రైతులంటే ఇంత హంగామా చేసి కట్టిన ప్రాజెక్టులు ఏం కావాలి?

ఎత్తిపోతల ప్రాజెక్టులు ఎన్నయినా చేపట్టవచ్చుననే పద్ధతిలో వ్యవహరించడమే తెలివితక్కువతనం. కాగల ఖర్చును దృష్టిలో వుంచుకొని అత్యవసరమైన వాటికి పరిమితం కావడం ఉచితమనిపించుకుంటుంది. గోదావరి జలాలలో మనకింకా వాటా వుంది కాబట్టి గుప్త, అలీసాగర్‌లతో పాటు ఉత్తర తెలంగాణాలో 300 మీటర్ల కాంటూరుకు ఎగువన వున్న మెట్ట నేలలకు నీరిచ్చే శ్రీరాంసాగర్ వరద కాలవకు, ప్రాణహిత నుంచి నీళ్లు మళ్లించి రూపొందించిన ఎల్లంపల్లి ప్రాజెక్టుకూ ప్రస్తుతానికి పరిమితం కావడం మంచిది.

## అయితే ఏం చేయాలి?

మరి ప్రభుత్వం ప్రాజెక్టులే చేపట్టవద్దంటారా అని అడుగుతారేమో.

వద్దని మేము అనడం లేదు. చేపట్టదగినవి 'జలయజ్ఞం' లిస్టులోనూ వున్నాయి. ఆ లిస్టులో లేనివీ వున్నాయి.

ఏ అనుమతులూ అక్కరలేకుండా, ఎవరినీ నిర్వాసితులు చేయకుండా, ఏ పొరుగు రాష్ట్రంతోనూ గొడవ లేకుండా వెనుకబడిన ప్రాంతాలకూ, దుర్భిక్ష ప్రాంతాలకూ సాగు నీరివ్వగల ప్రాజెక్టులు వున్నాయి. అవి రాజశేఖరరెడ్డి గారి ముప్పైలో లేకపోవడం చాలా ఆశ్చర్యం కలిగించే విషయం.

★ పెన్‌గంగ నదీమీద మహారాష్ట్ర ఆదిలాబాద్‌కు ఉత్తరాన దిగువ పెన్‌గంగ ప్రాజెక్టు కట్టింది. ప్రాజెక్టు ఖర్చులో 12 శాతం మనం చెల్లించి ఒకకాలవ తవ్వుకొని 5.6 టిఎంసిలనీళ్ళు తీసుకుపోవచ్చని చెప్పింది. 12 శాతం అంటే కేవలం 240 కోట్లు. ఆ మొత్తం మహారాష్ట్రకు ఇచ్చేస్తే చాలా వెనుకబడిన తాంసి, బేలా, జైనత్ మండలాలలోని 61 గ్రామాలలో 40,000 ఎకరాలకు నీళ్లొస్తాయి. 'జలయజ్ఞం'లో ఇదెందుకు లేదు? అసలు 'జలయజ్ఞం'లో ఆదిలాబాద్‌కు నీళ్ళిచ్చే ఒక్క ప్రాజెక్టూ ఎందుకు లేదు?

★ రాజోలిబండ మళ్లింపు పథకాన్ని ఆధునీకరించి దాని ఆయకట్టును పూర్తిస్థాయిలో కాపాడమని మహబూబ్‌నగర్ ప్రజలు చాలాకాలంగా ఆందోళన చేస్తున్నారు. దీనికి ఏ అనుమతులూ అక్కరలేదు, ఎవరినీ ముంచనక్కరలేదు. రాష్ట్రంలోని పాత ప్రాజెక్టులొక్కొక్కటీ ఆధునీకరిస్తూ వాటి ఆయకట్టులు కాపాడుతూ వస్తున్నారు కదా. 19వ శతాబ్దపు ప్రాజెక్టు లయిన గోదావరి డెల్టా, కృష్ణా డెల్టా, కె.సి.కెనాల్‌లను పూర్తిస్థాయిలో ఆధునీరించారు. కె.సి. కెనాల్‌ను ఇంకా ఆధునీకరించే పథకం 'జలయజ్ఞం'లోని ముప్పై పథకాలలో ఒకటి. 20వ శతాబ్దపు తొలి సంవత్సరాలలో

నిర్మించిన విజయనగరం జిల్లా తోటపల్లిని ఆధునీకరించడమే కాక మళ్లింపు పథకం స్థానంలో చిన్నపాటి డ్యాం నిర్మించి ఆయకట్టు పెంచుతున్నారు. అయితే వీటి తరువాత వరుస క్రమంలో వచ్చే పాత ప్రాజెక్టులయిన రాజోలిబండ ఊసేలేదు. 87 వేల ఎకరాల ఆయకట్టు ముప్పైవేలకు పడిపోయిన ఈ ప్రాజెక్టు మీద తగిన మొత్తం ఖర్చుపెడితే 50,000 ఎకరాలు సస్యశ్యామలమవుతాయి.

★ హోస్పేటలోని తుంగభద్ర డ్యాంలో పూడిక 30 టిఎంసిల మేరకు పేరుకొని పోవడం వల్ల అనంతపురం, కర్నూలు జిల్లాలకు నీళ్లిచ్చే తుంగభద్ర కుడిగట్టు ఎగువ కాలవ, దిగువ కాలవలు బాగా దెబ్బతిన్నాయి. వాటి ఆయకట్టులో సగం కూడా తడవడం లేదు. అయితే ఈ రెండు కాలవలు కర్నాటకలోని భూములకు నీళ్లిచ్చి మన రాష్ట్రంలోకి ప్రవేశిస్తాయి కాబట్టి ఈ సమస్య మనదే కాదు, వారిది కూడా. అందు వల్ల, పూడిక కారణంగా టి.బి. డ్యాంలో నిలవకుండా వున్న నీటిని సమాంతర కాలవల ద్వారా దాని గమ్యానికి తీసుకుపోవడం కర్నాటకకూ అభ్యంతరం వుండదు. ఎగువ కాలవకు సమాంతర కాలవను కర్నాటకే ప్రతిపాదించింది. మనమే స్పందించడం లేదు. దిగువ కాలవకూ అదే ఉభయతారకమైన ఏర్పాటు చేసుకోవచ్చు. ఎంతలేదన్నా ఒక లక్ష ఎకరాలను తిరిగి ఆయకట్టులోకి తేగల ఈ పథకాలు జలయజ్ఞంలో ఎందుకు లేవు?

★ నల్గొండ జిల్లాలోని మునుగోడు, సంస్థాన్ నారాయణపురం మండలాల ఫ్లోరైడ్ సమస్య అందరికీ తెలిసిందే. రాష్ట్రంలో 'జలయజ్ఞం' అంటూ జరిగితే ఈ గ్రామాలకు నీళ్లివ్వడం అందులో ఒక ముఖ్య కార్యక్రమం కావాలి. కానీ కాంగ్రెస్ వారి జలయజ్ఞంలో ఈ ప్రస్తావన లేదు. దీనికి అనువయిన మార్గాలు లేకపోలేదు. అక్కంపల్లి బ్యాలన్సింగ్ రిజర్వాయర్ నుంచి హైదరాబాద్‌కు తరలిస్తున్న 4 టిఎంసిలు ఆ గ్రామాలకు కేటాయించినా, పులిచింతలకు కేటాయించిన 9 టిఎంసిల నికర జలాలలో సగం ఆ గ్రామాలకు బదలాయించినా వారి సమస్య తీరుతుంది.

ఎప్పుడో లేక ఎవరో కట్టేసిన ప్రాజెక్టులకు కేవలం మరమ్మతులు చేయడం లేదా ఒకటీ అరా కాలవలు తవ్వడం పెద్దగా జేబులు నింపే వ్యవహారం కాదు కాబట్టే తక్కువ ఖర్చుతో ఖచ్చితమైన ఫలితం పొందగల ఈ పనులను నిర్లక్ష్యం చేస్తున్నారనుకోకూడదా?

## ముగింపు

ఆంధ్రప్రదేశ్ హరితాంధ్రప్రదేశ్ కావలసిందే. కానీ దానికి జరగవలసింది వేలకోట్ల ప్రజాధనాన్ని కాంట్రాక్టర్ల జేబులలో పోసి జనానికి అసాధ్యమైన ఆశలు కల్పించి సాగునీటి వనరులన్నీ రాజకీయ ప్రాబల్యం గల ప్రాంతాలకు కట్టబెట్టి చివరికి అప్పులూ, విధ్వంసమూ, ప్రజల మధ్య విద్వేషమూ మిగిల్చే అడ్డగోలు సాగునీటి ప్రయోగం కాదు. సాగునీటిని సార్వజనీనమైన హక్కుగా గుర్తించి, అనువయినవీ, అవసరమయినవీ, విధ్వంసకరం కానివీ అయిన నదీజలాల ప్రాజెక్టులు చేపట్టి, మండలానికి రెండు చెరువులను ఎంపిక చేసి సమగ్రంగా మరమ్మతు చేసి, భూగర్భ జలాల పెంపుదలకోసం, భూసార సంరక్షణకోసం తగు చర్యలు చేపట్టే సాగునీటి విధానం. అదే ఇంతకంటే తక్కువ ఖర్చుతో ఎక్కువ ఫలితాన్ని ఇవ్వగలదు, రాష్ట్రంలోని ప్రతి ఎకరానికి ఒక పంటకైనా సాగునీరు ఇవ్వగలదు.

**10-6-2005**





# ఫూలే బాటలో ముందుకు పోదామా...

హక్కుల ఆకాంక్ష జీవితం నుండి పుడుతుంది. హక్కుల భావన దాని పర్యవసానం. ఏ పేరు పెట్టుకున్నా, ఏ పేరూ పెట్టుకోకున్నా, అది అనాది కాకపోయినా చాలా ప్రాచీనమయినది.

హక్కుల సిద్ధాంతం సంగతి వేరే. దానికోసం తత్వవేత్తల రచనలలో వెతకాలి. చెప్పుకోదగ్గ విషయం ఏమిటంటే హక్కుల తత్వవేత్తలెవ్వరూ వట్టి తత్వవేత్తలు కారు. హక్కుల సాధనకు సంబంధించిన ఆచరణతో సజీవ సంబంధం గల వారే హక్కుల తత్వవేత్తలంతా.

మన దేశానికి సంబంధించిన ప్రముఖ హక్కుల తత్వవేత్తలలో జ్యోతిబా ఫూలె ఒకరు. భారతదేశంలో హక్కుల భావన, దానికి సంబంధించిన తత్వ చింతన బ్రాహ్మణ ధర్మాన్నీ బ్రాహ్మణీయ సమాజాన్నీ వ్యతిరేకించిన సామాజిక ఆచరణలోనే పుట్టింది. అందులో ఆశ్చర్యపోవలసిందేమీ లేదు. ఎందుకంటే హక్కుల కాంక్షకు సమానత్వ భావన మూలం. సమానత్వ భావనకూ బ్రాహ్మణీకానికీ చుక్కెదురు. అది ఆత్మల సమానత్వాన్నే తప్ప శరీరంతో కూడిన మానవుల సమానత్వాన్ని ఏ రూపంలోనూ ఏ కోశానా ఒల్లదు.

అయితే బ్రాహ్మణ వ్యతిరేక ఉద్యమాల నుండి, లేదా సామాజిక ఆచరణ నుండి పుట్టిన తత్వవేత్తల ఆలోచనలన్నీ అన్ని విషయాలలోనూ ఒకే రకంగా లేవు. ఎవరి ప్రత్యేకతలు వారికున్నాయి. హక్కుల కోణం నుండి చూసినప్పుడు బహుశా అందరి కంటే విస్తృత ఆలోచనా పరిధి ఉన్న తత్వవేత్త జ్యోతిబా ఫూలె.

భారతదేశంలో ఆధునిక కాలంలో హక్కుల గురించి ఆలోచించిన తత్వవేత్తలందరూ పాశ్చాత్య ఉదారవాద సంప్రదాయాన్ని రెండు చేతులా ఆహ్వానించారు. అది 'పాశ్చాత్యం' కాబట్టి మనకు అక్కరలేదనుకోలేదు. బ్రాహ్మణీకపు నిచ్చెన మెట్ల విలువలను వ్యతిరేకించడానికి కావలసిన తాత్విక సంపద అందులో ఉందని గుర్తించి ఆహ్వానించారు. అయితే దానికి హైందవ సమాజంలో – లేదా దానికి వ్యతిరేకంగా – జరిగిన పోరాటాలు, తిరుగుబాట్లు, నిరసనల చరిత్రను కూడ జోడించి మనకు అవసరమైన 'హక్కుల' భావనను రూపొందించే కృషి చేశారు. జ్యోతిబా ఫూలె ఆలోచనలకు థామస్ పెయిన్ స్ఫూర్తి ఎంత ఉందో బలిచక్రవర్తి స్ఫూర్తీ అంత వుంది. అంబేద్కర్ బుద్ధుడిని ఎంతగా చదివాడో పాశ్చాత్య లిబరల్ తాత్విక సంప్రదాయాన్నీ అంతగా చదివాడు. విస్తృతి గురించి చెప్పుకోవాలంటే, దళిత బహుజనుల హక్కులకూ స్త్రీల హక్కులకూ ఒక కృత్రిమ వైరుధ్యం తరచుగా తలెత్తుతున్న ఈ రోజులలో ఫూలె ఆలోచన, ఆచరణ అందరికీ ఆదర్శంగా నిలవగలదు. ఆయన స్త్రీల స్వేచ్ఛనూ శూద్రకులాల స్వేచ్ఛనూ వేరు వేరు విషయాలుగా చూడలేదు. ఇవ్వాళ ఆయనను తమ తత్వవేత్తగా ప్రకటించుకుంటూ స్త్రీల రాజకీయ సమానత్వం దళిత బహుజనులకు వ్యతిరేకం అనే నాయకులుండడం మన దురదృష్టం.

భారతదేశంలోని హక్కుల ఉద్యమం తనకంటూ ఒక హక్కుల దృక్పథాన్ని ఇప్పటికింకా సమగ్రంగా రూపొందించుకోలేదు. ఆ కృషి జరిగిన నాడు జ్యోతిబా ఫూలె ఆలోచనలకు అందులో ప్రముఖ స్థానం ఉంటుంది. అసలు ఫూలె ఆలోచనలతోనే మొదలుపెట్టి ఇతర ఆలోచనా స్రవంతులను మిళితం చేసుకుంటూ పోవడమే సమగ్రమైన హక్కుల దృక్పథానికి బాటవేయగలదని ప్రకటించవచ్చునేమో చర్చించుకుందాం రండి.

**18-7-2005,** కృష్ణా జిల్లా కమిటీ

## న్యాయమూర్తులూ ఆలోచించండి!

# అన్నీ మీరే పరిష్కరించగలరా...

**జూ**నియర్ డాక్టర్ల సమ్మె విషయంలో రాష్ట్ర హైకోర్టు అనుసరించిన వైఖరి చాలా చర్చకు దారి తీసింది. డాక్టర్లను సమ్మె చేయకుండా ఆపి హైకోర్టు రోగుల ప్రాణాలు కాపాడిందని మెచ్చుకున్న వారు ఉన్నారు. సమ్మె హక్కు అనే దానిని మొత్తంగా నిరాకరించే వైఖరి హైకోర్టు అనుసరించడం ప్రజాస్వామ్యానికి నష్టకరం అని విమర్శించిన వారూ ఉన్నారు.

హక్కుల సంఘాలు రెండవ వాదన వైపే మొగ్గు చూపించాయి. మరయితే రోగుల ప్రాణం – వారి జీవించేహక్కు – మా దృష్టిలో విలువ లేనిదని అర్థమా? సమ్మె హక్కుకు అనుకూలంగా మాట్లాడిన వారిని హైకోర్టు ఇదే ప్రశ్న అడిగింది. వైద్యుల సమ్మె హక్కు కంటే రోగుల జీవించే హక్కు ముఖ్యమనింది.

ఇప్పుడు జూనియర్ డాక్టర్ల కేసులో హైకోర్టు తన తుదితీర్పు ఇచ్చేసింది. ఏ సమస్యల పరిష్కారం కోసమయితే జూనియర్ డాక్టర్లు సమ్మెకు దిగారో వాటి విషయంలో హైకోర్టు ఎంతమేరకు న్యాయం చేయగలిగిందీ ఇప్పుడు స్పష్టంగా చూడగలుగుతున్నాం. ఈ నేపథ్యంలో సమ్మె హక్కు విషయంలో హైకోర్టు వైఖరిని విమర్శనాత్మకంగా పరిశీలించడం మన మనుగడకూ మన హక్కుల మనుగడకూ చాలా అవసరం.

ఒక్క సమ్మె విషయంలోనే కాదు. సమ్మె అనేది ఒకానొక ఆందోళన రూపం. అది ఎదుటి వారిపైన ఒత్తిడి పెట్టడం ద్వారా మన కోరికలను వినేటట్టు చేస్తుంది. పరిష్కరించేటట్టు కూడా చేయగలదు. అయితే అటువంటి ఆందోళన రూపాలు ఇంకా కూడా ఉన్నాయి. బంద్, రాస్తారోకో, నిరాహారదీక్ష, పికెటింగ్, ప్రదర్శన, ఊరేగింపు మొదలయినవన్నీ ఈ లక్షణాన్ని కలిగి వున్నాయి. సమ్మె విషయంలోనే కాక వీటన్నిటి విషయంలోనూ న్యాయస్థానాలు అనుసరిస్తున్న వైఖరిని పరిశీలించవలసి ఉంది.

ఎందుకు?

ఇవి ప్రజాస్వామ్యంలో ప్రభుత్వ విధానాలు లేక నడవడిక పట్ల బాధిత ప్రజావర్గాల నిరసనను సమర్థవంతంగా తెలియజేసే సాధనాలు కాబట్టి. ఇవే లేకపోతే ప్రజాస్వామ్యంలో ప్రజల చొరవ రెండు సందర్భాలకు కుదించబడుతుంది. ఒకటి వోటు వేసేటప్పుడు, రెండవది కోర్టులో కేసు వేసేటప్పుడు.

జూనియర్ డాక్టర్లను హైకోర్టు ఇందులో రెండవ ప్రక్రియలోకి ఆహ్వానించి వారిచేత సమ్మె విరమింపజేసింది కాబట్టి ఆ ప్రక్రియ ఏపాటి ప్రత్యామ్నాయం అనేది ఇప్పుడు చూడగలం. హైకోర్టు తీర్పులో ఏమీ లేదని కాదు, కొంత ఉంది. కానీ ఏది లేదో చూస్తే తప్ప ఉద్యమించే హక్కు అక్కర లేదు, కోర్టుకు రండి అనే వైఖరి ఏ మేరకు న్యాయం చేయగలగుతుందో అర్థం కాదు.

ప్రైవేట్ వైద్య విద్యా సంస్థలకు విచ్చలవిడిగా అనుమతులు ఇస్తున్నారనీ, వాటిలో చదివే విద్యార్థులకు పాఠాలు చెప్పే పంతుళ్లు లేరనీ, వారు వైద్య విద్యను అభ్యసించడానికి అవసరమయిన అనుబంధ ఆస్పత్రులు ఉన్నట్టు చూపించడానికి అరువు డాక్టర్లనూ, అరువు పేషంట్లనూ అప్పటి



కప్పుడు యాజమాన్యాలు సమకూర్చుకుంటున్నాయి తప్ప నిజంగా ఆస్పత్రులేవీ లేవనీ జూనియర్ డాక్టర్లు అన్నారు. ఈ విషయంలో ఇన్‌స్పెక్షన్ చేసే అధికారం ఉన్న మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా గుడ్డిగా వ్యవహరిస్తున్నది తప్ప నిజాన్ని చూడడం లేదన్నారు. రాష్ట్రంలోని 21 ప్రైవేట్ మెడికల్ కాలేజీలు, 16 ప్రైవేట్ డెంటల్ కాలేజీలలో నిజంగా అధ్యాపకులు ఉన్నారా, నిజంగా వాటికి ఉండవలసిన అనుబంధ ఆస్పత్రులు ఉన్నాయా అన్న విషయం పరిశీలించడానికి ఒక స్వతంత్ర కమిటీని నియమించమని కోర్టును కోరారు. అసలు వైద్య విద్య ఇంతగా ప్రైవేట్‌రంగంలో ఎందుకుండాలి, ప్రభుత్వమే ఈ కాలేజీలు నడపవచ్చుకదా అన్నారు.

### ఓటు ఒక్కటే మార్గమా...

ఇందులో చివరి ప్రశ్న ప్రభుత్వ విధాన నిర్ణయాలకు సంబంధించినది కాబట్టి తాను జోక్యం చేసుకోలేననీ, విద్యా వ్యవస్థలో ప్రైవేటీకరణ ఏ మేరకు ఉండవచ్చుననే చర్చ కోర్టులో చేయవద్దనీ హైకోర్టు అనింది. కరెక్టే. మరయితే ప్రజలు ఏం చేయాలి? సాధారణ ప్రజలు ఆందోళన చేస్తే అడిగే దిక్కు ఉండదు. సమ్మె చేసి ప్రభుత్వం పైన ఒత్తిడి పెట్టే స్థితిలో ఉన్నవారిని కోర్టు సమ్మె చేయనివ్వదు. కోర్టునే జోక్యం చేసుకొమ్మంటే అది నా పరిధిలో లేని విషయం అంటుంది. అయిదేళ్లకొకసారి వేసే వోటే దీనికి పరిష్కారమా? అది సరిపోతుందా?

పోనీ, ప్రైవేట్ వైద్య కళాశాలల 'అద్దె టీచర్లు – అద్దె పేషంట్లు' వ్యవహారంపైన విచారణ కమిటీ వేయండి అని అడిగితే దానికయినా కోర్టు ఒప్పుకుందా అంటే లేదు. ఆ సంస్థలను పరిశీలించి వారికి అనుమతి ఇచ్చే అధికారం మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు ఉంది; మెడికల్ కౌన్సిల్ ఆ పని చేసేసింది; చట్టబద్ధమైన అధికారం ఉన్న సంస్థ తన పని సక్రమంగా చేయలేదని దారిన పోయేవాళ్లెవరో అంటే కోర్టు ఆ సంస్థను శంకించనవసరం లేదు; కాబట్టి ప్రైవేట్ మెడికల్ కాలేజీలను కేసులో ప్రతివాదులుగా చేర్చడానికి సహితం హైకోర్టు ఒప్పుకోలేదు. అరడజను కాలేజీల విషయంలో వారు చెప్పుకుంటున్న అధ్యాపకుల సంఖ్య ఎంత, నిజంగా ఉన్నదెందరు అన్న సమాచారం కోర్టు ముందు ఉంచినా కూడా ఒప్పుకోలేదు. మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఇంకొంచెం సమర్థంగా, పారదర్శకంగా పనిచేయాలి అనీ, ఢిల్లీలో ఒక కార్యాలయం ఉంటే చాలదు, ప్రైవేట్ వైద్య విద్యా సంస్థలు ఈ రాష్ట్రంలో చాలా వెలిశాయి కాబట్టి వీలయితే హైదరాబాద్‌లో కూడా ఒక కార్యాలయం నెలకొల్పాలి అనీ మాత్రం సూచన కోర్టు ఇచ్చింది. దానితో పరిస్థితి చక్కబడక పోతే? వైద్య విద్యా వ్యవస్థ తమ కళ్ల ముందు నాశనం అవుతూ వుంటే దగ్గరి నుండి అన్ని విషయాలూ గమనిస్తున్న జూనియర్ డాక్టర్లు నిస్సహాయంగా చూస్తూ ఉండవలసిందేనా? ఈ వ్యవస్థను చక్కబెట్టే చట్టబద్ధమైన అధికారం ఉన్న సంస్థ ఒకటి ఉంది అనీ, దానిని పర్యవేక్షించడానికి కోర్టు పూనుకోజాలదనీ హైకోర్టు ప్రకటించిన అభిప్రాయం, న్యాయస్థానాల అధికారాల పరిధులకు సంబంధించిన సంప్రదాయక ఆలోచనా రీతికి లోబడిన అభిప్రాయమే కావచ్చును. మరి న్యాయస్థానం ఈ కారణంగా జోక్యం చేసుకోలేని పక్షంలో ప్రజలు వేరే ఏ విధంగా జోక్యం చేసుకోవాలి? వైద్యులు సమ్మె చేసి వైద్య వ్యవస్థను

కరపత్రం

తాత్కాలికంగా స్తంభింపజేస్తేనో, ప్రజా సంఘాలు భారీ ప్రదర్శన చేపట్టి రాజధానిని కొంతకాలం పాటు స్తంభింపజేస్తేనో, వైద్యశాఖామాత్యుడిని ఘెరావ్ చేసి ఒక పూట తిండీ, నీళ్లూ లేకుండ చేస్తేనో పరిష్కారం దొరకొచ్చునేమో. కానీ సమ్మెలూ, ప్రదర్శనలూ, ఘెరావ్‌లూ చెల్లవనీ, రాజ్యాంగ విరుద్ధమనీ న్యాయస్థానాలు ప్రకటించి వాటిని సాగనివ్వని పక్షంలో ప్రజలకు వేరే మార్గం ఏముంది?

## ఏ ఆందోళనా వద్దంటే ఎలా?

న్యాయస్థానాలు తమ పరిమితుల రీత్యా అన్ని విషయాలలోనూ న్యాయం చేయలేవు. ఆ పరిమితులను కొంత సరళంగా వ్యాఖ్యానించడం ద్వారా కొంచెం ఎక్కువ న్యాయం చేసే ప్రయత్నమైనా చేస్తారా అంటే ఇరవై ఏళ్లనాడు ఈ విషయంలో న్యాయమూర్తులు కొంత సంసిద్ధత చూపారు గానీ ఇప్పుడు ససేమిరా అంటున్నారు. మరి ప్రజలకు అయిదేళ్లకొకసారి వేసే వోటే దిక్కా? దానితో అన్ని సమస్యలూ పరిష్కారం అవుతాయా? ఎన్నికలలో ఇచ్చిన హామీలను అధికారానికి వచ్చిన తరువాత నిలబెట్టుకోవాలన్న నియమమేదీ లేనిచోట వోటు హక్కు బలహీనమైన సాధనమేనని అనుభవ పూర్వకంగా తెలుసుకున్నాం. మరీ దుర్మార్గంగా పరిపాలిస్తున్న ప్రభుత్వాన్ని దించడానికది పనికొస్తుందే తప్ప ప్రభుత్వ విధానాలను బలంగా ప్రభావితం చేయడానికి అది సరిపోదు.

అందుకే ప్రదర్శనలు, బంద్‌లు, రాస్తారోకోలు, సమ్మెలు, ఆమరణ నిరాహార దీక్షలు మొదలైన ఆందోళన రూపాలు ప్రజాస్వామ్యంలో భాగంగా ఎదిగాయి. చట్టంలోని హక్కులను ప్రభుత్వం హరిస్తే కోర్టును ఆశ్రయించవచ్చును గానీ, కోర్టు జోక్యం చేసుకోజాలని ప్రభుత్వ విధాన నిర్ణయాలు ప్రజల హక్కులకూ బాగోగులకూ భంగకరమయినట్టయితే వాటిని ఎదుర్కొనడానికి ఇటువంటి ఆందోళన రూపాలు చాలా అవసరం. వాటిని ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేసేవిగా కాక పెంపొందించేవిగా చూడాలి.

ఈ ఆందోళన రూపాల వల్ల ప్రజా జీవితానికి ఏ సమస్యలూ రావా అంటే వస్తాయి. ఒక్క నిరాహారదీక్ష తప్ప తక్కినవన్నీ ప్రజా జీవితాన్ని ఏదో ఒక మేరకు ఆటంక పరుస్తాయి, ప్రజలను ఏదో ఒక మేరకు ఇబ్బందికి గురిచేస్తాయి. అయితే ఆ కారణంగానే అవి ప్రభుత్వం పైన ఒత్తిడి పెట్టగలుగుతాయి. 'వాళ్లు సమ్మె చేసి ప్రజలను ఇంత ఇబ్బందికి గురిచేస్తుంటే ఈ ప్రభుత్వం ఎందుకు పట్టించుకోదు?' 'వాళ్లు ఇన్ని గంటల సేపు రాస్తారోకో చేస్తుంటే ప్రభుత్వం ఎందుకు స్పందించదు?' అన్న నిరసన ప్రజలలో రాగలదు కాబట్టే ఈ ఆందోళన రూపాలు పనిచేస్తాయి. అది ప్రజలకు ఇబ్బందికరమే. అయినప్పటికీ, ఇటువంటి ఆందోళన రూపాలు లేనట్టయితే ప్రజా వ్యతిరేకమైన ప్రభుత్వ విధానాలను నిలువరించడం సాధ్యంకాదని గుర్తించినట్టయితే, ఇటువంటి ఆందోళనలు చేపట్టేవారు బాధ్యతగా వ్యవహరించాలని అడగగలము తప్ప వీటిని పూర్తిగా నిషేధించడం ప్రజాస్వామ్యానికి శ్రేయస్కరం కాదని అర్థం అవుతుంది.

ప్రజా జీవితాన్ని ఇబ్బందులకు గురిచేసే ఆందోళనలు చేపట్టే నిర్వాహకులు తాము దేనికోసం ఆందోళన చేస్తున్నాము, దాని తక్షణ సాధ్యాసాధ్యాలు ఏమిటి, ప్రభుత్వం ఎంత హేతుబద్ధంగా స్పందిస్తున్నది, ప్రజలకు ఎంత ఇబ్బంది కలుగుతున్నది మొదలయిన విషయాలను దృష్టిలో ఉంచుకొని బాధ్యతగా వ్యవహరించాలని అడగగలము. అడగాలి కూడా. న్యాయస్థానాలు ఇటువంటి ఆందోళనల విషయంలో జోక్యమంటూ చేసుకుంటే, అది ప్రభుత్వానికి – ఆందోళనకు స్పందించ



వలసిన బాధ్యతనూ, ఆందోళనకారులకు – ప్రజలకు కలుగుతున్న అసౌకర్యం పట్ల తాము అనుసరించవలసిన బాధ్యతాయుత వైఖరినీ జ్ఞాపకం చేయడానికే తప్ప ఆందోళనలను నిషేధించడానికి కాకూడదు. సరయిన ప్రజాస్వామ్య స్పృహ ఉన్నట్టయితే న్యాయస్థానాలు ఈ విషయాన్ని గ్రహించగలిగి వుండేవి.

## ఏది ప్రజాస్వామ్యానికి నిజమైన నష్టం?

కానీ అదే లోపించింది. ఇది కేవలం మన హైకోర్టు విషయమో లేక కేవలం జూనియర్ డాక్టర్ల విషయమో కాదు. మొత్తంగానే ఉద్యమించే హక్కు పట్ల న్యాయస్థానాలు తిరస్కార వైఖరిని అవలంబిస్తున్నాయి. దానిని ప్రజాస్వామ్యంలో భాగంగా కాక, ప్రజాస్వామ్యానికి నష్టకరమైన విషయంగా చూసే వైఖరి న్యాయస్థానాలలో ప్రబలింది. బంద్ పిలుపు ఇవ్వడం రాజ్యాంగ విరుద్ధం, పికెటింగ్ రాజ్యాంగ విరుద్ధం, ఘెరావ్ నేరం, ప్రభుత్వ ఉద్యోగులు సమ్మె చేయడం తప్పు మాత్రమే కాదు, వారిని విచారణ లేకుండ ఉద్యోగం నుంచి తీసేయవచ్చు – ఒకదాని తరువాత ఒకటి ఇటువంటి తీర్పులొస్తున్నాయి. ఇప్పుడు డాక్టర్లు ఎట్టి పరిస్థితిలోనూ సమ్మె చేయడానికి వీలులేదనీ, సమ్మె చేస్తే వైద్యులుగా వారు పొందిన రిజిస్ట్రేషన్‌ను సహితం మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా రద్దు చేయవచ్చుననీ మన హైకోర్టు ప్రకటించింది. రోగికి వైద్యం చేయడానికి వైద్యుడు నిరాకరించడం నేరమని చెప్పే మెడికల్ కౌన్సిల్ నియమం నుండి హైకోర్టు ఈ నిర్ధారణకు వచ్చింది. డ్యూటీలో ఉండి వైద్యం చేయడానికి నిరాకరించడం, ఒక న్యాయమైన లక్ష్యం కోసం సమ్మెలో ఉన్న కారణంగా విధులకు హాజరు కాకపోవడం ఒకటేనా? అటువంటి సమ్మెను చట్టవిరుద్ధం అని నిషేధించే కంటె అది త్వరగా ముగింపుకు రావడం కోసం ఇరువర్గాలపైనా ఒత్తిడి పెట్టడం న్యాయస్థానాలకు ఉచితమైన వైఖరి కాదా? వైద్యులు కేవలం తమ హక్కుల కోసమే సమ్మె చేసి ఉన్నా ఇది వర్తిస్తుంది. కానీ జూనియర్ డాక్టర్లు సమ్మె చేసింది ఒక ప్రజా ప్రయోజనం కోసం. వైద్య వ్యవస్థ, వైద్య విద్యా వ్యవస్థ వ్యాపార ప్రక్రియగా మారిపోవడాన్ని నిరసిస్తూ వారు సమ్మె చేశారు. అటువంటి సమ్మెకు ఇది మరింత ఎక్కువ వర్తించదా?

16 సంవత్సరాల క్రితం ఒక కేసులో సుప్రీంకోర్టు పారిశ్రామిక కార్మికుల సమ్మె హక్కు గురించి ఇచ్చిన తీర్పును ఇక్కడ ఉటంకించడం ఉచితంగా ఉంటుంది. ఢిల్లీలోని ప్రగతి మైదాన్‌లో ఎప్పుడూ ఏవో పారిశ్రామిక ఉత్పత్తుల ప్రదర్శనలు జరుగుతుంటాయి. దేశ పారిశ్రామిక పురోగతికి చిహ్నంగా ఆ ప్రదర్శనలను భావిస్తారు. అక్కడ పనిచేసే కార్మికులు తమ కోర్కెల సాధన కోసం సమ్మె చేయగా, యాజమాన్యం దానిని దేశానికి అప్రతిష్ఠ తెచ్చే చర్యగా భావించింది. ఈ వివాదం సుప్రీంకోర్టు దాకా పోగా, జస్టిస్ అహ్మదీ ఈ విధంగా అన్నారు:

## అహ్మదీ తీర్పు

"సంఘాలు పెట్టుకొని వాటిని రిజిస్టర్ చేసుకునే హక్కును చట్టం గుర్తించింది. కార్మిక సంఘాలకు కొన్ని హక్కులు ఇవ్వడమే ఈ గుర్తింపు లక్ష్యం. కార్మికుల కష్టాల గురించి

చెప్పుకోవడానికి, హక్కులు అడగడానికి కార్మిక సంఘాలు అవసరం అయ్యాయి. కార్మిక సంఘాలు కార్మికుల ప్రతినిధులు. కార్మిక సంఘం బలం దాని సభ్యత్వాన్ని బట్టి ఉంటుంది. ఎక్కువ సభ్యత్వం ఉన్న కార్మిక సంఘాలు యాజమాన్యంతో ఎక్కువ సమర్థతతో సంప్రదింపులు చేయగలుగుతాయి. కార్మిక సంఘాలకు ప్రదర్శనలు చేపట్టే హక్కును నిరాకరిస్తే ఈ సామర్థ్యం బలహీన పడుతుంది. సమ్మె అనేది ఒకరకమైన ప్రదర్శన మాత్రమే. వేరే ప్రదర్శన రూపాలు కూడా ఉన్నాయి. గో-స్లో, సిట్ - ఇన్, వర్క్‌టు - రూల్, గైర్హాజరు కావడం మొదలయినవి. అటువంటి ప్రదర్శనా రూపాలలో సమ్మె ఒకటి. ప్రదర్శన జరిపే హక్కు, అందులో భాగంగా సమ్మె చేసే హక్కు, కార్మికులకు అందుబాట్లో ఉండే ఒక ముఖ్య సాధనం. అన్ని ప్రజాస్వామిక దేశాలూ ఈ హక్కును గుర్తించాయి.. అయితే పారిశ్రామిక న్యాయశాస్త్రంలో సమ్మె చేసే హక్కు అపరిమితమైనది కాదు. దానిని నియంత్రించే నియమాలున్నాయి... (యాజమాన్యం సిబ్బంది జీతాలు పెంచి కార్మికులవి మాత్రం పెంచని యాజమాన్య వైఖరికి ఆగ్రహించిన కార్మిక ప్రతినిధులు) సమ్మె చేయడం ద్వారా ఒత్తిడి పెట్టాలని నిర్ణయించుకున్నారు. సమ్మె సందర్భంగా కొన్ని అవాంఛనీయ ఘటనలు జరిగిన మాట వాస్తవమే. అయితే విధ్వంసమేమీ జరగలేదు... ఘాటయిన మాటలు అనుకోవడం జరిగింది. దానిని యాజమాన్యం 'బెదిరింపు'గా అభివర్ణించింది ... ఇరువర్గాల ప్రవర్తనను మేము అప్పటి పరిస్థితుల నేపథ్యంలో చూస్తున్నాం ... తప్పొప్పులు ఎంచి విద్వేషాలను ఇంకింత పెంచే బదులు సంస్థ దీర్ఘకాల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని సంక్షోభాన్ని పరిష్కరించదలచుకున్నాం.."

## ఇప్పుడే మరింత రక్షణ అవసరం

ఆందోళనలలో న్యాయస్థానాలు జోక్యం అంటూ చేసుకుంటే ఈ వైఖరితో చేసుకోవడం ఉచితంగా ఉంటుంది. లేకపోతే జోక్యమే చేసుకోకుండా ఉండడం మేలు. అంతే తప్ప సమ్మె చేయొద్దు, రాస్తారోకో చేయొద్దు, బంద్ నిర్వహించవద్దు, ఏవయినా సమస్యలుంటే కోర్టుకు రండి అని చెప్పి, కోర్టుకు వచ్చిన తరువాత మా పరిధి ఇంతే మేమింత కంటె ఎక్కువ చేయలేం పొండి అంటే ప్రజల సమస్యలు ఏ విధంగా పరిష్కారం కావాలి?

ఇది ఎప్పుడయినా ఉండే విషయమే గానీ, ప్రభుత్వ విధానాలు ప్రజానుకూలంగా ఉండనక్కర లేదని దేశ పాలకులు బహిరంగంగా ప్రకటించుకుని తిరుగుతున్న తరుణంలో ఉద్యమించే హక్కుకు రక్షణ మరింత అవసరం. ఈ మధ్య మన హైకోర్టు జోక్యం చేసుకున్న రెండు సమ్మెలూ - జూనియర్ డాక్టర్లదీ, ఆర్టీసీ కార్మికులదీ - ప్రజా ప్రయోజనాల పరిరక్షణ కోసం జరిగినవే తప్ప వారి కోసం వారు చేసుకున్నవి కావు. ఇటువంటి ఆందోళనలు ఇంకా చాలా జరగబోతాయి కాబట్టే ఉద్య మించే హక్కు పట్ల కోర్టులు అనుసరిస్తున్న వైఖరి గురించి మాట్లాడుకోవడం అవసరం.

**29-8-2005**



# పట్టణాభివృద్ధి అంటే
# పేదల తొలగింపా?!

పట్టణాలలో ఇళ్ల పట్టాలు లేకుండా ఎక్కడో ఒకచోట నీడ కల్పించుకొని బతుకు వెళ్లదీస్తున్న వాళ్లు ఇప్పుడున్నంత అభద్రంగా ఎప్పుడూ లేరేమో.

అటువంటి ఇళ్లన్నిటినీ నిర్దాక్షిణ్యంగా కూల్చేసి పట్టణాన్ని 'అభివృద్ధి' చేసే పట్టణాభివృద్ధి విధానం ఇప్పుడు రాజ్యం చేస్తున్నది.

పట్టణాభివృద్ధి నిమిత్తం భారతదేశంలోని మునిసిపాలిటీలకు డిఎఫ్ఐడి అనే బ్రిటిష్ సంస్థ నుండి భారీగా నిధులు లభించబోతున్నాయని వింటున్నాం. అదే సమయంలో, పట్టణాలలోని పేదల గుడిసెలు కూల్చేసి, కావాలంటే ఊరిబయట ఎక్కడో రెండంతస్తులవో, మూడంతస్తులవో అపార్ట్‌మెంట్లు కట్టితలా ఒక ఫ్లాట్ ఇస్తామని హామీ ఇవ్వడం, అది కూడ నూటికి పదిశాతమే అమలు కావడం చూస్తున్నాం.

దేశానికొక రాజ్యాంగము, ప్రజాస్వామ్యానికొక అర్థమూ ఉన్నాయనుకుంటే 'పట్టణాభివృద్ధి' అనేది రాష్ట్ర ప్రభుత్వమో, స్థానిక ప్రభుత్వమో అన్నివర్గాల ప్రజల అవసరాలనూ దృష్టిలో ఉంచుకొని నిర్వహించే ప్రక్రియ అయి వుండేది. దానికి ఆ ప్రభుత్వం దగ్గరున్న డబ్బులు చాలకపోతే డిఎఫ్ఐడి దగ్గరో, మరొకరి దగ్గరో అప్పు తీసుకుంటే దాని మంచి చెడుల గురించి చర్చించుకునే అవకాశం ఉండేది. కానీ ఇప్పుడు జరుగుతున్నది అది కాదు. అప్పిచ్చేవాడు ఏ పని ఏవిధంగా చేయడానికి అప్పిస్తే ఆ పని ఆ విధంగా చేయడానికి అప్పు తీసుకోవడం పాలనా విధానం అయింది.

డిఎఫ్ఐడి లాంటి సంస్థలు 'పట్టణాభివృద్ధి'కి అవసరమైన అప్పు మొత్తం ఇయ్యవు. బండి కదలడానికి అవసరమైన మేరకిచ్చి, ఆపైన ప్రైవేట్ రంగానికి 'భాగస్వామ్యం' కల్పించడం ద్వారా పని పూర్తిచేసుకొమ్మని సలహా ఇస్తాయి. అభివృద్ధి ఏ రూపంలో చేపట్టినా రోడ్డు కాంట్రాక్టులు వగైరాల రూపంలో ప్రైవేట్ రంగానికి పాత్ర ఉండనే ఉంటుంది. కానీ ఇప్పుడు జరిగేది అదికూడా కాదు. అభివృద్ధి రూపకల్పనలోనే ప్రైవేట్ రంగానికి భాగస్వామ్యం కల్పిస్తున్నారు. ఏం చేస్తే, ఏ విధంగా చేస్తే, వారు పెట్టుబడి పెడతారో కనుక్కొని దానికి అనుగుణంగా అభివృద్ధి ప్రణాళిక రూపొందిస్తున్నారు.

విలువయిన పట్టణ మధ్య ప్రాంత భూములలో పేదవాళ్లను ఉండనిచ్చి ఆ వనరును 'వృథా' చేసే బదులు వాళ్లను ఊరిబయట సర్ది పట్టణ మధ్య భూములను ఒక ఐమాక్స్ టాకీసుకో, మూడు నక్షత్రాల టూరిస్ట్ హోటల్‌కో, ఓషన్ పార్కులాంటి కాలక్షేప వ్యవస్థకో అప్పగిస్తే ఆదాయానికి ఆదాయమూ, అభివృద్ధికి అభివృద్ధీ సిద్ధిస్తాయి కదా అన్న ఆలోచన ప్రైవేట్ భాగస్వాములకు రాకపోదు, ప్రభుత్వం దానిని ఆమోదించకపోదు.

ఈ పట్టణాభివృద్ధి వరద లాగా ముంచుకొస్తున్నది. మన రాష్ట్రంలో 32 పట్టణాలకు ఇందు నిమిత్తం డిఎఫ్ఐడి నుండి రుణాలు అందబోతున్నాయని వింటున్నాం.

అయితే ఆరంటే ఆరేళ్ల క్రితం కేంద్ర ప్రభుత్వం ఒక మురికివాడల విధానం ముసాయిదా ప్రకటించింది. ఎక్కడున్న మురికివాడలు అక్కడే ఉంచి వాటిని అభివృద్ధి చేసి పట్టణంలో భాగం చేయడం ఆ ముసాయిదా లక్ష్యం. ప్రజారోగ్యం దృష్ట్యా ఎంతమాత్రం నివాసయోగ్యం కాని వాడలను మాత్రమే తొలగించాలి. తక్కిన వాడలను ఎక్కడున్నవి అక్కడే ఉండనిచ్చి అన్నిరకాల వసతులూ అభివృద్ధి చేయాలి. అది ప్రభుత్వ భూమి అయితే గుడిసెవాసులకు పట్టాలు ఇచ్చేయాలి. ప్రైవేట్ భూమి అయితే దాని యజమాని నుండి సేకరించి ఇవ్వాలి. 74వ రాజ్యాంగ సవరణ సూచించినట్టు వాడ కమిటీలు వేయాలి. మురికివాడల ప్రజలకు భాగస్వామ్యం కల్పిస్తూ వాటిని అక్కడే అభివృద్ధి చేయాలి. విద్య, ఆరోగ్యాలకు ప్రాధాన్యం ఇస్తూ ఈ పని చేయాలి.

ఆ ముసాయిదా ఏమయిందో, దానికి తుదిరూపం ఇచ్చారో లేదో గానీ ఇప్పుడు అందుకు సరిగ్గా విరుద్ధమైన పట్టణాభివృద్ధి విధానం వచ్చి కూర్చుంది. మురికివాడలను అక్కడే ఉంచి అభివృద్ధిచేయడం అంటే విలువయిన భూమిని వృథా చేయడం, ప్రభుత్వ ఖజానాపైన అదనపు భారం వేయడం అనుకుంటున్నారు. మురికివాడలను తొలగించేసి, విలువయిన పట్టణ భూముల అభివృద్ధిలో ప్రైవేట్ రంగం భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం చవకయిన పని, లాభదాయకమయిన పని అనుకుంటున్నారు.

మరి మురికివాడల ప్రజలేమవుతారు? వారికి పునరావాసం కల్పిస్తాం, మా దగ్గర దానికొక పాలసీ ఉంది అంటున్నారు. ఇది పచ్చి అబద్ధం. నందనవనం పేరిట మూసీనది ఒడ్డున తరతరాలుగా నివసిస్తున్న ప్రజలను తొలగించే పని 1998లో మొదలుపెట్టారు. వారందరికీ పునరావాసం ఇప్పటికీ ఇవ్వలేదు.

పునరావాసం పాలసీ అని ప్రభుత్వం చెప్పుకుంటున్న జీవో 68 పట్టణ ప్రాంత నిర్వాసితులకు వర్తించదు. అది నదీ జలాల ప్రాజెక్టుల వల్ల నిర్వాసితులయిన వారికి మాత్రమే వర్తిస్తుంది. అన్ని రకాల నిర్వాసితుల సమస్యలూ ఒకేరకంగా ఉండవు. అందరి పునరావాసమూ ఒకేరకంగా ఉండదు. నదీ జలాల ప్రాజెక్టు నిర్వాసితుల నుద్దేశించి రూపొందించిన జీవో 68 హైదరాబాద్, విశాఖపట్నం వంటి పట్టణాలలో ఇళ్లు కూల్చి బలవంతంగా నిర్వాసితులను చేస్తున్న ప్రజలకు పునరావాసం ఇవ్వడానికి పనికిరాదు. ఈ ప్రజలకు వర్తించే పునరావాస విధానమేదీ ప్రభుత్వం దగ్గర లేదు.

అయినా, 1999లో ముసాయిదా రూపంలో ప్రకటించిన జాతీయ మురికివాడల విధానంలో ఏం లోపం ఉందని దానిని పక్కన పడేసారు? పట్టణాలలో భాగంగా ఉండి, పట్టణ జీవితంలో అవసరమయిన పాత్ర నిర్వహిస్తున్న మురికివాడల ప్రజల ఆవాసాలను ఉన్నచోటనే అభివృద్ధి చేసి పట్టణాభివృద్ధిలో ఆ ప్రజలను భాగస్వాములు చేయాలన్న ఆలోచన ఎందుకు వదులుకున్నట్టు? పట్టణాభివృద్ధి నుండి వారిని వెలివేసి, ఒకవేళ పునరావాస హక్కు అంటూ రేపు కల్పించినా ఊరి బయట కాలనీలో పడేయడం ఎందుకు? వాళ్లు పట్టణాలలో రిక్షా తొక్కుతూ, కూరగాయలు అమ్ముతూ, ఇళ్లలో పాచిపని చేస్తూ, ఆటోలు నడుపుతూ, క్యాజువల్ కార్మికులతో పనిపడిన కార్ఖానాలకు అందుబాట్లో ఉంటూ తాము బతుకుతూ పట్టణాన్ని బతికిస్తున్నారు. అశుభ్రమైన పరిసరాలలో విద్య, ఆరోగ్య వ్యవస్థలు సక్రమంగా లేకుండా కూడా ఏదో ఒకరకంగా బతికేస్తూ మరీ పట్టణాన్ని బతికిస్తున్నారు. వారిని బలవంతంగా తీసుకుపోయి పదో పదిహేనో కిలోమీటర్ల దూరంలో పడేసినా



అదేపని చేసుకొని బతకగలరనడం అబద్ధం. అక్కడ నివాసం ఏర్పరచుకోవడానికి (ప్రభుత్వం ఎంతో కొంత సబ్సిడీ ఇచ్చినా కూడా), రోజూ పట్టణానికి వచ్చిపోవడానికి వారి ఆదాయమంతా సరిపోతుంది. అయినా ఆ మాత్రం పునరావాస విధానం ప్రభుత్వం దగ్గర ఉందనేది కూడ అబద్ధం. హైదరాబాద్ నగరంలోనే గడచిన ఏడేళ్లుగా గుడిసెలు కూల్చేసిన వేలాది మందిలో ఎంతమందికి ఊరిబయట అక్కరకు రాని పునరావాసమయినా కల్పిం చారో చెప్పమనండి. నగరం బయట కట్టబోయే పునరావాస కాలనీలు అధికార్ల మాటలలోనూ, ఫైళ్లలోనూ ఉన్నాయి. గుడిసెల కూల్చివేత, బలవంతపు తొలగింపు మాత్రం జరిగిపోతూనే ఉన్నాయి. గ్రామాలలో బతుకు గడవక పట్టణాలకు వలస వచ్చే ప్రజలకు ప్రత్యామ్నాయం చూపించే విధానమేదీ ప్రభుత్వం దగ్గర లేదు గానీ, వారు పట్టణంలో ఎక్కడ గుడిసెలు వేసుకున్నా వాటిని బలవంతంగా తొలగించి వారిని దుర్మార్గులయిన చొరబాటుదార్లుగా చూపించే విధానం మాత్రం ఉంది. దానికి విదేశీ నిధులు, ప్రైవేట్ పెట్టుబడులు తోడయితే అది 'పట్టణాభివృద్ధి' అనే అందమైన ప్రక్రియలో భాగంగా జరుగుతుంది.

దీనిని ప్రతిఘటించి, నివాస హక్కునొక మానవహక్కుగా నిలబెట్టుకుందాం రమ్మని ఆహ్వానిస్తూ...

**31-8-2005**
**హైదరాబాద్ నగర కమిటీ**

కరపత్రం

# హిరమండలం రిజర్వాయర్ వద్దు

సమాచార హక్కు చట్టం అక్టోబర్ నెల నుంచి అమలులోకి రానుందట.

అప్పటిదాకా ప్రజలకు ఏ సమాచారం చెప్పొద్దని మన పాలకులు నిర్ణయించుకున్నట్టున్నారు.

వంశధార స్టేజ్–II దీనికొక మంచి ఉదాహరణ. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలు ఎంత అసంబద్ధంగా ఉన్నాయంటే అది నిజమైన ప్రాజెక్టేనా లేక ఊహ అని ఎవరికైనా అనుమానం వస్తుంది. అది కాగితం మీద మాత్రమే ఉంటే నవ్వుకొని ఊరుకుందుము గానీ హిరమండలం రిజర్వాయర్ కోసం భూములు సేకరణ యత్నం, నిర్వాసితులను గుర్తించే యత్నం మొదలై ఉండడం వల్ల ఇది నవ్వులాట కాదని అనుకోక తప్పడం లేదు.

భామిని మండలం నేరడి వద్ద నిర్మించతలపెట్టిన బ్యారేజి వంశధార స్టేజ్-IIకు గుండెకాయ లాంటిది. దాని నుంచే ఈ ప్రాజెక్టుకు నీళ్ళు లభిస్తాయి. అయితే నేరడి బ్యారేజికి ఒరిస్సా అనుమతి ఇవ్వడం లేదు. వారిని ఒప్పించే ప్రయత్నమూ జరగడం లేదు. వివాద పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వాన్ని అడిగి ట్రిబ్యునల్ ఏర్పాటుచేసే ప్రయత్నమూ జరగడం లేదు. అసలు ఆ దిశగా మన రాష్ట్ర ప్రభుత్వం ఆలోచిస్తున్న దాఖలాలే లేవు.

ప్రాజెక్టుకు నీటి మూలం అయిన నేరడి బ్యారేజి అసలు సాధ్యమేనా అన్న సందేహం తీర కుండానే మిగిలిన ప్రాజెక్టు పనులు మాత్రం జరిగిపోతున్నాయి. 20 వేల ఎకరాలకు నీళ్ళియ్య వలసిన వరద కాలువ పనులు మొదలై పోయాయి. దానిమీద ఉన్న రెండు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ల పనులూ మొదలయ్యాయి. కుడి ప్రధాన కాలువను పొడిగించే ప్రక్రియ కూడా జరిగిపోతూ ఉంది. 19 టి.ఎం.సి.ల సామర్థ్యంతో నిర్మించబోయే హిరమండలం రిజర్వాయరు భూమి సేకరణకు అవసరమైన సర్వే ప్రారంభమైంది.

చివరికి ఒరిస్సా ప్రభుత్వం ఒప్పుకోకపోతే ఇదంతా ఎవరి నోట్లో పోసినట్టు?

నేరడి బ్యారేజికి ప్రత్యామ్నాయంగా కాట్రగడ దగ్గర నది సహజ ప్రవాహం నుండే నీటిని పక్కకు తీసి ప్రస్తుతానికి పని నడిపిస్తామని అంటున్నారు. దానివల్ల స్టేజ్-IIకు అవసరమైనంత నీళ్ళు లభిస్తాయా? లభిస్తాయన్న శాస్త్రీయమైన అంచనా ప్రభుత్వం వద్ద ఉన్నదా? లభించవనీ, హిరమండలం రిజర్వాయరు నింపడానికి కాదు కదా, పూర్తిగా తడపడానికి కూడా కాట్రగడ నీటి మళ్ళింపు పథకం చాలదనీ నిపుణులు అంటున్నారు. మరి నేరడి బ్యారేజి ఎప్పటికీ సాధ్యంకాక కాట్రగడతోనే వంశధార స్టేజ్–II సరిపెట్టుకోవలసి వస్తే అంత కొంచెం నీటికి ఇంత భారీ తవ్వకాలూ, కట్టడాలూ ఎందుకు?

ఇదంతా ఎవరి నోట్లో పోయడానికి?

అసలు వంశధార స్టేజ్-II లెక్కలే విచిత్రమైనవి. మేము ప్రధానంగా ఆందోళన చెందుతున్నది హిరమండలం రిజర్వాయర్ వల్ల నిర్వాసితులు కాబోయే 21 గ్రామాల గురించి, బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయి కొండలలో బందీలు కాబోయే 82 గిరిజన గ్రామాల గురించీ కాబట్టి హిరమండలం రిజర్వాయర్‌ను దృష్టిలో ఉంచుకొని మాట్లాడుకుందాం.





హిరమండలం 19 టి.ఎం.సిల నీటి సామర్థ్యం గల రిజర్వాయరులో 19 టి.ఎం.సిల నీరు నిలువ చేస్తే, 25 నుంచి 30 టి.ఎం.సిల దాకా పారించుకోవచ్చు. కానీ వంశధార స్టేజ్–II ఆయకట్టు 1,07,000 ఎకరాలని ప్రభుత్వం అంటున్నది. అందులో 20,000 ఎకరాలు హిర మండలం రిజర్వాయర్‌కు ఎగువన కట్టబోయే వరదకాలువ ఆయకట్టు కాబట్టి దానికి నీళ్ళు హిర మండలం రిజర్వాయర్ నుంచి తీసుకోరు. ఆ 20,000 తీసేస్తే మిగిలిన ఆయకట్టు 87,000 ఎకరాలు.

ఇది ప్రధానంగా వంశధార కుడి ప్రధాన కాలవ ద్వారా నీరు పొందుతుంది. అయితే కుడి ప్రధాన కాలవకు వంశధార నది నుంచే ఇప్పటికే నేరుగా 30,000 ఎకరాల మేరకు నీళ్ళు ఇస్తున్నామని ప్రభుత్వమే చెప్పుకుంటున్నది. గొట్ట బ్యారేజికి ఎగువన మూడేళ్ళనాడు నిర్మించిన కుడి హెడ్ రెగ్యులేటర్ నుంచి ఈ మొత్తం ఇప్పటికే ఇవ్వడం జరుగుతున్నది. గొట్టా బ్యారేజి (వంశధార స్టేజ్–I) కారణంగా దిగువన దెబ్బతిన్న పాతకాలపు యెరగాం, పురుషోత్తపురం. భైరి ఓపెన్ హెడ్ కాలవల ఆయకట్టు అవసరాలను భర్తీచేసే చిన్న ఉద్దేశంతో మొదలుపెట్టిన ఈ కుడి ప్రధాన కాలవ ఆయకట్టు ఇప్పటికే 30,000 ఎకరాలను చేరుకుంది. (నిజానికి ఇంకా ఎక్కువే ఇస్తున్నారని రైతులు అంటున్నారు కానీ, వాదన కోసం ప్రభుత్వాన్నే నమ్ముదాం.)

ఇంక మిగిలింది 57,000 ఎకరాలు. హైలెవెల్ కెనాల్ నుంచి నీరు పొందే 5,000 తీసేస్తే, కుడి ప్రధాన కాలవ ద్వారా హిరమండలం రిజర్వాయర్నుంచి నీళ్ళు పొందవల సింది 52,000 ఎకరాలు. 52,000 ఎకరాలకు 5 టి.ఎం.సిలు చాలు, నీళ్ళు దండిగా ఇస్తే 8 టి.ఎం.సిలు చాలు. 5 లేక 8 టి.ఎం.సిల నీళ్ళు పారించుకోవడానికి 3 లేక 5 టిఎంసిల సామర్థ్యం గల రిజర్వాయర్ చాలు.

మరి 19 టి.ఎం.సిల సామర్థ్యంతో హిరమండలం రిజర్వాయర్ ఎందుకు నిర్మిస్తు న్నట్టు? 21 గ్రామాల సస్యశ్యామలమైన భూములను ఎందుకు ముంచుతున్నట్టు? 82 గ్రామాల ఆదివాసులను కొండల మీద ఎందుకు బందీ చేస్తున్నట్టు?

ఎన్నిసార్లు అడిగినా ఈ ప్రశ్నకు ప్రభుత్వం నుంచి జవాబు లేదు. వారు జవాబు చెప్పరు కాబట్టి మనం వారు చేపడుతున్న నిర్మాణాల నుంచి ఊహించుకోవలసిందే తప్ప గత్యంతరం లేదు. మన సమాచార హక్కు దుర్గతి అది.

హిరమండలం రిజర్వాయర్‌ను తిరిగి నదికి కలుపుతూ నిర్మిస్తున్న **'లింక్'** కాలవలో ఈ రహస్యం ఉండాలి. కాట్రగడ దగ్గర (నేరడి సంగతి మరచిపోవడం మంచిది) పక్కకు తీసిన నీటిలో కొంత భాగాన్ని ఈ లింక్ కాలవ ద్వారా తిరిగి నదిలోకి పోస్తారు. ఇది గొట్టా బ్యారేజి (వంశధార స్టేజ్–I) ఆయకట్టు స్థిరీకరణకు ఉపయోగపడుతుందని అంటున్నారు. దీనికైనా ఎంత నీళ్ళు అవసరం ఉండబోతాయి?

వంశధార–I ఆయకట్టు 1,48,000 ఎకరాలు. అది పూర్తిగా అందుతూ ఉంది. అందులో పూడిక కారణంగా 17,000 ఎకరాలకు నీళ్ళందని పరిస్థితి రాగా, 1998లోనే దీనిని సరిదిద్దడానికి నిధులు సమకూర్చి 37 నీటి వినియోగదారుల సంఘాల ద్వారా

కాలవ నిర్వహణ పనులు చేపట్టి మరమ్మతులు చేసినట్టు ప్రభుత్వం చెప్పుకుంటున్నది. పూడిక సమస్య కూడా ఈ విధంగా తీరిపోయినట్టయితే ఇంక **'స్థిరీకరణ'**కు ఎంత నీళ్ళు కావాలి? వంశధార స్టేజ్-I ద్వారా నీళ్ళిస్తున్నది మొదటి పంటకు. ఆ సీజన్‌లో స్టేజ్-Iకు అవసరమైన నీళ్ళేకాక ఎగువన ఉన్న కుడి హెడ్‌రెగ్యులేటర్ నుంచి కుడి ప్రధాన కాలవ ద్వారా 30,000 ఎకరాలకు ఇప్పటికే నీళ్ళివ్వగలుగుతున్నారు. ఇంక స్థిరీకరణ ఎక్కడిది?

లింక్ కెనాల్ నీళ్ళివ్వబోయేది వంశధార స్టేజ్-I స్థిరీకరణకా, లేక అదే ఆయకట్టుకు రెండవ పంట నీటికా? అన్న సందేహం రాకమానదు. ప్రభుత్వం జవాబు చెప్పదు కాబట్టి మనం ఊహించుకోవలసిందే. 19 టి.ఎం.సిల హిరమండలం రిజర్వాయర్ నిర్మాణానికి కుడి ప్రధాన కాలవ కింద కొత్త ఆయకట్టును కారణంగా చూపుతున్నప్పటికీ, ఎడమ కాలవ కింద 1,48,000 ఎకరాలకు రెండవ పంటకు నీళ్ళివ్వడమే దాని ప్రధాన లక్ష్యం అని అర్థం అవుతుంది. (అయినప్పటికీ 19 టి.ఎం.సిల రిజర్వాయర్ అక్కరలేదు. 13-15 టి.ఎం.సిల సామర్థ్యం ఉంటే చాలును, అది వేరే విషయం.)

ఇదే నిజమైతే ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీయవలసి ఉంది. ముంపు బాధితుల కోణం నుంచి ప్రాజెక్టులను ఎప్పుడు విమర్శించినా 'అభివృద్ధి'కి అడ్డం వస్తున్నారని ఎదురుదాడి చేస్తారు. సాగునీరు లేని ప్రాంతాలకు సాగునీరివ్వడం వాంఛనీయమైన అభివృద్ధేనని ఒప్పుకుందాం. కానీ ఇప్పటికే ఒక పంటకు నీరు పొందుతున్న వారికి రెండవ పంటకు నీళ్ళివ్వడం కూడా అంతే అవసరమా? దానికోసం కూడా ఇతరులు **'త్యాగం'** చేయవలసిందేనా?

ఇదివరకటిలాగా ప్రతి ప్రాజెక్టునూ అభివృద్ధిగానూ, ముంపునంతా అనివార్యంగానూ చూసే రోజులు పోయాయి. అభివృద్ధి అవసరమే కానీ, అది విధ్వంసకరం కాని అభివృద్ధి అయివుండాలని ఇవాళ నాగరిక ఆలోచనారీతి భావిస్తున్నది. ముంపు తప్పనిసరి అయితే ఆ ముంపువల్ల బాధితులయ్యే వారికి కూడా అదే ప్రాజెక్టు కింద భూములివ్వడం ద్వారా గానీ, ఇతరత్రా గానీ మెరుగైన జీవనాన్ని ఇవ్వడం కూడా ప్రాజెక్టు రూపకల్పనలో భాగం కావాలని భావిస్తున్నది. ఈ ఆలోచనలు మన పాలకులకింకా తోచలేదు గానీ నాగరిక ప్రపంచం ఈ విషయాలను ఏ విధంగా చూస్తున్నదో ప్రజలైనా తెలుసుకోవడం అవసరం.

**'విధ్వంసకరం కాని అభివృద్ధి'** అనే ప్రమాణాన్ని పెట్టుకొని చూసినప్పుడు ఒక పంటకు ఇప్పటికే నీళ్ళిస్తున్నవారికి రెండవ పంటకు కూడా ఇవ్వడానికి పెద్దఎత్తున ముంపును ఆహ్వానించడం సమర్థనీయం కాదు. భారీ ప్రాజెక్టులు కట్టేసి రాష్ట్ర భగీరథులుగా, జిల్లా భగీరథులుగా చలామణి కావడం రాజకీయ నాయకులకు సంతోషం కలిగించే విషయం కావచ్చును గానీ ప్రజలు దానికోసం త్యాగాలు చేయనక్కర లేదు.

హిరమండలం రిజర్వాయర్ నిర్వాసితుల పక్షాన ఈ మాటలు అంటున్నామని మొదటే చెప్పాము కాబట్టి ఇక వారి విషయం మాట్లాడుకుందాం. నిర్వాసితుల భవితవ్యాన్ని కూడా ప్రాజెక్టులో భాగం చేసి వారికి సైతం ప్రాజెక్టు ద్వారా, లేక ప్రాజెక్టుకు అనుబంధంగా, మెరుగైన జీవితాన్ని అందించే సమకాలీన ఆలోచనా రీతి మన తరాలకింకా తోచలేదని చెప్పాము. మనకు నిన్నటిదాకా ఒక పునరావాస హక్కేలేదు. పునరావాసం ప్రభుత్వమిచ్చే భిక్షగా ఉండింది. ఇప్పుడు





పరిస్థితి కొంచెం మారి ఒక మేరకు పునరావాస హక్కు కల్పించే విధానం వచ్చింది. జీవో 68 అనే విధాన ప్రకటన పత్రంలో దానిని రాష్ట్ర ప్రభుత్వం పొందుపరిచింది.

ఈ విధాన పత్రం 6వ అధ్యాయంలో పునరావాస హక్కు స్వరూప స్వభావాలను వివరించారు. భూమి సేకరణ వల్ల స్థిరాస్తులు కోల్పోయిన వారికి ఎప్పటిలాగే నష్టపరిహారం దక్కుతుంది. అందులో మార్పేమీలేదు. నిర్వాసిత గ్రామాన్ని తిరిగి ఒక గ్రామంగానే ఇంకొక చోట అన్ని వసతులతోనూ నిర్మించాలన్న డిమాండ్ దేన్నయితే ప్రజాస్వామిక ఉద్యమాలు చేస్తున్నాయో అటువంటి పునరావాస హక్కేదీ ఈ విధాన పత్రంలో లేదు. వేరే ఎక్కడైనా ఇళ్ళ స్థలం ఫ్రీగా పొందాలంటే ఇప్పుడు కోల్పోయిన స్థలానికి నష్టపరిహారం వదులుకోవాలి. కోల్పోయిన ఇంటికి మారుగా ఇల్లు కట్టుకోవడానికి దరిద్ర రేఖకు దిగువన ఉన్న వారికి మాత్రం 40 వేల రూపాయలిస్తారు. ముంపుకు గురైన సాగుభూమికి ప్రత్యామ్నాయంగా అంతే సాగుభూమి పొందే హక్కులేదు. ఒకవేళ ఎక్కడైనా ఎవరి ఆక్రమణలో లేని సాగు యోగ్యమైన ప్రభుత్వ భూమి అందుబాట్లో ఉంటే ఇస్తారు. అయితే ఆ మేరకు ముంపుకు గురైన భూమికి నష్టపరిహారం వదులుకోవలసి వస్తుంది.

మరి కొత్తగా ఉన్న హక్కేమిటి ఈ పునరావాస విధాన పత్రంలో అంటే, ముంపుకు గురైన వారు తిరిగి జీవనాన్ని పొందడానికి కొంతకాలం పడుతుందని గుర్తించి ఆ కాలం గడవడానికి ఆర్థిక సహాయం ప్రభుత్వం చేస్తుంది. భూమి పూర్తిగా కోల్పోయిన రైతులకు 750 రోజుల కనీస వేతనం లెక్కగట్టి చేతిలో పెడుతుంది. వ్యవసాయ కూలీలకు ఇతర వృత్తుల వారికీ 625 రోజుల కనీస వేతనం చేతిలో పెడుతుంది. భూమి సేకరణ వల్ల చిన్నకారు రైతులుగా మారిన వారికి 325 రోజుల కనీస వేతనం, సన్నకారు రైతులుగా మారిన వారికి 500 రోజుల కనీస వేతనం ఒక్కసారిగా ఇవ్వడం జరుగుతుంది. ఇంకా చిన్నా, చితక విషయాలు ఈ **'పునరావాస విధాన పత్రం'**లో ఉన్నాయిగానీ ఇప్పటిదాకా లేనిదీ కొత్తగా ఇస్తున్నదీ ఈ ఆర్థిక సహాయం ఒక్కటే. **'దీనికి సహాయ పునరావాస విధానం'** అని పేరు పెట్టినప్పటికీ ఇది నిజానికి పునరావాస విధానం కాదు. కొంచెం మెరుగైన నష్టపరిహార విధానం మాత్రమే.

కాబట్టి ముంపుకు గురికాబోయే ప్రజల జీవన ప్రమాణం ఇప్పుడున్నట్టు ఇక మీదట ఉండబోదనేది (బాగా నష్టపరిహారం పొందగల పెద్ద రైతులను మినహాయిస్తే) స్పష్టమే. ఇవి ఒకటీ రెండూ కుటుంబాలు కావు. దాదాపు 30 వేల నుంచి 40 వేల జనాభా నిర్వాసితులవుతారు. ప్రభుత్వం లెక్క ప్రకారం పొలం మాత్రమే పోయి ఇల్లు భద్రంగా ఉంటుంది అనే కోవకు చెందిన వారు కూడా అక్కడే ఉండి బతకలేరు. జీవో 68 ప్రకారం వారు కూడా **'ప్రాజెక్టు బాధిత కుటుంబాల'** లెక్కలోకే వస్తారు.

ఇది హిరమండలం రిజర్వాయర్‌లో ప్రత్యక్షంగా ముంపుకు గురయ్యే 21 మైదాన గ్రామాల విషయం కాగా, రిజర్వాయర్‌కు ఆవలనున్న కొండలలో బందీ కాబోయే 82 ఆదివాసీ గూడెంల ప్రజలది మరింత సంకట స్థితి. ప్రభుత్వం లెక్కలలో వారివి **'ముంపు గ్రామాలు'** కావు. రిజర్వాయర్ నీటిమట్టం ఎంతవరకు ఉంటే అంత మేరకు మాత్రమే నీటిపారుదల శాఖ లెక్కలో **'ముంపు ప్రాంతం.'** రిజర్వాయర్ నీటిమట్టం మరియు వంద

మీటర్లు ఎగువ వరకు నీటిపారుదల శాఖ లెక్కలు వేసినదే ముంపు ప్రాంతం. జీవో 68 రూపంలో జారీ అయిన పునరావాస విధానపత్రం కూడా ముంపు ప్రాంతంలో ఏదైనా వృత్తి చేసుకొని బతుకుతున్న వారినే **'ప్రాజెక్టు బాధిత కుటుంబాలు'**గా గుర్తిస్తుంది తప్ప ప్రాజెక్టు వల్ల రాకపోకలు బంద్ అయిపోయే కారణంగా జీవనం కొనసాగించడం అసాధ్యం అయ్యే వారిని గుర్తించదు. ఇటువంటి బాధితులు ప్రతీ ప్రాజెక్టుకు ఉంటారని అనేక సందర్భాలలో ప్రభుత్వం దృష్టికి వస్తూనే ఉన్నా, లేక లేక రూపొందించిన ఈ పునరావాస విధాన పత్రంలో వారికి గుర్తింపు ఇవ్వలేదు. హిరమండలం రిజర్వాయర్ విశిష్టత ఏమంటే ఇటువంటి బాధితులు పెద్ద సంఖ్యలో ఉండడం, వారందరూ ఆదివాసులు కావడం. 82 గూడెంల ప్రజలకు ముందు నీళ్ళు, వెనక కొండలు బయటి ప్రపంచం నుంచి రాకపోకలకు ఆటంకంగా ఉంటాయి. బయలుప్రదేశంలోనే బందీలై బతకవలసి ఉంటుంది.

వీరి గురించి మేము ఇప్పటికే అధికార యంత్రాంగం దృష్టికి ఒకటికి నాలుగుసార్లు తీసుకొచ్చినప్పటికీ మేము వ్యక్తం చేస్తున్న ఆందోళన నిజమా కాదా అన్న విచారణ సైతం అధికారులు ఇప్పటిదాకా చేపట్టలేదంటే 'అభివృద్ధి' సాధించామని చెప్పుకోవాలన్న కోరిక, భగీరథుల మనిపించుకోవాలన్న నాయకుల దాహం, వారినెంత అమానుషంగా తయారు చేస్తున్నాయో గ్రహించవచ్చు.

★ హిరమండలం రిజర్వాయర్ ప్రతిపాదన విరమించుకోవాలి.

★ వంశధార ఎడమ కాలవ ఆయకట్టుకు రెండవ పంటకు నీళ్ళిచ్చే ఆలోచన విరమించి కుడి ప్రధాన కాలవ ఆయకట్టుకు ప్రస్తుతం ఉన్న కుడి హెడ్‌రెగ్యులేటర్ ద్వారా నది నుండే నేరుగా నీళ్ళు తీసుకోవాలి.

★ కాట్రగడ పథకాన్ని వరద కాలవకే పరిమితం చేయాలి.

★ జీవో 68ని పూర్తిగా తిరగరాసి సమకాలీన/ప్రజాస్వామిక ఆలోచనలకు అనుగుణంగా సమగ్ర పునరావాస విధానాన్ని రూపొందించాలి.

★ 'అభివృద్ధి'కి ఆదివాసులను సునాయాసంగా బలిచేసే అమానుష పాలనా వైఖరిని విడనాడాలి.

ఆం.ప్ర. వ్యవసాయ వృత్తిదారుల సంఘంతో కలిసి
**శ్రీకాకుళం జిల్లా కమిటీ, 1-9-2005**



కరపత్రం

## పోలవరం ప్రాజెక్టును

# ఎందుకు వ్యతిరేకిస్తున్నాం?

**పో**లవరం రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన 'జలయజ్ఞం'లోని అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ప్రాజెక్టు. దానిని ఏ విధంగానయినా పూర్తిచేస్తానని ముఖ్యమంత్రి ప్రకటిస్తున్నాడు. దానికి ఏ అనుమతులూ లేవుకదా అంటే అనుమతుల అవసరం ఏమిటని ఒకసారి అంటాడు, ముందు పని ముగించేసుకొని ఆ తరువాత అనుమతులు తెచ్చుకోకూడదా అని ఇంకొక సారి అంటాడు. ఇదిగో అనుమతులు తెచ్చేస్తున్నామని వేరొకసారి అంటాడు.

పోలవరం కట్టదగ్గ ప్రాజెక్టయితే ఈ పట్టుదలను అభినందించవచ్చు. దానికి సహాయం కూడా అందియ్యవచ్చు. కానీ అది కట్టదగ్గ ప్రాజెక్టు కాదని మానవహక్కుల వేదిక అభిప్రాయం. ఇది అభివృద్ధి నిరోధకమైన అభిప్రాయం అని చాలామంది అనబోతారు కాబట్టి దీనిని వివరించడం అవసరం అని మేము భావిస్తున్నాం.

స్థూలంగా మూడు కారణాల వల్ల ఈ ప్రాజెక్టును వ్యతిరేకించాలని అనుకుంటున్నాం. ఒకటి, అది ఆదివాసుల జీవితాలను పెద్దెత్తున విధ్వంసానికి గురి చేస్తుంది. రెండు, ఇప్పటికే అభివృద్ధి చెందిన ప్రాంతాలను మరింత అభివృద్ధి చేయడానికి ఇప్పటికీ వెనకబడి ఉన్న ప్రాంతాలను, ప్రజలను ముంచుతుంది, నిర్వాసితులను చేస్తుంది. మూడు, ఉత్తర తెలంగాణ జిల్లాలలోని మెట్ట భూములకు తగిన మోతాదులో గోదావరి జలాలను దక్కకుండ చేస్తుంది.

పోలవరం ప్రాజెక్టు స్వరూపాన్ని గురించి సమగ్రమైన నివేదిక ఇప్పటివరకు ప్రభుత్వం ప్రజల ముందు ఉంచలేదు. చేపడుతున్న కాలవల నిర్మాణానికీ ప్రకటించుకున్న ప్రాజెక్టుకూ పొంతన కనిపించడం లేదు. ప్రకటించుకున్న ప్రాజెక్టు లెక్కల ప్రకారం పోలవరం ప్రాజెక్టు ఉభయ గోదావరి, కృష్ణా జిల్లాలలో 7 లక్షల 27 వేల ఎకరాలకు సాగునీరు ఇస్తుంది. 975 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి చేస్తుంది. 23 టిఎంసిల నీళ్లు ఎడమ కాలవ ద్వారా విశాఖపట్నం దాకా అనేక గ్రామాలకూ, పట్టణాలకూ తాగడానికి, పరిశ్రమల అవసరాలకూ ఇస్తుంది. 80 టిఎంసిల నీటిని కుడి కాలవ ద్వారా కృష్ణా బేసిన్‌కు తరలించి కృష్ణా బేసిన్ ఎగువ ప్రాంతాల నీటి అవసరాలు తీరుస్తుంది. ఈ అవసరాల కోసం పోలవరం దగ్గర నిర్మించబోయే డ్యాం నుండి అది 325 టిఎంసిల నీళ్లు తీసుకుంటుంది.

ఈ ప్రయోజనాలు సాధించడానికి ఈ ప్రాజెక్టు ఎంత విధ్వంసం సృష్టించబోయేదీ ప్రభుత్వం చెప్పడంలేదు. స్పష్టమైన సమాచారం ఇవ్వకుండ 'నిర్వాసితులను తప్పక ఆదుకుంటాం' అనీ 'నిర్వాసితులకు ఏ కష్టమూ రానివ్వం' అనీ ప్రకటిస్తున్నది. అప్పుడెప్పుడో 15 సంవత్సరాల క్రితం జరిగిన సర్వేలను బట్టి, ఈ ప్రాజెక్టు కింద మూడు జిల్లాలలో 9 ఏజెన్సీ మండలాలు ముంపుకు గురవుతాయి. 276 గ్రామాలు పూర్తిగానో పాక్షికంగానో మునుగుతాయి. అప్పటి జనాభా లెక్కల ప్రకారం ఒక లక్ష పదిహేడు వేల మంది నిర్వాసితులవుతారు.

ఆ మండలాలు పోలవరం (పశ్చిమ గోదావరి జిల్లా), దేవీపట్నం (తూర్పు గోదావరి

జిల్లా), వరరామచంద్రాపురం, కూనవరం, చింతూరు, భద్రాచలం, బూర్గంపాడు, కుకునూరు, వేలేరుపాడు (ఖమ్మం జిల్లా). ఇవన్నీ ఏజెన్సీ మండలాలే. జనాభాలో దాదాపు సగం మంది ఆదివాసులు. ప్రధానంగా కోయ, కొండరెడ్డి తెగలవారు.

అప్పటికీ ఇప్పటికీ ముంపు గ్రామాల సంఖ్య పెరగకున్నా వాటిలోని జనాభా తప్పక పెరిగే ఉంటుంది. ఇప్పుడు లక్షా యాభైవేల దాకా ఉండవచ్చు. వీరికి పునరావాసం ఇస్తామని ప్రభుత్వం ఎన్ని మాటలు మాట్లాడినా వీరి జీవన ప్రమాణం ఇప్పుడున్న దానికంటే బాగా పడిపోతుందనడంలో సందేహమేమీ లేదు. ప్రాజెక్టు వల్ల ముంపుకు గురయ్యే ప్రజలకు తొలిసారిగా పునరావాస 'హక్కు' కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మొన్నటి ఏప్రిల్ నెలలో జారీచేసిన జీవో 68లో నిర్వాసితుల జీవన ప్రమాణం పడిపోకుండ చూసే సదుపాయమేదీ లేదు. తాత్కాలిక ఆర్థిక సహాయం మాత్రమే ఆ జీవో ఇస్తుంది. నిర్వాసితులు కాబోయే వారిలో సగం మంది ఆదివాసులని ముందే చెప్పాం. వారికి ఏజెన్సీలోనే పునరావాసం కల్పించడానికి భూమిలేదు, అటవీ సంరక్షణ చట్టం ఒప్పుకోదు. ఏజెన్సీ బయట వారికి పునరావాస కాలనీలు ఒకవేళ ఏర్పాటు చేసినా వారక్కడ జీవనాధారం ఇప్పుడున్న దానిలో పదవ వంతు కూడ సంపాదించలేరు. అడవి ఇచ్చే పుష్కలమైన ఉమ్మడి ఫల సాయం, రకరకాల గింజలు, ఆకులు, దుంపలు, జిగురు, తేనె మొదలైన చిన్నతరహా అటవీ ఉత్పత్తులు, వంటచెరుకు, పశుగ్రాసం బయట దొరకవు. షెడ్యూల్డు ప్రాంతానికి ప్రత్యేకమైన చట్టాల రక్షణా ఇక ఉండదు.

రాజకీయంగా నోరు లేని ప్రజల జీవితాలను ఇంతటి విధ్వంసానికి గురిచేసి, ఇప్పటికే అంతో యింతో బాగున్న వారి బతుకులు ఇంకింత బాగుచేయడం కోసం కడుతున్న ప్రాజెక్టును కట్టదగ్గదిగా ఎందుకు భావించాలి?

దాని బదులు అవే గ్రామాలకు అదే నీటిని సాగునీరుగా అందియ్యడం నిజమైన అర్థంలో 'అభివృద్ధి' కాదా అని కూడా అడుగుతున్నాం. పోలవరం ప్రాజెక్టు కింద మునగబోయే 276 గ్రామాలు గోదావరి నది ఒడ్డున ఇటూ అటూ ఉన్నాయి. వాటిని దాటి కిందికి ప్రవహించి, కింద రాబోయే పోలవరం కట్ట తాకిడికి వెడల్పయి ఆ గ్రామాలను ముంచబోయే నది నీటిని, ఎత్తిపోతల ద్వారా గానీ వేరే ఏ రకంగానయినా గానీ అవే గ్రామాలకు సాగునీరుగా అందించినట్లయితే ఆ నీటిని సద్వినియోగం చేసినట్టూ అవుతుంది, మైదాన ప్రాంతాల వారి బతుకులనే కాక అడవి బిడ్డల బతుకులనూ బాగుచేసినట్టవుతుంది, అభివృద్ధిలో సమతుల్యమూ సాధించినట్టవుతుంది. బాగున్నవాళ్లను ఇంకా బాగుచేయడానికి ఏమీలేని వాళ్లను ఇంకింత నాశనం చేయడం ఏ రకమైన అభివృద్ధి?

ఈ పని చేస్తే మహా అయితే ఒక లక్ష ఎకరాలు సాగులోకి వస్తాయేమోగానీ ఇప్పుడు కట్టబోయే ప్రాజెక్టు వల్ల ఏడు లక్షల ఎకరాల సాగు, 975 మెగావాట్ల కరెంటు వగైరా ఒనగూడుతాయి కదా అంటారేమో. 'అభివృద్ధి' అనే దానిని 'ఎంత' అనే తప్ప 'ఎవరికి' అనే ప్రశ్నతో బేరీజు వేసుకోనక్కరలేదనే ఈ వైఖరే అప్రజాస్వామికం అని మేము అంటున్నాం. టోకున ఎన్ని ఎకరాలు సాగులోకి వచ్చాయి, ఎన్ని ఊర్లకు నీళ్లందాయి అని మాత్రమే కాక ఎవరి భూములకు అందాయి, ఏ ఊర్లకు అందాయి అని ప్రశ్నించుకొని సమతుల్యాన్ని పెంచే ప్రత్యామ్నాయాన్ని ఎంచుకోవడం మెరుగయిన, ప్రజాస్వామికమైన అభివృద్ధి పంథా అని అంటున్నాం.

దానివల్ల గోదావరి జలాలలో మన వాటా నీళ్లు మనం పూర్తిగా వాడుకోక 'వృధా' కానివ్వడం జరుగుతుందని భయపడనవసరం లేదు. పోలవరం ముంపు ప్రాంతానికి ఎగువన ఇదే నీటిని



వెనుకబడిన తెలంగాణ జిల్లాల కోసం ఉపయోగించడానికి తలపెట్టిన ప్రాజెక్టులు అతీగతీ లేకుండ ఉన్నాయి. 85 టిఎంసిల నీటిని వినియోగించుకోగల ఇచ్చంపల్లి ప్రాజెక్టు పొరుగు రాష్ట్రాల అభ్యంతరాల కారణంగా మొదలే కాకుండ ఉండిపోయింది. దానిని తగిన విధంగా రూపొందించే ఆలోచన చేస్తే అది సమతుల్యంతో కూడిన అభివృద్ధికి దోహదపడుతుంది. 'దేవాదుల' అనే పేరుతో మొదలయి ఇప్పుడు గోదావరి ఎత్తిపోతల పథకం అనే పేరుతో కేవలం 5 టిఎంసిల వినియోగానికి భారీగా నిర్మిస్తున్న ప్రాజెక్టు ద్వారా 50 టిఎంసిల దాకా నీళ్లు తీసుకొని కరీంనగర్, వరంగల్, మెదక్, నల్లగొండ జిల్లాల ఎగువ ప్రాంత భూములకు సాగునీరిచ్చే ఆలోచన ప్రభుత్వ ప్రణాళికలోనే ఉంది. దానికి వేగంగా కార్యరూపం ఇయ్యవచ్చును. ఖమ్మం జిల్లాకు విస్తారంగా నీళ్లివ్వగల దుమ్ముగూడెం ప్రాజెక్టు మీద దృష్టిపెట్టవచ్చు. వీటికంటె ఎగువన కూడ తెలంగాణ జిల్లాలకు నీళ్లివ్వగల ప్రతిపాదిత ప్రాజెక్టులు (శ్రీరాంసాగర్ వరద కాలవ, ఎల్లంపల్లి వగైరా) ఉన్నాయి గానీ అవి పోలవరంతో నీటి కేటాయింపుకు పోటీకి రాగల ప్రాజెక్టులు కావు కాబట్టి వీటిని మాత్రమే ఇక్కడ ప్రస్తావిస్తున్నాం.

పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా ప్రస్తుతం తవ్వుతున్న కాలవలనూ ప్రాజెక్టు ఫలితాల గురించి ప్రభుత్వం చెప్తున్న మాటలనూ బట్టి చూస్తే పై ప్రాజెక్టులకు నీళ్లేమయినా ఉంటాయా అన్న సందేహం వస్తుంది. పోలవరం ద్వారా కృష్ణా, ఉభయ గోదావరి జిల్లాలలో ఏడు లక్షల ఇరవై ఏడువేల ఎకరాలు కాదు, 16 లక్షల ఎకరాలకు నీళ్లిచ్చే ఆలోచన ఉన్నట్టు ప్రభుత్వం ప్రకటనలు తెలియచేస్తున్నాయి. గోదావరి డెల్టాలో పదిన్నర లక్షల ఎకరాల స్థిరీకరణ కూడా పోలవరం ద్వారా చేపడతామని అంటున్నారు. పోలవరం నీళ్లు ఎప్పుడొస్తాయోనని దానికి ప్రత్యామ్నాయంగా దాని ప్రతిపాదిత ఆయకట్టులోనే కొంత భాగాన్ని తడపడానికి రూపొందించిన తాడిపూడి, పుష్కరం ప్రాజెక్టులను ఒకవైపు పూర్తి చేస్తూ, మళ్లీ అదే ఆయకట్టుకు పోలవరం కాలవలు కూడా తవ్వుతున్నారు. తొలినాటి అంచనాల ప్రకారం పోలవరం ప్రధాన కాలవ 9000 క్యూసెక్కుల ప్రవాహం కోసం నిర్మించాలని ఉండగా ఇప్పుడు 17,500 క్యూసెక్కుల ప్రవాహానికి తగినట్టు నిర్మిస్తున్నారు. చాలా వెడల్పుగా, లోతుగా నిర్మిస్తున్నారు.

దీనిని బట్టి చూస్తే పోలవరం ద్వారా 325 కాదు, 500 టిఎంసిల దాకా నీళ్లు తీసుకునే ఆలోచన ఉన్నట్టు స్పష్టం అవుతున్నది. కేవలం వ్యవసాయానికేనా లేక కోస్తా జిల్లాలలో వేగంగా అభివృద్ధి చెందుతున్న పారిశ్రామిక అవసరాలకూ తీసుకోబోతారా అన్న సందేహాలూ ఉన్నాయి. సమాచారాన్ని ఒక హక్కుగా భావిస్తున్న ఈ రోజులలో ఈ రకమైన ఊహాగానాలు చేయడం మనకు సిగ్గనిపించినా సమాచారాన్ని దాచిపెట్టడం ప్రభుత్వానికి సిగ్గనిపించడం లేదు కాబట్టి కంటికి కనిపిస్తున్న విషయాలను బట్టి ఈ ప్రశ్నలు వేసుకోవలసి వస్తున్నది.

పూర్తయిపోయిన ప్రాజెక్టులు పోను గోదావరి జలాలలో మన రాష్ట్ర వాటా ఇంక 680 టిఎంసిలే ఉందని నిపుణుల అంచనా. అందులో 500 పోలవరం ద్వారా తీసుకునేటట్టయితే ఎగువన ఉన్న తెలంగాణ జిల్లాల అవసరాలకేం మిగులుతుంది? ప్రాంతీయ అసమానతలు అప్రజాస్వామికం అని అందరూ ఒప్పుకుంటున్నట్టు మాట్లాడుతున్న ఈ రోజులలో ఇటువంటి ప్రాజెక్టులను అంగీకరించగలమా?

పైగా, దుమ్ముగూడెం, ఇచ్చంపల్లి మొదలయిన ప్రాజెక్టులు పోలవరం ప్రాజెక్టు భద్రతకు కూడ అవసరం అని నిపుణులు అంటున్నారు. గోదావరి నదిలో సంవత్సరంలో కొన్ని దినాలు పెద్దెత్తున ప్రవాహం ఉంటుంది. 20 లక్షల క్యూసెక్కుల నుండి 36 లక్షల క్యూసెక్కుల దాకా ఈ ప్రవాహ పరిమాణం ఉండగలదు. ఎగువన కట్టవలసిన ప్రతిపాదిత ప్రాజెక్టులేవీ కట్టకపోతే పోలవరం ఆనకట్టే నేరుగా ఈ ప్రవాహాన్ని భరించవలసి వస్తుంది. దానికది తట్టుకోలేదనీ పెద్దెత్తున విధ్వంసం జరిగే ప్రమాదముందనీ నిపుణులు అంటున్నారు. అంతా నాకే కావాలన్న ఆశపోతుతనం మన ఆరోగ్యానికి కూడ మంచిది కాదు మరి!

గోదావరి జలాలను కృష్ణా బేసిన్‌కు తరలించడం పోలవరం ప్రాజెక్టు ముఖ్య లక్ష్యాలలో ఒకటని రాష్ట్ర ప్రభుత్వం అంటున్నది. తొలినాటి అంచనాల ప్రకారం తరలించబోయేది 80 టిఎంసిలే. అందులో 35 టిఎంసిలు కర్ణాటక, మహారాష్ట్రల వాటాగా పోతాయి. ఆ మేరకు ఆ రాష్ట్రాలు కృష్ణా జలాలను ఎగువన ఆపుకుంటాయి. ఇంక మిగిలిన నీటి బదిలీ 45 టిఎంసిలే. అయినప్పటికీ ఇది రాయలసీమలోని కరువు ప్రాంత ప్రాజెక్టుల అవసరాలకు ఉపయోగపడుతుందని పోలవరం ప్రాజెక్టును సమర్థిస్తూ చేసే ఒక ముఖ్య వాదనగా ప్రభుత్వం అంటున్నది. గోదావరి జలాలను కృష్ణా బేసిన్‌కు తరలించడం అంటూ జరిగితే అది రాయలసీమకే కాదు, దక్షిణ తెలంగాణకూ ఉపయోగపడుతుంది. ఉపయోగపెట్టవలసి ఉంటుంది. ఈ బేసిన్ బదిలీ గురించి బచావత్ అవార్డులో ప్రస్తావించిన చోట కృష్ణా బేసిన్ ఎగువనున్న దుర్భిక్ష ప్రాంతాల గురించి ప్రస్తావించారే తప్ప ఒక ప్రాంతాన్నో కొన్ని జిల్లాలను ప్రస్తావించలేదు. కరువు రాయలసీమలో ఉన్నట్టే దక్షిణ తెలంగాణ లోనూ ఉంది. నీళ్లు రెండు ప్రాంతాలకూ కావాలి.

అయితే ఆ అవసరాల కంటె ముందు గోదావరి బేసిన్‌లోని ఉత్తర తెలంగాణకు చెందిన మెట్ట ప్రాంతాల అవసరాలకు ప్రాధాన్యం ఇవ్వడం న్యాయంగా ఉంటుంది. ఆ ప్రాంతాలకు గోదావరి జలాలు తప్ప వేరే లేవు కాబట్టి ఈ ప్రాధాన్యం న్యాయమైనది. దీనికి అవసరమైన ప్రాజెక్టుల రూపకల్పన అరకొరగా ఉంచేసి వేరే అవసరాల గురించి మాట్లాడడం న్యాయంకాదు.

కాబట్టి ఆదివాసుల జీవించే హక్కు, వారి మనుగడ హక్కు, అభివృద్ధిలో సమతుల్యం, నీటి హక్కులలో న్యాయమైన ప్రాధాన్యం, చివరికి ప్రాజెక్టు భద్రత – దేనిని ప్రమాణంగా పెట్టుకొని చూసినా పోలవరం ప్రాజెక్టు సమర్థనీయం కాదు. కాకపోగా, దానికి అవసరమైన ఏ అనుమతులూ లేవు. నీటి లభ్యత, ఉంటే దానిని వాడుకునే హక్కు, ప్రాజెక్టు డిజైన్‌లకు కేంద్ర జలవనరుల సంఘం అనుమతి అవసరం. అది లేదు. పదివేల ఎకరాల అడవి భూమి పోలవరం ప్రాజెక్టు కింద మునగనుంది కాబట్టి కేంద్ర అటవీశాఖ అనుమతి అవసరం. దానికోసం అంతే మొత్తంలో అడవి పెంచడానికి భూమి కేటాయించడం అవసరం. అదీ లేదు. అడవితోబాటు ఆదివాసుల ఆవాసాలు మునుగుతాయి కాబట్టి కేంద్ర సాంఘిక సంక్షేమ శాఖ అనుమతి అవసరం. అది కూడ లేదు. విలువయిన జీవావరణం ముంపుకు గురవుతుంది కాబట్టి కేంద్ర పర్యావరణ శాఖ అనుమతి అవసరం. అది సహితం లేదు. ఇవేవీ లేకపోయినా, టెండర్లు పాడుకోవడానికి కాంట్రాక్టర్లుంటే చాలునని రాజశేఖరరెడ్డి ప్రభుత్వం అనుకోవచ్చును గానీ చట్టం అనుకోదు.

ఇన్ని కారణాల వల్లా పోలవరం ప్రాజెక్టు వద్దంటున్నాం. దాని నిర్మాణాన్ని ఆపాలంటున్నాం. ఇప్పటికే దానిని ఆపడానికి ఉద్యమిస్తున్న ఆదివాసీ ప్రజలతో అందరం కలవాలంటున్నాం.

**3-9-2005**



# మున్సిపోల్స్‌కు ప్రశ్నలు

ఎన్నికలే ప్రజాస్వామ్యానికి మూలాధారమని, ప్రతి ఎన్నికా ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేస్తుందని రాజకీయ పండితులు వ్యాఖ్యానిస్తారు. స్వాతంత్ర్యం వచ్చి 57 సంవత్సరాలు గడిచిపోయినా, అనేక రకాల ఎన్నికల ప్రక్రియలలో ప్రజలు పాల్గొంటున్నా మన ప్రజాస్వామ్యానికి మాత్రం ప్రజాస్వామిక విలువలు ఇంకా అలవడడం లేదు. కులం, మతం, ధనం, దౌర్జన్యం, సారాయి లాంటి పంచ లక్షణాల ప్రభావం రోజు రోజుకూ పెరుగుతున్నది. ఒకప్పుడు రాజకీయ నాయకులకు అజ్ఞాతంగా, పరోక్షంగా సహాయపడే రౌడీలు, సారాయి కాంట్రాక్టర్లు, గూండాలు నేడు ప్రత్యక్షంగా తామే ఎన్నికలలో పోటీ చేస్తున్నారు. పార్టీలు కూడా ఇటువంటి వారిని సగౌరవంగా ఆహ్వానించి రాజకీయ విలువలకు పాతర వేస్తున్నాయి. భిన్నమైనటువంటి సామాజిక విలువలున్నటువంటి సమాజంలో ప్రజాస్వామిక విలువలు పరిపూర్ణంగా ఉంటాయని ఆశించడమే అత్యాశ. కొన్ని దశాబ్దాలుగా ప్రజాస్వామిక విధానాల్ని అమలుపరుస్తున్న సమాజంలో ప్రజాస్వామిక విలువలు పెరుగుతూ పోవాలి. కానీ మనదైన మార్కు ప్రజాస్వామ్యంలో మాత్రం ప్రజాస్వామిక విలువలు తిరోగమన దిశగా నడుస్తున్నాయి.

ప్రస్తుతం మన ముందు మునిసిపల్ ఎన్నికలున్నాయి. అనంతపురం పట్టణాన్ని కార్పొరేషన్‌గా కూడా మార్చారు. వివిధ రాజకీయ పార్టీలు నైతిక విలువల కంటే 'గెలిచే వారికే టిక్కెట్లు' అనే పేరుతో కాంట్రాక్టర్లను, రౌడీ షీటర్లను అభ్యర్థులుగా మన ముందుంచారు. జిల్లాలో ఏకగ్రీవాల వెనుక రాజకీయాలలో రౌడీయిజం, ధనబలం ఏ మేరకు పనిచేశాయో అందరికీ తెలిసిన విష యమే. వామపక్షాలు మినహా అన్ని పార్టీలు తమ ప్రణాళికలు ప్రకటించాయి. రోడ్లు, బ్రిడ్జిలు, మంచినీళ్ళు తదితరాల సౌకర్యాల పెంపును గురించి ప్రస్తావించాయి. కానీ ఏ పార్టీ కూడా విద్య గురించి మాట్లాడటం లేదు. విద్యను ప్రైవేటీకరించడంలో అన్ని పార్టీలు పోటీపడుతున్నాయి కాబట్టే విద్యను గురించి మాట్లాడవు. గత 30 సంవత్సరాలలో కొత్తగా అనంతపురం పట్టణంలో ప్రాథమిక పాఠశాలలు గానీ, ఉన్నత పాఠశాల గానీ ఏర్పాటు చేయలేదు. ఫలితంగా విద్య సామాన్య ప్రజానీకానికి దూరమైపోతున్నది. జిల్లాలో సంభవిస్తున్న కరువుల వల్ల గ్రామాలలో బతకలేక పట్టణ ప్రాంతాలలో బతుకును వెతుక్కుంటున్నారు. బతకడమే కష్టమైన వీరికి చదువును కొనుక్కోవడం చేతగాని పని. పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా విద్యా సౌకర్యాలు అభివృద్ధి చేయాలి. కానీ మునిసిపాలిటీలకు ఆదాయాలిచ్చే షాపింగ్ కాంప్లెక్సులకు మాత్రమే కోట్లు ఖర్చు పెడుతున్నారు. ఆఖరికి అంతర్జాతీయ సంస్థ డి.ఎఫ్.ఐ.డి నిధులు కూడా కాంట్రాక్టర్లకు, అధికారులకు ఉపాధినిచ్చే రోడ్లు, బ్రిడ్జిలకు మాత్రమే కేటాయిస్తున్నారు.

రెండవ ప్రధానమైన బాధ్యత పట్టణ ప్రజల ఆరోగ్యం. ఎప్పుడో మునిసిపాలిటీ ఏర్పడినప్పుడు ఏర్పాటుచేసిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు సిబ్బంది లేక, మందులు లేక కునారిల్లుతున్నాయి. ప్రజలు విద్యతో పాటు వైద్యం కూడా కొనుక్కోవలసి వస్తోంది. ఆఖరికి ప్రభుత్వ ఆసుపత్రులలో తిరిగి యూజర్ చార్జీలు ప్రవేశ పెడుతుంటే పాలక పార్టీ కాంగ్రెస్

అభ్యర్థులు కానీ, ప్రతిపక్ష తెలుగుదేశం అభ్యర్థులు గానీ ఆ విషయం ప్రస్తావించడం లేదు. అనంతపురం కార్పొరేషన్‌కు ఒక డాక్టర్ కూడా లేకపోవడం పార్టీలకు పట్టదు. దీని గురించి కూడా మాట్లాడరు. మూడవది మరుగు దొడ్లు. రైలు పట్టాలు, ఖాళీ స్థలాలు మరుగుదొడ్లుగా, నిత్యం రద్దీగా ఉండే రోడ్ల మూలలు మూత్ర శాలలుగా కొనసాగడం. ఈ సమస్యలు ఏ పార్టీలకు పట్టవు. ఎందుకంటే నాయకులకు ఈ సమస్య లుండవు. కాంట్రాక్టుల కోసం పోటీలు పడి సిమెంటు రోడ్లు వేయడానికి అత్యుత్సాహం ప్రదర్శించే ప్రజా ప్రతినిధులు పనులుండి ఇతర గ్రామాల నుంచి వచ్చే మహిళలు, పురుషులు లఘుశంక తీర్చుకోవడానికి కావల్సిన ఏర్పాట్ల విషయాన్ని మాత్రం పట్టించుకోరు.

మరొక ప్రధాన సమస్య తాగునీరు. ప్రజలు ప్రతిరోజూ నీటి పంపిణీకి పన్ను చెల్లిస్తున్నారు. కానీ మునిసిపాలిటీలు నిస్సిగ్గుగా రెండు రోజుల కొకసారి, కొన్ని చోట్ల వారానికి ఒకసారి అందిస్తు న్నాయి. పార్టీలు వీటి గురించి మాట్లాడవు.

పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్న మరొక సమస్య గ్రంథాలయాలు. పెరుగుతున్న పట్టణ విస్తీర్ణానికి అనుగుణంగా గ్రంథాలయాల్ని పెంచుతామని గాని, వాటి సౌకర్యాలు పెంచుతామని గానీ పార్టీలు ప్రస్తావించవు. ఎందుకంటే ప్రజలు సమాచారాన్ని, విజ్ఞానాన్ని పెంచుకోవడం వారికి ప్రాధాన్యంలేని అంశం. పైపెచ్చు ప్రమాదకరమైన అంశం.

ఇటీవలి కాలంలో అన్ని పట్టణాల్లో ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతోంది. ఆక్రమణదారుల చేతుల్లో రోడ్లు ఇరుకవుతున్నాయి. దీనికి తోడు రోడ్లు డివైడర్లు, ఐలాండులు ఏర్పాటుచేసి రోడ్లను మరింత ఇరుకుగా మారుస్తున్నారు. పాదచారులు రోడ్లలో నడవడానికి గానీ, రోడ్లను దాటడానికి గానీ ఏ విధమైన అనుకూలాలు లేవు. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని నడవాల్సిందే. వాహన సౌకర్యాలున్న నాయకులకు పాదచారుల సమస్యలు పట్టవు. ట్రాఫిక్ ఐలాండ్స్ కారణంగా ప్రధాన కూడళ్ళలో రోడ్లను దాటడం ప్రమాదకరంగా మారింది. తక్షణమే ఈ కూడలుల వద్ద జీబ్రా క్రాసింగ్ ఏర్పాటు చేయాలి.

అనంతపురంలో అశుభ్రత, అనారోగ్యం పెరగడానికి ప్రధానమైన కారణం పట్టణాన్ని మూడు భాగాలుగా విభజిస్తూ ప్రవహిస్తున్న మరువవంక మరియు నడిమి వంక. ఈ రెండు వంకలను శుభ్రం చేసి నీరు పారేలా చేస్తే అనంతపురంలో సగం మంది డాక్టర్లకు పనిలేకుండా పోతుంది. బహుశా డాక్టర్ల సంక్షేమం కోసమే ఏ పార్టీ కూడా ఈ వంకల ప్రస్తావన చేయడం లేదు. తక్షణమే వీటిని పరిశుభ్రం చేసే ప్రణాళికను పార్టీలు ప్రకటించాలి. అనంతపురం హైమాస్ లైట్లతో నిజంగా వెలగాలంటే ఈ పని తక్షణమే చేయాలి.

ఇలాంటి సమస్యలను ప్రస్తావించకుండా, వాటిని ఎప్పుడు పూర్తి చేయగలవో చెప్పకుండా ప్రకటించిన మ్యానిఫెస్టోలకు, ప్రకటనలకు అర్థమేమిటి? ఈ సమస్యల నేపథ్యంలో ప్రచారాలకొచ్చే అభ్యర్థులను, రాజకీయ పార్టీల నాయకులను ప్రజలు అడగవలసిన ప్రశ్నలు.

1. మేయర్లు, చైర్‌పర్సన్లు, కార్పొరేటర్లు, మెంబర్లు ప్రత్యక్షంగా కానీ, పరోక్షంగా కానీ కాంట్రాక్టర్లుగా అవతారమెత్తరాదు.
2. ప్రతి మునిసిపాలిటీలోనూ వచ్చే 5 సంవత్సరాల కాలంలో కనీసం 8 ప్రాథమిక పాఠశాలలు, 4 ఉన్నత పాఠశాలలు నెలకొల్పాలి. తగు సంఖ్యలో ఉపాధ్యాయులను నియమించాలి.



3. పందుల పెంపకందార్లకు, పందులకు ఊరిబయట సౌకర్యాలు కలిగించాలి.
4. పట్టణాల్లోని ప్రధాన కూడళ్ళలో మహిళలకు, పురుషులకు మూత్రశాలలు ఏర్పాటు చేయాలి. రోడ్లు దాటడానికి ప్రధాన సెంటర్లలో జీబ్రా లైన్లను ఏర్పాటుచేయాలి.
6. ప్రతి మునిసిపాలిటీలో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటుచేయాలి.
7. ప్రతి రోజూ తాగునీటి సరఫరా చేయాలి. అలా అందించలేని పక్షంలో నీటిపన్ను నీరు సరఫరా చేసే రోజులకు మాత్రమే వసూలు చేయాలి.
8. తక్షణం 100 పడకల ఆసుపత్రి నిర్మించాలి. కనీసం 5 మంది డాక్టర్లను శాశ్వత ప్రాతిపదికన నియమించాలి.
9. పట్టణాల్లో నివసిస్తున్న నిరుపేదలకు ఇళ్ళ పట్టాలను మంజూరుచేయాలి.
10. కడపను కార్పొరేషన్‌గా మార్చిన వెంటనే కోటి రూపాయలు అభివృద్ధికి మంజూరు చేసిన ప్రభుత్వం అనంతపురం కార్పొరేషన్‌కు ఎందుకు మొండిచేయి చూపుతోందో ప్రశ్నించాలి.

చివరగా గెలిచిన వారు ఎన్ని రోజులకొకసారి ఓట్లు వేసిన వారికి కనపడతారో, అసలు కనపడరో ముందుగానే అడిగి తెలుసుకోవడం మర్చిపోకండి.

**14-9-2005**

**అనంతపురం జిల్లా కమిటీ**

# నాయకులు నాయకులు కలిసి వార్డులు పంచుకుంటున్నారు!

## ప్రజలారా! పారాహుషార్..!

రాష్ట్రంలో మునుపెన్నడూ లేనంతగా మునిసిపల్ ఎన్నికల్లో అన్ని పార్టీలు తలమునకలుగా ఉన్నాయి. స్థానిక సమస్యల పరిష్కారానికి, కింది స్థాయిలో 'ప్రజాస్వామ్య' సంస్కృతి నెలకొల్పడానికి దోహదపడాల్సిన ఈ స్థానిక ఎన్నికలు సరిగ్గా అందుకు భిన్నమైన మార్గంలో పయనిస్తున్నాయి. బెదిరింపులు, ప్రలోభాలు, ఎత్తులు, పైయెత్తులు, జిత్తులతో 'ప్రజాస్వామ్య' భావనను ఎంతగా అవ హేళన చేస్తూ ముందుకు సాగుతున్నాయో విషయం ఈ మునిసిపల్ ఎన్నికలను పరిశీలిస్తే అర్థమౌతుంది.

ప్రొద్దుటూరు మునిసిపల్ ముఖచిత్రంలో పాతికేళ్ళుగా మనకు కనిపిస్తున్న ముఖ్యులు ఎం.వి. రమణారెడ్డి, వరదరాజుల రెడ్డిలు. ఇటీవలి కాలంలో లింగారెడ్డి కూడా. ఈ నాయకులు ఏ పార్టీలకు చెందిన వారన్న విషయానికి అంత ప్రాముఖ్యం లేదు. ఎందుకంటే ఎప్పుడు ఏ విధంగా అవసర మైతే ఆ విధంగా 'పార్టీలకు అతీతంగా' వ్యవహరించగల సమర్థులుగా ఇప్పటికే తమను తాము నిరూపించుకున్న వ్యక్తులు వీరు. వీరు ఒకే పార్టీలో ఉన్నా, వైరి పార్టీల్లో ఉన్నా ప్రొద్దుటూరుపై ఆధిపత్యం కోసం పోటీపడటమే వీరి ప్రధాన లక్ష్యం. ఇందుకోసం ఎక్కడికక్కడ 'బలవంతులతో సర్దుబాట్లు – బలహీనులపై దౌర్జన్యాలు' అన్న సూత్రాన్ని వీరందరూ అమలుపరుస్తున్నారని చెప్ప వచ్చు.

ఉదాహరణకు, 33వ వార్డు, 10వ వార్డుల్లో జరిగిన ఉదంతాలను చెప్పుకోవచ్చు. 33వ వార్డులో 'దేశం తరపున పోటీలో ఉన్న బి.సి అభ్యర్థి టైలర్‌బాబు కాంగ్రెసు వారి ప్రలోభాలకు, బెది రింపులకు లొంగి చివరి నిమిషంలో పోటీనుంచి తప్పుకున్నాడని 'దేశం' నేతలు నానా హంగామా చేశారు. లింగారెడ్డి మరో అడుగు ముందుకేసి 'పార్టీకి ఇంత ద్రోహం చేస్తావా' అంటూ ఆ టైలర్ బాబు చెంప ఛెళ్ళుమనిపించాడట. ఇంచుమించు ఇదే సమయంలోనే కాంగ్రెస్ పార్టీ ఛైర్మన్ అభ్యర్థిగా ప్రచారంలో ఉన్న ఇ.వి.సుధాకర్‌రెడ్డి భార్య 10వ వార్డులో ఏకగ్రీవంగా ఎన్నికైపోయింది. ఈ వార్డులో ఎం.వి.రమణారెడ్డి సూచనతో రత్నాలు, 'దేశం' టికెట్ ఆశించి విద్యావతి, లక్ష్మీ నరసమ్మలు, బి.జె.పి తరపున సుభాషిణిలు నామినేషన్లు వేశారు. సామ, దాన, భేద, దండోపాయా లను ప్రయోగించి అక్కడ ఇ.వి.సుధాకర్‌రెడ్డి తన భార్య ఎన్నికను ఏకగ్రీవం చేసుకున్నప్పటికీ ఏ ఒక్క నాయకుడూ నోరు మెదపలేదు. అలాగే 27వ వార్డులో జరిగిన సంఘటనను కూడా పేర్కొన వచ్చు. అక్కడ తన అనుయాయులుగా ఉన్నవారు వరదరాజులరెడ్డి వైపు మొగ్గు చూపుతున్నారన్న అనుమానంతో పల్లేటి నరసింహారెడ్డి తదితరులను లింగారెడ్డి నానా దుర్భాషలాడినట్టు పత్రికల్లో వార్తలొచ్చాయి. నిన్నగాక మొన్న అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ విధానాలకు కట్టుబడకుండా రెబెల్ అభ్యర్థిగా పోటీచేసి, సస్పెన్షన్‌కు గురైన లింగారెడ్డి, రాబోయే ఎన్నికల్లో ఏ పార్టీ తరపున రంగంలో ఉంటాడో తనకే తెలియని ఎం.వి.రమణారెడ్డిలు పార్టీ క్రమశిక్షణ గురించి, నీతి నియమాల గురించి



వాపోవడమే కాదు, టైలర్ బాబులాంటి అర్భకులపై చేయికూడా చేసుకోగలరు. ఇలాంటి ద్వంద్వ ప్రమాణాలు పాటించే విషయంలో ఈ 'దేశం' నాయకులకు వరదరాజుల రెడ్డి కూడా ఏమాత్రం తీసిపోడు.

ప్రొద్దుటూరులో శాంతిస్థాపనార్థం అవతరించిన నాయకునిగా ప్రచారం పొందుతూ మరోవైపు బ్యాంక్ లూటీలు, దొంగతనాల కేసుల్లో నిందితులను, జనాన్ని మోసం చేసి కోట్లకు ఐ.పి.లు పెట్టేవారిని వెనకేసుకొస్తూ పంచాయతీలు చేసే (పట్టణంలో నాగమల్లయ్య ఐ.పి. ఉదంతం ఇందుకు తాజా ఉదాహరణ) వారిని మునిసిపల్ రాజకీయాల్లోకి ప్రమోట్ చేస్తున్నాడు. స్త్రీలపట్ల అన్యాయంగా ప్రవర్తించే వారు, బ్రాందీ షాపుల సిండికేట్ దారులు, ఎంతటి కిరాతకాలనైనా డబ్బుతో మసిపూసి మారేడుకాయ చేయగల ధనిక, కులపెద్దలు ఈయన ఆస్థానంలో ముఖ్యులు. వరుస విజయాలతో ప్రొద్దుటూరు పట్టణంపై తన ఆధి పత్యాన్ని నెలకొల్పుకున్న ఈయనకు ప్రస్తుతం వై.ఎస్ ముఖ్యమంత్రిగా ఉండటం అదనపు సౌకర్యంగా చెప్పవచ్చు. ఈ కారణంగానే 'దౌర్జన్యం' కంటికి కనిపించకుండా కేవలం మాట బెదిరింపులతోనే పనులు చక్కబెట్టుకుంటున్నాడు. మునిసిపల్ ఎన్నికల సందర్భంగా పట్టణంలో అభ్యర్థుల ఉపసంహరణలన్నీ కాంగ్రెస్‌కే అనుకూలంగా జరగడం ఇందుకు తార్కాణం.



ఈ నేపథ్యంలో ప్రత్యామ్నాయ శక్తిగా కాకున్నా, ఒక మేరకు తమ గొంతును వినిపిస్తా రనే ఆశలపై కమ్యూనిస్టులు కూడా నీళ్ళు గుమ్మరించారు. ఎన్నికల పొత్తులో భాగంగా వీరు రెండు సీట్లు అడిగారట. కాంగ్రెస్ వారు ఎస్సీలకు రిజర్వు అయిన 7వ వార్డు సీటు ఇచ్చేందుకు అంగీకరించారట. అక్కడ సిపిఐ వారు హజరయ్య అనే వ్యక్తిని నిలిపారట. ఈలోగా పొత్తు ఉన్నప్పటికీ 'పొరపాటున' కాంగ్రెసు వారు కూడా అక్కడ తమ అభ్యర్థికి బి.ఫారం ఇచ్చారట. నామినేషన్ వేసినప్పటి నుంచి అక్కడ సిపిఐ అభ్యర్థి పత్తాలేకుండా పోవడం కొసమెరుపు. ఇప్పుడు కాంగ్రెస్ అభ్యర్థే పోటీలో ఉన్నారు.

మరో జాతీయ పార్టీ అయిన బి.జె.పి పరిస్థితి కూడా ఇందుకు భిన్నంగా లేదు. 'పంచ పాండవులు మంచంకోళ్ళలా ...' అన్న సామెతను జ్ఞప్తికి తెస్తున్నారు. మొత్తం 13 వార్డుల్లో ఈ పార్టీ అభ్యర్థులు నామినేషన్లు వేసి, నలుగురు విరమించుకోగా 9 మంది బరిలో ఉన్నారు. వీరిలో సీరియస్ పోటీదారులు ముగ్గురైతే మిగతా వారంతా 'ఆటలో అరటిపండ్లు' లాంటి వారు.

ఇంకా ఎన్నికల ప్రక్రియ ప్రచార దశలోనే ఉంది. అయినా ఇన్ని రకాల ఆధిపత్య, అవకాశవాద విన్యాసాలు ప్రదర్శిస్తున్నారు. 40వ వార్డులో తనకు మద్దతు ఇస్తే ఇకపై పోలీసులతో ఎలాంటి ఇబ్బంది లేకుండా మట్కా కంపెనీ నడుపుకునే వెసులుబాటు కల్పిస్తా మని ఒక వీధి నాయకునితో ఒప్పందం కుదుర్చుకున్నట్టు వినికిడి. మోడంపల్లె ప్రాంతంలో ఒక క్రికెట్ బుకీకి కౌన్సిలర్ టికెట్ ఇచ్చి రంగంలో నిలిపారు. పోలింగ్ పూర్తయి, కౌన్సిలర్లు ఛైర్మన్‌ను ఎన్నుకునే లోపు ఈ నాయకుల 'సాము – గరిడీలు' చాలానే చూడాల్సి వచ్చే టట్టుంది.

పాతికేళ్ళ నుంచీ మునిసిపల్ పరిధిలో తవ్విన కాల్వలనే తవ్వుతూ, వేసిన రోడ్లనే వేస్తూ ప్రజా సేవలోకి వేరే వారినెవ్వరినీ వేలు పెట్టనీయని వీరి ఘనత ఎంత చెప్పుకున్నా తనివి తీరదు. పట్టణంలో ప్రతి వీధిలోనూ ఉన్న రోడ్డుపైనే కొత్త రోడ్లను వేసుకుంటూ 'కాంట్రాక్టర్ కమ్ కౌన్సిలర్' తరహా ప్రజాసేవ కారణంగా సామాన్యుల ఇళ్ళన్నీ లోతట్టు ప్రాంతాలుగా మారిపోయాయి. ఇలా పదే పదే రోడ్లు వేస్తూ పోవడంతో లక్షలు ఖర్చుచేసి తమ ఇళ్ళను తామే పడగొట్టుకుని మళ్ళీ కట్టుకోవాల్సిన దుస్థితిలోకి ప్రజలను నెట్టివేస్తున్న 'ప్రజాసేవ' వీరిది. ప్రతి ఎలక్షన్‌లోనూ లక్షలు, కోట్లు ఖర్చు చేస్తున్నా ... ఎన్నిక ఎన్నికకూ వన్నె తగ్గని ఆస్తులు వీరివి.

రాజకీయాలు తాము నడుపుతూ కాలేజీలు, కాంట్రాక్టులు తమ కొడుకులకు వదిలివేస్తున్న అనువంశిక ఆచరణ వీరిది. పట్టణ సంపదలో భాగ పరిష్కారాలకోసం ఎన్నికల్లో ఎంతగా తిట్టుకున్నా, కొట్టుకున్నా, ఫాక్షన్‌లు నడిపినా అభాగ్య అనుచరులే తప్ప సొంత మనుషులెవ్వరూ చావని 'అహింసా' మార్గం వీరిది. పట్టణం వెంబడి పారే పెన్నలోని ఇసుకను, ఇసుకలోని నీటిని పిండుకునే నేర్పరితనం వీరిది. పట్టణం చుట్టుపక్కల పది మందికి ఉపాధి కల్పించే ఫ్యాక్టరీలను పాతికేళ్ళలో 'వట్టి ఆవులుగా' మార్చేసి మిల్లులంత ఇళ్ళలో 'తిలా పాపం తలా పిడికెడు' తింటున్న వీరు ప్రజాసేవ ముసుగులో మళ్ళీ మన ముందుకొస్తున్నారు. కొత్తగా మునిసిపాలిటీలకు అమరిన నిధుల 'పొంగు' అందినంత మింగేందుకే ఈ తపనంతా. మరి వీరి ఆధిపత్యాన్ని, ఆగడాలను నిలువరించేందుకు ప్రజలకు ఎలాంటి ప్రత్యామ్నాయమూ లేదా? మనం ఇలా చూస్తూ ఉండాల్సిందేనా? ప్రజల ప్రతిఘటన ఉంటే తప్ప ఈ పరిస్థితుల్లో మార్పురాదు. ఎన్నికల్లో ఒక్కసారి గెలిస్తే చాలు. సంవత్సరాల తరబడి అన్ని రకాల ఆదాయాలనూ ప్రజాసేవ ముసుగులో కొల్లగొట్టే వీలుండబట్టే ఈ నాయకులు ఎన్నికల్లో ఇంతగా తెగబడుతున్నారు. ప్రజాస్వామ్యానికి ప్రతీకగా నిలవాల్సిన ఎన్నికలను ఇన్ని రకాలుగా భ్రష్టు పట్టిస్తున్న ఈ నాయకుల ఆగడాలను ఎక్కడికక్కడ చర్చించడం, ప్రశ్నించడం, నిలదీయడం ద్వారానే ప్రత్యామ్నాయ రాజకీయాలను, విలువలను, సంస్కృతిని మనం నిర్మించ గలం.

**సెప్టెంబర్, 2005**
**కడప జిల్లా కమిటీ**





## సమాన విద్యావకాశాలకు

# సుప్రీంకోర్టు కూడా ఆటంకమైతే ఎలా?

ప్రైవేట్ వృత్తి విద్యా సంస్థలు రిజర్వేషన్లు ఇవ్వనక్కరలేదంటూ సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పు చాలా ఆగ్రహానికీ, అలజడికీ దారితీసింది.

ఆ ఆగ్రహాన్నీ, అలజడినీ చూసిన దేశ ప్రధాన న్యాయమూర్తి అలిగి, 'మా ధర్మం మేము నిర్వర్తిస్తున్నాం. మీకు మా తీర్పులు నచ్చకపోతే కోర్టులను మూసేసి మీ యిష్టం వచ్చినట్టు పరిపాలించుకోండి' అన్న సంగతి కూడ పత్రికలలో చూశాం. 'అయినా మేం ఏమన్నామని మా మీద ఇంత కోపం? ప్రైవేట్ వృత్తి విద్యా సంస్థలు రిజర్వేషన్లు ఇవ్వాలను కుంటే దానికి చట్టం చేయండి అన్నామంతే. మీరు చట్టం చేయలేక కోర్టులను ఆడిపోసు కోవడం ఎందుకు?' అని కూడ దేశ ప్రధాన న్యాయమూర్తి అన్నట్టు పత్రికలలో వచ్చింది.

ప్రధాన న్యాయమూర్తిగారు ఈ ప్రవచనాలు మౌఖికంగా అన్నవే తప్ప ఏ తీర్పులోనూ భాగం కాదు కాబట్టి పత్రికలలో ప్రచురించినవే ఆయన వాడిన మాటలా అని కచ్చితంగా చెప్పలేముగానీ రెండు విషయాలు మాత్రం కచ్చితంగా చెప్పగలం. పాలనా వ్యవస్థ మీద, చట్ట సభల మీద న్యాయస్థానాలు తమకు సందర్భోచితం అని తోచినప్పుడు తీవ్రమైన వ్యాఖ్యలు చేయడం చాలా కాలంగా చూస్తూనే ఉన్నాం. బూటాసింగ్ వ్యవహారంలో గవర్నర్ల వ్యవస్థ గురించి కూడ సుప్రీంకోర్టు నిక్కచ్చిగా వ్యాఖ్యానించడం చూశాం. మరి న్యాయ స్థానాల తీరును సందర్భోచితం అని తోచినప్పుడు అంతే తీవ్రంగా విమర్శించే స్వేచ్ఛ చట్టసభలకూ పాలనా యంత్రాంగానికీ ఎందుకు ఉండదు? ఈ వ్యవస్థలలో ఒకటి ఎక్కువ, ఒకటి తక్కువ అని రాజ్యాంగంలో ఎక్కడా చెప్పలేదే. ఇక ప్రజల మాటకొస్తే, రాజ్యాంగానికి మూలం ప్రజలే కాబట్టి మూడు వ్యవస్థలనూ స్వేచ్ఛగా విమర్శించే హక్కు ప్రజలకెందుకు ఉండదు?

రెండు, 'మేం ఏమన్నాం' అంటూ దేశ ప్రధాన న్యాయమూర్తి ఇచ్చిన వివరణ నిజమే అయితే చాలా దురదృష్టకరమని భావించవలసి ఉంటుంది. ఆయన తెలిసీ దేశాన్ని తప్పు దోవ పట్టిస్తున్నారని భావించవలసి ఉంటుంది. ప్రైవేట్ వృత్తి విద్యా సంస్థలు ఎస్‌సి, ఎస్‌టి, బిసి కులాలకూ, స్త్రీలకూ, వికలాంగులకూ రిజర్వేషన్లు ఇవ్వాలని ప్రభుత్వం కోరు కున్నట్టయితే దానికొక చట్టం చేయవలసి ఉంటుంది అని మాత్రమే సుప్రీంకోర్టు అని ఉంటే ఎవరికయినా ఎందుకు కోపం వస్తుంది? ఏ ప్రైవేట్ వ్యాపారంపైన అయినా ఏ ఆంక్షలయినా ప్రభుత్వం పెట్టదలచుకుంటే అది చట్టం ద్వారా చేయవలసిందేనని రాజ్యాం గాన్ని ఎరిగిన వారందరికీ తెలుసును. ఆ మాటే సుప్రీంకోర్టు అని ఉంటే కోపాలెందు కొస్తాయి? సుప్రీంకోర్టు అనింది అదికాదు. ప్రభుత్వం నుండి 'ఎయిడ్' (నిధులు) పొందని ప్రైవేట్ విద్యా సంస్థలు రిజర్వేషన్లు పాటించనే అక్కరలేదనీ, వారు పాటించాలనడం రాజ్యాంగ విరుద్ధమనీ అనింది.

‘ఎయిడ్ (ప్రభుత్వ నిధులు) పొందని ప్రైవేట్ వృత్తివిద్యా సంస్థలు ప్రభుత్వం సూచించిన వారికి సీట్లు ఇవ్వాలనడం గానీ, రిజర్వేషన్ విధానాన్ని పాటించాలనడం గానీ వారి హక్కులపైన, స్వయంప్రతిపత్తి పైన తీవ్రమైన దాడి.’

‘దీని అర్థం ఆ సీట్లను ప్రభుత్వం జాతీయం చేసిందని. ప్రైవేట్ విద్యా సంస్థలలో సీట్లను జాతీయం చేయడం చెల్లదని ఈ కోర్టు ఎప్పుడో స్పష్టం చేసింది.’

‘వృత్తి విద్యా సంస్థలు నెలకొల్పడానికి అవసరమైన నిధులు ప్రభుత్వం వద్ద లేవు. అలాంటప్పుడు మెరుగైన వృత్తి విద్య కల్పించడానికి ప్రైవేట్ రంగంలో ముందుకొచ్చిన వారు ప్రభుత్వ రిజర్వేషన్ విధానాన్ని అనుసరించి ప్రతిభ తక్కువ ఉన్న విద్యార్థులకు సీట్లు ఇవ్వాలని బలవంతం చేయడం తగదు.’

ఇవీ సుప్రీంకోర్టు మొన్న (ఇనాందార్ వర్సస్ స్టేట్ ఆఫ్ మహారాష్ట్ర కేసులో) అన్న మాటలు. ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు రాజ్యాంగ విరుద్ధం అయినట్టయితే, దానికొక చట్టం చేస్తే ఎంత, చేయకపోతే ఎంత?

ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు నిజంగా రాజ్యాంగ విరుద్ధమా అన్న ప్రశ్నను పక్కనపెడదాం. నిజానికి ఏ వ్యాపారం మీదనయినా ప్రజా సామాన్యం ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని సహేతుకమైన పరిమితులు విధించవచ్చునని రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(6)లో చెప్తుంది. ‘ప్రజా సామాన్యం ప్రయోజనాలు’ అనేది చాలా విస్తృతమైన ప్రయోగమనీ, రాజ్యాంగ ఆదేశిక సూత్రాల అమలు కూడ దాని కిందికి వస్తుందనీ సుప్రీంకోర్టు పలుమార్లు వ్యాఖ్యానించింది. సామాజిక న్యాయం రాజ్యాంగ ఆదేశిక సూత్రాల సారాంశం కాబట్టి సామాజిక న్యాయం కోసం ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు కల్పించడానికి ప్రభుత్వం ఒక చట్టం చేస్తే అది తప్పక రాజ్యాంగబద్ధమే అవుతుంది.

అదట్లాగుంచి, తప్పో ఒప్పో తన అభిప్రాయం ప్రకటించడానికి సుప్రీంకోర్టు ఎంచుకున్న పద్ధతి సరయినదా? నిజమే ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు కల్పించాలన్న చట్టమేదీ ప్రభుత్వం ఇప్పటిదాకా చేయలేదు. చట్టం చేసి వుంటే, దానినెవరయినా సవాలు చేసి ఉంటే, రిజర్వేషన్ పొందవలసిన వర్గాలు కూడా ఆ వ్యాజ్యంలో భాగమై తమ తరపున న్యాయవాదులను పెట్టుకుని ఉందురు. అప్పుడు అందరి అభిప్రాయాలూ విని సుప్రీంకోర్టు తన అభిప్రాయం ప్రకటించి ఉంటే, ఆ అభిప్రాయంతో ఏకీభవించినా, లేకున్నా అత్యున్నత న్యాయస్థానం ఒక పద్ధతి ప్రకారం నడుచుకుందని అందుము.

ఇప్పుడది ఏదీ లేదే! ‘ఎయిడ్’ పొందని ప్రైవేట్ వృత్తివిద్యా సంస్థలపైన ప్రభుత్వానికి ఉండే అజమాయిషీ ఎంత అనే అంశం మీద వ్యాజ్యం సుప్రీంకోర్టు ముందుకొచ్చింది. 2002లో 11 మంది న్యాయమూర్తుల ధర్మాసనం దానిమీద తీర్పు ఇచ్చింది. (దీనిని టిఎంఎ పాయ్ కేసు అంటారు) ఆ తీర్పులో కొన్ని ముఖ్యమైన విషయాలు అస్పష్టంగా ఉన్నాయని సుప్రీంకోర్టుకే అనిపించడం వల్ల ఆ అస్పష్టమైన వాక్యాలను స్పష్టపరచడానికి 2003లో అయిదుగురు జడ్జిల ధర్మాసనం కూర్చునింది. (ఇస్లామిక్ అకాడమీ కేసు) ఈ తీర్పు కూడా స్పష్టపరచవలసింది పోయి వక్రీకరించిందన్న ప్రైవేట్ విద్యా సంస్థల అభియోగంలో న్యాయం ఉందని సుప్రీంకోర్టుకే మళ్లీ



అనిపించి, ఆ స్పష్టీకరణ సరయినదా కాదా అని తేల్చడానికి ఏడుగురు జడ్జిల ధర్మాసనం పూనుకుంది. (ఇనాందార్ కేసు) ఆ తీర్పే మొన్న రచ్చకు దారితీసింది. ఈ మొత్తం వ్యాజ్యంలో ప్రైవేట్ విద్యా సంస్థలు, ప్రభుత్వమూ మాత్రమే పార్టీలు. వారికి రిజర్వేషన్లు ఇవ్వడం ఇష్టం లేదు, వీరికీ ఇప్పించాలని పెద్దగా ఆసక్తి లేదు. వారిద్దరి వాదనలూ విని ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు రాజ్యాంగ విరుద్ధం అని ఏడుగురు న్యాయమూర్తుల ధర్మాసనం ప్రకటించేయడం ఏం న్యాయం? రిజర్వేషన్లు డిమాండ్ చేస్తున్న సామాజిక వర్గాలు వ్యాజ్యంలో భాగం కాదు, వారి వాదనలు కోర్టు వినలేదు. విని ఉంటే పైన మేము రెండు వాక్యాలలో ప్రతిపాదించిన వాదన వివరంగా చేసి ఉందురు. ఆ అవకాశమే లేకుండ వారి ఆకాంక్షమీద నీళ్లు గుమ్మరించడం కోపం తెప్పించదా? చేసిన పని చేసేసి, ‘మా తీర్పులు నచ్చకపోతే కోర్టులు మూసేయండి’ అంటూ అలగడం ఎందుకు?

## విద్యా రంగం ప్రైవేటీకరణ - కోర్టులు

ప్రపంచీకరణ, ఆర్థిక సంస్కరణలలో భాగంగా ఒక దశాబ్ద కాలంగా దేశంలో వేగంగా పెరుగుతున్న విద్యారంగ ప్రైవేటీకరణ పట్ల సుప్రీంకోర్టు అనుసరిస్తున్న వైఖరిని మొత్తంగా చూసినప్పుడు ఈ తీర్పు పెద్దగా ఆశ్చర్యం కలిగించదు. విద్యను వ్యాపారం చేయడానికి వీలులేదన్న అభిప్రాయం నుండి సుప్రీంకోర్టు ఇప్పటిదాకా పక్కకు తొలగలేదు. అయితే ప్రైవేట్ విద్యా సంస్థలు చేస్తున్నది వ్యాపారం అన్న విషయం స్పష్టంగా కనిపిస్తున్నప్పటికీ దానిని చూడడానికి కోర్టుకు మనస్కరించడంలేదు.

విద్యా సంస్థలను నెలకొల్పడం వ్యాపారం కిందికి రాదనీ అదొక వ్యాపకం అనీ సుప్రీంకోర్టు అంటుంది. ఆ వ్యాపకం వ్యాపారంగా మారిపోయినా దానిని వ్యాపకంగానే చూస్తానంటుంది. వ్యాపారమో వ్యాపకమో, దానిని సామాజిక ప్రయోజనాల దృష్ట్యా నియంత్రించే అధికారం ప్రభుత్వానికి ఉంటుందని సూత్రప్రాయంగా ఒప్పుకుంటుంది. కానీ ‘మేము స్వంత నిధులతో సంస్థను నిర్వహిస్తున్నప్పుడు మా వ్యవహారాలలో జోక్యం చేసుకోవడానికి ప్రభుత్వానికేం అధికారం ఉంది?’ అన్న వారి వాదనను నిర్ద్వంద్వంగా తిరస్కరించదు. తిరస్కరించకపోగా చాలా సానుభూతితో చూస్తుంది.

ఈ అస్పష్ట వైఖరి నుండే అస్పష్టమైన తీర్పులు వెలువడుతున్నాయి. లేకపోతే 2002లో 11 మంది జడ్జిలు ఇచ్చిన తీర్పును 2003లో అయిదుగురు జడ్జిలు కూర్చొని స్పష్టీకరించవలసి రావడం, ఆ స్పష్టీకరణ సరిగ్గా ఉందా లేదా అని 2003లో ఏడుగురు జడ్జిలు పరిశీలించవలసి రావడం జరిగేది కాదు. న్యాయస్థానాల పట్ల ఇంకా గౌరవం ఉండబట్టి సరిపోయిందిగానీ లేకపోతే ప్రజలు సుప్రీంకోర్టును హాస్యం పట్టించి ఉందురు. మంచి తీర్పులిస్తారో చెడ్డ తీర్పులిస్తారో కనీసం వాటిని స్పష్టంగానయినా రాయలేరా అని అడిగితే ‘అత్యున్నత’ న్యాయమూర్తులు ఏం జవాబు చెప్తారు? ఒక్కొక్కసారి ఒక తీర్పు ఇచ్చిన తరువాత 20 లేక 30 సంవత్సరాలకు మారిన పరిస్థితులలో దానిని సక్రమంగా అన్వయించడానికి పునఃపరిశీలించవలసిన అవసరం వస్తుంటుంది. కానీ మూడేళ్లలో రెండుసార్లు పునఃపరిశీలించవలసి వచ్చే తీర్పును ఏమనాలి? చట్టాలు, ప్రభుత్వ తాఖీదులు

అస్పష్టంగా ఉంటే న్యాయస్థానాలు ప్రభుత్వాల పైన విరుచుకు పడుతుంటాయి. మీరు ఏం చెప్ప దలచుకున్నారో మీకే తెలీదా అని అభిశంసిస్తుంటాయి. ఇప్పుడు ఆ ప్రశ్నే సుప్రీంకోర్టును అడగ నక్కరలేదా?

మూడేళ్లలో రెండుసార్లు పునఃపరిశీలించిన తరువాతయినా అస్పష్టత తీరిందా అంటే తీర లేదు. ఇంకొక సంవత్సరం తిరిగేలోపల తొమ్మిది మంది జడ్జిలు కూర్చొని ఇనాందార్ కేసులో ఇస్లామిక్ అకాడమీ కేసు తీర్పుపైన చేసిన వ్యాఖ్యలను పునఃపరిశీలించినా, 13 మంది జడ్జిలు కూర్చొని టిఎంఎ పాయ్ కేసు తీర్పునే పునఃపరిశీలించినా ఆశ్చర్యపోవద్దు. నిక్కచ్చిగా మా అభి ప్రాయం చెప్పాలంటే 'విద్యను వ్యాపారం చేసుకోవచ్చు. దానిలో తప్పేమీ లేదు' అని సుప్రీంకోర్టు నిర్మొహమాటంగా ప్రకటించే దాకా ఈ ప్రహసనం సాగుతూనే ఉంటుంది. ఒకదాని తరువాత ఒకటి వెలువడుతున్న తీర్పులు ఆ దిశనే చూపిస్తున్నాయి.

ప్రస్తుతానికి 11+5+7 మంది జడ్జిలు తర్కించి తర్కించి ఒక విషయం మాత్రమే స్పష్టం చేశారు. ప్రైవేట్ విద్యా సంస్థలు రిజర్వేషన్లు ఇయ్యనక్కరలేదని, విద్యార్థుల విద్య హక్కుకు కీలకమైన మరి రెండు విషయాలు ఇనాందార్ కేసు తరువాత కూడ అస్పష్టంగానే ఉండిపోయాయి. ఒకటి ఫీజు పరిమాణం, రెండు అడ్మిషన్ల పద్ధతి.

విద్యాభ్యాసం కల్పించడం వ్యాపకమే తప్ప వ్యాపారం కాదు కాబట్టి లాభాలు దండుకోకూడదు గానీ, ఖర్చులు వసూలు చేసుకోవచ్చునని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. 'ఖర్చులు' అనే దానిలో ప్రస్తుత వ్యయమే కాక రాబోయే రోజులలో సంస్థ విస్తరణ కోసం, మెరుగుదల కోసం పెట్టబోయే వ్యయాన్ని కూడ లెక్కించవచ్చునని స్పష్టం చేసింది. ఈ భవిష్యత్ వ్యయం ఎంత ఉండవచ్చునో నిర్ణ యించే పద్ధతిని నిర్దేశించడానికి ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు (లేక కేంద్ర ప్రభుత్వం) చట్టం చేయ వచ్చునని అంటూ, అప్పటిదాకా ప్రతీ రాష్ట్రంలోనూ ఒక రిటైర్డు హైకోర్టు జడ్జి నేతృత్వంలో ఒక కమిటీ వేయాలని చెప్పింది. కానీ 'భవిష్యత్ విస్తరణ వ్యయం' పేరిట వసూలు చేసిన ఫీజును దాని కోసం ఖర్చుచేయక వ్యాపార లాభంగా జేబులో వేసుకుంటే చూసేదెవరు? చూసినా చేయగలిగిందే ముంది? బలవంతంగా సంస్థ విస్తరణ చేయిస్తారా, లేక పాత విద్యార్థులకు పైసలు వెనక్కి ఇప్పి స్తారా? ఇవి ఆచరణ సాధ్యం అయిన విషయాలా? ఈ ప్రశ్నలకు మూడు తీర్పులలోనూ జవాబు లేదు. భవిష్యత్ విస్తరణ వ్యయం పేరిట, కూడదు కూడదంటున్న వ్యాపార లాభాలకు సుప్రీంకోర్టు తలుపులు తెరిచి ఉంచిందని వ్యాఖ్యానిస్తే అబద్ధం అవుతుందా?

ప్రైవేట్ విద్యా సంస్థలలో అడ్మిషన్ల పద్ధతి ఏవిధంగా ఉండాలనేదీ ఇప్పటికీ అస్పష్టంగానే ఉంది. ఇక మీదట ప్రభుత్వం ఎంసెట్ పరీక్ష నిర్వహించి కౌన్సెలింగ్ జరిపి ప్రైవేట్ ఇంజనీరింగ్, మెడికల్ కాలేజీలకు విద్యార్థులను కేటాయిస్తుందా, లేక వేరే ఏదయినా అడ్మిషన్ పద్ధతి అమలవు తుందా? అనేది విద్యార్థులను ఆదుర్దాకు గురిచేస్తున్న ప్రశ్న. టిఎంఎ పాయ్ కేసు తీర్పునూ దానిని వ్యాఖ్యానించిన ఇస్లామిక్ అకాడమీ కేసు తీర్పునూ దానిని పునఃపరిశీలించిన ఇనాందార్ కేసు తీర్పునూ ఆద్యంతం చదివినవారు చెప్పగల జవాబు 'ఏమో తెలీదు' అని మాత్రమే.

ప్రభుత్వం నుండి నిధులు పొందని ప్రైవేట్ వృత్తి విద్యా సంస్థలకు విద్యార్థులను అడ్మిట్ చేసు కునే విషయంలో స్వేచ్ఛ ఉండాలని అన్నారు. వారికి బుద్ధిపుట్టిన విద్యార్థులను అడ్మిట్ చేసుకో





వచ్చునని అన్నారు. అయితే అడ్మిషన్ పద్ధతి న్యాయబద్ధంగా, పారదర్శకంగా ఉండా లన్నారు. విద్యా ప్రమాణాలను గౌరవించాలని అన్నారు. ఈ మేరకు నియమాలు నిర్దేశించే అధికారం ప్రభుత్వానికి ఉంటుందన్నారు. అడ్మిషన్లు పారదర్శకంగా, న్యాయబద్ధంగా ఉండాలంటే అందరూ పోటీపడగల ఉమ్మడి ప్రవేశ పరీక్ష జరిపి అందులో పొందిన ర్యాంకులను ప్రమాణంగా తీసుకోవడమే సరయిన పద్ధతి అన్నారు. ఈ ఉమ్మడి ప్రవేశ పరీక్షను ప్రైవేట్ వృత్తి విద్యా సంస్థలు కలిసి ఉమ్మడిగా నిర్వహించుకోవచ్చునన్నారు. అందరూ కలిసి ఒకటే నిర్వహించనక్కరలేదన్నారు. ఆయా సంస్థలలో ఇచ్చే స్పెషలైజేషన్లను బట్టి ఒక కోవకు చెందిన సంస్థలన్నీ కలిసి ఒక ఉమ్మడి ప్రవేశ పరీక్ష నిర్వహించవచ్చు నన్నారు. ఈ ప్రవేశ పరీక్షలు సక్రమంగా జరిగేటట్టు ప్రభుత్వం పర్యవేక్షించవచ్చునన్నారు. లేదా ప్రభుత్వమే ఉమ్మడి ప్రవేశ పరీక్ష నిర్వహించవచ్చునన్నారు. (అదీ ఇదీ రెండూ జరగ వచ్చా? తెలీదు) ఈ ప్రవేశ పరీక్ష(ల?)లో లభించిన ర్యాంకులను గౌరవిస్తూ వివిధ సంస్థల యాజమాన్యాలు తమకు ఇష్టమొచ్చిన వారికి స్వేచ్ఛగా అడ్మిషన్ ఇయ్యవచ్చునన్నారు.

ఇంతకూ అడ్మిషన్లు ఏవిధంగా జరగబోతాయో మీకు అర్థం అయిందా? మాకయితే కాలేదు. ఒక విషయం మాత్రం మాకే కాదు, మీకు కూడ అర్థం అయి వుండాలి. దీనిమీద లిటిగేషన్ విపరీతంగా జరగబోతుంది. తొమ్మిది మంది జడ్జిలు కూర్చొని ఇనాందార్ కేసును మరొకసారి వ్యాఖ్యానించడమో, 13 మంది కూర్చొని టిఎంఎ పాయ్ కేసు తీర్పునే తిరగరాయడమో జరుగుతుంది. 'విద్యా వ్యాపారంలో తప్పేమీ లేదు' అన్న అధికారిక ప్రకటన అత్యున్నత న్యాయస్థానం నుండి వెలువడేదాకా ఈ తీర్పులు, వ్యాఖ్యానాలు, పునః పరిశీలనలు సాగుతూనే ఉంటాయి.

అన్ని స్థాయిలలోనూ విద్యావకాశాలు అందరికీ సమానంగా దక్కాలన్న హక్కు కోసం ప్రభుత్వాల మీద, సమాజంలోని పెత్తందారీ కులాలు, వర్గాల మీదే కాక కోర్టుల మీద కూడా పోరాటం చేయవలసిన రోజు వచ్చిందని మాత్రం అందరూ గుర్తిస్తారనీ, దానికి తగిన సామాజిక, రాజకీయ కార్యాచరణ ప్రజాతంత్ర శక్తులు రూపొందించుకుంటారనీ ఆశిస్తాం.

**20-10-2005**

## చుండూరు విచారణ

# అగ్రకుల దురహంకారాన్ని హైకోర్టు మన్నించడం లజ్జాకరం

**చుం**డూరు కేసు విచారిస్తున్న జడ్జి డా. ప్రభాకరరావు గారిని ముద్దాయిల కోరిక మేరకు ఒంగోలుకు బదిలీ చేసిన సంగతి అందరికీ ఈ పాటికి తెలిసే ఉంటుంది.

ఆ బదిలీ ఎంతటి లజ్జాకరమైన పరిస్థితులలో జరిగిందో ప్రజలకు తెలియచెప్పడం అవసరం అని మేము భావిస్తున్నాము. బదిలీ చేసింది హైకోర్టే అయినప్పటికీ మేము ఈ మాట అంటున్నాము.

ప్రభాకర్‌రావుగారు కులం రీత్యా దళితుడు. దళిత కులస్థుడైన న్యాయమూర్తి కేసు విచారిస్తే, తమకు న్యాయం జరగదని అగ్ర కులస్తులైన చుండూరు కేసు ముద్దాయిలు భావించారు. దాదాపు అదేమాట ఆయనతోను అన్నారు. హైకోర్టుకూ చెప్పారు. బదిలీ అయి వెళ్ళిపోవడం తన మన శ్శాంతికి క్షేమకరం అని ఆయనకే అనిపించేటట్టు చేశారు. ఆయనను బదిలీ చేయకపోతే తమ తరఫున కేసు నిర్వహించడానికి లాయర్లే దొరకరని బెదిరించారు. కేసు చేస్తున్న లాయర్లంతా పక్కకు తప్పుకుంటారని ముద్దాయిలు బెదిరించడమే కాదు, వారి లాయర్లు బెదిరించారు. తమ ప్రమేయం లేకుండా ఏకపక్షంగా కేసును నడుపుకుంటారో లేక జడ్జిని బదిలీ చేస్తారో నిర్ణయించు కోండని సవాలు విసిరారు.

ఇదంతా చేసి తమ కోరిక సాధించుకున్నారు. జడ్జిని హైకోర్టు బదిలీ చేసేసింది. అందుకే ఈ బదిలీని 'లజ్జాకరం' అంటున్నాం. చేసింది హైకోర్టే కావచ్చు అయినప్పటికీ అంటున్నాం.

చుండూరు మారణకాండ గురించి మేము ప్రజలకు కొత్తగా జ్ఞాపకం చేయవలసిన పని లేదు. 1991 ఆగస్టు 6వ తేదీన చుండూరుకు, పరిసర గ్రామాలకు చెందిన అగ్రకులస్తుల గుంపు ఆ ఊరి దళితవాడపైన పట్టపగలు దాడి చేసి ప్రజలను తరిమారు, కొట్టారు, నరికారు, చంపారు.

14 సంవత్సరాలైనా కేసు విచారణ పూర్తికాకపోవడానికి హత్య చేసిన దుండగులే ప్రధాన కారణం. హతులు దళితులు కారనీ క్రైస్తవులనీ అందువల్ల ఎస్.సి., ఎస్.టి చట్టం వర్తించదని ఒకసారి కోర్టుకెక్కారు. ఆ కేసు ఓడిపోయిన తరువాత ఎస్.సి., ఎస్.టి. ప్రత్యేక కోర్టు చుండూరు లోనే కూర్చుంటుందన్న ప్రభుత్వ నిర్ణయాన్ని సవాలుచేస్తూ ఒకసారి కాదు, రెండు సార్లు కోర్టు కెక్కారు. ఎక్కువ మంది సాక్షులు, ముద్దాయిలు చుండూరుకు, దాని పరిసర గ్రామాలకు చెందిన వారు కాబట్టి కేసు విచారణ చుండూరులో జరపడం చట్టరీత్యా తప్పుకాదు, సాధారణ న్యాయ దృష్టిలోను తప్పు కాదు. అయినప్పటికీ దానిపై వ్యాజ్యం నడిపారు.

ఆ వ్యాజ్యం ఓడిపోయిన తరువాత చుండూరు కేసు నిర్వహించడానికి రాష్ట్ర ప్రభుత్వం స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ను నియమించడాన్ని సవాలుచేస్తూ వాళ్ళే కోర్టు కెక్కారు.

ఎస్.సి., ఎస్.టి. అత్యాచారాల నిరోధక చట్టంలోనే బాధితులను సంప్రదించి వారికి విశ్వాసం ఉన్న న్యాయవాదిని స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమించే అవకాశం ఉన్నప్పటికీ దళితులు కోరిన వ్యక్తిని ఎట్లా నియమిస్తారు? అంటూ కోర్టుకెక్కారు. సింగిల్ జడ్జి వారి కేసును కొట్టేయగా డివిజన్ బెంచికి అప్పీలు కూడా చేసుకున్నారు.



అది కూడా వీగిపోయిన తరువాతే చుండూరు మారణకాండపైన విచారణ మొద లయింది. ప్రత్యక్ష సాక్షుల విచారణ దాదాపు పూర్తయిపోయిన దశలో ప్రత్యేక కోర్టు న్యాయమూర్తిని బదిలీ చేయడం జరిగింది. ఇది ఏ ప్రత్యేక కారణం వల్లా జరిగిన బదిలీ కాదు. ఆనవాయితీగా న్యాయవ్యవస్థలో జరిగే బదిలీలలో భాగంగా గుంటూరులో చాలా మంది బదిలీ అయ్యారు. ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి కూడా బదిలీ అయి డా. ప్రభాకర్ రావుగారు నియమితులయ్యారు.

క్రిమినల్ కేసును ఆద్యంతం ఒకే న్యాయమూర్తి విచారించాలన్న నియమమేదీ లేదు. కాబట్టి కొత్త న్యాయమూర్తి నియామకానికి ముద్దాయిలు అభ్యంతరం చెప్పే అవకాశం లేదు. అయినప్పటికీ చుండూరు ముద్దాయిలు వెంటనే హైకోర్టుకు నిరసన తెలుపుతూ ఉత్తరం రాశారు. పాత న్యాయమూర్తినే కొనసాగించమని కోరారు. ఆయనేమైనా వారికి అనుకూలంగా వ్యవహరించాడా అంటే లేదు. ఆయన తన వృత్తి ధర్మం ప్రకారం చేశాడు. మరి అటువంటప్పుడు బదిలీని నిలిపివేసి పాత న్యాయమూర్తినే కొనసాగించాలని ముద్దా యిలు ఎందుకు కోరారన్న ప్రశ్నకు ముద్దాయిల నుండి జవాబు లేదు.

వాళ్ళు జవాబు చెప్పకున్నా కారణం ఊహించడం కష్టంకాదు. కొత్త జడ్జి దళితుడని తెలిసి పాత జడ్జినే కొనసాగించాలని వారు హైకోర్టును కోరారు. కొత్త జడ్జి వ్యవహార శైలిని వారప్పటికి చూడలేదు. ఆయన న్యాయబుద్ధి కలవాడో కాదో నిర్ణయించడానికి వారి వద్ద అప్పటికి ఏ ఆధారాలు లేవు. అయినప్పటికీ పాత జడ్జినే కొనసాగించమని హైకోర్టును వారు కోరారంటే కొత్తాయన కులంరీత్యా దళితుడు కావడమొక్కటే దానికి కారణం కాగలదు.

అప్పుడే హైకోర్టు వారి అభ్యర్థన పట్ల తగిన రీతిలో స్పందించవలసి ఉండింది. దళి తులపైన దాడి చేసిన కేసులో అగ్రకులస్తులను విచారించడానికి దళితకులస్థుడైన వ్యక్తి ఎంతటి న్యాయకోవిదుడైనా, నిష్పాతుడైనా అనర్హుడనే కదా వారు చెప్పదలచుకున్నది? అది కోర్టు ధిక్కారం కాదా? న్యాయవ్యవస్థ అన్యాయమైన తీర్పు ఇచ్చిందని విమర్శించిన వారిని సైతం కోర్టు ధిక్కారానికి శిక్షిస్తారే, ఏ తీర్పు ఇంకా ఇవ్వకముందే ఈ న్యాయమూర్తి దళితుడు కాబట్టి మాకు న్యాయం జరగదని భావిస్తున్నామని ప్రకటించే వారిని ఉపేక్షిం చడం భావ్యమా?

అప్పుడు హైకోర్టు వారిని అభిశంసించలేదు గానీ వారి కోరికను మన్నించనూ లేదు. ఊరకుండిపోయింది. కొత్త జడ్జి డా॥ ప్రభాకర్‌రావు గారి ఆధ్వర్యంలో చుండూరు కేసు విచారణ కొనసాగింది. 22 మంది సాక్షులను విచారించారు. వీరిలో ఎక్కువ భాగం పంచనామా మధ్యవర్తులు, పోలీసులు, డాక్టర్లు మొదలైన 'అధికారిక' సాక్షులు. వీరి సాక్ష్యానికి ప్రత్యక్ష సాక్షుల వాంగ్మూలానికి ఉండే ప్రాముఖ్యం ఉండదు. అయినప్పటికీ ఈ సాక్ష్యాలు నమోదు చేయడంలో న్యాయమూర్తి పక్షపాత బుద్ధితో వ్యవహరిస్తున్నారని ముద్దా యిలు ఆరోపించసాగారు. స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్, న్యాయమూర్తి కుమ్మక్కయి ప్రాసి క్యూషన్ కథనానికి అనుకూలించే పద్ధతిలో సాక్ష్యం నమోదు చేస్తున్నారనీ అందుకోసం

సాక్షులపైన ఒత్తిడిపెట్టి వారిచేత అనుకూలంగా చెప్పిస్తున్నారని నిందవేశారు. ఈ నిందా పత్రాన్ని ఆగస్టు నెలలో న్యాయమూర్తి చేతికే ఇచ్చి "ఈ కేసు మీరు విచారించిన యెడల ఏ విధంగాను న్యాయపరమైన తీర్పు వస్తుందని నమ్మకం లేదు. కనుక అన్యధా భావించక, మీ అధికారం మాపై చూపక వేరే జడ్జిగారి ద్వారా విచారణ జరిపించగలందులకు తగుచర్యలు తీసుకొనవలసిందిగా ప్రార్థించుచున్నాము" అని కోరారు.

ఈ వాక్యాలలోని వెక్కిరింత ధ్వని సాధారణంగా కోర్టులో ముద్దాయిల నోట వినిపించేది కాదు. న్యాయమూర్తి దళితుడనే చులకన భావమే లేకపోతే ఇది సాధ్యమయ్యేది కాదు.

ఈ నిందా పత్రాన్ని ముద్దాయిలు న్యాయమూర్తికి ఇవ్వడమేకాక హైకోర్టుకు కూడా పంపారు. చుండూరు కేసును ఆ కోర్టు నుంచి పొరుగు జిల్లాకు బదిలీ చేయమని హైకోర్టులో కేసు వేశారు. న్యాయమూర్తినే బదిలీ చేయమన్న అర్జీకూడా పెట్టుకున్నారు. కేసును బదిలీ చేయడం హైకోర్టు న్యాయపరమైన అధికారం పరిధిలోని విషయం కాబట్టి కేసు వేశారు. జడ్జీని బదిలీ చేయడం హైకోర్టు పాలనాధికారం పరిధిలోని విషయం కాబట్టి అర్జీ పెట్టుకున్నారు. రెండూ ఒకేసారి చేశారు. రెండింటికి ఆధారం ఆగస్టు నెలలో న్యాయమూర్తికి సమర్పించిన నిందా పత్రమే. దాని ముగింపు వాక్యాలను పైన ఉటంకించాము. అందులోని 15వ పేరాను కూడా ఉటంకించాలి.

**"మీరు ఎస్.సి. కులమునకు చెందిన వారని తెలియుచున్నది. ఔనో/ కాదో మాకు తెలియదు. కానీ, జరిగిన పై విషయములు మరియు ఇతర విషయముల దృష్ట్యా, మమ్ములను ఇబ్బంది పెట్టుట గురించి సాక్ష్యములు సరిగా నమోదు చేయకపోవడాన్ని బట్టి, జరుగుతున్న అన్యాయాన్ని బట్టి, నిజమేనేమో అనిపిస్తుంది. అందువలన కూడా మాకు ఈ కేసులో న్యాయము జరగదని విశ్వసించుచున్నాము. కులప్రాతిపదికగా ఏర్పడిన న్యాయస్థానము కనుక అనుమానించు చున్నాము".**

అంటే న్యాయమూర్తి కులాన్నిబట్టి ఆయన నిష్పాక్షితను శంకించవచ్చు. న్యాయమూర్తి దళిత కులస్థుడైతే ఎస్.సి., ఎస్.టి. చట్టం కింద విచారణ ఎదుర్కొంటున్న అగ్రకుల ముద్దాయిలు తమకు న్యాయం జరగదని అనుమానించవచ్చు. ఎస్.సి., ఎస్.టి. స్పెషల్ కోర్టు 'కులప్రాతిపదికన' ఏర్పడిన న్యాయస్థానం కాబట్టి ఆ కోర్టులో విచారణ జరిపే న్యాయమూర్తి ఎస్.సి.గానీ, ఎస్.టి.గాని అయితే ముద్దాయిలకు న్యాయం జరగదన్న విశ్వాస రాహిత్యాన్ని ప్రకటించి జడ్జి బదిలీగాని, కేసు బదిలీగానీ కోరవచ్చు.

ఇదీ చుండూరు ముద్దాయిల వాదన. దీనిని వారు తమలో తాము చెప్పుకొని ఊరుకోలేదు. కాగితం మీద పెట్టి హైకోర్టుకే ఇచ్చి కేసును గానీ, జడ్జిని గానీ బదిలీ చేయమని అడిగారు.

న్యాయవ్యవస్థను అవమానపరిచినందుకు కోర్టు ధిక్కారం కేసు, దళితుడు అగ్రకులాల నేరాన్ని విచారించడానికి అనర్హుడని అన్నందుకు పిసిఆర్ చట్టం కింద కేసు వారి పైన నమోదు చేయవలసింది పోయి హైకోర్టు వారి అభ్యర్థన మేరకు జడ్జిని బదిలీ చేసింది. కేసు బదిలీకోసం ముద్దాయిలు వేసిన వ్యాజ్యం ఇంకా విచారణలో ఉండగానే జడ్జినే బదిలీ చేసింది. ముద్దాయిల నిందా పత్రానికి డా॥ ప్రభాకర్‌రావు సంతృప్తికరంగా జవాబు చెప్పకపోలేదు. జవాబు చెప్పడమే కాక, ముద్దాయిలు కోర్టులో అనుచితంగా ప్రవర్తిస్తున్న వైనాన్ని కూడా హైకోర్టుకు వివరించాడు. దాంతోపాటు ఈ తలనొప్పి తనకొద్దని తానే బదిలీ కూడా కోరాడు. ఆయన అభ్యర్థనకు అగ్రకుల ముద్దాయిలు పెట్టిన వేధింపులే కారణం అని హైకోర్టు గుర్తించి ముద్దాయిల పైన తగుచర్య తీసుకోవలసింది పోయి వారి కోరికే తీర్చింది.

**ఇది హైకోర్టుకు తగునా? అని మేము అడుగుతున్నాం. దళితులను హతమార్చిన అగ్రకులస్తులు తమ కులాలకు చెందిన వారే తమను విచారించాలని డిమాండ్ చేయడాన్ని ఆమోదించినట్టు కాదా? రేపు దళిత బాధితులు జడ్జి దళితేతరుడు కాబట్టి మాకు న్యాయం జరగదని అనుమానిస్తున్నాం అంటే జడ్జిని మళ్ళీ బదిలీ చేస్తారా?**

1991 ఆగస్టు 6న ముద్దాయిలు ఏ అహంకారాన్ని ప్రదర్శించారో అదే అహంకారాన్ని 2005 ఆగస్టు నెలలో జడ్జి మీద తయారుచేసిన నిందాపత్రంలో మళ్ళీ ప్రదర్శించారు. మొదటి దానికి విచారణ ఇప్పటికీ పూర్తికాలేదు. రెండవది వారు కోరిన ఫలితాన్నే ఇచ్చింది. అందరికీ సమన్యాయం జరుగుతుందన్న విశ్వాసాన్ని న్యాయవ్యవస్థ ప్రజలలో నిలబెట్ట దలచుకుందా లేదా?

**27-10-2005**

**గుంటూరు జిల్లా కమిటీ**

## తన పని కాదు

# చట్టం చెన్నకేశవరెడ్డి పని చేస్తోంది!

**ప్రజలారా!**

**ఎ**మ్మిగనూరు నియోజకవర్గ ప్రజలు చెన్నకేశవరెడ్డి చిరకాలవాంఛ నెరవేర్చారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ శాసనసభ్యునిగా గెలిపించారు. ఆయన తన రాజకీయ ప్రాబల్యాన్ని పెంచుకోవడానికి ఎమ్మిగనూరు పట్టణ హమాలీల కడుపుకొట్టి వ్యాపారస్తుల ప్రయోజనాలు నెరవేర్చే పని చేశాడు. ఎమ్మిగనూరులో గత 25 ఏళ్ళుగా కొనసాగుతున్న యూనియన్‌కు పోటీగా వెంకటాపురానికి పరిమితమై, ఐదేళ్ళ క్రితమే ఏర్పడిన యూనియన్ వాళ్ళను ఎమ్మిగనూరులో సైతం పనులు చేసుకోవటానికి చట్టవిరుద్ధంగా అవకాశం కల్పించి వారిమధ్య వైషమ్యాల్ని పెంచి పోషించాడు. ఎమ్మిగనూరు మార్కెట్ కమిటీలో సైతం ఈ హమాలీలకు అంగడి హమాలీల పనులు అంటగట్టి, వారి సౌకర్యాలు వీరికి కలుగజేయక వేధింపులకు గురిచేయటం, అంతటితో ఆగకుండా మునిసిపల్ ఎన్నికల్లో ఇరువురి మధ్య ఘర్షణకు దారితీసే పరిస్థితులు కల్పించాడు. దీనికంతటికి ప్రధాన కారణం వారు తెలుగుదేశం పార్టీకి అనుబంధ సంఘంగా కొనసాగుతుండడమే.

ఎమ్మిగనూరు పట్టణ హమాలీల వివాదాన్ని పెంచి పోషించటానికి ఈయన జిల్లా కార్మికశాఖ అధికారిచేత వెంకటాపురం హమాలీలు ఎమ్మిగనూరులో సైతం పనులు చేయడానికి చట్టవిరుద్ధంగా "సవరణ" చేయించాడు. అప్పటికే ఈ విషయమై హైకోర్టు ఉత్తర్వులు ఉన్నప్పటికీ, ఈయన గారి ఒత్తిడి మేరకు సవరణ చేయడం జరిగింది. ఈ నిర్ణయాన్ని అమలు చేయడానికి ఆదోని ఇన్‌చార్జి డి.ఎస్.పి., ఆర్.డి.ఓ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్, ఎమ్మిగనూరు సి.ఐ., ఎస్.ఐలు రెండు యూనియన్‌లను సమావేశపరచి బలవంత పెట్టి ఇరువురూ పని చేసుకొమ్మని హెచ్చరించారు. ఎమ్మిగనూరు హమాలీల సంఖ్య 140 కాగా, వెంకటాపురం హమాలీలు 40 మంది. వెంకటాపురం యూనియన్ అప్పటికే ఉన్న అగ్రిమెంట్ రేట్ల కన్నా తక్కువ కూలిరేట్లకు పనిచేయటానికి సిద్ధపడడం వల్ల, హమాలీల సంఖ్య పెరగటంవల్ల వీరికి కనీస వేతనాలు అందకుండా పోవడంతో పాటు, రోజూ పని దొరకని పరిస్థితి కొనసాగుతోంది. దీన్ని ఆమోదించని ఎమ్మిగనూరు హమాలీలు ఆందోళనకు దిగగా, ఎమ్మిగనూరు సి.ఐ గోపాలకృష్ణ వారిపై లాఠీ చార్జిచేసి, తప్పుడు కేసుల్ని నమోదు చేయడంతో పాటు, దాన్ని శాంతిభద్రతల సమస్య అయినట్టు పట్టణంలో 144 సెక్షన్ సైతం విధించారు. ఇది అంతిమంగా వ్యాపారస్తుల ప్రయోజనాల్ని నెరవేర్చింది. ఎమ్మిగనూరు హమాలీలు హైకోర్టును ఆశ్రయించగా న్యాయస్థానం "తిరిగి ఆదేశాలు జారీ చేసేవరకు ముందు పరిస్థితిని కొనసాగించమని" ఆదేశించింది. ఎం.ఎల్.ఏ ఆదేశాలు చట్టవిరుద్ధమని తెలిసి కూడా వాటిని అమలుచేసిన అధికార యంత్రాంగం, రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఆదేశాల్ని మాత్రం మూడు నెలలు కావస్తున్నా అమలుచేయక "కోర్టు ధిక్కారానికి" పాల్పడుతుండడం శోచనీయం. ఇంత జరుగుతున్నా తెలుగుదేశం నాయకులు సైతం ప్రభుత్వంపై ఎటువంటి ఒత్తిడి తేకుండా మౌనంగా ఉండడం వల్ల ఎమ్మిగనూరు హమాలీలు దిక్కుతోచని పరిస్థితితో కాలం వెళ్ళబుచ్చుతున్నారు.



ప్రజాస్వామ్య వ్యవస్థలో శాసనసభ్యుల్ని ప్రజలు ఎన్నుకొనేది చట్ట సభల్లో చట్టాలను చేసి, ప్రజామోదమైన పనులుచేసి వారి ఆకాంక్షలను నెరవేర్చడం కోసమే. అయితే ఎమ్మిగనూరు శాసనసభ్యులు తమ రాజకీయ ప్రాబల్యం పెంచుకోడానికి హమాలీల పట్ల వ్యవహరించిన తీరు తీవ్ర ఆక్షేపణీయం. అధికారులు తమ విధుల్ని సవ్యంగా ఆచరించకపోతే వారిని సరిదిద్దాల్సిన శాసనసభ్యులే వారిచేత చట్ట విరుద్ధంగా వ్యవహరించేట్టు చేసి, రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఆదేశాల్ని సైతం అమలుచేయక కోర్టుధిక్కారానికి పాల్పడేట్టు చేయడం ఆయన నిరంకుశ వైఖరికి అద్దం పడుతోంది. దీనినిబట్టి చూస్తే, అతి పడుతున్నది హమాలీలు కాదని, శాసనసభ్యులే నన్నది స్పష్టమవుతోంది. కావున ప్రజలపట్ల ఆయనకు ఏమాత్రం బాధ్యత ఉన్నదని భావిస్తున్నా, హమాలీల పట్ల నిరంకుశ వైఖరిని మానుకొని, అధికార యంత్రాంగాన్ని చట్టబద్ధంగా వ్యవహరించేట్టు చూడకపోతే, శాసనసభ్యునిగా కొనసాగే అర్హత అతనికి ఉందా? అని మేం అడుగుతున్నాం. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా జోక్యం చేసుకొని ఈ విషయమై పూర్తిస్థాయి న్యాయవిచారణ జరిపి కోర్టు ధిక్కారానికి పాల్పడిన అధికార యంత్రాంగంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, పరిస్థితి సరిదిద్దకపోతే శాసనసభ్యులు పెద్దయెత్తున ప్రజా నిరసనను ఎదుర్కోవడంతో పాటు, న్యాయస్థానం చేత చివాట్లు తినాల్సిన పరిస్థితి వస్తుందని హెచ్చరిస్తున్నాం.

**5-11-2005**

**కర్నూలు జిల్లా కమిటీ**

## సమాచారహక్కు చట్టాన్ని

# అమలు చేసుకుందాం, మెరుగుపరచుకుందాం

**చి**న్న సమాచారం కోసం ప్రభుత్వ కార్యాలయాల దగ్గర పడిగాపులు కాసిన అనుభవం మన కందరికీ ఉంది.

మా వూళ్లో నీళ్ల టాంకు కోసం నిధులు కేటాయించబోతున్నట్టు ప్రభుత్వ అధికార్లు మా సర్పంచ్‌కు నిరుడు చెప్పారు. ఎప్పుడు కేటాయించబోతారు? ఎంత ఇయ్యబోతారు? కొంచెం చెప్తారా?

ఇళ్ల స్థలాలు లేని ముప్పై కుటుంబాల వారము ఏ పేచీ లేని ప్రభుత్వ భూమిని అందుకోసం కేటాయించమని ఎంఆర్‌వో గారికి అర్జీ పెట్టుకొని రెండేళ్లయింది. ఆయన చూస్తామన్నారు. అసలు ఊరిలో ఇళ్ల స్థలాల కేటాయింపుకు తగిన ప్రభుత్వ భూమి ఎంత ఉంది? ఎక్కడ ఉంది? దానిపైన కోర్టు కేసులేవయినా ఉన్నాయా? ఉంటే ఏ దశలో ఉన్నాయి? కొంచెం చెప్తారా?

మా ఊరి పక్కన ఒక పెద్ద ఫ్యాక్టరీ నెలకొల్పడానికి ఫలానా కంపెనీకి అనుమతి ఇచ్చారంట. వారికి భూమి ఎక్కడ కేటాయిస్తారు? వారు ప్రైవేటు భూమి కొనుక్కుంటారా, లేక వారికి ప్రభుత్వ భూమి కేటాయిస్తారా? ఫ్యాక్టరీకి అవసరమైన నీళ్లు ఎక్కడి నుండి ఇస్తారు? మా ఊరి నీటి వనరుల నుండే ఇస్తారా? రోజుకు ఎంత ఇస్తారు? ఆ ఫ్యాక్టరీ వల్ల కాలుష్యం ఏ రూపంలో ఉంటుంది? ఎంత ఉంటుంది? దానికి నివారణ మార్గాలేవయినా ఉన్నాయా? కొంచెం చెప్తారా?

మా ఊరిలో పది మంది స్త్రీలు వితంతు పింఛన్ల కోసం అర్జీ పెట్టుకున్నారు. పక్క ఊరిలో ఎనిమిది మంది పెట్టుకుంటే ఇద్దరికి ఇచ్చారు. మా ఊరిలో ఎవరికీ ఇయ్యలేదు. ఎందుకు? వితంతు పింఛన్లు వితంతువులందరికీ ఇవ్వరా? కొందరికే ఇస్తారా? ఎవరు ఎంపిక చేస్తారు? ఏవిధంగా చేస్తారు? మా వూరి అర్జీదారులకు ఎప్పుడిస్తారు? కొంచెం చెప్తారా?

ఇటువంటి ప్రశ్నలకూ సందేహాలకూ జవాబు దొరకక అధికార్లను అడిగీ అడిగీ వారి చుట్టూ తిరిగీ తిరిగీ విసిగిపోయి ఉన్నాము. ఈ బాధ మనకు పోగొట్టే లక్ష్యంతో పార్లమెంటు 2005 సంవత్సరంలో సమాచార హక్కు చట్టాన్ని చేసింది. దానిలో ఏముందో తెలుసుకొని సద్వినియోగ పరచుకుంటే ఈ బాధలు పూర్తిగా కాకున్నా కొంతమేరకయినా ఇక మీద తప్పించుకోవచ్చు.

మనం తెలుసుకొని అమలు చేయించుకోకపోతే ఈ చట్టం అమలు కావడం కల్ల. ప్రజా తంత్రశక్తుల ఒత్తిడి మేరకు ఈ చట్టం చేశారే తప్ప, ప్రజలతో సమాచారం పంచుకోవాలన్న మాన సిక పరివర్తన చెందడం వల్ల చేయలేదు. మనం ఎప్పటికప్పుడు ఎక్కడికక్కడ ఈ చట్టాన్ని అమలు చేయించుకోవడానికి ఒత్తిడి పెట్టకపోతే వాళ్లంతట వాళ్లు అమలు చేయరు. మన రాష్ట్ర రెవెన్యూ సిబ్బంది సంఘం పార్లమెంటును ధిక్కరించి, 'ఈ చట్టాన్ని అమలు చేయడం సాధ్యపడదు' అని ఇప్పటికే ప్రకటించి ఉంది.





ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ కార్పొరేషన్లు, స్థానిక సంస్థల నుండి సమాచారం పొందే హక్కు పౌరులందరికీ ఉంది అని ఈ చట్టం సెక్షన్ 3లో అంటుంది.

సమాచారం పొందే హక్కు అంటే సంబంధిత రికార్డులను పరిశీలించే హక్కు, ఫొటోస్టాట్ కాపీలు తీసుకునే హక్కు, ఆ రికార్డు గానీ కంప్యూటర్‌లో ఉన్నట్టయితే దానిని ఫ్లాపీలో కాపీ చేసుకునే హక్కు, వేరే రూపంలో పొందుపరిచి ఉన్నా దానిని ఉచిత రూపంలో కాపీ చేసుకునే హక్కు, వస్తు రూపంలో ఉంటే శాంపిల్స్ తీసుకునే హక్కు అని అర్థం అని సెక్షన్ 2(జె) అంటుంది. అంతేకాదు, ప్రభుత్వ పనులను (కాలవల తవ్వకం, బిల్డింగుల నిర్మాణం వగైరాలను) పరిశీలించే హక్కు కూడ దీనిలో భాగమేనంటుంది.

మన ఈ హక్కు వ్యక్తిగత సమాచారానికే పరిమితం కాదు. ప్రభుత్వం వద్ద ఉన్న ఏ సమాచారాన్నయినా మనం పొందవచ్చు. ఫలానా సమాచారాన్ని ఎందుకోసం కోరుతున్నా మన్న కారణం కూడా మనం చెప్పనవసరంలేదని సెక్షన్ 6(2) అంటుంది. మన గురించి వివరాలు కూడ ఇవ్వనవసరం లేదు. కేవలం మనకు సమాచారం పంపించవలసిన చిరు నామా తెలియజేస్తే చాలు.

సమాచారం కోసం మనం ఎవరిని అడగాలి? ఏవిధంగా అడగాలి?

ప్రతీ ప్రభుత్వ కార్యాలయంలోనూ దీని కోసం ఇద్దరు అధికారులు ఉంటారు. ఒకరు ప్రజా సమాచార అధికారి. రెండోవారు ఉప ప్రజా సమాచార అధికారి. సెక్షన్ 5(1) ప్రకారం 2005 అక్టోబర్ 1 నాటికే వీరి నియామకం జరిగిపోయి ఉండాలి. కాబట్టి ఈపాటికే మీ గ్రామ పంచాయతీ కార్యాలయంలో, మండల రెవెన్యూ ఆఫీసులో, మీ ఊరి ప్రభుత్వ ఆస్పత్రిలో, మీ జిల్లా కలెక్టర్ ఆఫీసులో, మండలం నుండి జిల్లా స్థాయి దాకా, అక్కడి నుండి రాష్ట్రస్థాయి దాకా ప్రతీ ప్రభుత్వ కార్యాలయంలోనూ ఈ ఇద్దరు అధికార్ల నియామకం జరిగి ఉండాలి. దీని అర్థం కొత్తగా దీనికోసం అధికార్లను నియమించడం అని కాదు. ఆ కార్యాలయంలో ఉద్యోగులుగా ఉన్న ఇద్దరు అధికార్లనే ఈ చట్టం అవసరాల కోసం 'సమాచార అధికార్లు'గా నియమిస్తారు. ఉదాహరణకు మండల రెవెన్యూ ఆఫీసులో ఎంఆర్‌వోగారే ప్రజా సమాచార అధికారి కావచ్చు.

మనం వారికి అర్జీ ఏవిధంగా పెట్టుకోవాలి? రాత వచ్చిన వారయితే రాసి ఇయ్య వచ్చు. దానికి 'ఫారం' ఏదీ లేదు. మనకు తోచిన పద్ధతిలో రాసి ఇయ్యవచ్చు. మనకు రాత రాకపోతే నోటితో అడగవచ్చు. అప్పుడు ఆ అధికారి దానిని కాగితం మీద రాసి మనకు చదివి వినిపించి మన వేలిముద్ర లేక సంతకం తీసుకోవాలి.

### ఆ తరువాత?

ఆ అధికారి మనం కోరిన సమాచారాన్ని 'వీలయినంత త్వరగా' మన ముందు ఉంచాలని సెక్షన్ 7(1) అంటుంది. అది మనిషి ప్రాణానికి గానీ స్వేచ్ఛకు గానీ సంబంధిం చిన సమాచారమయితే రెండు రోజుల లోపల మనకు ఆ అధికారి జవాబియ్యాలి. ఇతర సమాచారమయితే ఎట్టి పరిస్థితిలోనూ 30 రోజుల లోపల ఇయ్యాలి.

దీనికి ఖర్చేమీ చెల్లించుకోనక్కర లేదా? అర్జీతోపాటు పది రూపాయల ఫీజు కట్టాలి. మనకిచ్చిన సమాచారాన్ని మనం ఫొటోస్టాట్ లేక ఫ్లాపీ రూపంలో కాపీచేసి తీసుకునేటట్టు

యితే దానికయ్యే ఖర్చు చెల్లించాలి. కేవలం చూసి మనకు అవసరమయిన సమాచారాన్ని మనమే నోట్ చేసుకునేటట్టయితే తొలుత కట్టే పది రూపాయలు మించి ఏమీ కట్టనక్కర లేదు.

గడువు లోపల ప్రజా సమాచార అధికారి మనకు సమాచారం ఇవ్వకపోతే?

ఆ అధికారి సమాచారం ఇవ్వడానికి నివాకరించినట్టేనని సెక్షన్ 7(2) అంటుంది. అప్పుడు మనం రాష్ట్ర ప్రజా సమాచార అధికారికి (అది కేంద్ర ప్రభుత్వ కార్యాలయమయితే కేంద్ర ప్రజా సమాచార అధికారికి) సెక్షన్ 19 (1) కింద అప్పీల్ చేసుకోవచ్చు. ముప్పై రోజుల లోపల అప్పీల్ చేసుకోవాలి గానీ ముప్పై రోజుల గడువు దాటినా కూడా మనం ఆలస్యం చేయడానికి సహేతుక మైన కారణాలున్నాయని భావిస్తే ఆ అధికారి మన అప్పీల్ స్వీకరిస్తారు. అప్పీల్ విచారణలో, మనకు సమాచారం ఇవ్వకపోవడానికి సహేతుకమైన కారణం లేదని తేలితే, ప్రజా సమాచార అధికారి చేత మనకు సమాచారం ఇప్పించడమే కాక జరిగిన ఆలస్యానికి అధికారి నుండి రోజుకు 250 రూపాయల జుర్మానా వసూలు చేస్తారని సెక్షన్ 20(1) అంటుంది. (అయితే ఆ జుర్మానా పైసలు మనకు ఇవ్వరు. ప్రభుత్వానికే చెందుతుంది.)

అసలు మనం సమాచారం కోసం పెట్టుకున్న అర్జీ స్వీకరించడానికే అధికారి నిరాకరించినా అది కూడ సమాచారం ఇవ్వడానికి నిరాకరించినట్టే అవుతుందనీ, దానికి కూడ పై నియమమే వర్తిస్తుందనీ సెక్షన్ 20(1) అంటుంది.

అప్పీల్‌లో రాష్ట్ర (లేక కేంద్ర) ప్రజా సమాచార అధికారి ఇచ్చిన తీర్పు సంతృప్తినివ్వనట్టయితే రాష్ట్ర (లేక కేంద్ర) సమాచార కమిషన్‌కు రెండవ అప్పీల్ చేసుకోవచ్చునని అదే సెక్షన్ అంటుంది.

మామూలుగా వ్యాజ్యాలలో అభియోగం వేసినవారే దానిని రుజువు చేసుకోవలసి ఉంటుంది. కానీ ఈ అప్పీళ్లలో మాత్రం తన తప్పేమీ లేదని రుజువు చేసుకునే బాధ్యత ప్రజా సమాచార అధి కారిపైననే ఉంటుందని కూడ అదే సెక్షన్ అంటుంది.

ఇక్కడ ఒక మాట చెప్పుకోవలసిన అవసరం ఉంది. ప్రజా సమాచార అధికారి ప్రతీ కార్యా లయంలోనూ ఉంటారు కాబట్టి మనకు ఏ కార్యాలయం నుండి సమాచారం అవసరమో అక్కడే అర్జీ పెట్టుకుంటాం. అది బాగానే ఉంది. కానీ ఆ అధికారి మన అర్జీ తీసుకోవడానికి నిరాకరించినా, గడువు లోపల జవాబు ఇవ్వకపోయినా మనం అప్పీల్ చేసుకునే రాష్ట్ర (లేక కేంద్ర) ప్రజా సమాచార అధికారి మాటేమిటి? వారు రాష్ట్రంలో ఒకరే ఉంటారు. అంటే హైదరాబాద్‌లో ఉంటారన్న మాట. అయితే అప్పీల్ వారికే తీసుకుపోయి ఇవ్వనక్కరలేదు. అప్పీల్ మన నుండి స్వీకరించి వారికి పంపించడానికి ప్రతీ జిల్లాలోని ప్రతీ సబ్ డివిజన్‌లోనూ ఒక రాష్ట్ర (లేక కేంద్ర) ఉప ప్రజా సమా చార అధికారి ఉంటారు. అంతవరకు బాగానే ఉందనుకున్నా, అప్పీల్ విచారణ హైదరాబాద్‌లోనే జరగడం మారుమూల పల్లెల్లో నివసించే వారికి కష్టం కలిగించే విషయమే.

## అయితే...

ఈ సమాచార హక్కుకు మినహాయింపులు లేవా? పాకిస్తాన్ సరిహద్దుపైన భారత సైన్యం ఎక్కడ మోహరించి ఉందో చెప్పమంటే కూడ చెప్పేస్తారా?

చెప్పరు. ఆ మినహాయింపు విషయంలో మనకు పెద్దగా అభ్యంతరం ఉండకపోవచ్చునేమో గానీ, సెక్షన్ 8లో చాలా పెద్ద మినహాయింపుల జాబితాయే పెట్టారు. దేశ సార్వభౌమత్వానికీ,



సమగ్రతకూ, దేశ 'వ్యూహాత్మక, శాస్త్రీయ, ఆర్థిక' ప్రయోజనాలకూ, ఇతర దేశాలతోటి సంబంధాలకూ మీరడిగిన సమాచారం బయటపెట్టడం వలన హాని కలిగేటట్టయితే, అటువంటి సమాచారం మీకు ఇవ్వరు. అదేవిధంగా మీరడిగిన సమాచారం ఇవ్వడం నేరాన్ని ప్రేరేపించేటట్టయితే కూడ ఆ సమాచారం ఇవ్వరు. వేరే ఒక వ్యక్తి, లేక కంపెనీకి గల మార్కెట్‌లో పోటీపడే శక్తిని బలహీనం చేసే వ్యాపార రహస్యాలను, మేధోసంపత్తికి సంబంధించిన విషయాలను తెలియజేయరు. క్యాబినెట్‌లో చర్చనీయాంశాలుగా ఉన్న విషయాలకు సంబంధించి మంత్రులు, సెక్రటరీలు ఇతర అధికారులు వ్యక్తం చేసిన అభి ప్రాయాలు తెలియజేయరు. (అయితే క్యాబినెట్‌లో నిర్ణయం జరిగిపోయిన తరువాత దాని భౌతిక ప్రాతిపదికను మాత్రం బహిర్గతం చేస్తారు). నేర పరిశోధనకు, ముద్దాయిల అరెస్టుకు, నేర విచారణకు ఆటంకం కలిగించే సమాచారం ఇవ్వరు. చట్టం అమలుకు గాని, భద్రతా చర్యలకు గాని సహకరించడానికి రహస్యంగా సమాచారం లేక సహకారం ఇచ్చిన వ్యక్తి ఆచూకీని బహిర్గతం చేయగల సమాచారాన్ని, అటువంటి వ్యక్తి ప్రాణానికీ భౌతిక భద్రతకూ ప్రమాదం కలిగించగల సమాచారాన్ని ఇవ్వరు. చట్టసభల 'ప్రివిలేజస్'కు భంగం కలిగించగల సమాచారం ఇవ్వరు.

ఇన్ని చెప్పి చివరికి ఏమన్నారంటే 'పార్లమెంటుకూ శాసనసభలకూ నిరాకరించలేని సమాచారమేదీ ప్రజలకు నిరాకరించడానికి వీలులేదు' అన్నారు. ఇది వినడానికి బాగానే ఉంది కానీ చట్ట సభలకు నిరాకరించగల సమాచారమేమిటన్నది ఎక్కడా క్రోడీకరించలేదు. ఇచ్చేదీ ఇవ్వనిదీ ప్రతిపక్షాల కొట్లాడే శక్తినిబట్టి ఉంటున్నది.

మొత్తంమీద సమాచార హక్కు నిరాకరణ చాలా అస్పష్టంగా ఉంది. చట్టంలో అస్ప ష్టంగా ఉన్న విషయాలు కోర్టు వ్యాజ్యాలకు నెలవవుతాయి. మొండిగా ఉన్న స్థానిక అధి కారులు సమాచారాన్ని నిరాకరించడం, అప్పీల్‌లో రాష్ట్ర (లేక కేంద్ర) ప్రజా సమాచార కమిషనర్‌లు దాని గురించి ఏదో ఒకటి అనడం, ఆ తరువాత చట్టం పరిధి ఏమిటన్న వ్యాజ్యాలు హైకోర్టుకూ, సుప్రీంకోర్టుకూ చేరుకోవడం రేపు మనం చూడబోయే చరిత్ర.

## అయినప్పటికీ...

చేతులెత్తేసి ఈ చట్టం లాయర్లకు తప్ప వేరెవ్వరికీ పనికిరాదని వదిలేయకుండ కొట్లాడి అమలు చేయించుకోవడం మంచిది. అన్ని అర్జీలనూ అధికారులు తిరస్కరించ లేరు. ఎన్నిటిని తిరస్కరిస్తారనేది ప్రజలు పెట్టే ఒత్తిడిని బట్టి ఉంటుంది. నిజానికి ఈ చట్టం పుట్టిందే అటువంటి ఒత్తిడి నుండి. కరువు పీడిత రాజస్థాన్ రాష్ట్రంలో ప్రభుత్వ కరువు నివారణ కార్యక్రమాల గురించి, వాటి అమలు గురించి ప్రజలకేమీ తెలియడం లేదనీ, ఆ సమాచారం ఒక హక్కుగా తెలియజేయాలనీ రైతు సంఘాలు చేసిన ఆందోళనలో సమాచార హక్కు అనే భావన పుట్టి ఇప్పుడు ఈ చట్టం రూపం తీసుకుంది. దీనిలోని లోపాలను కూడ దీని సక్రమమైన అమలుకోసం పోరాడే క్రమంలోనే మనం తొలగించ గలుగుతాం.

**14 జనవరి, 2006**

## ఏజెన్సీలో మలేరియా మరణాలపై కె.ఆర్.వేణుగోపాల్ నివేదిక

# దోమ ఒక్కటే కారణం కాదు

నిరుడు విశాఖపట్నం ఏజెన్సీలో మలేరియా మరణాల గురించి తెలుగుదేశం నాయకులు అల్లరి చేసిన సంగతి, అటువంటిదేమీ లేదని కాంగ్రెస్ పాలకులు దబాయించిన సంగతీ తెలిసినదే.

రెండువేల మందికి పైగా ఆదివాసులు మలేరియా కారణంగా మరణించారని తెలుగుదేశం నాయకులు ఆరోపించగా, లేదు లేదు ఏడుగురు మాత్రమే చనిపోయారని కాంగ్రెస్ ప్రభుత్వం అనింది.

తెలుగుదేశం నాయకులు అక్కడితో ఆగిపోకుండా జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. కమిషన్ ఈ ఫిర్యాదుపైన విచారణ జరిపి రిపోర్టు ఇయ్యవలసిందిగా రిటైర్డు ఐఏఎస్ అధికారి కె.ఆర్.వేణుగోపాల్ గారిని పురమాయించింది.

కె.ఆర్.వేణుగోపాల్ గారు వివరంగా పరిశీలించి జాతీయ మానవహక్కుల కమిషన్‌కు సమర్పించిన నివేదిక సారాంశాన్ని ప్రజలకు అందియ్యడం కోసం ఈ కరపత్రం ప్రచురిస్తున్నాం. తెలుగుదేశం నాయకుల ఫిర్యాదు నిజమేనని అంటూ, దానికి కారణమైన విధాన వక్రీకరణ మాత్రం చంద్రబాబు నాయుడు పాలనలో మొదలయి కాంగ్రెస్ పాలనలోకొనసాగిందని వేణుగోపాల్ గారు తెలుగుదేశం నాయకులకు మొట్టికాయ వేశారు. ఆ తరువాత చంద్రబాబు నాయుడు మలేరియా మరణాల గురించి ఎక్కడా మాట్లాడకపోవడం గమనార్హం.

2005 సంవత్సరం మొదటి ఏడు నెలలలో పాడేరు ఏజెన్సీలో నమోదయిన 2227 చావులకు ప్రధాన కారణం మలేరియాయేనా? అదేనయితే ఆ ప్రాంతంలో మలేరియా అంత విస్తృతంగా ఎందుకుంది? వైద్య వ్యవస్థ దానినెందుకు ఎదుర్కోలేకపోతున్నది? పరిసరాల పారిశుధ్యాన్ని కాపాడవలసిన ప్రభుత్వ శాఖలు ఆ పని ఎందుకు చేయలేకపోతున్నాయి? అక్కడి ప్రజలు రోగానికి తట్టుకోవడానికి కావలసిన శారీరక శక్తి ఎందుకు లేకుండా ఉన్నారు?

ఇవీ కె.ఆర్.వేణుగోపాల్ గారు వేసుకుని జవాబు వెతికిన ప్రశ్నలు. 1999 నుండీ విశాఖపట్నం జిల్లా పాడేరు ఏజెన్సీలో ఆదివాసుల మలేరియా మరణాలను చూస్తూనే వున్నాము కాబట్టి, ఈ సంవత్సరం అదే జరగదన్న నమ్మకమేమీ లేదు కాబట్టి, వారు ప్రకటించిన జవాబులను తెలుసుకోవడం మనవంతుగా విపత్తును ఎదుర్కొనడానికి సిద్ధంగా ఉండేందుకు ఉపయోగపడవచ్చు.

## వైద్య వ్యవస్థ

వైద్య సిబ్బంది కొరతను మలేరియా మరణాలకు ఒక ముఖ్య కారణంగా కె.ఆర్.వేణుగోపాల్ గారు గుర్తించారు.

'గడచిన ఆరేడు సంవత్సరాలుగా అన్నిరకాల ప్రభుత్వ ఉద్యోగుల నియామకమూ ఆంధ్రప్రదేశ్‌లో నిలిచిపోయింది. ఇది ఏజెన్సీ ప్రాంతంలోని వైద్య సిబ్బందికి కూడా వర్తిస్తుంది' అని వేణుగోపాల్‌గారు అన్నారు. ఇది చంద్రబాబు నాయుడు ప్రపంచ బ్యాంకుతో చేసుకున్న ఒప్పందంలో భాగంగా జరిగిందని మనకు తెలుసు.



పాడేరు ఏజెన్సీలోని వివిధ ప్రభుత్వ వైద్యశాలలలో మొత్తం 818 పోస్టులు ఉండగా, 2001-2002లో అందులో 99 ఖాళీగా ఉన్నాయి. 2002-2003లో 106 ఖాళీగా ఉన్నాయి. 2003-2004లో 147 ఖాళీగా ఉన్నాయి. 2004-2005లో 186 ఖాళీగా ఉన్నాయి. ఈ నాలుగు సంవత్సరాలూ ఖాళీగా ఉన్న పోస్టులలో అత్యున్నత స్థాయిలోని అయిదు పోస్టులనూ పేర్కొనాలి. సివిల్ సర్జన్, సివిల్ సర్జన్ (స్పెషలిస్టు), ముగ్గురు డిప్యూటీ సివిల్ సర్జన్‌ల పోస్టులు 2001 నుండి ఖాళీగానే ఉన్నాయి.

'వైద్యరంగంలో పోస్టులు భర్తీచేసే విషయంలో ప్రభుత్వం వైఖరి ఈ విధంగా ఉండగా ఆదివాసుల ఆరోగ్యం బాగుండడం కల్ల' అని వేణుగోపాల్‌గారన్నారు.

ఏజెన్సీలోని వైద్య వ్యవస్థ కాల్బలం కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు. వీరిని ప్రవేశపెట్టింది కూడ ప్రపంచ బ్యాంకు సలహామేరకే. పాడేరు ఏజెన్సీలో గ్రామగ్రామాన ఉన్న కమ్యూనిటీ హెల్త్ వర్కర్ల సంఖ్య 3200. వీళ్లు అదే ఏజెన్సీకి చెందిన ఆదివాసీ మహిళలు. ఆదివాసులందరిలాగ వీళ్లు కూడా వారంలో రెండు రోజులు పస్తులుంటారు. కూలి చేసుకొని సంసారాలు పోషించుకుంటూ తమకే తెలియని వైద్యం చేస్తుంటారు. దీనికి వారికిచ్చే పారితోషికం నెలకు 400 రూపాయలు. అదికూడా ప్రతీనెలా ఇవ్వడంలేదు. ఆరు నెలలకొకసారి ఇస్తారు. 'కూలి చేసుకొని అర్ధాకలితో బతుకీడుస్తూ ఆరునెలలకొకసారి పారితోషికం పొందే ఈ ఆదివాసీ మహిళలు తమ తోటి ఆదివాసులలో ఆరోగ్య స్ఫూర్తిని ప్రచారం చేస్తారనీ మలేరియా వ్యాధిపైన పోరాటం చేస్తారనీ ఎట్లా ఆశిస్తాం?' అని వేణుగోపాల్‌గారు ప్రశ్నించారు.

కమ్యూనిటీ హెల్త్ వర్కర్ల నియామకాన్ని వేణుగోపాల్ నిరర్థకమనలేదు. అయితే వారికి కొంత కనీస ఆర్థిక భద్రత కల్పించి తగుమాత్రం శిక్షణ ఇయ్యవలసి ఉండిందనీ, అదేమీ లేకుండ పారాసెటమాల్ బిళ్లలూ, క్లోరోక్విన్ బిళ్లలూ ఇచ్చి జనం మీద వదిలేస్తే వచ్చే ప్రయోజనమేమీ లేదనీ అన్నారు.

## పేదరికం

ఒంట్లో సత్తువ ఉంటే ఏ మందులూ లేకున్నా రోగానికి కొంతమేరకు తట్టుకోగలం. ఆ శక్తి ఉండాలంటే తిండి ఉండాలి. తిండి ఉండాలంటే పని దొరకాలి, తగుమాత్రం వేతనం దొరకాలి.

ప్రభుత్వ గణాంకాల ప్రకారమే పాడేరు ఏజెన్సీలోని 1,26,013 కుటుంబాలలో 1,17,834 దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నాయి. ఆ రేఖకు ఎగువన ఉన్న కొద్దిమందీ గిరిజనేతరులే అయి వుంటారు కాబట్టి, ఆదివాసీ జనాభా మొత్తంగా దారిద్ర్య రేఖకు దిగువన ఉందని భావించవచ్చు. అందులో 57,975 కుటుంబాలను 'పేదలలోకే పేదలు'గా ప్రభుత్వమే గుర్తించింది.

ఆదివాసీ కుటుంబాలన్నీ కూడా వారంలో మూడు లేక నాలుగు రోజులు ఒక పూట మాత్రమే తింటున్నట్టు తాను పర్యటించిన గ్రామాలలో తెలుసుకున్నానని వేణుగోపాల్‌గారు అన్నారు.

గ్రామాలలో కూలిపనికి ఇచ్చే వేతనం రోజుకు 20 రూపాయలు మాత్రమే (స్త్రీకయినా, పురుషునికయినా). డివిజన్ కేంద్రమయిన పాడేరులో ఏదైనా పని దొరికి

నప్పుడు అంతకంటె ఎక్కువ వేతనమే ఇస్తారు గానీ పాడేరులో పని దొరికేది తక్కువ, దానికి పోటీ ఎక్కువ. మొత్తంమీద ఆది వాసులకు సంవత్సరంలో నాలుగు నెలలు మాత్రమే పని తగినంత దొరుకుతుందనీ, తక్కిన ఎని మిది నెలలు అర్ధాకలితో బతకవలసిందేననీ వేణుగోపాల్‌గారు నిర్ధారించారు. పోషకాహార లోపం అత్యధికంగా ఉండేది మే, జూన్, జులై నెలలలోననీ, మలేరియా జ్వరం ఉధృతంగా వ్యాపించేదీ ఆ కాలంలోనేననీ అన్నారు.

ఈ కొద్దిపాటి ఆదాయంతో రేషన్ బియ్యం కొనుక్కోని ఆమేరకయినా ప్రభుత్వ సహాయం పొందగలరా అంటే అదీ లేదు. డిపోలో నెలసరి బియ్యం ఒకేరోజు ఇస్తారు. కుటుంబం కోటా అయిన 20 కేజీలూ ఆరోజు కొనుక్కోవలసిందే. ఒకేసారి అంత డబ్బు చేతిలో లేక కొనుక్కోలేకపోతే ఎంత కొనుక్కుంటే అంతే ప్రాప్తి. ఆపైన ఇంటి అవసరాలకు మార్కెట్ రేటు పెట్టి బయట కొనుక్కోవాలి, లేకపోతే బియ్యం లేకుండ బతకాలి.

ఈ పరిస్థితిలో ప్రతీ ఆదివాసీ కుటుంబమూ మండల కేంద్రాలలోని షాహుకార్లకు రుణపడి ఉందంటే ఆశ్చర్య పోనవసరం లేదు. ఒక్కొక్క కుటుంబం తలమీద ఉన్న రుణభారం రూ.10,000/- దాకా ఉండవచ్చు. దీనికి వడ్డీ చాలా సందర్భాలలో నెలకు రూ.100/-కు అయిదు రూపాయలు - అంటే 60%.

ఇంతటి పేదరికంలో ఉన్నవారు రోగాలనెట్లా ఎదుర్కోగలరు?

## పరిసరాల పారిశుధ్యం

మలేరియా క్రిమి మన శరీరంలోకి దోమల వల్ల ప్రవేశిస్తుంది. పాడేరు ఏజెన్సీలో సంవత్సరం పొడవునా దోమలుంటాయి. అక్కడ అడువులు దట్టమైనవి. వార్షిక వర్షపాతం 1124 మి.మీ.లు. నేల ఎగుడు దిగుడుగా ఉండడం వల్ల వర్షం నీళ్ల మడుగులలో నిలిచిపోతుంది. ప్రజలకు బహిర్భూమే మరుగుదొడ్డి కావడం వల్ల ఈ మడుగులు మలినానికి నెలవవుతాయి, దోమలకు ఆవాసాలవుతాయి. దోమలు అధికంగా ఉండే ప్రాంతాలలో మలాథియాన్ వంటి మందులు స్ప్రే చేసే బాధ్యత మలేరియా నిరోధక శాఖది. కానీ వేణుగోపాల్ గారు పర్యటించిన అన్ని గ్రామాల లోనూ వారు గమనించిందేమిటంటే, ఇళ్ల బయట, పశువుల కొట్టాలలో స్ప్రేయింగ్ జరుగుతున్నది గానీ మురుగు నీటి కుంటల మీద, కాలవల మీద, ఊరి పక్కనున్న చేలలోను చేయడంలేదు. అది కూడా సంవత్సరంలో ఎప్పుడో ఒకటి రెండుసార్లు జరుగుతున్నది. చావులు మొదలయిన తరువాతే స్ప్రేయింగ్ మొదలవుతున్నది.

శుభ్రమైన తాగునీటి వసతి సహితం ఆదివాసీ గ్రామాలకు ప్రభుత్వం కల్పించలేదు. పాడేరు ఏజెన్సీలో 3,468 ఆవాసాలు ఉండగా, అందులో 114 ఆవాసాలలో మాత్రమే నీళ్ల ట్యాంకు, ఇంటింటికి పైపులు ఉన్నాయి. 2078 ఆవాసాలలో చేతిబోర్లు మాత్రమే ఉన్నాయి. వర్షాకాలంలో బోరు దగ్గర నీళ్లు నిలిచినట్టయితే బోరు నుండి తోడుకునే నీరు కలుషితమై ఉండే అవకాశం ఉంది. 1083 ఆవాసాలకు ఏ నీటివసతీ లేదు - అంటే సమీపంలోని ఏ వాగునుండో తెచ్చు కుంటారు. అటువంటి నీటివనరుల శుభ్రత గురించి చెప్పనవసరం లేదు.

దోమల బారి నుండి ప్రజలను కాపాడడానికి కేంద్ర ప్రభుత్వం సరఫరా చేస్తానని హామీ యిచ్చిన దోమతెరలు మూడవ వంతు కుటుంబాలకు కూడా అందలేదు. కేంద్ర ప్రభుత్వం నుండి సహాయంగా రావలసిన 'స్ప్రే' చేసే క్రిమిసంహారకర మందు కూడా సకా లంలో అందలేదు. ఆ మందు 'స్ప్రే' చేసింది తక్కువే కాగా మొదలుపెట్టింది కూడా చాలా ఆలస్యంగా.



## చావుకు కారణం మలేరియాయేనా?

చావులకు కారణం మలేరియా కాదనీ, ఎండ దెబ్బ నుండి గుండెపోటు దాకా అనేక కారణాలున్నాయనీ ప్రపంచాన్ని నమ్మించడానికి రాష్ట్ర ప్రభుత్వమూ, స్థానిక వైద్య సిబ్బందే కాక రాష్ట్ర ప్రభుత్వం పిలిపించిన నిపుణులు కూడా చేసిన ప్రయత్నాలను వేణుగోపాల్ గారు తీవ్రంగా అభిశంసించారు. మృతులకు పోస్టుమార్టం నిర్వహించి ఎవరెందుకు చని పోయారో నిర్ధారించే ప్రయత్నం ప్రభుత్వం చేయలేదు. అయితే ఏజెన్సీలోని ఆస్పత్రులకు వచ్చిన రోగుల రక్తపరీక్షల్లో సగటు కంటె చాలా ఎక్కువ కేసులు మలేరియా జబ్బును సూచించిన మాట ప్రభుత్వ అధికారుల నివేదికలే తెలుపుతున్నాయనీ, మలేరియా అని తేలిన కేసులలో 70 శాతం కంటే ఎక్కువ ప్రాణాంతకమైన ఫాల్సిపారం మలేరియా (ఇది మెదడును దెబ్బతీసి వేగంగా చావుకు కారణం అవుతుంది) అనీ కె.ఆర్.వేణుగోపాల్ గారు అభిప్రాయపడ్డారు. వివరమయిన విశ్లేషణ అనంతరం, జ్వరం వల్ల చనిపోయిన వారిలో అత్యధికులు మలేరియా వల్ల, అందులో ఫాల్సిపారం మలేరియా వల్ల చనిపోయా రని నేను భావిస్తున్నాను' అన్నారు.

## ముగింపు

ఇది నిజానికి ముగింపులేని సమస్య. పేదరికం, పోషకాహార లోపం, దోమల బెడద కల్పించిన సమస్యను వైద్య పారిశుధ్య వ్యవస్థలను పనిగట్టుకొని నాశనం చేసిన బాధ్యతా రహిత పాలనా విధానాలు ఎన్నోరెట్లు పెంచాయి. అన్నికోణాల నుండి పరిస్థితిని చక్కబెట్టే బృహత్తర ప్రయత్నం ఇప్పటికే మొదలుకావలసి ఉండింది కానీ కాలేదు. ప్రజలయినా ఒత్తిడి పెట్టి మొదలుపెట్టించకపోతే వేసవి ఎంతో దూరం లేదు, ఆ వెనుక వచ్చే వర్షాలూ, అవి తెచ్చే రోగాలూ ఎంతో దూరం లేవు.

★ పాడేరు ఏజెన్సీలోని ఆస్పత్రులలో అన్ని పోస్టులూ వెంటనే నింపాలి. డాక్టర్లంతా విధులలో ఉండేటట్టు చూడాలి.

★ కమ్యూనిటీ హెల్త్ వర్కర్లకు నెలకు 1000 రూపాయలు ప్రతీనెలా జీతంగా ఇచ్చి మలేరియా చికిత్సలో ప్రాథమిక తర్ఫీదు ఇవ్వాలి.

★ వేసవిలో ఆదివాసులకు విస్తృతంగా ఉపాధి అవకాశాలు కల్పించే పథకాలు రూపొం దించి అమలు చేయాలి. కేజి 3.00 రూపాయలకు ఇచ్చే అంత్యోదయ పథకం ఆదివాసులందరికీ అందుబాటులోకి తేవాలి.

★ మాలాథియాన్ వంటి క్రిమిసంహార మందులు విరివిగా సరఫరా చేయాలి, క్రమం తప్పకుండా స్ప్రే చేయాలి.

★ అన్ని ఆదివాసీ గూడేలకూ శుభ్రమైన మంచినీటి వసతి కల్పించాలి.

★ ఆదివాసీ కుటుంబాలన్నిటికీ ఉచితంగా తగినన్ని దోమతెరలు సరఫరా చేయాలి.

★ ఏజెన్సీలో అసహజ మరణాల గురించి ప్రభుత్వము, ప్రభుత్వ వైద్యులు అబద్ధాలు చెప్పడం మానేయాలి.

**20-1-2006**

**విశాఖపట్నం**

## ఇరాన్ అణుశక్తి హక్కుల విషయంలో

# భారత్ వైఖరి న్యాయమైనదా? తెలివైనదా?

ఇరాన్ అణుబాంబు తయారు చేసుకునే సామర్థ్యాన్ని రహస్యంగా పెంపొందించుకుంటోందనే అమెరికా ఆరోపణను భద్రతా మండలికి నివేదించాలన్న ప్రతిపాదనకు మద్దతుగా భారత్ ఓటు వేయడం అనుకూల, వ్యతిరేక ప్రకటనలకూ, వాదనలకూ దారితీసిన విషయం తెలిసిందే. మన దేశ పాలకులు దేశం లోపలయినా, బయటయినా అన్యాయంగా నడుచుకున్నట్టయితే తెలుసు కోవడం, విమర్శించడం దేశ పౌరులుగా మన కర్తవ్యం కాబట్టి ఈ ఉదంతం పూర్వాపరాలు, భారత్ తీసుకున్న నిర్ణయంలోని న్యాయాన్యాయాలు మనం చర్చించుకోవాలి.

అగ్రరాజ్యాలు తమ వద్ద మాత్రమే అణుబాంబులు ఉండాలనీ, వేరే ఎవ్వరి వద్దా ఉండడానికి వీలులేదనీ మొదటి నుండి అంటూ వచ్చాయి. కొత్తగా ఎవరూ బాంబులు తయారుచేసుకోకుండా చూడడానికి అణువ్యాప్తి నిరోధక ఒడంబడికను (ఎన్‌పిటి) రూపొందించి, దానిపైన సంతకం చేయవలసిందేనని బాంబులు లేని దేశాలపైన ఒత్తిడి పెట్టాయి.

ఎన్‌పిటి పైన సంతకం చేసిన దేశాలలో ఇరాన్ ఒకటి. ఎన్‌పిటి అన్యాయమైన ఒడంబడిక అని నిరసించిన దేశాలలో ఇండియా ఒకటి. మనం కూడ అణుబాంబు తయారు చేసుకున్న తరువాత మన పాలకులకు సహితం ఈ విషయంలో అగ్రరాజ్యాల బుద్ధి సోకింది గానీ అంతకు ముందు మనమన్నదేమిటంటే, అణుబాంబులు ఎవరివద్దా ఉండకూడదంటే సరేగానీ, కొందరు అణ్వస్త్రాలు ఉంచుకొని మిగిలిన వాళ్లకు ఆ హక్కు లేదనడం అన్యాయం అని. కాబట్టి మన పాలకులు అగ్రరాజ్యాలను ధిక్కరించి బాహాటంగానే అణుబాంబులు తయారు చేసుకున్నారు. ఇరాన్ అదే పని ఒకవేళ రహస్యంగా చేసుకుంటే మనకు కోపం ఎందుకు?

ఇరాన్ విషయంలో 'మన భద్రతకు మనం ప్రాధాన్యం ఇచ్చాం' అని ప్రధాని వివరణ ఇచ్చారు. ఆ మాట ఇరాన్ కూడ అనవచ్చునా? ఒకసారి ఆసియా చిత్రపటం చూడండి. ఇరాన్‌కు ఒకవైపు సరిహద్దు ఉన్న పాకిస్తాన్‌కు అణుబాంబు సామర్థ్యం ఉంది. రెండవ వైపు సరిహద్దు ఉన్న ఇరాక్ అమెరికా అదుపులో ఉంది. అమెరికా అణ్వస్త్ర సామర్థ్యం గురించి చెప్పనవసరం లేదు. సరిహద్దు దాటి ఇంకొంచెం దూరం దృష్టి సారించినట్టయితే ఇరాన్ చుట్టూ అర్థవలయాకారంలో ఇజ్రాయెల్, రష్యా, చైనా, ఇండియా పరచుకొని ఉన్నాయి. ఇవన్నీ అణుబాంబు గల దేశాలే. వీటిలో ఇజ్రాయెల్ 1979 నుండీ ఇరాన్‌ను తన శత్రువుగా ప్రకటించి ఉంది, ఒకసారి ఇరాన్‌పైన దాడి కూడ చేసి ఉంది. నిజానికి, తన పరిసరాలలో ఇన్ని అణుబాంబులు కలిగి ఉన్న దేశాలు ఉండీ, తాను మాత్రం త్యజించిన దేశం ఇరాన్ తప్ప ప్రపంచంలో వేరే ఏదీ లేదేమో.

ఇరాన్ ఎన్‌పిటి మీద సంతకం చేయడమే కాక, అనుమానం వస్తే వెతుక్కునే అధికారం కూడ అంతర్జాతీయ అణుశక్తి సంస్థకు (ఐఏఇఏకి) ఇచ్చింది. అక్కడితో ఆగిపోకుండా, యుద్ధేతర అవసరాలకోసం యురేనియం 'ఎన్‌రిచ్‌మెంట్' చేపట్టినా కూడ దానిని లోపాయకారీగా అణ్వాయుధాల తయారీకి వాడుకోవచ్చునన్న అగ్రరాజ్యాల కుశంకను సహితం గౌరవించి 3 సంవత్సరాల పాటు దానిపైన తానే నిషేధం విధించుకుంది. అయితే అగ్రరాజ్యాలను ఒకటి మాత్రం కోరింది. తన సాంకేతిక అవసరాలకూ, భద్రతావసరాలకూ న్యాయం చేకూర్చే బాధ్యత వారిదేనని. వారు సై అన్నారుగానీ ఏమీ చేయలేదు.



ఏమీ చేయకపోగా, నువ్వు రహస్యంగా అణుబాంబులు తయారు చేసుకుంటున్నావని మాకు అనుమానంగా ఉంది కాబట్టి మా పరిశీలకులను పంపుతున్నాం అన్నారు. ఇరాన్ సహకరించింది. వాళ్లు వెతికారు, వెతికారు, రెండేళ్లు వెతికారు గానీ ఏం దొరకలేదు. 'అయినప్పటికీ మా అనుమానం నివృత్తి కాలేదు' అన్నారు ఐఏఇఏ వారు. ఆపైన ఇరాన్ విషయాన్ని భద్రతా మండలికి నివేదించారు.

ఇదేమయినా న్యాయమా? భారత్ దీనికి సహకరించడం సబబా? అన్నది మన ముందున్న ప్రశ్న.

దేశంలో నాలుగవ వంతు జనాభాకు అన్నం పెట్టలేకపోయినా, ఒక అగ్రరాజ్యంగా గుర్తింపు పొందాలని మన వాళ్లకీమధ్య కోరిక పట్టుకుని గతాన్ని మరచిపోయారు గానీ దశాబ్దాల తరబడి అణుశక్తి వ్యాప్తి నిరోధక ప్రయత్నాల పట్ల భారత పాలకులు అనుసరించిన వైఖరికీ ఇవ్వాళ ఇరాన్ అంటున్నదానికీ తేడా ఏమీ లేదు. 'మాకు అణుబాంబు తయారు చేసుకోవాలన్న కోరిక లేదు. అయితే మాతో శత్రుత్వం ఉన్నవారు తయారు చేసుకుంటే చేతులు ముడుచుకొని కూర్చోము. అంతేకాక, శాంతియుత అవసరాల కోసం మేము అణుశక్తిని వినియోగించుకున్నట్టయితే అదే క్రమంలో బాంబులు తయారు చేస్తామేమోనని ఏ అమెరికాకో అనుమానం వచ్చినంత మాత్రాన మా సాంకేతిక అవసరాలను మేము వదులుకోము.' ఇదే కదా భారత్ నోట జవహర్‌లాల్ నెహ్రూ కాలం నుండి విన్న మాట? ఇప్పుడు ఇరాన్ ఆ మాటే అంటే మన పాలకులకెందుకు అభ్యంతరమనిపిస్తున్నది?

భద్రతా మండలిలో మనం సహితం శాశ్వత సభ్యత్వం పొంది, వీలయితే వీటో హక్కు కూడ పొంది, అణ్వస్త్ర దేశంగా గుర్తింపు పొంది, ఊరిలో కాకపోతే గల్లీలోనయినా దాదాగా బతకాలన్న పెడబుద్ధి మన పాలకుల కళ్లకు పొరలు కప్పిందనుకోకూడదా? ఈ కోరికలు తీరాలంటే అమెరికా పంచన చేరడమొక్కటే మార్గం అన్న అతి తెలివి వారి నైతిక స్పృహను మసకబార్చిందనుకోకూడదా?

రాజకీయాలలో- ముఖ్యంగా అంతర్జాతీయ రాజకీయాలలో- ప్రయోజనాలకే తప్ప విలువలకు చోటులేదని నమ్మేవారికి ఈ ప్రశ్నలు రుచించక పోవచ్చు. అయితే ప్రయోజనాలనే ప్రమాణంగా పెట్టుకున్నా అమెరికా బంటుగా ముద్రపడడం ఇండియాకు రాజకీయంగా ప్రయోజనకరమా? ఆర్థికంగా అసలే ప్రయోజనకరం కాదని చెప్పవచ్చు. సహజ వనరులు అత్యధికంగా ఉన్నది ఆసియాలో. దశాబ్దాలుగా ఆసియా దేశాలు పరాధీనులుగా ఉండి పరస్పర సంబంధాలు పెంపొందించుకోలేదు. మతాన్నీ, అగ్రరాజ్యాల ప్రయోజనాలనూ ప్రాతిపదిక చేసుకొని పరస్పర ద్వేషం పెంచుకున్నాయి కూడ. ఆ రోజులు పోయే పరిస్థితులు ఇప్పుడు కనిపిస్తున్నాయి. భారత్ పాకిస్తాన్‌తోనూ, చైనాతోనూ సంబంధాలు క్రమంగా మెరుగు పరచుకుంటున్నది. ఇరాన్‌తో నిజానికి మొదటినుండి భారత్‌కు మంచి సంబంధాలున్నాయి. దీనిని మరింత పెంపొందించుకొని బలమైన 'దక్షిణార్ధాన్ని' రూపొందించగల తరుణంలో ఇక్కడి సంబంధాలు పాడుచేసుకొని అమెరికాను నమ్ముకోవడం తెలివితక్కువతనం కాదా? చర్చించుకుందాం రండి.

**హైదరాబాద్ నగర కమిటీ**

# జలదుర్గం రమేష్‌లాంటి మానవ మృగాలపై

# నాయకులకు, పోలీసులకు ఎందుకు ఇంత ప్రేమ?

**ఉ**పన్యాసం ఇమ్మంటే అందరూ స్త్రీజనోద్ధారకులే. దగ్గరి నుంచి చూసినప్పుడే నిస్సహాయులైన స్త్రీలను అణచివేయడంలో ఒక్కొక్కరి పాత్ర – పోలీసులు, రాజకీయ నాయకులు, పెద్దమనుషులు, చివరికి కోర్టులు కూడా – ఏమిటో అర్థం అవుతుంది.

భర్త అని పిలవబడే మృగం చేత ఒళ్ళంతా వాతలు పెట్టించుకున్న జలదుర్గం చంద్రకళకు కనీసం చట్టం, సమాజం తన పక్షాన ఉన్నాయన్న సంతృప్తయినా మిగలని వైనం చూస్తే ఈ సత్యం అర్థం అవుతుంది.

తొమ్మిదేండ్ల కింద రెండు లక్షల రూపాయలు, 25 తులాల బంగారం కట్నంగా తీసుకొని చంద్రకళను పెళ్ళి చేసుకున్న రమేష్ ఆ కట్నం చాలక అదనపు కట్నంకోసం ఆమెను హింసించ సాగాడు. అతని తల్లి మీనాక్షమ్మ, చెల్లెలు మాధవి, లతలు అతనికి తోడయ్యారు. వాళ్ళు పెట్టిన మానసిక హింసకు, కొట్టిన దెబ్బలకు తట్టుకోలేక ఇద్దరు పిల్లలను తీసుకొని రైలు కిందపడే ఉద్దేశంతో చంద్రకళ 2003 సంవత్సరం అక్టోబర్ 12వ తేదీన ప్రొద్దుటూరు నుంచి యర్రగుంట్లకు పోయింది. తెలిసిన వాళ్ళు ఆమెను గుర్తుపట్టి ఆపకపోతే ఆ రోజే చనిపోయేది. అయితే అప్పుడు ఆమె ఇచ్చిన ఫిర్యాదును ప్రొద్దుటూరు ఒన్ టౌన్ పోలీసులు నేరారోపణగా పరిగణించి విచారించే బదులు పెద్దమనుషుల ముందుపెట్టి భార్యా భర్తలిద్దరినీ పిలిచి 'ఇక మీదట' బాగా చూసుకుంటానని అతని చేత అనిపించి మూసేశారు. (అరెస్టు తప్పించుకోవడానికి ఆ మాత్రం హామీ ఇవ్వడం అతనికేం కష్టం? జేబు దొంగలకు, నాటుసారా వ్యాపారులకు కూడా ఇదే పద్ధతి వర్తింపచేస్తే నేర ప్రపంచం ఎంత హాయిగా ఉండేది!)

ఆరు నెలలు తిరగక ముందే రమేష్, అతని తల్లీ తోబుట్టువులు చంద్రకళను క్రూరంగా హింసించడం మొదలుపెట్టారు. పోయిన దసరాకు రమేష్ కోరిన డబ్బు చంద్రకళ పుట్టింటి నుంచి తీసుకు రాలేదని ఎడమ తొడమీద పొంగనాల కడ్డీతో వాతలు పెట్టారు. పంచాయతీలు, కేసుల వల్ల పొందిన ఫలితం కళ్ళారా చూసిన చంద్రకళ మళ్ళీ కేసు గురించిగానీ, పంచాయతీ గురించి గానీ ఆలోచించలేదు. ఈ సంవత్సరం ఫిబ్రవరి 11వ తేదీ రాత్రి ఈ హింసాకాండ పరాకాష్ఠకు చేరుకుంది. వారు ఆమెను ఒక గదిలో బంధించి నోట్లో గుడ్డలు కుక్కి కాలిన ఇనుప కడ్డీతో వాతలు పెట్టారు. రమేష్ ఆమె గొంతు నులిమి అదనపు కట్నం తెస్తావా చస్తావా అని బెదిరించాడు. చివరికి ఆమె తన ప్రాణం కాపాడుకోవడానికి కాళ్ళావేళ్ళాపడి మా అమ్మా నాన్నలను అడుక్కొని డబ్బు తెస్తానని చెప్పి ప్రాణం దక్కించుకుంది.

గాయాలు కనపడకూడదని చెప్పి చంద్రకళను ఆ మృగాలు నాలుగు రోజులు నిర్బంధంలోనే ఉంచారు. 15వ తేదీన తన పుట్టింటికి పోనిచ్చారు. అయితే ఆమె పోలీసు ఫిర్యాదు ఇవ్వగలదని అనుకున్నాడేమో రమేష్ అదేరోజు ఆమె మీద, ఆమె తల్లిదండ్రులు, అన్నల మీద ప్రొద్దుటూరు ఒన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో ఒక సినిమా కథ వంటి ఫిర్యాదు ఇచ్చాడు. వాళ్ళంతా కలిసి తన కళ్ళెదుటే తన బెడ్ రూంలోకి ప్రవేశించి డబ్బు, బంగారం, బాండ్లు దోచుకొని సంచిలో వేసి తీసుకుపోయారని దీని సారాంశం. ఇంగితం ఉన్న వాళ్ళెవరికైనా ఈ ఫిర్యాదు వెనుక ఏదో కథ ఉందని తెలిసి ఉండాలి. చట్టం ఆవగింజంత తెలిసినా, భార్య తన భర్త వస్తువులు అతని ఇష్టానికి వ్యతిరేకంగా తీసుకున్నా సరే అది దొంగతనం కిందికి రాదని తెలిసి ఉండాలి. అయినప్పటికీ ప్రొద్దుటూరు ఒన్‌టౌన్ సి.ఐ వెంకటరమణ గారు అప్పటికే ఆర్‌టిపిపికి చేరిన చంద్రకళకూ, ఆమె పుట్టింటి వారికీ వెంటనే ఫోన్‌చేసి రమేష్ మీ అందరిపైనా దొంగతనం కేసు పెట్టాడనీ చంద్రకళ తండ్రి వెనువెంటనే పోలీసుస్టేషన్‌కు వచ్చి కలవవల సిందని ఆదేశించాడు.

నిజమైన ఫిర్యాదులు విచారించడానికి ఈ అధికారి ఎంత ఆతురత చూపుతాడో గానీ చదవగానే అబద్ధం అని అర్థమయ్యే ఫిర్యాదును విచారించడానికి మాత్రం చాలా తొందర ప్రదర్శించాడు. రమేష్ ఫిర్యాదు పైన ఎఫ్ఐఆర్ సైతం నమోదు చేయకుండా చంద్రకళ తండ్రిని స్టేషన్‌కు పిలిపించాడంటే రమేష్ ద్వారా సిఐ గారికి అప్పటికే అసలు కథ తెలిసిందనీ, రమేష్ ఫిర్యాదును చంద్రకళ ఇవ్వగల కంప్లయింట్‌కు కౌంటర్ కేసుగా గుర్తించాడనీ, అసలు కేసు నమోదు కాకుండా ఒత్తిడి చేయడం కోసం చంద్రకళ తండ్రిని స్టేషన్‌కు పిలిపించాడనీ వ్యాఖ్యానిస్తే కుటుంబ హింస విషయంలో పోలీసులు అనుస రిస్తున్న పనితీరుకు భిన్నమైన వ్యాఖ్య అవుతుందా?

పుండు మీద కారంలాగా ఈ బెదిరింపు మీదపడ్డ చంద్రకళ అదేరోజు సాయంకాలం కల్లమల్ల పోలీసుస్టేషన్ వెళ్ళగా వారు ఎఫ్ఐఆర్ నమోదు చేయకుండా కాలిన గాయాల చికిత్సకోసం ప్రొద్దుటూరు సివిల్ ఆస్పత్రికి పంపారు. ఆస్పత్రి వారు పోలీసులను పిలి పించగా, ఆమె వివరమైన ఫిర్యాదు ఇచ్చింది. హత్యా ప్రయత్నం (సెక్షన్ 307), డబ్బు రాబట్టటం కోసం తీవ్రంగా హింసించడం (సెక్షన్ 329) అనే నేరాలు ఆమె ఫిర్యాదులో స్పష్టంగా కనిపిస్తున్నా సి.ఐ గారు కేవలం ఉద్దేశ పూర్వకంగా గాయపరచడం (సెక్షన్ 324), వరకట్నం వేధింపు (సెక్షన్ 498–ఎ) సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. వాటికి శిక్ష 10 సంవత్సరాల నుంచి జీవిత ఖైదు దాకా ఉండగా వీటికి శిక్ష మూడేండ్లు మాత్రమే.

కాగా, రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మీద వెనువెంటనే ఆర్‌టిపిపికి ఫోన్‌చేసి చంద్రకళ తండ్రిని స్టేషన్‌కు రమ్మని హుకుం జారీచేసిన సి.ఐ గారు, చంద్రకళ ఫిర్యాదును మాత్రం భద్రంగా దాచుకొని కూర్చున్నాడు. ప్రొద్దుటూరులోని 'పెద్దమనుషుల'నందరినీ కలిసి తనకు మద్దతు కూడగట్టుకోవడానికి రమేష్‌కు కావలసిన వెసులుబాటు ఉద్దేశ పూర్వకంగా కల్పించాడు. మేము 20వ తేదీన ప్రెస్ కాన్ఫరెన్స్ పెట్టిన తరువాత, 21వ తేదీన హుటా హుటిన బయలుదేరి రమేష్‌ను (వేరే ఎక్కడో కాదు, అతని ఇంటి వద్దనే) అరెస్టు చేసినట్టు రిమాండ్ రిపోర్టులో చెప్పుకుంటూ కోర్టులో హాజరుపెట్టాడు. జిల్లా ఫ్యామిలీ కౌన్సిలింగ్ సెల్ చైర్‌పర్సన్ అయిన పద్మావతమ్మ గారు కూడా 21వ తేదీన జిల్లా ఎస్.పి దృష్టికి విషయాన్ని తీసుకుపోయిన తరువాత, చంద్రకళ ఫిర్యాదులోనే స్పష్టంగా ఉన్న హత్యా ప్రయత్నం సెక్షన్‌ను ఆరోపణలలో చేరుస్తున్నట్టు సిఐ 23వ తేదీన తీరికగా కోర్టుకు తెలియ జేశారు.

అయినప్పటికీ తొలుత ఎఫ్ఐఆర్‌లో చిన్న సెక్షన్లు చూపించిన ఫలితం రమేష్‌కు దక్కింది. సి.ఐ ఉద్దేశం నెరవేరింది. రమేష్‌కు వెంటనే బెయిల్ లభించింది. ఇక్కడ కోర్టు వైఖరి గురించి కూడా ప్రస్తావించక తప్పదు. పోలీసులు ఎఫ్ఐఆర్‌లో ఏ సెక్షన్లు సూచిస్తారనేది కోర్టుకు ప్రమాణం కాదు. ఫిర్యాదులో ఏముందనేది ప్రమాణం. చంద్రకళ ఫిర్యాదులో సెక్షన్ 307, 329 (ఇంకా సెక్షన్లు 343, 348) నేరాలు స్పష్టంగా ఉన్నాయి. ముద్దాయికి బెయిల్ ఇచ్చే ముందు నేరం తీవ్రతను, అతన్ని వెంటనే బెయిల్ పైన విడుదల చేస్తే బాధితుల మనోస్థైర్యం పైన పడగల ప్రభావాన్ని, ముద్దాయి తిరిగి నేరం చేయగల అవకాశాన్ని లెక్కలోకి తీసుకోవాలని న్యాయశాస్త్రం చెపుతుంది. పోలీసులు ఇంకా ఇన్వెస్టిగేషన్ ఏమీచేయలేదన్న కారణంగా క్రూరమైన నేరానికి పాల్పడ్డ వ్యక్తికి బెయిల్ ఇవ్వడం తగదు. భర్త భార్య ఒళ్ళు కాల్చడం తీవ్రమైన నేరం కిందికి రాదని పోలీసులు పెద్దమనుషులు భావిస్తున్నట్టు కోర్టులు కూడా భావిస్తున్నాయని ప్రజలు అనుకొనే పరిస్థితి వస్తే న్యాయవ్యవస్థ పైన గౌరవం మిగులుతుందా?

ఆ తరువాత చంద్రకళ, ఆమె అన్న ప్రొద్దుటూరు ఎంఎల్ఏ వరదరాజులరెడ్డి గారి దగ్గరికి పోయి తమకు జరిగిన అన్యాయం గురించి చెప్పి న్యాయం జరిగేటట్టు చూడమని కోరారు. ప్రజా ప్రతినిధిగా వారికి బాధ్యత ఏమైనా ఉంటే సి.ఐకి ఫోన్‌చేసి కేసు నిర్లక్ష్యం చేసినందుకు మందలించి ఉండవలసింది. వెంటనే నేర పరిశోధన చేపట్టి ఛార్జిషీటు దాఖలుచేయమని చెప్పవలసి ఉండింది. వారి ప్రయోజనాలు దెబ్బతిని ఉంటే ఈ పనే చేసి ఉందురు. కానీ చంద్రకళ విషయంలో అదేమి చేయకుండా "చేయదలచుకుంటే సంసారం చేయి, లేకపోతే విడాకులు తీసుకో" అని సలహా ఇచ్చి పంచాయతీ కావాలంటే చేస్తామని అన్నాడు. పంచాయతీ చేయడానికి ఇదేమైనా పొలంగట్టు తగాదానా, ప్రహరీ గోడ తగాదానా? కట్నం తీసుకోవడమే నేరమైతే పెళ్ళప్పుడు తీసుకోవడమేగాక ఇంకా తెమ్మని ఒళ్ళంతా ఇనుప కడ్డీతో కాల్చిన వాడితో ఏం రాజీ పడుతుంది? సగం డబ్బు తెచ్చిస్తాను. ఈసారీ సగం ఒళ్ళు మాత్రమే కాల్చమని అడుగుతుందా? ఈ నాయకుల, పోలీసు అధికారుల పిల్లలకే ఈ విధంగా జరిగితే ఇదే విధంగా స్పందిస్తారా?

పంచాయతీకి అర్థమేమిటో ఎంఎల్ఏ అనుచరుడు, డీసిసిబి ఉపాధ్యక్షుడు ఓబయ్య గారు స్పష్టం చేశారు. రమేష్ ఆస్తులు చంద్రకళ ఆమె కుటుంబ సభ్యులు దొంగిలించారనీ, ఆమె తన ఒంటిని కాల్చుకుందనీ, ఆమెకు వేరే ఎవరితోనో సంబంధం ఉందనీ అంటూ ఈ ప్రశ్నలకు ముందు జవాబు చెప్పమని కబురు పంపాడు. ఈ నీచత్వానికి పెద్దమనిషి హోదా, నాయకత్వపు హోదా కల్పించి దీనిని భరిస్తున్న సమాజాన్ని తిట్టుకోవాలా, తమ వారి ప్రయోజనాలు కాపాడటానికి ఎంతటి నీచానికైనా దిగజారగల ఈ నాయకుల నైజాన్ని అసహ్యించుకోవాలా అనేది నిర్ణయించటం కష్టం.

చంద్రకళ ఉదంతం ప్రొద్దుటూరు వాసులకు కొత్తకాదు. కట్నం కోసమో, అనుమానం ఉందనో, మొగుడికి రెండో పెళ్ళి చేసుకోవాలన్న కోరిక కలిగిందనో హింసకు గురైన స్త్రీ పోలీసు స్టేషన్‌కు పోతే అక్కడ నిర్లక్ష్యం, లంచగొండితనం, నాయకుల దగ్గరికి పోతే సంసారం చేసుకోమన్న నీతిబోధ, పంచాయతీలని, రాజీలని ఒత్తిళ్ళు, ఆమెదే ఏదో తప్పుందన్న వక్రవ్యాఖ్యలు, సమాజం ఉదాశీనత – ఎన్ని కథలు చూడలేదు? చివరికి నిస్సహాయంగా రాజీపడటమో, తన ప్రాణం తానే తీసుకోవడమో తప్ప గత్యంతరం ఉండటం లేదు. మళ్ళీ ఎవరిని కదలించినా స్త్రీ జనోద్ధరణ గురించి ఉపన్యాసాలు దంచేవారే.

ఎవరూ ఎవరినీ ఉద్ధరించనక్కర లేదు. అన్యాయానికి గురైన వారికి చట్టం అండగా నిలబడాలి, సమాజం అండగా నిలబడాలి. వారి హక్కులు సాధించుకోవటానికి, నిలబెట్టుకోవడానికి సహాయపడాలి. అవమానానికి గురైన వారికి ఆత్మస్థైర్యం కలిగించాలి. కుటుంబం లోపలహింసకు గురయ్యే స్త్రీలపట్ల అధికార యంత్రాంగానికి న్యాయ వ్యవస్థకు, రాజకీయ వ్యవస్థకు అన్నిటినీ మించి సమాజానికి ఉన్న బాధ్యత ఇది. ఈ నాగరికత మనం ఎప్పుడు అలవరచుకుంటాం?

ఇప్పటికైనా చంద్రకళకు న్యాయంచేసి మానవత్వం నిండిన మనుషులనిపించుకుంటారో లేక రమేష్ లాంటి మానవ మృగాలకు మద్దతుదారులుగా చరిత్రలో మిగిలిపోతారో మన నాయకులు, పోలీసులు తేల్చుకోవాల్సి ఉంది.

**కడప జిల్లా కమిటీ**

## బెస్ట్ బేకరీ కేసు వైఫల్యానికి

# జహీరాషేఖ్‌కు సుప్రీంకోర్టు విధించిన శిక్ష న్యాయమైనదా?

**2001**లో గుజరాత్‌లో ముస్లింలపైన జరిగిన మారణకాండ అత్యంత ఘోరమైన ఘటన. దానిని మానవ హననం (జెనోసైడ్) అనడమే సరైనది.

అటువంటి విషయంలో హంతకుల పక్షం చేరి వారికి శిక్ష తప్పించిన వ్యక్తిమీద కోపంరావడం సహజం. ఆ వ్యక్తి స్వయంగా బాధితురాలై ఉండి, మారణకాండలో తన వారిని పోగొట్టుకున్న వ్యక్తి అయి ఉండి, హంతకులతో చేతులు కలపడం మరింత కోపం తెప్పిస్తుంది.

14 మందిని సజీవ దహనం చేసిన బెస్ట్‌బేకరీ మారణకాండలో ప్రాసిక్యూషన్ ఘోరంగా విఫలమై ముద్దాయిలంతా శిక్షణా నుంచి తప్పించుకున్న రోజున జహీరా షేఖ్ స్పందించింది. హక్కుల ఉద్యమకారుల సహాయంతో సుప్రీంకోర్టును ఆశ్రయించింది. సుప్రీంకోర్టు ఆ కేసును అన్ని కేసులలో ఒకటిగా చూడక దాని ప్రత్యేకతను గుర్తించింది. రాష్ట్రం బయట కేసు రీ్ట్రయల్ జరపాలని ఆదేశించింది.

సరిగ్గా ఈ దశలో జహీరా అడ్డం తిరిగి ఎవరినైతే అప్పటిదాకా హంతకులని నిందించిందో వారే నిజానికి తన వారిని కాపాడరనింది. సుప్రీంకోర్టుకు కేసు తీసుకుపోవడానికి సహకరించిన తీస్తా సెతల్వాడ్‌ను బ్లాక్ మెయిలర్ అనింది. బెస్ట్‌బేకరీ మారణకాండ కేసు రాష్ట్రం బయట విచారించినా కూడా న్యాయం జరగకుండా పోయే ప్రమాదం దీని వలన ఏర్పడింది.

మిగిలిన సాక్షులు జహీరాలాగ లొంగిపోకపోవడం వల్ల ఆ ప్రమాదం తప్పింది. కేసు విచారణ మహారాష్ట్రలో నడిచింది. 10 మందికి శిక్షలు పడ్డాయి. అయినప్పటికీ జహీరా పైన కోపం ఉండడం సహజం. ఆ కారణంగా, మాటమార్చి న్యాయానికి అడ్డం పడినందుకు సుప్రీంకోర్టు ఆమెకు ఒక సంవత్సరం జైలు శిక్ష 50 వేల రూపాయల జుర్మానా విధించడం చాలామందికి న్యాయాన్ని నిలబెట్టే ఆదేశంగానే కనిపించి ఉండవచ్చు.

ఆ అభిప్రాయం సరైనదేనా అని కొంచెం ఆలోచించవలసి ఉంది.

సమస్యను లోతుగా అధ్యయనం చేయకుండా, సమగ్రమైన ఆలోచన లేకుండా, ప్రజాకర్షకంగా ఉంటుందని నిర్ణయాలు చేయొద్దని న్యాయస్థానాలు ప్రభుత్వాలను తరచుగా అభిశంసిస్తుంటాయి. ఆ రకమైన పాలనా నిర్ణయాలను 'పాపులిస్టు' నిర్ణయాలు అని నిందిస్తుంటాయి. జహీరాను అక్కడికక్కడే శిక్షించడంలో సుప్రీంకోర్టు అదే దోషానికి పాల్పడిందా? జహీరా ప్లేటు ఫిరాయింపు పట్ల సమాజంలో ఆగ్రహం ఉంది. ఆమె కేవలం భయం కారణంగా ప్లేటు ఫిరాయించలేదనీ, డబ్బులు తీసుకుందనీ దాదాపు అందరూ నమ్ముతున్నారు. ఆ కారణంగా ఆమెను ఉన్నపళంగా శిక్షించడం 'ప్రజాకర్షక' చర్యేననడంలో సందేహం లేదు.



కానీ బెస్ట్ బేకరీ కేసు వైఫల్యం విషయంలో న్యాయానికి అడ్డు తగిలిన వారినందరినీ శిక్షించాలన్నదే సుప్రీంకోర్టు సంకల్పమైతే, జహీరా షేఖ్ ఆ జాబితాలో చివర్న ఉంటుంది. బరోడా పోలీసుల ఆధ్వర్యంలో జరిగిన ఆ కేసు పరిశోధనను నీరుగార్చిన మహానుభావులెవరు? సాక్షులు భయపడే పరిస్థితి ఉన్నట్టయితే వారికి ధైర్యం ఇచ్చే చర్యలు చేపట్టాలన్న ఆలోచన ఎందుకు చేయలేదు? ఇక్కడ బాధ్యత కేవలం బరోడా పోలీసుల దగ్గర ఆగిపోదు. రాష్ట్ర హోంమంత్రి, ముఖ్యమంత్రుల దాకా పోతుంది. అసలు మారణకాండే ముఖ్యమంత్రి గ్రీన్ సిగ్నల్ ఇవ్వగా మొదలైందని అందరికీ తెలుసును. మరి ముఖ్యమంత్రిని హోం మంత్రిని ముద్దాయిలుగా ఎందుకు చేర్చలేదు? బెస్ట్‌బేకరీ కేసుతో సహా గుజరాత్ మారణకాండకు సంబంధించిన అన్ని కేసులలోనూ ముద్దాయిలకు కోర్టులు బెయిలు ఇవ్వొద్దని ప్రభుత్వం గట్టిగా అడ్డు తగలలేదు. అందుకే వాళ్ళు త్వరలోనే బయటికొచ్చి సాక్షులను బెదిరించగలిగారు. ప్రలోభపెట్టి లోబరచుకోగలిగారు. మరి బెయిల్ విషయంలో గట్టిగా అడ్డు తగలొద్దన్న నిర్ణయం ఏ స్థాయిలో జరిగింది? దానికి బాధ్యులెవరు?

ప్రాసిక్యూషన్ కేసును నీరుగారిస్తే విచారణ జరుపుతున్న న్యాయమూర్తి నిస్సహాయంగా ముద్దాయి లందరినీ విడిచి పెట్టనవసరం లేదు. నేర పరిశోధన కొనసాగించమనీ సాక్షులకు రక్షణ కల్పించమనీ పోలీసులను ఆదేశించవచ్చును. బెయిలు పైన బయటికొచ్చి సాక్షులను సతాయిస్తున్న వారి జామీనును తనంతట తానే రద్దుచేసి తిరిగి కటకటాల వెనక్కి పంపించవచ్చు. బెస్ట్ బేకరీ కేసును వివిధ స్థాయిలలో విచారించిన న్యాయమూర్తులకిది ఎందుకు తోచలేదు?

కేసు పునర్విచారణ జరిపించే అధికారం కేవలం సుప్రీంకోర్టుకే కాదు, హైకోర్టుకూ ఉంది. గుజరాత్ హైకోర్టు ఆ అభ్యర్థన నిరాకరించబట్టే అది సుప్రీంకోర్టు ముందుకొచ్చింది. హైకోర్టు ఎందుకు అనవసరం అనుకుంది? 14 ప్రాణాలు ఘోరంగా తీసినవారు అసమర్థమైన నేరపరిశోధన కారణంగా తప్పించుకున్నా ఫరవాలేదని గుజరాత్ హైకోర్టు ఎందుకు భావించింది?

జహీరా లొంగిపోయి అబద్ధపు వాంగ్మూలం ఇచ్చిందని ఆమెపైన అభియోగం మరి. ఆమెను లోబరచుకున్న వారిది అంతకంటే ఎక్కువ తప్పు కాదా? వారిలో ఇద్దరి పేర్లు బయటికొచ్చాయి కూడా. అయినప్పటికీ వారికి ఒక సంవత్సరం జైలు, 50 వేలు జుర్మానా కాదు కదా, ఏ శిక్షా వేయలేదు సుప్రీంకోర్టు. వారిపైన ఉన్నది అభియోగమే తప్ప అదింకా రుజువు కాలేదని అంటారేమో. అది జహీరాకు కూడా వర్తిస్తుంది కదా? ఆమె ప్రమాణపూర్వకంగా వేరువేరు వాంగ్మూలాలు ఇచ్చిన విషయం మాత్రమే రుజువయింది. ఏ పరిస్థితిలో ఇచ్చిందో, భయానికిచ్చిందో, డబ్బుకు ఆశపడి ఇచ్చిందో, రెండూ తగుపాళ్ళలో పనిచేశాయో ఆమెనెవరూ అడగలేదు. కదా! ఆమె జవాబు వినలేదు కదా! వాంగ్మూలాలు మార్చినందుకు ఆమెను విచారించవలసిందేనని సుప్రీంకోర్టు భావిస్తే ఆ పని కేసు విచారణ జరిపిన న్యాయస్థానానికే విడిచిపెట్టవలసింది. అప్పుడు, దానిపైన విచారణ జరిగి ఉండేది. తన మాట చెప్పుకునే అవకాశం జహీరాకు లభించి ఉండేది.

అదే సమయంలో 'బెస్ట్ బేకరీ'ని భ్రష్టు పట్టించిన వారందరి విషయమూ పరిశోధించమని ఏ సి.బి.ఐ.కో ఆదేశం ఇచ్చి ఉండవలసింది. దానిపైన విచారణ జరిపించి ఉండవలసింది. అంతే తప్ప కంటిముందు కనిపించిన వ్యక్తి మీద విరుచుకుపడడం ఏం న్యాయం? ఏం విజ్ఞత? జహీరా షేఖ్ విషయమే కాదు మోడల్ జస్సికాలాల్ హంతకులను కూడా కోర్టు సాక్ష్యం లేదని విడిచి పెట్టినప్పుడు దేశ వ్యాపితంగా వచ్చిన కదలికతో సుప్రీంకోర్టు దాని మీద తిరిగి విచారణను చేపట్టింది.

బెస్ట్ బేకరీ కేసు వెనక ఒక పాలక రాజకీయ పార్టీ ఉన్నట్టే జస్సికాలాల్ హత్యలో ఒక పాలక పార్టీ రాజకీయ నాయకులు ఉన్నారనేది అందరికీ తెలిసిన సత్యం. అందుకేనేమో పాలక రాజకీయ పార్టీ ఏదైనప్పటికీ నేరాన్ని ఋజువు పర్చడంలో ప్రాసిక్యూషన్ విజయవంతంగా విఫలమవుతున్నది!

ఇలాంటి సందర్భాలలో న్యాయాన్ని నిలబెట్టే బాధ్యత కేవలం సాక్షుల మీదనే ఉండదనే దృష్టి కోణంపై చర్చించుకుందాం రండి.

**స్త్రీ జనాభ్యుదయ అధ్యయన సంస్థతో కలిసి**
**వరంగల్ జిల్లా కమిటీ**



కరపత్రం

# 'ప్రతి మనిషికీ ఒకే విలువ' ఎన్నడు సమకూరేను?

**ఎస్.సి., ఎస్.టి., సంక్షేమ చట్టాలు, విధానాల అమలుపైన సెమినార్**

సామాజికంగా బలహీన వర్గాలైన ప్రజల పురోగతి భారత రాజ్యాంగం దేశం ముందు ఉంచిన లక్ష్యాలలో ముఖ్యమైనది. ప్రత్యేకించి ఎస్.సి., ఎస్.టి. ప్రజానీకం అభ్యున్నతిని ఒకటికి నాలుగుసార్లు రాజ్యాంగం ప్రస్తావించింది.

కానీ ఇప్పటికి సాధించింది ఎంత? రేపు సాధించబోయేది ఎంత?

ఈ లక్ష్యాన్ని సాధించడానికని చెప్పి అనేక చట్టాలు, విధానాలు ప్రకటించబడ్డాయి, రూపొందించబడ్డాయి. వాటికి ఏం గతి పట్టిందో సమీక్షించుకోవడం అవసరం.

రాజకీయ రిజర్వేషన్ల వల్ల దళిత, ఆదివాసీ వర్గాలు నిర్ణయాధికారంలో భాగం పంచుకుంటారని ఆశించడం జరిగింది. వారి జనాభా దామాషాలో వారికి వివిధ సంస్థలలో భాగస్వామ్యం కల్పించడం జరిగింది. కాని దానివల్ల నిర్ణయాధికారంలో దళిత, ఆదివాసీ ప్రజానీకానికి భాగం లభించిందా? లేక, మాకూ దళిత నాయకులున్నారు అని చెప్పుకునే అవకాశం పార్టీలకు లభించిందా? ఏ చట్ట సభలోనైనా, స్థానిక సంస్థలోనైనా పార్టీలకు అతీతంగా దళిత లేక ఆదివాసీ ప్రతినిధులు ఒక్కటిగా నిలబడి తమ వర్గాల హక్కులు కాపాడుకున్న ఘటనలు ఎన్ని చూశాం? కులవ్యవస్థ ధ్వంసం కానట్టయితే ప్రజాస్వామ్యాన్ని అది కబళించి వేస్తుందన్న డా॥ అంబేద్కర్ అభిప్రాయాన్నే ఈ యాభై సంవత్సరాల రాజకీయ రిజర్వేషన్ల చరిత్ర రుజువు చేసిందనుకోవాలా? లేక ఈ ప్రయత్నం ఇంకా శైశవంలో ఉంది కాబట్టి అప్పుడే తీర్పు చెప్పొద్దనుకోవాలా?

ఉద్యోగ రిజర్వేషన్ల విషయంలో జీవిత అనుభవం మొదటి అభిప్రాయానికే బలం చేకూరుస్తుంది. ఉద్యోగ రిజర్వేషన్లకు – ముఖ్యంగా విశ్వవిద్యాలయాలలోనూ, ఉన్నత స్థాయి వైజ్ఞానిక సంస్థలలోనూ ఎన్ని రకాలుగా గండికొట్టాలో అన్ని రకాలుగా కొట్టారు. హక్కును 'బ్యాక్‌లాగ్' చేశారు. ఆ పైన కాంట్రాక్టు ఉద్యోగాలు ప్రవేశపెట్టి వాటిలో రిజర్వేషన్లే లేవు పొమ్మన్నారు. క్రమంగా ప్రభుత్వ రంగాన్ని ప్రైవేటీకరించి ఆ ప్రస్తావనే లేకుండా చేశారు. ప్రైవేటు విద్యాసంస్థల్లో రిజర్వేషన్లు కల్పించడానికి అవకాశం ఇచ్చే రాజ్యాంగ సవరణ చేశారు గానీ ప్రైవేటురంగ ఉద్యోగాలలో రిజర్వేషన్ హక్కు కల్పించగల రాజ్యాంగ సవరణ చేస్తారా? చేసి రెండు చేతులా దేశంలోకి ఆహ్వానిస్తున్న బహుళజాతి పెట్టుబడిదారీ సంస్థలకూ కార్పొరేట్ భారత్‌కూ కోపం తెప్పిస్తారా?

దళితులు, ఆదివాసులు అత్యధికంగా భూమిలేని పేదలు కాబట్టి భూమి హక్కు కల్పించడం ఆ వర్గాల పురోగతికి చేయగల ముఖ్యమైన మేలని స్వాతంత్ర్యం వచ్చిన

కొత్తలోనే గుర్తించారు. భూసంస్కరణల పేరిట రకరకాల చట్టాలు చేశారు. కొండను తవ్వి ఎలుకను పట్టినట్టు వంద ఎకరాలలో రెండో మూడో మిగులు భూమిగా గుర్తించారు. బండలూ తుప్పలూ ఉన్న భూమిని దయగల భూస్వాముల నుంచి భూదానంగా తీసుకున్నారు. ఇదంతా పంచినా కూడా దళితుల పేదరికంలో పెద్దగా తేడా వచ్చి ఉండేది కాదు. కానీ అంతా పంచలేదు కూడా. కొంత పంచారు, కొంత భూస్వాముల వద్దే ఉంచారు. కొంత లిటిగేషన్‌లో ఇచ్చారు.

ఒకనాడు రాజులు బ్రాహ్మణులకు, ఇతర పెత్తందారీ కులాలకు అగ్రహారాలనీ, జమీందారీలనీ, ఈనాంలనీ ధారాదత్తం చేసిన భూమిని స్వాతంత్ర్యం వచ్చిన తరువాత స్వాధీనం చేసుకున్నట్టే చేసుకొని, తిరిగి సెటిల్‌మెంట్ పేరిట పెత్తందారీ వర్గాలకే అప్పగించారు. భూమిలేని పేదలకు దక్కవలసిన లక్షల ఎకరాల భూమి, ఆస్తిపరుల అదనపు ఆస్తిగా మారింది. భారతభూమి భాగోతంలో రైతువారీ 'సెటిల్‌మెంట్' అతి పెద్ద ప్రహసనంగా గుర్తింపు పొందింది.

బలహీన వర్గాల పిల్లలు చదువుకోడానికని చెప్పి సాంఘిక సంక్షేమ హాస్టళ్ళు కట్టారు. ఇదొక మంచి ప్రయోగంగా ప్రారంభం అయిందిగానీ రానురాను ఆ హాస్టళ్ళొక అంటరాని ప్రపంచం అయ్యాయి. వాటిని నిధులు లేక ఎండబెట్టారు. కేంద్రం నుండి నిధులు వస్తే హాస్టళ్ళ మీద ఖర్చు చేయకుండా, సివిల్ కాంట్రాక్టర్ల బిల్లులు చెల్లించడానికి వాడుకున్నారు. సరైన తిండి లేక శుభ్రమైన నీళ్ళు లేక అవి మురికి కూపాలయ్యాయి.

ప్రభుత్వ విధానాలు ఈ విధంగా అమలవుతుండగా, సమాజంలో దళిత, ఆదివాసీ ప్రజల పట్ల వైఖరులేమైనా మారాయా అని చూస్తే నిరాశే మిగులుతుంది. అసలేమీ మార్పులేదనీ, 19వ శతాబ్దపు వైఖరులే నేటికీ ఉన్నాయని అనలేముగానీ ప్రజాస్వామ్య స్ఫూర్తి గురించి రాసుకునే అందమైన మాటలకూ వాస్తవానికీ మధ్య చాలా అంతరం ఉంది. ముఖ్యంగా, ఎస్.సి., ఎస్.టి., ప్రజలు తమ హక్కులకోసం గట్టిగా నిలబడ్డచోట మధ్యయుగాల వైఖరులే జవాబులవుతున్నాయి. భౌతిక దాడులు, హింస, దౌర్జన్యం, సంఘ బహిష్కరణ యధేచ్ఛగా అమలవుతున్నాయి. భూమి హక్కుకోసం గట్టిగా అడిగినా, రాజకీయ హక్కులు అమలుచేసుకుంటామని పట్టుబట్టినా, నువ్వెంతో నేనూ అంతే అన్న ప్రాథమిక మానవ హక్కును ఆచరించినా సవర్ణ హిందూ సమాజం మొత్తం ఒకటై దాడి చేస్తుంది, వెలివేస్తుంది, అన్ని రకాలుగా హింసిస్తుంది. నెల్లూరు జిల్లా వరికుంటపాడు ప్రాంతంలో యానాదుల స్థితి ఈ అమానుషమైన సామాజిక నీతికి అద్దం పడుతుంది. మూకుమ్మడిగా వారిని నేరస్తులుగా ప్రకటించి సమాజం, అధికార యంత్రాంగం వారి స్వేచ్ఛతో, జీవించే హక్కుతో, ఆత్మాభిమానంతో చెలగాటం ఆడుతున్న వైనం మనుధర్మానికి చెందినదే తప్ప ఆధునిక భారత రాజ్యాంగంలోని 'సామాజిక న్యాయం, రాజకీయ న్యాయం, ఆర్థిక న్యాయం' అనే విలువలతో దానికేమీ సంబంధం లేదు.

ఈ హింసను ఎదుర్కొనే ఉద్దేశంతో పార్లమెంటు 1989లో రూపొందించిన ఎస్.సి., ఎస్.టి. (అత్యాచారాల నిరోధక) చట్టం అమలు అన్నిటి కంటే ఆందోళన కలిగిస్తున్న విషయం. ప్రజలకు హక్కులు కల్పించే చట్టాలు సాధారణంగా అజాగ్రత్తగా, అసమగ్రంగా రూపొందించబడతాయన్న పాలనా నీతికి భిన్నంగా ఇది సమగ్రంగా తయారుచేసిన చట్టం. కానీ సమాజంలో ప్రబలంగా ఉన్న దమననీతి దీని అమలుకు అడుగడుగునా అడ్డం తగులుతున్నది.



దాడికి గురైన దళితులు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదుచేస్తే కేసు నమోదు చేయరు, నమోదుచేస్తే అరెస్టు చేయరు, అరెస్టు చేసినా నేరపరిశోధన సక్రమంగా చేయరు. 'కౌంటర్ కేసులు' ఆహ్వానించి రాజీపడమని ఒత్తిడి చేస్తారు. చివరికి ఛార్జిషీటు పెట్టినా, ప్రాసిక్యూట్ చేసినా అందులో చిత్తశుద్ధి ఉండదు. నేరస్తులను శిక్షించి తీరాలన్న సంకల్పం ఉండదు. బాధితులకు నష్టపరిహారం ఇవ్వాలన్న ఆదేశాలు అమలుకావడానికి వారిని ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ కాళ్ళరిగేలా తిప్పించుకుంటారు. సూళ్ళూరుపేట, తడ, దొరవారిసత్రం మొదలు వాకాడు, చిట్టమూరు, కలిగిరి, వింజమూరు, పెళ్ళకూరు, ఓజిలి, ఎస్సార్‌పురం, సంగం, వరికంటపాడు, దుత్తలూరు వరకు దాదాపుగా అన్ని చోట్లా ఇదే పరిస్థితి. మిగతా జిల్లాలలో పరిస్థితి కూడా ఇంతకన్నా భిన్నం కాకపోవచ్చు. నెల్లూరు జిల్లాలోనైతే గతంలో ఎస్.పిగా పనిచేసిన రాజేంద్రనాథ్‌రెడ్డి తన అనుమతి లేకుండా ఎస్.సి., ఎస్.టి. చట్టం కింద కేసులే నమోదు చేయవద్దన్న చట్ట విరుద్ధమైన ఆదేశం జారీచేసి హైకోర్టు చేత, జాతీయ ఎస్.సి., ఎస్.టి కమిషన్ చేత తిట్లు తిన్నాడు గానీ ప్రభుత్వం అతనిపైన ఏ చర్యా ఇప్పటిదాకా తీసుకోలేదు.

బాధాకరమైన ఈ స్థితి నుంచి దళిత, ఆదివాసీ ప్రజానీకం బయటపడే మార్గాలేమిటి అని ఆలోచించుకోవడం, చర్చించుకోవడం అవసరం. 'ప్రతి మనిషికీ ఒకే విలువ' అనే అంబేద్కర్ సూక్తిని నిజం చేయగల మార్గాలు అన్వేషించడం అవసరం. ఈ ప్రయత్నంలో భాగంగా మార్చి 5వ తేదీన నెల్లూరులో నిర్వహిస్తున్న సెమినార్‌కు మీకందరికీ ఆహ్వానం.

**నెల్లూరు జిల్లా కమిటీ**

# రాజ్యాంగ విలువలు లక్ష్యంగా ప్రభుత్వ యంత్రాంగం పనిచేస్తే

## కొగిల్వాయి రవి తల్వార్ రవిగా ఎదిగేవాడా!?

## పున్నంచందర్ ఇంటిపై పోలీసులు దాడి చేసేవారా!?

## జిల్లాల ఎస్.పి.లు హక్కుల బోనులో నిలబడేవారా!?

వరంగల్ ప్రజలకు, ప్రజాస్వామిక వాదులకు, పౌరవిధులు తెలిసిన అధికార, అనధికార వర్గాలకు మానవహక్కుల వేదిక విజ్ఞప్తి ఏమనగా ...

ఈనెల 4 అర్ధరాత్రి దాటిన తర్వాత అనగా 5వ తేదీ చిమ్మచీకట్లో నాగారం క్రాస్ దగ్గర పేరు మోసిన క్రూర హంతకుడిని గుర్తుతెలియని నక్సలైటుగా ఎన్‌కౌంటర్‌లో చంపేశామని జిల్లా ఎస్.పి. దొరగారు ప్రకటించిన విషయం గుర్తు ఉండే ఉంటుంది. దొరగారి ప్రకటనకు భిన్నంగా ఆ కిరాయి హంతకుని తల్లి, భార్య మీడియా ముందు మాట్లాడారు. తమ ఇంటికి వచ్చి 'మాట్లాడుదా మని చెప్పి 4వ తేదీ ఉదయం తమ వెంట తీసుకెళ్ళి చంపినారని' వాళ్ళు ఏడుస్తూ చెప్పింది కూడా మనకు గుర్తుంది. ఈ వైరుధ్యంలో ఏది నిజమో జిల్లా ప్రజలకు తెలిసినా నిజాన్ని నిర్ధారించవలసి ఉందని మానవహక్కుల వేదిక జిల్లా కార్యదర్శి భావించాడు. నిజనిర్ధారణ కమిటీగా వెళ్ళి 6వ తేదీన సంఘటన జరిగిన ప్రదేశాన్ని పరిశీలించి, కొగిల్వాయి గ్రామానికి వెళ్ళి కుటుంబ సభ్యులతో, గ్రామస్తులతో మాట్లాడారు. తాము నిర్ధారించిన నిజాన్ని ప్రజలకు తెలియజేశారు.

కొగిల్వాయి రవి అనేవాడు ఇరవై ఏళ్ళుగా హత్యలు, అత్యాచారాలు, సెటిల్‌మెంట్లు చేసింది నిజమే. పగతో, ద్వేషంతో, కామవాంఛతో, కిరాయి స్వభావంతో పలు నేరాలకు పాల్పడింది నిజమే. ఇంతటి ఘనమైన నేరస్థుడిగా మారడానికి అతనికి ఆనాటి అధికార రాజకీయ పార్టీ అండ ఉంది. పోలీసుల రక్షణ ఉంది. అలాంటి నేరస్థుణ్ణి మాట్లాడి పంపిస్తామని చెప్పి ఎక్కడో చంపి నాగారం క్రాస్‌రోడ్డు దగ్గర పడేశారు. పైగా ఈ ఎన్‌కౌంటర్‌లో గుర్తు తెలియని నక్సలైటు చని పోయాడని ప్రకటించడం పోలీసు అధికారికే చెల్లిందనీ, పోలీసు రికార్డులలో భద్రంగా ఉన్న క్రూర నేరస్థుణ్ణి గుర్తించక పోవడమేమిటనీ, చట్ట ప్రక్రియను అమలు చేయవలసిన పోలీసు అధికారులే ఉల్లంఘించడం ఆ చట్ట ప్రకారమే నేరమని నిజనిర్ధారణ కమిటీ తరపున పున్నంచందర్ ప్రకటించాడు.

ఈ ప్రకటన చదివిన జిల్లా పోలీసు అధికారి అసహనంతో ఊగిపోయినట్టున్నాడు. తను పున్నంను ఏప్రిల్ 23వ తారీఖున ఎస్.పి ఆఫీసుకు పిలిపించుకొని బెదిరించినా ఇంత సాహసం చేస్తాడా? అని ప్రశ్నించుకున్నట్టుంది. "మీ ప్రకటనలు చదివిన మా వాళ్ళు కోపంతో ఊగిపోతు న్నారు. వాళ్ళను నీ మీద దాడి చేయకుండా ఆపడం కష్టమవుతున్నది ... నీవు ఇట్లాగే ఉంటే నేను నా హోదాను పక్కనబెట్టి ఏమైనా చేస్తా... అని చేసిన హెచ్చరికలు గాలికి పోవడమేనా?" అని ప్రశ్నించుకున్నట్టు ఉంది. లేదా 'ఈ జిల్లాకు కొన్ని లక్ష్యాలకోసం వచ్చి ఆ లక్ష్యాలు సాధించిన నన్నే ఖాతరు చేయడా!?' అని ప్రశ్నించుకున్నాడో ఏమో ... నగర డి.ఎస్పీగారితో ఓ ప్రకటన, తనకు





సంతృప్తినిచ్చే విధంగా ప్రకటించి శహభాష్ అనిపించుకుంటున్న ఘనపూర్ సి.ఐ., మడికొండ ఎస్సైలతో ఓ ప్రకటన, తన స్వంత నిఘా వ్యక్తులైన కోబ్రాస్‌తో ఓ ప్రకటన, పోలీసులు రాసిన ప్రకటనపై నాగపురి శోభతో సంతకం చేయించి విడుదల చేసిన ఇంకొక ప్రకటన మీడియాకు పంపిస్తూనే పున్నంచందర్ ఇంటిపై కొగిల్వాయి రవి బాధితులు దాడిచేశారు. ఆ సంఘటన దృశ్యాలను కవరు చేయండని ఎలక్ట్రానిక్ మీడియాకు సమా చారం అందించాడు. మీడియా ప్రతినిధులు పున్నం ఇల్లు చేరుతుండగా దాడిచేసి ధ్వంసం చేసిన 25 మంది తప్పుకున్నారు. మీడియా ప్రతినిధులే అందించిన సమాచారంతో బుర్ర రాములు, పున్నంచందర్‌లు అక్కడికి చేరుకున్నారు. ఇంటిని పరిశీలించారు.

బయటి నుంచి తాళం వేసిన గదికి తలుపు రెక్కను పగులగొట్టి లోపలికి వెళ్ళిన మూక గదిలో ఉన్న కుర్చీలు, అద్దాలు, టెలిఫోను విరగగొట్టారు. బట్టలు చింపారు. బియ్యం బక్కెట్‌ను విరగ్గొట్టారు. అంబేద్కర్, బుద్ధుడు, జ్యోతిరావు ఫులే ఉన్న క్యాలండర్‌ను విసిరి వేశారు. ఈ దృశ్యాలను మీడియా చిత్రీకరించింది. ఈ సంఘటనకు దారితీసిన పరిణామా లను వివరించి ఈ దాడి జిల్లా ఎస్.పి.నే చేయించాడని జిల్లా మెజిస్ట్రేటు, కలెక్టరు గారికి తెలిపాము. తగు చట్టబద్ధ చర్య తీసుకోవాలని కోరాము.

## పౌర సంస్కృతిని ఆశించే జిల్లా ప్రజలారా!

కలెక్టర్ గారికి మేమిచ్చిన వినతిపత్రం వల్ల కావచ్చు, పత్రికలలో మేము చెప్పిన నిజాలు కావచ్చు. ఎస్.పి దొరగారు మౌనం దాల్చి డి.ఎస్.పి తదితర భాజాభజంత్రీలతో ప్రకటనలిప్పించాడు. 'పున్నంచందర్ ఇంటిపై జరిగిన దాడికి పోలీసులకేమీ సంబంధం లేదు. కొగిల్వాయి రవి బాధితులే ఆ దాడి చేసి ఉండవచ్చు. మాకు ఫిర్యాదులు అందక పోయినా 'సుమోటో' కేసు నమోదు చేశాము. దర్యాప్తు చేపట్టాము. దాడి చేసిన వారిని తొందరలో పట్టుకుంటాము' అని డి.ఎస్.పి గారు ప్రకటిస్తే, ఘనపూర్ సి.ఐ., మనికొండ ఎస్సైలు కిరాయి హంతకులపై బ్రహ్మాస్త్రం ప్రయోగించం ... హంతకులు, అత్యాచారాలు చేసినవాడు చనిపోతే ఆ దుఃఖంలో ఉన్న అతని మిత్రుడైన పున్నంచందర్ మాపై నింద వేయడం ఏమిటి? రవి హత్యలు చేసినప్పుడు ఈ సంఘం ఏమి చేస్తున్నది? సెటిల్‌మెంట్లు చేసి లక్షలు గుంజుకొన్నప్పుడు ఈ సంఘం ఎందుకు మాట్లాడలేదు అని ప్రకటించారు. వీళ్ళను మించిన ఎస్.పి.గారి ఆంతరంగిక చట్టబద్ధ రౌడీలైనవాళ్ళు సి.పి.ఐ కోబ్రాస్ 'పేరుతో 'ఈ దాడి మేమే చేశాము. బాలగోపాల్, బుర్రరాములు, పున్నంచందర్‌లను చంపు తామని' హెచ్చరిక చేశారు. ఈ మూడు విధాలైన ప్రకటనలు, డి.ఎస్.పి గారి స్వీయ వైరుధ్య ప్రకటన ఏ ఫలితాలనిస్తుందో మీరు అంచనా వేసుకోగలరని మా విశ్వాసం. అయినప్పటికీ పోలీసు యంత్రాంగానికి పౌరసంస్కృతిపై అవగాహన కల్పించవలసిన బాధ్యత మాపై ఉంది.

మానవ హక్కుల వేదిక కొగిల్వాయి రవి అనబడే ఓ గరిష్ట నేరస్థుణ్ణి శిక్షించకూడదని ఎన్నడూ అనలేదు. పైగా ఈ జిల్లాలో ఇలాంటి వ్యవస్థీకృత నేరగాళ్ళ చర్యలను తరచూ ఖండిస్తూనే ఉంది. అతన్ని బాధితుల పక్షాన ఏ సంస్థో, శ్రేయోభిలాషులో లేదా కిరాయి వ్యక్తులో చంపితే పట్టించుకోవాల్సిన అవసరం రాకపోవు. ఇలా కాకుండా చట్టబద్ధంగా విధులు నిర్వర్తించి పౌరసంస్కృతికి బాసటగా ఉండవలసిన పోలీసు అధికారులు హత్యలు

చేస్తేనో, చేయిస్తేనో మానవహక్కుల వేదికే కాదు మీరు కూడా మౌనంగా ఎలా ఉండ గలరు?

రవి అనే ఓ గ్రామీణ యువకుడు తల్వారు రవిగా ఎలా రూపాంతరం చెందాడు? 1984లో వీడు చేసిన మొదటి హత్యపై పకడ్బందీగా చట్టప్రక్రియను అమలుచేసి శిక్షించకుండా ఎవరు అడ్డుకున్నారు? అప్పటి అధికార పార్టీ కాదా? అప్పటి జిల్లా పోలీసు అధికారి కాకుండా ఎవరు? ఆత్మహత్యకు పురికొల్పే విధంగా ఓ మహిళపై అత్యాచారం చేసి దానికి ఆమె భర్త సాక్ష్యం చెప్పబట్టి కదా వాడికి జైలుశిక్ష పడింది. అలాంటి నేరస్థుడికి పెరోల్ మంజూరు చేయించడంలో అప్పటి అధికార రాజకీయ పార్టీ సహాయం చేయకుండా ఉండి ఉంటే వాడు బయటికొచ్చి ఆమె భర్తను చంపేవాడా! ఆ తర్వాత కిరాయి హంతకునిగా మారేవాడా! నాగపురి సారంగపాణిని చంపేవాడా! ల్యాండ్ మాఫియాను ఏర్పర్చడంలో పోలీసుల, అధికార రాజకీయ పార్టీ నాయకుల ప్రయోజనాలు లేకుంటే సెటిల్‌మెంట్లు చేసేవాడా!? లక్షలు ఆర్జించేవాడా! ఇన్ని నేరాలు చేస్తూ కుటుంబంతో నిశ్చింతగా జీవించడానికి పోలీసు అధికారుల ఇచ్ఛాపూర్వక మద్దతు లేకుంటే సాధ్యమా!? రాష్ట్రంలో అధికార పార్టీ మారింది. జిల్లాలో పోలీసు అధికారి మారాడు. అందువల్లనే సుభాష్ అనే కాంగ్రెస్ కార్యకర్తను చంపితే పోలీసు ప్రాధాన్యతలు మారి రవిని ఇంట్లో నుంచి తీసుకొచ్చి చంపి 'ఏమి ప్రకటించినా సిగ్గేమిటి' అనుకున్నారేమో ఎన్‌కౌంటర్‌లో చనిపోయాడని ఎస్.పి దొరగారు ప్రకటించారు. పైగా ఇలా హత్యలే వృత్తిగా పెట్టుకున్న వాళ్ళ పోస్టుమార్టం టేబుల్ ఎక్కక తప్పదని 'వీరోచిత' కంఠంతో హెచ్చరించారు!

## ఈ పరిణామం పౌరసంస్కృతికి లోబడిందేనా?

1984లో ప్రతిపక్ష రాజకీయ పార్టీకి చెందిన గ్రామ ఉపసర్పంచ్ హత్యకు అప్పటి అధికార రాజకీయ పార్టీ మాట ప్రకారమే పోలీసు అధికారి రక్షణ కల్పించాడు. ఇప్పుడు అధికారంలో ఉన్న పార్టీకి చెందిన ఎం.పి.టి.సి భర్తను చంపితేనే రవి పోలీసులకు 'దొరికాడు!' గుర్తు తెలియని నక్సలైటు ఎన్‌కౌంటర్‌లో చనిపోయాడని చెప్పి శవం రవిదని తేల్చారు! ఈ పరిణామాన్ని ఎవరు నడిపించారు?

చట్ట ప్రక్రియను తూ. చ. తప్పకుండా ఆచరించవలసిన పోలీసు అధికారులే రవి హంతకునిగా ఎదగడానికి దోహదపడ్డారు. తర్వాత హత్య చేశారు. పైగా ఎన్‌కౌంటర్ అనే రక్షణ కవచాన్ని వాడుకోజూశారు. నక్సలైట్లను ఎన్‌కౌంటర్లో చంపామంటేనే నమ్మడానికి వీలులేకుండా ఉన్న వీరి ఆచరణ ఓ కిరాయి హంతకుడు తల్వార్‌తో వీరిపై దాడిచేస్తే ఆత్మరక్షణ కోసం కాల్పులు జరిపితే చనిపోయాడని చెబితే ఎవరు నమ్ముతారు? వీరి ప్రకటనలు ప్రజలలో పోలీసు యంత్రాంగంపై నమ్మకాన్ని, అభిమానాన్ని పెంచేలాగా ఉంటున్నవా? అనే ప్రశ్నలు పౌరసంస్కృతిని ఆశించే వాళ్ళం దరం వేసుకోవాల్సిందే.

ఈ ప్రశ్నలే మానవహక్కుల వేదిక వేస్తే ఓ హంతకునికి మద్దతుగా నిలిచామని మాపై దుస్సాహసిక నిందలు వేస్తారా! దాడులు చేస్తారా?

మానవహక్కుల వేదిక రవి అనే హంతకునికి మద్దతుగా నిలువలేదు. పోలీసు దొరలు "పోలీసు యంత్రాంగం చట్ట ప్రక్రియను ఎందుకు ఆచరించడం లేదని మాత్రమే ప్రశ్నిం చాము. చట్ట ప్రక్రియను అన్ని నేరాలకు, అన్ని రకాల నేరస్థులకు కూడా పాటించాలని అడుగుతున్నాము. అధికార పార్టీ ప్రయోజనాలకు, వారి ఆదేశాలకు కాకుండా రాజ్యాంగ ప్రయోజనాలకు, విలువలకు, ఆదేశాలకు లోబడి పనిచేయాలని ఆశిస్తున్నాము. పోలీసు అధికారైనంత మాత్రాన ఇష్టమొచ్చినట్టుగా మాట్లాడి చట్టగౌరవాన్ని తగ్గించకూడదని ఆశపడ్తున్నాము. పోలీసు అధికారి యొక్క



ప్రతిమాట, చర్య ప్రజలకు చట్ట ప్రక్రియపై విశ్వాసాన్ని పెంచే విధంగా ఉండాలని భావిస్తున్నాము.

పోలీసు అధికారులు బాధ్యతలను నిర్వర్తించడమంటే స్థూల అర్థంలో ప్రభుత్వ లేదా ముఖ్యమంత్రి ఆదేశాలు పాటించడమే కావచ్చు. అయినంత మాత్రాన రాజ్యాంగ విలువలకు వ్యతిరేకంగా ఉండే ఆదేశాలు పాటించడమంటే అది కిరాయి ఆచరణే తప్ప ప్రజాస్వామిక ఆచరణకాదు అని మా అభిప్రాయం. అధికార రాజకీయ పార్టీ సేవకులుగా పోలీసు యంత్రాంగం దిగజారకూడదని మా అభిప్రాయం.

మూడు దశాబ్దాలుగా ఈ జిల్లాకు వచ్చిన ఐ.ఎ.ఎస్., ఐ.పి.ఎస్., అధికారులలో అతి తక్కువ మంది మాత్రమే ప్రజాస్వామిక విలువలను ఆచరించారని చెప్పక తప్పదు. చాలామంది అధికారులు వారివారి సామాజిక నేపథ్యాన్ని మరిచిపోయి ఏ రకమైన ప్రజాస్వామిక విలువల ప్రమాణాన్ని పాటించకుండా ఒకే అగ్రవర్ణ ప్రయోజనానికి అండగా నిలిచారు. నిజానికి ఐ.పి.ఎస్. ఉద్యోగాలు బాగా కష్టపడి చదివితే తప్ప పొందలేరు. వారు ఇష్టపడి ఎంపిక చేసుకున్న సబ్జెక్టులలో ఘనంగానే మార్కులు సంపాదించుకొని ఉండొచ్చు. కాని తమ ఇష్టమొచ్చినట్టు విధులు నిర్వర్తించాలనుకుంటే కుదరదని మానవ హక్కుల వేదిక చెపుతుంటే ఈ అధికారులు ఉద్రేకాలతో ఊగిపోతూ పౌరసంస్కృతికి భిన్నంగా మాట్లాడుతున్నారు. వీళ్ళల్లో కొందరు డబ్బున్నవాడి మాటకు, నేరాలకు చట్ట బద్ధతను చాలా సులువుగా సృష్టిస్తారు. ఈ పనిని వీరు బట్టీపట్టి పరీక్షలు పాసైనంత తేలికగా చేయగలరు. ఇంకా కొందరు రాజకీయ పైరవీలకు కట్టుబడి చట్టబద్ధతను తుంగలో తొక్కుతారు. ఈ పనులను కంపల్సరీ పేపర్లను తప్పనిసరిగా చదివి మార్కులు సంపాదించుకున్నట్టుగానే సిన్సియర్‌గా చేసి పెడతారు. కాని రాజ్యాంగ విలువల ఆచరణలో మాత్రం రోజూ ఫెయిల్ అవుతారు.

ఈ విధంగా ప్రభుత్వ యంత్రాంగం పనిచేయడం వల్లనే సులువుగా సమసిపోయే సమస్యలు జటిలమవుతున్నాయి. రాజ్యాంగ విలువలను, వాటి ఆధారంగా తయారుచేసు కున్న చట్టాలను ప్రజలకు గుదిబండగా ఈ యంత్రాంగం మార్చివేస్తున్నది.

బాబాసాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగ సభలో అభిప్రాయపడినట్టు 'మనం రాసుకున్న రాజ్యాంగం చెడ్డదైనా పరిపాలకులు మంచివారైతే అది ప్రజలకు మేలు చేస్తుంది. రాజ్యాంగం మంచిదైనా పాలకులు చెడ్డవారైతే అది చెడుగా పరిణామం చెందుతుంది" అనే మాటలు అక్షర సత్యాలని ఈ పాలకులు, అధికారులు అరవై ఏళ్ళుగా ఋజువు పరుస్తున్నారు. ఈ పరిణామాన్నే ప్రశ్నించింది మానవహక్కుల వేదిక. రాజ్యాంగంలో ఉన్న స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం అధికార రాజకీయ పార్టీలకు, డబ్బున్న వర్గాలకు వర్తింపజేయడం కాదు మీ బాధ్యత అని చెపుతున్నది. అంబేద్కర్ ఆశయాలనే ఆచరించాలనుకునే కిన్నెర పున్నం పోలీసు అధికారి ప్రకటన అబద్ధం అన్నాడు. అందుకే దాడి చేస్తారా?

మానవహక్కుల వేదిక జిల్లా కార్యదర్శిగా కిన్నెర పున్నం జీతభత్యాల కోసం పనిచేసే కార్యకర్త కాదు. పేరు ప్రతిష్ఠల కోసం ప్రకటనలిచ్చే దళారి రాజకీయ స్వభావం కలిగినవాడు కూడా కాదు. మన నిచ్చెనమెట్ల సమాజంలో దళితులుగా వర్గీకరించబడి

అణచివేయబడ్డ కుటుంబంలో పుట్టిన వాడు పున్నం చందర్. జిల్లాలో న్యాయ పోరాట కమిటీలో భాగమై అంబేద్కర్ ఆలోచనలను ఈ సమాజంలోని అణచివేయబడ్డ కులాల కోసం, మహిళల కోసం గిరిజనులకోసం వర్తింపజేసి రాజ్యాంగ లక్ష్యాలైన 'ఒక మనిషికి ఒకే విలువ ప్రజలందరికీ ఒకే విలువ' కలిగిన సమాజ ఆవిష్కరణ కోసం నిర్భయంగా పనిచేస్తున్న కార్యకర్త. అలాంటి కార్యకర్త నిజాలను వెల్లడిస్తే విచా రించి నిర్ధారణ చేసుకోవలసిన అధికారులే కక్షగట్టి, విద్వేష పూరితంగా దాడి చేయడానికి కారణ మేమిటి?

కిన్నెర పున్నం దళితుడు కాబట్టా? ఉన్నత చదువులు చదువలేదు కాబట్టా? జీతభత్యాలు ఆశించకుండా మానవహక్కుల వేదికలో పనిచేస్తున్నాడు కాబట్టా!? పోలీసులే నేరస్తులని ప్రకటించే సాహసం చేశాడని ఎస్.పి దొరగారు భావించాడు కాబట్టా!? అతని ఇంటిపై దాడిచేసి నిర్వీర్యుణ్ణి చేయాలని చూడటం ఏ కోవకు చెందుతుందో ఆలోచించాలని మిమ్మల్ని కోరుతున్నాము.

ప్రజలుగా మనం మన హక్కులు, బాధ్యతల పట్ల నిశ్చేతనంగా ఉండడం అలవాటైంది. మన హక్కు అనే భావనను 'వ్యక్తిగత హక్కు'గా మాత్రమే భావించే వాళ్ళు అధికం. ఇతరుల ప్రయోజనాలకు, హక్కులకు భంగం వాటిల్లితే, ప్రతిబంధకాలు ఏర్పడితే 'నాకేమిటని' ముడుచుకుంటున్నాము. పైగా కొందరికి మంచి జరిగితే దానికి దైవానుగ్రహమో, రాజకీయ, ధన ప్రాబల్యాలో కారణం కావచ్చు ననుకుంటాము. సమాజ వనరులు, వాటిపై అవకాశాలు ఎవరెవరికి ఎలా అందాలో రాజ్యాంగం చెప్పిన విధంగా చెందాలని ఆలోచించడం లేదు. ప్రభుత్వం, దాని యంత్రాంగమైన రెవిన్యూ, పోలీసు ఉద్దేశ పూర్వకంగానే సమానత్వ ప్రాతిపదికను పక్కనబెట్టి నిర్వర్తిస్తున్నవి. కాబట్టే ప్రజలకు గుదిబండలుగా మారిన రాజకీయ పార్టీలకు ప్రభుత్వ యంత్రాంగం బ్రోకర్లుగా మారింది. నిజానికి ఈ పరిణామాన్ని ప్రశ్నించే రకరకాల ఉద్యమ సంస్థలకు ప్రజల హక్కులను నిర్వచించడంలో ఉన్న ఆసక్తి ఆచరించడంలో లేదు. ప్రకటించిన రాజ్యాంగ లక్ష్యాలకు లోబడి రాజకీయ పక్షాలు పనిచేస్తే మానవహక్కుల వేదిక ఆవశ్యకత ఉండదు. ప్రభుత్వ యంత్రాంగమైనా కనీసం రాజ్యాంగ విలువలకు లోబడి పనిచేస్తే మానవహక్కుల వేదిక అవసరం ఉండకపోవచ్చు. ప్రజలు ముఖ్యంగా మేధావి, మధ్యతరగతి ప్రజలు స్వప్రయోజన రేఖను దాటి రాజ్యాంగ విలువల కోసం పనిచేస్తూ ఉంటే కొగిల్వాయి రవి లాంటి క్రూర హంతకులు పుట్టకపోదురు. పోలీసు అధికారులు కొగిల్వాయి రవిలాగానే హత్యలు చేయకపోవుదురు. ఈ పరిణామాలకు, ఫలితాలకు కారణం సమాజంలో, యంత్రాంగంలో పౌరసంస్కృతి బలపడకపోవడమే. కావున పౌరసంస్కృతిని విస్తరింపచేసి రాజ్య యంత్రాంగాన్ని చట్టబద్ధంగా పని చేయించడానికి మానవహక్కుల వేదిక ఎల్లవేళలా సిద్ధంగా ఉంటుందని ప్రజలకు సగర్వంగా తెలియజేస్తున్నాము. మానవహక్కుల కోసం నిశ్చలంగా, నిర్భయంగా, నిబద్ధతతో పనిచేయడానికి అందరినీ ఆహ్వానిస్తున్నాం.

★ డి.ఎస్పీగారు ప్రకటించినట్టుగా పున్నం ఇంటిపై దాడి చేసిన గూండాలను గుర్తిం చారా! గుర్తిస్తారా! చట్టప్రకారం వారిపై చర్య తీసుకుంటారా!? నేరస్థులు గుర్తించ బడకుంటే మా ప్రకటనే నిజమని నిర్ధారిస్తారా!?

★ ఈ జిల్లాలో పోలీసు యంత్రాంగం పని కేవలం ఎన్‌కౌంటర్లు చేయడానికో, కూంబింగ్‌లు చేయడానికో కాక రోజువారీ నేరాలపై దృష్టి పెడతారా?!

**వరంగల్ జిల్లా కమిటీ**





# రిజర్వేషన్ వ్యతిరేక ఆందోళన ఏ ప్రయోజనాల కోసం?

పుష్కరానికొకసారి మన దేశంలో రిజర్వేషన్ - వ్యతిరేక ఆందోళనలు పుట్టుకొస్తుంటాయి. అవే వాదనలతో, అవే నినాదాలతో, అవే చేష్టలతో ఒక కొత్తతరం కుల దురహంకారాన్ని ప్రదర్శిస్తుంటుంది.

ఉన్నత విద్యాసంస్థలలో ఒబిసి కులాలకు రిజర్వేషన్ ఇవ్వరాదన్నది ప్రస్తుత అభ్యంతరం. రిజర్వేషన్ ఇవ్వాలన్న ప్రతిపాదన ప్రభుత్వం నుంచి వచ్చిందంటేనే ఆ సంస్థలలో ఒబిసి కులాలకు చెందిన వారు తగుమాత్రం ప్రవేశించలేకపోతున్నారని అర్థం. ఆ ప్రతిపాదనను అగ్రకులాల వారు వ్యతిరేకిస్తున్నారంటేనే వారు అధికభాగం సీట్లు చేజిక్కించుకుంటున్నారని అర్థం. ఉన్నత విద్యాసంస్థలన్నీ ఆధునిక అగ్రహారాలని వాటిలోకి తొంగి చూసిన వారందరికీ తెలుసును. ఒక్క విద్యార్థుల విషయంలోనే కాదు, అధ్యాపకుల విషయంలో కూడా.

విద్యార్థుల సీట్లలో ఒబిసి కులాలకు రిజర్వేషన్లు ఇవ్వొద్దని ఇవాళ ఆందోళన చేస్తున్నారు గానీ, అధ్యాపక పోస్టులలో ఏనాడో ఒబిసి కులాలకు ఇచ్చిన రిజర్వేషన్‌కు ఏం గతి పట్టించారు? కేంద్ర ప్రభుత్వ సర్వీసులలో ఓబిసిలకు రిజర్వేషన్ కల్పించమన్న మండల్ కమిషన్ సిఫారసులకు 1992లో సుప్రీంకోర్టు ఆమోదం లభించిన వెనువెంటనే, అది కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోని విద్యాసంస్థల అధ్యాపక పదవులకు కూడా వర్తిస్తుందా అన్న ధర్మసందేహం ఆ విద్యాసంస్థల పాలక వర్గాలు వ్యక్తం చేశాయి. 1994 డిసెంబర్ 13న జారీచేసిన ఒక సర్క్యులర్‌లో కేంద్ర ప్రభుత్వ మానవ వనరుల శాఖ ఆ ధర్మసందేహాన్ని నివృత్తి చేస్తూ, మండల్ కమిషన్ సిఫారసులు విద్యా సంస్థలకు కూడా వర్తిస్తాయని స్పష్టం చేసింది.

12 సంవత్సరాల తరువాత పరిస్థితి ఏమిటంటే, మన రాష్ట్ర రాజధానిలో ఉన్న కేంద్ర విశ్వవిద్యాలయంతో సహా దేశంలోని ఏ ఒక్క కేంద్ర ప్రభుత్వ విద్యాసంస్థలోనూ అధ్యాపకుల పోస్టులలో ఒబిసి రిజర్వేషన్లు అమలుచేయడం లేదు. ఎందుకు చేయడం లేదని కోర్టులు ప్రశ్నిస్తే, ఎవ్వరూ చేయడం లేదు కాబట్టి మేమూ చేయడం లేదని ఒక్కొక్క విద్యాసంస్థ పాలకవర్గం సిగ్గువిడిచి పెట్టి జవాబు చెప్తున్నది. అధ్యాపక పోస్టులలోని రిజర్వేషన్లకు ఈ గతి పట్టించి, ఇప్పుడు విద్యార్థుల సీట్లలో రిజర్వేషన్లు ఇవ్వడానికే వీలులేదని గొడవ చేస్తున్నారు.

పుష్కరాల కింద బ్రాహ్మణులు కనిపెట్టి ఆ తరువాత శూద్ర అగ్రకులాలు స్వంతం చేసుకున్న వాదనలే తప్ప, వీళ్ళీరోజు కొత్తగా చేస్తున్న వాదనలేవీ లేవు కాబట్టి వీరికి కొత్తగా చెప్పవలసిన జవాబేదీ లేదు. కొన్ని సామాజిక వాస్తవాలు మాత్రం ప్రస్తావించవలసి ఉంది. 'ఉన్నత విద్యాసంస్థలు' అని పిలువబడుతున్న ఐఐటి, ఐఐఎం, పిజి మెడికల్

కాలేజీలు మొదలైన వాటి సంగతి పక్కన పెట్టండి. సాధారణ గ్రాడ్యుయేట్ల విషయమే తీసుకుని అందులో అగ్రకులాలు ఎందరున్నారో, ఓబిసిలు ఎందరున్నారో చూస్తే మన సామాజిక వ్యవస్థ వికృత స్వభావం కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. నేషనల్ శాంపుల్ సర్వే ఆర్గనైజేషన్ ప్రకటించిన గణాంకాలను విశ్లేషించి, 'ది హిందూ' దినపత్రిక మే నెల 22వ తేదీన ఈ వివరాలు ప్రచురించింది. పట్టణ ప్రాంతాలలోని అగ్రకులాలలో 25.3 శాతం డిగ్రీ చదువుకున్నవారు కాగా ఓబిసిలలో 8.6 శాతం మాత్రమే డిగ్రీ చదువుకున్న వాళ్ళు ఉన్నారు. మొత్తంగా పట్టణ ప్రాంతాలలో డిగ్రీ చదువుకున్న వారిలో అగ్రకులాలవారు జనాభాలో వారి నిష్పత్తి కంటే 64 శాతం ఎక్కువ ఉండగా, ఓబిసిల వాటా జనాభాలో వారి నిష్పత్తి కంటే 44 శాతం తక్కువ ఉంది. పుట్టుకతోనే ఎవరూ ప్రతిభావంతులు కారనేది ఎవరైనా కాదనగలరా? ఆ కారణాలను అధిగమించే విధాన రచన చేయవలసిన బాధ్యత భారత రాజ్యాంగం ప్రభుత్వం మీద పెట్టలేదనగలరా?

రిజర్వేషన్ల వల్ల ప్రపంచ ఖ్యాతి గాంచిన ఈ ఉన్నత విద్యాసంస్థల ప్రమాణాలు పడిపోతాయని వాదిస్తున్నారు వీళ్ళు. ఎందుకు పడిపోతాయి? సిలబస్ తగ్గించమని ఎవరూ అడగలేదే. తక్కువ మార్కులకే పాస్ చేయమని అడగలేదే. సెకండ్‌క్లాస్ వస్తే ఫస్ట్‌క్లాస్ ఇమ్మని ఎవరూ అడగలేదే. ప్రవేశంలో మాత్రమే రిజర్వేషన్ ఉంటుంది. ఆపైన అందరూ అదే సిలబస్ చదవవలసిందే. అదే పాస్ మార్కులు తెచ్చుకోవలసిందే. అవే ఫస్ట్‌క్లాస్ మార్కులు తెచ్చుకోవలసిందే. సంస్థ ప్రమాణాలు ఎందుకు పడిపోతాయి? – లేకపోతే నున్నగా, ఎర్రగా, ఖరీదుగా లేని వాళ్ళ ప్రవేశమే ప్రమాణాల పతనమా?

రిజర్వేషన్ల వల్ల ఓబిసిలలోని పేదలు బాగుపడలేదనీ ధనవంతులు మాత్రమే బాగుపడ్డారనీ రిజర్వేషన్ల వల్ల ఎవరు బాగుపడ్డారో తెలిపే సమాచారం ప్రభుత్వం ప్రకటించాలనీ వీళ్ళు వాదిస్తున్నారు. ప్రకటిస్తే సంతోషమే – ఎందుకంటే వారి ఆరోపణ నిజం కాదని రుజువు అవుతుంది. చదువుకునే అవకాశం లేక కులవృత్తులలో కాయకష్టం చేసి బతికిన తల్లిదండ్రుల పిల్లలు లక్షల సంఖ్యలో రిజర్వేషన్ల ఆసరాతో చదువుకుని జీవితంలో పైకి రాగలిగారన్న సత్యం రుజువవుతుంది. కానీ ప్రభుత్వం ప్రకటించవలసిన సమాచారం వేరే ఉంది. రిజర్వేషన్లు అసలే లేని ప్రైవేటు విద్యాసంస్థలలో సీట్లన్నీ ఎవరు పొందుతున్నారన్న సమాచారం సేకరించాలి, ప్రకటించాలి. అప్పుడు గానీ ఈ ఆందోళన ఎంత అబద్ధపు ఆందోళనో రుజువు కాదు.

వీళ్ళు 'సమానత్వం', 'న్యాయం' అంటూ బ్యానర్లు పట్టుకుని ఊరేగుతున్నారు గానీ అసలు సమస్య కార్పొరేట్ ఉద్యోగాలలో ఈ 'ఉన్నత విద్యాసంస్థల' ఉత్పత్తులకు ఉండే గిరాకీ. ఈ సంస్థల విద్యార్థులను వాళ్ళింకా చివరి పరీక్షలు రాయక ముందే 'క్యాంపస్ సెలెక్షన్'లో పెద్దపెద్ద కంపెనీలు ఎంపికచేసి నెలకు 50 వేల నుంచి 5 లక్షల దాకా జీతాలిచ్చే ఉద్యోగాలలో పెట్టుకుంటున్నాయి. ఈ అవకాశాన్ని ఇతరులతో పంచుకోవడానికి మనసొప్పకే ఈ అల్లరంతా. మరి రేపు ఆ కార్పొరేట్ రంగంలోని ఉద్యోగాలకే రిజర్వేషన్లు వర్తింపచేయాలన్న ప్రతిపాదనలతో ప్రభుత్వం ముందుకొస్తే ఇంకెంత అల్లరి చేస్తారో!

మొదట్లో ఈ ఆందోళకారులు సీట్ల సంఖ్య పెంచితే తప్ప ఓబిసిలకు రిజర్వేషన్లు ఇవ్వడానికి వీలులేదని షరతుపెట్టారు. అది ప్రభుత్వానికి భారమవుతుంది కాబట్టి ఆ షరతు పెడితే ప్రభుత్వం తన ప్రతిపాదనను వదులుకుంటుందని వాళ్ళు ఆశించినట్టున్నారు. కానీ ప్రభుత్వం, ప్రతిపక్షాలు



ఆ డిమాండ్‌ను అంగీకరించి సీట్లు పెంచుతూ ఓబిసిలకు 27 శాతం రిజర్వేషన్ ఇవ్వాలని నిర్ణయించాయి. సీట్లు పెంచితే అందరి విద్యావకాశాలూ పెరుగుతాయి కాబట్టి దీనికి అభ్యంతరం చెప్పనవసరం లేదు గానీ, సీట్ల పెంపుదలతో రిజర్వేషన్‌ల కల్పనను ముడి పెట్టడానికి వీలులేదని ప్రభుత్వానికి స్పష్టంగా చెప్పాలి. ఈ 'ఉన్నత విద్యాసంస్థలన్నీ సాంకేతిక సంస్థలు కాబట్టి సీట్లు పెంచాలంటే ఇతర పరిశోధనా సదుపాయాలనూ, ఉపకరణాలనూ పెంచవలసి ఉంటుంది. దానికి ఖర్చు కావచ్చు, సమయం పట్టవచ్చు. అందువల్ల రిజర్వేషన్‌లు ముందు కల్పించి ఆపైన వెసులుబాటును బట్టి సీట్ల పెంపకం చేపట్టాలే తప్ప ఇది జరిగే వరకు అది జరగొద్దన్న వైఖరి ప్రభుత్వం అనుసరించకూడదు.

చెప్పుకోదగ్గ విషయం ఏమిటంటే సీట్లు పెంచనిదే రిజర్వేషన్లు ఇవ్వరాదని మొదట వాదించిన వారు సీట్లు పెంచుతూ రిజర్వేషన్లు కల్పిస్తామన్న ప్రభుత్వ నిర్ణయం తరువాత కూడా తమ ఆందోళనను విరమించుకోలేదు సరికదా, దానిని ఇంకా ఉధృతం చేస్తామని బెదిరిస్తున్నారు. అంటే ఉన్నతస్థాయి ఉద్యోగ అవకాశాల మీద అగ్రకులాలకుండే గుత్తాధిపత్యాన్ని కాపాడుకోవడమే తప్ప వారి ఆందోళనకు వేరే లక్ష్యమేదీ లేదని స్పష్టం అవుతున్నది. ఇంత అహంకారం, ఇంత బాహాటంగా వ్యక్తం కావడం నయా ఉదారవాద 'సంస్కరణల' యుగంలోనే సాధ్యం అయింది. సామాజిక అసమానతలను, వెనుకబాటుతనాన్ని, పేదరికాన్ని పోగొట్టే ప్రయత్నాలు వ్యర్థమనీ, అన్ని అవకాశాలు ఉన్నవాళ్ళు మరింత వర్ధిల్లడమే 'అభివృద్ధి' అనీ బోధించే ఈ 'సంస్కరణవాదం' బ్రాహ్మణ వాదానికి బాగా అతికింది. దాని అహంకారాన్ని పెంచింది.

అన్యాయాన్ని సమర్థించే వాళ్ళు నిర్లజ్జగా ఆందోళనలు చేస్తుంటే న్యాయాన్ని కాంక్షించే వాళ్ళు మౌనప్రేక్షకులుగా ఉండిపోవడం తగదు. సమన్యాయాన్నీ సమాన హక్కులనూ కాపాడుకుందాం రమ్మని ఆహ్వానం పలుకుతూ –

**30-5-2006**

# పెద్దగట్టు యురేనియం గనులు అవసరమా?

## వాంఛనీయమా? కొంచెం ఆలోచిద్దాం రండి

పెద్దగట్టు, లంబాపూర్ గ్రామాలలో యురేనియం గనులు నెలకొల్పుతామంటూ ప్రభుత్వం చేస్తున్న హడావిడి నల్లగొండ జిల్లా ప్రజలకెరుకే.

పర్యావరణానికి హాని కలిగించగల పరిశ్రమలు గానీ, గనులు గానీ ప్రారంభించే ముందు పర్యావరణ సంబంధమైన అనుమతి తప్పనిసరిగా పొందాలని 1994లో కేంద్ర ప్రభుత్వం ఎస్.ఓ. నెంబరు 60 (2) జారీచేసింది. 1997లో దానిని సవరిస్తూ, పర్యావరణ సంబంధమైన అనుమతి పొందే ముందు స్థానిక ప్రజల అభిప్రాయాలు సేకరించడం కోసం ప్రజా విచారణ నిర్వహించాలని చెప్పే ఎస్.ఓ. నెంబరు 31 (2) జారీచేసింది.

దాని ప్రకారం పి.ఎ.పల్లిలో ఒకసారి, 3-4-2005న శేరుపల్లిలో మరొకసారి ప్రజాభిప్రాయ సేకరణ జరిగింది. ప్రజలు ముక్తకంఠంతో యురేనియం ప్రాజెక్టు మాకొద్దు అని వ్యతిరేకతను వ్యక్తపరిచారు. ప్రజా ప్రతినిధులు, శాస్త్రవేత్తలు, సామాజిక కార్యకర్తలు ప్రభుత్వ ప్రయత్నాన్ని ఖండించారు. అయినా అందరి వ్యతిరేకతనూ సమాధి చేసి యురేనియం ప్రాజెక్టును నెత్తి నెక్కించు కుంటున్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి ప్రతిపక్ష నాయకుడుగా ఉన్నప్పుడు దీనిని వ్యతిరేకించారు. కాని ముఖ్యమంత్రి అయిన తర్వాత అన్ని వాగ్దానాలను తుంగలో తొక్కినట్టు గానే యురేనియం ప్రాజెక్టు కావలసిందేనని పట్టుబడుతున్నారు. చెప్పేదొకటి చేసేదొకటని ఇప్పటికే రాజశేఖర్‌రెడ్డి నిరూపించుకున్నారు. యురేనియం తవ్వకం వల్ల ప్రజలకు ఏ విధంగా నష్టం జరుగుతుందో మరీ సాంకేతిక వివరాల జోలికి పోకుండా చెప్పే ప్రయత్నం చేస్తాం.

మన చుట్టూ ఉన్న పదార్థాలు చాలావరకు తమంతట తాము తమ స్వభావాన్ని, స్వరూపాన్ని మార్చుకోవు. అంటే అవి స్థిరంగా ఉంటాయి. వాటిని మనం పనిగట్టుకొని బాగా వేడి చేస్తేనో మరొక రకమైన ఒత్తిడికి గురిచేస్తేనో అవి మారతాయి.

కాని కొన్ని పదార్థాలు 'అస్థిరమైనవి'. అవి వాటంతటవే మారుతుంటాయి. దీనికి కావలసిన చర్య వాటి కడుపులోనే నిత్యం జరుగుతుంటుంది. అవి మారే క్రమంలో కొన్ని రకాల విద్యుదయస్కాంత స్వభావం గల కణాలనూ కిరణాలనూ లేక అణుధార్మిక శక్తినీ తమ పరిసరాలలోకి వదులుతుంటాయి.

యురేనియం అటువంటి 'అస్థిర' పదార్థాలలో ఒకటి. అది తనంతట తాను థోరియంగా, రేడియంగా, రేడాన్ వాయువుగా మారుతూ ఉంటుంది. ఈ క్రమంలో కొన్ని హానికర పదార్థాలను, శక్తిని గాలిలోకి వదులుతుంటుంది.

ఒక యురేనియం ముద్దను మనం పక్కన పెట్టుకుని కూర్చున్నా మనకేం కాదు గానీ యురేనియం కలిసిన ధూళిని పీల్చినట్లయితే అది శరీరంలోకి పోయి చాలా హాని కలిగించగలదు.



యురేనియం గనిలో పనిచేసే కార్మికులు ఆ ధూళి పీల్చక తప్పదు. వారికి ఊపిరితిత్తుల క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందని యూరప్‌లో యురేనియం గనులను అధ్యయనం చేసిన వారు చెప్తారు.

కార్మికులకు జరగగల హానిని అరికట్టడానికి గని లోపల వెంటిలేటర్లు అమర్చి ఆ ధూళిని ఎప్పటికప్పుడు బయటికి పంపినట్టయితే దాని ప్రభావం తీవ్రత తగ్గవచ్చునేమో గాని ఇది చుట్టుపక్కలనున్న వాతావరణంలో కలిసి పరిసరాలలో నివసించే ప్రజలకు హాని చేయగలదు.

దీనిని నివారించగల చిట్కా ఏదైనా యురేనియం కార్పొరేషన్ దగ్గర ఉన్నట్టయితే తెలుసుకోవడానికి మాకు అభ్యంతరం లేదుగాని, ఆ సంగతే ప్రజలకు చెప్పకుండా ఆశీర్వదించమంటే ఎట్లా?

పెద్దగట్టు - లంబాపూర్‌లలో తవ్వి తీసిన ఖనిజాన్ని శేరుపల్లిలో నిర్మించబోయే కార్ఖానాలో 'శుద్ధి' చేస్తారు. శుద్ధి చేయగా వచ్చే యురేనియం ఆక్సైడ్‌ను హైదరాబాద్‌లోని ఎన్‌ఎఫ్‌సికి పంపించి దాన్నించి యురేనియం వెలికి తీస్తారు.

యురేనియం ఖనిజాన్ని 'శుద్ధి' చేయగా దానినుంచి వచ్చే యురేనియం ఆక్సైడ్ ఒక శాతం కంటే తక్కువ ఉంటుంది. తక్కిన 99 శాతం 'వ్యర్థ పదార్థమే' ఉంటుంది. ఆ వ్యర్థ పదార్థాన్ని అంతకు మూడు రెట్లు నీళ్ళతో బురద లాంటిది చేసి నేలలో తవ్వి తొట్లలో పోస్తారు. అంటే శేరుపల్లి పరిసరాలలో వ్యర్థ పదార్థాల కోనేరులు ఉండబోతాయి. (టెయిలింగ్ పాండ్ అంటారు వీటిని)

ఈ వ్యర్థ పదార్థాలలో ఏమేముంటాయి? ఒకప్పుడు యురేనియంగా ఉండి కాలక్రమంలో దానిలో అంతర్గత మార్పువల్ల థోరియంగా రూపాంతరం చెందిన పదార్థాలు ఉంటాయి. వీటి రూపాంతరమైన రేడాన్ వాయువు ఈ కోనేరుల నుంచి నిత్యం గాలిలోకి కలుస్తూనే ఉంటుంది. పెద్ద మొత్తంలో కాకపోవచ్చు, కొంచెం కావచ్చు, కాని కలుస్తూనే ఉంటుంది. ఆ వాయువు కూడా క్యాన్సర్ రోగకారిణే.

ద్రవరూపంలో ఉన్న ఈ వ్యర్థ పదార్థాలు కోనేరుల నుంచి భూగర్భ జలాలలోకి, పక్కనున్న నదులు, వాగులలోకి పోతుందనేది ఇతర దేశాల అనుభవం తెలిపే విషయం. ముఖ్యంగా రేడియం భూగర్భ జలాలలో పెద్ద మోతాదులో చేరుతుందని కనుగొన్నారు.

శేరుపల్లి సమీపంలో నాగార్జునసాగర్ రిజర్వాయర్ ఉండడం వల్ల భూగర్భ జలాలను అది తనవైపు గుంజుకుంటుంది. నీటితోపాటు ఈ వ్యర్థ పదార్థాలనూ అది గుంజుకోదా? నాగార్జునసాగర్ అయిదు జిల్లాల్లో లక్షల ఎకరాలకు సాగునీరు ఇచ్చే ప్రాజెక్టు. దానిని రేడియంతో కలుషితం చేసే ప్రమాదమున్న ప్రయోగాన్ని సులభంగా అనుమతిద్దామా?

పెద్దగట్టు - లంబాపూర్‌లలో ఉన్న ఖనిజాన్ని 20 సంవత్సరాలలో తీసేయడం జరుగుతుందనీ ఈ తరువాత ఆ గనులను మూసేయడం జరిగిందని యురేనియం వ్యర్థ పదార్థాల 'టెయిలింగ్ పాండ్స్' సమీపంలో నివసించే వారు సంవత్సరానికి సగటున అయిదుగురు చొప్పున క్యాన్సర్ రోగానికి బలి అవుతున్నారని అంచనా. యురేనియం

కార్పొరేషన్ వారు శేరుపల్లి విడిచిపెట్టి వెళ్ళిపోయిన తరువాత కొన్ని వేల సంవత్సరాల వరకూ ఇది జరుగుతూనే ఉంటుందని దీనిని బట్టి భావించవచ్చు.

ఇంతటి ప్రమాదమేమీ లేదనీ, ఇదంతా అతిశయోక్తి అని తాము రుజువు చేయగలమనీ, ఏ కొంచెం ప్రమాదం ఉన్నా దానిని నివారించే శక్తి తమ దగ్గర ఉందని యురేనియం కార్పొరేషన్ వారు వాదించదలచుకుంటే మేము వినడానికి సిద్ధమే. ప్రతివాదానికీ సిద్ధమే. కాని ఈ సమస్యలు ఉన్నాయని ప్రజలకు చెప్పకుండా, యురేనియం గనులు ఏర్పాటుచేస్తామంటే ఎలా? మైనింగ్ విషయంలో తీవ్ర అభ్యంతరాలు ప్రపంచ వ్యాప్తంగానే వ్యక్తమయ్యాయి.

మన దేశానికి యురేనియం మైనింగ్ కొత్తకాదు. జార్ఖండ్ రాష్ట్రంలోని జాదుగూడలో యురేనియం గనులున్నాయి. వాటి దుష్ఫలితాల గురించి తీవ్ర వాదోపవాదాలు జరుగుతున్నాయి. యురేనియం ధూళి పీల్చగా వచ్చిన రోగాల వల్ల జాదుగూడలో 1994లో 17 మంది చనిపోయారని 1995లో 14 మంది, 1996లో 19 మంది, 1997లో 21 మంది చనిపోయారని స్థానిక ఆందోళనకారుల అంచనా. రేడియేషన్ కారణంగా సంభవించే జన్యుసంబంధమైన వైపరీత్యాలు చాలా ఎక్కువగా కనిపిస్తున్నాయని చెపుతున్నారు వాళ్ళు. 'టెయిలింగ్ పాండ్'ల కారణంగా పశువులు, పిల్లలు రోగాల పాలవుతున్నారని వారి ఆరోపణ.

యురేనియం కార్పొరేషన్ వీటిని ఖండించింది. ఆ మాత్రం రోగాలు, చావులు సగటున ఎక్కడైనా ఉండేవేనంది. ఈ వివాదం ఇప్పుడు సుప్రీంకోర్టు ముందు ఉంది. సుప్రీంకోర్టు అందులోని సత్యాసత్యాలు నిర్ధారించడానికి ఒక నిపుణుల కమిటీని నియమించింది. ఆ కమిటీ తన పని ఇంకా పూర్తి చేయలేదు. తన విజ్ఞాపన ఇవ్వలేదు. మరి అంతలోనే నల్లగొండ మీద వచ్చి ఎందుకు పడినట్టు? ఆ నివేదిక వచ్చేదాకా ఆగలేనంత అత్యవసరం యురేనియంతో ఏమొచ్చింది?

ఇంతా చేసి యురేనియం దేనికి కావాలి? అణుశక్తిని ఉత్పత్తి చేయడం తప్ప దానికి వేరే ప్రయోజనమేదీ లేదు. అణుశక్తితో బాంబు చేయొచ్చు. కరెంటు ఉత్పత్తి చేయవచ్చు. అణుబాంబును ప్రపంచమంతటా మానవత్వం ఉన్నవాళ్ళు వ్యతిరేకిస్తున్నారు. వాటిని ఆయుధంగా ఉపయోగిస్తే లక్షలాది జనం చనిపోవడమే కాక భావితరాలు కూడా అంగవైకల్యంతో పుడతారు. అటువంటి అణుబాంబు మనకొద్దని మనం నిర్ద్వంద్వమైన వైఖరి తీసుకోవాలి. ఇక కరెంటు విషయానికొస్తే దానిని వేరే పద్ధతులలో ఉత్పత్తి చేసుకోవచ్చు. చేసుకుంటున్నాం. అణువిద్యుత్తు చవక అంటారు కానీ దాని ఉత్పత్తి వల్ల జరగగల పర్యావరణ నష్టాన్ని, ప్రమాదాలు జరిగే అవకాశాన్ని దృష్టిలో పెట్టుకున్నప్పుడు అన్నిటికంటే అదే ఖరీదైన ప్రక్రియ అని ఇప్పుడు సర్వత్రా గ్రహించారు. అందుకే పాశ్చాత్య దేశాలు అణువిద్యుత్తు కేంద్రాలను కొత్తగా నెలకొల్పడం మానేశాయి. మనకు మాత్రం అవి ఎందుకు? మన దగ్గర బొగ్గు విస్తారంగా ఉంది. జలవిద్యుత్తు ఉత్పత్తికి అవసరమైన నదీ ప్రవాహం ఉంది. సౌరవిద్యుత్తును ఉత్పత్తి చేయడం మీద దృష్టి కేంద్రీకరించి పరిశోధనలు జరిపినట్టయితే శాశ్వతంగా మన ఇంధనం సమస్యను పరిష్కరించుకోవడానికి కావలసినంత ఎండ ఉంది. ఇక యురేనియం తవ్వకాలు ఎందుకు?

చర్చించవలసిన అసలు విషయాలు ఇవి కాగా, యురేనియం కార్పొరేషన్ దేవరకొండ మండలంలో తాను పెద్దఎత్తున ఉద్యోగ అవకాశాలు కల్పించబోతున్నట్టు, 'అభివృద్ధి' తీసుకు రాబోతున్నట్టు ప్రజలలో అభిప్రాయం కలిగించి వారి మద్దతును కూడగట్టి పర్యావరణ సంబంధమైన అభ్యంతరాలను దాటవెయ్యాలని చూస్తున్నది. భ్రమలలో పడే ప్రజలను మేము తప్పుపట్టడం లేదుగానీ యురేనియం కార్పొరేషన్ అనుసరిస్తున్న ఈ ఎత్తుగడ పట్ల మా నిరసన తీవ్రంగా వ్యక్తం చేస్తున్నాం.

వారి రిపోర్టు ప్రకారమే వారు కల్పించబోయే ఉద్యోగాలు 442. అందులో సాంకేతిక నైపుణ్యం, శిక్షణ అవసరమైనవే అత్యధికం ఉండబోతాయి. పెద్దగట్టు వంటి గ్రామాల ప్రజలకు అందుబాట్లో ఉండేవి 30 లేక 40 కంటే ఎక్కువ ఉండవు. స్థానికులకు ఉద్యోగాలు కార్పొరేషన్ నియమాలను అనుసరించి ఇస్తామని తమ రిపోర్టులో రాశారుగాని ఆ నియమాలేమిటో చెప్పలేదు. చివరికి హమాలి పని మాత్రమే దక్కేటట్టయితే దానికోసం ఇంత ప్రమాదం కొని తెచ్చుకోవడం ఎందుకు? హమాలి పని మిర్యాలగూడెం రైస్‌మిల్లుల్లో దొరకదా, సిమెంటు ఫ్యాక్టరీలలో దొరకదా? కాగా, ఏ ఉద్యోగాలు దొరికినా అవి 20 సంవత్సరాల కోసమే. ఆ తరువాత గనులు ఉండవు. కానీ కాలుష్య ప్రమాదం మాత్రం నిరంతరం కొనసాగుతుంది.

జాదుగూడ కాలుష్యం సమస్య గురించి అధ్యయనం చేయడానికి సుప్రీంకోర్టు నియమించిన నిపుణుల కమిటీ నివేదిక వెలుగు చూసేవరకు పెద్దగట్టు – లంబాపూర్‌లలో తవ్వకం మొదలుపెట్టకూడదు.

పర్యావరణ ఉద్యమకారులపైన స్థానిక ప్రజలను కృత్రిమ హామీలతో రెచ్చగొట్టే నీచమైన ఎత్తుగడను యురేనియం కార్పొరేషన్ విడిచిపెట్టాలి.

జనవరి 3 నుంచి 7వ తేదీ వరకు జరుగు పాదయాత్రను జయప్రదం చేయండని విజ్ఞప్తి చేస్తున్నాము.

**జనవరి, 2006**

**నల్గొండ జిల్లా కమిటీ**

## కడప యురేనియం

# వైఎస్‌కు వరం ... ప్రజలకు శాపం

కడప జిల్లా వేముల మండలంలోని వేల్పుల, మీదిపెంట్ల రెవెన్యూ గ్రామాల పరిధిలో యురేనియం ఖనిజాన్ని వెలికితీసి శుద్ధిచేసే గనులు, ఫ్యాక్టరీ రాబోతున్నాయి.

ఇది కడప జిల్లాకు వరం అని రాష్ట్ర ప్రభుత్వం అంటున్నది.

కాదు, శాపం అని మేము అంటున్నాము. ఆ గ్రామాల ప్రజల అభిప్రాయమూ అదే. కానీ అది పులివెందుల కాబట్టి నోరు నొక్కుకొని బతుకుతున్నారు. 'వారిని' కాదని పులివెందులలో బతికినవారు లేరు కదా!

## వరం అని ప్రభుత్వం ఎందుకు అంటున్నది?

యురేనియం గనులు, కర్మాగారం వచ్చినట్టయితే స్థానిక ప్రజలకు పెద్దఎత్తున ఉద్యోగ అవకాశాలు, ఉపాధి అవకాశాలు వస్తాయని రాష్ట్ర ప్రభుత్వం అంటున్నది. ఎన్ని వస్తాయో మాత్రం చెప్పకుండా జాగ్రత్తపడుతున్నది.

నిజానికి ఉపాధి అవకాశాలేకాదు, ఈ ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలన్నీ గోప్యంగానే ఉన్నాయి. ప్రాజెక్టు కోసం 1,122 ఎకరాల ప్రభుత్వ భూమి, 1,118 ఎకరాల ప్రైవేట్ భూమి (అంటే మొత్తం 2,240 ఎకరాలు) అప్పగించబోతున్నారనీ, రోజుకు 3,000 టన్నుల ఖనిజాన్ని వెలికితీసి శుద్ధి చేయబోతారనీ మాత్రం వింటున్నాం. దీనివల్ల ఎంత మందికి నేరుగా ఉద్యోగాలు దొరకగలవు? 1,000 ఉద్యోగాలు వస్తాయనుకుందాం. ఆ 1,000 ఉద్యోగాలూ స్థానికులకే వస్తాయని మాటవరసకు అనుకున్నా, దానికోసం సేకరిస్తున్న 1,118 ఎకరాల సేద్యపు భూమి కల్పించగల ఉపాధి కంటే ఇదేమంత ఎక్కువ? ఆ 1,118 ఎకరాలు మెట్టభూమే కానీ, గడచిన ఏడెనిమిది సంవత్సరాలుగా రైతులే ఖర్చుపెట్టుకొని బోర్లు వేసుకొని, కరెంటు మోటార్లు పెట్టుకొని అరటి, మిరప, వేరుశనగ, పొద్దుతిరుగుడు, బొప్పాయి పండించుకుంటున్నారు. ఎకరం భూమి లక్షన్నర విలువ చేసే మేరకు అభివృద్ధి చేసుకున్నారు. ఈ వ్యవసాయం కల్పించగల ఉపాధికన్నా 1,000 ఉద్యోగాలు ఏమంత ఎక్కువని యురేనియం ప్రాజెక్టును గొప్ప 'అభివృద్ధి'గా ప్రజలు భావించాలి?

## ఆ ఉద్యోగాలు స్థానికులకొస్తాయా?

వేల్పుల, మీదిపెంట్ల గ్రామాల ప్రజలకు 1,000 కాదు కదా, 100 ఉద్యోగాలు కూడా రావు. యురేనియం ప్రాజెక్టులో రెండు భాగాలు ఉంటాయి. ఒకటి ముడిఖనిజాన్ని భూమి నుంచి తవ్వితీసే గనులు. రెండు, దానిని శుద్ధి చేసి యురేనియంను 'యెల్లో కేక్' రూపంలో వేరుచేసే శుద్ధి కర్మాగారం.

కర్మాగారంలోని ఉద్యోగాలు ఎక్కువభాగం నైపుణ్యంతో కూడుకున్నవి. వాటికి కావలసిన విద్యగానీ, శిక్షణగానీ ఈ ఊళ్ళ ప్రజలకు లేవు. గనులలో మట్టిపనీ, తట్టపనీ దొరకొచ్చును గానీ దానికిప్పుడు భారీ యంత్రాలు వస్తున్నాయి. రోడ్డు పనులలో, చెరువు పూడిక తీసే పనులలో వినియోగిస్తున్న ప్రొక్లెయిన్ మిషన్లను మనం చూస్తూనే ఉన్నాము. ఓపెన్‌కాస్ట్ గనులలో ఇప్పుడు



రాక్షస ప్రొక్లెయిన్‌లు వాడుతున్నారు. అవి ఒకేసారి రెండు లారీలోడ్ల మట్టిని తీయగలవు. కాబట్టి స్థానికులకు 100 ఉద్యోగాలు దొరకవచ్చుననేది చాలా ఉదారమైన అంచనాగా భావించవచ్చును.

## కానీ కాంట్రాక్టులు మాత్రం వస్తాయి

ప్రజలకు ఉపాధి దొరకదుగానీ నాయకులకు కాంట్రాక్టులొస్తాయి. 800 కోట్ల రూపాయల ప్రాజెక్టని వారు పదే పదే అంటున్నారంటే కారణం అదే. ఇవి 'స్థానికుల'కే వస్తాయిగానీ వాళ్ళు భూమయ్యగారిపల్లెలోనూ మబ్బుచింతలపల్లెలోనూ ఉండరు. పులివెందులలో, కడపలో ఉంటారు. వారికి 'అభివృద్ధి' దండిగా వస్తుంది. సందేహమేమీ లేదు. దానినే ప్రజల 'అభివృద్ధి'గా భావించుకోమంటేనే కష్టం.

## పోనీ వేరే ప్రయోజనమేమైనా ఉందా?

యురేనియం మనం నిత్యజీవితంలో ఉపయోగించే వస్తువు కాదు. దానికుండేవి రెండే ప్రయోజనాలు. ఒకటి అణుబాంబుల తయారీ, రెండవది విద్యుత్ ఉత్పత్తి. అణుబాంబు భయంకరమైన విధ్వంసకారకం. అది ఒక సైన్యం మరొక సైన్యం పైన ఉపయోగించే ఆయుధం కాదు. ఒక దేశ ప్రభుత్వం పొరుగు దేశ ప్రజల మీద ప్రయోగించే మారణాయుధం. ఇక విద్యుత్తు మాటకొస్తే, యురేనియంను ఉపయోగించి విద్యుత్తు తయారుచేసే ప్రక్రియను అణువిద్యుత్తు అంటారు. ఇది అన్ని రకాల విద్యుత్ ఉత్పత్తి ప్రక్రియల కన్నా చవక అని ఒకప్పుడు అనుకునేవారు. కానీ అన్ని ఖర్చులనూ – ముఖ్యంగా ప్రాణాంతకమైన అణుధార్మిక కాలుష్యాన్ని నియంత్రించే ఖర్చును లెక్కలోకి తీసుకున్నప్పుడు అదేమంత చవక కాదని ఇప్పుడర్థం అయింది. ఒకప్పుడు యూరప్‌లోని చాలా దేశాలు (ముఖ్యంగా ఫ్రాన్స్) అణువిద్యుత్తు మీదనే ప్రధానంగా ఆధారపడేవి. ఆ దేశాలిప్పుడు కొత్తగా అణువిద్యుత్ ప్రాజెక్టులు కట్టడం లేదు. పాతవాటిని మాత్రమే నడుపుకుంటున్నారు. కొత్త వాటికి సహజ వాయువు పైన ఎక్కువ ఆధారపడుతున్నారు. దానికి కావలసిన సహజ వాయువును రష్యా నుంచి భారీగా దిగుమతి చేసుకుంటున్నారు.

మన దేశం మాటకొస్తే మనం ప్రధానంగా జల విద్యుత్తు మీద ఆధారపడుతున్నాం. దాని తరువాత థర్మల్ విద్యుత్తు. దీనికి బొగ్గు లేక సహజవాయువు ఉపయోగిస్తున్నాం. అణు విద్యుత్తు మన దేశం మొత్తం విద్యుత్ ఉత్పత్తిలో 3 శాతం కూడా లేదు. సహజ వాయువు నిక్షేపాలు అనూహ్యంగా లభిస్తున్నప్పుడు మనం అణువిద్యుత్తు మీద దృష్టిపెట్టి దానితో వచ్చే ప్రమాదకరమైన కాలుష్యం భారాన్ని మోయనక్కరలేదు.

## అణుకాలుష్యం ఎటువంటిది?

అణు విద్యుత్ ఉత్పత్తిలో మాత్రమే కాదు, యురేనియం ఖనిజాన్ని తవ్వితీసే ప్రక్రియతో మొదలుపెట్టి అన్ని దశలలోనూ తీవ్ర కాలుష్య ప్రమాదం ఉంటుంది. మన దగ్గర జరగబోయేది ఖనిజం వెలికితీత, ప్రాసెసింగ్ (శుద్ధి) కాబట్టి వాటిని దృష్టిలో పెట్టుకొని మాట్లాడుకుందాం.

ఈ విషయాన్ని అర్థం చేసుకోవాలంటే అణుధార్మిక పదార్థాల స్వభావాన్ని గురించి కొంచెం తెలుసుకోవాలి. మరీ సాంకేతిక వివరాలలోకి పోకుండా క్లుప్తంగా తెలుసు కుందాం.

మామూలుగా ప్రకృతిలో ఉండే పదార్థాలు చాలావరకు స్థిరంగా ఉంటాయి. తమంతట తాము తమ స్వభావాన్ని మార్చుకోవు. మనం పనిగట్టుకొని వాటిని వేడి చేస్తేనో, వేరే ఏదో ఒక ఒత్తిడికి గురిచేస్తేవో అవి మారుతాయి.

కాని కొన్ని పదార్థాలు అస్థిరమైనవి. అవి వాటంతటవే మారుతుంటాయి. దీనికి కావలసిన చర్య వాటి కడుపులోనే నిత్యం జరుగుతుంటుంది. అవి మారే క్రమంలో కొన్ని రకాల విధ్వంసక స్వభావంగల కిరణాలను పరిసరాలలోకి విడుదల చేస్తుంటాయి. దీనిని అణుధార్మిక స్వభావం అంటారు. అణుధార్మిక స్వభావం గల పదార్థాల నుంచి ప్రతీ క్షణం వెలికివచ్చే ఈ విధ్వంసక శక్తిని నిలువరించే మార్గమేదీ లేదు. అది వెలికి వస్తూనే ఉంటుంది.

యురేనియం అటువంటి అణుధార్మిక గుణంగల అస్థిర పదార్థాలలో ఒకటి. అది తనంతట తాను థోరియంగా, రేడియంగా, రేడాన్ వాయువుగా మారుతుంటుంది. ఈ క్రమంలో అణుధార్మిక శక్తిని పరిసరాలలోకి విడుదల చేస్తుంటుంది.

యురేనియం వంటి అణుధార్మిక స్వభావం గల పదార్థాలు ప్రకృతిలో ఇతర స్థిర పదార్థాల నడుమ భూమి పొరలలో ఉంటాయి. కాబట్టి వాటివల్ల మనకంతగా హాని జరగదు. కానీ యురే నియం ప్రాజెక్టు చేపట్టినప్పుడు మనమే దానిని పనిగట్టుకొని బయటకు తీస్తాం. ప్రాణం మీదికి తెచ్చుకుంటాం.

యురేనియం ఎప్పటికప్పుడు విధ్వంసక శక్తి గల కిరణాలను పరిసరాలలోకి విడుదల చేస్తూ తాను రూపాంతరం చెందుతూ ఉంటుందని చెపుతున్నాము. కాబట్టి యురేనియం ఉన్న చోట దాని రూపాంతరాలు కూడా ఉంటాయి. కొత్తగా పుడుతూ ఉంటాయి. వీటిలో ప్రధానమైనవి థోరియం, రేడియం అనే లోహాలు, రేడాన్ అనే వాయువు.

గని లోపలా, గని చుట్టూ రేడాన్ వాయువు ఉత్పత్తి అవుతూనే ఉంటుంది. గాలిలో కలుస్తూనే ఉంటుంది. యురేనియం గనులలో పనిచేసే కార్మికులు రేడాన్ వాయువును పీల్చి రోగాల బారిన పడడం యురేనియం గనులున్న అన్ని దేశాల అనుభవం. దీనికి విరుగుడుగా గని లోపల వెంటి లేటర్లు పెట్టి లోపలి గాలిని ఎప్పటికప్పుడు బయటికి పంపే ఏర్పాటు చేయొచ్చు. అప్పుడు చుట్టూ ఉన్న గాలి మరింత అణుధార్మిక కాలుష్యానికి లోనవుతుంది. రేడాన్ వాయువు మామూలు గాలికంటే ఎనిమిది రెట్లు సాంద్రతరం కాబట్టి అది నేలను అంటి ఉంటుంది. అది ఉన్నచోట మనుషులు, పశువులు దానిని పీల్చకుండా ఉండలేరు.

అణుధార్మిక స్వభావం గల ధూళి, రేడాన్ వాయువు మనం పీల్చే గాలి ద్వారా శరీరంలోకి పోతాయి. ఆ ధూళి పరచుకున్న కాయగూరలు, ఆకుకూరలు తిన్నప్పుడు కూడా అది మన కడుపు లోకి చేరుతుంది. అణుధార్మిక ప్రక్రియ ఎప్పటికీ ఆగదని చెప్పాము కదా. అది మన ఒంట్లో కొనసాగుతూ ఉంటుంది.

దీనివల్ల రెండు రకాల హాని జరుగుతుంది. మన శరీర కణాలు దెబ్బతిని కాన్సర్ రోగం రాగలదు. జన్యుకణాలు (పురుషులలో వీర్య కణాలు, స్త్రీలలో అండకణాలు) దెబ్బతిని జన్యు వైప రీత్యాలు సంభవించగలవు. పుట్టే పిల్లలు అంగవైకల్యంతో పుట్టగలరు. జన్యు వైపరీత్యం ఒక తరం





దగ్గర ఆగిపోదు. కాబట్టి వేముల మండలంలో యురేనియం మొత్తం తవ్వేసిన తరువాత కూడా ఈ ప్రభావం కొనసాగగలదు.

ఖనిజాన్ని తవ్వి తీయడంతో అయిపోదు. దానిని శుద్ధిచేసి (ప్రాసెస్ చేసి) యురేని యాన్ని రవాణాకు అనువైన రూపంలో తీసుకొని మిగిలిన (వ్యర్థ) పదార్థాన్ని విసర్జిస్తారు. యురేనియం ప్రత్యేకత ఏమిటంటే దాని ఖనిజంలో 99 శాతం పైగా 'వ్యర్థ' పదార్థమే. కాబట్టి దానిని ప్రాసెస్ చేసే కర్మాగారం పెద్దఎత్తున మలినాన్ని విసర్జిస్తుంది. ఇది మెత్తటి మట్టి రూపంలో ఉంటుంది. దీనిలో యురేనియం రూపాంతరాలైన థోరియం, రేడియం వగైరాలు ఉంటాయి. నిరంతరాయంగా రేడాన్ వాయువు పుడుతుంటుంది.

ఈ వ్యర్థ పదార్థాలను ఇంగ్లీషులో టెయిలింగ్స్ అంటారు. వీటిని ఎక్కడ పారేస్తారు? ఎక్కడా పారేయరు. ప్రాసెసింగ్ కర్మాగారం సమీపంలోనే పెద్ద చెరువు చేసి వ్యర్థ పదార్థాన్ని ఒకటికి మూడు రెట్లు నీళ్ళతో కలిపి దానిలో నింపుతారు. ఈ చెరువులు శాశ్వతంగా అక్కడే ఉండిపోతాయి. యురేనియం గనులు ఖాళీ అయిపోయిన తరువాత కూడా ఏళ్ళ తరబడి అవి అక్కడే ఉంటాయి.

ఈ టెయిలింగ్ పాండ్స్ (వ్యర్థ పదార్థాల కుంటలు) తీవ్ర కాలుష్య కారకాలు. వాటిలో అణుధార్మిక స్వభావం గల పదార్థాలు నీళ్ళతో కలిసి బురద రూపంలో నిలువ చేయ బడతాయి. వర్షాలు వచ్చినప్పుడు ఇవి పొంగి చుట్టూ ఉన్న చేలలోకీ, బీడు భూములలోకీ ప్రవహించగలవు. మామూలు సందర్భాలలో ఈ కుంటలలోని ద్రవపదార్థం నేలలోకి ఇంకి భూగర్భ జలాశయంలోకి పోగలదు. అప్పుడది ఆ జలాశయం (ఎక్విఫయర్) ఉన్నంత మేరకు చుట్టుపక్కల బావులు, బోర్లలోని ఊటను అణుధార్మిక పదార్థాలతో కలుషితం చేయగలదు. ఇక కుంట నుంచి వెలువడే రేడాన్ వాయువు నిరంతరాయంగా చుట్టూ ఉన్న వాతావరణాన్ని కలుషితం చేస్తూనే ఉంటుంది. యురేనియం గని ఇరవై ఏళ్ళకో, ముప్పై ఏళ్ళకో ఖాళీ అయిపోతుంది గానీ దాని వ్యర్థ పదార్థాల కుంటలో నిలవుండే అణుధార్మిక పదార్థాలు, దానివల్ల గాలిలోకి చేరే రేడాన్ వాయువు చాలా దీర్ఘాయుష్షు కలవి. అమెరికాలో ఎప్పుడో మూసేసిన యురేనియం గనుల టెయిలింగ్ పాండ్స్ సమీ పంలో నివసించే ప్రజలలో సంవత్సరానికి అయిదుగురు కాన్సర్ రోగం వల్ల చనిపో తున్నారని అంచనా.

వైఎస్, ఆయన సోదరుడు వివేకానందరెడ్డి చెపుతున్నట్టు అణుధార్మిక ప్రభావం ఒక్క వేముల మండలానికో, పులివెందులకో పరిమితమనుకుంటే పొరపాటే. అణుధార్మిక ప్రభావం మానవ జీవితంలోకి రకరకాలుగా చొచ్చుకొని రాగలదు. యురేనియం శుద్ధిచేసే క్రమంలో కలుషితమైన నీరు భూగర్భ పొరల్లోని నీటి జాలులో చేరి, చాలాదూరం ప్రవ హిస్తుంది. అలాగే రేడాన్ గ్యాస్ కూడా. ఆ నీటిని ఉపయోగించి పండించే పంట దిగుబడు ల్లోనూ ఆ విషప్రభావాలు ఉంటాయి. ఈ అణుధార్మికత వ్యాప్తికి దాదాపుగా ఎల్లలు లేవనే చెప్పవచ్చు. వేల సంవత్సరాల పాటు ఈ క్రమం కొనసాగుతూనే ఉంటుందన్న విషయం మనం గుర్తుంచుకోవాలి.

## వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి: అప్పుడు – ఇప్పుడు

'నల్గొండలో యురేనియం ప్రాజెక్టును మీరు అప్పుడు వ్యతిరేకించారు కదా. ఇప్పుడు కడప జిల్లాలో అదే ప్రాజెక్టును ఎందుకు సమర్థిస్తున్నారు?' అని ఈ మధ్య ఒక టివి చానల్ వేసిన ప్రశ్నకు రాజశేఖర్‌రెడ్డి 'అక్కడ నాగార్జునసాగర్ కలుషితమయ్యే ప్రమాదం ఉంది కాబట్టి వ్యతిరేకించాను' అని జవాబు చెప్పారు.

## ఇందులో రెండు అబద్ధాలున్నాయి

నల్గొండలో యురేనియం ప్రాజెక్టుకు వైఎస్ అప్పుడు (అంటే చంద్రబాబు పాలన కాలంలో) వ్యతిరేకించి ఉండవచ్చును గానీ ఇప్పుడు వ్యతిరేకించడం లేదు. ఆ ప్రాజెక్టు నెల కొల్పడానికి భారత యురేనియం కార్పొరేషన్‌కు వైఎస్ ప్రభుత్వం అన్ని రకాల సహకారం ఇస్తున్నది.

రెండు, అప్పట్లో అతను వ్యతిరేకించడానికి నాగార్జునసాగర్ కలుషిత మవుతుందన్నదే కారణమనేది అబద్ధం. 2003 ఆగస్టు 21 నాడు వైఎస్ టైమ్స్ న్యూస్ నెట్‌వర్క్‌కు రాసిన వ్యాసంలో నాగార్జునసాగర్‌కు, అక్కంపల్లి రిజర్వాయర్‌కు, రాజీవ్ పులుల అభయారణ్యానికీ రాగల ప్రమాదాన్ని మాత్రమే ప్రస్తావించి ఊరుకోలేదు. ఇంకా ఈ విధంగా అన్నారు.

'యురేనియం కార్పొరేషన్ రోజుకు 1,250 టన్నులు తవ్వి తీయబోతుంది. ఇది సంభ్రమం కలిగించే పరిమాణం. దీని అర్థం ఏమిటంటే అణుధార్మిక స్వభావం గల వ్యర్థ పదార్థాలు భారీ పరిమాణంలో విసర్జించబడతాయి. వారు జార్ఖండ్‌లో మూడు చోట్ల యురే నియం గనులు నడుపుతున్నారు. వాటిలో ఒక గనిని వారు ఎంత అధ్వాన్నంగా నడుపుతున్నా రంటే వారు బాధ్యతాయుతంగా నడుచుకుంటారని నమ్మడం కష్టం. మొన్నటి మంగళవారం వారు లంబాపూర్‌లో ప్రజా విచారణను నిస్సిగ్గుగా అటకాయించడం దీనిని స్పష్టం చేసింది.

నా కాంగ్రెస్ పార్టీ సహచరుడు ఎం.శశిధర్‌రెడ్డి ఆగస్టు 16న రాజకీయ నాయకులు, శాస్త్రవేత్తలు, పర్యావరణవేత్తలు, స్వచ్ఛంద సంస్థల సమావేశం నిర్వహించి జాదుగూడకు సంబంధించిన వీడియో చూపించారు. అక్కడ పండ్ల గింజలు వికృత రూపంలో ఉంటున్నాయి. ప్రజలు విరుగుడు లేని రోగాల బారిన పడుతున్నారు. పిల్లలలో అంగవైకల్యాన్ని వివరిస్తే పాఠ కులు భరించలేకపోవచ్చు. అయినప్పటికీ ప్రమాదమేమీ లేదని యురేనియం కార్పొరేషన్ అంటుంది. ఈ మాటలు నమ్మడం తెలివితక్కువతనం అవుతుంది.'

## మరీ అతిగా ఊహిస్తున్నామా?

ఈ ఆరోపణ మా మీద వేయబోతారు. కానీ ఊహించవలసిన అగత్యం లేదు. ప్రపంచంలో అనేక దేశాలకు యురేనియం గనుల అనుభవాలున్నాయి. మన దేశంలో జార్ఖండ్ రాష్ట్రంలోని జాదుగూడ యురేనియం గనుల అనుభవం ఉంది.

పరిసరాలలో అణుధార్మికత ఎక్కువ ఉంటే కాన్సర్, స్త్రీలలో గర్భవిచ్ఛిత్తి, పిల్లల్లో జన్యు వైపరీత్యాలు మొదలైన లక్షణాలు సగటు కంటే ఎక్కువ కనిపిస్తాయి. జాదుగూడ గనుల పరిసరా లలో 15 గ్రామాలలో ఈ పరిస్థితి ఉందని పరిశోధనలు తెలుపుతున్నాయి. ఈ 15 గ్రామాల



జనాభా 30 వేలు. జాదుగూడ గనులలో పనిచేసే కార్మికులు పెద్ద సంఖ్యలో కాన్సర్ రోగంవల్ల చనిపోతున్నారని కూడా పరిశోధనలు తెలుపుతున్నాయి. జాదుగూడలో యురే నియం గనులు నడుపుతున్న భారత యురేనియం కార్పొరేషన్ వేములలో కూడా నడవ బోతోంది కాబట్టి 'అన్ని జాగ్రత్తలూ తీసుకుంటాం' అన్న వారి మాటలను నమ్మడం కష్టం. అయినా పైన చెప్పిన దాన్నిబట్టి తీసుకోగల సమగ్రమైన జాగ్రత్తలు లేవని కూడా ఈ పాటికి స్పష్టం అయి ఉండాలి.

పులివెందుల సమీపంలోని బ్రాహ్మనపల్లె వద్దనున్న ఆస్బెస్టాస్ గనులను ఇంకా ఆ ఖనిజం చాలా ఉండగానే మూసేసిన సంగతి తెలిసిందే. అది ఆసియా ఖండంలోనే అతి పెద్ద ఆస్బెస్టాస్ గని అని అంటారు. ఆస్బెస్టాస్ ధూళి ఆ గనిలో పనిచేసే వారికీ, ఆ పరి సరాలలో నివసించే వారికీ చాలా ప్రమాదకరం. అది ఊపిరితిత్తులను తినేసి మనిషిని మెల్లగా చంపేస్తుంది. ఈ విషయం గ్రహించిన తరువాత ప్రభుత్వమే దానిని మూసేసింది. అసలు ప్రపంచంలో ఏ నాగరిక దేశంలోనూ ఇప్పుడు ఆస్బెస్టాస్ గనులు లేవు.

అయితే యురేనియంతో పోలిస్తే ఆస్బెస్టాస్ ప్రమాదం ఎంత? ఆస్బెస్టాస్ ధూళి ఎవరు పీలిస్తే వాళ్ళకే రోగం వస్తుంది తప్ప వాళ్ళ పిల్లలు అవయవాల లేమితో పుట్టరు. అది ధూళే తప్ప రేడాన్‌లాగ వాయువు కాదు కాబట్టి గని సమీపంలో మాత్రమే దాని ప్రభావం ఉంటుంది. ఒకసారి గని మూసేస్తే దాని దుష్ప్రభావం అక్కడితో అయిపోతుంది. యురేనియం గనిలాగ దుష్ప్రభావం శాశ్వతంగా ఉండదు. అయినప్పటికీ ఆస్బెస్టాస్ కాలు ష్యాన్ని తీవ్రమైన విషయంగా భావించి గనులను మూసేసిన ప్రభుత్వం యురేనియం గనుల విషయంలో మూర్ఖంగా వ్యవహరించదలచుకుంటే మనమెందుకు ఊరుకోవాలి?

మేఘాలయలో కూడా యురేనియం నిక్షేపాలున్నాయి. అక్కడ కూడా యురేనియం కార్పొరేషన్ ప్రాజెక్టు చేపట్టాలని చూసింది. కానీ ప్రజల ప్రతిఘటన వల్ల విరమించు కోవలసి వచ్చింది. దీనికి కారణం రాజ్యాంగంలోని ఆరవ షెడ్యూలు అక్కడ స్థానిక స్వయం ప్రతిపత్తి కల్పించింది. అందువల్ల అక్కడి ప్రజలు తమ అభిప్రాయాన్ని అమలుచేసుకో గలిగారు.

## ప్రజల అభ్యంతరాలకు విలువ లేదా?

వేల్పుల, మీదిపెంట్ల గ్రామాలలో పార్లమెంటు సభ్యులు వివేకానందరెడ్డి గారు ప్రజలను సమావేశపరచి, వారి అభ్యంతరాలన్నీ విని 'మీరు యురేనియం ప్రాజెక్టు వద్దంటు న్నారు. మేం కావాలంటున్నాం' అన్నారంట. ప్రజలకు తమ అభిప్రాయాలు అమలు చేసుకునే అవకాశం లేదనే కదా ఈ అహంకారం?

**8-2-2006**

**కడప జిల్లా కమిటీ**

# యురేనియం పర్యావరణ విచారణ మళ్ళీ జరిపించాలి

## ప్రజల పైన పెట్టిన కేసులు ఎత్తివేయాలి

(కడప జిల్లా పులివెందుల సమీపంలోని తుమ్మలపల్లి గ్రామంలో వెలుస్తున్న యురేనియం పనులకు పర్యావరణ అనుమతి నిమిత్తం రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి 2006 సెప్టెంబర్ 10వ తేదీన తుమ్మలపల్లిలో బహిరంగ ప్రజా విచారణ నిర్వహించింది. గ్రామంలో ఇరుకుగా ఉండే స్థలాన్ని ఎంపిక చేసుకొని వేదిక తయారుచేశారు. ముఖ్యమంత్రి తమ్ముడు వై.ఎస్ వివేకానందరెడ్డి ఆధ్వర్యంలో ఆ ప్రాజెక్టు వల్ల ఏ సమస్యా లేని బయటి వాళ్ళు గుంపుగా వచ్చి ప్రజావిచారణ స్థలాన్ని ముందుగానే ఆక్రమించుకున్నారు. బాధిత గ్రామ ప్రజలు, పర్యావరణ ఉద్యమకారులు, ప్రజాసంఘాల వారు వచ్చేసరికి కొద్దిమందికి తప్ప కూర్చునే చోటు ఉండలేదు. ప్రాజెక్టు అనుకూలురు – ఎక్కువగా బయటి గ్రామాల వారు – ఒకరి తరువాత ఒకరు స్టేజి ఎక్కి రాజశేఖరరెడ్డి ఈ ప్రాజెక్టును పులివెందులకు తీసుకు రావడం ద్వారా గొప్ప మేలు చేశాడంటూ ముఖ్యమంత్రిని స్తోత్రిస్తూ మాట్లాడారు. ప్రాజెక్టును వ్యతిరేకించే వారు మాట్లాడడానికి స్టేజీ మీదికి పోగానే కింద మూగిన వారు బిగ్గరగా అరుస్తూ అల్లరి చేస్తూ అడ్డం పడ్డారు. ప్రత్యేకించి 'మానవ హక్కుల వాళ్ళు వెనక్కిపోండి' అంటూ అరిచారు. సి.పి.ఐ జిల్లా కార్యదర్శి ఓబులేశు మాట్లాడే ప్రయత్నం చేయగా, అతను వేరే మండలం (వీరపనాయనిపల్లి) జడ్‌పిటిసి కాబట్టి ఇక్కడ మాట్లాడ డానికి అర్హత లేదని అంతే దూరప్రాంతం నుంచి వచ్చి వై.ఎస్‌ను స్తోత్రించిన వారు అభ్యంతరం చెప్పారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన జిల్లా కలెక్టరు, గుంపును పోగుచేసి అల్లరి చేయించి హుందాగా స్టేజెక్కి కూర్చున్న పార్లమెంటు సభ్యుడు వైఎస్ వివేకానందరెడ్డి, ముసిముసిగా చోద్యం చూస్తూ కూర్చున్నారు. బాధిత ప్రజలు, ప్రజాసంఘాల బాధ్యులు వాకౌట్ చేయకపోతే వారి మీద చేయి చేసుకునే పరిస్థితి ఉండింది.

బూటకంగా జరిగిన ఈ ప్రజా విచారణను రద్దుచేసి మళ్ళీ జరిపించాలని రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలికి విజ్ఞప్తి చేయాలని యురేనియం ప్రాజెక్టు వ్యతిరేక ఐక్యవేదిక నిర్ణయించింది. ఆ మేరకు కాలుష్య నియంత్రణ మండలికి విజ్ఞప్తి సమర్పించడం జరిగింది గానీ, దానికి మద్దతుగా ప్రజాభిప్రాయాన్ని సమీకరించడానికి విస్తృతంగా పంచాలన్న లక్ష్యంతో రూపొందించిన ఈ కర పత్రం అదే. కరపత్రాన్ని అచ్చువేయడానికి మాత్రం ఐక్యకార్యాచరణ వేదిక ఇష్టపడలేదు. అందువల్ల అచ్చుకాకుండా పోయిన ఈ కరపత్రాన్ని ఇక్కడ ముద్రిస్తున్నాం.)

**ప్రజలారా!**

**తు**మ్మలపల్లి యురేనియం గనుల పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ మళ్ళీ జరిపించాలనీ, ఈసారి ఏకపక్షంగా కాకుండా, న్యాయసమ్మతంగా జరిపించాలనీ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి పైన ఒత్తిడి తేవాలని ప్రజలను కోరుతున్నాం.



సెప్టెంబర్ 10వ తేదీన జరిగిన ప్రజాభిప్రాయ సేకరణను ముఖ్యమంత్రి సోదరుడు, స్థానిక పార్లమెంటు సభ్యుడు అయిన వై.ఎస్ వివేకానందరెడ్డి జిల్లా కలెక్టర్ కృష్ణబాబు సహకారంతో, పులివెందుల డిఎస్‌పి, సిఐల అండదండలతో అభాసుపాలు చేసిన వైనం పత్రికల ద్వారా, మీడియా ద్వారా ఇప్పటికే ప్రచారం అయి ఉంది.

నిజానికి పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ అంటే ప్రాజెక్టుకు ప్రజల సమ్మతి సేకరణ కాదు. మన రాజకీయ నాయకులకు అర్థమయ్యే భాషలో చెప్పాలంటే, ప్రాజెక్టుపైన 'రెఫరెండం' కాదు. ప్రాజెక్టు నిర్వాహకులు ప్రజల ఆరోగ్యానికీ, జీవనానికీ నష్టం కలగ కుండా తీసుకోబోతామని నమ్మజూపే జాగ్రత్తల గురించి ప్రజల అభిప్రాయం సేకరించడం దాని ఉద్దేశం. నిర్వాహకుల హామీలను ప్రజలు నూటికి నూరు శాతమూ విశ్వసించకున్నా, కేంద్ర ప్రభుత్వ పర్యావరణ శాఖ విశ్వసించినట్టయితే ప్రాజెక్టు నెలకొల్పుకోవచ్చు. అయినప్పటికీ పులివెందుల పాలెగాళ్ళు తమ కండబలం ప్రదర్శించారంటే కారణం, మా ఇలాఖాలో మాకు ప్రయోజనకరమని మేము భావించే ప్రాజెక్టును వద్దనే గొంతు వినబడడం కూడానా, అన్న పెత్తందారీ అహంభావం తప్ప వేరే ఏమీకాదు.

వాళ్ళ అహంభావాన్ని వాళ్ళు ప్రదర్శిస్తుంటే ఆ కార్యక్రమ నిర్వాహకులైన కాలుష్య నియంత్రణ మండలి పెద్దలు ఏం చేస్తున్నారు? చూస్తూ ఉన్నారు. అధ్యక్ష స్థానంలో ఉన్న కలెక్టర్ కృష్ణబాబు ఏం చేస్తున్నారు? ఆయనకు అలవాటున్న పనే చేస్తున్నాడు. ఏ జిల్లాలో ఏ పదవి వెలగబెట్టినా పాలక పార్టీ నాయకుల బాగోగులు భద్రంగా చూసుకోవడం ఆయ నకు తెలిసిన రాజ్యాంగం. దానిని అమలుచేస్తున్నాడు. బందోబస్తు కోసం వచ్చిన పులి వెందుల డిఎస్‌పి, సిఐలు ఏం చేస్తున్నారు? వాళ్ళ ఉద్యోగం చేస్తున్నారు. పులివెందులలో డ్యూటీ చేసే ప్రభుత్వ అధికారులు వైఎస్ ఇంటి ఉద్యోగులే తప్ప ప్రభుత్వ ఉద్యోగులు కారనేది జగమెరిగిన సత్యమే.

వాళ్ళంతా తమ రాజ్యాంగాన్ని అమలుచేసుకుంటూ తమ యజమానులకు సేవచేసు కుంటూ ఉంటే ప్రజలు తమ మంచి చెడులు తాము చూసుకోనక్కర లేదా?

చూసుకునే ప్రయత్నం చేశారనే, ఆ అయిదు గ్రామాల ప్రజల మీద పులివెందుల పాలెగాళ్ళకూ వారి ఇంటి ఉద్యోగులకూ ఇంత కక్ష. వైఎస్ వివేకానందరెడ్డి అంతటి వాడు ప్రజాభిప్రాయ సేకరణ రేపు, మర్నాడు అనగా గ్రామాలకు పోయి కూర్చుంటే జనం ముకుళిత హస్తాలతో ఉరికి వచ్చి 'నీ ఆజ్ఞ ఏమి రెడ్డీ' అని అడిగే బదులు ఎవరి గేరిలోనో కూర్చొని ప్రజా సంఘాలు పంపిన కరపత్రాలు పంచుకుంటూ, పర్యావరణ వాదులు పంపిన సీడీలు చూసుకుంటూ వ్యతిరేకపు ఆలోచనలు చేస్తారా! రిగ్గింగ్ చేద్దాం పదమంటే ఎక్కడికి అని అడగకుండా బయలుదేరిన వాళ్ళు, హైదరాబాద్‌లో అల్లర్లు చేయాలి రమ్మంటే ఎందుకోసం అని అడగకుండా బస్సెక్కిన వాళ్ళు, కోట్ల విజయ భాస్కరరెడ్డి మీటింగ్‌లో గొడవ చేయమంటే మీ పార్టీయే కదా అని అభ్యంతరం చెప్పకుండా చెప్పులు విసిరిన వాళ్ళు, రేణుకా చౌదరిని అల్లరి పెట్టమంటే ఆడమనిషి కదా అని జంకకుండా అంతపనీ చేసిన వాళ్ళు, ఇవాళ తమ ప్రయోజనాలు అంటూ స్వంత ఆలోచనలు చేస్తారా, ఎంత కృతఘ్నత! వైఎస్ కుటుంబం ఇంకొక 50 కోట్లో వంద కోట్లో బ్యాంకులో వేసుకునే

అవకాశం వస్తే మాకు కాన్సర్ వస్తుంది. మా పిల్లలు అవిటి వాళ్ళయి పుడతారు అంటూ చిల్లర మల్లర అభ్యంతరాలు చెప్తారా, ఎంత విశ్వాస ఘాతుకత!

అవును, తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో ఉన్న రోజులలో నల్గొండ జిల్లాలో యురేనియం ప్రాజెక్టు చేపడతామంటే వీరే అభ్యంతరం తెలిపారు. ఇప్పుడు తీసుకుంటామని చెప్తున్న జాగ్రత్తలే యురేనియం కార్పొరేషన్ అప్పుడు కూడా తీసుకుంటామని హామీ ఇవ్వగా, 'యురేనియం కార్పొరేషన్ వారి హామీలు నమ్మడం తెలివి తక్కువతనం అవుతుంది' అని వైఎస్ రాజశేఖరరెడ్డి అన్నమాట కూడా సత్యమే. అయితే అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న సంగతీ ఇప్పుడు అధికార పక్షంలో ఉన్న సంగతీ మరచిపోయి మరీ దుర్మార్గంగా రెండు నాల్కల ధోరణి అంటూ ఎద్దేవా చేస్తారా? మనిషి ఒకరే అయినంత మాత్రాన ప్రతిపక్షంలో ఉన్నప్పటి నాలుక, అధికారంలోకి వచ్చిన తరువాతి నాలుక ఒకటే ఎట్లా అవుతాయి – రెండవుతాయి గానీ. ఈ హక్కుల సంఘాలకూ ప్రజా సంఘాలకూ కనీస భౌతికజ్ఞానం లేకపోవచ్చును గానీ ఏళ్ళ తరబడి అన్నీ చూసిన ప్రజలు కూడా ఆ జ్ఞానాన్ని కోల్పోతే ఎట్లా?

ఈ ధిక్కారాన్ని వివేకానందరెడ్డి శిక్షించదలచుకున్నాడు. ఎక్కడెక్కడి నుంచో జనాన్ని పోగు చేశాడు. సెప్టెంబర్ 10వ తేదీన తుమ్మలపల్లి ప్రజాభిప్రాయ సేకరణ దగ్గర వ్యతిరేకుల నోర్లు మూయించడానికి అల్లరి చేసిన వారొక్కరూ ప్రాజెక్టు కోసం భూములు అప్పగిస్తున్న భూమయ్య గారిపల్లె, మబ్బు చింతలపల్లె, రాచకుంటపల్లె, తుమ్మలపల్లె వాసులు కారు. వ్యర్థ పదార్థాలు పడేసే టెయిలింగ్స్ పాండ్ నెలకొల్పుతున్న కొట్టాలు గ్రామస్తులు కారు. ప్రాజెక్టు స్థలంలో కురిసే వర్షం నీళ్ళు అణుధార్మిక కాలుష్యాన్ని మోసుకొచ్చి పడేయబోయే బుచ్చయ్య గారిపల్లి చెరువు కింద భూములున్న గ్రామాల ప్రజలు కారు. ఆ నీళ్ళు ఇంకా కిందికి పోయి పాపాగ్ని నదిలోకి, దానిద్వారా పెన్నానదిలోకి పోయినట్టయితే ఆ నీళ్ళు తాగవలసిన వాళ్ళూ ఆ నీటితో పంటలు పండించుకోవలసిన వాళ్ళూ కారు.

ఏం జరిగినా ఏ నష్టం లేనివాళ్ళే వివేకానందరెడ్డి పురమాయింపు మేరకు అల్లరిచేసి ప్రాజెక్టు వల్ల ప్రాణహాని ఉండగలదనీ దానిని సమర్థంగా నివారించడం యురేనియం కార్పొరేషన్ వల్ల అయ్యే పనికాదనీ మాట్లాడగల వాళ్ళందరి నోర్లూ మూయించి ప్రజాభిప్రాయ సేకరణ 'విజయవంతంగా' జరిపించాలనే సంకల్పంతో తెల్లవారుతుండగానే తుమ్మలపల్లెకు బయలుదేరారు. తమ పథకాలు తమ జీతగాళ్ళకు ముందే చెప్పే అలవాటు వైఎస్ కుటుంబానికి లేకపోవడం వల్ల కాబోలు పులివెందుల డిఎస్‌పికి ఈ ఏర్పాటు ఆలస్యంగా తెలిసింది. ఎవరైనా ప్లకార్డులూ, బ్యానర్లూ పట్టుకొస్తే అరెస్టు చేస్తామని ఆయన ముందురోజు గంభీరంగా ప్రకటించాడు. తీరాచూస్తే 'తమ' వాళ్ళే పెద్ద పెద్ద ఇంగ్లిష్ అక్షరాలతో యురేనియంకూ యురేనియం కార్పొరేషన్‌కూ స్వాగతం పలుకుతూ బ్యానర్లూ ప్లకార్డులూ అందరి కంటే ముందు పట్టుకొచ్చారు. ఏ క్షణమైనా వాళ్ళను అరెస్టు చేసే సౌలభ్యం కోసం కాబోలు డిఎస్‌పి గారు రోజంతా వారి పక్కనే ఉన్నారు.

ఆ గుంపు ఆ రోజు చేసిన అల్లరి భారత శిక్షాస్మృతి కిందేకాక కాలుష్య నియంత్రణ చట్టాల కింద కూడా నేరం. వాళ్ళు ఆ నేరం కొన్ని గంటల తరబడి నిరాఘాటంగా చేశారు. కళ్ళ ముందు జరిగే నేరాన్ని నిరోధించే అధికారం గల పోలీసు అధికార్లు ఒక డజను మంది దాకా అక్కడున్నారు. వాళ్ళెవరికీ అది నేరమని తోచలేదు. వాళ్ళు తమ డ్యూటీ చేయకపోతే చేయమని ఆదేశించే



అధికారం గల జిల్లా మేజిస్ట్రేటైన జిల్లా కలెక్టరు కూడా అక్కడ ఉండడమే కాదు, అల్లరి చేస్తున్న వాళ్ళు పనిగట్టుకొని ఆటంకపరచినది అతను నిర్వహిస్తున్న కార్యక్రమాన్నే. అయినప్పటికీ కృష్ణబాబు గారు నోరుజారి కూడా 'వాళ్ళను అదుపు చేయండి' అని పోలీసులను ఆదేశించలేదు. కనీసం వాళ్ళనయినా నోరు మూసుకొని కూర్చొమ్మని అదిలించారా అంటే లేదు. లేక లేక కలిగిన ఏకైక సంతానం అల్లరి చేస్తుంటే మురిపెంగా 'ఊరుకోమ్మా' అని బుజ్జగించే ప్రేమమయుడైన తండ్రిలాగ వాళ్ళను అయిదు నిమిషాల కొకసారి అనునయిస్తూ ఉన్నాడు. వాళ్ళు దానిని ఏ విధంగా తీసుకోవాలో ఆ విధంగానే తీసుకుని తమ అల్లరిని రెట్టింపు చేశారు.

ప్రాజెక్టును వ్యతిరేకిస్తున్న వాళ్ళెవ్వరినీ మాట్లాడనీయక పోయేసరికి వ్యతిరేకిస్తున్న గ్రామాల జనంలో అసహనం పెరిగింది. నినాదాలకు ఎదురు నినాదాలిచ్చారు. తోపులాట జరిగింది. కొంతసేపటికి రాళ్ళు కూడా పడ్డాయి. రాళ్ళు ఎవరు వేశారో చూసిన వాళ్ళెవరూ లేరుగానీ ప్రాజెక్టును వ్యతిరేకిస్తున్న ప్రజలే వేశారని పోలీసులు గుర్తించేశారు. అప్పటి వరకు జరిగినదంతా ఉపేక్షించిన వారు ఈ ప్రజలను మాత్రం లాఠీలతో తరిమివేశారు. రాళ్ళు వేసినందుకు వారిపైన కేసు పెట్టారు. అధికార కార్యక్రమాన్ని పనిగట్టుకొని ఆటంకపరచిన వాళ్ళపైన ఏ కేసూ పెట్టలేదు గానీ ఆటంకపరచిన వారు తిరిగిపోతున్నప్పుడు వారిని ఆటంకపరచినందుకు మబ్బుచింతలపల్లె, భూమయ్య గారిపల్లె, రాచకుంటపల్లె గ్రామస్తుల పైన కేసులు పెట్టారు. శభాష్! సమతుల్యమంటే అట్లాగుండాలి! అదే సాయంత్రం జిల్లా కలెక్టర్ గారు ప్రజాభిప్రాయ సేకరణ సజావుగా జరిగిందని ప్రకటించేశారు. వారి యజమానులకు సజావుగానే జరిగింది మరి.

ఈ తంతు ఆధారంగా రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి వారు ప్రజాభిప్రాయ సేకరణ సజావుగానే జరిగిందని, స్థానిక ప్రజలెవ్వరూ పర్యావరణ సంబంధమైన సందేహాలు వ్యక్తం చేయలేదని, ఉద్యమాలు చేయడమే వృత్తిగానూ, అభివృద్ధిని వ్యతిరేకించడమే ప్రవృత్తిగానూ ఉన్న కొద్దిమంది బుద్ధిజీవులు మాత్రం వ్యతిరేకించారని కేంద్ర ప్రభుత్వ పర్యావరణ శాఖకు నివేదిక పంపితే న్యాయం జరిగినట్టే భావించగలమా? అటువంటి నివేదిక ప్రాతిపదికన కేంద్ర ప్రభుత్వ పర్యావరణ శాఖ తుమ్మలపల్లె యురేనియం గనికి అనుమతి ఇచ్చేస్తే, ఆ తరువాత ఏమైనా విపత్తు జరిగితే, ఎవరు జవాబుదారవుతారు? కంపెనీ తీసుకోబోయే పర్యావరణ రక్షణ చర్యల సాధ్యాసాధ్యాల గురించి, మంచిచెడుల గురించి పది మంది అభిప్రాయాలూ విని నిర్ణయం చేస్తే కనీసం ఒక పద్ధతి పాటించినట్టయినా అవుతుంది.

అందువల్లనే పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ మళ్ళీ జరపాలని కోరుతున్నాం. ఈ మేరకు తిరుపతిలోని కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతీయ కార్యాలయానికీ హైదరాబాద్‌లోని ప్రధాన కార్యాలయానికీ కూడా అర్జీలు ఇచ్చాము. నిజానికి తిరుపతి ప్రాంతీయ కార్యాలయ అధికారులు స్వయంగా అన్నీ చూశారు. వాళ్ళకు మేము చెప్పవలసిందేమీ లేదు. కళ్ళారా చూసిన అన్యాయాన్ని గురించి వాళ్ళు తమపై అధికార్లకు నివేదిక పంపి నిజాయితీగా తమ అభిప్రాయం చెప్పినట్టయితే పునర్విచారణ జరిగే

అవకాశం ఉంది. ఆ దిశగా కాలుష్య నియంత్రణ మండలి పైన ఒత్తిడి పెట్టవలసిందిగా ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నాం.

అంతేకాక, ప్రజాభిప్రాయ సేకరణ వేదిక వద్ద తమ అభిప్రాయాలు స్వేచ్ఛగా చెప్పుకునే అవకాశం దుర్మార్గంగా నిరాకరించబడినందుకు నిరసన తెలిపిన గ్రామస్తులపైన పెట్టిన రెండు క్రిమినల్ కేసులనూ ఎత్తేయాలని పోలీసుల పైన ఒత్తిడి పెట్టవలసిందిగా కూడా విజ్ఞప్తి చేస్తున్నాం.

**(అముద్రితం)**





## గృహహింస రక్షణ చట్టం

# వాడుకోవడమెలా... కాపాడుకోవడమెలా...

**"నా**కు ఇద్దరు పిల్లలు. నా భర్త ఇల్లు గడవడానికి డబ్బులివ్వడు. అతన్ని జైల్లో పెట్టినంత మాత్రాన నా ఇల్లు గడవదు కదా అని కోర్టుకెళ్ళడానికి వెనకాడుతున్నా."

"నా వయస్సు 75 సంవత్సరాలు. నా పేరునున్న పొలం రాసిచ్చేవరకు నా కొడుకు ఊరుకోలా. తీరా రాసిచ్చినాక ఇప్పుడు నా తిండికి, మందులకయ్యే ఖర్చు భరించడానికి కూడా ఏడిపించుకు తింటున్నాడు. ఈ వయస్సులో ఎవర్ని దేహీ అని అడగను?"

"నేను నాల్గవ తరగతి చదువుతున్నా. మా నాన్న రాత్రి పూట తప్పతాగి వచ్చి నన్ను, మా తమ్ముణ్ణి, మా అమ్మని చితకబాదుతూ ఉంటాడు. కమిలిన దెబ్బలతో బడికెళ్ళాలంటే సిగ్గేస్తుంది..."

ఆలకించాలే గాని ఇట్లా వింటూపోతే కట్టలు తెంచుకుని ప్రవాహంలా విరుచుకు పడతాయి సమస్యలు మన పైన. ఈ సమస్యలన్నిటికీ పరిష్కారాలుంటాయో లేదో తెలీదు గాని అందుకు జరగాల్సిన ప్రయత్నం మటుకూ ఎప్పుడూ జరుగుతూనే ఉంది. అటువంటి ప్రయత్నాలు బాధితులు, మహిళా సంఘాలు, ప్రజా స్వామికవాదులు చేయబట్టే "మహిళా గృహహింస రక్షణ చట్టం, 2005". ఈ ఏడాది అక్టోబరు 26న అమల్లోకి వచ్చింది. ఈ చట్టాన్ని అమలుపరిచే విధానంలోనూ, అది కల్పించే ఉపశమనాలలోనూ కొత్తదనం చాలా ఉంది. దీనిని సరిగ్గా అర్థం చేసుకొని వినియోగించుకుంటే గృహహింసకు గురయ్యే స్త్రీలకు బాగా మేలు చేయగలదు.

గృహ హింసను నేరంగా పరిగణించి, ఆ నేరానికి పాల్పడే వారిని శిక్షించే చట్టం ప్రస్తుతం అమలులో ఉంది. అది భారతశిక్షాస్మృతిలోని సెక్షన్ 498ఎ. అయితే ఆ చట్టం బాధపెట్టిన వాడిని శిక్షిస్తుందే తప్ప బాధితురాలికి ఉపశమనం ఇవ్వదు. నివారణకూ ఉపయోగపడదు. నేరం జరిగిపోయిన తరువాత శిక్షించడానికే తప్ప నేరం జరగకుండా నివారించడానికి ఉపయోగపడదు. ఆ లోటును గుర్తించి, మరింత విస్తృత ప్రాతిపదికన గృహహింస నుండి రక్షణ కల్పించే చట్టం కావాలని మహిళా ఉద్యమం చేసిన డిమాండు ఈ చట్టానికి దారితీసింది.

### ఈ చట్టంలో 'బాధితులు' అంటే ఎవరు?

ఈ చట్టం కేవలం వేధింపులకు గురయ్యే భార్యలకే కాదు ఒక కుటుంబంలోని స్త్రీలందరికీ వర్తిస్తుంది. అంటే అక్కా, చెల్లి, తల్లి, రక్తసంబంధం, వివాహం, దత్తత మొదలైన బాంధవ్యాల వల్ల ఒక కుటుంబంలో సభ్యులైన స్త్రీలందరికీ వర్తిస్తుంది.

## గృహహింస అని దేన్ని అంటారు?

సెక్షన్ 498-ఎ వరకట్నం వేధింపును, ఆత్మహత్యకు దారితీయగల శారీరక, మానసిక వేధింపును నేరంగా గుర్తించింది. అయితే కొత్త చట్టంలో గృహ హింసకు మరింత విశాలమైన అర్థం కల్పించారు. శరీరానికైనా, మనసుకైనా, ఆరోగ్యానికైనా, సంక్షేమానికైనా హాని కలిగించే భౌతిక, మానసిక, లైంగిక, ఆర్థిక చర్యగానీ, నోటి మాటకేగానీ గృహహింస కిందికీ వస్తుంది. బాధితురాలినే కాక ఆమెకు సంబంధించిన వారెవ్వరినైనా ఇటువంటి హింసాత్మక చర్యద్వారా బెదిరించడం కూడా గృహహింస కిందికి వస్తుంది. ఈ హింసాత్మక చర్యల జాబితాలో 'ఆర్థిక చర్య' అనే దానిని చేర్చడం విశేషం. ఆమె హక్కయిన ఆర్థిక వనరులను ఆమెకు దూరం చేయడం, ఆమె మనుగడకు అవసరమైన ఆర్థిక వనరులు ఆమెకు లేకుండా చేయడం, ఆమెకు వాడుకొనే హక్కు ఉన్న స్థిరాస్తినైనా, చరాస్తినైనా ఆమె ఇష్టానికి వ్యతిరేకంగా అమ్మివేయడం, లేదా అటువంటి కుటుంబ వనరులను ఆమెకు దూరం చేయడం కూడా గృహహింసకు పాల్పడడం కిందికే వస్తుంది.

## ఈ చట్టాన్ని వినియోగించుకోవాలంటే ఏం చేయాలి?

ఇందుకు బాధితురాలు కోర్టులో కేసు వేయనక్కర లేదు. ఆమె చేయవలసిం దల్లా ఏమిటంటే తాను ఎదుర్కొంటున్న సమస్యలను రాత పూర్వకంగా, ఫిర్యాదు రూపంలో ఇవ్వడమే. బాధితురాలే ఫిర్యాదు ఇవ్వాలని లేదు. ఆమె తరపున ఆమె బంధువులు, పక్కింటివారు, సామాజిక కార్యకర్తలు ఎవరైనా ఇవ్వొచ్చు.

## ఫిర్యాదు ఎవరికి సమర్పించాలి?

ఈ చట్టాన్ని అమలుపర్చడానికి భద్రతాధికార్ల వ్యవస్థను ఏర్పాటు చేశారు. తమ సమస్యలను వారికి నివేదిక రూపంలో సమర్పించాలి. ఫిర్యాదు స్వీకరించిన తర్వాత భద్రతాధికార్లు ఆ ఫిర్యాదుపైన గృహహింస నివేదిక (డిఐఆర్) నొకదాన్ని తయారుచేస్తారు. మామూలు కేసుల్లో ఎఫ్ఐఆర్ లాగా. బాధితురాలు కోరుకుంటున్న ఉపశమనమేమిటి అనేది కూడా రాసుకుంటారు. వీటన్నిటినీ భద్రతాధికారి ఒకటవ తరగతి జ్యుడిషియల్ మెజిస్ట్రేట్, మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ ముందు పెడతారు. అంటే బాధితురాలు నేరుగా కోర్టుని ఆశ్రయించే అవసరం లేకుండా ఆమెకు భద్రతాధికారి అండదండలు ఉంటాయి. ఒకే అధికారిపై ఇంతటి అపార నమ్మకం పెట్టుకుంటే ఆ అధికారి సాయంచేయకుండా అడ్డం తిరిగితే పరిస్థితి ఏమిటి? అనే సందేహం వస్తుందేమో. బాధితురాలి నివేదికను ఖాతరుచేయని భద్రతాధికారికి ఏడాది జైలు శిక్ష, రూ. 20,000 జరిమానా విధించవచ్చు. వేధింపులకు గురయ్యే స్త్రీలకు పోలీసుల రక్షణ అవసరం కావచ్చు. లేక ఇతరత్రా సహాయ సహకారాలు అవసరం కావచ్చు. అందుకోసమే భద్రతాధికారి గృహహింస నివేదిక కాపీలను పోలీసులకు, సర్వీసు ప్రొవైడర్స్‌కు కూడా పంపాలి. సర్వీసు ప్రొవైడర్స్ అంటే స్వచ్ఛంద సేవాసంస్థల కార్యకర్తలు.

మన రాష్ట్రంలో స్త్రీ శిశు సంక్షేమశాఖ ప్రాజెక్టు డైరెక్టర్లను భద్రతాధికారులుగా నియమించారు. తమకు ఇతర బాధ్యతలు ఉండడం వల్ల ఈ అభ్యర్థ నల్ని పట్టించుకోలేమని వారు తప్పించుకోడానికి వీలులేదనీ, తప్పకుండా స్వీకరించి తీరవలసిందే ననీ చట్టం చెప్పినా ఈ నియామకం చట్టం లక్ష్యాన్ని సాధించడానికి సరిపోదు. కనీసం మండల స్థాయిలో పూర్తికాలం భద్రతాధికారులను



నియమించడం అవసరం. వాళ్ళకు పనిలేకుండా పోతుందేమోనన్న ఆందోళన అవసరం లేదు. ఈ చట్టాన్ని స్త్రీలు అర్థం చేసుకొని ఉపయోగించడం నేర్చుకోవాలే గానీ భద్రతాధికారులకు పనికి కొదువ ఉండదు.

## కోర్టులో విచారణ ఎలా జరుగుతుంది?

బాధితురాలు నేరుగా కోర్టులో ఫిర్యాదుచేసినా, ఆమె తరపున వేరే ఎవరైనా చేసినా లేదా ఆమె దగ్గర ఫిర్యాదు స్వీకరించిన భద్రతాధికారి దానిని ఆధారం చేసుకొని కోర్టులో ఫిర్యాదు చేసినా, కోర్టు దానిపైన విచారణ చేపడుతుంది. కౌన్సిలింగ్ అవసరమనుకుంటే కౌన్సిలింగ్ చేపడుతుంది. లేదా ప్రతివాదికి నోటీసు జారీచేసి విచారణ చేపడుతుంది.

## ఉపశమనాలేమిటి?

ఈ చట్టంకింద రకరకాల సమస్యలకు తగిన పరిష్కారాలను కల్పించే ప్రయత్నం జరిగింది. ఇది ఈ చట్టంలోని అత్యంత ఉపయోగకరమైన అంశం. బాధితురాలిపై ప్రతివాది హింసకు పాల్పడకుండా నిషేధిస్తూ భద్రతా ఆదేశాలు (ప్రొటెక్షన్ ఆర్డర్) జారీచేయడానికి మెజిస్ట్రేటుకు అధికారాలు ఉన్నాయి. ఇంట్లోనేకాదు బైటకూడా ఆమెను వేధించకుండా ప్రతివాది కదలికలపై ఆంక్షలు విధించవచ్చు. నోటితోనేకాదు రాత పూర్వకంగా గాని, ఫోన్ చేసిగాని ఆమెను వేధించకూడదని మేజిస్ట్రేట్ ఆదేశించవచ్చు. ఉమ్మడి ఆస్తులను అమ్మడానికి వీలులేకుండా ఉత్తర్వులు పొందవచ్చు. ఉమ్మడిగా ఉన్న బ్యాంక్ ఖాతాలు, లాకర్ల వినియోగాన్ని కూడా అరికట్టవచ్చు. బాధితురాలికి అండగా నిలిచిన వారిపై అతను ఎటువంటి దాడికీ పూనుకోకూడదు. ఆ రకంగా భద్రతా ఆదేశాలు పొందవచ్చు.

ఇవికాకుండా తాను ఉంటున్న ఇంట్లో బాధితురాలికి నివాసహక్కు ఉందని కూడా ఈ చట్టం చెబుతుంది. చెప్పడమే కాక ఆ నివాసహక్కు అనుభవించడానికి అవసరమైన ఆదేశాలు జారీచేసే అధికారం మేజిస్ట్రేట్‌కు ఈ చట్టం ఇచ్చింది. ఆ ఇంటిపై యాజమాన్య హక్కు లేకపోయినా సరే ఆమెను ఆ ఇంట్లో నుంచి గెంటెయ్యడానికి ఎవరికీ అధికారం లేదు. ఇంట్లో నుంచి తరిమేయబడ్డ ఆడవాళ్ళకు తలదాచుకోవడం ఒక పెద్ద సమస్య. ఒక్కోసారి కన్న తల్లిదండ్రులే ముఖం చాటేస్తుంటారు. అటువంటి ఆడవారికి భద్రతాధికార్లు షెల్టర్‌హోమ్స్‌లో ఆశ్రయం కల్పించాలి. మేజిస్ట్రేట్ కూడా ఈ విషయంలో అవసరానికి తగిన ఆదేశాలు జారీచేయవచ్చు. ఆమె కావాలంటే తమ కుటుంబముంటున్న ఇంట్లోనే ఉండొచ్చు. ఆ ఇంట్లోనే ఒక వాటాను ఆమెకు కేటాయించవచ్చు. వేరే ఇంట్లో ఉంచడం మంచిదైతే అద్దె తదితర ఖర్చులు ప్రతివాది భరించాలి. ఈ విధమైన ఆదేశాలు జారీ చేసే అధికారం మేజిస్ట్రేట్‌కి ఉంది.

ప్రతివాది వేధింపులవల్ల బాధితురాలు ఆర్థికంగా నష్టపోతే దాన్ని పూరించాల్సిన బాధ్యత ప్రతివాదిదే. ఈ వేధింపులవల్ల ఆమె ఆరోగ్యం చెడితే వైద్యానికయ్యే ఖర్చు ప్రతివాది భరించాలి. ఆమె ఆస్తిపాస్తుల్ని ధ్వంసం చేస్తే అందుకైన నష్టాన్ని ప్రతివాదే భరించాలి. బాధితురాలు ఈ చట్టం ద్వారా కూడా మనోవర్తి పొందవచ్చు. మనోవర్తి ఇంతివ్వాలి, అంతివ్వాలని పరిమితులేమీ ఈ చట్టంలో లేవు. ఈ ఉపశమనాలతో పాటు మేజి స్ట్రేట్

అవసరమైతే ప్రతివాదిని నష్టపరిహారం చెల్లించమని చెప్పొచ్చు. వేధింపులవల్ల మానసిక చిత్రవధకు, ఒత్తిళ్ళకు గురైనందుకు ఆమెకు అతను నష్టపరిహారం ఇవ్వాల్సి ఉంటుంది.

బాధితురాలే ఆదేశాలు వెనక్కి తీసుకోమని అడిగేవరకు కోర్టు ఆదేశాలు అమల్లో ఉంటాయి. పరిస్థితుల్లో మార్పులను బట్టి కోర్టు తన ఆదేశాలను సవరిస్తూ ఉంటుంది.

## ప్రతివాదికి శిక్ష ఎప్పుడు?

ఈ చట్టం కింద ఉపశమనాలన్నీ సివిల్ స్వభావం గలవి. కోర్టు ఆదేశాలను ఉల్లంఘిస్తే ప్రతివాదికి ఏడాది జైలు శిక్ష, రూ. 20,000 జరిమానా విధిస్తారు.

ఒక హక్కుకి శాసన రూపం కల్పించడమే ఒక భగీరథ ప్రయత్నం. దాన్ని స్త్రీలు సాధించారు. పోలీసుల, న్యాయవాదుల తలుపులు తట్టే బదులు ఇప్పుడు స్త్రీలు భద్రతాధికార్ల తలుపులు తట్టాలి. గట్టిగా తట్టాలి! న్యాయం జరగాలంటే అందరికీ వినబడేంత గట్టిగా తట్టాలి!

## మనమేం చేయాలి?

సామాజికంగా అణగారిన వర్గాలకు హక్కులు కల్పించే చట్టాలు మన పాలకులు అప్పుడప్పుడు చేస్తుంటారు. అయితే ఆ వర్గాల ప్రతినిధులకు వాటి రూపకల్పనలో స్థానం ఉన్నప్పుడు తప్ప అవి సమగ్రంగా ఉండవు. గృహహింస చట్టాన్ని రూపొందించిన క్రమంలో మహిళా ఉద్యమకారులు చురుగ్గా పాల్గొన్నారు కాబట్టి ఈ చట్టం బాగుంది. అయితే సామాజిక వ్యవస్థ పోకడకు వ్యతిరేక దిశలో ఉన్న చట్టాలు వాటంతటవి అమలు కావు. పూనుకొని అమలు చేయించుకుంటేనే అమలవుతాయి. మహిళా సంఘాలు, ప్రజాతంత్ర ఉద్యమ శక్తులు ఆ కర్తవ్యాన్ని మీద వేసుకుంటాయని ఆశిద్దాం. లేకపోతే ఇది కరడుగట్టిన న్యాయవ్యవస్థ యథాస్థితివాద సంస్కృతికి బలయ్యే ప్రమాదం ఉంది.

**15-12-2006**
**కృష్ణా జిల్లా కమిటీ**



## సత్యవేడు - వరదయ్యపాలెం మండలాలలో

# ఎస్.ఇ.జడ్ కోసం భూసేకరణ ఆపాలి



రాష్ట్ర ప్రభుత్వం చిత్తూరు జిల్లా వరదయ్యపాలెం, సత్యవేడు మండలాలలో ‘స్పెషల్ ఎకనమిక్ జోన్ ఏర్పాటుచేయడం కోసం దాదాపు 12 వేల ఎకరాల భూమిని స్వాధీనం చేసుకోవాలని తాపత్రయ పడుతున్న సంగతి తెలిసిందే. అందులో మూడింట రెండు వంతులు రైతుల పట్టా భూమి కాగా, మిగిలిన ఒక వంతు బంజరు భూమి. అయితే ఆ బంజరు భూమిలో కూడా చాలావరకు భూమిలేని పేదలకు డి-ఫారం (స్థానిక పరిభాషలో డికెటి) పట్టాలు ఇచ్చి ఉన్నారు. కాబట్టి దాదాపు మొత్తం 12 వేల ఎకరాలూ వ్యవసాయ భూములే. అక్కడ చాలా చెరువులు, వందల సంఖ్యలో బావులు, బోర్లు ఉన్నాయి. వరి పొలాలు, మామిడి తోటలు, మల్లె, రోజా మొదలైన పూతోటలు, శెనక్కాయలు, సజ్జలు పండే మెట్ట భూములు ఉన్నాయి. ఈ నీటి వనరులన్నిటినీ పూడ్చి, తోటలన్నిటినీ నరికి, వరిపొలాల్ని సాపుచేసి ఏవో పరిశ్రమలు నెలకొల్పడం కోసం ఒక ప్రత్యేక ఆర్థిక క్షేత్రాన్ని తయారు చేయాలన్న ఆలోచన ఎంతవరకు ఉచితమైనది?

ఈ భూములు 16 గ్రామాలలో పరచుకొని ఉన్నాయి. ఈ గ్రామాల మొత్తం జనాభా 25 వేల దాకా ఉంటుంది. పశువులైతే ఒక్కొక్క ఊరిలో 4 వేల సంఖ్యలో ఉన్నాయి. వ్యవసాయ భూములే తప్ప ప్రజల ఆవాసాలు స్వాధీనం చేసుకోవడం లేదని ప్రభుత్వం అంటున్నప్పటికీ ఇక్కడ ఉంటూ ఎక్కడో పనిచేసుకొని బతకడం అయ్యే పనికాదు కాబట్టి ఈ ప్రజలంతా ఏదో ఒకరోజు ‘స్వచ్ఛందంగా’ ఇళ్ళు ఖాళీచేసి పశువులను మాంసం పరిశ్రమకు అమ్మి వెళ్ళిపోవలసి ఉంటుంది.

## ఇదంతా దేనికోసం?

స్పెషల్ ఎకనమిక్ జోన్ అంటే ప్రత్యేక ఆర్థిక క్షేత్రం అని అర్థం. మామూలుగా ఒకరు ఒక ఫ్యాక్టరీ నెలకొల్పాలంటే భూమి కొనుక్కొని కరెంటు కనెక్షన్ కోసం, నీటి సరఫరా కోసం, రోడ్లకోసం వివిధ ప్రభుత్వ శాఖలకు అర్జీలు పెట్టుకొని సాధించుకోవాలి. వారికి ఆ బెడద లేకుండా ప్రభుత్వమే ఒక విశాల భూభాగం నుంచి ప్రజలను తరిమేసి, రోడ్లు వేసి, కరెంటు వ్యవస్థ, నీటి వ్యవస్థ ఏర్పాటుచేసి, అక్కడ సంస్థల్ని నెలకొల్పే వారికి రకరకాల పన్ను రాయితీలు, కార్మిక చట్టాల నుంచి మినహాయింపు ఇచ్చే ఏర్పాటును స్పెషల్ ఎకనమిక్ జోన్ (ఎస్.ఇ.జడ్) అంటారు. మామూలుగా దానిని ఏర్పాటుచేసిన తర్వాత ప్రభుత్వం తన చేతిలోనే ఉంచుకొని అక్కడ సంస్థలు ఏర్పాటుచేయడానికి రమ్మని ప్రైవేటు కంపెనీలకు ఆహ్వానం పలుకుతుంది. ఇక్కడ ఆ బరువు కూడా ప్రభుత్వం దించేసుకుంది. శ్రీ సిటి (ప్రై) లిమిటెడ్ అనే సంస్థకు ఈ ఎస్.ఇ.జడ్ క్షేత్రాన్ని అప్పగించి,

దానిని కంపెనీలతో నింపే బాధ్యతను వారిపైన పెట్టింది. ఇక్కడ ఏ రకమైన పరిశ్రమలు రాబోతాయి? ప్రభుత్వానికే కాదు శ్రీ సిటీ వారికైనా తెలుసునో తెలియదో గానీ ప్రజలకు మాత్రం ఎవరూ తెలియజెప్పలేదు. అవి గ్రామీణులకు పని కల్పించే పరిశ్రమలా లేక భారీగా పెట్టుబడులు పెట్టి పది మంది విద్యావంతులకు మాత్రమే ఉద్యోగాలు ఇచ్చే సంస్థలా? అదీ తెలీదు. వాటివల్ల వాతావరణ కాలుష్యం ఎంత ఉంటుంది? పోయినవాళ్ళు పోగా మిగిలిన వారి బతుకుల మీద ఈ ఎస్.ఇ.జడ్ ప్రభావం ఏ విధంగా ఉండబోతోంది? అది సైతం తెలీదు. అసలు నిజంగా 'అభివృద్ధి' అనేది వస్తుందా లేక క్షేత్రం యావత్తు చెన్నై రహదారికి దగ్గరగా ఉంది కాబట్టి నాలుగు పెద్ద హోటళ్ళు రెండు ధాబాలు మాత్రమే ఇక్కడ వెలుస్తాయా? ఏమో తెలీదు.

ఏమీ తెలియకుండా 25 వేల ప్రజానీకం తమ జీవన వనరులన్నీ శ్రీ సిటీ వారికి అప్పగించి ఎందుకు వెళ్ళిపోవాలి? అభివృద్ధి కోసం ప్రజలు త్యాగం చేయాలి అంటున్నారు. అది ఎట్లాంటి అభివృద్ధో తెలియకుండా కూడా త్యాగం చేయాలా? ఆ అభివృద్ధి స్వభావం ఏమిటో, దానివల్ల ఎవరికి ఏమి ఒరుగుతుందో స్పష్టంగా సూచించి, దానికోసం భూములు అప్పగించే ప్రజలకు వచ్చే నష్టమెంతో కూడా అంచనా వేసి ఆ అభివృద్ధి మేలో, ఇప్పుడుండే బతుకులే మేలో నిర్ణయించడం సబబుకాదా? ఆ నిర్ణయం చేయడంలో స్థానిక ప్రజలకు భాగస్వామ్యం కల్పించడం సబబు కాదా?

కాదన్నట్టు ప్రభుత్వం వ్యవహరిస్తున్నది. అబద్ధాలు చెప్పి, తప్పుడు ఆశలు కల్పించి, కొంత మందిని తన వ్యూహానికి అనుకూలంగా మలచుకొని, మిగిలిన వారికి వారిని చూపించి లోబరుచుకొని, చివరికి ఆలస్యం చేస్తే ఏమీ ఇవ్వకుండా భూములు తీసుకు పోతాం అని బెదిరించి భూములు స్వాధీనం చేసుకునే ఆలోచనతో ప్రభుత్వం ఉంది.

వ్యవసాయంలో భద్రతలేదు కాబట్టి ఉద్యోగం సంపాదించుకోవాలన్న ఆశ వ్యవసాయ కుటుంబాల యువకులకు ఉంటుంది. దానిని ప్రభుత్వం మోసపూరితంగా వాడుకుంటున్నది. భూమిని కోల్పోయిన ప్రతీ కుటుంబంలోనూ ఒకరికి ఎస్.ఇ.జడ్‌లో ఉద్యోగం ఇస్తామన్న హామీ అధికారులు ఇస్తున్నారు. అక్కడ ఏ కంపెనీలు రాబోతాయో కూడా తెలియని వారు ఉద్యోగాల హామీ ఎట్లా ఇయ్యగలరు? బట్టల మిల్లుల్లో, చెప్పుల కర్మాగారాలో నెలకొల్పితే అందరికీ కాకున్నా కొందరికి ఉద్యోగాలు దొరకవచ్చునేమో. కానీ ఐ.టి కంపెనీలు వస్తే? అయినా వచ్చేవన్నీ ప్రైవేటు కంపెనీలైనప్పుడు, బహుశా విదేశీ పెట్టుబడులతో కూడిన కంపెనీలైనప్పుడు, స్థానికులకు ఉద్యోగాలు వస్తాయన్న హామీ రాష్ట్ర ప్రభుత్వం ఎట్లా ఇవ్వగలదు? ప్రైవేటు కంపెనీలకు అటువంటి ఆదేశం జారీచేసే అధికారం ప్రభుత్వానికి ఉందా? అసలు గతంలో ప్రభుత్వ రంగ సంస్థల కోసం భూములు స్వాధీనం చేసుకున్న చోటైనా ఉద్యోగాలిస్తామన్న హామీని ప్రభుత్వం నిలబెట్టుకుందా? విశాఖపట్నం ఉక్కు కర్మాగారం కోసం, రామగుండం సూపర్ థర్మల్ కేంద్రం కోసం భూములు ఇదే హామీ కారణంగా అప్పగించిన రైతు కుటుంబాల యువకులు 30 సంవత్సరాలుగా ఆ హామీ అమలుకోసం కోర్టుల చుట్టూ తిరుగుతుండడం వాస్తవం కాదేమో ప్రభుత్వాన్ని చెప్పమనండి!

సేకరించబోయే భూమిలో దాదాపు మూడవ వంతు డికెటి పట్టా భూములు కావడంతో డికెటి పట్టాదారులకు కూడా స్వంత పట్టా ఉన్న రైతులతో సమానంగా భూములకు నష్టపరిహారం ఇస్తామన్న హామీ ప్రభుత్వం ఇస్తున్నది. రాష్ట్రంలో ఎక్కడైనా అట్లా ఇచ్చారేమో ప్రభుత్వాన్ని అడగండి! స్వంత పట్టా అయినా డికెటి పట్టా అయినా భూసేకరణలో నష్టపరిహారం ఇవ్వాలని మన రాష్ట్ర





హైకోర్టు ఏడుగురు జడ్జీల బెంచి ఎల్‌పిఏ., చేవెళ్ళ వర్సస్ మేకల పాండు కేసులో ఇచ్చిన తీర్పు అన్యాయమంటూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో అప్పీలు చేసుకొని 'స్టే' తీసుకోలేదా? తీసుకోలేదేమో ప్రభుత్వాన్ని అడగండి! అక్కడ 'స్టే' తీసుకొని ఇక్కడ సమానంగా ఇస్తామంటే మనం నమ్మాలా?

పట్టా ఉన్న రైతులకైనా ప్రభుత్వం ఇవ్వబోయే నష్టపరిహారం ఏ రకమైన పునరావాసం ఇస్తుంది? ఎకరానికి రెండున్నర లక్షలో, మూడు లక్షలో ఇస్తారంట. ఇక్కడున్నది ఎక్కువగా రెండు, మూడెకరాల రైతులు. వారికి ఆరేడు లక్షల నష్టపరిహారం వస్తుందేమోగాని అందరికీ అంత మోతాదులో అప్పులూ ఉన్నాయి. రైతు వ్యవసాయం చేస్తున్నంతకాలం అప్పులవాళ్ళు మెడమీద కూర్చోకపోవచ్చు గానీ భూమి అప్పగించి పోతున్నాడని తెలిస్తే బాకీ తీర్చేదాకా కదలనివ్వరు. ఇంక చిన్న రైతులకు ఏమి మిగులుతుంది? భూమిలేని కూలీలకు ఎట్లాగూ నష్టపరిహారం రాదు. ఈ రెండు వర్గాలూ కలిసి నిర్వాసితులు కాబోయే జనాభాలో మెజారిటీ అవుతారు.

శ్రీ సిటీ కంపెనీకి, వారి ఆహ్వానం మీద రేపు రాబోయే కంపెనీలకు వచ్చే లాభాన్ని, వారి అభివృద్ధిని, 'దేశం అభివృద్ధి'గానో, 'రాష్ట్ర అభివృద్ధి' గానో పిలిచేవారు ఈ వేలాది ప్రజలకు కలిగే నష్టాన్ని 'దేశం నష్టం' గాను 'రాష్ట్రం నష్టం' గాను భావించి దేశం లేక రాష్ట్రం, దానిని భరించాలని ఎందుకు అడగరు? అటువంటి చట్టంగానీ, విధానంగానీ దేశంలో ఎందుకు లేదని ఎందుకు అడగరు? ఉన్నవాళ్ళ అభివృద్ధికోసం లేనివాళ్ళు పూర్తిగా పతనం అయ్యే ప్రగతిని ఎందుకు అంగీకరించాలి?

1970లలో నెల్లూరు జిల్లాలోని శ్రీహరికోట రాకెట్ కేంద్రం కోసం భూములు అప్పగించి వలస వచ్చి వరదయ్యపాలెం మండలంలోని తొండూరు సొసైటీ, శ్రీహరికోట కాలనీలలో ఉంటున్న జనాన్ని చూస్తే ప్రభుత్వం హామీలు ఎంత బూటకమో అర్థం అవుతుంది. ఒక్కొక్క కుటుంబానికి అయిదెకరాలు ఇస్తామన్నారు. రెండున్నర ఎకరాలే ఇచ్చారు. అదికూడా రాళ్ళు, రప్పలు, పాము పుట్టలు నిండిన బంజరు ఇచ్చారు. దానికి పట్టా ఇవ్వదానికి 20 సంవత్సరాలు, రెండు హైకోర్టు కేసులు అవసరం అయ్యాయి. చివరికి దక్కింది డికెటి పట్టాయే. ఒక్కొక్క కుటుంబంలోనూ ఒక్కొక్కరికి ఉద్యోగం ఇస్తామన్నారు. అందరికీ కలిపి ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదు. ఇప్పుడు ఎస్.ఇ.జడ్ కోసం ఆ ప్రజలు మళ్ళీ ఊళ్ళు ఖాళీ చేయాలి.

ప్రభుత్వం ఒక భరోసాతో ఉన్నట్టుంది. కొన్ని గ్రామాలలో – ముఖ్యంగా సత్యవేడు మండలంలో 20 నుంచి 50 ఎకరాల దాకా భూములున్న అగ్రకులాల భూస్వాములు ఉన్నారు. వాళ్ళకు 50 లక్షల నుంచి 1 కోటి రూపాయల దాకా నష్టపరిహారం దక్కుతుంది. కాబట్టి వాళ్ళు భూములు ఇచ్చేసి వెళ్ళిపోవడానికి సిద్ధంగా ఉన్నారు. వాళ్ళే ఆ ఊర్లలో 'పెద్ద మనుషులు' కాబట్టి మిగిలిన జనం నోరు నొక్కుకొని వారి వెంట పోతారని ప్రభుత్వం ఆశిస్తున్నది. చెరివి గ్రామంలో ఇప్పటికే ఇది జరిగింది. ఆ పంచాయతీలో భాగమైన చిగురుపాలెంవాసులు చెరివి గ్రామపెద్దలు ప్రభుత్వంతో చేసుకున్న ఒప్పందం తమ సమ్మతితో చేసుకున్నది కాదని అంటున్నప్పటికీ ఆ ఊరికి సంబంధించిన ఒప్పందం జరిగి

పోయినట్టే ప్రభుత్వం మాట్లాడుతున్నది. ఇటువంటి మోసాలకు లొంగవద్దని పేదలకు విజ్ఞప్తి చేస్తున్నాం.

అయితే నష్టపరిహారం, ఉద్యోగాలు అనేవి తరువాతి సంగతి. అంతకంటే మౌలికమైన ప్రశ్నే ప్రభుత్వాన్ని అడుగుదాం. ఎప్పుడు వస్తాయో, ఎన్ని వస్తాయో తెలియని కంపెనీల కోసం 12 వేల ఎకరాల సాగుభూమిని, పళ్ళతోటలను ఎందుకు ఖాళీ చేయించాలి? ఒక్కొక్క కంపెనీకి మహా అయితే నూరు, ఇన్నూరు ఎకరాల భూమి అవసరం అవుతుందేమో. ఎవరి సాగులోనూ లేని బంజరు ఆ మేరకు దొరకదా? శ్రీకాళహస్తి సమీపంలో అటువంటి బంజరు చాలా ఉందని ఆ ప్రాంత ఎం.ఎల్.ఏ ప్రకటించి ఉన్నాడు. ఒకేచోట ఒక పెద్ద ఎస్టేట్ లాంటిది తయారుచేసి, ముందే రోడ్లూ, కరెంటూ, నీళ్ళూ ఏర్పాటుచేసి, రాబోయే కంపెనీలకు అప్పగించాలన్న ఈ ఆలోచన ఎందుకు? విడివిడిగా బంజరు భూములు, కోర్టు వివాదాలలో ఉన్న 2,000 ఎకరాల శ్రోత్రియం భూములు ఈ ప్రాంతంలో ఉన్నాయి. శ్రోత్రియందార్లు కోర్టులో గెలిచినా ఆ భూములకు నష్టపరిహారం ఇచ్చి ప్రభుత్వమే స్వాధీనం చేసుకోవచ్చు. వాళ్ళు సంతోషంగానే ఇచ్చేయగలరు. అటవీ భూమి కూడా రెండు మండలాలలో విస్తారంగా ఉంది. వేరేచోట అడవుల పెంపకానికి బంజరు భూమి అప్పగించి ఇక్కడి అటవీ భూమిని తగుమొత్తంలో రేపు రాబోయే ఏదైనా కంపెనీకి కేటాయించవచ్చు. నిజంగా కంపెనీ పెట్టి అభివృద్ధి చేయాలన్న కోరిక ఉన్న వారికి ఒక్కొక్కరికీ ఒక్కొక్క చోట తగుమాత్రం భూమి ఇవ్వడానికి 16 ఊర్లు ఖాళీ చేయించనక్కరలేదు. ఈ ప్రత్యామ్నాయాలన్నీ ఉండగా పేద రైతుల, కూలీల జీవనాధారం అయిన 12 వేల ఎకరాల సాగుభూములే అభివృద్ధికి కావలసి వచ్చాయా?

ఈ ప్రశ్నలు మనమెందుకు అడగకూడదు? దీనికి జవాబు చెప్పేంతవరకు భూసేకరణ ప్రయత్నాలన్నీ ఆపమని ప్రభుత్వాన్ని ఎందుకు డిమాండ్ చేయకూడదు?

**చిత్తూరు జిల్లా కమిటీ**





# అన్యాక్రాంతమైన అసైన్డ్ భూములు తిరిగి లబ్ధిదారుకే చెందాలి

పేదల భూమి పోరాటాల గురించి అప్పుడెప్పుడో వింటుండే వాళ్ళం. ‘ఇంక భూము లెక్కడున్నాయి పోరాటాలు చేయడానికి’ అని పోరాటాలు చేసిన వాళ్ళే అనే దశ వచ్చింది. అంతలో ధనవంతుల భూమి పోరాటాలు అకస్మాత్తుగా ముందుకొచ్చాయి. భూమి చాలా ఉందని ఇప్పుడర్థం అవుతున్నది గానీ ఏం చేయగలమో మాత్రం తెలీదు. పేదలకు అసైన్ చేసి అన్యాక్రాంతమైన భూమే 10 లక్షల ఎకరాలు ఉందని ముఖ్యమంత్రి నిన్నగాక మొన్న స్వయంగా ప్రకటించాడు. ఖర్చుపెట్టి బాగుచేసి బావి తవ్వి లేక బోరువేసి ఇస్తే అది పది లక్షల పేదలకు తిండి పెట్టగలదు. పేదలకు భూములు కల్పించడం కోసమే ఇడుపలపాయ భూముల్ని ప్రభుత్వానికి స్వచ్ఛందంగా అప్పగించేశానని చెప్తున్న ముఖ్యమంత్రి ఆ పని చేస్తాడా?

వైఎస్ రాజశేఖరరెడ్డి గురించి అటువంటి దురభిప్రాయాలు ఎవరికీ ఉండనవసరం లేదు. అతనిది పేదలకోసం బాధపడి ఎరిగిన మనసు కాదు. ఇడుపలపాయ భూములు అక్రమంగా స్వంతం చేసుకున్నవని తనకిన్నాళ్ళూ తెలియనే తెలియదని అన్నాడు. కడప జిల్లాలో అతనికి తప్ప అందరికీ ఆ సంగతి ఎప్పటినుంచో తెలుసును. అయితే బలవంతుల అక్రమాల గురించి ఏమీ చేయలేకున్న సాధారణ నిస్సహాయతకు తోడు ఆ జిల్లాలో వైఎస్‌ను వ్యతిరేకించి బతకడం సాధ్యంకాదన్న భయం తోడై దాని గురించి మాట్లాడడం ప్రజలు మానేశారు. అంతమాత్రం చేత ఎవరికీ తెలీదనుకొని తన తెలివికి తానే మురిసిపోవడం ఏ నీతీ లేని మనిషికే చెల్లింది.

వైఎస్ తన దురాక్రమణకు పశ్చాత్తాపం చెందడం రామోజీ రావును ఇబ్బంది పెట్టడానికేనా అనే చర్చ మనకు అనవసరం. అందరూ దురాక్రమణదారులే. పత్రికను అడ్డం పెట్టుకుని రాజకీయాలు చేస్తున్నావని ఇతడు అతనినంటే, రాజకీయలు అడ్డం పెట్టుకుని కోట్లు గడిస్తున్నావని అతడు ఇతనినంటున్నాడు. మనకెందుకు?

మనకు కావలసింది ఒక్కటే. పేదలకు అసైన్ చేసి అన్యాక్రాంతమైనాయని ముఖ్యమంత్రి స్వయంగా ఒప్పుకున్న 10 లక్షల ఎకరాలు తిరిగి లబ్ధిదారులకే ఇవ్వాలి. దీనికి మూడు ఆటంకాలు కనిపిస్తున్నాయి. రెండు ముఖ్యమంత్రి చేసిన ప్రకటనలోనే ఉన్నాయి. మూడవది ఈ మధ్యనే రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన ఆర్డినెన్స్‌లో ఉంది.

అన్యాక్రాంతమైన భూమి సాగుయోగ్యమైనది కాకపోతే దానిని తొలినాటి లబ్ధిదారుకు తిరిగి ఇవ్వకుండా ఏదైనా ‘ప్రజావసరాల’ కోసం వాడుకుంటామని ముఖ్యమంత్రి అన్నాడు. (అంటే భూమిలేని పేదలకు భూమి ఇవ్వడం ప్రజావసరం కాదనా?) దీనిని తెలివి తక్కువతనం అనాలో అతితెలివి అనాలో తెలీదు. సాగుయోగ్యం కాని భూములను కాక సాగుయోగ్యమైన వాటి నెప్పుడైనా పేదలకు అసైన్ చేశారా? పేదలకు అసైన్ చేసేదే బంజర్లను. అవి ఎప్పుడో తప్ప ఉన్న పళంగా సాగుయోగ్యంగా ఉండవు. ప్రభుత్వం ఆ

భూమికి పేదలకు 'డి' ఫారం పట్టాలు ఇచ్చేసి చేతులు దులిపేసుకుంటుంది తప్ప ఆ భూమిని సాగుయోగ్యం చేసుకోవడానికి ఏ సహాయం చేయదు. పైగా, పట్టా ఇచ్చాక ఫలానా గడువు లోపల సాగులోకి తేకపోతే అసైన్‌మెంట్ రద్దవుతుందని ఒక షరతు కూడా 'డి' ఫారం పట్టాలోనే ఉంటుంది. లబ్ధిదారులు గత్యంతరం లేక ఆ భూమిని పెట్టుబడిపెట్టి బాగుచేయగల వాళ్ళకు అమ్ముకోవడమో, 'కౌలుకు' ఇవ్వడమో తరచుగా జరుగుతుంది. అసైన్డ్ భూముల అన్యాక్రాంతానికి ఇదొక ముఖ్యకారణం. ఇదేమీ ఎరుగనట్టు అన్యాక్రాంతమైన భూమి సాగుయోగ్యం కానట్టయితే ప్రభుత్వమే దానిని తీసేసుకుంటుందనడాన్ని ఏ రకంగా అర్థం చేసుకోవాలి?

ఈ మధ్య రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన ఆర్డినెన్స్‌తో దీనిని జతచేసి చూసుకున్నప్పుడే దీని భావం పూర్తిగా అర్థం అవుతుంది. 1977లో చేసిన అసైన్డ్ భూముల (బదలాయింపు నిషేధ) చట్టం కింద, పేదలకు అసైన్ చేసిన భూమిని వారు వేరే ఎవరికైనా అమ్మినా, ఇతర కారణాలుగా అది అన్యాక్రాంతమైనా దానిని తిరిగి లబ్ధిదారుకే ఇవ్వాలి. అది ఆచరణ సాధ్యం కానప్పుడు మాత్రమే ప్రభుత్వం దానిని తీసేసుకోవచ్చు. అసైన్‌మెంట్ పొందిన పేదలు గత్యంతరం లేని పరిస్థితిలోనే దానిని అన్యాక్రాంతం కానిస్తారన్న సామాజిక అవగాహనతో ఆ చట్టం రూపొందింది. ప్రస్తుత ఆర్డినెన్స్ ఆ దౌర్బల్యానికి వారిని శిక్షించదలచుకుంది. ఒకసారి అన్యాక్రాంతం కానిస్తే ఆ భూమిపైన లబ్ధిదారుకు హక్కు పోతుంది. అది ప్రభుత్వానికే చెందుతుంది. ప్రభుత్వం బుద్ధిపుడితే వారికే తిరిగి అసైన్ చేయవచ్చు, కాని చేయాలన్న నియమం లేదు.

దీనినీ, పైవిషయాన్నీ కలిపి చదివితే, అప్పుడెప్పుడో బుద్ధిలేక పేదలకు ఇచ్చేసిన భూమిని వీలైన మేరకు తిరిగి ప్రభుత్వం చేతిలోకి తీసుకోవాలన్న ఆరాటమే కనిపిస్తుంది తప్ప పేదలకు న్యాయం చేయాలన్న ఆకాంక్ష కాదు. సాగుయోగ్యం కాని బంజర్లు ప్రభుత్వానికి ఎందుకు? ప్రత్యేక ఆర్థిక మండలులకు, పెట్టుబడిదారీ కంపెనీలకు అప్పగించడానికి. ఇంకెందుకు?

ముఖ్యమంత్రి ఇంకొక షరతు కూడా పెట్టాడు. అన్యాక్రాంతమైన భూమిని కొనుక్కున్నది కూడా చిన్న రైతులే అయితే దానిని వారికే క్రమబద్ధీకరిస్తామన్నాడు. ఇది దుర్మార్గమైన ఆలోచన. అసలు ప్రభుత్వం ఉచితంగా ఇచ్చిన ఒకటి రెండెకరాలను పేదలు ఎందుకు అన్యాక్రాంతం కాని స్తారన్న కనీస అవగాహన అతనికి ఉందా? ఒళ్ళు బలిసి అమ్ముకుంటున్నా రనుకుంటున్నాడా? వాళ్ళకు బండలు, తుప్పలు, పుట్టలు నిండిన భూమి, ఊరి వ్యవసాయ భూములకు దూరంగా ఎక్కడో గుట్టలలో ఉన్న భూమి ఇస్తారు. ఏ పూటకాపూట పని చేసుకుంటే తప్ప గడవని వారికి దానిని సకాలంలో సాగులోకి తేవడం కష్టం. ఆ భూములు ఇతరుల చేతిలోకి పోవడానికి ఇదొక ముఖ్యకారణం.

దౌర్జన్యమూ తరచుగా జరుగుతుంటుంది. అనేక సందర్భాలలో అసైన్డ్ భూములకు 'డి' ఫారం పట్టా లబ్ధిదారు చేతిలో పెడతారుగానీ భూమి ఎక్కడుందో చూపించరు. లబ్ధిదారు వెతు క్కుంటూ పోతే అక్కడెవరో ఆక్రమించుకొని ఉంటారు. ఇది నీదికాదు పొమ్మంటారు. అసైన్ చేసిన భూమి ఒక భూస్వామి సీలింగ్ భూమి అయినట్టయితే, తరచుగా ఆ భూస్వామి ఆ సీలింగ్ భూమిని కాగితం మీద తప్ప నిజంగా ప్రభుత్వానికి అప్పగించి ఉండడు. అతను తనకు అనుకూలురైన చిన్న రైతులకే దానిని అప్పగించవచ్చు. అప్పుడు అన్యాక్రాంతమైనది చిన్న రైతుకే కాబట్టి అతనికే అప్పగిస్తామనడం ఏం న్యాయం? అయినా చిన్న రైతయితే ఫరవాలేదంటే దురాక్రమణ దారులంతా



చిన్న రైతులుగా అవతారమెత్తగలరు. కుటుంబ ఆస్తులను పది ముక్కలుగా పంచుకుని మరీ అవతారమెత్త గలరు.

వనరులు లేని పేదలకు వనరుల పైన హక్కు కల్పించాలన్న న్యాయబద్ధమైన ఆలోచన పట్ల వెటకారం ఈ విధాన ప్రకటనలలోని ప్రధాన విషయం. ఒక పక్క పేదల భూములు పేదలకే తిరిగి ఇప్పిస్తున్నట్టు కనిపించడం, మరొక పక్క రామోజీరావు, చంద్రబాబు నాయుడు తదితర అసంఖ్యాక ప్రత్యర్థి భూకబ్జాదారులపైన కక్ష తీర్చుకోవడం, పనిలో పనిగా పెట్టుబడి దారీ కంపెనీలకు ధారాదత్తం చేయడానికి ప్రభుత్వం చేతిలోకి మరింత భూమిని తెచ్చుకోవడం – ఇదీ వైఎస్ త్రికోణ భూమి విధానం.

1977 నుంచి అమలులో ఉన్న అసైన్డ్ భూముల (బదలాయింపు నిషేధ) చట్టాన్ని (దీనిని క్లుప్తంగా 9/77 చట్టం అని పిలుస్తారు) ఉన్నదున్నట్టు అమలుచేయాలనీ అన్యా క్రాంతమైన భూములను తొలినాటి లబ్ధిదారుకే తిరిగి అప్పగించాలనీ ప్రజాతంత్ర శక్తు లంతా ఉద్యమించాల్సిన అవసరం ఉంది. అయితే మళ్ళీ బంజరు భూమినే చేతిలో పెట్ట కుండా, దానిని సాగుయోగ్యం చేసి ఇవ్వాలి. ప్రస్తుతం రాష్ట్రంలో సగభాగంలో అమలులో ఉన్న గ్రామీణ ఉపాధి హామీ పథకం దీనికి ఉపయోగపడుతుంది. ఆ పథకం కింద చేపట్ట గల పనులలో ఒకటి, గ్రామంలో భూమి లేని పేదలకిచ్చిన అసైన్డ్ భూములను సాగు యోగ్యం చేయడం. దీనిని ఉపయోగించుకుంటే తిరిగి ఇచ్చిన 'డి' ఫారం భూములు మళ్ళీ అన్యాక్రాంతం కాకుండా చూడవచ్చు.

**1-1-2007**

# అయ్యవార్లు మూడు రెట్లు పౌరులా?

## శాసనమండలిని రద్దుచేయాలి లేదా

## ప్రజాస్వామికంగా పునర్వ్యవస్థీకరించాలి

**రా**ష్ట్ర లెజిస్లేటివ్ కౌన్సిల్ (శాసనమండలి) ఎన్నికలు ఫిబ్రవరిలో జరగనున్నాయి. అదనపు ఓటుహక్కు లభించిన ప్రజాప్రతినిధులు, పట్టభద్రులు, అధ్యాపకులు హడావుడిగా నామినేషన్లు వేసుకుంటూ, ప్రచారం చేసుకుంటూ తిరుగుతున్నారు. తక్కిన ప్రజానీకానికి ఈ ఎన్నికల్లో ఓటు హక్కు లేదు కాబట్టి అది వాళ్ళకేమీ పట్టని విషయం అయింది.

ఇతర ప్రజానీకానికి ఈ ఎన్నికల్లో ఓటుహక్కు ఎందుకు లేదు?

అన్ని స్థాయిల్లో జరిగే ఎన్నికల్లోనూ దళితులకూ, ఆదివాసులకూ ఉండే రిజర్వేషన్లు శాసన మండలిలో ఎందుకు లేవు? 'ప్రతి మనిషికీ ఒకే ఓటు' అనేది పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలోని ప్రాథమికమైన సమానత్వ సూత్రం కాగా, ప్రజా ప్రతినిధులకూ, పట్టభద్రులకూ, శాసనసభనూ శాసనమండలినీ కలుపుకొని రెండు ఓట్లు, అయ్యవార్లకయితే మూడు ఓట్లు ఎందుకిస్తున్నారు? వాళ్ళు రెండు రెట్లు, వీళ్ళు మూడు రెట్లు పౌరులా?

నిత్యజీవితంలో జరిగే అన్యాయాలను ప్రజలందరూ గ్రహించగలుగుతారు. కానీ చట్టాలలో, విధాన ప్రవచనాలలో ఉన్న అన్యాయాలను చదువుకున్న వాళ్ళు, ప్రజా ప్రతినిధులు మాత్రమే సులభంగా గ్రహించగలుగుతారు. వారు చెప్తేనే ప్రజలు తెలుసుకుంటారు. మరి చదువుకున్న వాళ్ళకూ, ప్రజా ప్రతినిధులకూ ప్రత్యేక హక్కులు కల్పించే చట్టాల గురించి ఎవరు మాట్లాడాలి? వారి స్వప్రయోజనం కోసం వారు గంభీర మౌనం పాటిస్తారు. తక్కిన ప్రజానీకానికి ఎక్కడో ఏదో లోపం ఉందని తోచినా వివరాలు తెలియకపోవడం వల్ల తప్పనిసరై మౌనం పాటిస్తారు. ఆ అన్యాయం అన్యాయంగా ఉండిపోవలసిందేనా?

శాసన మండలిని ఇంగ్లీష్ వాడి పరిభాషలో 'ఎగువ సభ' అంటారు. అది చట్టాలు చేయదు, కానీ చట్టాలు చేసే శాసనసభను (దిగువ సభను) పర్యవేక్షిస్తుంది. శాసనసభ ఆమోదించిన చట్టాలను పరిశీలించి తన అభిప్రాయాలు, సూచనలు తెలుపుతుంది. ఈ అభిప్రాయాలకు ఏ విలువా లేదనుకుంటే శాసన మండలి అనేది ఉండడమే అనవసరం కాబట్టి, వాటికి ఏదో విలువ ఉందనే ఆ వ్యవస్థను రూపొందించారని భావించవలసి ఉంటుంది. మరి అటువంటి వ్యవస్థలో రిజర్వేషన్లు ఉండవు, ఓటు హక్కు కొద్దిమందికే ఉంటుంది అంటే అర్థం చట్టాలు చేసే అధికారాన్ని ప్రజాస్వామీకరించినా, దానిని పర్యవేక్షించే అధికారాన్ని ప్రధానంగా శిష్ట వర్గాలకు పరిమితం చేయాలన్న అప్రజాస్వామికమైన ఆలోచనను వ్యవస్థీకరించడమే కాదా? అన్ని విషయాలలోనూ గొంతుచించుకునే మేధావి వర్గమూ, రాజకీయ వర్గమూ తమకిద్దరికీ పెద్ద పీటవేసే ఈ వ్యవస్థ పట్ల మౌనం పాటించడమేకాక దానిలో స్థానంకోసం ఎవరికి వారు ఆరాటపడడం విచిత్రంగా లేదూ?

శాసన మండలికి ఉండే ఈ అప్రజాస్వామిక స్వభావం రాజ్యాంగంలోనే రచించబడ్డ మాట వాస్తవమే. 'ప్రతి మనిషికీ ఒకే ఓటు ఇచ్చాం – ప్రతి మనిషికీ ఒకే విలువ ఉండే సమాజానికి ఇది సాధనం కావాలి' అని బాబాసాహెబ్ అంబేద్కర్ భారత రాజ్యాంగం నైజాన్ని వివరిస్తూ చేసిన





వ్యాఖ్యానానికి, శాసన మండలి రూపంలో కొందరికి రెండు ఓట్లు, కొందరికి మూడు ఓట్లు కల్పించిన ఆర్టికల్ 171 అభావం అనేది కూడా వాస్తవమే. అయితే శాసన మండలికి ఉండేది పర్యవేక్షక అధికారమే అయినప్పటికీ దీనిని రాజ్యాంగంలోని అప్రజాస్వామిక లక్షణాలలో ఒకటిగా గుర్తించడం సబబుగా ఉంటుంది తప్ప, రాజ్యాంగంలోనే ఉంది అంటూ వెనకేసుకు రావడం తగదు.

చెప్పుకోదగ్గ విషయం ఏమిటంటే రాజ్యాంగం తొలిముసాయిదాలో శాసన మండలి ప్రస్తావన మరీ ఇంత అప్రజాస్వామికంగా లేదు. బి.ఎన్.రావు తొలి రచన చేసి, అంబేద్కర్ సారథ్యంలోని డ్రాఫ్టింగ్ కమిటీ తుదిరూపం ఇచ్చిన రాజ్యాంగం ముసాయిదాలోనూ శాసనమండలి ప్రస్తావన ఉంది. అయితే అందులో అధ్యాపకులకూ, మేధావి వర్గానికీ పెద్దపీట వేయలేదు. శాసన మండలిలో కొన్ని సీట్లను ప్రజాప్రతినిధులు (పంచాయతీ స్థాయి నుంచి అసెంబ్లీ స్థాయి దాకా ఎన్నికైన వారు) ఎన్నుకుంటారని, కొన్నిటిని రాష్ట్ర గవర్నర్ తన నియామకం ద్వారా నింపుతారనీ అన్నారు. తక్కిన సీట్ల ఎన్నిక లేక ఎంపిక ఏ విధంగా జరుగుతుందో చెప్ప లేదు గానీ ఎవరిని ఎంపిక చేయాలో సూచించారు. వ్యవసాయ రంగం, పారిశ్రామిక రంగం, విద్యారంగం, కార్మికరంగం, సాంకేతిక కళాసాహిత్య రంగాలు మొదలైన సకల సామాజిక రంగాలతో సన్నిహిత పరిచయం ఉన్న నిపుణులను ఎన్నుకోవాలని అన్నారు. వివిధ సామాజిక రంగాలలో నైపుణ్యంగల వారు శాసన సభచేసే చట్టాలను పర్యవేక్షించి సలహాలూ, సూచనలూ ఇవ్వడం ఉచితంగా ఉంటుందన్నది దీని వెనుక ఉన్న ఆలోచన కావచ్చు. అయితే ఈ ముసాయిదాలో కూడా రిజర్వేషన్లు లేవు.

కానీ రాజ్యాంగానికి తుదిరూపం ఇచ్చే నాటికి ఇది మారిపోయింది. రాజ్యాంగ పరిషత్ సభ్యులలో ఒక్క జయప్రకాశ్ నారాయణ్ మాత్రమే శాసన మండలి ఉండనే వద్దన్నాడు. మిగిలిన వాళ్ళు దానికి మరింత అప్రజాస్వామిక రూపం ఇచ్చారు. ఎవరిని ఎన్నుకోవాలనేది తీసేసి ఎవరు ఎన్నుకుంటారనేది చేర్చారు. రాజ్యాంగం ముసాయిదాలోనే ప్రజాప్రతినిధులకు కల్పించిన ఓటుతో పాటు పట్టభద్రులకూ, అధ్యాపకులకూ ఓట్లు కల్పించారు. వారు ఎవరినైనా ఎన్నుకోవచ్చన్నారు. అదనంగా, ముసాయిదాలో రాసినట్టే, గవర్నర్ కొందరిని నియమించ వచ్చునన్నారు. గవర్నర్ అంటే రాష్ట్ర ప్రభుత్వమే కాబట్టి ఇది రాష్ట్ర ప్రభుత్వానికి ఇచ్చిన 'హక్కు'. ఈ నియామకాలు కళాసాహిత్య వైజ్ఞానిక రంగాలలోనూ, సహకార రంగంలోనూ, సామాజిక సేవలోనూ ప్రత్యేక ప్రవేశం లేక అనుభవం గల వారి నుంచి చేయాలని మాత్రం అన్నారు. ఏ పాలక పార్టీలోనైనా కళాపోషకులకూ, సంఘ సేవకులకూ కొదవలేదు కాబట్టి వారి 'హక్కు'కు ఈ షరతేం అడ్డం రాదు.

ఈ విషయంలో రాజ్యాంగం పేర్కొన్న ఒకే ఒక్క మంచి సంగతి ఏమిటంటే ఏ రాష్ట్ర శాసనసభైనా 2/3 మెజారిటీతో, తమకు శాసన మండలి అక్కరలేదని తీర్మానిస్తే, పార్లమెంటు తదనుగుణంగా చట్టంచేసి తీసేస్తుంది. అయితే మళ్ళీ ఆ రాష్ట్ర శాసనసభ తమకు కావాలని 2/3 మెజారిటీతో తీర్మానంచేస్తే అది తిరిగి వస్తుంది. మన రాష్ట్ర శాసన మండలిని ఈ ప్రకారంగా ఎన్‌టిరామారావు తీసేయిస్తే, రాజశేఖరరెడ్డి (ప్రతిపక్షాల సహకారంతో) తిరిగి తెచ్చాడు. అప్పట్లో ఎన్‌టిరామారావు ఆ పనిచేయడానికి శాసన మండలి

కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా ఉండడం కారణం కావచ్చును గానీ, అతను చేసిన కొద్ది మంచి నిర్ణయాలలో ఇదొకటి. అధికారదాహం శాసనసభతో తీరని పార్టీలన్నీ కలిసి దానిని తిరగదోడాయి.

## ప్రజాస్వామికమైన 'రెండవ సభ' సాధ్యంకాదా?

రెండవ సభ ఉండనే వద్దని మా అభిప్రాయం కాదు. నిజానికి ఒక చారిత్రక దశలో చట్టసభల ప్రాతినిధ్య స్వభావాన్ని గురించి చాలా చర్చ జరిగింది. ఎక్కువ భాగం చట్టసభల ఎన్నికలు ప్రాదేశిక నియోజకవర్గాల ప్రాతిపదికన జరుగుతాయి. అంటే 'ప్రజా ప్రతి నిధులు' ఒక ప్రాంతానికి ప్రతి నిధులుగా ఉంటారు, అయితే ఒక ప్రాంతంలో లేక భూభాగంలో నివసించే ప్రజలకు కొన్ని ఉమ్మడి సమస్యలు ఉన్నప్పటికీ సామాజిక, ఆర్థిక వర్గాల ప్రాతిపదికన భిన్న ప్రయోజనాలూ ఉంటాయి. కాబట్టి ప్రాదేశిక నియోజక వర్గాలతో బాటు, సామాజిక ఆర్థిక వర్గాలను నియోజకవర్గంగా గల రెండవ సభ ఉండడం ఉచితంగా ఉంటుందన్న చర్చ పందొమ్మిదవ శతాబ్దంలోనూ, ఇరవయ్యవ శతాబ్దపు ప్రథమార్థంలోనూ చాలా జరిగింది. ఇది పర్యవేక్షక అధికారం ఉండే 'ఎగువ సభ' కాదు. శాసనాధికారం ఉండే రెండవ సభ. ఈ ఆలోచనకు రూపం ఇచ్చేటట్టయితే కేవలం పట్టభద్రుల నియోజక వర్గాలు, అధ్యాపకుల నియోజక వర్గాలే కాక అంతకంటే పెద్ద సంఖ్యలో రైతు నియోజక వర్గాలు (అయ్యవార్ల జనాభా కంటే వ్యవసాయదార్ల జనాభా చాలా ఎక్కువ కాబట్టి), వ్యవసాయ కూలీల నియోజక వర్గాలు, పారి శ్రామిక కార్మికుల నియోజక వర్గాలు, వృత్తి పనులవారి నియోజక వర్గాలు వగైరా ఉండాలి. అందులో శాసనసభలో ఉన్నట్టే రిజర్వేషన్ ఉండాలి. సామాజిక వర్గీకరణ ప్రాతిపదికన దళిత కులాల నియోజక వర్గాలు, బిసి కులాల నియోజక వర్గాలు, స్త్రీల నియోజక వర్గాలు, మైనారిటీ మతాల నియోజక వర్గాలు, ఆదివాసీ నియోజక వర్గాలు వగైరా ఉండాలి. ఇటువంటి శాసన మండలిని రూపొందించి శాసన సభతో సమాన అధికారం కల్పించినట్టయితే అభ్యంతరం ఉండనక్కరలేదుగానీ ప్రజా ప్రతినిధులకూ, పట్టభద్రులకూ, అధ్యాపకులకూ ప్రత్యేక ప్రాతినిధ్యం కల్పించి, పాలక పార్టీకి నియామకం పేరిట కొన్ని సీట్లు నింపే అధికారం కల్పించి, అందులో కనీసం ఎస్సి, ఎస్టి రిజర్వేషన్ కూడా ఇవ్వని శాసనమండలి ఏ రకంగా ప్రజాస్వామిక మైనది? చదువుకున్న వాళ్ళంతా దానిలో సభ్యత్వం కోసం ఉవ్విళ్ళూరుతుండడాన్ని ఏమనాలి?

**1-1-2007**



# ప్రాజెక్టులు - నిర్వాసితులు

ఇటీవల మన రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రాజెక్టు నిర్మాణాలు పలు వివాదాలకు, ప్రజాందోళనలకు తావిస్తున్నాయి. ఇందుకు శాస్త్రీయపర కారణాలు, సహేతుక సందేహాలు లేక పోలేదు. అభివృద్ధి చెందిన ప్రాంతాలకే సాగునీటి వసతికోసం ప్రాజెక్టులు చేపట్టడం, మరీ పర్యావరణానికి, అటవీ సంపదకు అపార నష్టం చేకూరే రీతిలో ప్రాజెక్టుల నిర్మాణ రూప కల్పన చేయటం, మరీ ముఖ్యంగా ఈ నిర్మాణాల వలన ఆశ్రయం కోల్పోతూ బజారున పడుతున్న నిర్వాసితుల బతుకులు పై వివాదాలకు, ఆందోళనకు కారణమవుతున్నాయి.

జలయజ్ఞం పేరుతో ప్రభుత్వం చేపట్టిన వివిధ ప్రాజెక్టు పనులు వాటి నిర్వాసితుల ఆందోళనల మధ్య గందరగోళంగా మారాయి. గతంలో నిర్మించిన నాగార్జునసాగర్, శ్రీశైలం ప్రాజెక్టుల నిర్వాసితులు తమ సర్వం కోల్పోయి నేడు కూలీలుగా జీవిస్తున్న సజీవ దృశ్యాలు ఈ ఆందోళనలకు బలం చేకూరుస్తున్నాయి. స్వాతంత్ర్యం వచ్చి 50 సంవత్సరాలు దాటినప్పటికీ నిర్వాసితులకు సంబంధించి ఒక జాతీయ విధానాన్ని మన ప్రభుత్వాలు రూపొందించుకోలేదు. దేశంలో ఇప్పటికే 5 కోట్లకు పైగా ప్రజలు ప్రాజెక్టుల కింద నిర్వాసితులై ఉంటారని ఒక అనధికార అంచనా. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ వారు 54 భారీ ప్రాజెక్టులను పరిశీలించి సగటున ఒక ప్రాజెక్టు వలన 44,182 మంది నిర్వాసితులు అవుతున్నట్టు అంచనా వేశారు. ఇప్పటికే దేశంలో నిర్మాణమైన అనేక భారీ ప్రాజెక్టుల వల్ల పైపరిశీలనను బట్టి నిర్వాసితుల సంఖ్య ఎంతగా ఉంటుందో ఊహించుకోవచ్చు. నేడు పోలవరం ప్రాజెక్టుని తీసుకున్నప్పటికీ దాని కింద 270 గ్రామాలకు పైగా నీట మునిగి వందలాది గిరిజనుల కుటుంబాలు తమ అడవి తల్లి ఒడినుంచి విసిరి వేయబడుతున్నారు. అలాగే పులిచింతల, ఝుంఝూవతి, వంశధార, ఎల్లంపల్లి ఇలా ప్రతి నిర్మాణంలో వేలాది ప్రజలు తమ సర్వం కోల్పోయి నిర్వాసితులుగా మారబోతున్నారు. అవకాశం ఉన్నచోట నిర్వాసితుల సంఖ్యను తగ్గించటానికి మేధావులు, సాంకేతిక నిపుణులు సూచిస్తున్న ప్రత్యామ్నాయ ప్రాజెక్టు నిర్మాణాలను ప్రభుత్వం పట్టించుకోకపోవటం గమనార్హం.

వాస్తవానికి నిర్వాసితుల పునరావాసానికి సంబంధించి ఒక సమగ్ర ప్రత్యామ్నాయ ప్రణాళిక కాని, వారి నష్టపరిహారాన్ని అంచనా వేసే సరైన విధానం కాని, మన ప్రభుత్వాల వద్ద లేవు. అందుచేతనే నేడు మన రాష్ట్రంలో సైతం వివిధ ప్రాజెక్టులచే ముంపుకు గురి కాబడుతున్న భూముల, ఆస్తుల వివరాలు మన ప్రభుత్వం దగ్గర ఉన్న దాఖలా కనిపించుట లేదు. నిర్వాసితుల పునరావాసానికి సంబంధించి ఒక సమగ్ర విధానం కొరవడుట చేతనే ఈ పరిస్థితి తలెత్తింది. నిర్వాసితులకిచ్చే నష్టపరిహారాన్ని నగదు రూపంలో అరకొరగా చెల్లించే ప్రక్రియగా మాత్రమే మన ప్రభుత్వాలు భావిస్తున్నాయి. దాని కొరకు ప్రధానంగా భూసేకరణ చట్టం 1894పై ప్రభుత్వాలు ఆధారపడుతున్నాయి. ఇందుచేత చట్టపర, రెవిన్యూ, ఇతర ఆధారాలు చూపుకోలేని నిర్వాసితులు నగదు రూపంలో తాము పొందే కొద్దిపాటి సాయం అందని పరిస్థితికి నెట్టబడతారు. ఈ పరిస్థితి దృష్ట్యా నేడు ప్రతి ప్రాజెక్టు

నిర్వాసితులూ తమకు సమగ్ర పునరావాసం కల్పించిన అనంతరమే ప్రాజెక్టు పనులను చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఎన్నికల హామీల మాదిరిగానే పూర్తి నష్టపరిహారం చెల్లిస్తామని చెబుతూ ఆచరణలో అందుకు భిన్నంగా పోలీసు తూటాలు, లాఠీలతో సమాధానం ఇవ్వటం తోటపల్లి నిర్వాసితుల విషయంలో చూశాం. అదేవిధంగా ప్రాజెక్టు ముంపు గ్రామాలలో జరిగిన ప్రజాభిప్రాయ సేకరణ సభలు వారి గొంతు విప్పి తమగోడు వినిపించుకోలేని పరిస్థితుల మధ్య ప్రభుత్వ అధికారుల హడావుడి ప్రహసనంగా మారటం చూశాం. నిర్వాసితుల బతుకులు జలయజ్ఞంలో జలసమాధి కాకముందే వారు కోరుతున్న నష్టపరిహారం, పునరావాసం నిర్వాసితుల జీవించే హక్కుగా గుర్తిద్దాం. ఉద్యమిస్తున్న నిర్వాసితులకు బాసటగా నిలబడదాం. వారిపట్ల ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని వ్యతిరేకిద్దాం. అందులో భాగంగా జరుగుతున్న సభను జయప్రదం చేయగలరు.

**26-2-2006**

**గుంటూరు జిల్లా కమిటీ**





# అర్హులైన జీవిత ఖైదీలను విడుదల చేయాలి

ప్రతి సంవత్సరం జాతీయ దినాలైన ఆగస్టు 15, జనవరి 26, అక్టోబర్ 2 గురించి ఎంతో ఉద్వేగంతో ఎదురుచూసేవారు సమాజంలో కొందరున్నారు. వారే ఏళ్ళతరబడి అనిశ్చిత భవిష్యత్తుతో జైళ్ళలో మగ్గే జీవిత ఖైదీలు. గత రెండున్నర ఏళ్ళ కాలంలో ప్రభుత్వం ఒక్క జీవిత ఖైదీని కూడా విడుదల చెయ్యలేదు. గత గణతంత్ర దినాన వీరిని విడుదల చేయడానికి సన్నాహాలు చేసిన ప్రభుత్వం - ప్రతిపక్షాలు, పత్రికలు బాధ్యతారాహిత్యంగా చేసిన విమర్శకు జడిసి ఈ ప్రక్రియను ఆపివేసింది. దీని పరిణామాలు ఖైదీలపై, వారి కుటుంబాలపై తీవ్రంగా ఉంది.

## జీవిత ఖైదీల గురించి ఎందుకు పట్టించుకోవాలి?

జీవిత ఖైదు అనే శిక్ష విషయంలో సామాన్య ప్రజలలోనేకాక, నేర న్యాయవ్యవస్థలో ఉన్న వారిలో కూడా చాలా అపోహలున్నాయి. జీవిత శిక్ష అంటే ఏడు లేక 14 ఏళ్ళ శిక్షగా భావించడం జరుగుతుంది. కానీ చట్టం జీవిత ఖైదుకు ఒక నిర్దిష్ట కాలపరిమితిని విధించకపోవడం వల్ల జీవిత ఖైదీలు చివరి శ్వాసవరకు జైలులోనే ఉండాలని సుప్రీంకోర్టు అభిప్రాయం.

భారతదేశంలో 1955 వరకు జీవిత ఖైదు అనే శిక్ష లేదు. అప్పటివరకు నేరస్తులకు విధించే ప్రవాసమే అన్నిటికన్నా పెద్ద శిక్ష. ప్రవాసానికి గురైన వారిని స్వదేశానికి పిలిపించడంలో ఆర్థికకోణం ఉండడంతో వలస ప్రభుత్వం వారిని స్వదేశానికి తరలించేది కాదు. దాంతో వాళ్ళు విడుదలైనా అక్కడే మరణించేవారు. 1955లో భారత శిక్షాస్మృతికి 25వ సవరణద్వారా ప్రవాసం స్థానంలో జీవితఖైదు శిక్షను చేర్చారు. కానీ శిక్ష స్వభావంలో ఎలాంటి మార్పులేదని పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ స్పష్టం చేసింది. దాంతో ప్రవాసంలోలాగ మరణం వరకు ఖైదీగా ఉండాలని సుప్రీంకోర్టు స్పష్టం చేస్తూ వస్తోంది. స్వాతంత్ర్యం తర్వాత జైళ్ళను అంతర్గత ప్రవాసాలుగా మార్చేశారు. ప్రస్తుతం దేశంలో శిక్షపడిన 75 వేల మందిలో 45 వేల మంది జీవిత ఖైదీలే! మన రాష్ట్రంలో వారి సంఖ్య దరిదాపు మూడు వేలు. వీరిలో 45 శాతం మంది పూర్తిగా నిరక్షరాస్యులు, 40 శాతం మంది ప్రాథమిక విద్యను మాత్రమే చదివినవారు. వీటిలో 36 శాతం మంది దళిత ఆదివాసీ వర్గాలకు చెందినవారు. స్వాతంత్ర్యం తర్వాత దేశ పాలనలో మార్పు రూపంలోనే తప్ప సారాంశంలో రాలేదనడానికి జీవితఖైదు అనే శిక్ష కన్నా మరో మంచి ఉదాహరణ దొరకదేమో!

## ప్రభుత్వం ఏం చేయాలి?

అయితే జీవిత ఖైదీల విడుదలకు చట్టంలో అవకాశాలు అస్సలు లేవనలేము. జీవిత ఖైదీల కుటుంబ పరిస్థితులు, ఆరోగ్యం, సత్ప్రవర్తన లాంటి ప్రమాణాల ప్రకారం, వారి శిక్షను సమీక్షించి ఏడు లేక పది ఏళ్ళ శిక్షను పూర్తిచేసిన వారిని విడుదల చేయాలని చట్టం చెబుతుంది. దీనికి ప్రతి కేంద్ర కారాగారం స్థాయిలో ప్రతి మూడు నెలలకు ఒకసారి సలహా బోర్డు సమావేశమై నిర్ణయం తీసుకోవాలి. ఇది నిరంతరాయంగా జరగాల్సిన ప్రక్రియ. కాని దీన్ని ప్రభుత్వాలు ఎప్పుడూ చిత్తశుద్ధితో కొనసాగించలేదు. ఈ ప్రక్రియకు అదనంగా ప్రత్యేక జాతీయ దినాలలో ఖైదీలకు క్షమాబిక్ష ప్రకటించి విడుదల చేసే సంప్రదాయం గాంధీ శతజయంతి సందర్భంగా 1969లో ప్రారంభమయింది. చట్టంలోని ప్రక్రియకు అదనంగా వచ్చిన ఈ సంప్రదాయం, క్రమంగా చట్టం సూచించిన ప్రక్రియకు ప్రత్యామ్నాయంగా మారిపోయింది. దీనికి ప్రభుత్వాలు చట్టాల కన్నా వ్యక్తిగత ప్రతిష్టలకు ప్రాధాన్యం ఇవ్వడం, రాజకీయాలు నేరపూరితం కావడం ప్రధాన కారణాలు.

సలహా బోర్డుల సిఫారసుల మేరకు జీవిత ఖైదీల విడుదల 1994-95 తర్వాత పూర్తిగా ఆగిపోయింది. ప్రత్యేక సందర్భాలలో విడుదల చేసే విధానాన్ని కూడా ప్రతి సంవత్సరం పాటించడం లేదు. గత 38 ఏళ్ళలో 12 సార్లు మాత్రమే జీవిత ఖైదీలను విడుదల చేశారు. ప్రభుత్వాలు తమ ఇష్టం వచ్చినప్పుడు విడుదల చేసే విధానం వల్ల కొందరు ఏడేళ్ళకే విడుదలైతే కొందరు 14 ఏళ్ళకు విడుదలవుతున్నారు. ఒకే నేరంలో జైలుకొచ్చిన ఇద్దరు వేరువేరుగా విడుదలైన సందర్భాలు ఉన్నాయి. శిక్షా కాలాల లెక్కింపులు, పక్షపాతాలు ఎలాగూ ఉంటాయి. దీంతో చట్టం దృష్టిలో అందరూ సమానులే అనే న్యాయసూత్రం మరింతగా దిగజారిపోతూ ఉంది. ఇది ఖైదీలలో తీవ్రమైన మానసిక క్షోభకు దారితీస్తుంది.

## ఏం జరిగింది?

ఆగస్టు 2004లో ప్రభుత్వం వెయ్యి మంది ఖైదీలను విడుదల చేసింది. 2005లో ప్రత్యేక జీవో ద్వారా మాజీ ఎంఎల్ఏ గౌరు వెంకటరెడ్డిని మాత్రమే ప్రభుత్వం విడుదల చేసింది. అతని విడుదల వివాదాస్పదమై సుప్రీంకోర్టులో రెండేళ్ళు కేసు నడిచింది. ఈ కాలమంతా కోర్టు వ్యాఖ్యలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉండడంతో సాధారణ ఖైదీల విడుదలపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోలేకపోయింది. చివరకు చాలా జాగ్రత్తలు తీసుకుని ఈ ఏడు జనవరి 26 సందర్భంగా ఖైదీల విడుదలకు జీవోలు విడుదల చేసింది. జీవోలలోని ప్రమాణాలు చట్టపరమైనవే అయినప్పటికీ, గౌరు వెంకటరెడ్డికి, మద్దెల చెరువు సూర్యనారాయణరెడ్డికి కొన్ని కేసులలో విముక్తి లభించడం జరగొచ్చు, జరగకపోవచ్చు. కానీ వారిద్దరి విడుదల కోసమే జీవోలు 314, 315లను తెచ్చినట్టు పత్రికలు, ప్రతిపక్షాలు రగడ చేయడంతో, ప్రభుత్వం ఖైదీల విడుదలను వాయిదావేసింది. ఈ దుస్థితికి గౌరు వెంకటరెడ్డి విషయంలో వారు గతంలో చేసిన నిర్వాకమే కారణం.

ప్రధాన ప్రతిపక్షమైన తెలుగుదేశం పార్టీ, దాని మద్దతుదారులైన పత్రికలు 1,300 మంది ఖైదీల విడుదల కన్నా, దానిలోని చట్టబద్ధత కన్నా, కాంగ్రెస్ పార్టీకి చెందిన ఖైదీలను అడ్డుకోవడం, రాజకీయంగా పైచేయి సాధించడమే ముఖ్యం అన్నట్టుగా ప్రవర్తించాయి. సినీనటుడు బాలకృష్ణను చట్టం నుంచి తప్పించడానికి తెలుగుదేశం అధినేత చేసిన యాగీని గుర్తు చేసుకుంటే, ఖైదీల విడుదలకు వ్యతిరేకంగా ఆయన చేస్తున్న వాదనలోని డొల్లతనం ఇట్టే అర్థమవుతుంది.

జనవరి 26 నాటికి విడుదలకు అర్హత సంపాదించాలనే ఆతృతతో జరిమానా కట్టాల్సిన ఖైదీలు, వారి కుటుంబాల చేత వేల రూపాయలు వడ్డీలకు తెప్పించి చెల్లించారు. అలా చెల్లించిన మొత్తం ఒక్క రాజమండ్రి జైలులోనే 7 లక్షల వరకు ఉంది. కాని ఖైదీల విడుదల ఆగిపోవడంతో వారి కుటుంబాలపై పెనుభారం పడింది. అదే జైలులో గోగసాని రామయ్య అనే 52 ఏళ్ళ జీవిత ఖైదీ మనోవ్యథతో ఫిబ్రవరి 16న మరణించాడు. విడుదల ఆగిపోవడంతో ఖైదీల కుటుంబాలలో ఏం జరుగుతుందనడానికి ఇవి ఉదాహరణలు.

ఖైదీలు, వారి కుటుంబాలు గత నెలలో ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా నిరాహార దీక్షలు చేశాయి. నిరసనలు తెలిపాయి. ఖైదీల విడుదలపై ఏకాభిప్రాయాన్ని సాధించగలిగాయి. అదే విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి అఖిలపక్షం తీసుకుపోయింది. అయినా ఇంతవరకు ప్రభుత్వంలో ఎటువంటి స్పందన లేదు.

జైళ్ళలో మగ్గుతున్న వారి సామాజిక, ఆర్థిక నేపథ్యాన్ని దృష్టిలో ఉంచుకుని, ఖైదీల విడుదల కోసం, వారి హక్కుల కోసం ప్రజాస్వామిక వాదులందరూ స్పందించాలి. ఖైదీల విడుదలకు సందర్భమే అవసరమైతే రాజ్యాంగ రూపశిల్పి అంబేద్కర్ జయంతి ఏప్రిల్ 14 మించిన సందర్భం మరొకటి లేదు.

## డిమాండ్స్

1. ఖైదీల విడుదలను నిలిపివేసిన జీవో 12/2007ను రద్దు చేయాలి.
2. జీవోలు 314, 315ను వెంటనే అమలుచేయాలి.
3. జీవిత ఖైదును రద్దు చేయాలి.
4. ఖైదీల విడుదలకు సలహా బోర్డులను వెంటనే పునరుద్ధరించాలి.

**31-3-2007**

**విశాఖపట్నం జిల్లా కమిటీ**

మానవహక్కుల వేదిక

# రెండవ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

**ప్రజలారా**

పరిపాలన అంటే ఏమిటి? పార్టీల ప్రయోజనాలు, పార్టీ నాయకుల ప్రయోజనాలు, అంతిమంగా వారి కిశోరాల ప్రయోజనాలు.

అభివృద్ధి అంటే ఏమిటి? ఆస్తులున్న వాళ్ళకు వాటిని వేగంగా, శరవేగంగా, సింగపూర్ వేగంగా పెంచుకునే అవకాశం.

శాంతి అంటే ఏమిటి? స్వచ్ఛందమైన మౌనం. కాకుంటే దానికి పోలీసు కాపలా.

సమత అంటే ఏమిటి? తాత ముత్తాతల నుంచి సంక్రమించిన సదవకాశాలను స్వేచ్ఛగా వాడుకునే ప్రతిభ.

భద్రత అంటే ఏమిటి? గ్రేహౌండ్స్, సల్వాజుడుం.

ఈ నిర్వచనాలతో సాగుతున్న పాలనలో మనం బతుకుతున్నాం. ప్రభుత్వమే కాదు, కోర్టులూ ఈ నిర్వచనాలే ఇస్తున్నాయి. మేధావులూ ఇస్తున్నారు, మీడియానూ ఇస్తున్నది. ఈ నిర్వచనాల గురించి కొట్లాటే హక్కుల ఉద్యమం.

ఈ కొట్లాట తెలుగు ప్రజలకు బాగానే తెలుసును గానీ ఎందుకో ఈ మధ్య నీరసించినట్టున్నారు. మన రాష్ట్రానికి చెందిన దంపతులను గుజరాత్ పోలీసులు హత్య చేసినందుకు ఆ రాష్ట్రంలో పెద్ద పెద్ద పోలీసు అధికారులనే అరెస్టుచేశారని తెలిసి అందరమూ సంతోషించాం. కానీ మన రాష్ట్రానికి చెందిన కొన్ని వేల మందిని మన రాష్ట్ర పోలీసులే ఆ రకంగా హత మార్చారే. అయినా వారిలో ఒక్కరినైనా అరెస్టు చేయించలేకపోయామని బాధపడకుండా ఉండలేం.

పశ్చిమ బెంగాల్ రైతులు సింగూరు, నందిగ్రామంలలో వ్యవసాయ భూములను కంపెనీలకు కట్టబెట్టే నీతికి వ్యతిరేకంగా తిరగబడ్డారని విని సంతోషించాం. కానీ ఈ భూదానంలో ఆంధ్రప్రదేశ్‌తో పశ్చిమ బెంగాల్‌కు పోలిక ఎక్కడిది? ప్రత్యేక ఆర్థిక మండలులు నెలకొల్పే పోటీలో మనం దేశంలోనే రెండవ స్థానంలో ఉన్నాం. అయినా మనం ఏ ఒక్క చోటా వాటిని ఆపలేకపోయామని బాధపడకుండా ఉండలేం.

నర్మదా నదిమీద కడుతున్న సర్దార్ సరోవర్ ప్రాజెక్టు నిర్వాసితులు కోర్టు లోపలా, బయటా పట్టుదలగా చేస్తున్న పోరాటాన్ని అందరం అభినందిస్తున్నాం. మన పోలవరం సర్దార్ సరోవర్‌కు ఏ రకంగానూ తక్కువ కాకున్నా పోలవరం వ్యతిరేక ఆందోళన రెండు ధర్నాలు, మూడు సంఘీభావాలుగా మిగిలిపోయిందే అని బాధపడకుండా ఉండలేం.

ప్రభుత్వాలు చేసేదెట్లాగూ చేసుకుంటాయి, మనకు దక్కేది దక్కించుకొని పక్కకు పోదామన్న



వైఖరి అలవడిందేమో. పదిమంది కోసం గొంతు చించుకోవడమెందుకు, మన బాగు మనం చూసుకుందామని తెలివి మీరామేమో. ప్రజాస్వామ్యానికి సంబంధించిన ప్రతి సమస్యనూ కాంగ్రెస్ – తెలుగుదేశం పార్టీల పంచాయతీగా మార్చిన మీడియా మన హక్కుల చైతన్యాన్ని బలహీనపరుస్తున్నదేమో.

పాలకులకు నిజానికి ఇంతకంటే కావలసింది లేదు. ఏ అన్యాయానికీ, అణచివేతకూ వారు జవాబు చెప్పనక్కర లేదు. తెలుగుదేశం పాలనలో జరగలేదా అంటే సరిపోతుంది. ప్రజలకు చెందవలసిన వనరులు పెట్టుబడిదారీ కంపెనీలకు దత్తత చేస్తున్నందుకు సంజాయిషీ ఇవ్వనక్కర లేదు. తాను విదిల్చే నాలుగు పైసల నష్టపరిహారం సకాలంలో తీసుకోకపోతే అది కూడా దక్కదని బెదిరించి సాగించుకోవచ్చు. ఆ హితవు చెప్పేవాళ్ళు ఎక్కడో కాదు మన పక్కనే ఉంటారు.

ఇంకొంచెం ప్రజాస్వామికంగా కనిపిస్తూ కూడా సాగించుకోవాలంటే మాటల దుకాణాన్ని ఒకదాన్ని తెరవవచ్చు. చేసేవి చేస్తూ దానికి భిన్నంగా మాట్లాడుతూ ఉండవచ్చు. దానికోసం ఒక సోనియాగాంధీని కేటాయించవచ్చు. ఆగ్రహం తెప్పించవలసిన అబద్ధపు పాలనా సంస్కృతిని రాజకీయ కాలక్షేపంగా భావించే ధోరణిని ప్రజలకు అలవాటు చేసేయడం కూడా అప్రజాస్వామిక పాలనను సాగించుకోవడానికి తోడ్పడుతుంది. 'మావోయిజం సామాజిక ఆర్థిక సమస్యే తప్ప శాంతిభద్రతల సమస్య కాదు' అంటూనే వాళ్ళను రోజూ చంపుకుంటూ పోవచ్చు. పచ్చటి పొలాలున్న భూములను కంపెనీలకు ఇవ్వం అన్న విధాన ప్రవచనం గంభీరంగా చేస్తూ, ఎడమ చేత్తో పచ్చదనం తప్ప వేరే ఏమీలేని కాకినాడ పరిసర భూములలో ప్రత్యేక ఆర్థిక మండలి నెలకొల్పడానికి ఆమోదం ఇచ్చే పత్రం మీద సంతకం చేసేయొచ్చు. ప్రతీ ఒక్కరికీ పునరావాసం కల్పించనిదే ఏ ప్రాజెక్టూ చేపట్టం అని ప్రకటిస్తూ పునరావాసం తప్ప వేరే ఏమీ అడగని గంగవరం జాలర్లపైన కాల్పులు జరపవచ్చు. ఇళ్ళ స్థలాలు లేని పేదలకోసం 'ఆవాస్ యోజనాలు' రోజుకొకటి ప్రకటిస్తూ పట్టణ పేదలను ఊరవతలికి నిర్దాక్షిణ్యంగా నిత్యం విసిరేస్తూ ఉండవచ్చు. పేదలు తెలిసో తెలియకో అన్యాక్రాంతం చేసిన అసైన్డ్ భూములను తిరిగి వారికే ఇప్పించే మహోద్యమంలో భాగంగానే వై.ఎస్.రాజశేఖరరెడ్డి ముప్ఫై ఏళ్ళు ఆదమరచి చట్టవిరుద్ధంగా అనుభవించిన పేదల భూములను ప్రభుత్వానికి ఉదారంగా అప్పగించాడని చెప్తూ, అటువంటి భూములను పేదలకు ఇవ్వవలసిన అవసరమే లేకుండా చేసే చట్ట సవరణలు చేపట్టవచ్చు. రంగారెడ్డి వంటి జిల్లాలో పేదలకు ఒక గూడు కలిగి ఉండే అవకాశమే లేకుండా చేసేయొచ్చు. జల యజ్ఞానికి ముందుషరతుగా నీటివనరుల మీద అందరికీ సమాన హక్కు ఉండేటట్టు నీటి హక్కులు నిర్ధారించమన్న డిమాండుకు జవాబు చెప్పకుండా, ఏ ప్రాతిపదికా లేని ప్రాజెక్టుల యజ్ఞం చేపట్టి కోటి ఎకరాలకు నీళ్ళేమోగానీ కోటాను కోట్ల రూపాయల ప్రజాధనం సంతర్పణ చేయవచ్చు. రైతుల ఆత్మహత్యల నివారణకోసం అని ఒక నిపుణుల కమిటీని వేసి వారి నివేదికలోని ఒక్క అంశాన్నీ అమలు చేయకుండా నీ పాలనలో ఎక్కువ మంది చనిపోయారా నా పాలనలో ఎక్కువ మంది చనిపోయారా అని ప్రతిపక్ష నాయకునితో వాదులాడుకుంటూ కాలం గడపవచ్చు.

అబద్ధాన్నీ అణచివేతనూ చూసి ఆగ్రహించడం మనం మరొకసారి నేర్చుకోవలసి ఉంది. లేకపోతే అన్నీ అందరికీ తేటతెల్లంగానే ఉంటాయి కాని అన్నీ యథాతథంగా సాగుతూనే ఉంటాయి. అన్నిటినీ యథాలాపంగా, కాలక్షేపంగా తీసుకునే సంస్కృతి నుంచి మన సమాజం బయటపడవలసి ఉంది. లేకపోతే దౌర్భాగ్యుల చావులు అభివృద్ధి సక్సెస్ స్టోరీలో పిట్టకథలుగా మిగిలిపోయే ప్రమాదం ఉంది.

హక్కుల ఉద్యమం ఒకనాడు మిలిటెంట్ పోరాటాలపైన అణచివేతనూ, చట్ట బాహ్యమైన పోలీసు హింసనూ వ్యతిరేకించే వేదికగా మొదలయింది. ఆ పరిస్థితీ కొనసాగుతున్నది, ఆ అవసరమూ కొనసాగుతున్నది. రాజకీయ కార్యకర్తలను వేటాడి చంపడం కోసమే ఉద్దేశించిన గ్రేహౌండ్స్ వంటి ప్రత్యేక పోలీసు బలగాలు ప్రజాస్వామ్య వ్యవస్థలో అసలు ఉండవచ్చునా, రాజకీయ అశాంతికి సామాజిక ఆర్థిక మూలం ఉందని గుర్తించినట్టు చెప్పుకునే పాలన అటువంటి వికృత సృష్టిని చేపట్టవచ్చునా అనే ప్రశ్నలు ఉంటుండగానే ఆ సృష్టిని ప్రధానమంత్రి స్వయంగా కీర్తించడం, దేశమంతా అనుసరించాలని ఉద్బోధించడం చూస్తున్నాం. నక్సలైట్లను ఎదుర్కొనడానికి అది కూడా చాలదని ప్రైవేట్ ప్రతీకారాన్ని ప్రోత్సహించే ప్రయత్నం మన దగ్గర గ్రీన్ టైగర్స్, కోబ్రాలతో మొదలై ఛత్తీస్‌గఢ్‌లో పాశవికమైన సల్వాజుడుం సృష్టికి దారితీయడం, దానిని సైతం ప్రధాన మంత్రి స్వయంగా ప్రశంసించడం చూస్తున్నాం. కరెంటు షాక్‌లతో సహా తీవ్రమైన చిత్రహింసలు, ఎన్‌కౌంటర్ హత్యలు నక్సలైట్లతో మొదలై అన్ని రకాల అనుమానితులకూ పాకడం చూస్తున్నాం.

**మే 26 ఉదయం 10 గంటలకు**

## సెమినార్

వక్తలు:

**అరుణారాయ్**

**ప్రొ. డి.నరసింహారెడ్డి**

**ప్రదీప్ ప్రభు**

**సుజాతోభద్ర**

హక్కుల ఉద్యమం ఆ తరువాత సామాజిక రాజకీయ అసమానతల నుంచి పుట్టిన హక్కుల అణచివేత పైన దృష్టి పెట్టడం, దానికి వ్యతిరేకంగా పనిచేయడం మొదలుపెట్టింది. ఆ అణచివేతా కొనసాగుతున్నది, ఆ అవసరమూ కొనసాగుతున్నది. స్త్రీలకూ, మైనారిటీలకూ గొంతునిచ్చే ఉద్యమాలు ఎప్పుడూ బలహీనంగానే ఉండగా, దళిత ఉద్యమమూ ఈ మధ్యకాలంలో బలహీనపడడం, మనిషిని మనిషిగా గౌరవించే సంస్కృతి వేగంగా క్షీణించడం అన్ని రకాల సామాజిక అణచివేతలను ఎన్నో రెట్లు పెంచింది. కులవివక్షను అంతం చేసే దిశలో ఒక ప్రాథమిక చర్యగా భావించే విద్యా, ఉద్యోగ రిజర్వేషన్లకు అత్యున్నత న్యాయస్థానమే పనిగట్టుకొని అడ్డం పడుతున్నది. రాజ్యాంగ స్ఫూర్తికేకాదు రాజ్యాంగ సూత్రాలకు సైతం విరుద్ధమైన తీర్పులివ్వడానికి న్యాయమూర్తులు వెనకాడడం లేదు. స్త్రీలకు అధికారంలో భాగస్వామ్యం ఇస్తే వారి ప్రయోజనాలను కాపాడే విధాన రచన వారే చేస్తారని గుర్తించినట్టు ప్రకటించి ఆ భాగస్వామ్యం నామమాత్రపు స్థాయి దాటకుండా అనంతంగా కాలక్షేపం చేస్తున్నారు. బాబ్రీ మసీదు కూల్చివేత తరువాత, గుజరాత్ మారణకాండ తరువాత భారతదేశం ముస్లింలకు కూడా చెందుతుందా అన్న ప్రశ్న బలంగా ముందుకు రాగా, 60 ఏళ్ళుగా కూడా ఈ దేశం వారికి చెందలేదని రాజిందర్ సచార్ కమిటీ రిపోర్టు సవివరంగా స్పష్టం చేసింది.





కాగా, ప్రాథమిక జీవన వనరులైన భూమి, నీరు, అడవులు, ఖనిజ సంపదల యాజమాన్య హక్కు, వాటి వినియోగం ఇవ్వాళ ముఖ్యమైన హక్కుల సమస్యలుగా ముందుకొస్తున్నాయి. కొంత కాలంగా ఇవే ప్రధానంగా వార్తలలో ఉంటున్నాయి. ఒరిస్సా, జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలలోనూ, మన రాష్ట్రంలోని ఉత్తరాంధ్ర జిల్లాలలోను అడవి భూములను బాక్సైట్, ఇనుము తదితర ఖనిజాల కంపెనీలకు లీజుకివ్వడం పట్ల ఆదివాసీ సమాజం వ్యక్తం చేస్తున్న వ్యతిరేకత, కోట్లాది గ్రామీణులకు తిండిపెట్టే భూములను ప్రత్యేక ఆర్థిక మండలులకు దత్తం చేయడం పట్ల రైతాంగంలో అన్ని ప్రాంతాలలోనూ వ్యక్తమవుతున్న నిరసన, వనరుల వినియోగంలో అసమానత, వివక్షల గురించి తెలంగాణ వంటి ప్రత్యేక రాష్ట్ర ఉద్యమాలు లేవదీస్తున్న ప్రశ్నలు ఈ కోవకు చెందినవి. ఈ రంగంలో హక్కుల లేమికీ, నిరాకరణకూ ప్రత్యక్ష పర్యవసానం విస్థాపన (నిర్వాసం), వలసలు, ఆకలి చావులు. ఆర్థిక సంస్కరణల పేరు మీద ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలు వనరుల యాజమాన్యం సమస్యను మరింత వికృతంగా తయారుచేస్తున్నాయి. హక్కుల ఉద్యమం ఈ రోజు అనివార్యంగా దీనిపైన ఎక్కువ దృష్టిపెట్టి పనిచేస్తున్నది.

ఈ విశాల నేపథ్యంలో మన రాష్ట్రంలో తలెత్తుతున్న హక్కుల సమస్యలపైన మానవ హక్కుల వేదిక తొమ్మిది సంవత్సరాలుగా పని చేస్తున్నది. కరపత్రాలు, ఇతర ప్రచురణలు, సభలు, సమావేశాల రూపంలో హక్కుల అవగాహనను ప్రచారం చేస్తున్నది. ప్రజా ఉద్యమాలకు సహాయ సహకారాలు, సంఘీభావం అందజేస్తున్నది. న్యాయస్థానాల నుంచి హక్కుల కమిషన్ వరకు వివిధ చట్టపరమైన వేదికలలో ఫిర్యాదులు చేసి విచారణలలో పాల్గొంటున్నది. మన రాష్ట్రంలోనేకాక ఒరిస్సా, ఛత్తీస్‌గఢ్, కాశ్మీర్, కర్నాటక, గుజరాత్, పశ్చిమ బెంగాల్, మణిపూర్ రాష్ట్రాలలో హక్కులకోసం జరుగుతున్న కృషికి సంఘీభావంగా కూడా పని చేస్తున్నది.

ఈ క్రమంలో మే నెల 26, 27 తేదీలలో మానవహక్కుల వేదిక తన రెండవ రాష్ట్ర మహాసభలను శ్రీకాకుళం పట్టణంలో జరుపుకుంటున్నది. ఈ సభలకు అన్ని రకాల సహాయ సహకారాలూ అందించి మీ సంఘీభావాన్ని తెలియజేయమని కోరుతూ -

**10-5-2007**